# INDIAN HISTORY AND CULTURE
# (DHIS1)
# (BA – HISTORY)

## ACHARYA NAGARJUNA UNIVERSITY

### CENTRE FOR DISTANCE EDUCATION

NAGARJUNA NAGAR,

GUNTUR

ANDHRA PRADESH

# History

## Paper - I : Indian History and Culture From Earliest Times to 1526 A.D.

Sources - History as a Social Science - Influence of Geography on Indian History.

Harappan Culture - Vedic Civilisation.

Importance of 6th Century B.C. in Indian History Buddhism and Jainism.

Alexender's invasion and its effects.

Mauryan - Asoka's Dhamma - Mauryan Administration - Decline and downfall - Cultural conditions in the Mauryan Age.

Kushans - Kanishka - Cultural Contributions - Satavahanas - Social economic, Political and Religious conditions.

Imperial Guptas - Samudragupta - Contribution to Culture - Fahien. Harsha and his achievements - Yuan chawng Rajput Heritage.

India's Cultural contacts with neighbouring Countries - Central South East and East Asia.

Pallavas and their Contribution to culture and Arts. Western Chalukyas of Badami - Pulakesin II. Eastern Chalukyas of Vengi.

Imperial Cholas - Administration - Cultural Contributions.

Turke - Afgan invasions - Arab Conquest of Sind Invasions of Ghazni & Ghori - establishment of Sultanate - Alauddin. Khilji Mohammad Bin Tagluq - Influence of Islam on Indian Culture Bhakti Movement.

The Kakatiyas - Socio economic conditions - their cultural contributions.

Vijyanagar Empire - Krishnadevaraya - Socio - economic and Cultural conditions.

### Text Books

| | | |
|---|---|---|
| 1. | K.A. Neelakanta Sastri | : History of India Vols. I & II |
| 2. | Puri, Chopra & Das | : Economic, Social and Cultural History of India - Vols. I & II |
| 3. | Ray Chaudhuri, Majumdar and Dutta | : Advanced History of India. Vols. I & II |
| 4. | S. Natarajan | : History of India Vols. I & II |

### Reference Books :

| | |
|---|---|
| Romila Thapar | : History of India |
| A.L. Basham | : Cultural History of India |
| Lunia | : Cultural History of India |

B.A. DEGREE EXAMINATION - DECEMBER 2005.

(Yearly Examination Scheme)

FIRST YEAR EXAMINATION

**Part - II : HISTORY**

**Paper - I : INDIAN HISTORY AND CULTURE**

Time : 3 Hours | Max. Marks :100

## PART - A

**Answer any TWO of the following questions (2 × 20 = 40 marks)**

1. Critically examine the value of the literary sources for the study of Indian history.
   భారతదేశ చరిత్ర అధ్యయానికి వాఙ్మయాధారములు ఎంతవరకు తోడ్పడుచున్నదో వివరించండి.

2. Trace the origin and the growth of the early vedic civilization.
   తొలి వేదకాలంనాటి నాగరికత పుట్టుక, అభివృద్ధిని గూర్చి వివరించుము.

3. Explain the circumstances under which Buddhism started in India. Account for its decline.
   భారతదేశంలో బౌద్ధమత స్థాపనకు దారితీసిన పరిస్థితులు వివరింపుము దాని క్షీణతకు కారణములేవి.

4. Estimate the contribution of the Kakatiyas to Andhra Culture.
   ఆంధ్రుల సంస్కృతికి కాకతీయులొనరించిన సేవలెట్టివో తెల్పుము.

## PART - B

**Answer any THREE of the following. (3 × 15 = 45 marks)**

5. What were the factors leading to the foundation of the Mouryan empire ?
   మౌర్య సామ్రాజ్యస్థాపనకు దారితీసిన పరిస్థితులేవి ?

6. Enumerate the contribution of Kanishka to literature and art.
   సాహిత్యానికి, కళలకు కనిష్కుడు చేసిన సేవలను వివరింపుము.

7. What are the achievements of Chandra Gupta II?
   రెండవ చంద్రగుప్తుని ఘనతలను తెల్పుము. ?

8. What was the contribution of Pallavas to South Indian Culture ?
   దక్షిణ భారతదేశ సంస్కృతికి పల్లవులు చేసిన సేవలేవి ?

9. Describe the social and economic conditions during the Satavahana period.
   శాతవాహన కాలమునాటి సాంఘిక, మరియు ఆర్థిక పరిస్థితులను వర్ణింపుము.

10. Give an account of the political conditions of India on the eve of the establishment of Delhi Sultanate.

ఢిల్లీసుల్తానేట్ స్థాపించుకాలమునాటి భారతదేశ రాజకీయ పరిస్థితులు తెల్పుము.

## SECTION - C

**Answer any THREE of the following. (3 x 5 = 15 marks)**

11. (a) Indus Seals

సింధునాగరికత నాటి ముద్రికలు

(b) Arthasastra.

అర్థశాస్త్రము

(c) Pulikesin II.

రెండవపులకేశి.

(d) Hie-un-Tsang.

హ్యూయాన్‌త్సాంగ్.

(e) Brihadisvara temple at Tanjore.

తంజావూరు బృహదీశ్వరాలయము.

(f) Amuktamalyada.

ఆముక్తమాల్యద.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ప్రాచీన భారతదేశ చరిత్ర - ఆధారాలు | 1.1 - 1.6 |
| 2. | భారతదేశ చరిత్రపై భౌగోళిక పరిస్థితుల ప్రభావం | 2.1 - 2.7 |
| 3. | హరప్పా సంస్కృతి | 3.1 - 3.8 |
| 4. | వేదకాలపు - నాగరికత | 4.1 - 4.7 |
| 5. | క్రీస్తుపూర్వ 6 వ శతాబ్దంనాటి ఉత్తర భారతదేశం | 5.1 - 5.9 |
| 6. | జైన, బౌద్ధమతాల పుట్టుక - సూత్రాలు | 6.1 - 6.10 |
| 7. | అలెగ్జాండర్ దండయాత్ర - ఫలితాలు | 7.1 - 7.7 |
| 8. | మౌర్య సామ్రాజ్యం రాజకీయ చరిత్ర | 8.1 -8.8 |
| 9. | మౌర్య సామ్రాజ్యం | 9.1 - 9.10 |
| 10. | కుషాణులు కనిష్కుడు - సాంస్కృతిక సేవ | 10.1 - 10.9 |
| 11. | శాతవాహనులు - రాజకీయ ఆర్థిక సాంఘిక, మత పరిస్థితులు | 11.1 - 11.10 |
| 12. | గుప్త సామ్రాజ్యం | 12.1 - 12.13 |
| 13. | గుప్తయుగ విశేషాలు | 13.1 - 13.10 |
| 14. | హర్ష వర్ధనుడు - హుయాన్‌సాంగ్ | 14.1 - 14.8 |
| 15. | రాజపుత్ర యుగం | 15.1 - 15.17 |
| 16. | భారతీయ సంస్కృతి వ్యాప్తి - ఆగ్నేయాసియా | 16.1 - 16.8 |
| 17. | పల్లవులు - సంస్కృతి సేవ, శిల్పకళ | 17.1 - 17.6 |
| 18. | బాదామి (పశ్చిమ) చాళుక్యులు - రెండవ పులకేశి | 18.1 - 18.6 |
| 19. | వేంగి చాళుక్యులు లేక తూర్పు చాళుక్యులు | 19.1 - 19.6 |
| 20. | నవీన చోళులు పరిపాలన - సాంస్కృతిక - సేవ | 20.1 - 20.10 |
| 21. | మహమ్మద్ ఘజనీ - మహమ్మద్ ఘోరీ దండయాత్రలు - ఫలితాలు | 21.1 - 21.7 |
| 22. | ఢిల్లీ సుల్తాన్ యుగం | 22.1 - 22.7 |
| 23. | ఖిల్జీవంశం | 23.1 - 23.14 |
| 24. | తుఘ్లక్ వంశం | 24.1 - 24.16 |
| 25. | భారతీయ సంస్కృతిపై ఇస్లాం ప్రభావం | 25.1 - 25.7 |
| 26. | కాకతీయులు - సాంఘిక, ఆర్థిక పరిస్థితులు - సాంస్కృతిక సేవ | 26.1 - 26.6 |
| 27. | విజయనగర చరిత్ర | 27.1 - 27.8 |
| 28. | విజయనగర సామ్రాజ్యంలో సాంస్కృతిక పరిస్థితులు | 28.1 - 28.6 |
| 29. | ఢిల్లీ సుల్తానత్ యుగ పరిస్థితులు | 29.1 - 29.4 |

పాఠం - 1

# ప్రాచీన భారతదేశ చరిత్ర - ఆధారాలు

## 1.1. లక్ష్యం :

చరిత్ర అంటే ఏమిటి? చరిత్రను చదవటానికి లేక రాయటానికి ప్రాచీన భారతదేశ చరిత్రకు గల ఆధారాలు ఏమిటి? అట్టి ఆధారాల ద్వారా చరిత్రను రాయటం ఎలా, అటులనే అట్టి ఆధారాల ద్వారా చరిత్ర రచన చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు మొదలగు అనేక విషయాలను తెలుసుకోవటం ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

ప్రధానాంశాలు :


1.2 ఉపోద్ఘాతం

1.3. చరిత్ర ఆధారాలు అంటే ఏమిటి

1.4. ప్రాచీన భారతదేశ చరిత్ర - ఆధారాలు

1.4. 1. పురావస్తు ఆధారాలు

1.4.1. 1. శాసనాలు

1.4.1. 2. నాణేలు

1.4.1. 3. నిర్మాణాలు

1.4.2. వాఙ్మయ లేక లిఖిత ఆధారాలు

1.4.2. 1. స్వదేశీ ఆధారాలు

1.4.2.1. 1. బ్రాహ్మణ మత గ్రంథాలు

1.4.2.1. 2. బౌద్ధమత గ్రంథాలు

1.4.2.1. 3. జైనమత గ్రంథాలు

1.4.2.1. 4. మతేతర గ్రంథాలు

1.4.2.2. విదేశీ రచనలు

1.4.2.2. 1. గ్రీకు రచనలు

1.4.2.2. 2. చైనీ రచనలు

1.4.2.2. 3. అరబ్బు లేదా ముస్లిం రచనలు

1.5. సారాంశము


## 1.2 ఉపోద్ఘాతం :

గత కాలములో మానవుని అనుభవాల్ని, విజయాల్ని, వైఫల్యాన్ని, వివరించేదే చరిత్ర. చరిత్ర అంటే కేవలం ఊహల్తో అల్లిన కట్టుకథ కాదు చరిత్ర ఒక విజ్ఞానశాస్త్రం. ఏ దేశపు చరిత్రైనా రాయాలంటే దానికి తగిన ఆధారాలు ఉండాలి, అట్టి ఆధారాలు లేకపోతే చరిత్ర రాయటం సాధ్యం కాదు.

## 1.3. చరిత్ర ఆధారాలు అంటే ఏమిటి ?

గతకాలపు సంఘటనలు వదలివెళ్ళిన అవశేషదృశ్య చిహ్నాల్ని (Traces) చరిత్ర మూలాధారాలు అంటారు. చారిత్రక సంఘటనలు ఒకప్పుడు నిజంగా జరిగినవే అయినా, ఇప్పుడు కంటికి కనిపించేవి కావు. దురదృష్టవశాత్తూ ప్రాచీన భారతీయులకు చారిత్రాత్మక జ్ఞానము లోపించుట వలన ప్రాచీన భారతదేశ చరిత్రను గూర్చి సంపూర్ణంగా రాయబడిన గ్రంథమొక్కటి కూడా లేదు. అందువల్లే మహ్మద్ గజనీతోపాటు మనదేశానికి వచ్చిన ఆల్‌బెరూని అనే మహమ్మదీయ చరిత్రకారుడు "హిందువులు చారిత్రక విషయంలో ఎక్కువ శ్రద్ధ చూపరు, ఎవరు రాజ్యపాలకులైనా వారి కాలాను క్రమాన్ని వివరించటంలో వారు నిర్లక్ష్యంగానే ఉంటారు" అని పేర్కొనెను.

"(The Hindus do not pay much attention to the historical order of things and they are very careless in relating to the choronological succession of Kings)" - Alberuni

"చరిత్ర రచన పట్ల నిర్లక్ష్యమే మన సంస్కృతికి గొప్ప లోపమని " ఆర్.సి. మజుందార్ వర్ణించారు.

(One of the greatest defects of Indian Culture is the aversion of Indians to writing history. - R.C. Mazumdar)

## 1.4. ప్రాచీన భారతదేశ చరిత్ర - ఆధారాలు :

ప్రాచీన భారతదేశ చరిత్ర రచనకు ఉపయోగపడే ఆధారాలను స్థూలంగా పురావస్తు ఆధారాలు, వాఙ్మయ లేక లిఖిత ఆధారాలు అని రెండు రకాలుగా విభజించవచ్చును.

సామాన్యంగా మానవునికి చదువుట, రాయుట (లిపి) తెలిసినప్పటినుండి చారిత్రక యుగమని (Historic Age) అంతకు పూర్వం ఉన్న కాలమును చారిత్రక పూర్వయుగమని (Pre - Historical Age) అంటారు. చరిత్ర రచనకు నాటి మానవుడు ఉపయోగించిన, వదిలి వెళ్లిన భౌతిక అవశేషాలే ఆధారాలు.

చరిత్ర ఆధారాలు

| | |
|---|---|
| పురావస్తు ఆధారాలు | : శాసనాలు, నాణెములు, నిర్మాణాలు, మట్టిపాత్రలు |
| వాఙ్మయ లేక లిఖిత ఆధారాలు | : విదేశీ రచనలు : గ్రీకు రచనలు, చీనీ రచనలు, అరబ్ రచనలు |
| స్వదేశీ రచనలు | : మత గ్రంథములు (హిందూ, బౌద్ధ, జైన మతగ్రంథాలు) |
| మతేతర గ్రంథాలు | : రాజనీతి, జీవిత, వంశ చరిత్రలు |

**1.4. 1. పురావస్తు ఆధారాలు: (Archaeological Sources)** : ప్రాచీన భారతదేశ చరిత్ర రచనకు పురావస్తు ఆధారాలు ముఖ్యమైనవి. పెక్కు కారణాల వలన భూగర్భములో ఉన్న మానవుని నాగరికతా అవశేషాలను పురాతత్త్వ శాస్త్రం ద్వారా తెలుసుకొనవచ్చును. వాఙ్మయం లేక లిఖిత ఆధారాలలో అనేక మార్పులకు అవకాశం ఉంటుంది. కాని పురావస్తు ఆధారాలల్లో అట్టి మార్పులకు అవకాశం ఉండదు. అందువల్లనే "వాఙ్మయ ఆధారాల కంటే పురావస్తు ఆధారాలే అత్యంత విశ్వాస యోగ్యములు" అని ఆచార్య నీలకంఠశాస్త్రి పేర్కొన్నారు. (It is superior in authenticity to many written records - Prof. K.A.N. Sastri)

ఈ పురావస్తు ఆధారాలను మూడు భాగాలుగా విభజించవచ్చును.

1. శాసనాలు (Inscriptions) 2. నాణేలు (Coins) 3. నిర్మాణములు లేక చిహ్నాలు (Monuments).

**1.4.1. 1. శాసనాలు** : పురావస్తు ఆధారాల్లో శాసనాలు ముఖ్యమైనవి. రాజులు కానీ, సమాజంలోని సామాన్యులు కానీ తాము సాధించిన విజయాలనో, చేసిన దానాలలో తెలియజేస్తూ వ్రాయించిన ప్రకటనలను శాసనాలంటారు. ఈ ప్రకటనలు చిరకాలం శిధిలం కాకుండా ఉండటానికి గాను రాళ్ళమీద, లోహాల మీద చెక్కించేవారు. ఈ శాసనాలలో భౌగోళిక పరిస్థితి, రాజవంశంలో రాజుల పేర్లు వారి పరిపాలనా దండయాత్రలు, యజ్ఞయాగాలు, పరిపాలనా విధానాలు, నాటి రాజకీయ, సాంఘిక, ఆర్థిక, మత, సాంస్కృతిక పరిస్థితులు మొదలగు

అనేక విషయాలు తెలియచేయబడిన తరువాత మార్చటానికి అవకాశం ఉండదు. శాసనాలు చరిత్ర రచనకు ఏవిధంగా ఉపయోగపడతాయి అనే విషయానికి వస్తే, ప్రాచీన భారత రాజకీయ చరిత్ర రచనకు దోహదపడే శాసనాల్లో అశోకుని శిలాశాసనాలు, ఖారవేలుని హాథిగుంఫా శాసనం, గౌతమీ బాలశ్రీ నాసిక్ శాసనం, రుద్రదమనుని జునాగడ్ శాసనం, సముద్రగుప్తుని అలహాబాద్ శిలాస్తంభశాసనం, చంద్రుని మెహ్రౌలి శాసనం, స్కందగుప్తుని జునాగఢ్ శాసనం, యశోధర్ముని మందసోరు శాసనం, రెండవ పులకేశి ఐహోలు (Ihole) శాసనం మొదలగునవి చరిత్ర రచనకు ఎంతో దోహదపడతాయి.

పైన పేర్కొనబడిన శాసనాల్లో పరిపాలనా విధానాలు, నాటి సామాజిక, సాంస్కృతిక పరిస్థితులు, నాటి భాషలకు గల ప్రాధాన్యత మొదలగు అనేక అంశాలు చరిత్ర రచనకు ఉపకరిస్తాయి. పైన పేర్కొనబడిన శాసనాలు అన్నీ స్వదేశీ శాసనాలే.

**1.4.1.2. నాణేలు :** శాసనాల తరువాత ప్రాచీన చరిత్ర రచనలు నాణేలు ముఖ్యమైన ఆధారాలు. మనదేశంలో వేదకాలంలో నుండి నాణేలు వాడుకలో ఉన్నా, వాటి ముద్రణ పద్ధతులు ఇండో-బాక్ట్రియన్ల పరిపాలనా ఫలితంగా మెరుగయ్యాయి. మన దేశమును పాలించిన వివిధ రాజవంశాలు అన్నీ ప్రత్యేకమైన నాణేలను బంగారం, వెండి, రాగి, సీసం, పోటిన్ మొదలైన లోహాలతో ముద్రించి చెలామణి చేసారు. వివిధ ప్రాంతాలలో జరిగిన పురావస్తు త్రవ్వకాలలో వివిధ రకాలైన నాణేలు లభించాయి. ఈ నాణేలు అనేక చారిత్రక విషయాలను తెలియజేస్తున్నాయి.

ప్రాచీన భారతదేశ రాజకీయ చరిత్రలో ముఖ్యంగా మౌర్య, గుప్త సామ్రాజ్యాల మధ్యకాలంలో మనదేశాన్ని పాలించిన ఇండో, గ్రీకు, సిథియన్, కుషాణ్, క్షాత్రపరాజ వంశాల చరిత్రను తెలుసుకోవటానికి వారి నాణేలే ప్రధాన ఆధారం.

నాణేలు రాజవంశాలు, రాజులు అవలంబించిన మత, సాంప్రదాయాలను కూడా వివరిస్తాయి. ఇవికాక నాణేలపై చెక్కిన ప్రతిమలు, లాంఛనాలు, ఇతర చిహ్నాలు, నాణేల స్వరూపం ఆయా కాలాల ప్రజల కళాభినిరతికి నిదర్శనాలు. నాటి ఆర్థిక పరిస్థితుల్ని కూడా నాణేలలో వాడిన లోహాల్ని బట్టి తెలుసుకొనవచ్చును.

**1.4.1.3. నిర్మాణాలు లేక చిహ్నాలు :** పురావస్తు సముదాయకములైన భవన శిథిలాలు, వాడిన పాత్ర సామాగ్రులు, పనిముట్లు, మృణ్మయ పాత్రలు ఆయుధాలు, శిల్పాలు, చిత్రలేఖనము మొదలగునవి చరిత్ర రచనకు ఎంతగానో ఉపయోగపడతాయి. చరిత్ర పూర్వయుగానికి, చారిత్రక యుగం తొలి దశలకు కూడా ఇవి చాలా ప్రామాణికమైన ఆధారాలు. పురావస్తు త్రవ్వకాలను నిర్వహించుటకు 1906వ సం.లో లార్డ్ కర్జన్ కాలమున పురావస్తు శాఖ (Department of Arechaeology) సర్ జాన్‌మార్షల్ ఆధ్వర్యమున ఏర్పడింది. ఈ త్రవ్వకాలు ప్రాచీన భారతచరిత్ర గతినే మలుపు తిప్పాయి.

ఉదా : సింధు నాగరికత కనుగొనబడటంతో ఆర్యుల కంటే ముందే మనదేశంలో నాగరికత వర్థిల్లినది అనియు, మనదేశ నాగరికత వేదకాలనాగరికతో కాక, సింధు నాగరికతతో ప్రారంభమైనట్లు తెలుస్తున్నది.

తక్షశిల, లోథల్, నలంద, సారనాథ్, పాటలీపుత్ర, హస్తినాపురము, నాగార్జున కొండ మొదలైన ప్రాంతాలలో జరిపిన త్రవ్వకాలు నాటి ప్రాచీన చరిత్రను విశదపరుస్తున్నాయి.

కన్హేరి, బేడ్సా, అజంతా, సిత్తన్నవాసల్, బాగ్, మొదలగు ప్రాంతములందు కుడ్యవర్ణచిత్రాలు ఆనాటి కళానైపుణ్యంతో పాటు, నాటి సమకాలిక మత, సాంఘిక పరిస్థితులను తెలియజేస్తున్నాయి. శిలా విగ్రహాలు, లోహ విగ్రహాలు, సాంచీ, సారనాథ్, అమరావతి స్తూపాలు, దేవగిరి, మహాబలిపురం, అలంపుర ఆలయాలు నాటి సాంస్కృతిక పరిస్థితులను వివరించును.

**1.4.2. వాఙ్మయ లేక లిఖిత ఆధారాలు :** ప్రాచీన భారతదేశ చరిత్ర రచనకు తోడ్పడు వాఙ్మయ లేక లిఖిత ఆధారాల్ని స్వదేశీ, విదేశీ ఆధారాలు అని రెండు రకాలుగా విభజించవచ్చును. అట్లే స్వదేశీ ఆధారాల్ని తిరిగి మతపరమైన ఆధారాలు, మతేతర ఆధారాలు అని రెండు రకాలుగా విభజించవచ్చును. మతపరమైన ఆధారాల్లో బ్రాహ్మణ మతగ్రంథాలు, బౌద్ధ మతగ్రంథాలు, జైన మత గ్రంథాలు పేర్కొనవచ్చును.

మతేతర గ్రంథాలను చారిత్రక ప్రాధాన్యతను బట్టి చారిత్రక గ్రంథాలు లేక రాజకీయ గ్రంథాలు (Historical Works) చారిత్రేతర లేక సారస్వత గ్రంథాలని (Non-Historical Works) రెండు రకాలుగా పేర్కొనవచ్చును.

**1.4.2.1. స్వదేశీ ఆధారాలు :**

**1.4.2.1. 1. బ్రాహ్మణ మత గ్రంథాలు :** మతపరమైన గ్రంథాలలో బ్రాహ్మణ మతగ్రంథాలు ముఖ్యమైనవి. వేదములు నాల్గు. బ్రాహ్మణ మతగ్రంథాలలో అతి ప్రాచీనమైనది ఋగ్వేదము. ఇది క్రీ.పూ. 2000-600 సం.ల మధ్య వ్రాయబడినట్లు తెలియుచున్నది. 'విద్' అనగా తెల్సుకొనుట, 'వేదం' అనగా జ్ఞానం (Knowledge) అని అర్థము. యజు, సామ, అథర్వణ వేదములు మిగిలిన మూడు వేదములు.

ఋగ్వేద, ఋగ్వేదం కాలంనాటి రాజకీయ, సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితులను వివరిస్తుంది. మిగిలిన మూడు వేదములు మలి వేదకాలం నాటి సంస్కృతిని తెలియచేస్తాయి. వేదములతో పాటు బ్రాహ్మణములు, అరణ్యకములు, ఉపనిషత్తులు, సుప్రసిద్ధ ఇతిహాసాలైన రామాయణ, మహాభారతాలు చరిత్ర రచనకు ఎంతగానో ఉపకరిస్తాయి. మహాభారతము ఉత్తర దేశ సార్వభౌమాధికారమునకు ఆర్యరాజుల మధ్య సంఘర్షణను వివరిస్తుంది. రామాయణము ఉత్తరాది సంస్కృతిని దక్షిణదేశమునకు వ్యాపింపచేసిన విధాన్ని తెలియచేయును. అష్టాదశ పురాణములు కూడా చరిత్ర రచనకు ఉపయోగపడతాయి.

ఉదా : విష్ణుపురాణం - మౌర్యులను గూర్చి, మత్స్యపురాణం - ఆంధ్ర శాతవాహనుల గూర్చి, వాయు పురాణం - గుప్తుల గూర్చి వివరిస్తాయి.

**1.4.2.1. 2. బౌద్ధమత గ్రంథములు :** బౌద్ధమత ప్రామాణిక గ్రంథాలలో "త్రిపీటకములు" ముఖ్యమైనవి. బుద్ధుని పరినిర్యాణం అనంతరం అతని సూక్తులు 'వినయ', 'సూత్త', 'అభిదమ్మ' పీటకములుగా పాలీభాషలో క్రోడీకరింపబడ్డాయి. అట్లే బుద్ధుని జీవిత విశేషాలను తెలియచేసే 549 "జాతక కథలు" రూపొందింపబడ్డాయి. పీటకములు, జాతక కథలు బుద్ధుని తొలిజీవితాన్ని, అతని బోధనల్ని క్రీ.పూ 6,5 శతాబ్దముల నాటి రాజకీయ, సాంఘిక, మత పరిస్థితుల్ని తెలుసుకొనుటకు ఉపకరిస్తాయి.

అట్లే 'మిలిందవన్హ' అను గ్రంథము (బాక్ట్రియన్ రాజగు మినాండర్‌కు, బౌద్ధాచార్యుడగు నాగసేనునకు జరిగిన సంభాషణ) అశోకుని తరువాత కాలంనాటి రాజకీయ, మత విషయాలను గూర్చి తెలియచేయును. బౌద్ధాచార్యులగు వసుమిత్రుడు, అశ్వఘోషుడు, ఆచార్య నాగార్జునుల రచనలు ప్రాచీన భారతదేశ చరిత్ర రచనకు ఎంతో దోహదపడతాయి.

**1.4.2.1. 3. జైన మత గ్రంథములు :** జైన మత ప్రామాణిక గ్రంథాలను 'అంగాలు' 'ఉపాంగాలు' అంటారు. జైన గ్రంథమైన 'ద్వాదశాంగం' వర్ధమాన మహావీరుని తొలిజీవితం, జైన మతసూత్రాలు, నాటి సమాజ పరిస్థితులు, వివరించును. భద్ర బాహుని 'కల్ప సూత్రాలు' మరియు 'అవశ్యక సూత్రాలు' క్రీ.పూ. 4వ శతాబ్దం నాటి పరిస్థితులను, శకుల దండయాత్రలను వివరిస్తాయి.

**1.4.2.1. 4. మతేతర గ్రంథాలు :** చారిత్రక విలువగల గ్రంథాల్లో ముఖ్యమైనవి చంద్రగుప్తమౌర్యుని ప్రధానమంత్రి అయిన కౌటిల్యుడు వ్రాసిన 'అర్థశాస్త్రము'. ఇది రాజనీతి శాస్త్రం. ఇది మౌర్యుల కాలం నాటి రాజకీయ, సాంఘిక, ఆర్థిక, మత, పరిస్థితులను వివరించును. వంశ చరిత్రలో క్రీ. శ. 12 వ శతాబ్దంలో కల్హణుడు సంస్కృత భాషలో వ్రాసిన 'రాజతరంగిణి' అత్యంత ప్రధానమైనది. నాటి కాశ్మీర్ చరిత్రను తెలుసుకొనుటకు ఇది ఎంతగానో దోహదపడును.

చరిత్ర రచనకు ఆధారాలైన వ్యాకరణ గ్రంథాలలో పాణిని, కాత్యాయనుల రచనలు, గార్గి సంహిత, పతంజలి పాణిని వ్రాసిన వ్యాఖ్యానం 'మహాభాష్యం' పేర్కొనదగినవి. ఇది క్రీ.పూ. 2 వ శతాబ్దంలో భారతదేశంపై గ్రీకుల దండయాత్రలను గూర్చి వివరిస్తుంది.

రాజుల జీవిత చరిత్రలను కూడ వివరించు గ్రంథాలు అనేకం కలవు. ఉదా : బాణుని - హర్షచరిత్ర, జయసింహుని - కుమారపాల చరిత్ర, బిల్హణుని - విక్రమాంకదేవ చరిత్ర, వాక్పతి - గౌడవహో, చంద్ర బార్దే - పృధ్వీరాజరాసో మొదలగునవి. అట్లే హాలుని - గాధాసప్తశతి, గుణాఢ్యుని - బృహత్‌కథ, సంగమ వాఙ్మయము, ఆళ్వారు, నాయనార్ల రచనలు ప్రాచీన భారతదేశ చరిత్ర రచనకు మిక్కిలి సహాయపడును. భాసుడు, కాళిదాసు, విశాఖదత్తుడు, శూద్రకుడు, దండి, అశ్వఘోషుడు మొదలగు వారి రచనలు కూడా చరిత్ర రచనకు ఉపకరిస్తాయి.

1.4.2. 2. **విదేశీ రచనలు :** భారతదేశాన్ని సందర్శించిన విదేశీయులు వారి అనుభవాలను, ఆయా కాలంనాటి పరిస్థి...లను తమ రచనలందు పొందుపరిచారు. అట్టి రచనల్లో ముఖ్యమైనవి. (1) గ్రీకు - రోమన్ రచనలు (2) చైనీ రచనలు (3) అరబ్బుల రచనలు అని మూడు భాగాలుగా విభజించవచ్చును.

1.4.2.2. 1. **గ్రీకు - రోమన్ రచనలు :** భారతదేశాన్ని గూర్చి పశ్చిమ దేశాలకు మొదటిసారిగా తెలియచేసినవారు గ్రీకు - రోమన్ చరిత్రకారులైన హిరోడోటస్ (Herodotus) స్కైలాక్స్ (Scylax), టెసియస్ (Ctesias) మొదలగువారు. హెరెడోటస్ తన గ్రంథం హిస్టరీస్ (Histories) లో పర్షియా - గ్రీకు దండయాత్రలను వివరిస్తున్నది.

అలెగ్జాండర్ భారతదేశ దండయాత్రలను గూర్చి అరియన్ (Arrian) స్ట్రాబో (Strabo), ప్లినీ (Pliny) తమ రచనలందు పేర్కొనిరి. అజ్ఞాత రచయిత రచన ఎర్రసముద్రపు డైరి (The Periplus of The Erythrian Sea) ప్రాచీన భారతదేశ చరిత్ర రచనకు ఎంతో ఉపయోగపడును.

చంద్రగుప్త మౌర్యుని ఆస్థానములోని మొగస్తనీస్ వ్రాసిన ఇండికా (INDIKA) గ్రంథం ద్వారా మౌర్యుల కాలంనాటి అనేక విషయాలు తెలుస్తున్నది.

1.4.2.2. 2. **చైనీయుల రచనలు :** బౌద్ధమతావలంబులై, బౌద్ధ గ్రంథాలను సేకరించుటకు, బౌద్ధక్షేత్రాలను దర్శించుటకు, ఫాహియాన్, హుయాన్‌త్సాంగ్, ఇత్సింగ్, మొ. చైనా యాత్రికులు మనదేశానికి వచ్చిరి. ఈ చైనా యాత్రికులలో మొదటివాడైన ఫాహియాన్ క్రీ.శ. 399 - 414 మధ్య తన భారతదేశ యాత్ర అనుభవాలను, నాటి గుప్త సామ్రాజ్య మత, సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను 'ఫో-కువో-కీ' (Fo - Kuo - Ki) లో వర్ణించెను.

హుయాన్ సాంగ్ క్రీ.శ 629 - 645 మధ్య తన భారతదేశ యాత్రానుభవాలను సి-యూ-కి (Si - Yu - Ki) అనే గ్రంథంలో పొందుపర్చెను. ఇతడు హర్ష చక్రవర్తిని గూర్చియు, అనేక ఉత్తర, దక్షిణ దేశ రాజులను, నాటి పరిస్థితులను, నలందా విశ్వవిద్యాలయమును తన రచనలలో పేర్కొనెను.

ఇత్సింగ్ క్రీ.శ. 671 - 695 మధ్య గుప్తుల కాలం నాటి పరిస్థితులను వివరించెను. ఈ చైనా యాత్రికుల రచనలు మనదేశ చరిత్ర రచనకు ఎంతో దోహదపడినవి. అట్లే హూణ దండయాత్రలను తెల్సుకొనుటకు ఇత్సింగ్ రచనలు చరిత్ర రచనకు ఉపయోగపడ్డాయి.

1.4.2.2. 3. **అరబ్బు లేదా ముస్లిం రచనలు :** క్రీ.శ. 8వ శతాబ్దం నుండి లభ్యమవుతున్న కొన్ని అరబ్బుల రచనలు ప్రాచీన భారతదేశ చరిత్రకు ఆధారాలుగా ఉపయోగపడతాయి. అరబ్బు రచయితలలో మేటి 'అల్‌బెరూనీ'. ఇతడు అరబ్బీ, సంస్కృత భాషలలో దిట్ట. అల్‌బెరూనీ రచనల ద్వారా భారతదేశ శాస్త్రములు, సాంఘిక, మత విషయములలోను, మహమ్మదీయ దండయాత్రలకు సంబంధించిన సమాచారం విపులంగా లభిస్తుంది. అతని గ్రంథమైన 'కితాబ్ - ఉల్ - హింద్' అత్యంత విశ్వసనీయమైనది.

అల్ - మసూది (క్రీ.శ. 850) కనూజ్ పాలకుడైన మిహిరభోజుని పరిపాలనను వర్ణిస్తుంది. 'ఫిర్‌దౌశీ' అను కవి తన 'షానామా' లో అలెగ్జాండర్, మౌర్య చంద్రగుప్తుల వివరము తెలియచేసెను.

## 1.5. సారాంశము

పైన పేర్కొనబడినటువంటి పురావస్తు, వాఙ్మయ ఆధారములు ప్రాచీన భారతదేశ చరిత్రను వ్రాసేందుకు ఉపయోగపడుతున్నవి. చరిత్ర రచనలో పురావస్తు ఆధారాల కంటే వాఙ్మయ ఆధారాలను ఉపయోగించేటప్పుడు చరిత్రకారుడు కడు శ్రద్ధ వహింపవలెను, లేకపోతే కొన్ని దోషాలు దొర్లే అవకాశం ఉంటుంది.

## అభ్యాసాలు

**I. వ్యాసరూప ప్రశ్నలు (Essay Type Questions)**

(1) భారతదేశ చరిత్రకు గల ఆధారములను వర్ణింపుము

**II. లఘు వ్యాసరూప ప్రశ్నలు (Short Notes)**

(1) నాణేలు (2) బౌద్ధమత గ్రంథాలు

(3) నిర్మాణాలు లేక చిహ్నాలు

**III. నాలుగైదు వాక్యాలలో సమాధానం వ్రాయండి**

(1) ఋగ్వేదం (2) అర్థశాస్త్రం (3) అశోకుడు

## ఉపయుక్త గ్రంథాలు


(1) M.A. Charitra Rachanaa Saastram — Sri.J. Durga Prasad (Telugu Akademi)

(2) The Ancient India — R.C. Mazumdar

(3) Indian History and Culture Vol.1 — B.S.L. Hanumantha Rao & Basaveswara Rao

(4) Out lines of Indian History — Eswari Prasad

(5) Students Oxford History of India — V.A. Smith

(6) Advance History of India — Datta, Roychaudary and R.C. Mazumdar


- పి. రవీంద్ర రాజు

పాఠం - 2

# భారతదేశ చరిత్ర పై భౌగోళిక పరిస్థితుల ప్రభావం

## 2.1. లక్ష్యం :

చరిత్ర అంటే ఏమిటి? చరిత్రకు మూలం ఏమిటి?, ప్రకృతికి - మానవునికి గల సంబంధం ఎట్టిది? చరిత్రపై భౌగోళిక పరిస్థితుల ప్రభావం ఎలా ఉంటుంది. భారతదేశానికి ఆ పేరు ఎలా వచ్చింది? దాని ఉనికి, ఎల్లలు, భౌగోళిక పరిస్థితుల ప్రభావం, భారతదేశ విశిష్ట లక్షణమైన భిన్నత్వంలో - ఏకత్వం మొదలగు అనేక విషయాలను తెలుసుకోవటం.

ప్రధానాంశాలు :

2.2. ఉపోద్ఘాతం
2.2. 1. పేరు
2.2. 2. దేశవిస్తీర్ణం
2.2. 3. ఎల్లలు
2. 3. భౌగోళిక విభాగాలు
2.3. 1 హిమాలయ పర్వతప్రాంతం
2.3. 2. ఆర్యావర్తం లేదా గంగా సింధూ మైదానం
2.3. 3. దక్కన్ పీఠభూమి
2.3. 4. దక్షిణ దేశం
2. 4. భౌగోళిక పరిస్థితుల ప్రభావం :
2.4. 1. పర్వత శ్రేణులు - వాటి ప్రభావం
2.4. 2. నదులు వాటి ప్రభావం
2.4. 3. శీతోష్ణస్థితి - దాని ప్రభావం
2.4. 4. సముద్రతీరం - దాని ప్రభావం
2. 5. భిన్నత్వంలో ఏకత్వం

## 2.2.ఉపోద్ఘాతం :

గతంలో మానవుడు సాధించిన అభ్యుదయాన్ని వివరించేదే చరిత్ర. సుదీర్ఘమైన చరిత్ర ఉన్న కొద్ది దేశాల్లో భారతదేశం ఒకటి. అతి ప్రాచీన సంస్కృతులకు, నాగరికతలకు స్థావరాలైన దేశాల్లో భారతదేశం అగ్రగామి. మానవుడు భూమిమీద సాధించిన అభ్యుదయమే చరిత్రకు కథావస్తువు. ప్రకృతిలో అనంతమైన సంపద ఉంది. ప్రగతిశీలత మానవలక్షణం. ఈ కారణాల వల్లనే మానవ ప్రగతి పై ప్రకృతి ప్రభావం ప్రగాఢంగా కన్పిస్తుంది. అనాగరిక దశనుండి నేటి నాగరిక స్థితికి చేరుకోవడానికి మానవుడు జరిపిన కృషి, అతడు సాధించిన ప్రగతి చరిత్రకు ప్రధానాంశం. అందువల్లనే చరిత్ర నాగరిక మానవుని జీవిత కథగా వర్ణించబడింది.

దేశ స్వరూపాన్ని ప్రకృతి అని స్థూలంగా నిర్వచించవచ్చు. దీనిలో ఆ దేశ విస్తీర్ణం, సరిహద్దులు, పర్వతాలు, నదులు, శీతో సముద్రతీరం, మొదలైన అంశాలు ప్రధానంగా ఉంటాయి. వీటినే భూగోళపరిస్థితులు అంటారు. పైన వివరించిన దానిని దేశ భౌగోళిక పరిస్థితులు, అందులో నివసించే ప్రజల ప్రవృత్తి, ఆలోచనలు, ఆచారాలు, ఆశయాలు, ఆ జాతి చరిత్రలోని

ఉద్యమాలు, ప్రముఖ ఘట్టాలు మొదలైన వాటిపై గాఢమైన ప్రభావాన్ని కలిగిస్తాయి. దేశనైసర్గిక స్వరూపం ఆ జాతి ప్రగతికి నాటక రంగస్థలం వంటిది. అందుచేతనే ఒక దేశ చరిత్రను సరిగా అర్థంచేసుకోవడానికి ఆ దేశ నైసర్గిక స్వరూపాన్ని గురించి తెలుసుకోవడం అత్యవసరం. ఇట్లు చరిత్రకు, భౌగోళిక పరిస్థితులకు అత్యంత సాన్నిహిత్యముండుటచే 'రిచర్డు హక్లుయాత్' (Richard Hqkluyet) అను పండితుడు "ఈ సృష్టికి సూర్య చంద్రాదులెట్టివారో, మానవులకు నేత్రాలు ఎట్టివో, చరిత్రకు భౌగోళికశాస్త్రం, కాలవివరణ శాస్త్రం (Chronology), అట్టివి" అని వక్కాణించెను. (Geography and Chronology are the Sun and the Moon the right eye and the left eye of History) (Richard Hykluyet)

**2.2. 1. పేరు :** 'భారతదేశం' అన్న పేరు భరతుడనే రాజు పాలించినందు వల్ల వచ్చిందని ప్రతీతి. భరతుడు మహాభారతంలో కన్పించే శకుంతలా దుష్యంతుల పుత్రుడు. భరతుడు ప్రసిద్ధుడైన చక్రవర్తి కాదు. కాని ఈతడు భరతులు అనే తెగకు చెందినవాడు. వీరే హస్తినాపుర రాజ్యాన్ని స్థాపించిన వారు. కౌరవ పాండవులు భరత తెగలోని శాఖలే. వారి మధ్య జరిగిన యుద్ధ చరిత్రే 'మహాభారతం' అనే ప్రసిద్ధ ఇతిహాసమయ్యింది. అందువల్ల ప్రసిద్ధుడైన భరతుని వల్లగాక సుప్రసిద్ధమైన భరతులవల్లనే ఈ దేశానికి 'భారత దేశం' అనే పేరు వచ్చిందనడం యుక్తం. పురాణాలు భారత దేశం "జంబూద్వీపంలో" అంతర్భాగమని చెబుతున్నాయి.

సింధూనది ఈ దేశంలో ప్రవహిస్తుంది. అందువల్ల పారశీకుల ఉచ్ఛారణలో సింధు 'హిందూ' గానూ, గ్రీకుల ఉచ్ఛారణలో 'హింద్' 'ఇండ్' గానూ మారింది. మధ్యయుగంలో అరబ్, పారశీక దేశాలకు చెందిన మహమ్మదీయ చరిత్రకారులు ఈ దేశాన్ని "హిందూస్థాన్" అని వ్యవహరించారు.

ఈనాడు భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ అని పిలువబడుతున్న దేశాలు భారత ఉపఖండంలో అంతర్భాగాలుగా ఉండేవి. క్రీ.శ. 1947 ఆగస్ట్ 15వ తేదీన భారత దేశం, భారత్, పాకిస్థాన్ అనే రెండు స్వతంత్ర దేశాలుగా విభజింపబడింది. ఆ తర్వాత పాకిస్థాన్ నుండి తూర్పుపాకిస్థాన్ విడిపోయి 'బంగ్లాదేశ్' అను పేర స్వతంత్ర్య దేశం అవతరించింది. 1947 లో భారత్, పాకిస్థాన్‌లు విడిపోయే వరకు ఈ దేశాలు చరిత్ర ఒక్కటే, అందువల్ల భారత చరిత్రలో భారతదేశమనే పేరు భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ లు కలసి ఉండిన భారత ఉపఖండానికి వర్తిస్తుంది.

**2.2. 2. దేశవిస్తీర్ణం (ఉనికి) :** భారతదేశం ఆసియాఖండంలో దక్షిణాన మధ్యగా ఉన్న సువిశాల ద్వీపకల్పం. ఇది సుమారు $8^0$ - $37^0$ ఉత్తర అక్షాంశాల నడుమను, $61^0$ - $97^0$ తూర్పు రేఖాంశాల నడుమ ఇమిడి ఉన్నది. ఉత్తర దక్షిణాలుగా 3200 కిలోమీటర్‌లు, తూర్పుపడమరలుగా 3200 కిలోమీటర్‌లు విస్తరించి రష్యా మినహా ఐరోపా ఖండానికి సమంగా ఉంది. దాదాపు నేడు 100 కోట్ల జనాభా కలిగి ఉంది.

ఈ దేశం ఆసియా ఖండంలో దక్షిణాన మధ్యగా ఉన్నందువలన తూర్పు, పశ్చిమ, ఆసియా దేశాలతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకొనుటకు వీలుకలిగినది. అందువల్లనే ఆసియాలో వలస సామ్రాజ్యాలను నెలకొల్పిన ఐరోపా వారు తమ కార్యకలాపాలకు భారత దేశాన్ని కేంద్రంగా చేసుకొన్నారు. సువిశాల దేశమైనందు వల్లనే ఉపఖండంగా పిలువబడుతున్నది. సువిశాల దేశమైనందువల్లనే ఆధునిక యుగారంభం వరకు దేశంలో రాజకీయ ఐక్యత స్థాపించుటకు జరిగిన ప్రయత్నాలన్నీ విఫలమైనాయి. దేశం సువిశాలమైనందువల్లనే ఈ దేశాన్ని పరిపాలించిన ప్రభువులు దేశం మొత్తాన్ని జయించడంలోనే తమ శక్తిసామర్థ్యాలను వినియోగించారేగాని ఇతర దేశాలను జయించుటకు ప్రయత్నించలేదు. అందువల్లనే భారతదేశం శాంతి కాముక దేశంగా పరిగణించబడింది. దేశం విశాలమైనందువల్లనే వివిధ ప్రాంతాల ప్రజలలో సాంస్కృతిక వైవిధ్యం కూడా ఏర్పడినది.

**2..2 3. ఎల్లలు :** భారతదేశం సరిహద్దులు ప్రకృతి సిద్ధమైనవి. ఉత్తరాన మహోన్నత హిమాలయ పర్వతశ్రేణులు. దక్షిణాన హిందూ మహాసముద్రం, తూర్పు పడమరలు వరుసగా అరేబియా సముద్రం, బంగాళాఖాతం భారత దేశానికి సహజమైన సరిహద్దులు. ఇవి దేశానికి విలక్షణమైన భౌగోళిక ఐక్యాన్ని చేకూరుస్తూ నలువైపుల పెట్టని కోటవలె రక్షణ నిస్తున్నాయి. దేశాన్ని మిగిలిన ఆసియా ఖండం నుండి వేరుచేస్తున్నాయి. అందువల్లనే భారతదేశం భౌగోళిక ఒంటరితనం అనుభవిస్తున్నదని చెప్పబడినది. క్రీ. శ. 17, 18 శతాబ్దాల వరకు సముద్రాలు దాటి ఈ దేశం మీద దండయాత్ర చేయడానికి సాహసించినవారు లేరు. అయితే వాణిజ్యం కోసం ఇతర దేశా

నుంచి వ్యాపారస్తులు చిరకాలం నుండి వస్తూనే ఉండేవారు. అదే లక్ష్యంతో ఈ దేశవాసులు కూడా ఇతర దేశాలకు నౌకలపై వెళ్ళి వ్యాపారం చేసేవారు. అంతేకాక వ్యాపారస్థులను అనుసరించిన మత ప్రచారకులు. ముఖ్యంగా ఆగ్నేయాసియా దేశాలకు వెళ్ళి భారతీయ సంస్కృతిని విస్తరింప చేసినారు. భారతదేశానికి వాయవ్య సరిహద్దున హిమాలయ పర్వతశాఖలైన హిందూ కుష్ పర్వతాలున్నాయి. వాటిలో కొన్ని ముఖ్యమైనవి ఖైబర్ బోలాన్ కనుమలు. మనదేశానికి వచ్చిన విదేశీయులు దాదాపుగా ఈ కనుమల గుండానే వచ్చినారు. దక్షిణాన ఉన్న సింహళం, ఆగ్నేయాన ఉన్న బర్మా, వాయువ్యాన ఉన్న ఆఫ్ఘనిస్తాన్, బెలుచిస్తాన్‌లు భౌగోళికంగా భారతదేశంలో అంతర్భాగాలు కాకపోయినా చారిత్రకంగానూ, సాంస్కృతికంగానూ చిరకాలంగా అత్యంత సన్నిహిత సంబంధాలు ఉండేవి.

## 2.3 భౌగోళిక విభాగాలు :

భౌగోళిక పరిస్థితులను బట్టి భారతదేశాన్ని 4 సహజ మండలాలుగా విభజించవచ్చును.

1. హిమాలయ పర్వత ప్రాంతం
2. ఆర్యావర్తం లేదా గంగా సింధూ మైదానం
3. దక్కన్ పీఠభూమి
4. దూరదక్షిణ దేశం లేదా తమిళకం

హిమాలయ పర్వత ప్రాంతం, గంగా సింధూ మైదానం కలసి ఉత్తర హిందూ దేశంగాను, దక్కన్ పీఠభూమి, దూరదక్షిణ దేశంకలసి దక్షిణా పథంగాను వర్ణించవచ్చును.

**2.3. 1. హిమాలయ పర్వత ప్రాంతం :** మనదేశంలో ఉత్తరాన ఉన్న పర్వత శ్రేణులు ఎల్లప్పుడూ హిమంచే (మంచు) కప్పబడి ఉండుటచే వాటిని హిమాలయ పర్వత శ్రేణులందురు. ఈ పర్వత ప్రాంతం పశ్చిమమున బెలూచిస్తాన్ నుండి తూర్పున అస్సాం వరకు అర్థచంద్రాకారంగా వ్యాపించింది. ఈ పర్వత శ్రేణులు దేశానికి ఉత్తరమున తూర్పు పడమరలుగా దాదాపు 240 కి.మీ. ల పొడవున విస్తరించి ఉన్నవి.

హిమాలయాలు ప్రపంచంలో కెల్లా ఎత్తైన పర్వతశ్రేణులై నందున అవి పెట్టని కోటగోడవలె, విదేశీ దండయాత్రల నుండి మనదేశంను చాలా వరకు రక్షించినవి. హిమాలయ పర్వతశ్రేణుల్లో ఎత్తైన శిఖరం 'ఎవరెస్టు', ఇది 8,884 మీటర్ల ఎత్తు ఉన్నది. ఈ పర్వత శ్రేణులలో వాయువ్య భాగంలో హిందూకుష్, సులేమాన్, కిర్తార్, పర్వతాలు, ఈశాన్యదేశంలో ఖాశీ, జాంతియా, పట్‌కాయ్ తోషామ్, నాగా పర్వతాలు ఈ హిమాలయశాఖలు. కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, నేపాల్, బూటాన్, సిక్కిం, అస్సాం ప్రాంతాలు ఈ సహజ మండలంలోనివి.

హిమాలయాల సహజ సౌందర్యము కవులను, కళాకారులను ఆకర్షించివారిని ఉత్తేజ పరచెను. మహాకవి కాళిదాసు హిమాలయాలు 'దేవతల ఆత్మ సదృశ్యాలు' (The soul of gods) అని వర్ణించెను. అట్లే భగవద్గీత యందు శ్రీకృష్ణుడు "పర్వతశ్రేణులలో నేను హిమాలయములంతటి వాడను" ( "Among the mountains I am the Himalayas") అని తన గొప్పతనాన్ని చాటెను.

**2.3. 2. గంగాసింధూ మైదానం :** ఉత్తర హిందూ దేశాన ప్రవహించు నదులలో ముఖ్యమైనవి, గంగ, సింధూ, బ్రహ్మపుత్ర. హిమాలయ పర్వతశ్రేణుల నుండి దక్షిణాన వింధ్య పర్వతాల వరకు విస్తరించిన మైదాన ప్రాంతంను గంగా సింధూ మైదానం అంటారు. ఈ నదీలోయలలోనే ప్రాచీన భారత సంస్కృతి పుట్టి పెరిగింది.

ఈ నదులకు తరచు వరదలు రావటం వలన ఒండ్రుమట్టితో కూడిన సారవంతమైన మైదానమగుటవల్ల ఈ ప్రాంతాన వ్యవసాయం పుష్కలంగా పండుటతో ఈ ప్రాంతం ఐశ్వర్యవంతమై జనసాంద్రత ఎక్కువగా కలిగిఉన్నది. గంగామైదానం తరతరాలుగా భారతరాజకీయాలకు ఆయువుపట్టయ్యింది. అదే పుణ్యభూమిగా పేర్కొనబడిన మధ్యదేశం. ఒకనాటికి దాదాపు దేశ వ్యాప్తమైన మగధ సామ్రాజ్యం ఈ ప్రాంతంలోనే ఆవిర్భవించింది. తమ సమర్థత, సత్తాలను నిరూపించుకునేందుకు గంగామైదాన ప్రాంతాన్ని ఆక్రమించాలని కొన్ని దక్షిణాది రాజవంశాలు పోటి పడినాయి. 'గంగా - యమునా' తోరణాప్రాంతం భారతీయ సార్వభౌమాధికారానికి చిహ్నంగా

కాలాకాలం నిలిచింది. ఈ గంగామైదానాన్ని స్వాధీనం చేసుకొన్న తర్వాతనే తురుష్కులుకాని, ఆంగ్లేయులు కాని దేశానికి సార్వభౌములు కాగలిగారు. గంగా సింధూ మైదానం వేద మతానికి పట్టుగొమ్మ. జైన, బౌద్ధమతాలు ఈ ప్రాంతంలోనే వ్యాప్తిపొందాయి. ఈ మైదానంలోనే అనేక హిందూ పుణ్యక్షేత్రాలు వెలిసాయి. సారనాథ్, మధుర, ఖజురహో వంటి కళాక్షేత్రాలకు ఈ ప్రదేశం ఘనత వహించింది. ప్రాచీన భారత చరిత్రలోని రాజధాని నగరాలు,వ్యాపార కేంద్రాలన్ని నదీ తీరాల్లో నిర్మించినవే. పాటలీ పుత్రం, ప్రయాగ, వారణాసి, హస్తినాపురం వంటి నగరాలు ఇందుకు ఉదాహరణలుగా చెప్పవచ్చును. అందువల్లనే భారతదేశంలోనికి చొచ్చుకొనివచ్చిన విదేశీయులు తమ దృష్టిని ఈ ప్రాంతాల వైపు మళ్ళించాయి.

**2.3. 3. దక్కన్ పీఠభూమి :** వింధ్య పర్వతాలకు దక్షిణంగా తూర్పు, పశ్చిమ కనుమలకు మధ్యగా, కృష్ణా, గోదావరి, కావేరి, నర్మదా, తపతీ, మొ. నదుల వరకు వ్యాపించిన కఠిన శిలాప్రాంతంను దక్కన్ పీఠభూమిగా పిలువబడుతున్నది. నర్మద, తపతి నదులు తూర్పునుండి పశ్చిమంగా ప్రవహిస్తే గోదావరి, కృష్ణా నదులు పశ్చిమం నుండి తూర్పుగా ప్రవహించి సముద్రంలోకి కలుస్తున్నాయి. ఈ పీఠభూమి ప్రాంతం ఎత్తు, పల్లాలతో ఎగుడు, దిగుడుగా ఉండుటచేత, వర్షపాతం తక్కువగుట చేతను వ్యవసాయానికి అంత అనుకూలంకాదు. ఈ పీఠభూమి ఉత్తర హిందూ దేశం నుండి వింధ్య సాత్పురా పర్వతాలచే వేరు చేయబడింది. ఈ ప్రాంతపు ప్రజల అలవాట్లు సంప్రదాయాలు ఉత్తర హిందూదేశ ప్రజల అలవాట్లు, సాంప్రదాయాలకు భిన్నంగా ఉంటాయి. అనాదిగా దక్కన్ పీఠభూమిలో స్థాపించబడిన రాజ్యాలు, రాజవంశీయులు తమ ప్రత్యేకతను నిలుపుకోగలిగాయి. దేశంలోని ఉత్తర, దూరదక్షిణ నాగరికతల మధ్య ఈ ప్రాంతం సమన్వయాన్ని సమకూర్చింది. ఈ ప్రాంతం విజయనగర, మహారాష్ట్రారాజ్యాల హిందూ మత సాంస్కృతిక పునరుద్ధరణ కృషికి పట్టుకొమ్మ. ఈ పీఠభూమి అందలి నదులు నౌకాయానానికి అంత అనుకూలంగా లేవు. అందువల్లే వ్యాపార, వాణిజ్య అభివృద్ధి సాగలేదు.

**2.3. 4. దక్షిణ ప్రాంతం :** దక్షిణదేశంన ప్రవహించు ముఖ్యనదులు గోదావరి, కృష్ణా, కావేరి, తుంగభద్ర. ఈ నదులు దక్షిణ దేశంను నాల్గుముక్కలుగా విభజించి నందున, ఈ ప్రాంతంలో ఎన్నడునూ రాజకీయ ఐక్యత నోచుకొనలేదు. కృష్ణా, తుంగభద్ర నదులకు దక్షిణంగా కన్యాకుమారి వరకు వ్యాపించిన భూభాగం దక్షిణ దేశం లేదా తమిళం అనియు, దీనినే ద్రావిడదేశమని కూడా పిలుతురు. ప్రాచీన తమిళ రాజ్యాలు ఇక్కడే వెలిసాయి. దక్షిణ దేశ రాజ్యాధిపత్యమునకై ఎల్లప్పుడూ, దక్షిణ దేశరాజుల మధ్య సంఘర్షణ జరిగెడిది.

ఉదా : కృష్ణా - తుంగభద్ర నదుల మధ్య నున్న ప్రదేశం కొరకు బహమనీ, విజయనగర రాజులు నిరంతరం యుద్ధాలు చేసారు. ఈ దక్షిణ దేశాన శాతవాహన, పల్లవ, చోళ, చాళుక్య సామ్రాజ్యాలుదయించినవి. ఈ ప్రాంతంను పాలించిన రాజ వంశాలు దక్షిణ దేశ సాంస్కృతిక వికాసానికి ఎంతో కృషి చేసిరి. రోమ్, ఈజిప్టు రాజ్యాలతో వర్తక సంబంధాలు కలిగి ఉండుటచే దక్షిణ భారతీయ సంస్కృతి విదేశాలకు కూడా వ్యాపించింది.

## 2.4 భౌగోళిక పరిస్థితుల ప్రభావం :

పర్వతాలు, నదులు, శీతోష్ణస్థితి, సముద్ర తీరం, మొదలైన భౌగోళిక అంశాలు దేశ చరిత్ర పైననూ, ప్రజల జీవిత విధానం పైననూ చాలా ప్రభావాన్ని ప్రదర్శిస్తాయి. భారత చరిత్రపై వీటి ప్రభావాన్ని పరిశీలిద్దాం.

**2.4. 1. పర్వత శ్రేణులు - వాటి ప్రభావం :** చరిత్రను రూపొందించుటలో ఏ దేశ పర్వత శ్రేణులూ మనదేశ పర్వత శ్రేణులంతటి ముఖ్య పాత్ర వహింపలేదు. భారత దేశానికి ఉత్తర సరిహద్దున, తూర్పు పడమరలుగా దాదాపు 2400 కి.మీ పొడవున వ్యాపించియున్న హిమాలయ పర్వత శ్రేణులు ప్రపంచంలో కెల్ల మహోన్నతమైనట్టివి. కిర్థార్, సులేమాన్, హిందూకుష్, కారాకోరమ్ పర్వతాలు కూడా చెప్పుకోదగినవి. ఈ పర్వతములోని ఎత్తైన శిఖరం ఎవరెస్ట్ శిఖరం. కాంచనగంగ, నందాదేవి, ధవళగిరి శిఖరాలు కూడా ఈ పర్వత శ్రేణులకు చెందినవే. ఈ పర్వతాలు విదేశీ దండయాత్రల నుండి దేశాన్ని రక్షించటమే గాక, ఉత్తర దిశ నుంచి వీచే ఎడారి గాలుల నుంచి ఉత్తర భారతాన్ని రక్షిస్తున్నాయి. కాని వాయువ్య దిశలో ఉన్న పర్వతాలలో కైబర్, బోలన్, టోచీ, గోమల్, ముల్లా మొదలగు కనుమలు ఉండుట చేత విదేశీయులు వీటి ద్వారా భారతదేశంపై దాడిచేయుటకు అవకాశ మేర్పడినది. ఆర్యులు మొదలు కొని తురుష్కుల వరకు మనదేశం పై దాడి చేసిన వారందరూ ఈ కనుమల ద్వారా మన దేశంలో ప్రవేశించిరి. హిమాలయ పర్వత శ్రేణులు

భారతదేశాన్ని ఆసియా ఖండం నుండి వేరుచేసి దేశానికి భౌగోళిక ఒంటరితనాన్ని కలుగ చేసినప్పటికి పశ్చిమోత్తర దిశల ఉన్న కనుమల ద్వారా దేశం ఇతర ఆసియా దేశాలతో సాంస్కృతిక, వాణిజ్య పరమైన సంబంధాలు కలిగి ఉండుటకు వీలయ్యింది.

ఈ పర్వత శ్రేణులు ఎల్లప్పుడు మంచుతో కప్పబడి ఉండుటచేత ఈ పర్వతాలలో పుట్టి ప్రవహించే గంగ, సింధు, బ్రహ్మపుత్ర జీవనదులైనాయి. ఋతుపవన వర్షాలకు కూడా ఈ పర్వత శ్రేణులే కారణం. వాస్తవానికి ఈ పర్వత శ్రేణులే లేకపోతే ఉత్తర భారతదేశం పెద్ద ఎడారిగా ఉండేది. హిమాలయ ప్రాంత భూములలో నివసించే ఘుర్కాలు, మొదలైన జాతులవారు, దృఢకాయులు. స్వాతంత్ర్య ప్రియులు. ఇన్ని విధాల దేశ సౌభాగ్యానికి కారణాలైన ఈ శీతాద్రులపట్ల కృతజ్ఞతాభావంతో ప్రాచీనులు వాటిని తమ భాగ్య దేవతలకు నివాసంగా బావించి ఆరాధించటంలో ఆశ్చర్యమేమీ లేదు. భారతీయుల, మతంలో, సారస్వతంలో ప్రముఖ స్థానాన్ని పొందిన హిమాలయాలు భారతదేశానికి జాతీయ పర్వత శ్రేణులని చెప్పవచ్చు. అయితే ఈ పర్వత శ్రేణులు వల్ల కొన్ని నష్టాలు కూడా లేకపోలేదు. విదేశీయులందరు ఈ పర్వత శ్రేణుల ద్వారానే మనదేశంలో ప్రవేశించి, ఆక్రమించిరి. ఈ దురాక్రమణదారులతో మన దేశములు యుద్ధం చేయవలసి వచ్చినది. అందువల్లనే భారత చరిత్ర గతిని మార్చిన యుద్ధాలన్ని పానిపట్టు, కురుక్షేత్రం, స్థానేశ్వరం మొదలగు ప్రాంతాలలో జరిగాయి.

వింధ్య పర్వతాలు భారతదేశాన్ని ఉత్తర దక్షిణాలుగా రెండు ముక్కలుగా విభజిస్తున్నాయి. అందువలన ఈ రెండు ప్రాంతాల మధ్య చాలా కాలం వరకు ఎటువంటి సంబంధాలు లేవు. దానితో ఈ రెండు ప్రాంతాలు ప్రత్యేకమైన భిన్న సంస్కృతులను అభివృద్ధి చేసుకొన్నవి.

అంతేగాక విదేశీ సంస్కృతుల ప్రభావం దక్షిణ దేశం కంటే ఉత్తర భారతదేశం పై ఎక్కువగా కనిపిస్తుంది. పడమటి కనుమలు నైఋతీ ఋతుపవనాలను అడ్డగించుటచేత పశ్చిమ తీరప్రాంతంలో విశేష వర్షపాతం, దక్కన్ పీఠభూమిలో వర్షాభావం ఏర్పడింది. పడమటి కనుమలు దక్షిణ భారతదేశానికి రెండవ దక్షణ గోడగా వ్యవహరిస్తుంది. సముద్రాలను అధిగమించి పశ్చిమ తీరంలో అడుగు పెట్టిన విదేశీయులు తమ అధికారాన్ని దక్కన్ పీఠభూమిలోనికి విస్తరించకుండా ఈ పడమటి కనుమలు అడ్డుకుంటున్నాయి. వీనినాధారంగా చేసుకొని మహారాష్ట్రులు శివాజీ నాయకత్వాన దక్కను సుల్తానులపై, మొగలు చక్రవర్తులపై గెరిల్లా యుద్ధాలను సాగించి అనేక విజయాలను పొందిరి.

**2.4. 2. నదులు - వాటి ప్రభావం :** నదులు భారత చరిత్ర పై విశేష ప్రభావాన్ని చూపెడుతున్నాయి. నదీ ప్రాచీన నాగరికతలకు కేంద్రాలు. మన దేశంలో తొలి నాగరికత యైన సింధూ నాగరికత లేదా హరప్పా సంస్కృతి ఈ నదిలోయ ప్రాంతాలలోనే ఉద్భవించినది. అటులనే వేదకాలపు నాగరికత గంగా, సింధూ, మైదాన ప్రాంతాలలోనే ఉద్భవించినది. ఇక్కడే ఆర్యులు తమ సంస్కృతిని విస్తరింప చేసిరి.

నదీలోయ ప్రాంతాలగుటచే తరచు వచ్చు వరదల వలన ఇచ్చటి నేలలు సారవంతమైన ఒండ్రు మట్టి కొట్టుకు వచ్చి వ్యవసాయం పుష్కలంగా పండుటచే ఈ గంగా, సింధూ, మైదాన ప్రాంతాలు సస్యశ్యామలమై ఐశ్వర్య వంతమైనవి. 'గంగా - యమునా' తోరణ ప్రాంతం భారతీయ సార్వభౌమాధికారానికి చిహ్నంగా నిలచింది. ఈ ప్రాంతంలోనే ప్రాచీన నాగరికతలు, మతాలు, కళాక్షేత్రాలు, వికసించాయి. ప్రముఖ వ్యాపార కేంద్రాలు కూడా ఇక్కడ ఉన్నాయి.

దక్షిణ భారత దేశంలోని నదులలో గోదావరి, కృష్ణ, మహానది, కావేరి ముఖ్యమైనవి. ఈ నదులు తమ డెల్టా ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తున్నాయి. దక్కన్ పీఠభూమిని కృష్ణ, గోదావరి నదులు రెండు భాగాలుగా విభజించుచున్నాయి. అందువలననే దక్కన్ ప్రాంతంలో రాజకీయ ఐక్యత లేదు. ఈ దక్కన్ ప్రాంత అధిక్యత కొరకు నాటి విజయనగర, బహమనీ రాజ్యాలు నిరంతర పోరు సల్పినవి.

**2.4. 3. శీతోష్ణ స్థితి - దాని ప్రభావం :** భారతదేశంలో శీతోష్ణస్థితి ప్రభావం ఎక్కువగా ఉంది. ఎక్కువ ఉష్ణ మండల ప్రాంతం, కొంత సమశీతోష్ణ మండల ప్రాంతం ఉంది. కొన్ని ప్రాంతాలలో హెచ్చు వేసవి ఉష్ణోగ్రత ఉంటే మరి కొన్ని ప్రాంతాలలో శీతాకాలం చలి విపరీతంగా ఉంటుంది. ఇటువంటి పరిస్థితి వర్షపాతంలో కూడా కనిపించును. కొన్ని ప్రాంతాలలో ఎక్కువ వర్షపాతం, మరి కొన్ని ప్రాంతాలలో తక్కువ వర్షపాతం ఉంటుంది. ఇటువంటి విభిన్న శీతోష్ణస్థితులు ఉండుటచే అత్యధిక జనాభా కలిగిన భారతదేశం త్వరిత గతిని అభివృద్ధి చెందలేక పోవుచున్నది. భారతదేశంలో అధిక ప్రాంతం ప్రకృతి పై ఆధారపడుట కూడా ఒక కారణంగా చెప్పవచ్చును.

### 2.4. 4. సముద్ర తీరం - దాని ప్రభావం :

మన దేశంనకు మూడు వైపులా కలసి సుమారు 3,000 మైళ్ళు సముద్ర తీరం ఉంది. కాని ఈ తీర రేఖ చాలి ఉండక పోవుటచే గొప్ప సహజ నౌకాశ్రయం ఏర్పడలేదు. ఈ సముద్రం దక్షిణా పథానికి దగ్గరలోను ఉత్తర పథానికి దూరంగాను ఉన్నందువలన ప్రాచీన కాలం నుండి దక్షిణ వాసులు సముద్ర యానంలో ఆరితేరి విదేశాలతో వర్తక వ్యాపారాలు సాధించిరి. అయితే ఉత్తర ప్రాంతము సముద్రయానం నిషేధించుట, నౌకా బలాన్ని అభివృద్ధి చేసుకొనక పోవుట అనేక ప్రముఖ రాజ్యాలు పతనము చెందుటకు కారణమైంది. ఆంగ్లేయుల రాజ్యాధికారానికి ప్రముఖ కారణం వారి నౌకాబలం. దక్షిణ భారతీయ చక్రవర్తుల కొందరు విదేశాలతో వర్తకవ్యాపారాలు చేసినారు.

ఈ విధంగా భారతదేశపు నైసర్గిక స్వరూపం భౌగోళిక పరిస్థితులు భారత దేశ చరిత్ర మీదా, భారతీయుల జీవిత విధానంపైన విశేష ప్రభావాన్ని కలిగించాయి.

### 2.5. భిన్నత్వంలో ఏకత్వం :

భారతదేశంలో వివిధ జాతుల మతాల మధ్య కన్పించే భిన్నత్వం ఒక ప్రత్యేక లక్షణంగా చెప్పుకోవచ్చు. అత్యధిక జనాభా, వైశాల్యం, గల దేశం కావున అనంతమైన భౌగోళిక, సాంస్కృతిక విభిన్నతల్ని దాచుకుంది. వివిధ జాతుల మతాల సమ్మేళనం ఒక్క భారత దేశంలోనే మనకు కన్పిస్తుంది. ఒక మాటలో చెప్పాలంటే భారతదేశాన్ని "భిన్నత్వంలో ఏకత్వం" కలిగిన దేశంగా, ఒక 'భిన్న ప్రపంచంగా' చెప్పవచ్చును.

1. పరిమాణంలోను, జనాభాలోను అతి పెద్దదైన దేశాల్లో భారతదేశం కూడా ఒకటి. ప్రపంచ జనాభాలో 5 వ వంతు ప్రజలు భారతదేశంలో ఉన్నారు.
2. భారతదేశపు భౌగోళిక పరిస్థితులను పరిశీలించినట్లయితే విభిన్న పరిస్థితులు గల భౌగోళిక అంశాలు మనం చూడగలం.

ఉదా : కొన్ని ప్రాంతాలు జీవనదులతో సస్యశ్యామలంగా ఉంటే మరి కొన్ని 'థార్' లాంటి ఎడారులు కల్గి ఉన్నాయి. కొన్ని ప్రాంతాలలో అత్యధిక వర్షపాతం, కొన్ని ప్రాంతాలలో అల్ప వర్షపాతం కనిపిస్తుంది.

3. భారతదేశంలో వివిధ భాషలు, వివిధ మతాలకు చెందిన వారు ఉండుటచే "భారతదేశం వివిధ జాతుల జంతు ప్రదర్శన శాలగా అభివర్ణించారు. (India is a Zoo - V.A. Smith)
4. భారత దేశంలో నివసించు ప్రజల ఆచారవ్యవహారాలలోను అత్యంత వ్యత్యాసం కన్పించును.

జాతి, మత, భాషల్లో యిన్ని రకాల వైరుధ్యాలున్నప్పటికీ 'భారతీయత' అనే భావైక్యతను మాత్రం ప్రజలు కోల్పోలేదు. అతి ప్రాచీన కాలం నుండి మన ఋషులు, కవులు, సమైక్యతా భావాల్ని ప్రబోధించారు.

హిమాలయం నుండి కన్యాకుమారి వరకు గల ప్రాంతాన్ని 'భరతవర్ష' మని, అందు నివసించే ప్రజల్ని 'భరత సంతతి' అని వ్యవహరించుచున్నారు.

ఎన్ని వైరుధ్యాలున్నా 'భారతీయత' అనే అంతః సూత్రం భారత ప్రజలందరికి సమైక్యంగా ఉంచగలుగుతున్నది అని "సర్. రిబర్ట్ రిస్లే" అభివర్ణించారు.

## అభ్యాసాలు

**I. వ్యాస రూప ప్రశ్నలు (Essay Type Questions)**

(1) భారతదేశ చరిత్ర పై భౌగోళిక పరిస్థితుల ప్రభావాన్ని వివరించండి ?

**II. లఘు వ్యాసరూప ప్రశ్నలు (Short Notes)**

(1) భారత దేశ ఉనికిని గుర్తించుము ?

(2) హిమాలయ పర్వతాలను గురించి వర్ణింపుము ?

(3) 'భిన్నత్వం లో - ఏకత్వం చర్చించుము ?

**III. ఈ క్రింది ప్రశ్నలకు సరైన సమాధానాలు గుర్తించండి ?**

(1) భారత దేశాన్ని పురాణాలలో ఏమని పిలుతురు ( )

(A) భరతవర్షం (B) భారతదేశం (C) జంబుద్వీపం
(D) సింధూ దేశం.

(2) భారత దేశంనకు స్వాతంత్ర్యం ఎప్పుడు వచ్చింది ? ( )

(A) 1947 ఆగస్ట్ 15 (B) 1937 ఆగస్ట్ 15 (C) 1935 ఆగస్ట్ 15
(D) 1950 జనవరి 26

(3) హిమాలయాలలో ఎత్తైన శిఖరం ఏది ( )

(A) ఎవరెస్ట్ (B) సులేమాన్ (C) కిర్తార్
(D) జాంతీయ

(4) భారతదేశాన్ని ఉత్తర, దక్షిణాలుగా విభజించు పర్వతాలు ( )

(A) వింధ్య పర్వతాలు (B) అరావళి పర్వతాలు (C) ముడుత పర్వతాలు
(D) సాత్పురా పర్వతాలు

## ఉపయుక్త గ్రంథాలు :

(1) The Ancient India — R.C. Mazumder
(2) Indian Hisroty and culture Vol - 1 — B.S.L Hanumantha Rao
(3) Students Oxford History of India — V.A. Smith
(4) Advance History of India — Datta, Roychoudery and R.C. Mazumder
(5) Out lines of Indian History — Asweri Prasad.

- పి. రవీంద్రరాజు

పాఠం - 3

# హరప్పా సంస్కృతి

## సింధు - నాగరికత

### 3.1 లక్ష్యం

సింధు నాగరికత గురించి తెల్సుకొనుటకు ముందు, చరిత్ర పూర్వయుగం అంటే ఏమిటి, పురాతన కాలంనాటి అనాగరిక మానవుడు నాగరికుడుగా మార్పు చెందటానికి ఎంతకాలం పట్టినది, పురాతన కాలంనాటి అనాగరిక మానవుడు ఎలా జీవించాడు, అతడు ఆహార అన్వేషణ నుండి, ఆహారాన్ని ఉత్పత్తి చేసే దశకు చేరుకోవటానికి ఎంతకాలం పట్టినది, దీనికి శిలాయుగ నాగరికత అని ఎందుకు పేరువచ్చినది, శిలాయుగపు నాగరికతలు ఎన్ని ? మొదలగు అంశాలను తెల్సుకుందాం.

**ప్రధానాంశాలు :**

3.2. ఉపోద్ఘాతం
3.3. శిలాయుగాలు
3.3. 1. పాత శిలాయుగం
3.3. 2. మధ్య శిలాయుగం (లేక) సూక్ష్మ రాతియుగం
3.3. 3. నూతన శిలాయుగం (లేక) కొత్త రాతియుగం
3.3. 4. లోహయుగం
3. 4. సింధు నాగరికత
3.4. 1. పేరు
3.4. 2. నగర నిర్మాణం
3.4. 3. భవనాలు
3.4. 4. పౌర నిర్మాణాలు
3.4. 5. భూగర్భ మురుగు పారుదల
3.4. 6. ప్రజాజీవితం - సాంఘిక ఆర్థిక ప్రియత్వం
3.4.6. 1. ఆహారం
3.4.6. 2. మచ్చిక చేయబడిన జంతువులు
3.4.6. 3. దుస్తులు - ఆభరణాలు - అలంకార ప్రియత్వం
3.4.6. 4. గృహసామాగ్రి - వినోదాలు
3.4.6. 5. వ్యాపారం - వృత్తులు
3.4.6. 6. మత పరిస్థితులు
3.4. 7. సింధు - లిపి
3.4. 8. సింధు నాగరికత నిర్మాతలు ఎవరు?
3.4. 9. సింధు నాగరికతా కాలం
3.4. 10. క్షీణతకు గల కారణాలు
3.5 సారాంశము

**3.2 ఉపోద్ఘాతం** (Introduction)

మన దేశంలో ఆదిమ మానవుడు సుమారు 5 లక్షల ఏళ్ల క్రితం ఆవిర్భవించినట్లు తెలుస్తున్నది. నాగరికత పరిణామ చరిత్రలో లిపి (Script) వాడుకలోనికి రాక పూర్వపు యుగాన్ని చరిత్ర పూర్వయుగంగా (Pre - Historic age) లిపి వాడుకలోకి వచ్చి రాత ప్రారంభమైనప్పటినుండి చారిత్రక యుగంగా (Historical age) నిర్ణయించింది.

చరిత్ర పూర్వయుగంలో మానవుడు అనాగరికుడు. ఆహార అన్వేషణ నుండి నాగరికుడిగా మార్పు చెందటానికి అనేక వేల సంవత్సరాల పట్టింది. ఆదిమ మానవులు రాత పూర్వకంగా ఏమీ మిగల్చనప్పటికి, తమ నిత్యజీవితంలో వాడిన తయారుచేసిన, వాడిన ఆయుధాల పరికరాలు, భారతదేశంలో ప్రథమంలో సివాలిక్ కొండల ప్రాంతంలో, పంజాబులో వాయువ్య భాగాన పశ్చిమ సమతలంలో లభించాయి ఇటీవల రాజపుత్ర స్థానము, గురజాత్, ఎగువ నర్మదాలోయ, ఒరిస్సా, దక్కన్, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తమిళదేశాలలో ఆదిమ మానవు పనిముట్లు దొరికాయి.

## శిలాయుగాలు :

నాటి ఆదిమ మానవుడు పనిముట్లు తయారీకి వాడిన రాయి, వాటి రకాల ఆధారంగా ఆదిమమానవుల యుగాన్ని నాలుగు భాగాలుగా విభజించారు. అవి :

1. పాతశిలాయుగం (Paleolithic age (or) old stone age)
2. మధ్యశిలా యుగం (లేక) సూక్ష్మరాతియుగం (Microlitic (OR) Mesolithic age)
3. నూతన శిలాయుగం (లేక) కొత్త రాతియుగం (Neolithic (OR) New stone age)
4. లోహయుగం (Metal age)

**3.3. 1. పాతశిలాయుగం : (క్రీ. పూ. 35,000 - 10,000):** మనదేశ ప్రథమ నివాసులు పాతరాతియుగ మానవులు. వీరు అనాగరికులు. వీరు మొరటుగను, గరుకుగమ, ఉన్న రాతి పనిముట్లను ఉపయోగించినట్లు తెలియుచున్నది. వీరు క్వార్టజైట్ (Quartzit మొదలైన రాళ్ళతో తమ పనిముట్లను తయారుచేసుకొనెడివారు. వారు గులకరాళ్ళు(Pebbles), పెచ్చులు (Flatce), గొడ్డళ్ళు (hand axe), గీకుడురాళ్ళు (Scrapers) మొదలైనవాటిని సాధనాలుగా ఉపయోగించారు.

మొదట్లో మనుషులు ఆహారం కోసం జట్లు జట్లుగా ఒకచోట నుంచి మరో చోటికి సంచరిస్తూ దేశ దిమ్మరులుగా జీవించారు. ఈ యుగ మానవుడికి వేటాడుట, ఆహార సేకరణ మాత్రమే తెలుసు. గృహనిర్మాణం తెలియదు. ఎక్కువగా అడవుల్లో చెట్టు క్రింద, కొండ చరియలు, గుహలు వీరి నివాసాలు. వీరు జంతువులను వేటాడి చంపి వీటి మాంసాన్ని తినేవారు. మొదట్లో వీరికి నిప్పు చేయడ తెలియదు. కాయలు, పండ్లు కనిపిస్తే కోసుకొని తినేవారు. వ్యవసాయం చేయటం తెలీదు. ఆకులతో చెట్లు బెరడులతో, చర్మం శరీరమును కప్పుకొనేవారు. మరణించినవారి కెట్టి అంత్యక్రియలు చేయుట తెలియదు, మృత కళేబరాన్ని ప్రకృతికే వదిలివేసేవారు.

క్రమంగా రెండు కర్రలను రాపాడించి నిప్పు చేయటం తెలుసుకొన్నారు. నాటి మానవునికి కళా జ్ఞానం లేకపోలేదు. గింబేట కొండలలో, కర్నూలు, రాయఘర్ నందలు (సింగన్‌పూర్), గుహలలో జంతువుల వర్ణచిత్రంలు ఉదాహరణలు. కేవలం శిలా పనిముట్లేకా ఎముకలను కూడా ఉపయోగించినట్లు కర్నూలు, బేతంచర్ల గుహలలోని త్రవ్వకాల వలన తెలుస్తున్నది.

పాతరాతియుగం సుదీర్ఘమైన యుగం. ఈ పాతరాతియుగ మానవుని అవశేషాలు సివాలిక్ కొండ సమీపమున గల సోహా నదీలోయలోను దక్షిణ దేశమున పల్లావరం, మధురై, తంజావూర్, బళ్ళారి, కర్నూలు, గుంతకల్లు మొదలగు ప్రాంతంలోనూ లభించిన

ఈ శిలాయుగ మానవుడు కొన్ని వేల సంవత్సరాలు నివసించినను, పెక్కు పనిముట్లను, అవశేషాలను వదలివెళ్ళినను, వారు ఎ ఉంటారు, వారు ఏజాతికి చెందినవారో తెలియదు. కాని ఈ యుగమానవుడు నీగ్రో జాతికి చెందినవాడని తెలియుచున్నది. వీ పొట్టిగా, నల్లని ... గిరుసైన శిరోజాలు, చట్టిముక్కులు కల్గి ఉందురు. వీరు ప్రస్తుతం అండమాను దీవులలోని జనాలకు పూర్వీకు

**3.3. 2. మధ్య శిలాయుగం (లేక) సూక్ష్మ రాతియుగం (క్రీ.పూ. 10,000) :** క్రమంగా మానవునికి తన పరిసరాలను గూర్చిన అవగాహన పెరిగింది. మంచినేర్పు, ఆలోచన పెరిగి, తన కవసరమైన పనిముట్లను ఇసుక శిలలు, ఇతర రాళ్ళతో కూడా చిన్న సైజువి తయారుచేయటం నేర్చుకున్నాడు. ఈ పరికరాలకు కొయ్య, ఎముక పిడులు అమర్చి రకరకాల పనులకు వీటిని వాడటం నేర్చుకున్నాడు. ఇతడు ఉపయోగించిన రాతి పనిముట్లను సూక్ష్మరాతి పనిముట్లు అంటారు.

ఈ యుగమానవులు ఆహార అన్వేషణ నుండి స్వయంగా ఆహారంను సమకూర్చుకొనుటకు సంకల్పించిరి. స్థిరనివాసం మొదలైయింది. ఆహారం కోసం జంతువులను మచ్చిక చేసిరి. పశువులను, కుక్కలను, పందులను పెంచినారు. గవ్వలతో, పూసలతో తయారుచేసిన ఆభరణాలు ధరించేవారు.

ఈ యుగంలోనే మతం ప్రారంభమైనట్లు కనబడుతుంది. మృతులను వారు వాడిన పనిముట్లతో సహా పాతిపెట్టినారు. అంటే మరణానంతర జీవితంలో వారికి విశ్వాసం కలదు. తమిళనాడు, ఆంధ్ర, గుజరాత్, మహారాష్ట్ర, బెంగాల్, సింధు, మధ్యప్రదేశ్, పంజాబ్, బీహార్, రాష్ట్రాలలో మధ్యశిలాయుగ స్థావరాలు బయల్పడినాయి.

**3.3. 3. నూతన శిలాయుగం : (క్రొత్త రాతియుగం) (క్రీ.పూ. 10,000 - 5,000) :** ఈ యుగంలో మరింత ప్రగతిని సాధించినాడు. మానవ జీవితంలో స్థిరత్వం దృఢమైంది. అతడు ఉపయోగించిన పనిముట్లు శిలానిర్మితములైనప్పటికి, అవి పదునుగా, నునుపుగా, ఉండుటచే ఈ యుగంను క్రొత్త, నూతన శిలాయుగాలుగా పిలిచిరి.

పంటలు పండించటం, పశువుల పెంపకముతోపాటు, మొదట చేతితో తరువాత చక్రంతో కుండలు తయారు చేసుకొనుట, వాటిపై రంగులతో చిత్రాలను చిత్రించటం ఆరంభించారు. గవ్వలు, ఎముకలతో చేసిన ఆభరణాలను ధరించేవారు. సేలం, కడప, బళ్ళారి, అనంతపురం, తెలంగాణా, గుజరాత్, కథియావార్ ప్రాంతాలలో వీరి అవశేషాలు లభించినవి.

**3.3. 4. లోహ యుగం (METAL AGE) (క్రీ.పూ. 5,000 - 6,000) :** లోహాలు వాడుకలోకి రావడం ఈ యుగముఖ్యలక్షణం. మానవుడు ఉపయోగించు పనిముట్లకు రాతికి బదులు లోహమును ఎక్కువగా ఉపయోగించుటచే లోహయుగమందురు. మొదటి దశను తామ్ర శిలాయుగం అందురు ఈ యుగానికి చెందినదే సింధు - నాగరికత. ఈ నాగరికత అవశేషాలు సింధు ప్రాంతాన్నే గాక బీహారు, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ నందుకూడా లభించినవి.

గంగా మైదానంలో దొరికిన గొడ్డళ్ళు, కత్తులు, బాకులు మొదలగు తామ్ర సాధనములు సింధు నాగరికత అంత్యదశకు చెందినవి. అటులనే గంగా నగర్ జిల్లాలోని కాలీ బాగన్‌లో దొరికిన అవశేషాలు, ఇటుకలతో నిర్మించిన ఇండ్లు, బొమ్మల లిపితో రాసిన ముద్రలు లభించినాయి. ఇవి హరప్పా సంస్కృతికి చెందినవే.

## 3.4 సింధు - నాగరికత :

భారతదేశంలో నాగరికత వేదకాలంతోనే ఆరంభమైనట్లు ఇటీవల కాలం వరకు భావించారు. కాని, 1922 వ సంవత్సరంలో సింధు మైదానంలో జరిపిన త్రవ్వకాల్లో రెండు పురాతన మహానగరాల శిధిలాలు బయల్పడ్డాయి. ఒకటి మొహంజోదారో (ఇప్పుడది సింధు రాష్ట్రాలలోని లార్ఖానా జిల్లాలో ఉంది) రెండు - హరప్పా, (పంజాబ్‌లో మాంట్‌గోమరీ జిల్లాలో ఉంది.)

భూమి అడుగున పూడిపోయిన ఈ పురాతన మొహంజోదారో - హరప్పా నాగరికతా సంస్కృతులు వెలుగులోకి రావడానికి మూలకారకాలు పురావస్తు పరిశోధకులైన కనింగ్ హాం, సర్ జాన్ మార్షల్, ఆర్.డి. బెనర్జీ.

ఈ త్రవ్వకాల ఫలితంగా క్రీ.పూ 3000 సంవత్సరంల క్రిందటనే ఒక గొప్ప విశిష్ట నాగరికత మనదేశంలో ఉండేదని తెలిసినది. దీనితో మన చరిత్ర సింధు ప్రజల నాగరికతతో ప్రారంభమైనదను నూతన వికాసం కల్గినది.

సింధు మైదాన ప్రాంతానికి మాత్రమే ఈ నాగరికత పరిమితమైనట్లు అప్పట్లో భావించేవారు. అందువల్ల దీన్ని సింధూనాగరికత హరప్పా నాగరికతగా వ్యవహరించారు. తదుపరి త్రవ్వకాలవల్ల గుజరాత్‌లోని లోథాల్, రంగాపూర్, రాజిదీ, రాజస్థాన్‌లోని కాలీ బంగన్,

హర్యానాలో బన్వాలీ మొదలగు ప్రదేశాలలో ఈ నాగరికత అవశేషాలు లభించినవి. ఈ నాగరికత ఈజిప్టు, బాబిలోనియా, అస్సీరియా నాగరికతలు విలసిల్లిన కాలంలోనే ఉండుట వలన మనదేశం కూడ ప్రాచీన నాగరికతా దేశాలలో ఒకటిగా పరిగణింపబడుతున్నది.

**3.4.1. పేరు :** ఈ నాగరికత సింధు లోయలో వర్ధిల్లిన నాగరికత అగుటచే "సింధు లోయ నాగరికత" అని సర్‌జాన్. మార్షల్ పేరిడెను. మొహంజొదారో (మృతుల పురం లేదా దిబ్బ అని అర్థం) హరప్పా పట్టణం అందు ముఖ్యంగా వెల్లివిరిచినదిగాన మొహంజొదారో, హరప్పా నాగరికత అని కూడా పిలిచిరి. ఇటీవల కాలంలో పంజాబ్‌లో రూపర్, గుజరాత్‌లో రంగాపూర్, లోథాల్, ఉత్తరప్రదేశ్‌లో హస్తినాపూర్ వద్ద జరిపిన త్రవ్వకంలందు సింధు నాగరికత అవశేషాలు కన్పడుటచే ఈ నాగరికత సింధు ప్రాంతంనకే పరిమితంగాక మిగిలిన ఉత్తరాపథ మంతయు వ్యాప్తి చెందినట్లు తెలియుచున్నది. అందువలననే కె.ఎన్. దీక్షిత్ "ఇది ప్రాచీన భారతీయ నాగరికత" (Proto Indian Civilization) అని పేర్కొనెను. ఈ నాగరికత లోహయుగంలోని తామ్ర శిలాయుగానికి చెందినది.

**3.4. 2. నగర నిర్మాణం :** మొహంజొదారో, హరప్పాలోని శిథిలాలను పరిశీలిస్తే నాటి నాగరికత పట్టణ నాగరికత అని తెలియుచున్నది. మొహంజొదారో కంటె హరప్పా పెద్ద నగరం. రూపర్, లోథాల్ నగరాలు చిన్నవి. మొహంజొదారో, హరప్పాలోని పట్టణ నిర్మాణంను బట్టి వారు నగర నిర్మాణాలందు ఆరితేరిన వారు అని తెల్సుకోవచ్చును. చక్కటి నగరాలు, భవనాలు నిర్మించుకొని సుఖజీవనం చేసిరి. గుజరాత్‌లోని లోథాల్ వారి రేవుపట్టణం. పట్టణాలు సువిశాలంగాను, అందంగాను నిర్మించబడినవి. నగరంలోని ప్రధాన వీధులు ఉత్తర దక్షిణంగాను, పురవీధులు తూర్పు, పడమరలుగాను ఏర్పాటుచేసుకొనిరి. నగరంలోని వీధులు దీర్ఘచతురస్రాకారపు భాగాలుగా విభజింపబడెను. వీధులు సువిశాలంగా బండ్లరాకపోకలకు అనుకూలంగా ఉండేవి. మొహంజొదారో, హరప్పా నగరాలలో రెండు ప్రధాన భాగాలుండేవి. పశ్చిమాన మెరక ప్రాంతాలలో దుర్గం, తూర్పున పల్లపు ప్రాంతాలలో పౌరనివాస భాగం ఉండేది. ఇక్కడి దుర్గాలు అష్టముఖ దుర్గాలు. కోటగోడను పచ్చిఇటుకలతో కట్టి పైన పండుగా కాలిన ఇటుకలు తాపడం చేసేవారు. దుర్గాల కోటగోడలు పునాదులు వద్ద 13.5 మీటర్లు వెడల్పుగా ఉండి పైకి వెళ్ళిన కొలది వెడల్పు తగ్గుతూ ఉండేది. ప్రభుత్వ భవనాలు సాధారణంగా కోటలోనే ఎత్తైన వేదికలపై నిర్మించేవారు. నగరంలో ప్రతి వీధిలోను ఒక బావి, వీధుల వెంబడి దీపపు స్థంబాలు , నగరంలోని మురుగు నీరు బైటకు వెళ్లుటకు భూగర్భాన ఇటుకలతో కట్టిన కాలువ (డ్రైనేజ్) ఏర్పాటు చేయబడింది.

**3.4. 3. భవనాలు :** ఈ నగరంలోని భవనాలను నివాస గృహాలు, పెద్ద భవనాలు, పౌర నిర్మాణాలు (Public Buildings) అని మూడు భాగాలుగా విభజింపవచ్చును. సాధారణంగా వీధులకు రెండు వైపులా నివాసగృహాలు, దుకాణాలు ఉండేవి. సింధునది వరదల భయంతో భవనాలను సాధ్యమైనంత వరకు మెరకపైననే నిర్మించేవారు. సంపన్నుల గృహాలు రెండు లేక మూడు అంతస్తులు గాను , సామాన్యులవి చిన్న ఇండ్లు లేదా రెండు గదులు కల్గి ఉండేవి. ఇళ్ళ నిర్మాణానికి కాల్చిన ఇటుకలను వాడేవారు. పెద్ద పెద్ద గృహాలతో మండువాలోగిళ్ళవలె మధ్యలో పెరడు ఉండి దాని చుట్టూ గదులుండేవి. పెద్ద భవనాలలో వంటకు, స్నానానికి, పడకకు, నౌకర్లు నివసించుటకు ప్రత్యేకించి గదులుండేవి. ప్రతి ఇంటికి మురుగు నీటి పారుదల సౌకర్యాలుండేవి. ఇండ్లకు కిటికీలు ఎక్కువగా ఉండేవికావు. అంతస్థులు గల ఇండ్లలో పై అంతస్తు నుండి నీటి పారుదలకు గొట్టాలు గలవు. ప్రతి ఇంటికి బావి ఉండేది, అయితే కూలీల ఇండ్లన్నింటికీ కలిపి ఒకే బావి ఉండేది. లోథాల్ లో 6 మీటర్లు పొడవు 12.7 మీటర్లు వెడల్పు ఉన్న గదుల వరుస బయటపడింది. బహుశ ఇవి దుకాణాలై ఉండవచ్చును.

**3.4. 4. పౌరనిర్మాణాలు :** సింధు ప్రజల నిర్మాణ కౌశలం వారి పౌర నిర్మాణాలలో ప్రతిఫలించును. సాధారణంగా ఇటువంటి భవనాలు కోటలోనే ఉండేవి. మొహంజోదారో నిర్మాణాలన్నింటిలోనూ చెప్పుకోదగినది గొప్ప స్నాన వాటిక. ఇది చాలా క్లిష్టమైన నిర్మాణం. దీని మధ్య భాగంలో 11.7 మీటర్‌ల పొడవు, 6.9 మీటర్‌ల వెడల్పు, 2.4 మీటర్‌ల లోతు ఉన్న కొలను ఉంది. దీనికి దక్షిణ దిశల్లో మెట్లను ఏర్పాటుచేశారు. ఒక బావి నుంచి ఈ కొలనులోనికి నీటిని పంపేందుకు, మరో మార్గం నుంచి నీరు బయటకు వెళ్ళేందుకు ఏర్పాట్లు చేయటం ఒక విశేషంగా చెప్పాలి. హరప్పాలో 50.7 మీటర్ల పొడవును, 40.5 మీటర్ల వెడల్పును కట్టిన ధాన్యాగార భవనం ఒక విశిష్ట నిర్మాణం. ఇదే నగరంలో రెండు వరుసలుగా కార్మిక నివాస గృహాలు నిర్మించడం జరిగింది. ఈ నగరాలలో బయల్పడిన పెద్ద భవనాలను ప్రభుత్వ కార్యాలయాలుగానో, సత్రాలుగానో, ప్రార్థనామందిరాలుగానో వాడివుండవచ్చును.

**3.4. 5. భూగర్భ మురుగు పారుదల పథకం :** సింధు నగరాల్లోని సౌకర్యాలన్నిటికంటె భూగర్భ మురుగు పారుదల పథకం ఏర్పాటు, అద్భుతమైన విషయంగా చెప్పాలి. నాటి సింధు నగరాలలో వీధులన్నీ వేసవిలో దుమ్ముతోను, వర్షాకాలంలో బురదతోను నిండి ఉండేవి. ప్రతి వీధిలోనూ భూమిలో ఇటుకలతో మురుగు నీటి పారుదలకు కాలువలను నిర్మించారు. ఇళ్లలోంచి మురుగునీరు మట్టి గొట్టాలద్వారా ఈ కాల్వల్లోకి ప్రవహించేది.

ఈ కాలవలన్నీ నగరానికి వెలుపల సింధునదితో కలిసేవి. ఇంతటి సమర్థవంతమైన మురుగు పారుదల నిర్మాణం ప్రపంచ చరిత్రలో మరే ప్రాచీన నాగరికులలోను లేదు. ఈ నిర్మాణం నాటి సింధు ప్రజల సాంకేతిక ప్రతిభకు నిదర్శనం.

**3.4. 6. ప్రజాజీవితం - సాంఘిక ఆర్థిక పరిస్థితులు :** సింధు ప్రజలు ఎక్కువ పట్టణవాసులైనప్పటికి గ్రామములలో కూడా నివసించెడివారు. నాటి ప్రజల ముఖ్యవృత్తి వ్యవసాయం. ఈ నాగరికత విస్తరించిన ప్రాంతమంతా ఆ రోజుల్లో సస్యశ్యామలం. పంటలు పుష్కలంగా పండేవి. గోధుమలు, బార్లీ ధాన్యం పండిస్తూ ఉండేవారు. ప్రత్తి (Cotton) కూడా పండించినట్లు తెలుస్తుంది.

**3.4.6. 1. ఆహారం :** సింధు ప్రజలు శాఖాహార, మాంసాహార ప్రియులు. పాలు, కూరగాయలు, ఖర్జూర పండ్లు, ఇతర ఫలాలు, గోధుమ, బార్లీ మొదలగునవి తమ ఆహారంగా తీసుకొనిడివారు. అటులనే గొర్రె, కోడి, పంది, ఎద్దు మొదలగు జంతువుల మాంసాలు, చేపలు, గ్రుడ్లు కూడా సింధు ప్రజలు ఆహారంగా తీసుకొనెడివారు.

**3.4.6. 2. మచ్చికచేయబడిన జంతువులు :** సింధు ప్రజలు వృషభం, మహిషం, గొర్రె, పంది, కుక్క, ఒంటె, ఆవు, కోడి, మొదలగు జంతువులను మచ్చిక చేసి పెంచెడివారు. గంగిరెద్దు వంటి వృషభం సింధుకాలపు ముద్రలపై తరచు కనబడుతుంది. వన్యప్రాణులకై ఎలుగుబంటి, ఖడ్గ మృగం, పులి మొదలగు జంతువులు వారికి తెలుసు. జంతువుల స్వరూపాలతో ఆటబొమ్మలను కూడా వీరు తయారుచేసారు.

**3.4.6. 3 దుస్తులు, ఆభరణాలు - అలంకార ప్రియత్వం :** సింధు ప్రజలు నూలు, ఉన్ని వస్త్రాలు ధరించే వారు. సామాన్యంగా అంతరీయం, ఉత్తరీయం ధరించేవారు. స్త్రీల, పురుషుల దుస్తుల్లో అట్టే తేడా లేదు. వీరికి కుట్టడం తెలుసు. శిరోజాల అలంకరణలో పురుషుల పద్ధతి వేరు, స్త్రీల పద్ధతి వేరు, స్త్రీలు జడలు, ముడులు వేసుకొనేవారు. పురుషులు గడ్డం, మీసం తరచు తీసివేయు ఆచారం కలదు. మగవారికి క్షౌర సామాగ్రి కలదు. సింధు ప్రజలు అలంకార ప్రియులు. స్త్రీ పురుష అనుభేదం లేకుండా వీరు ఆభరణాలను ధరించేవారు. కంఠాభరణాలు, మురుగులు, ఉంగరాలు, కడియాలు స్త్రీ, పురుషులిరువురు ఉపయోగించెడివారు. కాలి గిద్దులు, ముక్కుపుడకలు, అందెలు, వడ్డాణం, మెట్టెలు, చెవిపోగులు మొ.నవి స్త్రీలు మాత్రమే ధరించేవారు. ఈ ఆభరణాలన్నియు బంగారం, వెండి, రాగి, దంతము, మొ. వానితోను, విలువైన అమెజాన్, ఎగేటు, జిప్సర్ మొ. రాళ్ళతోను తయారుచేయబడెడివి.

స్త్రీలు సాధారణంగా జడలు అల్లుకొనేవారు. పైగా అద్దము, దువ్వెన, కాటుక, సుగంధ లేపనము, జడపిన్నులు, పెదవులకు రంగు వేసుకొనుట (Lipstick) అలంకార సామాగ్రి నంతయు వారు ఉపయోగించిరి. కనుకనే "అలంకార ప్రియత్వములో నాటి సింధు స్త్రీలు నేటి తమ సోదరీమణులకు ఏవిధంగాను తీసిపోరు" అని ఆర్. సి. మజుందార్ పండితుడు పేర్కొనెను"

("In culture of beauty they are not far behind their sisters of the present day")

- R.C. Majumder

**3.4.6. 4 గృహసామాగ్రి - వినోదాలు :** ఇళ్ళలో ఉపయోగించిన సామాగ్రిని రాయి, మట్టి, దంతం లేదా లోహంతో తయారుచేసిరి. ఇనుపలోహం వీరికి తెలియదు. కుర్చీలు బల్లలు, మంచాలు, దారుశయ్యలు వంటి సామాగ్రితో ఇళ్లను అలంకరించేవారు. మట్టి పాత్రలను రంగుల చిత్రాలతో అలంకరించే వారు. నృత్యం, వేట, పాచికలాట, చదరంగం, ఎద్దుల పోట్లాట, ఎద్దుల వినోదాలు, ఈలలు, గిలకలు, బండ్లు, జంతువుల బొమ్మలు, మనుషుల బొమ్మలు పిల్లల ఆటవస్తువులు.

**3.4.6. 5 వ్యాపారం - వృత్తులు :** సింధు ప్రజలు వ్యవసాయమేగాక వర్తక, వ్యాపారాలను చేసిరి. ఇటుకల తయారీ, వడ్రంగం, పూసలు, ఆభరణాలు, మట్టి పాత్రలు తయారీ, గొడ్డళ్ళు, బరిశెలు, బాకులు వంటి ఆయుధాలు తయారీ, నేత, పడవల నిర్మాణం ఆ కాలంనాటి ప్రధాన వృత్తులు. సింధు ప్రజల వ్యాపారంలో తూకాలను, కొలతలను కూడా ఉపయోగించిరి. డబ్బు వాడకం ఇంకా అమల్లోనికి రాలేదు.

వ్యాపారం వస్తుమార్పిడీ పైనే జరిగేది. సరుకులు రవాణా ఎద్దు బండి మీదే జరిగేది. ప్రజలకిది ప్రధాన సాధనం. అరేబియా, మెసపటోమియా, దేశాలతో సింధు ప్రజలకు వ్యాపారం, సాంస్కృతిక సంబంధాలు ఉన్నట్లు తెలియుచున్నది.

**3.4.6. 6 మత పరిస్థితులు :** సింధు ప్రజల మట్టి ముద్రికలు, శిలా విగ్రహాలు, లోహప్రతిమలు వారి మతవిశ్వాసాన్ని, సూచిస్తున్నాయి. వీరు ప్రధానంగా "మాతృదేవత" ను ఆరాధించేవారు. ఇదే, క్రమంగా శక్తి (స్త్రీమూర్తి) ఆరాధనగా రూపొందింది. అశ్వద్ధ వృక్షం కొమ్మల మధ్య నిల్చి ఉన్న శక్తికి మేకను బలి ఇస్తున్నట్లుగా ఒక ముద్రికపై చిత్రింపబడి ఉంది. కనుక నాడు జంతుబలి ఇచ్చే ఆచారం ఉన్నట్లు తెలియుచున్నది. ఒక ముద్రిక పై మూడు ముఖాలు కల్గిన పద్మాసనాసీనుడై శివుని చుట్టూ వన్యమృగాలు ఉన్నాయి. పశుపతిగా, మహాయోగిగా శివుని ఆరాధన నాడు ఉన్నట్లు మనకు తెలియుచున్నది.

సింధు ప్రజలు జంతువులను, చెట్లను, సర్పాలను కూడా ఆరాధించేవారని కొందరి నమ్మకం. ఏది ఏమైనా వీరు ప్రధానంగా మాతృదేవతారాధకులేనని చెప్పవచ్చును. అప్పట్లో దేవాలయాలంటూ ఏమిలేవు. మృతదేహాన్ని సాధారణంగా భూస్థాపితం చేసేవారు. ఇటులనే కొన్ని సమయాలలో శవాన్ని పేటికలో ఉంచి కానుకలు, వివిధ వస్తువులు అమర్చి నివాస గృహంలోనో, లేక గృహసమీపంలోనే పూడ్చడం జరిగేది.

**3.4.7 సింధు - లిపి (Script) :** ప్రాచీన మెసపటోమియా ప్రజలవలెనే సింధు ప్రజలకు కూడా లిపి తెలుసు. ముద్రికల పై గల ఈ లిపి ఇంతకాలంగా నిర్దిష్టంగా చదవలేకపోయారు. ఈ లిపి బొమ్మల లిపిగా కొందరు నిర్ధారించారు. ఇందులో గుర్తులు చాలా వరకు సాంకేతికాలు కలవు. కొన్ని మాత్రం మత్స్య, మానవ, పక్షి ఆకృతులలో ఉన్నాయి. బొమ్మలు ప్రథమంలో చిత్రరూపాలుగా ఉండి క్రమంగా శివి గుర్తులుగా స్థిరపడినాయి. ఈ ముద్రికల పై లిపి ఒక వరుస ఎడమనుంచి కుడికి, మరో వరుస కుడి నుండి ఎడమకు రాసి ఉంది. ఇంతవరకు 400 చిహ్నాలు గుర్తించడం జరిగింది. దీనికి సుమేరియా, ఈజిప్టు, క్రీటు, చైనా లిపులకు పోలికలున్నాయి. సింధులిపి నుంచి బ్రహ్మలిపి ఉద్భవించింది అని ప్రొఫెసర్ లాంగ్డన్ (Longdon) వంటి చరిత్రకారుల అభిప్రాయం. ఈ భాష సంస్కృతమని కొందరు పండితులు, ద్రావిడమని ఫాదర్ హీరాస్ (Father Hearas) వంటి కొందరు అభిప్రాయపడినారు.

**3.4. 8 సింధు నాగరికత నిర్మాతలెవరు ?**

ఈ నాగరికత నిర్మాతలు ఏజాతి అనునది నిర్ధారణ చేయటం కష్టమైన సమస్య. వేద నాగరికత కంటె ఇది కూడా ప్రాచీనమైనది. వేద సంస్కృతికి సింధు సంస్కృతికి మధ్య మౌలికమైన వ్యత్యాసాలున్నాయి. కనుక ఇది వేరేతరమని స్పష్టమయింది. సింధు తవ్వకాలలో బయల్పడిన మానవ అస్థిపంజరంను బట్టి వారు

(A) ప్రోటో ఆస్ట్రలాయిడ్

(B) మెడిటరేనియన్

(C) మంగోలిమడ్

(D) ఆల్పైన్ - అను నాలుగు జాతులకు చెందిన వారని తెలియుచున్నది.

**3.4. 9 సింధు నాగరికతా కాలం :** సింధు సంస్కృతి తామ్ర శిలాయుగానికి చెందింది. సింధు త్రవ్వకంలో ఏడు అంతస్తులలో నగరాలు బయల్పడినాయి. పొరలకు పొరలకు మధ్య 500 సం. కాలవ్యవధి ఉన్నట్లు నిర్ణయించినారు. సర్. జాన్. మార్షల్, సింధు నాగరికత క్రీ.పూ. 3250 - 2750 సం.ల మధ్య కాలానన్నదని చెప్పెను. సింధు నది వరదల వల్ల ఈ నగరాలు భూస్థాపితాలైనాయి. పై

పోర నాగరికత క్రీ.శ. 1వ శతాబ్దికి చెందింది. అందుచేత మొదటి పోర క్రీ.పూ. 3000 సంవత్సరాలనాటికి చెంది ఉంటుంది. ఈ కాల నిర్ణయం మధ్య ఆసియాలో ఉశిర్ మొదలైన చోట్ల దొరికిన సింధు ముద్రలవల్ల బలపడుతుంది.

అయితే వీలర్ పండితుడు (Wheeler) ఈ సంస్కృతి క్రీ.పూ 2500 నుండి క్రీ.పూ. 1500 మధ్యకాలంలో లేక సంబందించినదని అభిప్రాయపడెను. చరిత్రకారుల దృష్టిలో సింధు సంస్కృతి క్రీ.పూ 2800 సం. నుండి క్రీ.పూ. 2200 సం. వరకు ఉజ్వల దశ ననుభవించినట్లు, క్రీ.పూ 1500 తరువాత క్షీణించినదని భావించుచున్నారు.

**3.4. 10 క్షీణతకు గల కారణాలు :** హరప్పా సంస్కృతి నశించడానికి కూడా స్పష్టమైన కారణాలను చెప్పలేరు. సింధు ప్రజలలో సహజంగా ఉన్న సంప్రదాయ ప్రియత్వమే అభివృద్ధి నిరోధకమై ఈ నాగరికత క్షీణించిందని "స్టువర్ట్ పిగ్గట్" వంటి పురాతన వస్తువేత్తల విమర్శ. సింధునది వరదల వల్ల ఈ సంస్కృతి నిర్మూలనమై ఉండవచ్చని కొందరు చరిత్రకారులు భావిస్తున్నారు. ఆర్యగణాలు ఈ నాగరికతను నిర్మూలించి ఉండవచ్చని, మరికొందరు చరిత్రకారులు అభిప్రాయపడుచున్నారు. ఈ సంస్కృతి కేవలం సింధూ లోయకు మాత్రమే కానందువల్ల సింధూనది వరదలవల్ల ఈ సంస్కృతి నిర్మూలించబడినదని భావించుటకు వీలులేదు. ప్రకృతి వైపరీత్యాల వలన క్రీ.పూ. 1500 నాటికి ఈ సంస్కృతి నిర్మూలించబడినదని భావించుట సమంజసం. ఏకారణం వల్ల ఈ సంస్కృతి క్షీణించినప్పటికి ఈ సంస్కృతిలోని కొన్ని అంశాలుభారతీయ సంస్కృతిలో జీర్ణించుకొనిపోయాయి.

## 3. 5. సారాంశము

ఏది ఏమైనా హరప్పా సంస్కృతి విధ్వంసం భారతదేశ చరిత్రకు ఒక విషాదకర సంఘటన. హరప్పా నాగరికత తరువాత వైదిక వేద కాలం వారికి పట్టణ జీవితమంటే ఏమిటో సరిగా తెలియదు అందుచేతనే భారతదేశం తన సుందర నగరాల్ని గురించి మళ్ళీ ఘనంగ చెప్పుకోటానికి వేదకాలం తరువాత మరో వెయ్యేళ్ళు పట్టింది.

# అభ్యాసాలు

**I. వ్యాస రూప ప్రశ్నలు (Essay Type Questions)**

(1) సింధూ నాగరికత (హరప్పా సంస్కృతి) ముఖ్య లక్షణములను వర్ణింపుము ?

(2) హరప్పా సంస్కృతిని అనార్య ద్రావిడ సంస్కృతి అని ఊహించుటకు కారణములను తెల్పుము ?

**II. లఘు వ్యాసరూప ప్రశ్నలు (Short Notes)**

(1) హరప్పా సంస్కృతిలో నగర జీవితాన్ని వర్ణింపుము ?

(2) సింధు ప్రజల మత పరిస్థితులను తెల్పుము ?

**III. ఈక్రింది వానిలో సరైన సమాధానం గుర్తించుము ?**

(1) సింధు మైదానంలో త్రవ్వకాలు ఎప్పుడు జరిగెను ? ( )

(A) 1932 (B) 1922 (C) 1942
(D) 1924

(2) సింధు ప్రజల ముఖ్యదేవత ఎవరు? ( )

(A) శివుడు (B) ఇంద్రుడు (C) అమ్మతల్లి
(D) ఈ మూడు

(3) సింధు ప్రజలకు తెలియని లోహం : ( )

(A) రాగి (B) ఇనుము (C) ఇత్తడి

(D) బంగారం

(4) శిలాయుగాలు ఎన్ని ? ( )

(A) 3 (B) 4 (C) 2 (D) 5

(5) పాత శిలాయుగపు మానవుడు ఏ జాతికి చెందినవాడు.

(A) నీగ్రో జాతి (B) ఆస్ట్రిక్ (C) మంగోలాయిడ్

(D) నార్డిక్ జాతి

## ఉపయుక్త గ్రంథాలు


(1) The Ancient India - (R.C. Mazumder)

(2) Indian History and Culture Vol. 1 - (B.S.L. Hunumantha Rao)

(3) Mohonjodaro and Indus Valle Civilization - (Sri John. Marshall)

(4) The Indus Civilization - (Wheeler)

(5) The Indus Civilization - (E.J.H. Macay)


- పి. రవీంద్రరాజు

పాఠం - 4

# వేదకాలపు - నాగరికత

## 4.1 లక్ష్యం :

ఆర్యులు ఎవరు, వారి జన్మభూమి ఎక్కడ వేదకాలపు నాగరికత లేదా సంస్కృతిని తెల్సుకొనుటకు గల ఆధారాలు ఏమిటి, వేద కాలానికి చెందినవారు, వేద కాలం నాటి రాజకీయ, సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితులు ఎలా ఉన్నాయి. వేద కాల సంస్కృతి మన కందించిన నేటి సంస్కృతియొక్క గొప్పతనం మొదలగు అంశాలను తెల్సుకుందాం.

ప్రధానాంశాలు :

4.2 ఉపోద్ఘాతం

4.3 వైదిక వాజ్మయం

4.3.1 వేదములు

4.3.2 వేదంలోని భాగాలు

4.3.3 వేదాంగాలు

4.3.4 ఉపవేదాలు

4.3.5 ఇతిహాసాలు

4.4 ఋగ్వేదకాలపు నాగరిక

4.4.1 తొలి స్థావరాలు

4.4.2 రాజకీయ పరిస్థితులు

4.4.3 సాంఘిక పరిస్థితులు

4.4.4 ఆర్థిక పరిస్థితులు

4.4.5 మత పరిస్థితులు

4.5 మలివేద కాలపు ఆర్యనాగరికత

4.5.1 రాజకీయ పరిస్థితులు

4.5.2 సాంఘిక పరిస్థితులు

4.5.3 ఆర్థిక పరిస్థితులు

4.5.4 మత పరిస్థితులు

## 4. 2 ఉపోద్ఘాతం

హరప్పా నాగరికత విధ్వంసకమైన కొన్ని వందల సంవత్సరాల తర్వాత వాయవ్య సరిహద్దుగుండా ఆర్యులు భారత దేశానికి వలస వచ్చారు. ఈ విధంగా మన దేశంలో స్థిరపడ్డ ఆర్యులు సింధు ప్రజల సంస్కృతి కంటే విలక్షణమైన సంస్కృతిని రూపొందించారు.

ఆర్యుల జన్మస్థానం గురించి రకరకాల సిద్ధాంతాలు వ్యాప్తిలో ఉన్నాయి. భారతీయ భాషయైన సంస్కృతానికి యూరోపియను భాషలైన గ్రీకు, లాటిన్ భాషలకు చాలా పోలికలుండడం వల్ల ఆర్యులు యూరపు ఖండం నుండి మిగిలిన ప్రాంతాలకు వలస వెళ్లేరని సర్ విలియం జోన్స్ మాక్సుముల్లర్ వంటి పండితుల అభిప్రాయం. కానీ ఈ సిద్ధాంతంను చరిత్రకారులు ఆమోదించలేదు.

మరికొందరు పండితులు ఆర్యుల జన్మస్థానం మధ్యాసియా అని చెప్పిరి. ఆర్కిటిక్ ప్రాంతంనుండి వచ్చారని బాలగంగాధర తిలక్ గారి అభిప్రాయం.

ఆర్యులు భారతదేశానికి వలస రావటం కొన్ని శతాబ్దాల తరబడి జరిగిందేగాని, అకస్మాత్తుగా జరిగిందికాదు. ఈ విధంగా భారతదేశానికి వలస వచ్చిన ఆర్యుల్ని ఇండోఆర్యులని, వారు పెంచి పోషించిన సంస్కృతినే వైదిక సంస్కృతి అనడం జరిగింది.

వేదకాలపు చరిత్రకు ముఖ్యాధారాలు వైదిక వాఙ్మయం. ఈ వాఙ్మయంం క్రీ.పూ 1500 - 500 సం.ల మధ్య తయారైనదని చరిత్ర కారుల అభిప్రాయం. వేదం అనగా జ్ఞానమని (Knowledge) అర్థం. వేదం అను పదం సంస్కృత భాషలోని వేద్ అను పదంనుండి ఉద్భవించినది. వేద్ అనగా తెల్సుకొనుట అని అర్థం. వేదాలు అపౌరుషయాలని, భగవంతునిచే ప్రేరేపితులై, ఋషులు, వానిని సంతరించిరని అందురు.

**4.3 వైదిక వాఙ్మయం :** ఇందు నాల్గు వేదాలు గలవు.

(1) ఋగ్వేదం (2) యజుర్వేదం (3) సామవేదం (4) అధర్వణ వేదం. అటులనే ప్రతి వేదంలోను 4 భాగాలున్నాయి. అవి (1) సంహిత (2) బ్రాహ్మణం (3) ఆరణ్యకం (4) ఉపనిషత్తు.

**4.3. 1 వేదములు :**

**(1) ఋగ్వేదం :** వేదంలలో అతి ప్రాచీనమైనది ఋగ్వేదం. ఇందు 1017 ఋక్కులు కలవు (ఋక్కులు అనగా ప్రార్థనా శ్లోకాలు). ఇవి 10 మండలాలుగా విభజింపబడినవి. ఇందలి ఋక్కులు దేవతా ప్రీతి కొరకు వేదకాల ప్రజలు వల్లె వేసెడివారు. తొలి వేదకాలపు రాజకీయ, సాంఘిక, ఆర్థిక మత పరిస్థితులను తెలిసికొనుటకు ముఖ్యాధారం ఋగ్వేదము.

**(2) యజుర్వేదం :** ఇది పద్య, గద్య సంకలనం ఇది క్రతువులను నెరవేర్చు విధానాన్ని గూర్చి వివరించును.

**(3) సామవేదం :** సామవేదం నందు 1549 ఋక్కులు గలవు. ఈ ఋక్కులు శ్రావ్యమైన సర్వసంకలనం కల్గియున్నవి. వీనిని యజ్ఞ క్రతువులందు పాడెదరు.

**(4) అధర్వణ వేదం :** ఇందు 731 ఋక్కులు కలవు. ఇది 20 భాగాలుగా విభజింపబడినది. ఇందు భూత, పిశాచాలను పారద్రోలు మంత్రతంత్రాలు గలవు.

**4.3. 2 వేదంలోని భాగాలు :**

**(1) సంహితలు :** ప్రార్థనా ఋక్కులు, యజ్ఞయాగాదిక్రతువులు సూత్రాలకు సంబంధించిన ఋక్కుల సంపుటినే సంహితలందురు. ఋగ్వేద సంహితలో 1017 ఋక్కులు కలవు. ఇవి 10 మండలంలుగా విభజింపబడి ఉన్నవి. యజ్ఞయాగాదిక్రతువులకు సంబంధించిన వివరాలు పురోహితులలో సాంప్రదాయకంగా ఏర్పడిన మతపరమైన భావాలు ఈ ఋగ్వేద సంహితలో ఋక్కుల రూపంలో పొందుపరచబడి యున్నవి. ఋగ్వేదంలో ఋక్కులు దేవతా ప్రీతి కొరకు ఆర్యులు వల్లెవేసెడివారు. యజుర్వేదంనందు క్రతువులను చేయు విధానం, సామవేదంనందు యజ్ఞ క్రతువులందు పాడు ప్రార్థనా శ్లోకాలు, అధర్వణ వేదంలో భూత పిశాచాలను పారద్రోలు మంత్రతంత్రాలు కలవు.

**బ్రాహ్మణాలు :** బ్రాహ్మణాలలో యజ్ఞయాగాది క్రతువులకు సంబంధించిన అనేక విషయాలు, కర్మ మార్గాన మోక్షమార్గాన్ని పొందు విధానం ఇందు కార్యరూపంలో పొందుపరచబడి ఉన్నది.

**(3) ఆరణ్యకాలు :** సంసార బంధాలు త్యజించి, సన్యసించి అడవులలో నివసించే మునుల కొఱకు ఉద్దేశింపబడిన దివ్యజ్ఞానాన్ని ఆరణ్యకాలని అంటారు. సంహితంలో ఉన్న నిగూఢమైన భావాలను ఈ ఆరణ్యకాలు తెలియచేస్తాయి. ఇందలి అంశాలే తదుపరి ఉపనిషత్తులుగా పరిణమించెను. ఈ ఆరణ్యకాలు బ్రాహ్మణాలలోని కర్మమార్గానికి, ఉపనిషత్తులోని జ్ఞాన మార్గానికి నాంది. ఆరణ్యకాలలో ఐతరేయ, తైత్తరీయ ఆరణ్యకాలు ముఖ్యమైనవి.

**(4) ఉపనిషత్తులు :** ఆత్మ, పరమాత్మ, కర్మ, పునర్జన్మ మొదలగు విషయాలపై తాత్వికాలోచన ఉపనిషత్తులలో తెలియజేయబడింది. ఉపనిషత్తులలోని తాత్విక ఆలోచన తరువాత కాలంలో హిందూ మతతత్వానికి పునాది అయింది.

**4.3. 3. వేదాంగాలు :** సూత్ర వాఙ్మయానికి వేదాలకు ఆ తర్వాత సన్నిహిత సంబంధం గలదు. దీనినే వేదాంగము అందురు. ఈ వేదాంగాలు ఆరు. అవి శిక్ష, ఛందస్సు, వ్యాకరణం, నిరుక్త, జ్యోతిష్య, కల్పసూత్రాలు గా చెప్పబడుచున్నాయి.

**4.3. 4 ఉపవేదాలు :** మంత్ర ప్రసక్తి లేని శాస్త్రీయ గ్రంథాలను ఉపవేదాలు అందురు. ఇందు ముఖ్యమైనవి ధనుర్వేదం, ఆయుర్వేదం, గాంధర్వవేదం, శిల్పవేదాలుగా చెప్పబడుచున్నాయి.

**4.3. 5 ఇతిహాసాలు :** భారత, రామాయణాలు ఇతిహాస గ్రంథాలు మహాభారతం ఉత్తరదిశ సార్వభౌమత్వానికి ఆర్యగణాల మధ్య జరిగిన పోరాటాన్ని వివరించును. రామాయణం ఆర్య సంస్కృతి దక్షిణా పథానికి వ్యాపించిన వేదాన్ని వివరించును. ఈ ఇతిహాసాలు ప్రాచీనాలైనను ఒకే యుగంలో తయారైనవి కావు. కాలగమనంలో అనేక అంశాలు ఇందు చేరి గొప్ప గ్రంథాలైనవి. కనుక దీనివలన ఎక్కువ చారిత్రాత్మక విషయంలు గ్రహించుట కష్టం.

**4.4 ఋగ్వేద కాలపు నాగరికత : (క్రీ.పూ 1500 - 900) :** ప్రాచీన వేదకాల నాగరికత తెలిసికొనుటకు ముఖ్యాధారం ఋగ్వేదం. ఇది ప్రపంచాన అతి ప్రాచీనమైన గ్రంథం. ఇది క్రీ.పూ. 1500 సం. న సంతరించబడినదని మాక్సుముల్లర్ (Max Muller) అభిప్రాయం. ఇది క్రీ.పూ. 2000 లేక 2500 సంచరించబడినదని వింటర్ నిడ్జ (Winter nitz) పండితుని అభిప్రాయం.

**4.4. 1 స్థావరాలు :** ఆర్యులు ఆఫ్ఘనిస్థాన్ ద్వారా భారతదేశపు వాయవ్య ప్రాంతాలలోనికి చొచ్చుకొని వచ్చారు. సింధు, జీలం, చీనాబ్, రావి, సట్లజ్, బియాస్, సరస్వతి నదుల పరీవాహక ప్రాంతంను సప్తసింధు ప్రాంతమనిరి. ఋగ్వేదకాలం నాటికి ఆర్యులు ఈ ప్రాంతమున స్థిరపడిరి.

**4.4. 2 రాజకీయ పరిస్థితులు :** వీరు ఒకే జాతికి చెందినవారే అయినప్పటికి వీరిలో అనేక తెగలవారున్నారు. ఋగ్వేద కాలంలో రాజకీయ, సాంఘిక జీవనానికి పునాది కుటుంబం. ఈ కుటుంబానికి తండ్రి పెద్ద. కొన్ని కుటుంబాలు కలిసి ఒక గ్రామంలో నివసించేవి. కొన్ని గ్రామాలు కలసి విస్ (VIS) గా ఏర్పడేవి. ఆర్యుల జాతిలో లేదా రాజ్యంలో ఇలాంటి 'విస్' లు అనేక ముండేవి. కొన్ని విస్‌లు తిరిగి జనపదాలుగా ఏర్పడెను. ఇట్టి జనపద రాజ్యమే లేక తెగల రాజ్యమే ఋగ్వేదరాజ్యం.

ఉదా : భారత, పురు, యదు, తుర్వస, ద్రుహ మున్నగునవి, ఒక్కొక్క తెగ ఒక్కొక్క ప్రాంతాన్నీ ఆక్రమించి రాజ్యాలను స్థాపించెను. రాజ్యానికి రాజు అధిపతిగా వ్యవహరించేవాడు. రాజరికం వంశపారంపర్యంగా క్రమంగా పరిణమించినది. గణతంత్ర రాజ్యం అధిపతులను ప్రజలే ఎన్నుకునేవారు, అట్టి ఎన్నుకొనబడిన రాజును గణపతి అందురు. ఆర్యులు రాజ్యాధిపత్యం కొరకు తమలో తాము పోట్లాడుకునేవారు. అట్టి యుద్ధాలలో ఒకటి దశరాజు యుద్ధం (Battle of Ten Kings).

ఇందు యదు, తుర్వసు, పురు, మొ. పది గణతంత్ర రాజులు భరత తెగకు చెందిన సుదాసునునితో పోరాడి చిత్తుగా ఓడిపోయినట్లు తెలియుచున్నది.

రాజు శత్రువుల్నుంచి రాజ్య రక్షణ ప్రజలకు రక్షణ వంటి మౌలిక విధులను నిర్వర్తించేవాడు. ఇందుకు ప్రతిఫలంగా ప్రజలు రాజుకు బలి అనే పన్ను లేదా కానుకలను సమర్పించుకొనే వారు. పురోహితుని సహాయంతో రాజు తన క్రతువులను నెరవేర్చెడివాడు. సమాజంలో పురోహితునికి మంచి గౌరవస్థానం కలదు. పరిపాలనా వ్యవహారంలలో రాజుకు సహాయపడటానికి పురోహితుడు, సేనాని,

గ్రామణి కలరు. పరిపాలనా వ్యవహారాలలో పురోహితుడు రాజుకు తగిన సలహాలు ఇస్తూ ఉండేవాడు, సేనాని సైనిక విషయంలందు, గ్రామణి గ్రామానికి పెద్ద.

రాజు సర్వాధికారి అయినప్పటికి నిరంకుశుడు మాత్రంకాదు. పాలనా వ్యవహారాల్లో 'సమితి, సభ' అనే ప్రజాసంస్థలు రాజుకు సహాయపడేవి. వీటి నిర్ణయాలను రాజు అమలు పర్చాలి. సమితి సామన్య జనులతోను 'సభ' ప్రముఖులచే అనగా పెద్దలతోను కూడినది. రాజ్యాలమధ్య తరచుగా యుద్ధాలు జరుగుతూ ఉండేవి. అందువలన రాజులు సైన్యాలను పోషించేవారు. రథ, అశ్వ, పదాతి దళాలు సైన్యంలోని విభాగాలు, కత్తులు, గండ్ర గొడ్డళ్ళు, ఈటెలు, విల్లమ్ములు, అప్పటి ఆయుధాలు. సైనిక రక్షణాయుధాలైన డాలు, కవచం, శిరస్త్రాణం, ధరించేవారు.

ఋగ్వేద కాలంలో శిక్షలు కఠినంగా ఉండేవి. అప్పుతిరిగి చెల్లించలేకపోతే అప్పు ఇచ్చిన వానికి దాస్యం చేయాలి. అట్లే హంతకునికి వంద ఆవులను జరిమానాగా విధించేవారు. దేశ బహిష్కరణ, అంగవిచ్ఛేదం, వంటి శిక్షలు కూడా అమలులో వుండేవి.

**4.4. 3 సాంఘిక పరిస్థితులు :** ఉమ్మడి కుటుంబాల సముదాయమే వేద కాలసమాజం. కుటుంబానికి తండ్రి పెద్ద. తండ్రిని 'గృహపతి' 'దంపతి' అని పిల్చేవారు. తండ్రికి కుటుంబ సభ్యుల మీద సర్వాధికారాలు ఉండేవి. అవిధేయులైన కుటుంబ సభ్యుల పట్ల తండ్రి కఠినంగా వ్యవహరించేవాడు. అందువలన కుటుంబంలో క్రమశిక్షణ హెచ్చుగా ఉండేది. కుటుంబ పెద్ద అతని భార్యకలసి కుటుంబ సభ్యుల క్షేమం కోసం యజ్ఞయాగాది క్రతువులు చేసేవారు. ప్రతి గృహంలోను ఒక హోమగుండం ఉండేది. సమాజంలో స్త్రీకి గౌరవ ప్రదమైన స్థానముండేది. సమితి, సభ సమావేశాల్లో మహిళలు కూడా పాల్గొనేవారు. బహు భార్యత్వం సంపన్న కుటుంబాల్లో ఉండేది. వితంతు వివాహాలు నిషేధించబడలేదు. భర్త నెన్నుకొనుటలో ఆడపిల్లలకు పూర్తి స్వాతంత్ర్యం కలదు. స్త్రీలయందు నైతిక ప్రమాణం హెచ్చు. వారు పతివ్రతలు. స్త్రీలయందు గొప్ప విద్యావేత్తలు కలరు.

సమాజంలో వర్ణ వ్యవస్థ ఇంకా స్థిరపడలేదు. పురుష సూక్తంలో సృష్టికర్త నుదుటనుండి బ్రహ్మణులు, భుజస్కంధాలనుండి క్షత్రియులు, తొడలనుండి వైశ్యులు, పాదాలనుండి శూద్రులు ఉద్భవించినారని చెప్పబడింది. ఈ పురుషసూక్తం అసలు ఋగ్వేదమందు లేదని కొంత కాలం తదుపరి ఇందు చేర్చబడినవని చరిత్రకారుల అభిప్రాయం. అందుచే ఈ కాలంలో వర్ణలేక కులవ్యవస్థ లేదు. కేవలం వృత్తులు అనగా పురోహితులు - బ్రాహ్మణులు, క్షత్రియులు - యుద్ధం చేయుట, వైశ్యులు - వ్యవసాయం, వ్యాపారం, శూద్రుడు - బానిసగా ఉందురు.

బియ్యం, గోధుమలు, యవలు, కాయగూరలు, పాలు, నెయ్యి, మాంసం, చేపలు వారి ముఖ్య ఆహారం. సోమ, సుర అను మత్తు పానీయాలను సేవించేవారు. నూలు, ఉన్నితో తయారుచేయబడిన వస్త్రాలను ధరించేవారు. తలపాగాలుండేవి. క్షీరం వారికి తెలుసు. పురుషులు జుత్తును గెడ్డం, మీసాలను పొడవుగా పెంచెడివారు. స్త్రీ, పురుషులిరువురు లోహాలతో తయారుచేయబడిన ఆభరణాలను ధరించేవారు. తీరిక సమయాలలో నృత్యం, సంగీతం, జూదం, వేట, రథాల పోటీలు మొదలగు వినోదాలతో కాలం గడిపేవారు.

**4.4. 4 ఆర్థిక పరిస్థితులు :** ఆర్యులు గ్రామీణ జీవితాన్ని గడిపిరి. వీరిది గ్రామీణ సంస్కృతి. వ్యవసాయం, పశుపాలన వారి ప్రధాన వృత్తులు. వారు పండించే ధాన్యాలలో గోధుమ ముఖ్యమైనది. యవలు, ప్రత్తి, ధాన్యం వారు పండించు ఇతర పంటలు. బావులు వారికి ముఖ్య సేద్యపు నీటి వనరులు.

గోవును ధనంగా నెంచెడివారు. ఎద్దు, ఆవు, గుర్రం, గొర్రె, కుక్క, గాడిద మొదలగు జంతువులను మచ్చిక చేసెడివారు.

వ్యవసాయంతో పాటు ఇతరవృత్తులైన కంసాలులు, కమ్మరులు, వడ్రంగులు, సాలీలు, పడవలను తయారుచేయువారు కలరు. చర్మాన్ని చదును చేయువారు కూడా కలరు.

వస్తుమార్పిడి విధానం అమలులోఉండేది. గోత్ర లేక 'నిష్కమణా' అను వెండి, బంగారు నాణెంలు ద్రవ్యంగా ఉపయోగించెడివారు.

**4.4. 5 మత పరిస్థితులు :** ఋగ్వేద కాలంలో ఆర్యులు ప్రకృతి శక్తులను ఆపాదించి ఆరాధించారు. ప్రకృతి శక్తులను వివిధ పేర్లతో ఎలుస్తు దేవతలుగా పూజించేవారు. వారి ముఖ్య దేవతలు ఇంద్రుడు, అగ్ని, వాయువు, వరుణుడు, సూర్యుడు, చంద్రుడు, మొదలగువారు. వీరందరు పురుష దేవతలే, అదితి, పృథ్వి అను స్త్రీ దేవతలు కూడా కలరు. వీరందరిలో ఎక్కువ ప్రాధాన్యంగల దేవుడు ఇంద్రుడు. ఇతడు తన వజ్రాయుధంతో శత్రువులను నిర్మూలించి, వీరికి సిరిసంపదలు చేకూర్చే యుద్ధదేవ (War God) అని వారి నమ్మకం.

ఋగ్వేద కాలంలో పూజా విధానం చాలా సామాన్యంగా నిరాడంబరంగా ఉండేది. యజ్ఞయాగాదులను నిర్వహించడం, ఋక్కులనుగానం చేయడం, దేవతలను తృప్తి పరచుటకు ఆహార పానీయాలు పవిత్రాగ్నికి సమర్పించడం మొదలగు అలవాట్లు ఉండేవి. యజ్ఞయాగాదుల సమయంలో జంతువుల బలి కూడా ఆచారంగా ఉండేది. మరణించిన వారిని దహనం చేయుట, పూడ్చి పెట్టుట ఆ కాలమందు ఆచరణలో ఉండెను.

## 4.5 మలివేదకాలపు నాగరికత (క్రీ.పూ. 900 - 500)

ఋగ్వేదంనుండి మనకు లభించే రాజకీయ సాంఘిక, ఆర్థిక, మత విశేషాలు పరిమితమైనవి. ఆ కాలంలో ఆర్యుల కార్యకలాపాలు సప్తసింధు ప్రాంతానికి మాత్రమే పరిమితమైనవి. కాని మలివేదాలు బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, రామాయణ, మహాభారత ఇతిహాసాలలో జీవించిన వారి జీవితం భిన్నమైంది. ఈ మలివేద కాలంలోని వారి రాజకీయ, సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితులలో గొప్ప మార్పులు జరిగెను.

**4.5. 1 రాజకీయ పరిస్థితులు :** సప్త సింధు ప్రాంతంనుండి క్రమంగా ఋగ్వేద కాలంనాటి ప్రజలు మలివేద కాలంనాటికి ఉత్తరాపథాన తూర్పు, దక్షిణ దిశలకు విస్తరించిరి. వారిమధ్య జరుగు పరస్పర యుద్ధాల వలన కొన్ని జాతులు లేక తెగలు నశించి, మరికొన్ని బలపడినవి. తత్ఫలితంగా గణరాజ్యాలు నశించి, సువిశాల సామ్రాజ్యాలు ఏర్పడెను. సువిశాల సామ్రాజ్యాలతోపాటు రాజు అధికారాలు కూడా పెరిగెను. రాజు దైవాంశ సంభూతుడనే సిద్ధాంతం అమలులోకి వచ్చింది. దిగ్విజయ యాత్రలు జరపడం, పట్టాభిషేక మహోత్సవాలు ఆడంబరంగా చేసుకొనడం అశ్వమేధ, రాజసూయాది క్రతువులు చేయడం, ఏకరాట్, సమ్రాట్ అనే బిరుదులు ధరించడం, పరిపాటి అయింది.

రాజరికం సాధారణంగా వంశపరంపరాగతమై ఉండేది. రాజ్యరక్షణ, ప్రజారక్షణ రాజు ముఖ్యమైన విధులు. వాటికోసం రాజులు సమర్ధ వంతమైన సైన్యంను పోషించేవారు. రాజు ధర్మబద్ధుడుగా ఉండాలి అని నాటి శతపథ బ్రాహ్మణం చెప్పుచున్నది.

రాజ్యాన ముఖ్య పాలనాధికారి రాజైనను సువిశాల రాజ్యమైనందున పరిపాలనా యంత్రాంగం క్లిష్టతరమగుట వలన రాజునకు పరిపాలనా వ్యవస్థలో సహాయపడుటకు ఉద్యోగుల సంఖ్య ఋగ్వేదకాలం నాటి కంటె పెరిగెను. సేనాని, పురోహిత, సుమంత (Charioteer) సంగ్రహిత (Treasuren), భాగదుఘ (Taxcolletor) సచివ (Minister) అధ్యక్ష (superintendent) సంధి విగ్రహిక (Foreign affairs) వంటి ఉద్యోగుల పేర్లు నాటి వాఙ్మయంలో కనిపిస్తున్నాయి.

రాష్ట్రాధిపతిని స్థపతి లేక శతపతి అని పిలిచేవారు. గ్రామాణి, గ్రామీణ అధికారిగా ఉండేవాడు. రాజు సర్వాధికారియైనను, అతని అధికారంపై ఆంక్షలు లేకపోలేదు. సభ, సమితి అనురెండు ప్రజా సభలు కొంత అధికారాన్ని కల్గి ఉన్నవి.

రాజ్యంలో రాజే ఉన్నత న్యాయమూర్తి (Chief Justice) రాజు తన న్యాయాధికారాన్ని కొన్ని సందర్భాలలో 'రాజన్యుడు' అనే ఉద్యోగి ద్వారా నిర్వహించేవాడు. రాజద్రోహం, హత్య, వ్యభిచారం, గర్భస్రావము, దొంగతనము, ఆనాటి పెద్దనేరాలు. రాజద్రోహానికి మరణశిక్ష, హత్యకు నూరు ఆవుల పరిహారం. దివ్యపరీక్షల ద్వారా (Trial by ordeal) తీర్పు చెప్పుట కూడా ఈ కాలమందు అమలులో కలదు. గ్రామాలలో 'గ్రామ్యవాది' యను ఉద్యోగి నేరాలను విచారించి తీర్పు చెప్పేవాడు. మొత్తం మీద శిక్షలు కఠినంగా ఉండేవి.

**4.5. 2 సాంఘిక పరిస్థితులు :** ఈ యుగంలో ఆర్యుల సాంఘిక విధానంలో గణనీయమైన మార్పులు జరిగాయి. దీనిలో ప్రధానమయింది వర్ణవ్యవస్థ రూపొందటము. వర్ణవ్యవస్థ ఎట్లు ఏర్పడెనను విషయంపై చరిత్రకారులలో భిన్న అభిప్రాయాలున్నను వృత్తులను బట్టే వర్ణాలేర్పాడ్డాయని చెప్పవచ్చును. అయితే సింధు ప్రజలలో కూడా వృత్తి విభజన ఉంది. ప్రాచీన నాగరికత దేశాలన్నింటిలో సమాజాలు వృత్తి విభజన సూత్రం మీదనే ఆధారపడ్డాయి. స్థానికంగా ఉన్నవృత్తివిభజన పద్ధతికి 'వర్ణం' (రంగు) అనే భావాన్ని చేర్చి వర్ణ వ్యవస్థను రూపొందించారు. ప్రథమంగా వర్ణాల ప్రసక్తి పురుష సూక్తంలో కనిపిస్తుంది. బ్రాహ్మణులు, క్షత్రియులు అగ్రవర్ణాలు, వేద విద్యాపారంగతులై యజ్ఞయాగాది దేవతారాధనలు చేయించుట, అధ్యయన బ్రాహ్మణ వృత్తులు, దేశరక్షణ, ప్రజాపాలన క్షత్రియ ధర్మాలు. వైశ్యులకు వ్యవసాయం, వర్తకం ప్రధాన వృత్తి, శూద్రులు పైన పేర్కొన్న వర్ణాల వారికి సేవకా వృత్తిని చేయుట. అగ్రవర్ణాలవారు ధర్మశాస్త్రం విధించిన బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసాది ఆశ్రమ విధులు నిర్వహించవలెను. వీరు గాక ఆర్యులచే పరాజితులైన ఆదిమజాతులు (నిషాదులు)పంచములై చర్మకార వృత్తినవలంభించి గ్రామాలకు వెలుపల నివసించేవారు. ఈ యుగాంతానికి వర్ణ వ్యత్యాసాలు బాగుగా బలపడి వర్ణ వైషమ్యాలు

చెలరేగుట ప్రారంభమయ్యెను. అగ్ర వర్ణాలలో బ్రాహ్మణాధిక్యాన్ని క్షత్రియులు నిరసించారు. సమాజంలో ప్రథమస్థానం కోసం వారు ఇరువురూ సంఘర్షణ పడ్డారు. వైదిక వాఙ్మయంలో బ్రాహ్మణులది ప్రథమ స్థానం కాగా, జైన, బౌద్ధ వాఙ్మయాలలో క్షత్రియులు ప్రథమ స్థానమాక్రమించడం గమనించదగింది. మాతంగచిత్త సంభూత, జాతక కథల వల్ల పంచముల పరిస్థితి అత్యంత హీనంగా ఉన్నట్లు తెలుస్తుంది.

సమాజంలో స్త్రీలకు పూర్వమున్న గౌరవ ప్రతిపత్తులు, స్వాతంత్ర్యం క్షీణించాయి. వారి విద్యలు చాలావరకు నాట్యసంగీతాలకు మాత్రమే పరిమితమయ్యాయి. వివాహ నిబంధనలు కఠినంగా చేయబడ్డాయి. క్షత్రియ స్త్రీలలో తప్ప, మిగిలిన స్త్రీల వివాహాలను తల్లి తండ్రులే నిర్ణయించేవారు. బాల్యవివాహాలు, వరకట్నాలు, సతీసహగమనం ఆచారంలోకి వచ్చాయి. బహుభార్యాత్వం పెరిగిపోయింది. పూర్వం వలే సభ సమితియందు వారికి సభ్యత్వం లేదు. స్త్రీలకు ఆస్థిహక్కు లేదు. అగ్రవర్ణములవారు తక్కువ వర్ణాల కన్యలను వివాహమాడవచ్చును. కాని తక్కువ వర్ణాలవారు అగ్రవర్ణాల కన్యలను వివాహమాడరాదు. భర్తకు విధేయురాలైన స్త్రీ ఆదర్శగృహిణిగా పరిగణింపబడినది. స్త్రీ జననం దుఃఖకరంగా భావించేవారు. ఆడపిల్లలను తల్లిదండ్రులు భారంగా చూసేవారు.

మలివేద కాలంలో మాంసాహారభక్షణ, సోమ, సుర పానీయాలను సేవించుట పాపకార్యాలుగా నెంచబడెను. అక్షరజ్ఞానం సాధారణంగా అగ్రవర్ణాలవారికి పరిమితంగా ఉండేది. విద్యాకేంద్రాలను గురుకులాలు అనేవారు. గణితం, వ్యాకరణం, ఛందస్సు, జ్యోతిషం, ఉపవేదాలు, ఉపనిషత్తులు, జ్ఞానసముపార్జనయందు చేర్చబడిన నూతన గ్రంథములు. నటన, వాద్య, సంగీతం, వినోదాలందు క్రొత్తగా చేర్చబడెను.

**4.5. 3 ఆర్థిక పరిస్థితులు :** ఆర్యుల రాజ్యాలు విస్తరించి కొత్త భూమి సాగులోకి వచ్చినందువల్ల ఈ యుగంలో విశేషంగా ఆర్థిక పురోభివృద్ధి జరిగింది. వ్యవసాయం పెంపొంది రాజ్యాలు ఐశ్వర్యవంతులైనాయి. పశుగణాభివృద్ధి జరిగింది. భూమిని దున్నడం కోసం నాగలికి ఆరు మొదలు ఇరవైనాలుగు వరకూ ఎద్దులను పూన్చేవారట. వాణిజ్యం కూడా విస్తరించింది, వాణిజ్యానికి, పరిశ్రమలకు కేంద్రాలకు తక్షశిల, హస్తినాపురం, కౌశాంబి, కాంపిల్య, శ్రావస్తి, వైశాలి, రాజగృహ, వారణాసి, చంప మొ. పట్టణాలు వెలసినాయి. ఈ నగరాలను కలుపుతూ రాచబాటలు నిర్మించినారు. శకటాలు, రథాలు పశువులు నాటి ప్రయాణసాధనాలు. వర్తకంలో క్రమంగా మారకం పద్ధతి వెనుకబడి, 'కర్షాపణ' 'శతమాన' అనే బంగారు, వెండి నాణాలు వాడుకలోకి వచ్చినాయి. బంగారు వెండినాణెములు నాటి ఐశ్వర్యానికి నిదర్శనాలు. పణిజులనే వర్తకులచే వ్యాపారం నిర్వహించబడుతుండేది.

**4.5. 4 మతపరిస్థితులు :** ఈ కాలములో మత సంబంధమైన విషయాలలోను, తాత్విక చింతనలోను చాలా మార్పులు సంభవించాయి. ఋగ్వేదకాలపు నిరాడంబర ప్రకృతి ఆరాధన ఈ యుగంలో పూర్తిగా మార్పుచెంది క్లిష్టంగా తయారైంది. అగ్ని, ఇంద్రుడు దైవాలకు ప్రాధాన్యత తగ్గింది. విష్ణు, రుద్రుడు వంటి దైవాలపట్ల భక్తి పెరిగింది. సృష్టికర్తగా 'ప్రజాపతి' ఈ యుగపు పూజావిధానంలో అత్యున్నతస్థానాన్ని ఆక్రమించాడు. పశుసంరక్షకుడులా 'పుషాన్' దేవుని ఆరాధనకు ప్రాధాన్యత తగ్గింది. పశుపోషణకు ప్రాముఖ్యత తగ్గడమే అందుకు కారణం.

యజ్ఞయాగాలకు కర్మకాండకు ప్రాధాన్యతపెరిగింది. ఈ యుగంలో మతానికి యజ్ఞమే ప్రధానమయింది. ఈ క్రతువులు అధికవ్యయప్రయాసలతో కూడుకొని ఉండుటచే సామాన్యప్రజలకు అందుబాటులో మోక్షంలేదు. యజ్ఞాలను బ్రాహ్మణులే నిర్వహించేవారు. గోవులు, బంగారం, అశ్వాలు, వస్త్రాలు, వంటివి 'దక్షిణ' గా చెల్లించేవారు. యజ్ఞయాగాదులకు పురోహితవర్గం ఆధిపత్యం కిందగల ఈ పూజావిధానానికి వ్యతిరేకంగా జ్ఞానులలో తాత్త్విక చింతన దారితీసింది. ఇహపర జీవిత రహస్యాలు, ఆత్మ, పరమాత్మ, పునర్జన్మ మొదలగు భావాలు గురించిన తాత్త్వికాలోచన ఉపనిషత్తులలో వ్యక్తమైంది. ఈ ఆధ్యాత్మిక చింతన నూతన సిద్ధాంతాల వ్యవస్థీకరణకు దారితీసింది. ఈ యుగంలో 'షడ్దర్శనాలు' ఆవిర్భవించాయి. అవి కపిలుని సంఖ్యా విధానం, పతంజలి యోగవిధానం, కణాదుని వైశేషిక విధానం గౌతముని - న్యాయవిధానం, జైమిని యొక్క పూర్వమీమాంస విధానం, బాదరాయణునిఉత్తర మీమాంసా విధానం. ఈ ఆరు తాత్త్విక ఆలోచన వ్యవస్థలు భగవద్గీతలో వ్యక్తమయ్యే తాత్త్విక ఆలోచన నాటి ప్రజల మేధాశక్తి ఎంత ఉన్నతమైన స్థితికి చేరుకున్నదో తెలియచేస్తున్నాయి. ఈ కాలంలోనే శ్రౌత, గృహ్యాం, ధర్మ సూత్రాలతో కూడిన వాఙ్మయం వృద్ధి చెందింది. ఈ కాలంలోనే విష్ణు, వాయు, పద్మ మొదలగు పురాణాలు రూపొందించబడ్డాయి.

## 4.6 సారాంశము

మలివేద కాలము ముగిసే సమయానికి మత సంస్కరణోద్యమాలకు రంగం సిద్ధమయ్యింది. సామాజిక, తాత్త్విక రంగాల్లోకి అసంతృప్తి జైన, బౌద్ధమతాల అవతరణకు దారితీసింది.

## అభ్యాసాలు

I ఈక్రింది వ్యాసరూప ప్రశ్నలు వ్రాయుము ?

(1) ఋగ్వేదకాలపు ఆర్యుల రాజకీయ, సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితులను వర్ణింపుము ?

(2) మలివేదకాలపు ఆర్యుల రాజకీయ, సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితులను తెల్పుము ?

II లఘు వ్యాసరూప ప్రశ్నలు

(1) వేదములు ఎన్ని వాటిని వివరింపుము ?

(2) వేదములోని ఇతర భాగాలను వివరింపుము ?

III ఈ క్రింది వానిలో సరియైన సమాధానములు గుర్తించుము ?

(1) వేదములు ఎన్ని ? ( )

(అ) 3 (ఆ) 4 (ఇ) 5 (ఈ) 2

(2) తొలి ఆర్యుల జీవిత వ్యవస్థను తెలుసుకొనుటకు గల ఆధారము ( )

(అ) ఋగ్వేదము (ఆ) యజుర్వేదము (ఇ) సామవేదము

(ఈ) అధర్వణవేదము

(3) ఆర్యులు ఆర్కిటిక్ ప్రాంత వాసులు అని చెప్పిన వ్యక్తి ఎవరు ? ( )

(అ) మాక్స్‌ముల్లర్ (ఆ) బాలగంగాధర తిలక్ (ఇ) ఫర్ గిటర్

(ఈ) స్వామి దయానంద సరస్వతి

(4) తొలి ఆర్యుల నాగరికత కాలము ( )

(అ) 900 - 500 B.C (ఆ) 1500 - 900 B.C (ఇ) 2500 - 1500 B.C

(ఈ) 1000 - 600B.C

(5) మలివేద కాలములో పన్నులువసూలు చేయు అధికారిని ఏమనిపిలుస్తారు ? ( )

(అ) బాగదూషు (ఆ) సంగ్రహిత (ఇ) అధ్యక్ష

(ఈ) సంధివిగ్రహిక

## ఉపయుక్త గ్రంథాలు


(1) Political History of Ancient India - (Ray Chaudhary)

(2) Indian History and Culture - (B.S.L. Hanumantha Rao)

(3) Age of Imperial Unit - (R.C. Mazumdar)

(4) Advance History India - (Dutta, Mazumdar, Ray Chaudhary)


రచయిత

సి. రవీంద్రరాజు

పాఠం - 5

# క్రీస్తు పూర్వం 6 వ శతాబ్దంనాటి ఉత్తర భారతదేశం

## 5.1 మగధ ఔన్నత్యం

### 5.1.1 లక్ష్యం

ఉత్తర భారతదేశమందు క్రీ.పూ. 6 వ శతాబ్దం నాటికి అనేక రాజ్యాలుండి రాజకీయ అనైక్యత ఉన్నప్పుడు, అట్టి రాజకీయ అనైక్యతను అంతమొందించి మగధ రాజ్యము ఏ విధంగా ఉన్నతస్థితికి చేరుకున్నదో తెలిసికొనుట.

ముఖ్యాంశ సంగ్రహం

5.1.2. ఉపోద్ఘాతం

5.1.3. ఆధారాలు

5.1.4. క్రీ.పూ. 6 వ శతాబ్దంలోనున్న 16 మహాజన పథాలు (రాజ్యములు)

5.1.5. మగధ రాజ్యం యొక్క వివరణ

5.1.6. మగధ రాజ్యం ఉన్నతస్థితికి చేరినవైనం

5.1.7. బృహద్రథ వంశం

5.1.8. హర్యయాంక వంశం

5.1.9. శిశునాగ వంశం

5.1.10. నందవంశం

5.1.11. సారాంశము

### 5.1.2. ఉపోద్ఘాతం

క్రీ.పూ 6వ శతాబ్దం నాటికి భారతదేశ చరిత్ర క్రమబద్ధమై స్పష్టమైన చరిత్రగా రూపొందినది. చరిత్ర ఆధారాలను బట్టి ఆ కాలంలో ఉత్తర భారతదేశంలో 16 మహాజన పథాలుండి రాజకీయ ఐక్యత లేకుండెను. ఈ పదహారు మహాజన పథాలను "షోడస మహాజనపథములు" అందురు. వీటిలో ఒకటైన మగధ రాజ్యము, మిగిలిన రాజ్యాలను జయించి, రాజకీయ ఐక్యతను సాధించి, ఉన్నత స్థితికి చేరుకున్నది.

**5.1.3. ఆధారాలు :** పురాణాలు, జైన, బౌద్ధ గ్రంథాలు, గ్రీకుల రచనలు, క్రీ.పూ. 6వ శతాబ్దము నాటి స్థితిగతులు తెలిసికొనుటకు తోడ్పడే ఆధారాలు.

### 5.1.4. క్రీ.పూ. 6వ శతాబ్దంలో ఉత్తర భారతదేశంలోనున్న 16 మహాజన పథాలు :

బౌద్ధ గ్రంథాలలో లభించిన సమాచారాన్ని బట్టి క్రీ.పూ. 6వ శతాబ్దపు ప్రారంభం నాటికి ఉత్తర భారతదేశంలోని 16 మహాజన పథాలలో కొన్ని రాజరికపు వ్యవస్థ కలిగిన రాజ్యాలు కాగా మిగిలినవి గణతంత్ర రాజ్యాలు (Republics) కొన్ని గణతంత్ర రాజ్యాలు కలిసి గణరాజ్య సమాఖ్యగా (Confederation) ఏర్పడినవి. అట్టి 16 మహాజన పథాలు వాటి రాజధానులు ఈ దిగువ పేర్కొనబడినవి.

| రాజ్యము | రాజధాని |
|---|---|
| 1. మగధ | గిరివ్రజ |
| 2. అంగ | చంపానగరం |
| 3. కాశీ | వారణాసి |
| 4. కోసల | శ్రావస్తి |
| 5. చేది | శుక్తిమతి |
| 6. వత్స | కౌశాంబి |
| 7. కురు | ఇంద్రప్రస్థపురం |
| 8. పాంచాల | అహిచ్ఛత్రం |
| 9. మత్స్య | విరాటనగరం. |
| 10. సూరసేన | మధుర |
| 11. అశ్మక | పూతన్ |
| 12. అవంతి | ఉజ్జయినీ |
| 13. గాంధార | తక్షశిల |
| 14. కాంభోజ | రాజపురం |
| 15. మల్లా గణరాజ్యం | కుశినరగం |
| 16. వజ్జిగణ రాజ్య సమాఖ్య | వైశాలి |
| a) లిచ్ఛవి | వైశాలి |
| b) జ్ఞాత్రిక | కుంద |
| c) వైదేహి | మిధిల |

పైన పేర్కొనబడిన 16 మహాజన పథాలలో మగధ, వత్స, కోసల రాజ్యాలు పెద్దవి మరియు శక్తివంతమైనవి కాక మిగిలినవి చిన్న రాజ్యాలు. మగధ అన్ని రాజ్యాల్ని ఆక్రమించి రాజకీయ ఐక్యతను సాధించింది.

**5.1.5. మగధరాజ్యం యొక్క వివరణ:** ప్రస్తుతం దక్షణ శివారులో నున్న గయా, పాట్నా జిల్లాలే ఒకప్పటి మగధ రాజ్యం. క్రీ.పూ. 6-4 శతాబ్దాల మధ్య నున్న 16 మహాజన పథాలలో మగధ శక్తివంతమైన పెద్ద రాజ్యం.

ప్రాచీన రాజకీయ, సాంస్కృతిక వ్యవహారాలకు మగధరాజ్యం కేంద్రంగా వుండేది.

**5.1.6. మగధ ఉన్నతస్థితికి చేరిన వైనం:** క్రీ.పూ. 6వ శతాబ్దంలో ఉత్తరభారతదేశంలో వున్న రాజకీయ అనైక్యతను అదునుగా తీసుకొని మగధ ఉన్నతస్థితికి చేరుటకు ఆ రాజ్యాన్ని పాలించిన రాజ వంశాలు సాధించిన విజయాలే కారణం.

**5.1.7. బృహద్రత వంశం:** ఇతిహాస సమాచారాన్ని బట్టి మగధ రాజ్యాన్ని స్థాపించినవాడు బృహద్రదుడు. గిరివ్రజము ఇతని రాజధాని. అతని మరణానంతరం ఇతిహాస ప్రసిద్ధుడైన జరాసంధుడు మగధను పాలించాడు. ఈ వంశంలో చివరి రాజు రిపుంజయుడు.

**5.1.8. పర్యాయాంక వంశం హర్యంక వంశం :** రిపుంజయుని మరణానంతరం మగధ రాజ్యం హర్యాయంక వంశ ఆధిపత్యంలోనికి వచ్చింది. హర్యాయాంక వంశస్థాపకుడు బింబిసారుడు.

**బింబిసారుడు క్రీ.పూ. 544-493 :** వివాహ సంబంధముల ద్వారా, రాజ్యాలు జయించుట ద్వారా బింబిసారుడు మగధరాజ్యాన్ని విస్తరింపజేసి దాని ఔన్నత్యానికి పునాదులు వేసాడు. కోసలరాజైన ప్రసేనజిత్తుని సహోదరి (కౌసలదేవి)ని వివాహమాడి కాశీరాజ్యాన్ని

కట్నంగా పొందాడు. వైదేహి, మద్రా లిచ్ఛవీల రాకుమార్తెలను వివాహమాడి మగధ ప్రతిష్టను పెంచాడు. అంగ రాజ్యాన్ని ... కలిపాడు. గిరివ్రజానికి ఉత్తరాన వున్న కొండల వద్ద రాజగృహం అనే క్రొత్త పట్టణాన్ని నిర్మించి, మగధ రాజధానిని అచ్చటకు మార్చాడు.

అతని సమకాలీనులైన మహావీరుడు, బుద్ధుడు, మగధను దర్శించి, వారిమతాలను ప్రచారం చేసారు. జైనులు బింబిసారుని జైన మతస్థుడని పేర్కొనగా బౌద్ధులు అతడ్ని బౌద్ధ మతస్థుడని చెప్పిరి. ఇతడు పట్టుదల గల పరిపాలనాదక్షుడు. వృద్ధాప్యంలో బింబిసారుడు అతని కుమారుడైన అజాతశత్రువుచే హత్యగావింపబడెను.

**II) అజాతశత్రువు : క్రీ.పూ. 493 - 462 :** భారతదేశ రాజ వంశాల చరిత్రలో తొలి పితృహంతకుడిగా గుర్తింపు పొందిన అజాతశత్రువు సింహాసనము అధిష్టించిన వెంటనే తన మేనమామ కోసల రాజు అయిన ప్రసేనజిత్తుతో యుద్ధము చేయవలసి వచ్చెను. బింబిసారుని హత్యతో తన సహోదరి విధవగుటచే ఆగ్రహించిన ప్రసేనజిత్తు, మగధపై దాడిచేసి, అజాతశత్రువుని ఓడించి కాశీరాజ్యాన్ని ఆక్రమించెను. తదుపరి అతడు అజాతశత్రువుతో సంధి చేసుకొని, అతనిని మగధకు రాజుగా గుర్తించి, కాశీరాజ్యాన్ని తిరిగి యిచ్చెను. పిదప అజాతశత్రువు తన విజయాలతో తూర్పు భారతదేశాన్నంతటిని తన పాలన క్రిందకు తెచ్చుకొనెను. అవంతి రాజైన ప్రద్యోత తరచుగా మగధపై దాడి చేయుచున్నందున, అతనిని ప్రతిఘటించేందుకు, గంగానదికి ఆవలివైపున ఉన్న శక్తివంతులైన లిచ్ఛవీలను జయించుటకు, బలమైన కోట అవసరమని తలంచెను. ఆ కారణముగా గంగా, సోనా నదుల మధ్య పాటలీ అను కోటను నిర్మించెను. అటుపిమ్మట లిచ్ఛవీలపై దాడి చేసి వారి గణరాజ్యాలైన వైశాలి, వైదేహిలను ఆక్రమించెను. ఇతనికి కూడా సమకాలీనులైన మహావీరుడు, బుద్ధుడు మగధరాజ్యాలలో వారి మతాలను ప్రచారము చేసిరి. ఇతడు బౌద్ధ మతాన్ని అంగీకరించెను. కాని జైనులు ఇతడు జైన మతస్థుడని పేర్కొనిరి. అజాతశత్రువుని పోషణలో మొదటి బౌద్ధ సంగీతి (సమావేశము) మహాకాశ్యపుని అధ్యక్షతన రాజగృహంలో జరిగెను. అజాతశత్రువు అతని కుమారుడైన ఉదయభద్రుని చేత హత్యగావించబడెను.

**III) ఉదయభద్రుడు లేక ఉదయనుడు :** తండ్రిని చంపి రాజ్యానికి వచ్చిన ఉదయభద్రునికి మరి ఒక పేరు ఉదయనుడు. ఇతడు పాటలీకోట యొక్క ప్రాముఖ్యతను గ్రహించి, ఆ కోటచుట్టు కుసుమపురము అను పట్టణమును నిర్మించెను. ఆ పట్టణమే తదుపరి పాటలీపుత్రమైనది. ఇతడు రాజధానిని రాజగృహము నుండి పాటలీపుత్రమునుకు మార్చెను. అవంతి రాజైన ప్రద్యోతకును, ఇతనికి మధ్యవైరము ఉన్నందున ప్రద్యోత ప్రోత్సాహముతో ప్రద్యోతకు సన్నిహితుడైన ఒక జైన మతస్థుడు ఉదయనుని హత్యచేసెను.

**IV) హర్యంక వంశపు చివరిరాజులు:** ఉదయనుని తరువాత అనిరుద్ధ, ముండ, నాగదసకుడు అనేవారు వరుసగా పాలించిరి. చివరివాడైన నాగదసకుడు మరణించిన తరువాత శిశునాగ వంశము మగధ పరిపాలనను చేపట్టెను.

హరియాంక వంశపు చివరి రాజైన నాగదసకునికి యితడు మంత్రిగా వ్యవహరించెను. నాగదసకుని మరణానంతరం గిరివ్రజాన్ని రాజధానిగా చేసుకొని శిశునాగుడు మగధను పాలించెను.శిశునాగ వంశస్థాపకుడు ఇతడు.

అవంతి రాజైన ప్రద్యోతనుని ఓడించి అవంతి రాజ్యాన్ని మగధలో కలిపెను. ఇతని మరణానంతరం ఇతని కుమారుడు కాలాశోకుడు సింహాసనానికి వచ్చెను.

**II) కాలాశోకుడు :** కాలాశోకుడు రాజధానిని గిరివ్రజం నుండి పాటలీపుత్రానికి మార్చినాడు. వైశాలిలో రెండవ బౌద్ధ సంగీతి (సమావేశమును) ఏర్పాటుచేసి ఆ వంశంలో సుప్రసిద్దుడు అయినాడు. క్రీ.పూ. 364 సం. నంద వంశస్థులు కాలాశోకుని హత్యచేసి మగధ సింహాసనాన్ని ఆక్రమించిరి.

### 5.1.10. నందవంశం : క్రీ.పూ. 364 - 324

**I) మహాపద్మనందుడు :** కాలాశోకుని హత్యచేసి మగధ సింహాసనాన్ని ఆక్రమించిన గొప్ప యోధుడైన మహాపద్మనందుడు నందవంశ స్థాపకుడు. నందులు సూద్రకులమునకు చెందినవారు. ఇతడు క్షత్రియ పాలకులను తుదముట్టించి, పాంచాల, కాశి, కురు, అశ్మక, కోసల, వై... [illegible] ...క్రమించెను. ఈ విజయాలకు చిహ్నంగా "క్షాత్రంతక" అను బిరుదు పొందెను. ఇతని విజయములతో మగధరాజ... [illegible] ...గాళఖాతం నుండి పడమర సట్లెజ్ నది వరకు వ్యాపించి పెద్ద సామ్రాజ్యమైనది. అందువలన ఇతడు, భారతదేశంలో

సువిశాల సామ్రాజ్యం స్థాపించిన మొదటి పాలకునిగా, ఉత్తర భారతదేశపు మొదటి చారిత్రక చక్రవర్తిగా కీర్తింపబడినాడు. ఇతని మరణానంతరం ఇతని 9 మంది కుమారులు వరుసగా రాజ్యం పాలించారు.

**II) నందవంశపు చివరిరాజులు :** మహాపద్మనందునికి 9 మంది కుమారులు. వీరిని నవనందులు అనేవారు. ఉగ్రసేన, రాష్ట్రపాల, గోవిషనాక్, దససిద్ధక్, పాండుక్, పాండుగట్టి, భూతపాల, కైవర్త, ధననంద. వీరు వరుసగా రాజ్యపాలన చేసిరి. నందులకు అపారమైన సంపద, సైనిక బలం ఉన్నట్లు గ్రీకు గ్రంధాల నుండి తెలుస్తున్నది. ఈ వంశపు చివరివాడైన ధననందుని కాలమందు భారతదేశంపై దండెత్తిన అలెగ్జాండరు మగధపై దాడికి ప్రయత్నించగా, ధననందుని సైనికబలం తెలిసికొనిన అలెగ్జాండరు సైన్యం మగధపై దాడికి తిరస్కరించినది. ధనాపేక్షాపరుడైన ధననందుడు ప్రజలను పీడించుచు దుష్టపాలన సాగించెను. ఆ కారణముగా ప్రజలు ఆతని పరిపాలనను తిరస్కరించిరి. ఈ పరిస్థితులలో చంద్రగుప్త మౌర్యుడు, కౌటిల్యుని సహాయముతో ధననందుని సంహరించి, మగధను ఆక్రమించి, మౌర్యసామ్రాజ్య స్థాపన చేసెను.

### 5.1.11. సారాంశము

బింబిసారుని పరిపాలన ప్రారంభము నుండి మహాపద్మనందుని వరకు మగధ రాజ్యము సుసంపన్నమై రాజ్యవిస్తరణ కూడా సాధించింది. ఇట్లు రాజకీయ ఐక్యతను సాధించి ఉత్తర భారతదేశంలో సామ్రాజ్యంగా వెలసిన మగధ తదుపరి కాలంలో భారతదేశంలో మహాసామ్రాజ్యమై దేశ రాజకీయాలకు కేంద్రమై, జైన, బౌద్ధ మతాల ప్రచారానికి, వ్యాప్తికి ఎంతో సహాయపడింది.

## 5.2. క్రీస్తు పూర్వం 6 వ శతాబ్దం నాటి ఉత్తర భారతదేశ పరిస్థితులు

### 5 2.1 లక్ష్యం

వేద, ఇతిహాసయుగాలు దాటి ప్రజలు నాగరికత, సంస్కృతి యందు ఎంత అభివృద్ధి సాధించిరో తెలుసుకొనుట.

ముఖ్యాంశ సంగ్రహం


5.2.2. ఉపోద్ఘాతం

5.2.3. ఆధారాలు

5.2.4. రాజకీయ పరిస్థితులు

5.2.5. పరిపాలన విధానం

5.2.6. సైన్యం

5.2.7. న్యాయపాలన

5.2.8. ప్రభుత్వ ఆదాయ వనరులు (రెవిన్యూ)

5.2.9. సాంఘిక పరిస్థితులు

5.2.10. ఆర్థిక పరిస్థితులు

5.2.11. మత పరిస్థితులు

5.2.12. సారాంశము

**5.2.2. ఉపోద్ఘాతం :** క్రీ.పూ. 6వ శతాబ్దం భారతదేశ చరిత్రలో అత్యంత ప్రధానమైనది. ఆ కాలంలో అనేక రాజ్యాలుగా విభజింపబడిన ఉత్తర భారతదేశమందు రాజకీయ ఏకత్వం కొరకు కృషి సాగింది. ఆనాటి సంఘం కులవ్యవస్థపై ఆధారపడింది. సంఘంలో శూద్రులు తక్కువ కులస్థులుగా పరిగణింపబడ్డారు. హిందూమతంపై తిరుగుబాటుగా జైన, బౌద్ధ మతాలు క్రొత్తగా అవతరించాయి. ఈ మతాల ప్రభావం కారణంగా హిందూమతానికి గట్టి దెబ్బ తగిలింది. పట్టణాలు, పరిశ్రమలు, వ్యాపారం మొదలైనవి అభివృద్ధి చెందాయి.

**5.2.3. ఆధారాలు :** పురాణాలు, జైన, బౌద్ధ గ్రంధాలు, గ్రీకు రచనలు, క్రీ.పూ. 6వ శతాబ్దము నాటి పరిస్థితులను తెలియజేస్తున్నాయి.

**5.2.4. రాజకీయ పరిస్థితులు:** ఉత్తరభారతదేశం 16 మహాజన పథాలుగా విభజింపబడెను. వీటిలో కొన్ని రాజ్యాలందు రాజరికపు వ్యవస్థ వుండగా మిగిలినవి గణతంత్ర రాజ్యాలు. సామ్రాజ్య అధికారం కొరకు ఈ రాజ్యాల మధ్య ఎప్పుడూ యుద్ధాలు జరుగుచుండేవి. క్షత్రియులే రాజ్యపాలనకు అర్హులైనప్పటికీ క్షత్రియులు కానివారు కూడా రాజ్యపాలన చేస్తుండేవారు. రాజరికపు వ్యవస్థనందు రాజరికం వంశపారంపర్యమైనప్పటికీ అప్పుడప్పుడు రాజకుటుంబీకులు గాని, రాజ్యం లోని ప్రజలు గాని, రాజకుటుంబానికి చెందని ఏ కులస్థుడినైనా రాజుగా ఎన్నుకొనే ఆచారం ఉన్నది. రాజరికపు వ్యవస్థ కలిగిన రాజ్యంలోని పాలకుని రాజు అనేవారు. వీరు సామ్రాజ్య అధికార చిహ్నాలైన ఏకరాట్, సామ్రాట్ అనే బిరుదులు ధరించారు. గణతంత్ర రాజ్యాల పాలకుని గణపతి, లేక రాజన్ అని పిలచేవారు.

**5.2.5. పరిపాలనా విధానం:** రాజరికపు వ్యవస్థ గల రాజ్యాలలోను, గణతంత్ర రాజ్యాలలోను పరిపాలనా విధానం ఒకదానికి ఒకటి భిన్నంగా వుండేవి.

**a) రాజరికపు వ్యవస్థలో పాలనా విధానం :** ఈ వ్యవస్థలో రాజుకు సర్వాధికారాలు ఉండేవి. వేద, శాస్త్రాల విజ్ఞానము రాజుకు తప్పనిసరిగా ఉండేది. నిరంకుశంగా పాలించు రాజును తొలగించి వేరొక రాజును ఎన్నుకొనే హక్కు ప్రజలకుంది. రాజుకు పరిపాలనలో సహాయపడుటకు, యువరాజు, పురోహితుడు, సేనాపతి, ఇతర మంత్రులతో కలసి ఒక సభ వుండేది. దీనినే "పరిషత్" అనేవారు. తదుపరి కాలంలో రాజ్యంలోని ప్రతి ఒక్కరు ఈ పరిషత్ క్రియలలో పాల్గొనుటవల్ల అది బహిరంగ పరిషత్ అయ్యింది. ఇట్టి బహిరంగ పరిషత్ బహిరంగ భవనమైన "శాంతగార" లో సమావేశమై పరిపాలనపై నిర్ణయాలు తీసుకొనేది. రాజ్యం రాష్ట్రాలుగా విభజింపబడెను. రాజు వీటికి రాజ వంశస్థులను గాని, సైనికాధికారులను గాని రాజ ప్రతినిధులుగా నియమించేవాడు. పరిపాలనలో గ్రామము చివరి భాగం. గ్రామాధికారిని "గ్రామిక" లేదా "గ్రామ భోజక" అని పిలిచేవారు.

**b) గణరాజ్యాలలో పాలనా విధానం :** రాజరికపు వ్యవస్థ లేని రాజ్యాన్ని గణతంత్ర రాజ్యం లేదా సంఘం అని పిలిచేవారు. అట్టి గణతంత్ర రాజ్యాలు కలసి ఒక రాజ్యంగా ఏర్పడిన దానిని గణరాజ్యాల సమాఖ్యగా పరిగణించేవారు. గణతంత్ర రాజ్యాలలో పరిపాలనాధికారం ఒకే వ్యక్తి లేదా కొందరు వ్యక్తుల చేతులలో వుండేది. ఈ గణతంత్ర రాజ్యాల పరిపాలనాధికారిని, గణపతి, లేదా గణరాజన్ లేదా సంఘముఖ్య అని పిలిచేవారు. కొన్ని గణరాజ్యాలలో ఈ అధికారిని రాజన్ అని పిలచు సాంప్రదాయం కూడా కలదు. పరిపాలనలో రాజన్‌కు సహాయపడుటకు ఉపరాజన్, సేనాపతి, బాండాగారిక అనే ఇతర ఉద్యోగులు ఉండేవారు. కొన్ని గణతంత్ర రాజ్యాలలో రక్షక భటుల వ్యవస్థ (Police) కలదు. రాజరికపు వ్యవస్థ ఉన్న రాజ్యాలలో మాదిరిగా గణతంత్ర రాజ్యాలలో ప్రజలచే ఎన్నుకొనబడిన పరిషత్ ఉండేది. ఇది బహిరంగ భవనమైన "శాంతాగార" యందు సమావేశమై పరిపాలనకు కావలసిన శాసనాలు చేసేది. ప్రతి శాసనానికి పరిషత్ యొక్క ఏకాభిప్రాయము కావలెను. ఏకాభిప్రాయము లేని విషయాలపై నిర్ణయాలు చేయుటకు, ఆ విషయాలను ఎన్నిక చేయబడిన సంఘానికి నివేదించేవారు. అంతేగాని అట్టి విషయాలపై ఓటు చేసే ఆచారం లేదు.

**5.2.6. సైన్యం :** శత్రురాజుల దాడులనుండి రాజ్యాన్ని ప్రజల్ని కాపాడుట రాజు యొక్క ముఖ్యవిధి. అందుకుగాను రాజులు కాల్బలము, అశ్వదళము, రధములు, గజబలంతో కూడిన సైన్యాన్ని పోషించిరి. సైన్యంలో గజబలానికి హెచ్చు ప్రాధాన్యత ఇవ్వబడెను. కొంత నౌకాదళం కూడా ఆనాటి రాజులకుండెడిది. సైనికులు పొడవైన విల్లంబులు, వేముతో చేయబడి ఇనుముతో కొనతేల్చబడిన బాణాలను, రెండు వైపుల పదనుగల కత్తులను, ఎద్దు చర్మముతో చేయబడిన డాలును ఉపయోగించిరి. సైన్యంలో "అక్షౌహిణి" మరియు "వాహిని" అను భాగములు ఉండేవి. యుద్ధసమయంలో రాజులు "వ్యూహ" రచనా విధానం కూడా అవలంబించారు.

**5.1.7. న్యాయపాలన :** న్యాయ పరిపాలనయందు రాజు సర్వాధికారి. న్యాయ వ్యవహారాలు చూసేందుకు న్యాయాధిపతి అయిన "వ్యవహారిక" యుండేవాడు. రాజ్యంలోని వివిధ ప్రాంతాలలో అనేక న్యాయస్థానాలుండేవి. న్యాయ విచారణ జరుగు సమయమందు స్థానిక, కుల, కుటుంబ చట్టాలను పరిశీలనలోనికి తీసుకొనేవారు. గణతంత్ర రాజ్యాలలో ప్రజాస్వామ్య పద్ధతిలో న్యాయవిచారణ జరిగేది. అపరాధి అని భావింపబడిన వ్యక్తి ఆరున్యాయస్థానాల ద్వారా తీర్పు పొందవలెను. ఈ ఆరు న్యాయస్థానాలలో ఏ ఒక్క న్యాయస్థానమైన అతడు నిర్దోషిగా భావించిన యెడల అతనిని విడుదల చేసేవారు.

**5.2.8. ప్రభుత్వ ఆదాయం వనరులు (రెవిన్యూ) :** పరిపాలనకు అవసరమైన ధనాన్ని వివిధ రూపాల్లోను, పలు విధాలుగాను జమచేసేవారు. యుద్ధంలో ఓడినరాజులు చెల్లించు కప్పం యుద్ధ సమయంలో దోచిన సంపద, రైతులు పంటనుండి చెల్లించు 1/6 వంతు, రాజ్యానికి ముఖ్య ఆదాయం. రైతులు చెల్లించు శిస్తును "భాగ" అని పిలిచేవారు. ఒక్కొక్కసారి అడవి ప్రాంతాలను, ఎవ్వరికి చెందని పంట భూములను విక్రయించుట ద్వారా రాజు రాజ్యానికి ఆదాయం సమకూర్చే వాడు. రాజ్యానికి వచ్చు ఇట్టి ఆదాయమును సేకరించుటలో గ్రామాధికారియైన "గ్రామిక" లేక "గ్రామ భోజక" ప్రముఖ పాత్రవహించేవాడు.

**5.2.9. సాంఘిక పరిస్థితులు :**

a) **ప్రజాజీవనము :** గ్రామములోని సాధారణ ప్రజలు తడికెలతో నిర్మింపబడిన గృహములందు నివసించేవారు. నగరాలు, పట్టణాలు కోటగోడల మధ్యయుండేవి. ఇట్టి నగరాలలో లేదా పట్టణాలలో రాజప్రసాదము, ప్రభుత్వ కార్యాలయాలు ఉండేవి. నగర కట్టడాలన్నీ చెక్కతోగాని, రాతితోగాని నిర్మితమై యుండేవి. పట్టణ ప్రాంతపు భవనాలు అంతస్థులు కలిగి యుండేవని, ఏడు అంతస్థుల భవనములు కూడా ఉన్నవని బౌద్ధ గ్రంధాలు తెలియచేయుచున్నవి.

b) **కుటుంబము :** సంఘంనందు సమిష్టి కుటుంబ వ్యవస్థ కలదు. కుటుంబములోని పెద్దవాడు సమిష్టి కుటుంబానికి నాయకత్వం వహించేవాడు. కుటుంబంలో బిడ్డలు జన్మించినప్పుడు సంతోషపడి పండుగ జరుపుకొనేవారు. మగశిశువు జననానికి ప్రాధాన్యతనిచ్చిరి.

c) **సంఘంలో స్త్రీ స్థానం:** ఈ కాలంలో స్త్రీకి కొంత స్వేచ్ఛ లభించింది. పురుషునితో పాటు స్త్రీలు బహిరంగంగా సంచరించుట, పండుగలు మరియు ఇతర సమావేశాలలో పాల్గొనుట జరుగుచుండేది. స్త్రీ విద్య అశ్రద్ధ చేయబడలేదు. విద్యావంతులైన స్త్రీలకు సంఘంలో గౌరవప్రదమైన స్థానం ఇవ్వబడింది. ఆనాటి స్త్రీలు పరదా పద్ధతిని అనుసరించలేదు. వీరు సంగీతము, నృత్యమందు ప్రావీణ్యతను సంపాదించిరి. సతీసహగమనం అచ్చటచ్చట ఆచరణలో వున్నది. బాల్యవివాహాలు పెద్ద ప్రచారంలో లేవు. స్త్రీలు స్వయంగా భర్తను ఎన్నుకొను "స్వయంవరం" పద్ధతి అమలులోనికి వచ్చినది. బహుభార్యత్వము అమలులో వున్నది. స్త్రీ శీల పవిత్రతకు, ప్రాధాన్యత ఇవ్వబడి స్త్రీలందరు పురుషునికి లోబడి వుండాలని చెప్పబడింది.

స్త్రీలలో రెండు వర్గాలు కలవు. మొదటి వర్గం "బ్రహ్మవాదిని" వర్గం. ఈ వర్గపు స్త్రీలు వివాహం చేసికోకుండా జీవితాంతం మత గ్రంధాలను, వేదాలను పఠించి, మోక్షం పొందుటకుగాను ఇహలోక సుఖాలను త్యజించిరి. రెండవ వర్గపు స్త్రీలు "సద్యోద్వహ" వర్గానికి చెందినవారు. వీరు వివాహం జరుగు సమయం వరకు మత గ్రంథాలు, వేదాలు పఠించేవారు.

d) **ఆహారం:** ప్రజలలో మాంసాహారులు, శాకాహారులు కలరు. బియ్యం, బార్లీ, గోధుమ శాఖాహారంలో ముఖ్యమైనవి. మత సంబంధమైన పండుగల సమయాలలోనే వీరు మత్తు పానీయాలు సేవించేవారు.

e) **దుస్తులు - అలంకరణ:** ఆనాటి ప్రజలు నూలు అంగీని ధరించి, భుజముపై ఒక వస్త్రాన్ని వేసుకొని, మెలిపెట్టిన తల పాగను ధరించేవారు. స్త్రీ పురుషులిరువురు ఆభరణములందు ఎక్కువ ఆసక్తి చూపారు. పురుషులు చెవి దుద్దులు ధరించి తమ గడ్డమును ఆకర్షణీయంగా తీర్చిదిద్దు కొనేవారు. గొడుగు పాదరక్షలను ఆనాటి ప్రజలు ఉపయోగించేవారు.

సంపన్న కుటుంబానికి చెందిన స్త్రీలు బంగారంతో చేయబడిన నక్షత్రాలను ఉపయోగించి, తమ శిరోజాలను అలంకరించుకొన్నారు. అంతేగాక అమూల్యమైన వజ్రాలు పొదగబడిన కంఠాభరణములను, గాజులను ధరించారు. మరియు బంగారంతో చేయబడిన

వడ్డాణము, గంటలు కలిగిన కాలి అందెయలు, ఆకర్షణీయమైన రంగులతో నున్న సిల్కు దుస్తులు ధరించారు. కుట్టిన దుస్తులు ధరించుట ఆచరణలోనికి వచ్చింది.

f) **వినోదాలు:** సంగీత, నృత్య కళలలో ప్రజలు అమితమైన ఆసక్తిని కనబరిచారు. జంతువుల పోటీలు, చదరంగం సాధారణ వినోదాలు కాగా జూదముతోను, వేటతోను, యుద్ధాలగురించి గాథలు వినుచు తమ కాలం గడిపేవారు.

g) **కులవ్యవస్థ:** సంఘము కుల పద్ధతిపైన వ్యవస్థీకరించబడింది. క్షత్రియ, బ్రాహ్మణ, వైశ్య, శూద్ర అను నాలుగు వర్ణాలుండెను. ఈ నాలుగు వర్ణాలు కాకుండా చండాలురు అని పిలువబడే హీనకులానికి చెందిన మరియొక వర్గం వుండేది. వీరు ఊరు బయట నివసించేవారు. బానిస వ్యవస్థ అమలులో కలదు.

సాంఘిక ఆచారాలు పటిష్టంగా వుండెను. కులాంతర వివాహాలు అనుమతించబడలేదు. వ్యక్తులు తమ కులాన్నిగాని వృత్తినిగాని మార్చుకొనుటకు వీలులేదు.

జైన, బౌద్ధ మతాల పుట్టుకతో వర్ణవ్యవస్థ పటిష్టతను కోల్పోయింది. బ్రాహ్మణుల ఆధిక్యత నశించి, క్షత్రియుల ప్రాముఖ్యత పెరిగింది. ప్రజలు కులవృత్తులనే గాక ఇతర వృత్తులను చేపట్టుట ప్రారంభమైనది.

**5.2.10. ఆర్థిక పరిస్థితులు :** వ్యవసాయం ప్రజల ముఖ్యవృత్తి. బియ్యం, బార్లీ, చెఱకు వీరి ప్రధానమైన పంటలు. ధనవంతులు వైభవోపేతమైన భవనాలలో నివసించగా బీదవారు సాధారణమైన గృహాలలో నివసించిరి. స్త్రీ, పురుషులు సమిష్టి సహకారంతో పంటలు పండించుట, పంట కాల్వలు నిర్మించుట, రోడ్లు నిర్మించుట మొ. పనులు చేసెడివారు. గ్రామమునందు వ్యవసాయమే కాకుండా పశుపోషణ కూడా ఉండేది. మొత్తంమీద గ్రామ ప్రజల జీవితం సూక్ష్మంగాను, స్వయం సమృద్ధిగాను, సుఖప్రదంగాను మరియు సంతోషంగాను వుండేది. రాజ్యంలో నేతపని, రాతిపని, దంతపు పని, బంగారపు పని, మొదలగు చేతి పనివారు కూడా వుండిరి. వారి వారి వృత్తులలో ప్రావీణ్యత కలిగి వుండిరి. చేతి వృత్తి చేయువారందరు ఒక సంఘంగా లేక శ్రేణిగా ఏర్పడేవారు. అట్టి శ్రేణి అధ్యక్షుని ప్రముఖ, లేదా జ్యేష్టక లేదా శ్రేష్టిన్ అని పిలిచేవారు. ఈ శ్రేణులు ఆయావృత్తుల వారికి శిక్షణనిచ్చుచుండేవి.

దేశీ, విదేశీ వ్యాపారం ఆసక్తికరంగా లేదు. వ్యాపారం, వర్తకం కొరకు రాజ్యంలోని ప్రముఖ వ్యాపార కేంద్రాలను కలుపుతూ రహదారులు నిర్మింపబడినవి. భూమార్గమున, సముద్రమార్గమున మధ్యఆసియా, అరేబియా, సిలోను, బర్మా, సుమత్ర, మలయా, మరియు పశ్చిమ రాజ్యాలతో వ్యాపారం సాగింది. గుజరాత్‌లోని బరుకచ్చము, మహారాష్ట్రములోని సోపార, బెంగాలులోని తామ్రలిప్తి ఆనాటి ప్రముఖ రేవు పట్టణాలు. యమున, సరయు, రాప్తి, గోదావరి, గంగా, సింధూ నదులు కూడా రేవు సౌకర్యాలను కలిగి యున్నవి. సిల్క్ వస్త్రాలు, నగిషీ రగ్గులు ఔషధాలు, సుగంధాలు, దందము, బంగారం, ఇత్తడి మొదలగునవి విదేశాలకు ఎగుమతి చేసారు. బార్టర్ పద్ధతి అమలులో ఉన్నప్పటికి వస్తువులు కొనుటకు గాను కార్షాపణ అను రాగి నాణాన్ని ఉపయోగించిరి. వ్యాపారానికి ధన సహాయము చేసి దానిపై వడ్డీ వసూలు చేయు ఆచారము కూడాయున్నది.

**5.2.11. మత పరిస్థితులు:** నూతనంగా ఆవిర్భవించిన జైన, బౌద్ధ మతాల వలన హిందూమతంలో గొప్ప మార్పులు సంభవించి, ఆ మతానికి వ్యతిరేకంగా వసుదేవుని పూజించుట జరిగింది. శైవ, వైష్ణవ అను నూతన మతాలు జనించెను. హిందూమతంలోని వ్యర్థమైన యాగాలు, యజ్ఞాలు, జంతుబలులు విమర్శింపబడినవి. దాని ఫలితంగా రాజ్యంలోని సంపన్నులు హిందూమతాన్ని ఒదలి నూతన మతాలను స్వీకరించిరి.

మత బోధన బ్రాహ్మణుల ఆధీనంలో నుండి గ్రామముల వెంట తిరుగు సాధువుల ఆధీనంలోనికి వచ్చింది. ఆ విధముగా క్షత్రియులైన మహావీరుడు, బుద్ధుడు, నూతన మతాలను ప్రచారం చేసారు. వీరు సిద్ధాంతమును బోధించిరి. కర్మ సిద్ధాంతమునకు ప్రాముఖ్యత నిచ్చి సత్‌ప్రవర్తన ద్వారా మానవుడు మోక్షము పొందవచ్చునని చెప్పారు.

బౌద్ధమతం వ్యాప్తిలో నున్నప్పటికి వేదకాలము నాటి ఇంద్రుడు, వరుణ[illegible], నదులు, వృక్షములు మొ. దేవతలను ప్రజలు పూజించారు. దేవతలను మానవ రూపములో నిర్మించుకొని, ప్రతిరోజు వారిని పూజించుటకు గాను వారికి దేవాలయాలు నిర్మించినారు.

## 5.2.12. సారాంశము

క్రొత్తగా ఏర్పడిన జైన, బౌద్ధ మతాల ద్వారా ప్రజలు మోక్షానికి సులువైన మార్గాన్ని కనుగొన్నారు. వైశ్య కులస్థుల ప్రగతితో రాజ్యములోని వర్తక వ్యాపారం అభివృద్ధి చెందినది. ధనికులైన వ్యాపారులు నూతన మతాలను పోషించిరి. సంఘములో సమానత్వం యుండవలెనని, ప్రతివారికి సంఘంలో స్థానముండవలెనని జైన, బౌద్ధ మతములు బోధించినవి. దీని ఫలితముగా సంఘంలోను, సంఘం వెలుపలనున్న హీనకులస్థులు, సంఘంలో స్థానం పొందుటకు, సమానత్వం అనుభవించుటకు గాను ఈ నూతన మతాలను అనుసరించినారు.

## అభ్యాసాలు

**A. వ్యాస ప్రశ్నలు**

1. క్రీ.పూ 6 - 4 శతాబ్దముల మధ్య మగధ ఔన్నత్యమును వివరింపుము.

2. క్రీ.పూ 6 వ శతాబ్దము నాటి ఉత్తర భారతదేశ పరిస్థితులను తెలియ జేయుము.

**B. సమస్య పూరిత ప్రశ్నలు**

1. మగధ ఔన్నత్యమునకు హరియాంక వంశము ఎంతవరకు కారణమో వ్రాయుము.

2. క్రీ.పూ 6 వ శతాబ్దము నాటి ఉత్తర భారతదేశపు రాజకీయ పరిస్థితులను వర్ణింపుము.

3. క్రీ.పూ. 6 వ శతాబ్దమునాటి ఉత్తర భారతదేశపు సాంఘీక, ఆర్థిక పరిస్థితులను వివరింపుము.

**C. లఘుటీక :**

**ఈ క్రింది వాటిని క్లుప్తంగా జవాబులు వ్రాయుము**

1. 16 మహాజనపథాలు

2. బింబిసారుడు.

3. అజాత శత్రువు

4. క్రీ.పూ. 6 వ శతాబ్దమునాటి సంఘంలోని స్త్రీ స్థానం

5. మహా పద్మనందుడు.

**D. కుశాగ్ర బుద్ధి పరీక్ష**

**I. ఈ క్రింది ప్రశ్నలకు a,b,c,d,e అక్షరములను ఉపయోగించి సరియైన సమాధానములను ప్రశ్నలకు ఎదురుగానున్న గడులలో వ్రాయుము.**

1. హరియాంక వంశ స్థాపకుడు ( c )

   a) శిశునాగుడు b) బృహద్రదుడు
   c) బింబిసారుడు d) కాలశోకుడు e) వీరెవరు కాదు.

2. పాటలీపుత్రాన్ని నిర్మించిన రాజు ( b )

   a) బింబి సారుడు b) ఉదయనుడు
   c) కాలాశోకుడు d) శిశునాగుడు e) ధననందుడు

3. రెండవ బౌద్ధ సంగీతి (సమావేశమును) వైశాలీలో ఏర్పాటు చేసిన రాజు ( e )

a) అజాత శత్రువు b) శిశునాగుడు
c) మహాపద్మనందుడు d) ఉదయనుడు e) కాలాశోకుడు

4. "క్షాత్రాంతక" అను బిరుదును పొందిన రాజు ( a )

a) మహాపద్మనందుడు b) బింబిసారుడు
c) కాలాశోకుడు d) ధననందుడు e) ఉదయనుడు.

5. పాటలీపుత్రాన్ని మగధ రాజధానిగా చేసిన మొదటిరాజు ( )

a) అజాతశత్రువు b) ధననందుడు
c) ఉదయనుడు d) శిశునాగ e) రిపుంజయ

II. జతపర్చుము

| | | | |
|---|---|---|---|
| 1. | కాలాశోకుడు | (e) | (a) కుసుమపురము |
| 2. | మహాపద్మనందుడు | (d) | (b) అజాతశత్రువు |
| 3. | పాటలీపుత్రం | (a) | (c) గిరివ్రజం |
| 4. | మొదటి బౌద్ధసంగీతి సమావేశము | (b) | (d) ఉత్తర భారతదేశపు మొదటి చక్రవర్తి |
| 5. | మగధ తొలి రాజధాని | (c) | (e) రెండవ బౌద్ధ సంగీతి సమావేశము |

**Assignment**

1. క్రీ.పూ 6 - 4 శతాబ్దాల మధ్య మగధ ఔన్నత్యాన్ని గురించి తెలుపుము.

## ఉపయుక్త గ్రంథాలు


1. R.C. Majumdar - An advanced history of India
2. T.M. Rhys David - Buddhist India
3. B.N. Lumiya - Life and culture in Ancient India
4. K.M. Pani Kar - A survey of India History
5. Bharatiya Vidya Bhavan's History and series Culture of the Indian people
6. R.C. Majumdar - Ancient India.

పాఠం - 6

# జైన, బౌద్ధ మతాల పుట్టుక, సూత్రాలు

## 6.1. లక్ష్యం

క్రీ.పూ. 6వ శతాబ్దం నాటి భారతదేశ ఆర్థిక, సాంఘిక, ి త పరిస్థితుల దృష్ట్యా జైన బౌద్ధ మతాల సూత్రాలను అర్థం చేసుకోవడం ఈ పాఠం యొక్క ప్రధాన ధ్యేయం.

ముఖ్యాంశ సంగ్రహం


6.2. ఆధారాలు

6.3. ఉపోద్ఘాతం

6.4. జైన, బౌద్ధ మతాల విజృంభణకు కారణాలు

6.5. జైనమత అవతరణ

6.6. పార్శ్వనాథుడు జీవితం, బోధనలు

6.7. మహావీరుడు అతని జీవితం, బోధనలు

6.8. జైనవ్యాప్తి, క్షీణత

6.9. జైన, హిందూ మతాల మధ్య సామ్యములు, వ్యత్యాసములు

6.10. గౌతమబుద్ధుడు అతని జీవితం, బోధనలు

6.11. బౌద్ధమత వ్యాప్తి, పతనం

6.12. బౌద్ధ జైన మతాల మధ్య సామ్య, వ్యత్యాసాలు

6.13. భారతీయ సంస్కృతికి జైన బౌద్ధమతాలు చేసిన సేవ

6.14. సమీక్ష


## 6.2. ఆధారాలు :

1 జైనమతాన్ని గురించి తెలుసుకోవటానికి చాలా ఆధారాలున్నాయి. వాటిలో ముఖ్యమైనవి 12 అంగాలు, ఉపాంగాలు, కల్పసూత్రాలు, నిరుక్కులు, బద్రబాహుని కల్పసూత్రాలు, హేమచంద్రసూరి వ్రాసిన పరిశిష్టపర్వన్.

2 సుక్తని పతము, త్రిపిటకాలు, అభినిష్క్రమణసూత్రం, జాతక కథలు, అశ్వఘోషుని బుద్ధచరిత్రం, దిఘయము, మహావదన సూక్తాంతం, సింహళగ్రంధాలయిన దీపవంశం, మహావంశం మొదలగునవి బౌద్ధమత చరిత్రను తెలుసుకొనటానికి ఉపకరిస్తాయి.

## 6.3. ఉపోద్ఘాతం :

1 ప్రపంచ చరిత్రలో క్రీ.పూ. 6వ శతాబ్దానికి విశిష్టత ఉంది. ఆనాడు ప్రముఖ నాగరికతా కేంద్రాలన్నింటిలోనూ ప్రాచీన సాంప్రదాయాలను విచ్ఛిన్నం చేస్తూ నూతన సాంప్రదాయాలతో నూతన ఉద్యమాలు జరిగాయి. ముఖ్యంగా మత ఆరాధనా పద్ధతులలో గొప్ప మార్పులు సంభవించినాయి. ఆనాడు అనేకమంది తాత్త్వికులు బయలుదేరి నూతన రీతులను బోధించారు. వీరి బోధనలు

మత సాంప్రదాయాలనే గాక సాంఘిక, రాజకీయ వ్యవస్థలను సైతం తారుమారు చేసాయి. అందువల్లనే చరిత్రలో ఈ శతాబ్దపు పరిణామాలు మరుపురానివని హెచ్. జి. వెల్సు అభిప్రాయ పడినాడు. పర్షియాలో జొరాస్టర్, బాబిలోనియాలో వెర్రియ్యా, గ్రీసులో సోక్రటీసు, పిరమైడ్స్, ఎంపెటోక్లెస్, అయోనియాలో హిరాక్లిటస్, చైనాలో లావోత్సి, కన్ఫ్యూషియస్ వేదాంత బోధనలు చేసి జీవితాశయ మేమిటో ప్రజలకు తెలిపారు. ప్రపంచ వ్యాప్తమైన ఈ ఆధ్యాత్మిక సంచలనంలో భారతదేశం కూడ పాలుపంచుకొంది.

2) ఋగ్వేదంతో ప్రారంభమైన నాగరికత ఆ తదుపరి అనేక మార్పులకు చేర్పులకు గురియై క్రీ. పూ. 6వ శతాబ్దం దాకా అవిచ్ఛిన్నంగా వర్ధిల్లింది. కాని క్రీ. పూ. 6వ శతాబ్దంలో ఈ నాగరికత గొప్ప ఎదురు దెబ్బతిన్నది. ఈ సమయంలో భారత ప్రజలు నాటి మత సిద్ధాంతాలతో విసుగు చెంది సులభమైన తరుణోపాయం కొరకు అన్వేషించ సాగిరి. ఇటువంటి పరిస్థితులలో పెక్కుమంది తాత్త్వికులు బయలుదేరిరి. వారిలో మహావీరుడు, గౌతమ బుద్ధుడు ముఖ్యులు. ఆనాడు, వీరేగాక 62 మత తెగలు వున్నాయని పాళీ గ్రంథాలు, 363 అని జైన గ్రంధాలు పేర్కొన్నాయి. వాటిలో ముఖ్యమైనవి ఆజీవకులు, జటిలకులు, ముండసావకులు, మాగంధికులు, గోతమకులు, లేదండికులు మొదలగునవి. నాటి మత ప్రచారకులలో ముఖ్యమైనవారు మహావీరుడు, గౌతమ బుద్ధుడేగాక పురాణ-కాశ్యపుడు, మఖల్లి-గోసల, మిగంఠనాటపుత్త, అజిత. ఆధ్యాత్మిక అశాంతికి మహావీరుడు, బుద్ధుడు, మార్గం చూపుటయేకాక సత్య, అహింసల ద్వారా విశ్వమానవ శాంతికి గూడ పరిష్కార మార్గం సూచించారు.

## 6.4. జైన, బౌద్ధ మతాల విజృంభణకు కారణాలు :

**6.4.1 వైదిక క్రతువులు :** ఇతిహాసయుగం చివరి రోజులలో వైదికమతం అర్థరహితమయిన కర్మలతో, ఆచారాలతో కూడి ఉన్నదనే భావం ఏర్పడింది. అవి వ్యయ, ప్రయాసలతో కూడినవి, హింసాయుతమయినవి. అవి సాధారణ వ్యక్తులకు అందుబాటులో లేవు. అంతేగాక కార్యభారమయినవిగా ప్రజలు అసంతృప్తులైనారు. యజ్ఞాల పేరుతో జరిగే జంతు హింసను గర్హించారు.

**6.4.2 బ్రాహ్మణ వర్గంపై తిరుగుబాటు :** వర్ణ వ్యత్యాసాల వలన వైశ్య, శూద్ర, పంచమ వర్ణాలలో అసంతృప్తి ప్రబలింది. యజ్ఞాల ద్వారా, ఇతర సాంఘిక కార్యకలాపాల ద్వారా బ్రాహ్మణులు ఆధిక్యత సాధించారు. పురోహితుడుగా రాజును అదుపులో ఉంచారు. ఈ వర్ణాలన్నీ బ్రాహ్మణాధిక్యతను నిరసించాయి. సమాజ శిఖరాన్ని అధిరోహించి సాంఘిక, రాజకీయ రంగాలలో సర్వాధికారాలను చెలాయిస్తున్న బ్రాహ్మణులపై వారి మతంపై తిరుగుబాటు నూతన మతాల లక్ష్యం.

**6.4.3 మంత్రాలపై విశ్వాసం :** వేదమంత్రాల స్థానంలో ఇతర మంత్రాలు చోటుచేసుకొన్నాయి. ఈ మంత్రాలను పఠించుట వలన ప్రజల రోగాలు తొలగి పోవునని, పంటలు బాగా పండునని, శత్రు వినాశము కలుగునని, రాజ్యం అభివృద్ధి చెందునను ప్రగాఢవిశ్వాసం ప్రజలలో ఉండేది. కాని ఈ మంత్రాలను సాధారణ ప్రజలు అర్థం చేసుకోలేరు. కావున ప్రజలు మార్పుకొరకై ఎదురుచూచారు.

**6.4.4 భాషా సమస్య :** మతసంబంధమైన సాహిత్యమంతా సంస్కృత భాషలో వ్రాయబడింది. కాలం గడిచిన కొలది నిరాండంబరత లోపించింది. చాలామంది ప్రజలు భాషను అర్థము చేసికోలేకపోయారు. ఆనాడు ప్రజలు తమకు తెలిసిన భాషలో అర్థం చేసుకొనగలిగిన భాషలో మతం ఉండాలని కోరుకొన్నారు.

**6.4.5 జాతి సంఘర్షణ :** తూర్పు భారతదేశంలో నివశిస్తున్న కొన్ని జాతులు వేదమతాచారాలతో కూడిన బ్రాహ్మణ వర్గం మీద ఎదురు దాడుల ఫలితమే జైన, బౌద్ధ మతాలని ఒక అభిప్రాయం. టిబెటన్, మంగోలియన్ జాతులవారు స్థిరనివాస మేర్పరచుకొనిన తర్వాత, వారి సంతతి వారయిన శాక్యులు, జ్ఞాత్రికులు పూర్వాచార పరాయణుల మీద తిరుగబడ్డారని వారి అభిప్రాయం.

**6.4.6 గణరాజ్య ప్రజల తిరుగుబాటు :** తూర్పు భారతదేశంలో, నివసించిన శాక్యులు, లిచ్ఛవులు, మల్లవంశీయులు అనార్యులు. వారు గణతంత్ర సిద్ధాంతాలలో విశ్వాసమున్న స్వేచ్ఛాప్రియులు. కాని దేశంలో నాడు నిరంకుశ రాజకీయాల విస్తరణ జరుగుచున్నది. ఆ విస్తరణకు గణరాజ్యాల ప్రతిఘటనే జైన, బౌద్ధాల రూపంలో వెలువడిందని కొందరి అభిప్రాయం.

**6.4.7 ఇనుపలోహ సాంకేతిక పరిజ్ఞానవ్యాప్తి :** తూర్పు గంగాలోయ ప్రాంతంలో ఇనుపలోహ సాంకేతిక పరిజ్ఞానం వ్యాప్తి చెందడంచేత నూతన భౌతిక పరిస్థితులు వెలిసాయి. అనగా సరికొత్త వ్యవసాయ పనిముట్లు, పరికరాలు వాడుకలోనికి రావడం వలన, ఆ పనిముట్లతో

బీహారు, తూర్పు ఉత్తరప్రదేశ్ ప్రాంతాలలోని దట్టమైన అడవులను మైదానాలుగా మార్చడం జరిగింది. దీనితో సారవంతమైన విస్తారభూములు వ్యవసాయానికి అనుకూలమైనాయి. తత్ఫలితంగా రైతులు ఎక్కువ ఫలసాయాన్ని పొందసాగారు. దీనితో పాటు వ్యాపారం విస్తృతంగా వృద్ధిచెంది పట్టణ నాగరికత పెరుగుదలకు తోడ్పడింది. మారుతూ వస్తున్న ఆర్థిక వ్యవస్థా క్రమంలో ఎక్కువగా లాభపడిన వారు వైశ్య తెగవారే అయినప్పటికీ వారు మూడవ వర్ణంగానే ధృవీకరించబడ్డారు. ఈ మార్పులలో క్షత్రియులు కూడ లాభపడ్డారు. ఎందుచేతనంటే వీరు భూమిని ఆధారంగా కలిగి ఉండడం చేతను, వ్యవసాయ ఫలాసాయంలో అధికదిగుబడిని, పన్నుల రూపంలో పొందడంవలన తమ వర్ణం యొక్క స్థాయిని నిలుపుకొన్నారు. ఈ విధంగా క్షత్రియులు బ్రాహ్మణుల యొక్క మితిమీరిన ఆధిపత్యాన్ని ప్రతిఘటించగా, వైశ్యులు మాత్రం తమ సాంఘిక స్థితిని మెరుగుపరచుకొనడానికి మార్గాన్ని వెదకడానికి పూనుకొన్నారు.

**6.4.8 మతరంగంలో అయోమయస్థితి :** క్రీ.పూ. 6వ శతాబ్దం నాటికి మతరంగంలో అరాచక పరిస్థితి ఏర్పడింది. కొందరు కర్మమార్గాన్ని బోధించారు. కొందరు తత్త్వవేత్తలు జ్ఞానమార్గాన్ని ప్రభోదించారు. కొందరు జ్ఞానం వలన ఆత్మకు సంసార బంధాలనుండి, యోగం ద్వారా శరీరాన్ని శుష్కింప చేయుట వలనను మోక్షం లభిస్తుందని ప్రతిపాదించారు. ఈ మార్గాలలో ఏది ఉత్తమమో ప్రజలకు తెలియటం కష్టమయింది.

**6.4.9 ఉపనిషత్తుల బోధల పరిణామం :** ఇట్టి పరిస్థితులలో ఉపనిషత్తులు భావసంచలనం కలిగించాయి. దేశంలో ఒక వైజ్ఞానిక, అధ్యాత్మిక ఉద్యమం ప్రారంభమయింది. వర్ణవ్యత్యాసాల విధానాలను సమన్వయం చేసి అందరికి అందుబాటులో వుండే మోక్ష సాధన కనుగొనడమే ఈ ఉద్యమానికి లక్ష్యమయ్యింది. ఆ లక్ష్య సాధనకై బోధించిన నూతన సిద్ధాంతాలన్నింటిలో జైన, బౌద్ధాలు ముఖ్యమైనవి.

## 6.5. జైనమత అవతరణ :

**6.5.1 జైనమతం గూర్చి అపోహలు :** ఒకప్పుడు జైనమతం బౌద్ధ మతం యొక్క శాఖ అని విశ్వసింపబడేది. రెండు మతాలూ అహింసా ప్రధానమైనవి కావడం ఇందుకు కారణం కావచ్చు. అనంతర కాలంలో జైనం ప్రత్యేక మతమని గుర్తించబడింది. అట్లే బుద్ధుడు బౌద్ధమత స్థాపకుడయినట్లే మహావీరుడు జైనమత స్థాపకుడు. జైన తీర్థంకరులలో మహావీరుడు చివరివాడు.

**6.5.2 జైన బౌద్ధాల సామ్యములు :** రెండు మతాలు వైదిక మతం మీద తిరుగుబాటు వలన ఉద్భవించిన మతాలు. వేదముల ఆధిక్యతను, బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని, యజ్ఞాలలో జంతుబలుల ద్వారా ప్రయోజకత్వాన్ని రెండు మతాలు ప్రశ్నించాయి, నిరసించాయి. రెండు మతాలకు జీవకారుణ్య, అహింసల మీదనే ప్రాధాన్యత వచ్చింది. రెండు మతాల సంస్థాపకులు క్షత్రియ కులస్తులు. జన్మనాధారంగా చేసుకొని కుల వ్యవస్థను నమ్మలేదు. రెండు మతాలు ఉత్తమ నైతిక ప్రవర్తన ద్వారా నిర్వాణాన్ని పొందవచ్చునన్నవి. కర్మ, పునర్జన్మలను రెండు మతాలు అంగీకరించాయి. రెండు మత సంఘాలలోను స్త్రీలకు ప్రవేశం ఇవ్వబడింది. రెండు మతాలు ఖర్చులేనివి, సులభమైనవి, ఆచరణ యోగ్యమైనవి. రెండు మతాల సిద్ధాంతాలు సామాన్యప్రజలకు అర్థమగు ప్రాకృత భాషలోనే బోధింపబడ్డాయి.

**6.5.3 జైన బౌద్ధాల మధ్య వ్యత్యాసములు :** బౌద్ధం నిరాడంబరముగా, ఆచరణ సాధ్యంగా ఉండేది. జైనం ఆధ్యాత్మిక తార్కిక చర్చతో ప్రయాసతో కూడిన మతంగా పరిణమించింది. జైనమతం కాలక్రమేణా వేదమతంతో, వైదిక సమాజంలో సన్నిహితంగా వ్యవహరించింది. కులవ్యవస్థను కొలది మార్పుచేసి దాని ప్రధాన లక్షణాలను ఆమోదించింది. బౌద్ధ-వేద మతముల మధ్య అంతరాలు ఎక్కువయ్యాయి. తత్ఫలితంగా బౌద్ధం దాదాపు ఒక ప్రత్యేక మతంగా రూపొందినదనవచ్చును. మహావీరుడు నిర్వాణ సిద్ధికి దేహమును ఉపవాసముల చేత క్షీణింపజేసి మరణించుట ఆదేశించినాడు. బుద్ధుని ఉద్దేశ్యములో సకల కర్మలకు కారణ భూతమైన కోరికలను పరిత్యజించుకొనటమే నిర్వాణం. బుద్ధుడు ఆత్మను గురించి ఎటువంటి అభిప్రాయాన్ని తెలియజేయలేదు. ఆయన ప్రకారం ఆత్మకోరికల సమిష్టి రూపం. సర్వవ్యాప్తమైన చేతనాచేతన వస్తువులన్నింటిలో ఆత్మ ఉన్నదని మహావీరుడు అంగీకరించాడు. బౌద్ధ సంఘంలో భిక్షువులకు స్థానం ఉంది. జైన సంఘంలో భిక్షువులకు, గృహస్థులకు గృహస్థులు అండదండలుగా నిలిచారు. జైనమతం నిలబడడానికి ఇదే కారణం.

**6.5.4 జైనమతం ప్రాచీనత :** జైన మతం ఎప్పుడు స్థాపించబడినదో తెలియదు. కాని ఋగ్వేద మంత్రాలలో జైన మత స్థాపకుడైన ఋషభుని, అరిష్టనేమి తీర్థంకరుల గురించి స్పష్టమైన ప్రస్తావన గలదు. విష్ణు, భాగవత పురాణాలలో నారాయణుని అవతారముగా ఋషభుడు పేర్కొనబడెను. దీనిననుసరించి జైనము చాలా పురాతనకాలంనుండి ఉన్నదని తెలియుచున్నది. జైన మతానికి 24 మంది

తీర్థంకరులు కలరు. తీర్థం కరులనగా జీవన ప్రవంతిని దాటడానికి వారధి నిర్మించిన వారు అని అర్థం. వీరిలో మొదటి ఇరవై ఇద్దరు పౌరాణిక వ్యక్తులు. కాని 23వ తీర్థంకరుడైన పార్శ్వనాధుడు, 24 వ తీర్థంకరుడైన మహావీరుడు చారిత్రక పురుషులు. జైనతీర్థంకరుల నామములు ఈ క్రింద సూచించబడినవి.

1. ఋషభదేవ/ఆధినాధ
2. అజితనాధ
3. సంభవనాధ
4. అభినందన
5. సమితినాధ
6. పద్మప్రభు
7. సుపార్శ్వనాధ
8. చంద్రప్రభు
9. పుష్పతంత్
10. శీతల నాధ
11. శ్రేయోంసనాధ
12. వసుపూజ్య
13. విమలనాధ
14. అనంతనాధ
15. ధర్మనాధ
16. శాంతినాధ
17. కుంతనాధ
18. అరనాధ
19. మల్లనాధ
20. మునిసువీరనాధ
21. నేమినాధ
22. అరిష్టనేమి
23. పార్శ్వనాధ
24. మహావీర

### 6.6. పార్శ్వనాధుడు :

**6.6.1 పార్శ్వనాధుని జీవితం :** 24 మంది తీర్థంకరులలో మొదటి చారిత్రక పురుషుడు పార్శ్వనాధుడే. ఇతడు 23వ తీర్థంకరుడు. జాకోబి అనే పండితుని అభిప్రాయం ప్రకారం ఇతడే జైనమత స్థాపకుడు. ఇతడు కాశీరాజైన అశ్వసేనుని కుమారుడు. నరవర్మ కుమార్తెయగు ప్రభావతిని ఇతడు వివాహమాడెను. ఇతడు 30 సంవత్సరాల వయస్సు వరకు గృహస్థాశ్రమం గడిపి తరువాత సన్యసించాడు. 83 రోజుల పాటు తపస్సు చేసి జ్ఞాన సిద్ధి పొందాండు. నాటి నుండి తాను తెలుసుకొన్న సత్యాన్ని ప్రసారం చేశారు. ఇతను 100 సంవత్సరాలు జీవించి బెంగాలులోని సమ్మేత పర్వతం మీద నిర్యాణం పొందాడు. ఇతను క్రీ.పూ. 9వ శతాబ్దికి చెందిన వాడని చరిత్రకారుల నిర్ణయం. ఇతడు జైన మతాన్ని ఒక చక్కని సంస్థగా రూపొందించాడు. ఇతని సంఘాన 16 వేల మంది శ్రవణులు విరాజిల్లారు. వీరికి ఆర్యదత్తుడు నాయకుడు. పార్శ్వనాధుని మతమున 38 వేల మంది సన్యాసినులు ఉండేవారు.

**6.6.2 పార్శ్వనాధుని సిద్ధాంతములు :** మానవుని జీవితాశయము మోక్షాన్ని పొందుట. చక్కని నియమాలు మన చెడు కర్మలను తొలగించునని పార్శ్వనాధుని విశ్వాసం. దీనిని సాధించుటకై ఇతడు తపస్సును ప్రతిపాదించెను. ఇతని మతంలో నాలుగు సిద్ధాంతాలు కలవు. అవి. 1. అసత్యమాడరాదు. 2. దొంగతనము చేయరాదు. 3. ఆస్తిపాస్తులుండరాదు. 4. జీవహింసచేయరాదు.

### 6.7. వర్ధమాన మహావీరుడు :

**6.7.1 మహావీరుని జీవితం :** పార్శ్వనాధుని సిద్ధాంతాలను క్రోడీకరించి ప్రచారంచేసిన వాడు 24వ తీర్థంకరుడైన వర్ధమాన మహావీరుడు. ఇతడు వైశాలి దగ్గరగల కుందగ్రామంలో సంపన్నమైన క్షత్రియ కుటుంబంలో క్రీ.పూ. 599 లో జన్మించెను. ఇతని తండ్రి సిద్ధార్ధుడు క్షత్రియతెగ నాయకుడు. తల్లి త్రిశాల. ఈమె లిచ్ఛవీ రాకుమార్తె. వీరు జ్ఞాత్రికా తెగకు చెందినవారు. ఇతని మొదటి పేరు వర్ధమానుడు. జ్ఞానోదయమైన తరువాత మహావీరుడిగా పేరుగాంచెను. మహావీరునికి యుక్త వయస్సునందే యశోదతో వివాహమయ్యెను. వారికి ప్రియదర్శన అను పేరు గల కుమార్తె కలిగెను. ఆమెను మేనల్లుడైన జామాలి కిచ్చి పెండ్లిచేసెను. మహావీరుడు తల్లిదండ్రులకు

బాధ కలిగించకుండా వారి మరణానంతరం తన అన్న అయిన నందివర్ధనుని అనుమతితో తన ముప్పదవ ఏట సన్యాసి అయ్యెను. ఇల్లు విడిచి 13 మాసాలైన తరువాత వర్ధమానుడు కఠిన నియమాలు పాటిస్తూ దిగంబరుడై ధ్యానంలో నిమగ్నుడయ్యెను. 12 సంవత్సరములు కఠిన తపస్సు చేసి రుజుపాలిక నదీ తీరాన జృంభిక గ్రామ సమీపంలో సాలవృక్షము క్రింద జినత్వంను పొందెను. అదే జ్ఞానోదయం. జిన అనగా జయించిన వాడని అర్థము. నాటి నుండి సంవత్సరములో 8 నెలలు దేశాటన చేయుచు ప్రజలకు తన సిద్ధాంతాలను బోధించెను. మిగిలిన 4 నెలలు చెంప, వైశాలి, రాజగృహ, మిథిల, శ్రావస్తి మొదలగు పట్టణాలలో కాలం గడుపుచుండేవాడు. 72 సంవత్సరాల ప్రాయంలో మహావీరుడు పాట్నా జిల్లాలోని పావాపురిలో హస్తిపాలుడనే రాజు గృహంలో క్రీ.పూ. 527లో నిర్యాణం పొందెను.

**6.7.2 మహావీరుని బోధనలు (లేక) జైనమత సిద్ధాంతాలు :** మహావీరుడు వేదముల అధికారమును, వైదిక కర్మకాండను, బ్రాహ్మణుల ఆధిక్యతను తిరస్కరించెను. పవిత్రమైన జీవనము గడుపుతూ, సన్యాసిగా తపస్సు చేసి నిర్యాణమును పొందవచ్చునని మహావీరుడు బోధించెను. ఇతని మతంలో అందరూ ప్రవేశించవచ్చునని, జాతి, మత, కుల, వర్ణ, లింగ బేధములు లేవని చెప్పెను. కాని ఇతడు కుల వ్యవస్థ సిద్ధాంతానికి వ్యతిరేకికాడు. ఈ ప్రపంచమును భగవంతుడు సృష్టించెనని మహావీరుడు విశ్వసించలేదు. మానవుడు విముక్తి కొరకు భగవంతుని అనుగ్రహముపైన లేక ఇతర వ్యక్తులపై ఆధారపడకూడదని, తన భవిష్యత్తుకు తానే కర్తయని బోధించెను. జైన మతం సమానత సిద్ధాంతానికి ఎక్కువ ప్రాముఖ్యత నిచ్చెను. అన్ని సమానంగా చూడవలెనని బోధించెను. ఈ ప్రపంచము చేతనాత్మకమైన జీవులతోను, అచేతనాత్మకమైన అజీవులతోను ఉండెనని నుడివెను. ఇచ్చట జీవి అనగా ఆత్మకే వర్తించును. జనన మరణముల నుండి విముక్తి పొందుటయే ఈ జీవి లక్ష్యం. మానవుని కర్మలే అతని భవిష్యత్తును నిర్ణయించును. కర్మ ఆత్మను అంటిపెట్టుకొని యుండును. కామ, క్రోధ, లోభ, మోహాదులు కర్మకు కారణం. వాటివలన కర్మ ఉద్భవించును. కర్మల ఫలితాలను అనుభవించుటకై ఆత్మ, జన్మ, పునర్జన్మించ వలసివచ్చును. ఈ కర్మ మార్గాలను అరికట్టి పూర్వార్జిత కర్మను నాశనం చేసుకొన్నప్పుడు జీవుడు బంధ విముక్తుడగును. దీర్ఘ తపస్సుచేత, నియమనిష్టలను ఆచరించి కర్మఫలితాలనుండి దూరం కావచ్చును. అచేతనాలు కూడ జీవులుగా భావించడం వలన అహింసావ్రతమును కఠినముగా జైనులు పాటించిరి. పార్శ్వనాథుడు బోధించిన నాలుగు వ్రతాలను మహావీరుడు బ్రహ్మచర్యాన్ని చేర్చి అయిదు వ్రతాలను చేసెను. బ్రహ్మచర్యమనగా ఇంద్రియములను, కోరికలను అదుపులో ఉంచుకొనుట, మనోవాక్కాయ కర్మలలో పవిత్రత కనబరచుట. ఉపవాసము, పంచవ్రతాలను పాటించడం ద్వారా సంచిత కర్మ నాశనమై జీవి కైవల్యము పొందును. దీనినే మోక్షమందురు. మోక్షమనేది దుఃఖము లేని అనంత సౌఖ్యము. దీనినే శుద్ధశీల అని కేవలావస్థ అని అంటారు. చేసిన తప్పును ఒప్పుకొనుట, అహింసాదీక్ష పాటించుట, సమ్యక్ చరిత్ర, సమ్యక్ దర్శనం, సమ్యక్ జ్ఞానం మోక్షానికి మార్గములు. తీర్థంకరుల బోధనలలో శ్రద్ధే సమ్యక్‌దర్శనం. ఈ బోధనలలోని సత్యాన్ని గ్రహించుటయే సమ్యక్‌జ్ఞానం. పంచవ్రతాలను నియమంగా పాటించుటయే సమ్యక్ చారిత్రము. ఈ మూడింటినే త్రిరత్నములు అని అందురు. వీటిద్వారా జీవమోక్షాన్ని పొందవచ్చును.

## 6.8. జైన మతవ్యాప్తి, క్షీణత

**6.8.1 జైనమతం వ్యాప్తి :** వైదికమతంపై తిరుగుబాటుగా జైనమతం వైశాలిని కేంద్రంగా చేసుకొని అనతికాలంలోనే బహుళ వ్యాప్తి చెందింది. తొలిదశలో బౌద్ధముకన్నా జైన మతమే దేశం నలుమూలలా వ్యాప్తి చెందింది. దానికి కారణం మహావీరుని వ్యక్తిత్వం, ఆకర్షణశక్తి. ఇతడు ప్రథమంగా 12 మంది బ్రాహ్మణ పండితులను ఓడించి, తన శిష్యులుగా చేసుకొని వారిచే జైనమత ప్రచారం చేయించాడు. మగధ పాలకులైన బింబిసారుడు, అజాతశత్రువు, ఉదయనుడు, నందులు, చంద్రగుప్తమౌర్యుడు జైనమతాన్ని అభిమానించి పోషించారు. అశోకుడు బౌద్ధానికి చేసిన సేవ సంప్రతి (మౌర్యచక్రవర్తి) జైనానికి చేసినట్లు తెలుస్తుంది. అతని ఆదేశం మీద ద్రావిడ, ఆంధ్రాది దక్షిణాది రాజ్యాలకు జైన ప్రచారకులు వెళ్ళినట్లు జైనగ్రంథాలు పేర్కొంటున్నాయి. వీరేగాక కళింగ చక్రవర్తి, ఖారవేలుడు, దక్షిణ దేశం ఏలిన చాళుక్యులు, రాష్ట్రకూటులు జైనమతాన్ని ఆదరించారు. భద్రబాహుడు, స్థూలభద్రుడు, దిజ్ఞాగుడు మొదలగు జైనాచార్యులు ఈ మత వ్యాప్తికి కృషిచేశారు. జైనమత పరిషత్తులు ఈ మతవ్యాప్తిని చేసినవి. చంద్రగుప్త మౌర్యుని కాలంలో పాటలీపుత్రంలో స్థూలభద్రుని ఆధిపత్యంలో మొదటి జైన పరిషత్తు సమావేశమైనది. ఇది జైనమత బోధనలను 12 అంగాలుగా విభజించి క్రోడీకరించింది. కళింగ చక్రవర్తి ఖారవేలుడు రెండవ జైన పరిషత్తు జరిపి జైన గ్రంథాలన్నీ తిరిగి వ్రాయించాడు. క్రీ.శ. 512 లో జైనులు గుజరాత్‌లోని వల్లభాలో మూడవ జైనపరిషత్తు జరిపి జైన గ్రంథాలన్నీ సేకరించి అర్ధమాగధిలో తర్జుమా చేశారు. ముస్లిం పరిపాలనా కాలంలో జైనుల ప్రాబల్యం తగ్గిపోయింది.

**6.8.2 జైనమతక్షీణత :** జైనమతం మొదట బహుళ వ్యాప్తి చెందినప్పటికి త్వరలోనే ఇది క్షీణించింది. ఇందుకు అనేక కారణాలు కలవు. నిస్వార్థతతో కూడిన జైన సంఘంలోని ఉపాసకుల, భిక్షువుల సంఖ్య తగ్గిపోయింది. మతసంబంధమైన కార్యకలాపాలలో వారు చురుకుగా పాల్గొనలేకపోయిరి. అంతేగాక జైన సంఘం శ్వేతాంబరధారణను సమ్మతించినట్లునూ, మహావీరుడు ఖండించినట్లునూ జైన గ్రంథాల వల్ల తెలుస్తుంది. దీనికి తోడుగ కుల, వర్గభేదాలు తిరిగి తలెత్తాయి. ఇలాంటి పరిస్థితులలో వైదిక మతంలో ప్రతిసంస్కరణ ఉద్యమం బయలుదేరింది. దీనివలన జైనమతం చాలా బలహీనమయ్యేను. వీటన్నింటికి తోడుగా రాజపోషణ అంతరించింది. వీటివలన జైనమతం క్రమక్రమముగా పతనమయ్యేను. అయినా ఈ మతం రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలలో ఎక్కువగాను, మధ్యభారతదేశంలో, దక్షిణ భారతదేశంలో కొన్ని జిల్లాల్లో ఇప్పటికి నిలిచియున్నది.

## 6.9. జైన హిందూ మతాల మధ్య సామ్యములు, వ్యత్యాసాలు

**6.9.1 సామ్యములు :** హిందూ సమాజం నుండి జైనులు చీలిపోలేదు. జైన భిక్షువులు గృహస్థుల ఆదరణ పొందిరి. జైనులు హిందూ కులవ్యవస్థ పట్ల తీవ్రవ్యతిరేకత ప్రదర్శించలేదు. హిందూ ప్రజల పూజావిధానాన్ని అవలంబించినారు. కర్మ, పునర్జన్మ, ఆత్మ, కులవ్యవస్థలలో రెండు మతాల వారికి సమాన విశ్వాసాలున్నాయి.

**6.9.2 వ్యత్యాసాలు :** హిందూ మతస్థులవలె జైన మతస్థులకు వేద ప్రామాణ్యత, యజ్ఞ నిర్వహణలో విశ్వాసం లేదు. జైనులు సృష్టికర్తను గుర్తించరు. హిందువులు పరమాత్మలో జీవాత్మ లీనమగునని నమ్ముతారు. మోక్షప్రాప్తి లభించిన తర్వాత ప్రతి జీవాత్మ విడివిడిగా ప్రత్యేక స్థానాల్లో ఉంటాయని జైనులు అంటారు. జైన మతం అన్ని వర్గాల వారికి కఠిన నియమాలను విధించిరి. హిందూ మతం బ్రాహ్మణుల పైననే ఎక్కువ నియమ నిబంధనలను విధించింది.

## 6.10. గౌతమ బుద్ధుడు, అతని జీవితం, బోధనలు

**6.10.1.** ఆసియా ఖండంలో, క్రీ.పూ. 6వ శతాబ్దంలో జన్మించిన మేధావులలో అత్యంత ప్రముఖుడు గౌతమ బుద్ధుడు. ఆయన ధర్మం మానవుని ఆదర్శాలపై ఎన్నటికి ముద్రవేసింది. ధర్మం, అహింస, కరుణ, మానవత అను గొప్ప ఆశయాలను జీవితంలో అమలు పరచిన మహాపురుషుడు కనుకనే ఎడ్విన్ ఆర్నాల్డ్ అను పండితుడు ఆయనను ఆసియా జ్యోతి అని, శ్రీమతి రైస్‌డేవిడ్స్ ప్రపంచజ్యోతి అని వర్ణించారు.

**6.10.2 తొలి జీవితము :** క్షత్రియులలో శాక్య వంశానికి చెందిన బుద్ధుని అసలు పేరు సిద్ధార్థుడు. అతని తండ్రి శుద్ధోధనుడు కపిలవస్తుకు రాజు, తల్లి మాయాదేవి. క్రీ.పూ. 567లో లుంబినీ వనము నందు సిద్ధార్థుడు జన్మించెను. ఇతడు జన్మించిన ఏడవ రోజునే తల్లి మాయాదేవి మరణించుటతో సవతి తల్లి ప్రజాపతి గౌతమి పెంచింది. సిద్ధార్థుని ధ్యాస ప్రాపంచిక విషయాలపై మరల కుండుటకు తండ్రి సుద్ధోధనుడు గౌతమునికి యశోధర అను రాకుమార్తె నిచ్చి వివాహము జరిపించాడు. వీరికి రాహులుడనే కుమారుడు జన్మించెను. కాని గౌతముని ఆలోచనా సరళిని వివాహం మార్చలేకపోయింది.

**6.10.3 నాలుగు దృశ్యములు చూచుట :** తన 29వ ఏట గౌతముడు ఒకనాడు కపిలవస్తు నగరంలో నాలుగు దృశ్యములను చూచెను. అవి. 1. వృద్ధుడు 2. రోగిష్టి 3. శవము 4. సన్యాసి. ఈ దృశ్యాలు అతని జీవితంపై గొప్ప ప్రభావమును కలిగించాయి. ప్రపంచము ఎందుకు దుఃఖమయంగానున్నది అను ప్రశ్న గౌతముని త్రీవముగా కలవరపరచింది. ఈ సమస్యకు పరిష్కార మార్గము కనుగొనవలెనని అతడు నిశ్చయించుకొని ఆనాటి రాత్రి సర్వస్వమును త్యజించి తన రథసారధి చెన్న సహాయంతో అరణ్యాలకేగినాడు. దీనినే బౌద్ధమతంలో మహాభినిష్క్రమణ అని అందురు.

**6.10.4 తపస్సాధనము :** గౌతముడు సమస్త సంపదను, రాజ్యమును, భార్యా కుమారుని త్యజించిన పిమ్మట రాజగృహాన్ని చేరాడు. అచట కొంతమంది వేద పండితులవద్ద ధర్మశాస్త్రములన్నింటిని క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. ఆ తదుపరి వేదములన్నింటిని అవగాహన చేసుకొన్నాడు. ఆరామ కలామ అను తత్త్వజ్ఞుని వద్ద యోగాభ్యాసాన్ని చేశారు. 6 సంవత్సరాలు శరీరాన్ని శుష్కింప జేసి జ్ఞానోదయం

కాలేదని ఆ మార్గాన్ని వదలి చివరకు గయలోని బోధివృక్షం క్రింద ధ్యాన నిమగ్నుడయి యుండ తుదకు అతనికి 35 వ ఏట జ్ఞానోదయమయింది. దీనినే "సంబోధి" అంటారు. గౌతముడు బుద్ధుడయినాడు.

**6.10.5 ధర్మచక్ర ప్రవర్తనము :** జ్ఞానోదయం అయిన తరువాత బుద్ధుడు మొదట సారనాథ్ చేరెను. అచట గల జింకల పార్క్‌లో తన ఐదుగురి శిష్యులకు తాను కఠోర దీక్ష ద్వారా కనుగొనిన సత్యాలను బోధించాడు. దీనినే ధర్మ చక్ర ప్రవర్తన యందురు.

**6.10.6 మహాపరినిర్యాణము :** జ్ఞానోదయమైన పిమ్మట బుద్ధుడు తాను కనుగొనిన సత్యాలను తాను నమ్మిన సిద్ధాంతాలను దేశవ్యాప్తంగా ప్రచారం చేయుచూ విస్తృత పర్యటన చేసి విశేష ప్రజానీకమును ఆకర్షించెను. తుదకు బుద్ధుడు తన 80వ ఏట క్రీ.పూ. 487లో కుసి నగరం చేరి నిర్యాణం పొందాడు. దీనినే మహాపరినిర్యాణము అని అందురు.

**6.10.7 బుద్ధుని బోధనలు :** బుద్ధుని బోధనల ప్రకారం ప్రపంచంలో ప్రతి సంఘటన ఏదో కారణం వల్ల జరిగి ఫలితాన్ని అనుభవిస్తుంది. అనగా మానవుని జీవితం ఒక కారణము వలన కలిగినది. కలిగిన జన్మ దుఃఖంతో కూడుకొన్నది. ఈ దుఃఖ పూరితమయిన జన్మ కలగడానికి కారణం కోరిక. కోరిక అజ్ఞానం వలన కలుగుతుంది. కావున అజ్ఞానం తొలగించు కొనవలెనన్న జ్ఞానాన్ని సంపాదించవలెను. జ్ఞానం పొందగనే జనన మరణ బంధనుండి విముక్తి లభిస్తుంది. ఇదియే నిర్యాణం అని బుద్ధుడు తెలియజేసెను దీనిని బుద్ధుడు నాలుగు సూత్రాలలో తెలిపాడు. వీనినే ఆర్యసూత్రాలంటారు. అవి 1. ప్రపంచం దుఃఖమయం 2. దుఃఖానికి కారణం కోరిక 3. దుఃఖం పోవలెనన్న కోరిక నశించాలి. 4. కోరిక నశించాలన్న అష్టాంగ మార్గాన్ని అనుసరించాలి. అవి 1. సమ్యక్ వాక్ 2. సమ్యక్ క్రియ 3. సమ్యక్ జీవనం 4. సమ్యక్ శ్రమ 5. సమ్యక్ ఆలోచన 6. సమ్యక్ ధ్యానం 7. సమ్యక్ నిశ్చయం 8. సమ్యక్ దృష్టి. వీటిని అనుసరించుట వలన కోరికలు, అజ్ఞానం నశించును. సమాధి (mental control), ప్రజ్ఞ (intellectual development) కలిగిన జ్ఞానం లభిస్తుంది. జ్ఞాని నిర్యాణానికి అర్హుడగును. అనగా పునర్జన్మలేని మోక్షం లభించును. బౌద్ధంలో వైదిక మతంలో వలెనే వ్యయప్రయాసలతో కూడిన యజ్ఞయాగాది క్రతువులు కాని, హింసతో కూడిన జంతుబలులు గాని లేవు. అదే విధంగా జైన మతంలోని సల్లేఖనం వంటి కఠోర ఉపవాస దీక్షలు కూడా లేవు. అందువలననే బౌద్ధం "మధ్యేమార్గం" గా ప్రసిద్ధి చెందింది. మహావీరుని వలెనే బుద్ధుడు వేదమే పరమ ప్రమాణమనే సిద్ధాంతాన్ని అంగీకరించలేదు. యజ్ఞయాగాదులు వాటికి సంబంధించిన జంతుబలులను నిరసించాడు. దేవుడు ఉన్నాడని, లేడని వాదోపవాదాలకు దిగలేదు. ఆత్మతత్త్వాన్ని అంగీకరించలేదు. మానవ శరీర, ఆత్మల సంబంధాన్ని గుర్తించ లేదు. బుద్ధుడు శాశ్వతమైన, అమరమైన ఆత్మను నమ్మలేదు. మానవుని మరణానంతరం ఆత్మ శూన్యంలో కలిసిపోతుంది. ఆత్మ మానవుని కోరికల సంపుటి. ఆత్మకు స్వతంత్ర ప్రతిపత్తి లేదు అన్నాడు. మానవుడు మరణానంతరం జీవాత్మ శూన్యంలోకి వెళ్ళి మరొక శరీరంలో ఎట్లు ప్రవేశిస్తుందో చెప్పలేదు. మానవ జీవితం కర్మ మీద ఆధారపడి యున్నది. వ్యక్తి సుఖదుఃఖములకు అతని చర్యలే కారణం కనుక ప్రార్థన, యజ్ఞం, భగవంతుడు కర్మను మార్చలేవు. కర్మ ఫలితాన్ని అనుభవించి తీరవలసిందే. మానవునిలోని అజ్ఞాన విజ్ఞానాలన్నియు పూర్వ ఖర్మ ఫలితాలే. అట్లే ఈ జన్మలో చేసిన కర్మలు సుఖదుఃఖాల నుండి, పునర్జన్మ నుండి విముక్తి పొందవచ్చును. అనగా వ్యక్తి నిస్సహాయుడు కాదని అతనికి కర్మ చేయుటకు, చేయకుండుటకు స్వేచ్ఛఉన్నదని భావించాడు. కర్మను అమితంగా పెంచేది జీవహింస. కనుక నిశ్చలవంతుడై అహింసయే పరమధర్మం అని విధిగా పాటించాలన్నాడు. తన శిష్యులు సక్రమముగా ధర్మాన్ని అనుసరించడానికి సంఘను ఏర్పాటు చేసినాడు. ఈ సంఘంలో ప్రవేశమునకు త్రిరత్నాలను అంగీకరించవలెను. అవి. 1. బుద్ధుడు 2. ధర్మము. 3. సంఘం. ఈ మూడింటిని శరణువేడిన వారు బౌద్ధానికి అర్హులు. తన పెంపుడు తల్లి ప్రజాపతి కోరిక పైన స్త్రీలను కూడా సంఘంలో చేర్చుకొనెను.

## 6.11. బౌద్ధమత వ్యాప్తి పతనం

**6.11.1 బౌద్ధమత వ్యాప్తి :** బుద్ధుని వ్యక్తిత్వం, రాజాదరణ; బౌద్ధ సంఘాల కృషి, నిరాడంబరమైన సిద్ధాంతాలు ప్రజలకు అర్థమగుభాషలో ప్రచారము గావించుట, కాలానుగుణముగా మార్పు స్వభావం మొదలైనవి బౌద్ధమత వ్యాప్తికి ఉపకరించినవి. బుద్ధునిలో గొప్ప ఆకర్షణ శక్తి గలదు. ఆయన అహింసా సత్యవ్రతములను త్రికరణ శుద్ధిగా ఆచరించాడు. తన అసాధారణ వాదనా పటిమతో తన సిద్ధాంతాలను అంగీకరింప జేసాడు. సామాన్య మానవులకు నేర్పుగా తన ధర్మాన్ని వివరించేవాడు. బుద్ధుని శిష్యులు ఆనంద, మహాకాస్యప బౌద్ధమత వ్యాప్తికి నాయకత్వం వహించారు. బౌద్ధమత వ్యాప్తికి అశోకుడు, కనిష్కుడు, హర్షుడు చేసిన కృషి చారిత్రాత్మకమైనది. వారు బౌద్ధ విహారాలను, స్తూపాలను, చైత్యాలను నిర్మించుటకు, మత ప్రచారకులను దేశం నలుమూలలకు, విదేశాలకు పంపుటకు ప్రభుత్వ నిధులను వెచ్చించారు. అశోక, కనిష్కుల కృషి ఫలితంగా పాహియాన్, హ్యూయాన్ త్సాంగ్‌లను చైనా యాత్రికులు బౌద్ధ గ్రంథాలను పఠించి, ధర్మవ్యాప్తి

చేసారు. బుద్ధుని నిర్వాణానంతరం అజాత శత్రుని కాలంలో రాజగృహమందు బౌద్ధులు మొదటి సమావేశం జరిపిరి. దీనినే ప్రథమ సంగీతి అని అందురు. ఈ సమావేశమునకు మహాకశ్యపుడు అధ్యక్షత వహించెను.

ఈ సమావేశంలో బుద్ధుని ఉపదేశాలన్నింటిని గూర్చి రెండు సంపుటాలుగా వ్రాసిరి. వీనిని వినయ, సుత్త పిటకములని పిలిచారు. రెండవ సంగీతి కాలాశోకుని కాలంలో వైశాలియందు జరిగెను. నాటికి బౌద్ధమతం ఆంధ్రదేశం మొదలైన దూర ప్రాంతాలకు కూడ విస్తరించింది. క్రొత్త ప్రాంతాలలో విస్తరించడం వల్ల బౌద్ధ భిక్షువుల ఆచారాలలో విభేదాలు పొడచూపినాయి. బౌద్ధ సంఘంలో మార్పు రావలెనని వైశాలి భిక్షువులు పట్టుబట్టారు. ఈ సమస్య పరిష్కరించడానికి రెండో సంగీతి జరిగింది. ఈ సమస్యపై తీవ్ర అభిప్రాయ భేదాలు రావటంతో బౌద్ధ సంఘం రెండుగా చీలింది. మార్పులు కావలెనన్న వారు మహా సాంఘికులైనారు. పూర్వాచార పరాయణులు స్థవిరవాదులు - థేరవాదులైనారు. బౌద్ధ సంఘంలో ఐక్యత సాధించుటకు అశోకుడు మూడవ సంగీతిని పాటలీపుత్రంలో ఏర్పాటుచేశాడు. ఈ సభలో పెద్ద గ్రంధాలను చర్చించి అభధమ్మ పిటకం వ్రాయబడింది. ఈ సమావేశంలో బౌద్ధుల మధ్య ఐక్యత సాధించుటకు అశోకుడు చేసిన ప్రయత్నం ఫలించలేదు. కనిష్కుడు కుందలవనంలో నాలుగో సంగీతిని ఏర్పరచి బౌద్ధ సంఘాన్ని ఉద్ధరించడాన్కి ప్రయత్నించాడు. కాని నాటికే బౌద్ధమతంలో హీనయాన, మహాయాన అను చీలికలేర్పడ్డాయి. బౌద్ధము ఆడంబరాలతో పనిలేని మతం. బుద్ధుడు ప్రజలను నీతిగా జీవించండని బోధించాడు. బుద్ధుడు మత ప్రచారం కొరకు ప్రజలు వాడు 'పాలీ' బాషను ఉపయోగించాడు.

**6.11.2 బౌద్ధమత పతనం :** అహింసా సూత్రాలు సామాన్యులకు ఆచరణ సాధ్యంకాలేదు. బౌద్ధ బిక్షువులలో నైతిక ప్రమాణాలు దిగజారినాయి. మత ప్రచారానికి సరియైన వారసుడు లేక మత ప్రచారంగూడా కుంటుపడింది. హిందూ మత లక్షణాలైన విగ్రహారాధన, ఉత్సవాలు బౌద్ధమతంలో ప్రవేశించి బౌద్ధమతం తన వ్యక్తిత్వాన్ని పోగొట్టుకుంది. శుంగులు, గుప్తులు హైందవ మతాన్ని ఆదరించారు. హైందవ మతాచార్యులు హైందవ మతాన్ని పునరుద్ధరించారు. శంకరాచార్యుడు దేశమంతా తిరిగి బౌద్ధాన్ని రూపుమాపాడు. బుద్ధుడు విష్ణుమూర్తి అవతారం అని ప్రకటించారు. దానితో బౌద్ధమతం హైందవ మతంలో కలిసిపోయింది. శక, పహ్లవ, ముస్లిం దండయాత్రలు బౌద్ధమతాన్ని, బౌద్ధ ఆరామాలను తుడిచి పెట్టినవి. పై కారణాల వలన బౌద్ధమతం భారతదేశంలో అదృశ్యం అయినది. కాని చైనా, జపాన్, శ్రీలంక మొదలగు దేశాలలో బౌద్ధం నేటికి ప్రముఖ మతం.

## 6.12. బౌద్ధ, వైదిక మతాల మధ్య సామ్యములు, వ్యత్యాసాలు

కర్మ, పునర్జన్మ మోక్షం అను భావాలు వైదిక మతానికి చెందినవి. బౌద్ధులు అవలంబించు సన్యాసము హిందువుల సాంఖ్యతత్వానికి చెందినవి. బుద్ధుని నాలుగు ఆర్యసూత్రాలు హిందూ ఉపనిషత్తులలో చర్చించబడినవి.

వైదిక మతం భగవంతుని ఉనికిని అంగీకరించును. బౌద్ధమతం భగవంతుని చర్చ నిష్ప్రయోజనమనెను. బౌద్ధమతం వేదాలను ప్రమాణాలుగా అంగీకరించదు. హిందూమతం వర్ణ వ్యవస్థను బ్రాహ్మణాధిక్యతను అంగీకరించెను. బౌద్ధమతం వీనిని తిరస్కరించి సర్వ మానవులు సమానమని అందరూ మోక్షానికి అర్హులని చెప్పెను. హిందూ మతం ఆత్మకు మరణం లేదనెను. కాని బౌద్ధమతం మరణించిన ఆత్మశూన్యంలో కలిసి పోవుననెను.

## 6.13. భారతీయ సంస్కృతికి జైన, బౌద్ధ మతాలు చేసిన సేవ

1. కుల, వర్గ బేధాలు లేకుండా అందరూ నిర్వాణ ప్రాప్తికి అర్హత కల్గిన వారేనని ఈ మతాలు ప్రకటించాయి. ఈ సిద్ధాంతం దేశంలో చెప్పుకోదగినంత ఆచరణలోనికి రాకపోయినా సంఘ సంస్కర్తలైన శంకర, రామానుజ, నానక్, రామకృష్ణులకు లక్ష్యమయ్యింది. ఈ తత్వాన్ని అమలులో పెట్టుటకు అనేక ప్రయత్నాలు జరిగాయి.
2. భాగవత ధర్మం ప్రచారంలోనికి రావటానికి బౌద్ధ ధర్మం కొంతవరకు కారణం. అహింసతో కూడిన దైవభక్తి, ఇష్టదైవాన్ని పూజా ద్రవ్యాలతో ఆరాధించుట, సమిష్టి భజనల ద్వారా భక్తి సంఘాలను నిర్మించుట, మొదలైనవి బౌద్ధ ధర్మ ప్రభావమే.
3. మానవసేవ ద్వారా బుద్ధుడు మత సిద్ధాంతాలను ప్రబోధించినాడు. ఆయన ఆదర్శాన్ని తీసుకొని అశోకుని వంటిరాజులు తమ ధనాన్ని మానవసేవకు వినియోగించారు. ఆ సేవాభావాన్ని క్రైస్తవ మిషనరీలు, రామక్రిష్ణ మిషన్, ఆర్యసమాజం వంటి సంస్థలు చేపట్టి మతంలో మానవత్వానికి ప్రముఖస్థానాన్ని కల్పించాయి.

4. వాదోపవాదాల ద్వారా బుద్ధుడు తన ప్రత్యర్థులను ఓడించాడు. శంకరుడు, రామానుజుడు, మధ్వాచార్యుడు మొదలగువారు అదే మార్గాన్ని అవలంభించి ప్రత్యర్థులనే వాదంలో ఓడించి తమ తమ సిద్ధాంతాలను వ్యాప్తి చేశారు.

5. స్త్రీల పట్ల గౌరవం చూపించడం బౌద్ధమతస్థుల రూపకల్పనమే. నిర్వాణప్రాప్తికి స్త్రీలు కూడా అర్హులని, పాటుపడగలరని, వారికి సమర్థత వుందని నిరూపించబడింది. ఇదే మార్గంలో మీరాబాయి, సక్కుబాయి మొదలగువారు కీర్తి గడించారు.

6. దేవాలయాల నిర్మాణం బౌద్ధుల వారసత్వమే. బౌద్ధులు నిర్మించిన స్థూపాలు, చైత్యాలు, శిలలమీద బుద్ధుని చెక్కుట, సుందర శిల్ప, చిత్రలేఖనాల ద్వారా గొప్పవారి జీవితాలలోని సంఘటనలను చిత్రించుట ద్వారా ప్రభోధించడాన్ని హిందూ మతస్థులు అవలంభించారు.

7. సామాజిక జీవితంలో అహింస, సత్యాలకు బౌద్ధం ఉన్నత స్థానం ఇచ్చింది. హిందూ రాజులు తమతమ రాజ్య పరిసరాలలో జంతుబలులను నిషేదించి పశుసంపదాభివృద్ధికి, వ్యవసాయాభివృద్ధికి తోడ్పడ్డారు.

8. విగ్రహారాధన, దేవాలయ నిర్మాణం మొదలగు మహాయాన బౌద్ధ సాంప్రదాయాలను హైందవులు స్వీకరించారు. అలాగే బౌద్ధ సన్యాసుల వ్యవస్థను శంకర, రామానుజ మొదలగువారు అవలంభించి తమ మతాలను వ్యాప్తి చేసుకొన్నారు.

9. విదేశీజాతుల వారైన గ్రీకులు, కుషాణులు బౌద్ధమతావలంబకులై హిందూదేశంలో స్థిరపడి హిందూసమాజంలో కలిసిపోయినారు.

10. బౌద్ధ భిక్షువులు ఆసియా ఖండంలోని వివిధ దేశాలకు వెళ్ళి ధర్మప్రచారం చేసారు. వీరితోబాటు భారతీయ నాగరికతా సంస్కృతులు విదేశాలకు వ్యాపించాయి.

11. కళాభివృద్ధికి, విద్యాభివృద్ధికి ముఖ్యంగా శాస్త్ర అభివృద్ధికి, ప్రాంతీయ భాషల వృద్ధికి జైన బౌద్ధాలు గొప్పసేవ చేసినవి.

## 6.14. సమీక్ష

జైనమతం వైదికమతం కన్నా ప్రాచీనమైనదికాకపోయినను బౌద్ధం కంటే ప్రాచీనమైంది. జైన మతం ఏ కాలంలోనూ అత్యంత విస్తృతముగా విజృంభింపకున్నను, భారతీయ సంస్కృతిని రూపుదిద్ది భారతదేశములో ఒక బలవత్తరమైన శాఖగా రూపొందినది. ఇది సనాతన వైదిక మతానికి చాలా సన్నిహితంగా ఉండుట వలనను, ఇతర మతాలతో విద్వేషము లేకుండుట వలన జైనమతం నేటికీ భారతదేశంలో అనేక ప్రాంతాలలో మనుగడ సాగించుచున్నది. బౌద్ధమతం భారతదేశంలో అంతరించినను విదేశాలకు వ్యాప్తి చెంది నేటికి కొనసాగుతున్నది. బౌద్ధమతం ప్రపంచానికి శాంతిని, అహింసా సిద్ధాంతాలను అందించినందున ప్రపంచ శాంతిని కాంక్షించిన ఘనత భారతదేశానికి దక్కింది.

## ప్రశ్నలు

**I. వ్యాస ప్రశ్నలు :**

1. వర్థమాన మహావీరుని జీవితాన్ని బోధనలను వివరింపుము ?
2. బుద్ధుని జీవితాన్ని, అతని బోధనలను వివరింపుము ?

**II. సమస్య పూరిత పశ్నలు :**

1. జైన బౌద్ధ మతాల ఆవిర్భవించుటకు దోహదపడిన పరిస్థితులను వివరింపుము.
2. భారతీయ సంస్కృతికి జైన, బౌద్ధాలు చేసిన సేవ ఎట్టిదో తెలుపుము.

**III. లఘుటీక ప్రశ్నలు :**

**ఈ క్రింది వాటిని క్లుప్తంగా జవాబులు వ్రాయుము**

1. పార్శ్వనాధుడు
2. బౌద్ధమత వ్యాప్తి
౩ అజాత శత్రువు

IV. కుశాగ్ర బుద్ధి పరీక్ష

I. ఈ క్రింది ప్రశ్నలకు a,b,c,d,e లు అని ఐదు సమాధానములున్నవి. వాటిలో ఒకటి మాత్రమే సరియైన సమాధానము. ఏది సరియైన సమాధానము దానికి ముందు ఇవ్వబడిన అక్షరమును బ్రాకెట్‌లో వ్రాయండి.

1. తీర్థంకరులలో 23 వ వాడు ( )
   a) మహావీరుడు b) పార్శ్వనాథుడు
   c) బుద్ధుడు d) ఆదినాథుడు e) అశోకుడు
2. మహావీరుడు తన బోధనలను ఈ భాషలో బోధించినాడు. ( )
   a) అర్థమాగధి b) బ్రాహ్మి
   c) సంస్కృతం d) తెలుగు e) హిందీ
3. జైనులకు గల మరొక పేరు ( )
   a) బౌద్ధులు b) శ్వేతాంబరులు
   c) దిగంబరులు d) గ్రంధులు e) మహాయానులు
4. గౌతమ బుద్ధుడు ఇక్కడ జన్మించెను ( )
   a) నేపాల్ b) కుశి
   c) సారనాథ్ d) గయ e) లుంబినీవనం
5. మహాయానమతాన్ని వ్యాప్తి చేసిన వాడు ( )
   a) అశోకుడు b) కనిష్కుడు
   c) బింబిసారుడు d) బుద్ధుడు e) మహావీరుడు

II. జతపర్చుము

| గ్రూపు - A | గ్రూపు - B |
|---|---|
| 1. గోమతేశ్వరుడు | (a) జైనుల స్త్రీ దేవత |
| 2. విద్యాదేవి | (b) శ్రావణ బెళగోళ |
| 3. చరకుడు | (c) మహాయానము |
| 4. నాగార్జునుడు | (d) చరకసంహిత |

**అభ్యాసాలు :**

1. జైన మత వ్యాప్తికి కారణాలు తెలిపి అది నేటికి భారతేశంలో ఎందుకు నిలిచి ఉందో తెలపుము ?
2. బౌద్ధ, వైదిక మతాల మధ్య సామ్యములు వ్యత్యాసాలు తెలుపుము ?

**ఉపయుక్త గ్రంథాలు :**


1. వారణాసి యశోదా దేవి : భారతదేశ చరిత్ర , సంస్కృతి, ప్రథమబాగం, తెలుగు అకాడమి ప్రచురణ.
2. Romila Thaper : History of India, Vol 1
3. A.L. Bsaham : The wonder that was India
4. R.C. Majumdar : Advanced History of India H.C. Raychandari & K. Datta
5. R. Sathianatha Aiyar : History of India Vol I
6. K.A. Nilakanta sastri : History of India, Vol 1
7. D.D. Kosambi : The culture and civization of Ancient India - A Historical outline.


రచయిత
వి.కె. మోహన్

పాఠం - 7

# అలెగ్జాండర్ దండయాత్ర - ఫలితాలు

## 7.1. లక్ష్యం

మౌర్య సామ్రాజ్య స్థాపనకు మునుపు భారతదేశంపై జరిగిన విదేశీయుల దండయాత్రల గురించి వానివలన కలిగిన రాజకీయ, సాంస్కృతిక ఫలితాలను గురించి అధ్యయనం చేయడమే ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

**ముఖ్యాంశ సంగ్రహం**

7.2. ఆధారాలు

7.3. ఉపోద్ఘాతం

7.4. పారశీక దండయాత్ర ఫలితాలు

7.5. గ్రీకుల దండయాత్ర ఫలితాలు

7.6. సమీక్ష

## 7.2. ఆధారాలు :

1. శాసనాలు, క్షత్రపులచే జారీ చేయబడిన ఖరోష్టి లిపిలోని శిలాశాసనాలు

2. నాణాలు

3. **సాహిత్యం :** హెరాడొటస్, టిసియస్, స్ట్రాబో, ప్లినీ, ఆరియన్, కర్టియస్, డయోడోరస్, ప్లూటార్క్, జస్టిన్ మొదలగు వారి రచనలు, అవెస్తా.

## 7.3. ఉపోద్ఘాతం

క్రీ.పూ. 6వ శతాబ్దం ఆరంభంలో ఉత్తర భారతదేశంలో 16 జన పథాలు, కొన్ని గణరాజ్యాలు ఏర్పడి ఉన్నట్లు చదివినారు. ఈ రాజ్యాలు పరస్పరం యుద్ధాలలో నిమగ్నమయి ఉండేవి. ఈ సమయంలోనే భారతదేశపు వాయవ్య సరిహద్దులు రక్షణ లేక విదేశీదండయాత్రలకు గురికావలసి వచ్చినవి. ప్రప్రథమంలో పారశీక చక్రవర్తులు వాయువ్య భారతంలో అధిక భాగమాక్రమించి తమ సామ్రాజ్యంలో కలుపుకొన్నారు. వారి తరువాత గ్రీకులు ఆ ప్రాంతాలను జయించారు. ఈ విదేశ దండయాత్రల వల్ల ఆ ప్రాంతాలలోని చిన్న రాజ్యాలబలం క్షీణించింది. అందుమూలంగా మౌర్య చంద్రగుప్తుని సామ్రాజ్య నిర్మాణానికి త్రోవ ఏర్పడింది. భారతదేశానికి గ్రీకుదేశానికి రహదారులు ఏర్పడ్డాయి. ఉభయ దేశాలకు పరస్పరం వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం మన పరిశీలనా పరిధిలో విదేశీయ రాజ వంశాల పాలన అందు ముఖ్యంగా గ్రీకులు, వారి పాలనా ఫలితాలు ప్రస్తావించబడు విషయాలు.

## 7.4. పారశీక దండయాత్ర, ఫలితాలు

**7.4.1 పారశీక దండయాత్ర :** మగధ రాజకీయాధిక్యాన్ని సాధిస్తున్న సమయంలోనే భారతదేశపు వాయవ్య సరిహద్దులు రక్షణ లేక పారశీక, గ్రీకు దండయాత్రలకు గురికావలసి వచ్చింది. ప్రప్రథమంగా పర్షియారాజు సైరస్ (క్రీ.పూ. 558-530) తూర్పువైపుగా దండెత్తివచ్చి

గాంధారమును, హిందూకుష్ పర్వతాలలోని కొండజాతులను, కాబూలులోయలోని గండరియనులను జయించాడు. కాని భారతదేశ ప్రాంతాలను సైరస్ జయించలేదని గ్రీకు చరిత్రకారులు వ్రాసారు. సైరస్ తరువాత సించెసిన పర్షియా రాజైన డేరియస్ క్రీ.పూ. 522-486 తన రాజ్యాన్ని భారతదేశంలో విస్తృతపరిచినాడు. క్రీ.పూ. 518-515 సంవత్సరాల మధ్య కాలానికి చెందిన ఈతని బెహిసూన్, పెర్సిపోలిస్ మొదలగు శాసనాల వలన అతని సామ్రాజ్యంలో గాంధార, సింధు ప్రాంతాలున్నాయని తెలియ వస్తున్నది. అందువల్ల డేరియస్ క్రీ.పూ. 517 ప్రాంతాన వాయవ్య భారతదేశాన్ని ఆక్రమించాడని చెప్పవచ్చు. హెరాడొటస్ అను గ్రీకు చరిత్రకారుడు డేరియస్ సామ్రాజ్యంలో ఇండియాను 20వ రాష్ట్రంగా పేర్కొన్నాడు. బంగారం రూపంలో భారతదేశం చెల్లించే కప్పం పారశీక సామ్రాజ్య ఆదాయంలో మూడోవంతుగా ఉండేదిట. డేరియస్ క్రీ.పూ. 517లో స్కైలాక్స్ ఆధ్వర్యాన సింధునదిని పరిశోధించడానికి ఒక నౌకా దండయాత్రను పంపినాడు. డేరియస్ తరువాత పర్షియా చక్రవర్తి అయిన క్సెర్క్సెస్ (క్రీ.పూ. 468-465) గ్రీసుతో యుద్ధాలలో పాల్గొనడానికి ఒక భారతీయ సైనిక దళాన్ని రప్పించాడు. ఇందులోని సైనికులు గాంధార, సింధు ప్రాంతాల వారు. గ్రీసు పర్షియా దేశాల మధ్య థెర్మోపలె వద్ద జరిగిన యుద్ధంలో భారతీయ సైన్యాలు ఎంతో శ్రమించి శౌర్యసాహసాలతో పోరాడాయి. భారతదేశంపై పారశీకుల పాలన క్రీ.పూ. 330 వరకు కొనసాగింది. పారశీక చక్రవర్తులలో చివరివాడైన 3వ డేరియస్ గ్రీకు రాజైన అలెగ్జాండరు దండయాత్రను ఎదిరించడానికి భారతీయ సైన్యాలను పంపమని కోరాడు. అందువల్ల ఒక భారతీయ సైనిక దళము బాక్ట్రియా క్షత్రపుని క్రిందను, మరొక భారతీయ పర్వత సైనికదళం అరఖోసియా క్షత్రపుని ఆధ్వర్యాన గ్రీకు సేనలతో పోరాడాయి. ఈ అంశాల వల్ల పారశీకుల క్రింద ఉన్న భారతదేశ భాగాలకు ప్రత్యేక పారశీక క్షత్రపుడు లేడని తెలుస్తుంది. అందువల్లనే భారతీయ సైనిక దళాలు ఇతర రాష్ట్ర క్షత్రపుల కింద పోరాడ వలసి వచ్చింది. ఈ కారణం వల్లనే భారతదేశంపై పారశీక అధికారం త్వరలో క్షీణించింది.

**7.4.2 పారశీక దండయాత్ర ఫలితాలు** : పారశీకుల పలుకుబడి వాయవ్య భారతానికి మాత్రమే పరిమితమయినప్పటికి, ఈ దండయాత్రలవల్ల భారతదేశానికి మధ్య ఆసియా రాజ్యాలకు సన్నిహిత సంబంధాలేర్పడ్డాయి. ఆ రాజ్యాల ద్వారా పడమర గ్రీస్ వరకు ఉన్న రాజ్యాలతో పరిచయమేర్పడింది. భారతీయ వర్తకులు సువిశాల పారశీక సామ్రాజ్యంలో వివిధ భాగాలలో తమ వస్తువులను విక్రయించి అపార ధనాన్ని ఆర్జించారు. పారశీక చక్రవర్తులు భారతదేశం నుండి కప్పం రూపంలో అపారధనాన్ని తరలించుకొనిపోయారు. పారశీక క్షత్రపులు భారతదేశంలో ఖరోష్ఠి లిపిలో శిలాశాసనాలు వ్రాసే పద్ధతిని ప్రవేశపెట్టారు. ఈ పద్ధతిని క్రీ.పూ. 4వ శతాబ్దం వరకు కొనసాగింది. పారశీక దండయాత్రల తరువాతనే భారతదేశంలో శిలానిర్మాణాలు ప్రారంభమై పారశీక వాస్తు శిల్పాలు దేశీయ పద్ధతులను ప్రభావితం చేసాయి. మౌర్యుల రాజధాని పెర్సిపోలిస్ వాస్తును పోలి ఉంది. అశోక శిలాస్తంభాలపైన కిరీటాలు వానిపై మెరుగు, పారశీకులననుసరించి తయారుచేసినవేనని కొందరి పండితుల అభిప్రాయం. పారశీక సూర్యారాధన వృద్ధి చెందెను. పారశీక నాణాల పద్ధతి భారతదేశంలోనికి దిగుమతి చేయబడింది.

## 7.5. గ్రీకుల దండయాత్ర, ఫలితాలు

7.5.1. ప్రాచీన కాలంలో భారతదేశంపై జరిగిన దండయాత్రలలో గ్రీకుల దండయాత్ర ప్రముఖమైనది. వి.డి. మహాజన్ మాటలలో "అలెగ్జాండర్ దండయాత్రా కాలము భారతీయ కాలమాన శాస్త్రములో మైలురాయి వంటిది". అలెగ్జాండర్ తన దండయాత్రాకాలంలో భారతదేశములో 19 నెలలు గడిపినను ఆయన దండయాత్ర భారతదేశ చరిత్రపై శాశ్వత ప్రభావమును చూపింది.

**7.5.2. అలెగ్జాండర్ తొలి దండయాత్రలు** : గ్రీకునగర రాజ్యాలలో ఒకటైన మాసిడోనియా రాజైన ఫిలిప్ కుమారుడు అలెగ్జాండరు. తన తండ్రి మరణానంతరము క్రీ.పూ. 335 లో అలెగ్జాండర్ మాసిడోనియా పాలకుడయ్యాడు. గొప్ప సామ్రాజ్యకాంక్ష కలిగిన అలెగ్జాండర్ రాజైన వెంటనే తన సైన్యమును అత్యంత శక్తివంతంగా తీర్చిదిద్దాడు. ఆ తరువాత తన తండ్రి మరణానికి కారకులైన పారశీక చక్రవర్తి మూడవ దరయస్‌ను అలెగ్జాండర్ ఓడించి వధించి క్రీ.పూ. 330 సంవత్సరంలో అతని రాజధాని పెర్సిపోలిస్‌ను దగ్ధం చేసాడు. పారశీకం మీదికి దండెత్తడానికి పూర్వమే అలెగ్జాండరు ఈజిప్టు, సిరియా ప్రాంతాలను ఆక్రమించాడు. పెర్సపోలిస్‌ను దగ్ధంచేసిన తరువాత కాందహార్, అలెగ్జాండ్రియా, చర్షన, చెద్రేరి ప్రాంతాలను జయించాడు. క్రీ.పూ. 327 నాటికి పర్షియా పూర్తిగా అలెగ్జాండర్ ఆధీనం క్రిందికి వచ్చింది. తాను ఆక్రమించిన ప్రాంతాలలో రక్షణ కోసం సైనిక స్థావరాలు ఏర్పాటు చేసాడు. క్రీ.పూ. 327 మే నెలలో అలెగ్జాండరు దృష్టి భారతదేశం వైపు మళ్ళింది.

**7.5.3. అలెగ్జాండర్ భారతదేశంపై దాడికి కారణాలు :** ప్రపంచాన్నంతటిని జయించాలని అపరిమిత ఆకాంక్ష అలెగ్జాండరుకుంది. ఆనాటి భౌగోళిక పరిజ్ఞానం ప్రకారం ప్రపంచానికి తూర్పు సరిహద్దు రాజ్యంగా ఉన్న భారతదేశాన్ని జయించ సంకల్పించాడు. భారతదేశాన్ని గురించి ముఖ్యంగా కాశ్మీర్ లోయ సౌందర్యాన్ని గూర్చి గ్రీకు చరిత్రకారుడైన హెరాడొటస్ రచించిన రచనలను చదివి అలెగ్జాండర్ గొప్పగా ప్రభావితుడై భారతదేశంపై దండయాత్ర చేయ నిశ్చయించుకొన్నాడు. భారతదేశం యొక్క సిరిసంపదలను గూర్చి గ్రీకు రచయితలు వర్ణించగా అలెగ్జాండర్‌కు నోరు ఊరింది. కనుక భారతదేశాన్ని తన స్వాధీనం చేసుకొని సమస్త భోగభాగ్యాలకు యజమాని కావాలని సంకల్పించాడు. పశ్చిమోత్తర భారత భూభాగాలు పూర్వం పర్షియా సామ్రాజ్య భాగాలు. వీటిని జయింపనిచో తన పర్షియా దండయాత్ర సంపూర్ణ కాదని అలెగ్జాండర్ నిర్ణయించాడు. గ్రీకులకు వ్యతిరేకంగా పర్షియా వారి తరపున యుద్ధము చేసిన భారతీయ వీరులకు గ్రీకు ఖడ్గాన్ని చవి చూపించి గుణపాఠం నేర్పకోరాడు. అలెగ్జాండర్ గురువు అరిస్టాటిల్ 'ఏక ప్రపంచ' నిర్మాతవు కమ్మని ఆశీర్వదించాడు. అందువలన అలెగ్జాండర్ తూర్పు పడమర, ప్రపంచ భూభాగాలను ఏకసామ్రాట్ పాలన క్రిందికి తీసుకొని రావాలని సంకల్పించాడు. ప్రపంచమంతటా గ్రీకు నాగరికతా సంస్కృతులను వ్యాపింపజేయవలెనని అలెగ్జాండర్ సంకల్పించాడు. పై కారణాలేగాక బాక్ట్రియాలో విడిది చేసిన అలెగ్జాండర్ వద్దకు భారతదేశంలోని వాయవ్య సరిహద్దు రాజ్యమైన తక్షశిల పాలకుడు అంభి అనేక కానుకలతో ఒక రాయబారిని పంపి భారతదేశంపై దండయాత్ర చేయవలసిందిగా ఆహ్వానించాడు.

**7.5.4 క్రీ.పూ. 327లో భారతదేశ రాజకీయ పరిస్థితి :** అలెగ్జాండర్ దండయాత్ర నాటికి (క్రీ.పూ. 327) భారతదేశం రాజకీయంగా అనేక స్వతంత్ర రాజ్యాలుగా విభజింపబడింది. పశ్చిమోత్తర భారత ప్రాంతం కూడ అనేక స్వతంత్ర రాజ్యాలుగా చీలిపోయి కలహించుకోసాగాయి. సరిహద్దుల రక్షణ పట్ల శ్రద్ధ వహించిన వారులేరు. తక్షశిల రాజధానిగా సింధు, జీలం నదుల మధ్యభాగాన్ని అంభి రాజు పాలిస్తున్నాడు. జీలం-చీనాబ్ నదుల మధ్య ప్రాంతాన్ని పురుషోత్తముడు రాజ్యమేలుచున్నాడు. సింధునదికి దిగువ భాగంలో క్షుద్రక, మాళవ, అంబష్ఠ, మౌషిక, శంభు మొదలగు జాతులు నివసించే చిన్న గణరాజ్యాలున్నాయి. గంగానదీ మైదానంలో బలమైన నందరాజ్యముంది.

**7.5.5 అలెగ్జాండర్ భారత దండయాత్ర :** పారశీక సామ్రాజ్యాన్ని ఆక్రమించిన తరవాత అలెగ్జాండర్ కాందహార్, బాక్ట్రియాలను ఆక్రమించి క్రీ.పూ. 327 మే నెలలో భారత దేశంపై దృష్టి మరలించాడు. అదే సమయంలో భారతదేశంలో తక్షశిల రాజైన అంభికి పౌరవ రాజైన పురుషోత్తమునకు వైరం ఏర్పడి అలెగ్జాండరును దండెత్తి రమ్మని ఆహ్వానించాడు. అదే అవకాశంగా తీసుకొని అలెగ్జాండర్ వెనక రక్షణ ఏర్పాట్లు చేసుకొంటూ 30,000 సైన్యంతో భారతదేశంపై దండెత్తి వచ్చాడు. అలెగ్జాండర్ సైన్యంలో గ్రీకు సైన్యాలు, బాల్కనుల నుంచి కొండజాతుల వారు, పర్షియా రౌతులు, ఫొనీషియన్ నావికులు ఉన్నారు. అలెగ్జాండర్ తన సైన్యాన్ని రెండు విభాగాలుగా చేసి ఒక భాగాన్ని తన నాయకత్వం క్రింద కాబూలు నది దక్షిణ తీరాన కైబరు కనుమ దాటి సింధూ వరకు పోయి తక్షశిల రాజు సహాయంతో పుష్కలావతిని ఆక్రమించాడు. తన సైన్యంతో అలెగ్జాండర్ గాంధారంపై దండెత్తాడు. దీని పాలకుడు అష్టక రాజు అలెగ్జాండర్ ను ఎదిరించి యుద్ధంలో చనిపోయాడు. ఈ రాజ్యాన్ని అలెగ్జాండర్ సంజయునికిచ్చి ఫిలప్స్ నాయకత్వంలో ఒక సైన్యాన్ని ఉంచాడు. ఆ తరువాత అలెగ్జాండర్ ఆధ్వర్యాన గ్రీకు సైన్యాలు అశ్వకులను, అండకులను జయించాయి. అస్సకనాయి రాణి అలెగ్జాండర్‌ను ఎదిరించింది. ఈమెను అలెగ్జాండర్ అభిసారుని సాయంతో ఓడించి బంధించి, 7 వేల మంది సైనికులను వధించాడు. అలెగ్జాండర్ దండయాత్ర అంతటిలోను దారుణమైన ఈ ఘాతుకచర్య అతని శీలానికి శాశ్వతమైన కళంకం తెచ్చిపెట్టింది. నయాసారాజు అలెగ్జాండర్‌తో సంధి చేసుకున్నాడు. ఈ పర్వత ప్రాంతాలను కాబూలులోయతో కలిపి కొత్త రాష్ట్రాన్ని సృష్టించి నికొనార్ ను పాలకుడుగా నియమించాడు. తరువాత అలెగ్జాండర్ వరణ పర్వతదుర్గాన్ని శశిగుప్తుడనే ద్రోహి సహాయంతో స్వాధీన పరచుకొన్నాడు. అనంతరం సింధు తీరంలో ఉభయ గ్రీకు దళాలు కలుసుకొన్నాయి. క్రీ.పూ. 326 సంవత్సరములో వసంత ఋతువులో అట్టక్ సమీపంలో ఓ హింద్ వద్ద అలెగ్జాండర్ సింధు నదిని దాటాడు. అతనికి అంభిరాజు స్వాగతము పలికాడు. అలెగ్జాండర్ తక్షశిలలో దర్బారు తీర్చి తాను పర్షియా నుంచి తెచ్చిన సువర్ణ, రజిత పాత్రలను, జరీ వస్త్రాలను అభిసారాది రాజ్యాల ప్రభువులకు పంచి పెట్టినాడు. వారు అలెగ్జాండరకుకు కానుకలు సమర్పించారు.

**7.5.6. పురుషోత్తమునితో యుద్ధము :** తక్షశిలకు సరసన ఉన్న పౌరవరాజు పురుషోత్తముడు తన రాజ్య స్వాతంత్ర్యం కాపాడటానికి అలెగ్జాండర్‌ను ఎదిరించడానికి నిశ్చయించుకొన్నాడు. జీలం నదికి ఇరువైపుల భారతీయ, గ్రీకు సైన్యాలు యుద్ధ సన్నాహాలు చేసాయి.

అలెగ్జాండర్ జీలం నది దాటే ప్రయత్నాలు ప్రారంభించాడు. నదిలో వరదలు వచ్చి ఉండటం వల్ల అర్ధరాత్రి వేళ నదికి ఎగువన 17 మైళ్ళ దూరానికి పోయి సైన్యంతో నదిని దాటి పౌరవ సైన్యంపై వెనకనుంచి దాడి చేసాడు. దాని ఫలితమే క్రీ.పూ. 326 లో జరిగిన జీలం యుద్ధం లేక హైడాస్పస్ యుద్ధం. ఈ యుద్ధంలో అలెగ్జాండర్ అశ్వదళ దాటికి పురుషోత్తముని సైన్యం తట్టుకొనలేకపోయింది. పురుషోత్తముని సైన్యాలు చెల్లాచెదురయ్యాయి. పోరస్ కుమారులు యుద్ధంలో మరణించారు. పురుషోత్తమునే గ్రీకులు పోరస్ అని పిలిచారు. గాయపడిన పోరస్ అలెగ్జాండర్‌కు బందీ అయ్యాడు. అలెగ్జాండర్ 'నిన్ను ఏ విధంగా ఆదరిస్తే నీకు సమ్మతం' అని ప్రశ్నిస్తే 'రాజువలె గౌరవింపుము' అని పోరస్ ఠీవిగా సమాధానమిచ్చాడట. అంతట అలెగ్జాండర్ పోరస్‌ను తన రాజ్యంలో తిరిగి నిల్పి అతని రాజ్యానికి సమీప ప్రాంతాలను కొన్ని జయించి ఆ రాజ్యంలో చేర్చాడు. ఆ తరువాత అలెగ్జాండర్ చీనాబ్, రావి నదులను దాటి, గణ రాజ్యాలపై దండెత్తి అక్కడి రాజ్యాలను జయించి బియాస్ నదిని చేరాడు.

**7.5.7 తిరోగమనం :** బియాస్ నదిని చేరగానే అలెగ్జాండర్ సైన్యాలు ముందడుగు వేయుటకు నిరాకరించాయి. గ్రీకు సేనలు స్వదేశం తిరిగి వెళ్ళాలని పట్టుబట్టారని కొందరి పండితుల అభిప్రాయం. భారత సైన్యాల ధైర్య సాహసాలు గ్రీకు సేనలను కలవరపరచి యుద్ధ విముఖులుగా చేసిందని మరికొందరంటారు. బియాస్ నదికి దక్షిణంగా ఉన్న నంద సామ్రాజ్య బలం వారిని భయకంపితుల్ని చేసిందని మరికొందరి అభిప్రాయం. అలెగ్జాండర్ తిరోగమించడం తప్పలేదు. అందువలన వచ్చిన దారినే జీలం నదీ తీరానికి వెనుకకు పోయి తాను జయించిన రాజ్యాలను పోరస్, అంభి, అభిసారుల కింద ఉంచి జీలం, సింధు నదుల మీదుగా నౌకలలో ప్రయాణం సాగించాడు. మార్గమధ్యములో మాళవులు, క్షుద్రకులు, అర్జునాయనులు అడుగడుగున అలెగ్జాండర్‌ను ఎదుర్కొన్నారు. మాళవ రాజ్యంలోని ఒక్క బ్రాహ్మణ పట్టణంలో 5 వేల సైనికులు యుద్ధంలో చనిపోయారు. ఒక దుర్గముట్టడిలో అలెగ్జాండర్ గాయపడినందున ప్రతీకారంగా ఆ దుర్గం స్వాధీనమైన తరువాత అందలి ప్రజలను గ్రీకులు హతమార్చారు. అర్జునాయనులు, ఒక పట్టణంలో 20 వేల మంది ప్రజలు గ్రీకులతో పోరాడి చివరకు ఆబాలగోపాలం మరణించారు. ఆ తరువాత అలెగ్జాండర్ బ్రాహ్మణ రాజ్యాలను, పార్ధ రాజ్యాన్ని జయించి పాటలాపట్నం చేరినాడు. క్రీ.పూ. 325 వ సంవత్సరం సెప్టెంబరులో పాటలా నుంచి తిరుగు మార్గం పట్టి గెడ్రోసియా మీదుగా బాబీలోన్ చేరాడు. ఇచటనే అలెగ్జాండర్ వ్యాధిగ్రస్తుడై క్రీ.పూ. 323లో తన 33వ యేట మరణించాడు.

**7.5.8 అలెగ్జాండర్ దండయాత్ర ఫలితాలు :** అలెగ్జాండర్ (గ్రీకు) దండయాత్రను గురించి, ఫలితాలను గురించి చరిత్రకారులు భిన్న అభిప్రాయాలను వ్యక్త పరచారు. గ్రీకుల దండయాత్ర భారతదేశ వ్యవస్థను పూర్తిగా మార్చివేసిందని కొందరు దండయాత్ర నిష్ప్రయోజనమైందని తేలికగా కొట్టివేసారు. ఈ రెండు అభిప్రాయాలు సత్యదూరమైతే అలెగ్జాండర్ దండయాత్ర రాజకీయంగా, ఆర్థికంగా భారతదేశంపై గొప్ప ప్రభావమును చూపకపోయినను సాంస్కృతిక, సాంకేతిక రంగాలలో ప్రాచీన భారతదేశంపై శాశ్వత ఫలితాలను చూపింది.

1. అలెగ్జాండర్ దండయాత్ర రాజకీయంగా భారతదేశంపై ఎటువంటి ఫలితాలు చూపలేదు. అతడు సరిహద్దు ప్రాంతపు చిన్న రాజులతో తప్ప భారతదేశంలో గొప్ప రాజులతో యుద్ధం చేయలేదు. కాబట్టి అతని విజయాలు గ్రీకు, భారతీయ సైనికుల బలాబలాలకు పరీక్ష అనజాలము. పంజాబులో గ్రీకుల పాలన స్థిరపడనందువల్ల అలెగ్జాండర్ దండయాత్ర రాజకీయంగా గొప్ప విజయం కాదు. రాజ్యాంగం పై గాని, సాహిత్యం మీదగాని, ప్రజాజీవనం మీదగాని గ్రీకు దండయాత్ర ప్రభావం ఏమంతగా లేదు. భారతదేశంలో తాను జయించిన ప్రాంతాలు తన సామ్రాజ్యంలో శాశ్వతంగా ఉండవలెననే ఆశతో వాటిని 5 రాష్ట్రాలుగా విభజించి, విశ్వాస పాత్రులైన క్షత్రపులను నియమించాడు. ఈ రాష్ట్రాలలో సైనిక స్థావరాలు నిర్మించి బలమైన సైన్యాలను నిలిపాడు. ఎంత జాగ్రత్త వహించినప్పటికి అలెగ్జాండర్ అధికారం భారతదేశంపై తాత్కాలికమే అయింది. అలెగ్జాండర్ మరణంతో గ్రీకు అధికార చిహ్నాలను మౌర్య చంద్రగుప్తుడు తుడిచి పెట్టాడు. అంభి, శశిగుప్తుడు మొదలగు దేశద్రోహుల వల్ల అలెగ్జాండర్ భారత భూమి మీద విజయం సాధ్యమయింది. అంతేగాక భారతీయులకు సరియైన నాయకత్వం లేనందువల్ల అలెగ్జాండర్ చేతిలో వాయవ్య భారత రాజ్యాలు ఓడిపోయాయి.

2. మరోవిధంగా భారతదేశ రాజకీయాలపై అలెగ్జాండర్ దండయాత్రా ప్రభావం ప్రసరించింది. వాయవ్య భారతదేశంలోని చిన్న చిన్న రాజ్యాలన్నీ పోరస్, అభిసార, తక్షశిల మొదలైన-పెద్ద రాజ్యాలలో లీనమైనాయి. అందువల్ల మౌర్యచంద్రగుప్తుని సామ్రాజ్య నిర్మాణా కి దారి ఏర్పడింది.

3. అలెగ్జాండర్ దండయాత్ర రాజకీయంగా ఐరోపా-ఆసియా ఖండములను ఏకం చేయలేకపోయినను సాంస్కృతికంగా, వాణిజ్యపరంగా భారతదేశంపై గొప్ప ఫలితాలను చూపింది. భౌగోళికముగా అలెగ్జాండరు దండయాత్ర ఐరోపాకు, భారతదేశానికి నూతన రహదారులను తెరచినది. దీని వలన భారత - ఐరోపా దేశాలకు వర్తక వ్యాపార సంబంధాలు అభివృద్ధి చెందుటకు అవకాశమేర్పడింది.

4. భారతీయ పాలకులు గ్రీకుల నాణాల ముద్రణ పద్ధతిని స్వీకరించారు.

5. గ్రీకుల ఖగోళ శాస్త్ర విజ్ఞానాన్ని భారతీయులు గ్రహించారు.

6. బాక్ట్రియాలో ఏర్పడిన గ్రీకు రాజ్యానికి భారతదేశానికి సంబంధాలుండేవి. మౌర్యసామ్రాజ్య పతనానంతరం బాక్ట్రియాలోని గ్రీకు రాజ్యం భారతదేశంపై దాడిచేసి పంజాబుసింధు ప్రాంతాలను జయించింది. నాటినుంచి గ్రీక్ సంస్కృతి భారతీయ సంస్కృతిని ప్రభావితం చేయసాగింది.

7. అలెగ్జాండర్ భారతదేశ దండయాత్ర తరువాత కాలంలో జరిగిన వివిధ విదేశీ జాతుల దండయాత్రకు మార్గాన్ని సులభతరం చేసింది. అలెగ్జాండర్ వచ్చిన మార్గం ద్వారానే భారతదేశ చరిత్రలో అనేక విదేశీజాతులు భారతదేశంపై దండయాత్ర చేయుట జరిగింది.

8. గ్రీకుల దండయాత్ర ఫలితంగా కనిష్కుని కాలము నాటికి గ్రీకు - హిందూ శిల్ప కళా రీతులు సమ్మేళనమై గాంధార శిల్పకళ అవతరించింది.

9. భారతీయుల ముఖ్య సిద్ధాంతాలైన అహింసా, వేదాంతము, వైద్యం మొదలగునవి అలెగ్జాండర్ దండయాత్ర ఫలితంగ గ్రీకులు అలవరచుకొన్నారు. భారతీయ శిల్పకళా ప్రభావము కూడ గ్రీక్, రోమ్‌లలో గోచరించింది.

10. అలెగ్జాండర్ దండయాత్ర ఫలితాలలోఅన్నిటికంటె ప్రధానమైంది గ్రీకులు భారతదేశాన్ని గురించి వ్రాసిన అంశాలు. ఇవి ఆనాటి చరిత్రను పునర్నిర్మించడానికి ఉపకరిస్తాయి. గ్రీకు రచనలలో అలెగ్జాండర్‌కు చంద్రగుప్తమౌర్యుడు సమకాలీనుడని వర్ణించి ఉన్నది. ఇది భారతచరిత్రలో కాలనిర్ణయానికి మొదటి పునాదిరాయిగా ఉపకరిస్తుంది.

## 7.6. సమీక్ష

క్రీ.పూ. 6వ శతాబ్దం నుండి క్రీ.పూ. 4వ శతాబ్దం వరకు పారశీకులు, గ్రీకులు భారతదేశపు వాయువ్య ప్రాంతంలో తమ స్థావరాలను ఏర్పరచినప్పటికి, గంగా మైదానంలో అధికభాగం విదేశ దండయాత్ర ప్రభావానికి గురికాలేదు. అయినప్పటికీ వాయవ్య ప్రాంతంలో చిన్న చిన్న తెగలరాజ్యాలను అలెగ్జాండర్ తుదముట్టించి మౌర్యులకాలంనాటి రాజకీయైక్యతకు దోహదకారుడయ్యాడు. భారతదేశానికి గ్రీకుదేశానికి రహదారులు ఏర్పడ్డాయి. ఉభయదేశాలకు పరస్పరం వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా అలెగ్జాండర్ మధ్య ఆసియాలో నెలకొల్పిన గ్రీకు రాజ్యాలు గ్రీకు విస్తరణా కేంద్రాలుగా పనిచేసాయి. వీటి నుంచి ముఖ్యంగా బాక్ట్రియా నుంచి గ్రీకుల నాణేల ముద్రణా పద్ధతి, గ్రీకుల శిల్పశైలి. ఖగోళ విజ్ఞానం భారతదేశంలో ప్రవేశించింది.

పదకోశం :

అవెస్తా : ప్రాచీన పర్షియా దేశానికి చెందిన జొరాస్ట్రియన్ మత సంబంధమైన పవిత్ర వాఙ్మయం

క్షత్రపుడు : రాష్ట్రగవర్నరు

ఖరోష్టి : వాయువ్యభారతాన వ్రాయబడిన, పర్షియాలోని 'అరామైక్' లిపి నుండి వచ్చిన లిపి

గాంధార శిల్పకళ : గ్రీకు, భారతీయకళల సమ్మేళనం
వాస్తువు : కట్ట నిర్మాణానికి సంబంధించిన విధానం

## ప్రశ్నలు

### I. వ్యాస ప్రశ్నలు :

1. అలెగ్జాండర్ దండయాత్రలకు దారితీసిన కారణాలు, ఫలితాలను వివరింపుము.
2. అలెగ్జాండర్ దండయాత్రలోని ప్రధాన సంఘటనలను వివరింపుము.

### II. సమస్య పూరిత పశ్నలు :

1. పారశీక దండయాత్రలు, ఫలితాలను వివరింపుము.
2. అలెగ్జాండర్ దండయాత్ర స్వభావమును వివరింపుము.

### III. లఘుటీక ప్రశ్నలు :

1. డేరియస్
2. పోరస్

### IV. కుశాగ్ర బుద్ధి పరీక్ష

1. సరియైన సమాధానము బ్రాకెట్‌లో గుర్తింపుము

1. ప్రాచీన పారశీక సామ్రాజ్యరాజధాని ( )
   a) పెర్సిపోలిస్ b) సుసా
   c) పెథిన్స్ d) పాటలీపుత్రం e) పుష్కలావతి
2. ఖరోష్ఠిలిపిలో శిలాశాసనాలు వ్రాసే పద్ధతిని భారతదేశంలో ప్రవేశపెట్టినవారు ( )
   a) గ్రీకులు b) పారశీల
   c) శకులు d) కుషాణులు e) హుణులు
3. గ్రీకుల కాలం నాటి తక్ష శిల రాజు ( )
   a) అంబి b) పురుషోత్తముడు
   c) అలెగ్జాండర్ d) శశిగుప్తుడు e) చంద్రగుప్తుడు
4. గ్రీకుల దండయాత్ర కాలంలో మగధను పాలించిన రాజు ( )
   a) పద్మనందుడు b) మహానందుడు
   c) ధననందుడు d) అశోకుడు e) బింబిసారుడు
5. అలెగ్జాండర్ మరణించిన ప్రదేశం ( )
   a) మాసిడోనియా b) గాంధార
   c) యుద్ధములో d) బాబిలోనియా e) పెర్సిపోలిస్

III జతపర్చుము

| గ్రూపు - A | గ్రూపు - B |
| --- | --- |
| 1. బెహిస్టూన్ | (a) క్రీ.పూ. 397 |
| 2. హెరాడొటస్ | (b) అరిస్టాటిల్ |
| 3. అలెగ్జాండర్ భారతదేశంపై దండెత్తినది | (c) గ్రీకు చరిత్ర కారుడు |
| 4. గ్రీకుతత్త్వవేత్త | (d) డిరియస్ |

**ఉపయుక్త గ్రంథాలు :**

1. వారణాసి యశోదాదేవి : భారతదేశ చరిత్ర - సంస్కృతి ప్రథమ భాగము, తెలుగు అకాడమి ప్రచురణ
2. Romila Thapar : History of India, Vol, I
3. R.C Majumdar, H.C. Raychandari & Advanced History of India, vol I K.Datta
4. R. Sathianatha Aiyar : History of India, Vol. I
5. A.L. Basham : The Wonder that was India
6. Rapson : Cambridge History of India Vol. I
7. W.W. Tarn : Alexander the Great

పాఠ్య రచయిత

**వి.కె. మోహన్.**

పాఠం - 8

# మౌర్యసామ్రాజ్యం - రాజకీయ చరిత్ర

## 8. 1 లక్ష్యం

చంద్రగుప్త మౌర్యునిచే రాజ్యం స్థాపించబడుట - బిందుసారుడు, అశోకుడు దానిని భద్రపర్చుట, అశోకుని యొక్క గొప్పతనము మొ. విషయములు తెలిసికొనుట.

## ముఖ్యాంశ సంగ్రహం


8.2 ఉపోద్ఘాతం.
8.3 ఆధారాలు.
8.4 మౌర్య సామ్రాజ్య స్థాపనకు పూర్వం ఉత్తర భారతదేశం
8.5 చంద్రగుప్త మౌర్యుని తొలి జీవితం
8.6 చంద్రగుప్త మౌర్యుని చే రాజ్య స్థాపన
8.7 చంద్రగుప్త మౌరుక్యని ఇతర విజయాలు.
8.8 రాజ్య విస్తరణ.
8.9 చంద్రగుప్త మౌర్యుని చివరి దినాలు.
8.10 విశిష్టత
8. 11 బిందుసారుడు.
8. 12 అశోకుడు
8.12. 1 ఉపోద్ఘాతము
8.12. 2 ఆధారములు.
8.12. 3 అశోకుని తొలి జీవితం - పట్టాభిషేకం
8.12. 4 కళింగ యుద్ధం - క్రీ.పూ. 261
8.12. 5 అశోకుని రాజ్య వ్యాప్తి
8.12. 6 అశోకుడు బౌద్ధమతాన్ని అంగీకరించుట.
8.12. 7 అశోకుని మత విధానం లేక అశోకుని ధర్మం
8.12. 8 అశోకుని పరిపాలనలోని ఇతర అంశాలు
8.12. 9 భారత ప్రభుత్వం పై అశోకుని ప్రభావం
8.12. 10 అశోకుని విశిష్టత.
8.13 మౌర్య వంశపు చివరి రాజులు
8.14 సారాంశము

## 8. 2 ఉపోద్ఘాతం

మౌర్య సామ్రాజ్యం స్థాపించిన కీర్తి చంద్రగుప్త మౌర్యునికి దక్కుతుంది. ఈ రాజ్య స్థాపనతో భారతదేశపు రాజకీయ, సాంస్కృతిక చరిత్రలో నూతన అధ్యాయం ప్రారంభమైంది. మౌర్యుల పరిపాలన కాలంలో రాజకీయ ఏకత్వం సాధించుటతోపాటు చరిత్ర క్రమ బద్ధమైంది. వీరు రాజ్యంలో ప్రవేశపెట్టిన ఒకే విధమైన పరిపాలన రాజ్యమంతయు ఒకే విధమైన సంస్కృతి ఉండుటకు సహాయపడింది.

## 8. 3 ఆధారాలు

పురాణాలు, జైన, బౌద్ధ గ్రంథాలు, కౌటిల్యుడు వ్రాసిన "అర్థశాస్త్రము", మెగస్తనీసు వ్రాసిన "ఇండికా", విశాఖ దత్తుని "ముద్రారాక్షసము' తమిళ సాహిత్యం, అశోకుని శాసనాలు రుద్రదాముని జున్నాఘడ్ శాసనం మౌర్య సామ్రాజ్యమును గురించి తెలుసుకొనుటకు గల ఆధారాలు.

## 8. 4 మౌర్య సామ్రాజ్య స్థాపనకు పూర్వం ఉత్తర భారతదేశం

మగధ సింహాసనానికి వచ్చిన మహాపద్మనందుడు ఉత్తర భారత దేశం మొత్తం ఆక్రమించుకొని పెద్దసామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసాడు. నంద వంశములో చివరివాడైన ధననందుడు దుష్టపాలన చేయుచు, ప్రజలచే వ్యతిరేకించబడ్డాడు. ఇతని పరిపాలనా కాలంలోనే గ్రీసులోని మాసిడోనియాకు రాజైన అలెగ్జాండరు, పంజాబు సింధూ ప్రాంతాలను ఆక్రమించుకొని గ్రీకు రాజ్యాన్ని స్థాపించాడు.

## 8. 5 చంద్రగుప్త మౌర్యుని తొలిజీవితం (క్రీ.పూ. 322 - 300)

స్వతంత్ర మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించిన చంద్రగుప్త మౌర్యుని గురించి లభ్యమైన సమాచారము నందు వ్యత్యాసములుండుటవల్ల ఇతని తొలి జీవితం స్పష్టముగా తెలియటం లేదు. చంద్రగుప్తుడు హీనకులానికి చెందిన "ముర" అనే స్త్రీకి నందరాజు ద్వారా జన్మించాడని. ఇతని తల్లి ముర అయినందున ఇతని వంశము మౌర్య వంశమయిందని పురాణాలు చెపుతున్నాయి. గ్రీకుల రచనలలోను ముద్రారాక్షసమునందు కూడా చంద్రగుప్తుడు హీనకులానికి చెందిన వాడని చెప్పబడింది.

చంద్రగుప్త మౌర్యుడు ఒక గ్రామాధికారి కుమార్తెకు జన్మించినాడని, ఆ గ్రామములోని వారంతా మయూర (నెమళ్ళ) పోషకులని, అందువల్లే అతని వంశము మౌర్య వంశమైందని జైన గ్రంథాల ద్వారా తెలుస్తుంది.

బౌద్ధ గ్రంథాలలో ఈ క్రింది సమాచారం ఉంది : చంద్రగుప్తుని తండ్రి మగధ రాజ్యంలోని ఒక ప్రాంతాన్ని పరిపాలించు "మోరియా' అనే క్షత్రియ తెగకు నాయకుడు. ఇతడు తాను పాలించు ప్రాంతమునకు, మరియొక ప్రాంతమునకు మధ్య వచ్చిన సరిహద్దు పోరాటంలో మరణించాడు. అప్పుడు గర్భములో నున్న అతని భార్య రక్షణ కొరకు పాటలీపుత్రం వచ్చి చంద్రగుప్తునికి జన్మనిచ్చింది. బాలుడైన చంద్రగుప్తుడు తన వయస్సు బాలురతో ఆడుకొనుచుండగా తక్షశిలా బ్రాహ్మణుడైన కౌటిల్యుడు అతనిలోని రాజ లక్షణాను గ్రహించినాడు. ఈ కౌటిల్యుడు ఒకప్పుడు నందరాజుచే అవమానింపబడి, వారి వంశాన్ని నాశనం చేయుదునని శపథం చేసాడు. ఆ కార్యము సాధించుటకు ఇతడు రాజలక్షణాలు కలిగిన చంద్రగుప్తుని తక్షశిలకు తీసుకొనిపోయి అచ్చట సకల విద్యలందు శిక్షణ యిప్పించాడు. వారిరువురు కలసి అటవిక, కొండ జాతుల వారిని సమీకరించి, తర్ఫీదునిచ్చి గొప్ప సైన్యంగా చేసారు. తదుపరి కౌటిల్యుని సహాయంతో చంద్రగుప్తుడు మగధను ఆక్రమించి స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించుకున్నాడు. మోరియా అనే క్షత్రియ వంశానికి చెందిన వాడైనందున ఇతని వంశానికి మౌర్య వంశమని పేరు వచ్చింది.

భారతీయుల రచనలో ఇటీవల దొరికిన సమాచారాన్ని బట్టి అలెగ్జాండరు పంజాబును ఆక్రమించినప్పుడు, చంద్రగుప్తుడు అచ్చట అలెగ్జాండర్‌ను కలసి అతనిని ధిక్కరించాడు. కోపోద్రేకుడైన అలెగ్జాండర్ చంద్రగుప్తుని బంధించవలసిందిగా ఆజ్ఞలు జారీ చేసాడు కాని చంద్రగుప్తుడు తప్పించుకొని పోయాడు. ఆ తరువాత కౌటిల్యుని సహాయంతో మౌర్యసామ్రాజ్యం స్థాపించాడు.

పై సమాచారంలో ఏది సత్యమో, ఏది అసత్యమో తెలియకుంది. ప్రస్తుతం అందరి చరిత్రకారుల అభిప్రాయంలో చంద్రగుప్తుడు మోరియా అనే క్షత్రియ వంశానికి చెందినవాడు. ఈ వంశం ఉత్తర ప్రదేశ్‌లోని "పిప్పలి వనము" అను ప్రాంతమును పాలించెడిది. ఉత్త

ారతదేశంలోని కల్లోల రాజకీయస్థితిని ఆధారంగా తీసుకొని మెరియా వంశానికి చెందిన చంద్రగుప్తుడు కౌటిల్యుని సహాయంతో క్రీ.పూ. 322 సం.న మౌర్య రాజ్య స్థాపన చేసాడు.

## 8. 6 చంద్రగుప్త మౌర్యునిచే రాజ్య స్థాపన

క్రీ.పూ. 322 కౌటిల్యుడు తక్షశిలకు చెందిన బ్రాహ్మణుడు. ఇతడు ఒకసారి మగధను పాలించు నందులచే అవమానించబడ్డాడు. వారి వంశాన్ని నాశనం చేస్తానని శపథం చేసాడు అందుకొరకు అటవిక, కొండ జాతులవారిని సమీకరించి గొప్ప సైన్యంగా చేసాడు. నందుల వంశములో చివరి వాడైన ధననందుడు దుష్ట పాలన చేస్తున్నందున అతనిని ప్రజలు వ్యతిరేకరించారు. అట్టి పరిస్థితిని అదునుగా తీసుకొని కౌటిల్యుడు చంద్రగుప్తునికి తన సహాయం అందించాడు. చంద్రగుప్తుడు ధననందుని పై దాడిచేసి, అతనిని చంపి, మగధను ఆక్రమించుకొని క్రీ.పూ. 322 సం. మౌర్య రాజ్య స్థాపన చేసాడు. ఇతడు క్రీ.పూ. 300 సం. వరకు పరిపాలన చేశాడు. పాటలీపుత్రం ఇతని రాజధాని. కౌటిల్యుడు ఇతని ప్రధానమంత్రి. రాజ్యపాలన, రాజు ధర్మాలను గురించి తెలియజేయు "అర్థశాస్త్రము" అను గ్రంథం వ్రాసినాడు.

## 8. 7 చంద్రగుప్త మౌర్యుని ఇతర విజయాలు

మగధసింహాసనం అధిష్టించిన చంద్రగుప్త మౌర్యుడు తన ఇతర విజయాలతో రాజ్యాన్ని విస్తరింప చేశాడు.

**8.7.1 పంజాబు - సింధూ నుండి గ్రీకులను పారద్రోలుట.** పంజాబు, సింధూ ప్రాంతముల యందున్న గ్రీకులను తరిమివేసి, ఆ ప్రాంతములను మగధకు కలిపాడు. ఆ విధంగా గ్రీకుల బారినుండి భారతదేశానికి స్వేచ్ఛను ప్రసాదించాడు.

**8.7.2 గుజరాత్ - మాళ్వాలను జయించుట :** చంద్రగుప్త మౌర్యుడు, గుజరాత్, మాళ్వాలను జయించి మగధకు కలిపినట్లు రుద్రదాముని జున్నాఘడ్ శాసనము ద్వారా తెలుస్తుంది.

**8.7.3 సెల్యూకస్ నికేటర్‌తో యుద్ధం (క్రీ.పూ. 305.)** అలెగ్జాండర్ మరణానంతరం అతని సామ్రాజ్యాన్ని అతని సేనాధిపతులు పంచుకున్నారు. అట్టివారిలో సెల్యూకస్ నికేటర్ ఒకడు. ఇతడు సిరియా నుండి ఆఫ్గన్‌స్థానము వరకు తన భాగంగా ఆక్రమించుకున్నాడు. తదుపరి ఒకప్పుడు గ్రీకుల పాలనక్రింద, ప్రస్తుతం మౌర్య సామ్రాజ్యంలో ఉన్న పంజాబు, సింధూ ప్రాంతాలను ఆక్రమించాలని క్రీ.పూ. 305 లో భారతదేశంపై దండెత్తాడు. కాని చంద్రగుప్త మౌర్యునిచే ఓడింపబడి సంధి చేసుకున్నాడు. ఈ సంధి ప్రకారం తన ఆధీనములోనున్న కాబూలు, కాందహారు, హీరత్, బెలూచి స్థానాలను చంద్రగుప్తుని పరంచేసాడు. మరియు తన కుమార్తె (హెలిన) ను చంద్రగుప్త మౌర్యునికిచ్చి వివాహం చేశాడు. ఈ సంబంధం మెరుగు పర్చుకొనుటకుగాను మెగస్తనీస్ అనువానిని తన రాయబారిగా చంద్రగుప్తమౌర్యుని ఆస్థానానికి పంపాడు. మెగస్తనీస్ తాను ఉన్నంత కాలం మౌర్య సామ్రాజ్యంలో చూచిన పరిస్థితులను "ఇండికా" అనే గ్రంథములో పొందుపర్చాడు. తమిళ సాహిత్యాన్ని బట్టి చంద్రగుప్తుడు దక్షిణమున మైసూరు, మద్రాసులోనున్న తిరుణానల్వేలి ప్రాంతాలను కూడా జయించాడు.

## 8. 8 రాజ్య విస్తరణ

చరిత్ర ఆధారాలను బట్టి చంద్రగుప్త మౌర్యుడు తన లక్షల సైన్యంతో బయలుదేరి దాదాపు భారతదేశం మొత్తం ఆక్రమించుకున్నట్లు తెలుస్తుంది. తన విజయాలతో చంద్రగుప్తుడు వాయవ్యాన ఆఫ్గన్ స్థానం నుండి తూర్పున బ్రహ్మపుత్ర వరకు, ఉత్తరాన హిమాలయముల నుండి దక్షిణాన మైసూరు, తిరుణనల్వేలి వరకు మౌర్య సామ్రాజ్యాన్ని విస్తరింప చేసాడు.

## 8. 9 చంద్రగుప్త మౌర్యుని చివరి దినములు

క్రీ.పూ. 300 చివరి దినాలలో చంద్రగుప్త మౌర్యుడు ఇహలోక సుఖాలను త్యజించి జైనమతాన్ని స్వీకరించాడని జైనగ్రంథాలను బట్టి తెలుస్తుంది. ఆ తరువాత సింహాసనాన్ని తన కుమారుడైన బిందుసారునికి వదలి, జైన సాధువైన బద్రబాహునితో కలసి మైసూర్‌లో శ్రావణ బెల్‌గోలా ప్రాంతానికి వెళ్లాడు. అచట అతను నివసించిన పర్వతం చంద్రగిరి అని పిలువబడింది. జైన సాంప్రదాయం ప్రకారం ప్రాయ దీక్షను చేపటి క్రీ.పూ. 300 చంద్రగుప్త మౌర్యుడు శ్రావణ బెల్‌గోలా [illegible]

## 8. 10 విశిష్టత

స్వతంత్ర మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించి, గ్రీకుల బారినుండి భారతదేశానికి స్వేచ్ఛను ప్రసాదించాడు. తన విజయాలతో సువిశాల సామ్రాజ్యాన్ని ఏర్పాటుచేసి, భారతదేశపు మొదటి చారిత్రిక చక్రవర్తి అయ్యాడు. రాజ్యంలో మంచి పరిపాలనను ప్రవేశపెట్టాడు. ఒకే విధమైన పరిపాలన దేశంలో సాంస్కృతిక ఏకత్వం సాధించుటకు సహాయపడింది.

## 8. 11 బిందుసారుడు : క్రీ.పూ. 300 - 273

చంద్రగుప్త మౌర్యుని తరువాత అతని కుమారుడు బిందుసారుడు రాజ్యానికి వచ్చాడు. ఇతనికి "అమిత్రఘాత" (శత్రుసంహారి) అని బిరుదు కలదు. ఇతని పరిపాలన కాలమందు తక్షశిల రాష్ట్రమందు తిరుగుబాటు జరుగగా తన కుమారుడైన అశోకుని సహాయంతో దానిని అణిచి వేసాడు. దక్కను ప్రాంతంలో చెలరేగిన తిరుగుబాటును కూడా అణచివేసాడు. ఆ విధంగా తన తండ్రి అప్పగించిన రాజ్యాన్ని కాపాడి రాజకీయ ఏకత్వం భద్రపరచాడు. విదేశీ రాజులతో స్నేహసంబంధాలు కలిగి ఉన్నాడు. గ్రీసు, సిరియా, ఈజిప్టు రాజులు తమ రాయబారులను ఇతని ఆస్థానానికి పంపారు. బిందుసారునికి అనేకమంది కుమారులు, కుమార్తెలు ఉన్నట్లు అశోకుని 5 వ శిలాశాసనం ద్వారా తెలుస్తుంది. ఇతని మరణానంతరం ఇతని కుమారుడు అశోకుని సింహాసనం అధిష్టించాడు.

## 8. 12 అశోకుడు క్రీ.పూ. 273 - 233

**8. 12. 1 ఉపోద్ఘాతము :** ప్రాచీన భారతదేశపు చరిత్రలో అశోకుడు గొప్పవాడు. ఇతని పరిపాలన ప్రారంభంతో ప్రాచీన భారత దేశ రాజకీయ, సాంస్కృతిక చరిత్రయందు నూతన శకం ఆరంభమైంది. తన రాజ్యాన్ని సంక్షేమరాజ్యంగా చేయ తలంచినందుననే అశోకుడు గొప్పవాడుగా భావించబడి ప్రపంచంలోని చరిత్రకారులందరి చేత కీర్తించబడ్డాడు.

**8. 12. 2. ఆధారాలు :** పురాణములు, జైన, బౌద్ధగ్రంథాలు, అశోకుని శాసనాలు సిలోను క్రానికల్స్ అశోకుని గురించి తెలుసుకొనుటకు గల ఆధారాలు.

**8. 12. 3 అశోకుని తొలి జీవితం - పట్టాభిషేకం :** అశోకుడు యువకుడిగా ఉన్నప్పుడు తక్షశిల, ఉజ్జయిని రాష్ట్రాలకు రాజప్రతినిధిగా వ్యవహరించాడు. బిందుసారుడు క్రీ.పూ. 273 సంవత్సరాన మరణించినప్పుడు రాజ్యానికి వచ్చిన అశోకుడు నాలుగు సంవత్సరాల తరువాత పట్టాభిషేకం జరుపుకున్నాడు. ఈ విషయం చరిత్రకారులందరు అంగీకరిస్తున్నారు. బౌద్ధగ్రంథాలను బట్టి, సిలోను క్రానికల్స్‌ను బట్టి బిందుసారుడు మరణించిన పిదప సింహాసనం ఆక్రమించుటకు అశోకుడు పోరాటం సల్పినట్లు తెలుస్తుంది. కాని ఈ పోరాటం ఎవరితో జరిగిందో స్పష్టంగా తెలియటం లేదు.

బౌద్ధ గ్రంథాలను బట్టి బిందుసారునికి 100 మంది కుమారులున్నారు. మొదటి కుమారుని పేరు సుసిమ. రెండవ కుమారుని పేరు అశోకుడు. బిందుసారుడు మరణించిన పిదప అశోకుడు నాలుగు సంవత్సరాలు పోరాడి సుసిమతో సహా అతని 99 సహోదరులను చంపి రాజ్యానికి వచ్చాడు. అందువల్లె అతనికి "చండ అశోకుడు" అని బిరుదు వచ్చింది. బౌద్ధ గ్రంథాలలో ఉన్న ఈ సమాచారం కొందరు చరిత్రకారులు అంగీకరించుట లేదు. అశోకుని మొదట క్రూరుడిగా చిత్రించి, బౌద్ధమతం అంగీకరించిన తరువాత అతడు మంచివాడుగా, ఉదార స్వభావుడిగా మారినాడని చెప్పుచు, బౌద్ధమతానికి ఖ్యాతిని తెచ్చుటకుగాను బౌద్ధులు ఈ కథను సృష్టించారని అశోకుడు నిజంగా క్రూరుడు కాదని వీరు భావించారు.

ఏమైనప్పటికి, తండ్రి మరణానంతరం అశోకుడు సింహాసనం అధిష్టించుటలో తన సహోదరుల నుండి ప్రతిఘటన ఎదుర్కొనవలసి వచ్చింది. బిందుసారుని ప్రధాన మంత్రియైన రాధాగుప్తుని సహాయంతో తన సహోదరుల వ్యతిరేకతను అణచి వేయుటకు 4 సంవత్సరాలు పట్టింది. ఆ తర్వాతే అతను పట్టాభిషేకం జరుపుకొని రాధాగుప్తుని ప్రధానమంత్రిగా నియమించాడు.

**8. 12. 4. కళింగ యుద్ధం క్రీ.పూ. 261 :** తండ్రి వద్ద నుండి అశోకుడు విస్తారమైన రాజ్యాన్ని పొందాడు. తాను స్వంతగా ...యించినది కళింగ మాత్రమే. అశోకునితో పోరాడి ఓడపోయిన కళింగరాజు పేరు మాత్రం చరిత్రకు తెలియలేదు. ఈ కళింగ యుద్ధంలో

1,50,000 మంది బందీలుగా పట్టుబడి, 1 లక్షకు పైగా సైనికులు చంపబడి, అంతకంటే ఎక్కువమంది యుద్ధం జరుగుసమయంలో తీవ్రంగా గాయపడ్డారు. యుద్ధంలో జరిగిన ఈ ఘోరవిపత్తు, యుద్ధభూమిలో ప్రవహించిన రక్తము, అశోకుని మనస్సుని కదిలించింది. ఆ కారణంగా భవిష్యత్‌లో యుద్ధం చేయకూడదని అశోకుడు నిర్ణయించుకున్నాడు.

**8. 12. 5. అశోకుని రాజ్య వ్యాప్తి :** కళింగ యుద్ధం తరువాత మౌర్య సామ్రాజ్యం ఉత్తరాన కాశ్మీరు, నేపాల్ నుండి దక్షిణాన మైసూరు వరకు, పడమర అరేబియా సముద్రం నుండి తూర్పున అస్సాం వరకు వ్యాపించింది. వాయవ్యమున భారతదేశపు సరిహద్దులు దాటి ఆఫ్గనిస్థాన్, బెలూచిస్థాన్ కూడా అశోకుని సామ్రాజ్యంలో ఉన్నవి.

**8. 12. 6 అశోకుడు బౌద్ధ మతాన్ని అంగీకరించుట :** కళింగ యుద్ధంలో జరిగిన మారణకాండకు కలత చెందిన అశోకునికి ఉపగుప్తుడు అనే బౌద్ధసాధువు బౌద్ధమతాన్ని బోధించాడు. ఈ మతంలోని అహింస సూత్రము అశోకుని ఆకర్షించింది. ఆ కారణంగా అశోకుడు బౌద్ధమతం స్వీకరించి, హింసను విడనాడి మనశ్శాంతి పొందాడు.

**8. 12. 7 అశోకుని మతవిధానం లేక అశోకుని ధర్మం :** బౌద్ధ మతం వలన ప్రభావితుడైన అశోకుని బౌద్ధమత సిద్ధాంతాలను ఆధారంగా చేసికొని అతను స్వంత మతాన్ని రూపొందించాడు. దీనిని అశోకుని ధర్మం అన్నారు. దీనిలో అన్ని మతాల సారాంశం ఉంది. ప్రజలందరు ఈ ధర్మమున ననుసరించి, నీతికరమైన జీవితాన్ని జీవించి, నైతిక విలువలు పెంచుకోవాలని అశోకుడు కాంక్షించాడు. కనుక అశోకుని ధర్మం అనగా ప్రజల యొక్క ప్రవర్తనానియమావళి. బౌద్ధమతంపై ఆధారపడి నిర్మింపబడిన ఈ ధర్మం వ్యాప్తి చేయుటవల్లనే బౌద్ధమతానికి విస్తృతమైన ప్రచారం లభించింది.

**8.12.7.1 అశోకుని ధర్మంలోని ముఖ్య సూత్రాలు:** అశోకుని మతం లేక ధర్మంలో ఈ దిగువ పేర్కొనబడిన సూత్రాలున్నవి.

1. మానవులు తమ కోరికలపై నియంత్రణ కలిగియుండాలి. సత్‌ప్రవర్తన, నీతి కరమైన పవిత్రమైన తలంపులు కలిగియుండాలి.
2. ఇతర మతాలను ద్వేషించకూడదు. అనగా మత సహనం కలిగియుండాలి.
3. జంతువులను హింసించకుండా వాటిని దయతో చూడాలి.
4. అందర యెడల దయతో వ్యవహరించాలి.
5. తల్లిదండ్రులకు, పెద్దలకు లోబడి యుండాలి. గురువులను, బంధువులను, స్నేహితులను, సాధువులను, వృద్ధులను గౌరవించాలి.
6. బానిసలను, సేవకులను దయతో చూడాలి.
7. ఎల్లప్పుడు సత్యాన్నే పలకాలి.

**8.12.7.2 అశోకుడు తన మతాన్ని లేక ధర్మాన్ని ప్రచారం చేయుట :** ప్రజల నైతిక విలువలను పెంచుకొనుటకు కనుగొనిన (మతం) ధర్మాన్ని ప్రచారం చేయుటకు అశోకుడు నూతన విధానాలు అనుసరించాడు. అవి :

1. తాను నమ్మిన ధర్మాన్ని ముందుగా తానే ఆచరించి ప్రజలకు మార్గదర్శకుడైనాడు. అన్ని మతాలపట్ల సహనంచూపి అన్ని మతాలవారికి ఉదారంగా దానాలు చేశాడు.
2. స్వయంగా రాజ్యమంతట పర్యటించి ధర్మాన్ని ప్రచారం చేసాడు. ఆ విధంగా వినోదయాత్రలు ధర్మయాత్రలైనాయి.
3. బౌద్ధమతానికి చెందిన పవిత్రస్థలాలను (బుద్ధగయ, లుంబిని) మొ. దర్శించి, తాను వెళ్లిన ప్రతిస్థలమందు మతాన్ని గురించిన చర్చలు ఏర్పాటు చేశాడు.
4. ప్రభుత్వంలోని ఉన్నత ఉద్యోగులు తమ విధులను నిర్వహించుచూ ప్రతి 5 సంవత్సరముల కొకసారి రాజ్యంలో పర్యటించి ధర్మాన్ని ప్రచారం చేయాలని సూచించాడు.
5. ప్రజలందరు ఈ ధర్మాన్ని తెలుసుకొనేందుకు వీలుగా ధర్మసూత్రాలను రాతి స్తంభాలపైన, గుహగోడలపైన ఆనాటి ప్రజల వాడుకభాషయైన ప్రాకృత భాషలో చెక్కించాడు. అట్లు చెక్కించిన రాతి స్థంబాలను రాజ్యంలోని ముఖ్య కేంద్రాలలో స్థాపించా-

6. ఇతర దేశములలో కూడా ఈ ధర్మమును భోధించుటకు ప్రత్యేక దూతలను పంపాడు. దాని ఫలితంగా బౌద్ధమతము ఆసియాలోను, ఈజిప్టు, తూర్పున దూరప్రాంతాలకు వ్యాపించింది. తన కుమారుడైన మహేంద్రను, కుమార్తె సంఘమిత్రను ఈ ధర్మ ప్రచారము కొరకు సింహళదేశము పంపించాడు.

7. బౌద్ధ మతంలో విభేధాలు తొలగించుటకుగాను పాటలీపుత్రంలో మూడవ బౌద్ధసంగీతి (సమావేశము) ఏర్పాటు చేసాడు. దీనికి మెగ్గాలిపుత్తతిస్సా (ఉపగుప్తుడు) అధ్యక్షత వహించాడు.

అశోకుడు చేసిన ఇట్టి ప్రచారం వల్లనే బౌద్ధమతం ఇతర దేశాలకు వ్యాపించి అంతర్జాతీయ మతమైంది.

**8.12.7.3** అశోకుని ప్రవర్తన పై బౌద్ధమత ప్రభావం : బౌద్ధమతాన్ని అంగీకరించిన తరువాత అశోకుని ప్రవర్తనలో అనేక మార్పులు సంభవించాయి. అహింసా సూత్రము నమ్మినందున జంతువులను వేటాడుట మానివేసాడు. మాంసభక్షణ తగ్గించాడు. జంతువధను నిషేధించుతూ అనేక శాసనాలు చేసాడు. భవిష్యత్‌లో యుద్ధముల ద్వారా కాకుండా ధర్మాన్ని బోధించుటద్వారా ప్రజలను తన వైపుకు ఆకర్షించుకొనవలెనని నిర్ణయించాడు. ఆ విధంగా "భేరిఘోష - ధర్మఘోష" అయింది. అనగా యుద్ధంలో ఉపయోగించే భేరీలు ఇకమీదట ధర్మాన్ని ప్రచారం చేసే డప్పులుగా మారాయి.

**8.12.7.4** అశోకుని పరిపాలన పై బౌద్ధమత ప్రభావం - ప్రజాక్షేమం: మత ప్రచారంపై దృష్టి కేంద్రీకరించినప్పటికీ అశోకుడు రాజుగా తాను నిర్వహించ వలసిన విధులను మరువలేదు. పాలకులు దేవునిచే నియమించ బడుదురను సిద్ధాంతాన్ని నమ్మినవాడు అశోకుడు. అందువల్లనే "దేవవనాంప్రియా" అను బిరుదులు పొందినట్లు మాస్కిభైరట్ శాసనాలు చెప్పుతున్నాయి. అహింసా సూత్రం ప్రభావంవల్ల ఇతడు పరిపాలనలో ఉదారస్వభావుడిగా మారాడు. అందువల్లనే ప్రజలందరు తన కన్న బిడ్డలని, బిడ్డల కొరకు తండ్రి ఏమి చేయునో దానిని ప్రజల కొరకు చేయుదునని తన రెండవ శిలాశాసనంలో తెలియచెప్పాడు. తాను ఎచ్చట ఉన్ననూ, ఏ పరిస్థితిలో ఉన్నను, ఎప్పుడైనను ప్రజలు తన యొద్దకు వచ్చి వారి కష్టాలు, సమస్యలుచెప్పుకొన వచ్చునని తన 5 వ శిలాశాసనంలో లిఖించాడు.

ప్రజాక్షేమమే ముఖ్యమని భావించి, అహింస, దయ అను సూత్రాలను పాటించి అశోకుడు పాలించాడు. మానవులకు, జంతువులకు, పక్షులకు వైద్యశాలలు నిర్మించాడు. ప్రయాణీకుల సౌకర్యము కొరకు రహదారులు నిర్మించి, ఇరువైపులా నీడనిచ్చు చెట్లునాటించాడు. ఉచిత వసతి గృహాలు నిర్మించి, నీటి సౌకర్యం కొరకు బావులు త్రవ్వించాడు. ప్రతి సంవత్సరం తన జన్మదినంనాడు ఖైదీలను విడుదలచేశాడు. హింసా వాదమును వదలి అతిపెద్ద సామ్రాజ్యాన్ని శాంతియుతంగా పరిపాలించి, ప్రజలకు సుఖజీవనం అందించగలిగాడు.

### 8. 12. 8 అశోకుని పరిపాలనలోని ఇతర అంశాలు

**8.12.8.1** శాసనాలు : తాను నమ్మిన ధర్మాన్ని, తాను చేసిన క్రియలను శాసనాలలో భద్రపరిచిన మొదటి భారతదేశపు చక్రవర్తి అశోకుడు. అశోకుని శాసనాలు మూడు భాగాలుగా విభజింపబడ్డాయి. అవి:

1. 14 శిలాశాసనాలు 2. లఘుశిలాసనాలు 3. 7 స్తంభ శాసనాలు

అశోకుని యొక్క ఇతర శాసనాలు అంత ప్రాముఖ్యమైనవికావు. ఈ శాసనాలన్నియు అశోకుని జీవితం, అతని రాజ్యవ్యాప్తి తెలిసికొనుటకు అత్యంత విలువైన సమాచారాన్ని అందించుచున్నాయి. ఈ శాసనాలు ఖరోష్టి, బ్రాహ్మి, అర్‌బిక్ లిపిలో చెక్కబడ్డాయి. అశోకుని శాసనాలు భారతదేశపు చరిత్రలో అత్యంత ప్రాచీనమైనవి లిఖిత ఆధారాలు.

**8.12.8.2** సంస్కృతి ఏకత్వము : అశోకుని రాజ్యమంతటిలో ఒకే విధమైన పరిపాలన, ఒకే భాష, ఒకే లిపి ప్రవేశ పెట్టినాడు. దీనివల్ల రాజకీయ ఏకత్వం సాంస్కృతిక ఏకత్వం సాధించుటకు సహాయపడింది.

**8.12.8.3** కళాభివృద్ధి : అశోకుని పరిపాలనతోనే భారతదేశపు కళాచరిత్ర ప్రారంభమయ్యింది. ఇతని ఏకస్థంబశాసనాలు అన్ని చక్కగా చెక్కబడి మెరుగు పెట్టబడ్డాయి. ఈ స్థంభ శాసనాల పైభాగాన చెక్కబడిన జంతువుల బొమ్మలతో ధర్మచక్రం ఉంటుంది. ఈ స్థంభాలలోని కళ ఇప్పటికీ ప్రపంచంలో అత్యున్నతమైన కళగా భావింప బడుచున్నది.

**8. 12. 9.** భారత ప్రభుత్వం పై అశోకుని ప్రభావం : ఒకప్పుడు అశోకుని అంగీకరించి ప్రచారం చేసిన అహింసా సిద్ధాంతము దేశీయ, అంతర్జాయ రాజకీయాలకు అన్వయించబడింది. అశోకుని సంక్షేమ రాజ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, అతడు సాధించిన రాజకీయ,

సాంస్కృతిక ఏకత్వమును కాంక్షించుచు అశోకుని ఏకస్తంభ శాసనాలపై ఉన్న ధర్మచక్రాన్ని ఏకత్వానికి గుర్తుగా భావించి భారత ప్రభుత్వం దానిని భారతదేశపు చిహ్నంగా అశోకుని ధర్మచక్రాన్ని జాతీయ పతాకంపై ముద్రించింది.

**8. 12. 10. అశోకుని విశిష్టత :** సంక్షేమ రాజ్యస్థాపన చేసి అశోకుడు ప్రపంచంలో గొప్ప చక్రవర్తిగా గుర్తింపబడ్డాడు. తన పరిపాలన విధానాల ద్వారా రాజకీయ సాంస్కృతిక ఏకత్వం సాధించాడు. బౌద్ధమతం అంగీకరించినప్పటికీ లౌకిక విధానం అవలంబించాడు. ఇతడు ప్రపంచశాంతి, అంతర్జాతీయ సహోదరత్వం కాంక్షించాడు. ఇతని కృషి ఫలితంగానే బౌద్ధమతం అంతర్జాతీయ మతంగా రూపొందింది. ఇట్టి గొప్ప వ్యక్తి గనుకనే H.G. వేల్స్ అశోకుని గురించి ఈ విధంగా చెప్పాడు. "చరిత్ర పుటలలో పేర్కొనబడిన అనేక వందల రాజుల పేరులలో అశోకుని పేరు నక్షత్రంవలె ఇప్పటికిని ప్రకాశించుచున్నది".

## 8. 13 మౌర్యవంశపు చివరిరాజులు

అశోకుడు క్రీ.పూ. 232 సం. మరణించిన పిదప అతని మనుమలు దశరథ, సంప్రతి అశోకుని రాజ్యాన్ని విభజించుకొని పాలించారు. అశోకుని మరణాంతరం 7గురు రాజులు ఒకరి తరువాత ఒకరు రాజ్యపాలన చేసారు. వీరందరు బలహీనులే. బృహద్రథ ఈ వంశపు చివరి పాలకుడు. సుంగ వంశానికి చెందిన బృహద్రథ సేనాపతి పుష్యమిత్రుడు, అతనిని చంపి మౌర్య రాజ్యాన్ని ఆక్రమించాడు. ఆ విధముగా మౌర్యరాజ్యం అంతరించి, దానితోపాటు భారతదేశపు రాజకీయ ఏకత్వంకూడా అంతరించింది.

## 8. 14 ముగింపు

కౌటిల్యుని సహాయ సహకారాలతో చంద్రగుప్త మౌర్యునిచే స్థాపించబడ్డ మౌర్యసామ్రాజ్యం అశోకుని కాలంలో ఉన్నత స్థితికి చేరుకుంది. వాయువ్యమున భారతదేశపు సరిహద్దులు దాటిరాజ్యాన్ని వ్యాపింపచేసారు. అశోకుని తరువాత రాజులు బలహీనులైనందున, స్వతంత్రులు కావలెనని ప్రయత్నించు రాష్ట్రపాలకులను అణచివేయలేక పోయారు. అందువల్ల అశోకుడు మరణించిన 50 సంవత్సరాల లోపులో మౌర్యసామ్రాజ్యం కూలిపోయింది. ఏమైనప్పటికీ వీరు భారతదేశపు రాజకీయ ఏకత్వం సాధించుటలో సాధించారు. దాని ఫలితంగానే నేటికి దేశమంతట ఒకే సంస్కృతి యుండుటకు అవకాశం ఏర్పడింది.

## అభ్యాసాలు

**A. వ్యాస ప్రశ్నలు :**

1. చంద్రగుప్తుడు మౌర్యసామ్రాజ్యం స్థాపించి విస్తరించిన విధానం తెలుపుము
2. చరిత్రలో అశోకుడు గొప్పవాడనుటకుగల కారణాలు వ్రాయుము.

**B. సమస్య పూరిత పశ్నలు :**

1. చంద్రగుప్త మౌర్యుని వంశాన్ని గురించి ఉన్న వివాదాలను తెల్పుము
2. అశోకుని మత విధానాన్ని వర్ణింపుము.

**C. లఘుటీక ప్రశ్నలు (క్లుప్తముగా జవాబు వ్రాయుము)**

ఈ క్రింది వాటిని క్లుప్తంగా జవాబులు వ్రాయుము

1. కౌటిల్యుడు
2. సెల్యూకస్ నికేటర్
3. మెగస్తనీస్

4. బిందుసారుడు

5. కళింగ యుద్ధం

D. **కుశాగ్ర బుద్ధి పరీక్ష :**

I. **ఈ క్రింది ప్రశ్నలకు a,b,c,d,e లు అను అక్షరాలను ఉపయోగించి సరియైన సమాధానాము ప్రశ్నకు ఎదురుగానున్న గడులలో వ్రాయుము**

1. భారతదేశపు మొదటి చారిత్రక చక్రవర్తి ఎవరు ? ( )
   a) మహాపద్మనందుడు b) అశోకుడు
   c) ధననందుడు d) బింబిసారుడు e) చంద్రగుప్తమౌర్యుడు
2. చంద్రగుప్త మౌర్యునిచే ఓడింపబడిన గ్రీకు రాజు ( )
   a) సెల్యూకస్ నికేటర్ b) అలెగ్జాండర్
   c) మినేండర్ d) డేరియస్ e) డెమిట్రియస్
3. దేవనాంప్రియ అనుబిరుదు కలిగిన మౌర్యపాలకుడు ( )
   a) చంద్రగుప్త మౌర్యుడు b) బింబిసారుడు
   c) అశోకుడు d) బ్రిహద్రత e) దశరథ
4. మౌర్యసామ్రాజ్యపు రాజధాని ( )
   a) గిరివ్రజము b) పాటలీపుత్రము
   c) రాజగృహము d) బుద్ధగయ e) లుంబిని
5. ఇండికా గ్రంధ రచయిత ( )
   a) కౌటిల్యుడు b) రాధాగుప్తుడు
   c) మెగస్తనీసు d) దశరధుడు e) విశాఖదత్తుడు

III. **జతపర్చుము**

| | |
|---|---|
| 1. అర్థశాస్త్రము | (a) శ్రావణబెల్ గోలా |
| 2. కళింగ | (b) పుష్యమిత్రుడు |
| 3. చంద్రుగప్త మౌర్యుడు | (c) కౌటిల్యుడు |
| 4. బ్రిహద్రదుడు | (d) గ్రీకు రాయబారి |
| 5. మెగస్తనీసు | (e) అశోకుడు |

IV. **మీ కివ్వబడిన భారతదేశ పటమునందు అశోకుని సామ్రాజ్యం గుర్తించి ఈ దిగువ ప్రాంతాలను పేర్కొనుము.**

**a) పాటలీపుత్రం b) ఉజ్జయిని c) తక్షశిల d) కళింగ**

Assignment

1 అశోకుని మత విధానాన్ని వర్ణింపుము ?

పాఠం - 9

# మౌర్య సామ్రాజ్యం

## సాంఘిక, ఆర్థిక పరిస్థితులు - పతనం

### 9.1 లక్ష్యం

చంద్రగుప్తమౌర్యునిచే స్థాపించబడి, బిందుసారునిచే భద్రపర్చబడి, అశోకుని కాలములో ఉన్నత స్థితికి చేరిన మౌర్యుల పరిపాలన విధానం మౌర్యసామ్రాజ్యములోని పరిస్థితులను, మౌర్యసామ్రాజ్యము పతనమువుటకు కారణాలు గురించి తెలుసుకొనుట.

### ముఖ్యాంశాలు


9.2 మౌర్యుల పరిపాలన
9.2.1 ఉపోద్ఘాతం
9.2.2 ఆధారాలు
9.2.3 మౌర్యపరిపాలనలోని ముఖ్యాంశాలు
9.2.3.1 కేంద్రప్రభుత్వం
9.2.3.2 రాష్ట్రప్రభుత్వం
9.2.3.3 గూఢాచారులు
9.2.3.4 న్యాయపరిపాలన
9.2.3.5 సైనిక వ్యవస్థీకరణ
9.2.3.6 ప్రభుత్వ ఆదాయవవరులు (రెవిన్యూ)
9.2.3.7 నీటి వసతి
9.2.3.8 ప్రజా ఉపయోగ కార్యాలు
9.2.3.9 నగరపాలన - పురపాలక సంఘం
9.2.3.10 జనాభా లెక్క
9.2.3.11 ప్రజా ఆరోగ్యం
9.2.4 ముగింపు
9.3 మౌర్య సామ్రాజ్యంలోని పరిస్థితులు
9.3.1 ఉపోద్ఘాతం
9.3.2 సాంఘిక పరిస్థితులు
9.3.3 ఆర్థిక పరిస్థితులు
9.3.4 మత పరిస్థతులు
9.3.5 సాహిత్యం
9.3.6 క

9.3.7 ముగింపు
9.4 మౌర్య సామ్రాజ్యపతనం
9.4.1 ఉపోద్ఘాతం
9.4.2 మౌర్యసామ్రాజ్య పతనానికి కారణాలు.
9.4.2.1 అశోకుని బాధ్యత
9.4.2.2 సామ్రాజ్య విభజన
9.4.2.3 బలహీనులైన రాజులు
9.4.2.4 సామ్రాజ్య నైసర్గిక వైరుధ్యం
9.4.2.5 సామంతుల స్వాతంత్ర కాంక్ష
9.4.2.6 రాష్ట్రపాలకుల అణచివేత విధానం
9.4.2.7 బలహీనమైన ప్రభుత్వం
9.4.2.8 వార్తా రవాణా సౌకర్యాలు లేకపోవుట
9.4.2.9 దిగజారిన ఆర్థిక పరిస్థితి
9.4.2.10 ప్రజలలో జాతీయ భావం లేకపోవుట
9.4.2.11 ఆంధ్రులు - కళింగులు మొ. సామంతులు స్వతంత్రులగుట
9.4..2.12 విదేశీయుల దాడులు - క్రీ.పూ. 190 డెమిట్రియస్
9.4.2.13 ఆస్థానపు కుట్రలు - పుష్యమిత్రుని విజృంబణ క్రీ.పూ. 187
9.4.3 సారాంశము

## 9.2 మౌర్యుల పరిపాలన

**9.2.1 ఉపోద్ఘాతం :** మౌర్య సామ్రాజ్యం స్థాపించిన తరువాత చంద్రగుప్త మౌర్యుడు అతిన ప్రధాన మంత్రియైన కౌటిల్యుని సూచనలు, సలహాలు పాటించి మంచి పరిపాలన ప్రవేశపెట్టాడు. ఈ పరిపాలనా విధానం అశోకుని కాలం వరకు సక్రమంగా నిలచివుంది. మౌర్యులు ప్రవేశపెట్టిన ఒకే విధమైన పరిపాలన వల్ల రాజకీయ ఏకత్వం సాధించబడి దానిద్వారా సాంస్కృతిక ఏకత్వం ఏర్పడింది.

**9.2.2 ఆధారాలు :** జైన, బౌద్ధగ్రంధాలు, కౌటిల్యుని అర్థశాస్త్రం, మెగస్తనీసు, ఇండికా, విశాఖ దత్తుని ముద్రారాక్షసం, అశోకుని శాసనాలు మౌర్యుల పరిపాలనను గురించి తెలుసుకొనటానికి గల ఆధారాలు.

## 9.2.3. మౌర్య పాలనలోని ముఖ్యాంశాలు :

**9.2.3.1 కేంద్రప్రభుత్వం :** మౌర్యుల ప్రభుత్వం కేంద్రీకృతమైన ఉద్యోగుల పరిపాలనావ్యవస్థ. ఈ ఉద్యోగులందరు పరిపాలనలో నైపుణ్యం కలవారే. కేంద్రప్రభుత్వం పనిచేయు విధానం ఈ దిగువ తెలుపబడింది.

**A. రాజు :** సామ్రాజ్యపు పూర్తి పరిపాలన మీద అధికారి రాజు. మౌర్యరాజుల పరిపాలనలోని సర్వాధికారాలను కలిగి ఉండిరి. కాని రాజు రాజ్యాంగబద్ధుడై రాజ్యం యొక్క చట్టం, సాంప్రదాయాలను అనుసరించి రాజ్యపాలను చేశాడు. పరిపాలనలో అన్ని అధికారాలున్నప్పటికి, నిరంకుశంగా కాక ఉదార స్వభావులుగా వ్యవహరించిరి. అశోకుడైతే ప్రజలను కన్న బిడ్డలవలె భావించి, వారి క్షేమం కోసంపాటు పడ్డాడు. ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉన్నాడు.

**B.** మంత్రి మండలి : రాజుకు పరిపాలనలో సహాయపడుటకు కొందరు మంత్రులతో ఏర్పడిన ఒక మంత్రిమండలి ఉండేది. దీనినే పరిషత్ లేదా మంత్రిపరిషత్ అని పిలిచేవారు. పరిపాలనా విషయాలు గురించి రాజు ఈ మంత్రిమండలిని సంప్రదించేవాడు. ఈ మంత్రిమండలిలోని ముఖ్య సభ్యులు ఎవరనగా :

పురోహితుడు - మతవిషయాలపై, ధర్మముల గురించి రాజుకు సలహాలిచ్చేవాడు.

సేనాపతి - సైన్యంపై పర్యవేక్షణ, యుద్ధవిషయాలు గురించిన సలహాలిచ్చేవాడు.

యువరాజు - రాజు తరువాత సింహాసనాన్ని అధిరోహించేవ్యక్తి. కనుక పరిపాలనా అనుభవం కొరకు మంత్రిమండలిలో యుండి రాజుకు సహాయపడేవాడు.

**C.** సెక్రటేరియట్ (సచివాలయం) : రాజు గైకొనిన నిర్ణయాలు రాజ్యంలో అమలుపర్చుటకు సచివాలయం ఉంది. అనేక శాఖలు ఉన్నవి. ప్రతిశాఖ అధికారిని అధ్యక్షుడు అనేవారు. ఇతని క్రింద ఇతర ఉద్యోగులు ఉండేవారు. (ఒక గణాంక అధికారి, గుమస్తా Store Keeper.)

**D.** ప్రభుత్వ - ఇతర ఉద్యోగులు : ప్రభుత్వపు కార్యకలాపాలు నిర్వహించుటకు ఇతర ఉన్నత ఉద్యోగులున్నట్లు కౌటిల్యుని అర్థశాస్త్రముద్వారా తెలుస్తుంది. ఈ ఉద్యోగులను అమాత్యులు అని పిలిచేవారు. కోశాధికారియైన, సన్నిధాత, ప్రభుత్వ ఆదాయం వసూలు చేయు సమహర్త, ద్వారపాలకుడైన ద్వారిక, న్యాయవ్యవహారములను చూచు వ్యవహారిక, కోటల రక్షణను చూచు దుర్గపాల, సరిహద్దులను కాపాడు అంతపాల మొ. ప్రభుత్వపు ఇతర ఉన్నత ఉద్యోగులు లేదా అమాత్యులు. అశోకుని పరిపాలన కాలమందు ధర్మాన్ని ప్రచారం చేయుటకు మాత్రమే క్రొత్త ఉన్నత ఉద్యోగులను నియమించాడు. వీరిని ధర్మమహామాత్రులు అనిరి. పరిపాలన చేయు ఈ ఉన్నత ఉద్యోగులను కుల, మత, తెగల బేధాలు లేకుండా రాజు స్వయంగా నియమించేవాడు.

**9.2.3.2.** రాష్ట్రప్రభుత్వం : పరిపాలన సౌకర్యం కొరకు మౌర్యులు తమ రాజ్యాన్ని రాష్ట్రాలుగా విభజించిరి. రాష్ట్రములను పాలించుటకు యువరాజును గానీ, రాజ కుటుంబీకులను గాని రాజ ప్రతినిధిగా నియమించేవారు. అట్టి రాష్ట్రపాలకుని "కుమార" లేదా 'రాష్ట్రీయ" లేదా "ప్రవేశిక" అని పిలిచేవారు.

రాష్ట్రములను జిల్లాలుగా విభజించారు. జిల్లాపాలకుని "స్థానిక" లేదా "రాజుక" అని పిలిచేవారు. జిల్లా పరిపాలనలో ఉన్నా ఇతర ఉద్యోగులను యుక్తాలు అనెడివారు.

పరిపాలనలో గ్రామం చిట్టచివరి భాగం. గ్రామధికారిని "గ్రామిక" అనెడివారు. గ్రామపరిపాలన కొరకు గ్రామ పెద్దలతో ఏర్పడిన పంచాయితి ఉండెడిది. ప్రతి 5 లేక 10 గ్రామలపై పరిపాలన పర్యవేక్షించుటకు "గోప" అనే ఉద్యోగి ఉండేవారు.

**9.2.3.3.** గూఢచారులు : పరిపాలనలో నియమితులైన ఉద్యోగుల ప్రవర్తనను తెలిసికొనుటకు, ప్రజల అవసరాల గురించి తెలిసికొనుటకు రాజులు, స్త్రీ పురుషులను హెచ్చు సంఖ్యలో గూఢాచారులుగా నియమించిరి.

**9.2.3.4.** న్యాయ పరిపాలన : రాజు న్యాయపాలనలో సర్వాధికారి. అతని ఆస్థానమే అత్యున్నత న్యాయస్థానం. న్యాయం ప్రజలకు అందుబాటులో ఉండునట్లు రాజ్యంలోని అనేక ప్రాంతాలలో రెండు రకాలైన న్యాయస్థానాలు ఏర్పాటు చేసారు. 1. ధర్మాస్థియా అనే సివిల్ న్యాయస్థానం 2. కంఠకశోధన అను క్రిమినల్ న్యాయస్థానము. హిందూ ధర్మశాస్త్రాన్ని అనుసరించి వివాదాలు పరిష్కరించేవారు. న్యాయస్థానాల ప్రధాన న్యాయమూర్తిని ధర్మాధికారి అని పిలిచేవారు. రాజ్యంలోని న్యాయవ్యవస్థనంతటిని వ్యవహారిక అనే ఉన్నత ఉద్యోగి పర్యవేక్షించెడివాడు. గ్రామములోని చిన్న చిన్న తగాదాలను, గ్రామాధికారి, గ్రామపెద్దలు పరిష్కరించుకొనేవారు.

మౌర్యులకాలంలో శిక్షలు చాలా కఠినంగా ఉండేవి. సత్యాన్ని రాబట్టుటకు దోషులను హింసించేవారు. అంగచ్ఛేదనం, కొరడాదెబ్బలు, మరణశిక్ష మొదలగు శిక్షలు విధించేవారు. అశోకుడు రాజ్యానికి వచ్చిన పిదప శిక్షలలోని కఠినత్వం తగ్గించాడు.

**9.2.3.5.** సైనిక వ్యవస్థీకరణ : మౌర్యులు తమసైన్యాన్ని అతినైపుణ్యంగా వ్యవస్థీకరించారు. సైన్యానికి కావలసినవన్ని సమకూర్చబడి శిక్షణతో వ్యవహరించెడిది. యుద్ధసమయంలో రాజే స్వయంగా సైన్యాన్ని నడిపించేవాడు. సైనిక వ్యవహారాలు చూచుటకు సేనాపతి

అనే ఉన్నత ఉద్యోగియుండేవాడు. చంద్రగుప్త మౌర్యునికి 6 లక్షల కాల్బలం, 30 వేల అశ్వికదళం, 9 వేల గజబలం, రథములు, ఐవాహనాలు, నౌకాదళం ఉన్నట్లు ప్లీనీ పండితుడు తెలియచేశాడు.

సైనిక వ్యవహారాలు చూచుటకు 30మంది సభ్యులతో కూడిన ఒక సంఘం ఉండేది. ఈ సంఘం 6 శాఖలుగా విభజింపబడింది. ఒకొక్క శాఖలో 5 గురు సభ్యులున్నారు. ఈ ఆరు శాఖలలోని మొదటి శాఖ నౌకాదళాన్ని, రెండవది రవాణా సమాచారవిషయాలను, మూడవది కాల్బలాన్ని నాల్గవది అశ్విక దళాన్ని, అయిదవది రథాలను, ఆరవది గజబలాన్ని గురించి జాగ్రత్తలు గైకొనేవి.

9.2.3.6. ప్రభుత్వ ఆదాయ వనరులు (రెవెన్యూ) : పంటలోని 1/4 లేదా 1/6 వంతు ప్రభుత్వం యొక్క ముఖ్య ఆదాయం. ఇది ధనరూపంలో గాని, ధాన్య రూపంలోగాని వసూలు చేసెడివారు. మరియు రాజుకు ద్రవ్య రూపమున వచ్చు బహుమతులు, కప్పం, కూడా రాజ్యానికి ఆదాయమే. ఇవిగాక అమ్మకపు పన్ను, మత్తుపానీయాలపై వసూలు చేయు సుంకము, గనులు, అడవులపై వచ్చు కౌలు, పంట కాలువలపై వసూలు చేయుపన్ను, నీటిపన్ను, జూదగృహములపై పన్ను, కబేళాపైపన్ను, వృత్తి పన్ను, న్యాయస్థానాలు విధించే అపరాధ సుంకం మొ. వన్నియు రాజ్యానికి వచ్చు ఇతర ఆదాయాలు.

9.2.3.7. నీటి వసతి : పంటపొలాలకు నీటి వసతి కలిగించుటకుగాను మౌర్యులు ప్రత్యేకమైన నీటిపారుదలశాఖను ఏర్పాటుచేసారు. నీటివసతి కొరకు ఈ శాఖ కాల్వలను చెరువులను త్రవ్వించేది. గ్రామప్రాంతాలలో అవసరమైన చిన్న కాల్వలను గ్రామస్తులే నిర్మించుకొనేవారు. చంద్రగుప్త మౌర్యుని పరిపాలనా కాలమందు గుజరాత్‌లోని సుదర్శన చెరువు నిర్మించబడింది.

9.2.3.8. ప్రజా ఉపయోగ కార్యాలు : మౌర్యరాజులు ప్రజాక్షేమానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. ప్రజల ఉపయోగార్ధము రహదారులను, నదుల, కాల్వలపైన వంతెనలు నిర్మించారు.

అశోకుడు బాటసారులకు నీడ నిచ్చుటకు రహదారుల కిరువైపుల చెట్లు నాటించి, ఉచిత విశ్రాంతి గృహాలు నిర్మింపచేసి, నీటి వసతి కొరకు బావులను త్రవించాడు. మనుష్యులకు, జంతువులకు, పక్షులకు వైద్యశాలలు నిర్మించాడు.

9.2.3.9. నగరపాలన - పురపాలక సంఘం. మౌర్య సామ్రాజ్యంలోని నగర పాలన పురపాలక సంఘాలకు అప్పగించబడింది. రాజధానియైన పాటలీపుత్ర నగరమును పాలించుటకు 30 మంది సభ్యులతో కూడిన ఒక పురపాలక సంఘం ఉండేది. ఈ సంఘం 6 శాఖలుగా విభజింపబడింది. ప్రతిశాఖలోను 5 గురు సభ్యులు ఉండేవారు. ఆరు శాఖలు ఆరు రకములైన విధులు నిర్వహించేవారు. మొదటి శాఖ పరిశ్రమలు, చేతి వృత్తుల వారిని గమనించెడిది. రెండవ శాఖ మౌర్యసామ్రాజ్యానికి వచ్చిన విదేశీయులకు వసతి కల్పించి వారిపై నిఘా ఉంచేది. మూడవ శాఖ జనన మరణాలు నమోదు చేసేది. నాల్గవది తూనికలు కొలతలపై నియంత్రణ చేసేది. అయిదవది వస్తుఉత్పత్తి, అమ్మకాలను గురించి జాగ్రత్త వహించేది. ఆరవది అమ్మిన వస్తువులపై 1/10 వ వంతు శిస్తు వసూలు చేసేది. నగర పరిపాలనా అధికారిని "నగరిక" అని పిలిచేవారు.

9.2.3.10. జనాభా లెక్కలు : ప్రతి సంవత్సరం మౌర్యులు జనాభా లెక్కను సేకరించేవారు. గ్రామమందు గ్రామిక, నగర మందు నగరిక ఈ జనాభా లెక్కలను సేకరించేవారు.

9.2.3.11. ప్రజా ఆరోగ్యం : ప్రజా ఆరోగ్యానికి మౌర్యులు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. మనుష్యులకు, జంతువులకు, పక్షులకు వైద్యశాలలు నిర్మింపచేసి నిపుణులైన వైద్యులను నియమించేవారు. ప్రజల ఆరోగ్యం కొరకు రహదారులను శుభ్రంగా యుంచేవారు. రహదారులను మురికిచేయు వారి వద్ద నుండి అపరాధపు రుసుము వసూలు చేసేవారు.

## 9.2.4. ముగింపు

కేంద్రీకృతమైన ఉద్యోగ పరిపాలనా వ్యవస్థ అయినప్పటికి మౌర్యుల పాలనలో స్థానిక స్వపరిపాలనకు హెచ్చు అవకాశములుండేవి. ప్రజా క్షేమమే ఈ ప్రభుత్వం యొక్క ముఖ్య లక్షణమై యుండేది. మౌర్యుల పరిపాలన విధానాన్నే తదుపరి కాలంలో మహమ్మదీయులు, ఆంగ్లేయులు కొనసాగించారు. ప్రస్తుతం భారతదేశపు పరిపాలనలోని అనేక అంశాలు ఆనాటి మౌర్యుల పరిపాలన నుండి గైకొన బడినవి.

## 9.3 మౌర్య సామ్రాజ్యంలో పరిస్థితులు

**9.3.1. ఉపోద్ఘాతం :** మౌర్యుల పరిపాలనతో ప్రాచీన భారతదేశపు రాజకీయ సాంస్కృతిక చరిత్రయందు క్రొత్త అధ్యాయం ప్రారంభమైయింది. మౌర్యవంశపురాజులు ఉదారస్వభావంతో పాలన చేయుటవల్ల ప్రజలు సుఖజీవనం సాగించి ఆర్థికంగా బలపడిరి. జైన, బౌద్ధమతాల వ్యాప్తివల్ల, మత, సాంఘిక పరిస్థితులలో మార్పులు సంభవించాయి. వీరు భారతదేశపు సరిహద్దులు దాటి రాజ్యాన్ని సంపాదించారు. ఒకే విధమైన పరిపాలన ద్వారా రాజకీయ సాంస్కృతిక ఏకత్వం సాధించారు. అట్టి మౌర్య సామ్రాజ్య పరిస్థితులు ఈ దిగువ తెలియజేయబడెను.

**9.3.2. సాంఘిక పరిస్థితులు :** మౌర్యుల కాలం నాటి ప్రజలు సంపన్నులై స్వయంసమృద్ధి కలిగియుండిరి. వీరి జీవితం సంతోషంగాను సుఖప్రదంగాను యుండేది.

**a.** కుటుంబం : సంఘంలో సమిష్టికుటుంబ వ్యవస్థ కలదు. కుటుంబ సభ్యులమధ్య ప్రేమానురాగాలుండి, పెద్దలు గౌరవించబడేవారు. బహుభార్యాత్వం అమలులో ఉన్నందున వివిధ కులాలకు, ఆచారాలకు చెందిన స్త్రీలు ఒకే కుటుంబంలో యుండేవారు. అట్టి కుటుంబంలో సుఖసంతోషం ఉండేది.

**b.** జీవన విధానం : జైన, బౌద్ధమతాల ప్రభావం వల్ల నీతి, అహింస, సత్యం అను సూత్రాలు ప్రజలు పాటించారు. మోక్షం పొందటానికి ఇహలోక సుఖాలు త్యజించారు. ప్రచారంలో నున్న పై సిద్ధాంతాలు అమలు పర్చకుండా విలాసవంతమైన జీవితం గడిపినవారు కూడా ఉన్నారు.

**c.** ప్రజల ప్రవర్తన : ప్రజలు నీతి నిజాయితీపరులని, ధైర్యవంతులని, కుతంత్రాలు తెలియవని, వీరికి దొంగల భయంలేదని, విలువైన వస్తువులు కూడా తాళాలు వేయని ఇండ్లలో వదలి వెళ్లేవారని మెగస్తనీసు రచనలను బట్టి తెలుస్తుంది.

**d.** ఆహారం : సంఘంలో శాకాహారులు, మాంసాహారులు ఉన్నారు. పాలు దాని వుత్పత్తులు, తీపి వస్తువులు, పండ్లు, బియ్యం, బార్లీ, గోధుమ, చేపలు, మాంసం, పండ్లరసం, వీరి ఆహారం. వీరు మత్తుపానీయాలు కూడా సేవించేవారు.

**e.** దుస్తులు - అలంకరణ : నూలు, సిల్కు, ఊలుతో చేయబడిన రెండు భాగాలుగా నున్న దుస్తులు ధరించిరి. మొదటి వస్త్రభాగం నేలమండల వరకు యుండు అంగీ, రెండవదానిలో సగం భుజం మీదుగా వేసుకొని మిగిలినది మెలిపెట్టి తలకు చుట్టుకొనేవారు. పురుషులు తలపాగా ధరించేవారు. కుట్టిన దుస్తులు వాడకంలోకి వచ్చాయి. రాజ్యంలో వస్త్ర పరిశ్రమ యున్నట్లు కౌటిల్యుడు పేర్కొన్నాడు.

వీరు బంగారం, ముత్యాలు, పగడాలు, దంతాలు, ఖరీదైన రాయితో చేయబడిన ఆభరణాలు ధరించారు. స్త్రీ పురుషులు చెవిదుద్దులు, కంఠహారాలు ధరించారు. ఎక్కువ ఆభరణాలు ధరించుటకు స్త్రీలు ఇష్టపడేవారు. తెల్లని చర్మంతో చేయబడ్డ పాదరక్షలు ధరించేవారు.

f. వినోదాలు : దీపావళి, వసంతోత్సవం, గిరిపూజ మొ. పండుగలు ప్రజలు ఆచరించారు. గానం, సంగీతం, నాటకాలు, పాచికలు, వేట, రథాల పోటీలు, జంతువులతో పోటీలు, కుస్తీ మొ.నవి వీరి వినోదాలు. స్త్రీలు బంతి ఆటయందు ఎక్కువ శ్రద్ధ చూపగా పురుషులు పడవల, ఈత, విలువిద్య పోటీలలో ఆసక్తి చూపిరి.

g. కులవ్యవస్థ - సంఘంలోని తరగతులు : ప్రారంభంలో కులవ్యవస్థ చాలా పటిష్టంగా యున్నది. కులాంతర వివాహాలు అంగీకరింపబడలేదు. ప్రజలు కులంగాని, కులవృత్తిని గాని మార్చుకొనుటకు వీలులేదు.

సంఘంలో ఏడు తరగతుల ప్రజలున్నట్లు మెగస్తనీసు పేర్కొన్నాడు. 1. వేదాంతులు, 2. Husbandman 3. Herds men లేదా వేటగాళ్ళు, 4. వ్యాపారస్తులు, చేతిపనివారు, 5. సైనికులు, 6. Secret Inspectors or oversees 7. కౌన్సిలర్లు. రాజ్యంలోని బానిసత్వ వ్యవస్థ అమలులో యున్నది.

బౌద్ధమత వ్యాప్తితో కులవ్యవస్థలోని పటిష్టత తగ్గింది. కులాంతర వివాహాలు, కులవృత్తి మార్చుకొనుట అంగీకరింపబడ్డాయి.

h. సంఘములో స్త్రీ స్థానం : వివాహం త్యజించిన స్త్రీలు మాత్రమే వేద విజ్ఞానం పొంది దాన్ని ప్రచారం చేయుటకు అనుమతించబడ్డారు. స్వేచ్ఛగా తిరుగుతున్న జైన, బౌద్ధ సన్యాసినుల ప్రభావం వల్ల సంఘంలో స్త్రీకి కొంత స్వేచ్ఛ ఇవ్వబడింది. సతీసహగమనం అంతరించుచుండెను. వితంతు వివాహాలు అనుమతించబడ్డాయి. వ్యభిచార వృత్తి అచ్చటచ్చట కలదు. చెడు ప్రవర్తన కల్గిన భర్తకు విడాకులిచ్చు హక్కు స్త్రీకి ఉన్నది. సంపన్నుల కుటుంబాలలో బహుభార్యాత్వం ఉన్నది. రాజుని కాపాడుటకు స్త్రీ రక్షక భటులు కూడా నియమించారు. స్త్రీ హత్య బ్రాహ్మణుని హత్య చేసినంత పాపంగా పరిగణించబడ్డది.

i. విద్య : ప్రభుత్వం, ప్రైవేటు వ్యక్తులు విద్యావ్యాప్తికి పాఠశాలలు నిర్మించారు. విద్యాబోధన మొదట బ్రాహ్మణులకే పరిమితమయింది. బౌద్ధమత వ్యాప్తితో బౌద్ధసాధువులు కూడా విద్యా బోధనకు నియమించబడ్డారు. ఈ పాఠశాలల్లో ధర్మశాస్త్రములు, వ్యాకరణం, Rhetoric, రాజనీతిశాస్త్రం, ఆర్థిక శాస్త్రం బోధించారు. తక్షశిల, ఉజ్జయిని, వారణాసి విశ్వవిద్యాలయాలు ప్రసిద్ధి చెం[illegible]వి. వీటిలో సాహిత్యం, మతం గురించి మాత్రమే బోధించేవారు. ప్రత్యేకంగా నేయబడిన గుడ్డ మీద లేదా చెట్టు బెరడు మీద వ్రాసేవారు. స్త్రీ విద్యకు ప్రాధాన్యత ఇవ్వబడింది. వ్యాపార, పారిశ్రామిక సంస్థలు సాంకేతిక శిక్షణ ఇచ్చేవి.

9.3.3. ఆర్థిక పరిస్థితులు : వ్యవసాయం ప్రజల ముఖ్యవృత్తి. వివిధ రకాలైన బియ్యం, బార్లీ, గోధుమ, ప్రత్తి, చెరకు కాయగూరలు, పండ్లు వీరి ముఖ్యపంటలు. పశువులు, కోళ్ళఫారాలు, పాల ఉత్పత్తి కేంద్రాలు ప్రభుత్వ ఆధీనంలో ఉండేవి. సృష్టి వైపరీత్యం వల్ల పంటలకు నష్టం కలుగకుండా ప్రభుత్వం జాగ్రత్త వహించేది. అత్యవసర పరిస్థితి ఎదుర్కొనేందుకు ధాన్యాగారంలో ధాన్యం నిల్వయుంచేది.

పరిశ్రమ కూడా బాగా అభివృద్ధి చెందింది. ముఖ్యమైన గనులు, ఉప్పు, నౌకా నిర్మాణం, వివిధ లోహ పరిశ్రమలు, ప్రభుత్వ ఆధీనంనందు ఉండేవి. పారిశ్రామిక వేత్తలందరు ఒక సంఘంగా లేదా శ్రేణిగా ఏర్పడిరి. ఈ శ్రేణులకు శాసన, కార్య నిర్వాహక, న్యాయాధికారాలు ఉండేవి. ఇవి బ్యాంకులుగా వ్యవహరించుచు ప్రజల యొద్దనుండి డబ్బు సేకరించి, దానికి వడ్డీ చెల్లించేది.

పరిశ్రమ అభివృద్ధితో వ్యాపారం అభివృద్ధి చెందింది. వ్యాపార సౌకర్యం కొరకు రాజ్యంలోని పలు పట్టణాలను కలుపుచూ రహదారులు నిర్మించారు. వ్యాపారం పర్యవేక్షించుటకు, ధరలను అదుపుచేయుటకు, తూనికలు, కొలతలు సరిగా చూచుటకు తనిఖీ అధికారులను నియమించారు.

సముద్రమార్గములో సిలోను, సిరియా, ఈజిప్టు, రోము, ఇతర పాశ్చాత్య రాజ్యాలతో వ్యాపారం సాగింది. తీయని మత్తు పానీయాలు, గాజు, వెండి పాత్రలు, గానం చేయు బాలురు, అంతఃపురమునకు అందమైన కాంతలు, ఖరీదైన రాళ్ళు, సన్ననివస్త్రము, దిగుమతి చేసుకొనబడెను. విలాసవస్తువులు, సిల్కు, సుగంధ ద్రవ్యములు, సుగంధములు, సెంటు, ఔషధపు కాడలు (herbs), నీలిమందు, గంధకపుచెక్క, ముత్యాలు, ఖరీదైన రాళ్ళు, దంతం, ఇనుము, ఉక్కు మొ.వి విదేశాలకు ఎగుమతి చేయబడెను.

పరిశ్రమ, వ్యాపార అభివృద్ధితో సంఘంలో ధనికవర్గం ఉద్భవించింది. వీరు విహారాలకు, దేవాలయాల నిర్మాణానికి దానాలు ఇచ్చేవారు. పెద్దవ్యాపార సంస్థలకు అప్పులిచ్చే వ్యాపార కంపెనీలు కూడా ఉన్నాయి.

## 9.3.4. మత పరిస్థితులు

వేదకాలం నాటి ఇంద్రుడు, వరుణుడు, ఇతిహాస కాలంనాటి విష్ణువు, శివుడు, సూర్యుడు పూజింపబడిరి. గంగానదిని, నాగ సర్పమును కూడా పూజించిరి. దేవతలయొక్క విగ్రహాలు చేసి అమ్మట ఆచారంలో ఉన్నది. ఈ విధంగా హిందూమతం రాజ్యంలో ఉన్నప్పటికి కొత్తగా ఉద్భవించిన జైన, బౌద్ధమతాలధర్మం, అర్థం, కామం, మోక్షం అనేవి జీవితాశయాలుగా బోధించాయి. బౌద్ధమతానికి రాజాదరణ లభించుట వల్ల రాజ్యంలో ముఖ్యమైన మతంగా అది గుర్తింపు పొందింది.

## 9.3.5. సాహిత్యం

పాలకులు, ప్రజలు, సాహిత్యం పట్ల ఎక్కువ శ్రద్ధ చూపారు. తక్షశిల విజ్ఞానం బోధించు కేంద్రంగా అభివృద్ధి చెందుచుండినది. మౌర్యుల కాలంలో అనేకమైన సాహిత్య రచనలు చేయబడ్డాయి. కౌటిల్యుని అర్థశాస్త్రము, బద్రబాహుని కల్పసూత్రము, బౌద్ధుల కథావత్తు, మొ. వీరి కాలంలో రచింపబడ్డాయి. సంస్కృత భాషకూడా అభివృద్ధి చెందినది.

### 9.3.6. కళలు

భారతదేశపు కళల చరిత్ర మౌర్యులతో ప్రారంభమైనది. మౌర్యులు గొప్ప భవన నిర్మాతలు. అశోకునికి పూర్వం చెక్కతో కట్టడాల నిర్మించబడ్డాయి. అశోకుడు, రాతితో నిర్మాణం చేపట్టాడు. వీరు అంతస్థులుగా ఉన్న గృహాలను అలంకారప్రాయంగా నిర్మించుకున్నార. అశోకుడు శాసనాలు చెక్కించిన ఏకశిలా స్థంభాలు అందాన్ని మాత్రమేకాక అద్భుతమైన సాంకేతిక ప్రతిభను కూడా ప్రదర్శిసున్నాయి. సారనాథ్‌లోని ఏకశిలా స్థంభం యొక్క Capital నాలుగు సింహపు బొమ్మలతో ఉండి మౌర్యుల యొక్క కళానైపుణ్యాన్ని చాటుతుంది అశోకుడు 8400 స్థూపాలు నిర్మించినట్లు వాటిలో సాంచి స్థూపం అతి ప్రాముఖ్యమైనదిగా తెలియుచున్నది. వీరు రాజధానిలో వైభోగముత కూడిన భవనాలు నిర్మించినట్లు గ్రీకులు పేర్కొన్నారు. మౌర్యులపాలన తరువాత 100 సంవత్సరాలకు భారతదేశం వచ్చిన చైనా యాత్రికుడ ఫాహియాన్ మౌర్యుల కళను గురించి పొగడినాడు.

### 9.3.7. ముగింపు

మౌర్యుల పాలన భారతదేశపు సంస్కృతీరంగంలో స్వర్ణయుగంగా భావించబడింది. వీరు రాజ్యమంతటిలో ఒకే విధమైన పరిపాలనన ప్రవేశపెట్టి, శాంతి భద్రతలను రక్షించి, ప్రజల అభ్యున్నతికి తోడ్పడ్డారు. ప్రపంచ చరిత్రలో యుద్ధంలో విజయం సాధించిన తరువాత యుద్ధాన్ని త్యజించి, యుద్ధాన్ని పూర్తిగా నిషేధించిన చక్రవర్తి అశోకుడొక్కడే. ఆ విధంగా ఐక్యరాజ్యసమితికి మార్గదర్శకుడైన అశోకునిక ప్రపంచం ఎంతగానో రుణపడియుంది. అశోకుడు పరమత సహనం పాటించుటే గాక, ఆదర్శంతుడైన పాలకుడేవిధంగా ఉండా తెలియచెప్పాడు.

భారతదేశపు సంస్కృతి ఏకత్వం సాధించుట ద్వారా మౌర్యులు సంస్కృతికి ఎంతో సేవ చేసారు. వీరు పరిశ్రమలు, వ్యాపా వర్తకం అభివృద్ధి చేసినందున ప్రజలు సంపన్నులైనారు. మౌర్యుల 150 సంవత్సారాల పరిపాలనా కాలంలో భారతదేశం నాగరిక, సంస్కృ అభివృద్ధి సాధించి, ప్రపంచలోని గొప్ప దేశాలతో పాటు సమాన ప్రతిపత్తిని సంపాదించగలిగింది.

## 9.4. మౌర్య సామ్రాజ్య పతనానికి కారణాలు :

**9.4.1. అశోకుని బాధ్యత :** చరిత్ర కారులు వేరు వేరు దృక్పధాలతో అశోకుడే మౌర్యసామ్రాజ్య పతనానికి కారణమని చెప్పారు.

**9.4.1.1 మత విధానం :** ఒక వర్గపు చరిత్రకారుల అభిప్రాయంలో అశోకుడు అనుసరించిన మత విధానం మౌర్యసామ్రాజ్య పతనానికి కారణమైంది. వారిమాటల్లో చెప్పాలంటే అశోకుడు బౌద్ధమతాన్ని అంగీకరించి దానిని ప్రచారం చేశాడు. అందువల్ల రాజ్యంలోని బ్రాహ్మణులు అతని తరువాత వచ్చిన రాజులను ప్రతిఘటించారు. అందువల్ల మౌర్యసామ్రాజ్యం పతనమైయినది. కాని ఈ చరిత్రకారుల అభిప్రాయం అంగీకారంగా లేదు. ఎందువలనంటే అశోకుడు బౌద్ధమతం స్వీకరించినప్పటికి లౌకిక విధానాన్ని అవలంభించాడు. అతడు బ్రాహ్మణులను ధూషించినట్లు ఎక్కడా ఆధారాలు లేవు.

**9.4.1.2 అహింసా సిద్ధాంతం :** రెండవ వర్గపు ఉద్దేశం ప్రకారం, అశోకుడు అనుసరించిన అహింసా సిద్ధాంతం మౌర్యసామ్రాజ్య పతనానికి దారితీసింది. ఎందుకంటే కళింగ యుద్ధం తరువాత, భవిష్యత్‌లో యుద్ధం చేయకూడదని నిర్ణయించుకున్నాడు. బౌద్ధమతం అంగీకరించి అహింసను బోధించాడు. సైన్యాన్ని పెంచి పోషించటానికి బదులుగా ధర్మ మహామాత్రులను నియమించి పోషించి ధర్మం ప్రచారం చేశాడు. దీనిఫలితంగా సైనికులలో యుద్ధం అంటే ఆసక్తిపోయింది. సైన్యం యుద్ధం చేసేశక్తి సామర్థ్యం కోల్పోయింది. ఇట్టి సైన్యం అశోకుని తరువాత వచ్చిన రాజులకు రాజ్యాన్ని రక్షించటానికి ఏ విధంగాను సహాయపడలేకపోయింది. కాని ఈ వర్గపు చరిత్రకారులు చెప్పిన దానిలో కూడా సత్యం లేదు. రాజ్యంలో శాంతి భద్రతలను కాపాడుటానికి అశోకుడు సైన్యాన్ని సమకూర్చుకున్నాడు. సైన్యానికుండవలసిన శక్తి సామర్థ్యాలను కూడా పెంపొందింపజేశాడు. అహింసా సిద్ధాంతం అవలంభించినప్పటికి తిరుగుబాటు ధోరణి ప్రదర్శించిన అటవి జాతులవారిని హెచ్చరించినట్లు సాక్ష్యాలు ఉన్నాయి. కనుక అశోకుడు అనుసరించిన అహింసా సిద్ధాంతం సైన్యాన్ని పూర్తిగా బలహీనపర్చలేదు

పై చెప్పబడిన అభిప్రాయాలలో వైరుధ్యం ఉన్నప్పటికి, మౌర్యసామ్రాజ్య పతనానికి అశోకుని భాధ్యత లేకపోలేదు. యుద్ధం అనే విధానాన్ని అనుసరించి మౌర్య సామ్రాజ్యం స్థాపించబడింది. అట్టి విధానాన్ని అనుసరించుట ద్వారానే ఆ రాజ్యం కాపాడబడుతుంది కాని అహింసా సూత్రం వల్లకాదు. ఇతడు అనుసరించిన మతవిధానం, అహింసా సిద్ధాంతం వల్ల సైన్యం పూర్తిగా గాక పోయినప్పటికీ కొంతమేరకు బలహీనమైపోయింది. ఇట్టి బలహీనమైన సైన్యం తదుపరి కాలములో సామ్రాజ్యానికి వాటిల్లిన ఆపదలనుండి దానిని రక్షింపలేక పోయింది. ఆ విధంగా అశోకుడు తన విధానాలవల్ల మౌర్యసామ్రాజ్య పునాదులనే కుదిపివేశాడు.

మౌర్య సామ్రాజ్య పతనానికి అశోకుడొక్కడే బాధ్యుడనటానికి వీలులేదు. అనుసరించిన విధానాలతో సంబంధం లేకుండా మౌర్యసామ్రాజ్యం, అశోకుని తరువాత ఏదో ఒక రోజు పతనమయ్యేందుకు సిద్ధంగా యున్నదని ఇతర కారణాలను పరిశీలిస్తే అర్థమవుతుంది.

**9.4.2. మౌర్య సామ్రాజ్య విభజన :** అశోకుని మరణానంతరం అతని మనుషులు రాజ్యాన్ని విభజించుకొని పాలించినట్లు చరిత్ర ఆధారాలవల్ల తెలియుచున్నది. ఇట్టి విభజన వల్ల పరిపాలనలో ఏకత్వం, రాజకీయ ఏకత్వం నశించి, సామ్రాజ్య క్షీణదశ ప్రారంభమయింది.

**9.4.3. బలహీనులైన రాజులు :** మౌర్య సామ్రాజ్యం చాలా విశాలమైన సామ్రాజ్యం. అట్టి సామ్రాజ్యన్ని చంద్రగుప్తమౌర్యుడు బిందుసారుడు అనుసరించిన యుద్ధవిధానం ద్వారా గాని, లేదా అశోకుడు అనుసరించిన అహింస, ధర్మవిధానాల ద్వారాగాని రక్షించుకోవాలి. కాని అశోకుని తరువాత రాజ్యానికి వచ్చిన వారందరు బలహీనులు. వారిలో లక్షణాలు లేవు.

**9.4.4. సామ్రాజ్యనైసర్గిక వైరుధ్యం :** మౌర్యులు భారతదేశపు సరిహద్దులలోనేగాక, సరిహద్దు ఆవలివైపున కాబూలు, కాందహారు, హీరత్, బెలూచిస్థానం, ఆఫ్ఘనిస్థానం భూభాగలను కూడా తమ రాజ్యంలో కలిగియుండిరి. ఇట్టి నైసర్గిక వైరుధ్యం ఉన్నప్పటికి అశోకుని కాలం వరకు వారు మౌర్యులకు లోబడి యుండిరి. అశోకుని మరణానంతరం వారిలో స్వతంత్ర్యకాంక్ష పెరిగి మౌర్య అధికారం ధిక్కరించుట ప్రారంభమై సామ్రాజ్యం క్షీణించుటకు అవకాశం ఏర్పడింది.

**9.4.5. సామంతుల స్వాతంత్ర్య కాంక్ష :** మౌర్యసామంతులలో సామ్రాజ్యకాంక్ష ఎక్కువగా యుండేది. బిందుసారుని పరిపాలనా కాలంలో తక్షశిల, దక్కన్ తిరుగుబాటు సామంతుల యొక్క స్వాతంత్ర్యకాంక్షను వెల్లడిస్తున్నాయి. అశోకుని తరువాత తక్షశిలలో తరచుగా తిరుగుబాట్లు చెలరేగెను. సామ్రాజ్యంలోని ఇట్టి తిరుగుబాట్ల వల్ల పరిపాలన దెబ్బతిని శాంతి భద్రతలకు అవాంతరం ఏర్పడింది. అందువల్ల మౌర్యపరిపాలన యెడల ప్రజలకు విరక్తి కలిగింది.

**9.4.6. రాష్ట్ర పాలకుల అణచివేత విధానం :** స్వాతంత్ర్యం కాంక్షించిన రాష్ట్రపాలకులు తిరుగుబాట్లు చేయగా, రాజుకు విధేయులైన రాష్ట్రపాలకులు పరిపాలనలో అణచివేత విధానం అవలంబించారు. వీరు ప్రజాక్షేమం విస్మరించి, వారి యొద్దనుండి బలవంతంగా శిస్తు వసూలు చేయుచుండేవారు. దీని ఫలితంగా ప్రజలు మౌర్య ప్రభుత్వంకు వ్యతిరేకులైరి.

**9.4.7. బలహీనమైన మౌర్య ప్రభుత్వం :** మౌర్యుల ప్రభుత్వం కేంద్రీకృతమైన ఉద్యోగుల పాలనా వ్యవస్థ. కాని దీనిలో స్థానిక స్వపరిపాలనకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. అనగా ప్రభుత్వం సరిగా వ్యవస్థీకరించబడక బలహీనమైంది. దీని ఫలితంగా రాష్ట్రపాలకులకు కొంత స్వేచ్ఛ లభించి వారికి ఇష్టం వచ్చిన రీతిలో సమర్థులైన పాలకులుండుటచే రాష్ట్రపాలకులపై బలహీనులగుట వల్ల ప్రభుత్వం కూడా బలహీనమై రాష్ట్రపాలకులపై అజమాయిషీ లేకుండా పోయింది. రాష్ట్రపాలకులు అవలంభించిన స్వతంత్ర్యవిధానాల వల్ల పరిపాలన దెబ్బతిని మౌర్యసామ్రాజ్యం క్షీణిరచింది.

**9.4.8. వార్తా - రవాణాసౌకర్యాలు లేకపోవుట :** మౌర్యులకు వార్తా - రవాణాసౌకర్యాలు లేకపోవుట వల్ల విస్తారమైన సామ్రాజ్యంలోని రాష్ట్రపాలకుల పై సరిగా నియంత్రణ చేయలేకపోయారు. ఆయా ప్రాంతాలలో చెలరేగిన తిరుగుబాట్లు కూడా అణచివేయలేక పోయారు.

**9.4.9. దిగజారిన ఆర్థిక పరిస్థితి :** ప్రజాక్షేమం కొరకు, ధర్మప్రచారం కొరకు అశోకుడు ఎక్కువ ధనం ఖర్చుచేశాడు. లౌకిక విధానం అవలంభించి అన్ని మతాల వారికి ఉదారంగా దానాలు చేశాడు. దానికారణంగా అతని మరణానంతరం వచ్చిన పాలకులు దిగజారిన ఆర్థిక పరిస్థితులు సవరించుకోలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం కుంటుపడింది. ఈ పరిస్థితులలో మౌర్యులు ప్రజల సహకారం పొందలేకపోయారు.

**9.4.10. ప్రజలలో జాతీయభావం లేకపోవుట :** అశోకుని కాలం వరకు మౌర్యులు సామ్రాజ్యంలో రాజకీయ ఏకత్వంను కాపాడిరి. ఈ రాజకీయ ఏకత్వం ప్రజలలో జాతీయ భావాన్ని కలిగించలేదు. అశోకుని వరకు రాజులందరు బలవంతులు కాబట్టి ప్రజలందరు ఒక్కటిగా ఆ రాజులకు విధేయులుగా యుండిరి. కాని తామంతా ఒకే రాజ్యానికి చెందినవారమని భావన వారిలో కలుగలేదు. కనుకనే బలహీనులైన రాజులు సింహాసనానికి వచ్చినప్పుడు ప్రజలలో ఏకత్వం పోయింది. అరాచకం ప్రబలి రాజులను వ్యతిరేకించారు.

**9.4.11. ఆంధ్రులు - కళింగులు, మె. స్వతంత్రులగుట :** దక్కనులోనున్న ఆంధ్రులు మౌర్యులకు సామంతులుగా యుండి అశోకుని కాలం వరకు కప్పం చెల్లించారు. అశోకుని తరువాత వచ్చిన రాజుల బలహీనతను అదునుగా తీసుకుని వారు స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆ విధంగానే అశోకుడు జయించి మౌర్యసామ్రాజ్యానికి కలిపిన కళింగ కూడా స్వతంత్ర్యరాజ్యమైపోయింది.

**9.4.12. విదేశీయుల దాడులు - క్రీ.పూ. 190 - డెమిట్రియస్ :** సెల్యూకస్ మరణానంతరం అతని సామ్రాజ్యంలోని బాక్ట్రియా, పార్థియా రాష్ట్రాలు స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాయి. బాక్ట్రియా గ్రీకుల (యవనుల) కు రాజైన డెమిట్రియస్ క్రీ.పూ. 190 సం.లో భారతదేశంపై దండెత్తి మౌర్యసామ్రాజ్యంలోని వాయవ్య ప్రాంతంలో కొంత భూభాగాన్ని ఆక్రమించాడు. దానితో మౌర్యుల అధికారం, గౌరవం పతనమైంది.

**9.4.13. ఆస్థానపు కుట్రలు - పుష్యమిత్రుని విజృంభణ - క్రీ.పూ. 185 B.C. :** రాజులు బలహీనులు కావటంతో మౌర్యుల ఆస్థానం కుట్రలకు, కుతంత్రాలకు నిలయమైపోయింది. ఆస్థానంలో ఉన్న ఉద్యోగులకు అధికార దాహం ఎక్కువైంది. దాని ఫలితంగా మౌర్యవంశపు చివరి రాజైన బ్రహద్రతను అతని సైన్యాధిపతి, శుంగవంశీయుడైన పుష్యమిత్రుడు హత్యగావించి క్రీ.పూ. 185 సం. మగధ సింహాసనాన్ని ఆక్రమించి శుంగ వంశపాలన ప్రారంభించాడు.

### 9.4.3. ముగింపు

మౌర్యవంశ పతనంలో భారతదేశంలో రాజకీయ ఏకత్వం నశించి, అనేక చిన్నరాజ్యాలు ఉద్భవించాయి. ఈ వంశ పరిపాలన ప్రారంభమునుండి క్రమబద్ధమైన చరిత్ర లభ్యమగుట వల్లను, భారతదేశపు కళాచరిత్ర ఈ వంశంతో ప్రారంభమగుటవల్లను భారతదేశంలో విశాలమైన సామ్రాజ్య స్థాపనకు ఈ వంశం కారణం అగుటవల్ల ప్రాచీన భారతదేశ చరిత్ర సంస్కృతిలో మౌర్యవంశానికి విశిష్టమైన స్థానం లభించింది. అందువల్లనే R.K. ముఖర్జీ పండితుడు ఈ విధంగా చెప్పాడు. "రెండువేల సంవత్సరములు గతించినప్పటికీ అశోకుడి మూలంగా వచ్చిన భారత సంస్కృతి యొక్క నైతిక అభివృద్ధి ఈ సువిశాల నాగరికతా ప్రపంచంలో ఇంకా కీర్తింపబడుచు ఒక మైలురాయిగా నిలిచింది.

"But the moral ascendency of Indian culture over a large part of the civilised world, which Ashoka was mainly instrumental in bringing about remained for centuries as a monument to her glory and has not altogether vanished ever now after the lapse of more than two thousand years" - R.K. Mukharjee

## అభ్యాసాలు

A. వ్యాస ప్రశ్నలు :

1. మౌర్య వంశపు పతనానికి కారణాలు తెలియజేయుము
2. మౌర్యుల పరిపాలనలోని ముఖ్యాంశాలను పేర్కొనుము .
3. మౌర్యసామ్రాజ్యంలోని సాధారణ పరిస్థితులను వ్రాయుము.

B. సమస్య పూరిత పశ్నలు :

1. మౌర్య సామ్రాజ్య పతనానికి అశోకుడు, ఎంతవరకు బాధ్యుడు.
2. మౌర్యసామ్రాజ్యంలోని సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితులు వ్రాయుము.

C. లఘుటీక ప్రశ్నలు (క్లుప్తముగా జవాబు వ్రాయుము)

1. మౌర్యుల నాటి నగరపాలన  2. మౌర్యుల కళ
3. పాటలీపుత్రం  4. అర్థశాస్త్రం  5. మొగస్తనీసు

D. కుశాగ్ర బుద్ధి పరీక్ష :

1. భారతదేశపు సంస్కృతి నైతిక అభివృద్ధికి కారకుడైన పాలకుడు ( )
   a) చంద్రగుప్త మౌర్యుడు  b) అశోకుడు
   c) బిందుసారుడు  d) మహా పద్మనందుడు  e) ధననందుడు
2. మౌర్యపరిపాలనలో న్యాయపాలనను పర్యవేక్షించుట అధికారి ( )
   a) వ్యవహారిక  b) రాజు
   c) గ్రామిక  d) నాగరిక  e) మహామాత్ర
3. ప్రజాసంక్షేమారాజ్యాన్ని స్థాపించిన ప్రాచీన చక్రవర్తి (
   a) మహాపద్మనందుడు  b) చంద్రగుప్తమౌర్యుడు
   c) బిందుసారుడు  d) దశరథుడు  e) అశోకుడు
4. మౌర్యుల పాలనలో 5 లేక 10 గ్రామాల సమూహంపై ఉన్న అధికారి (
   a) గ్రామిక  b) గ్రామబోజక
   c) గోప  d) కుమార  e) స్థానిక
5. బౌద్ధమతాన్ని అంతర్జాతీయ మతంగా చేసినవాడు (
   a) అశోకుడు  b) బుద్ధుడు
   c) చంద్రగుప్తమౌర్యుడు  d) బిందుసారుడు  e) దశరథుడు

III. జతపర్చుము

| | |
|---|---|
| 1. కౌటిల్యుడు | (a) అశోకుడ |
| 2. ఇండికా | (b) అర్థశాస్త్రం |
| 3. ఏకశిలాస్థంభాలు | (c) కల్పసూత్రం |
| 4. బద్రబాహుడు | (d) మొగస్తనీసు |
| 5. సుదర్శన చెరువు | (e) చంద్రగుప్త మౌర్యుడు |

## ఉపయుక్త గ్రంథాలు


1. K.M Panikar - A survey of Indian History
2. B.N. Luniya - Life and culture in Ancient India
3. R.C. Majumdar - An Advanced History of India
4. Bharatiya Vidhya Bhavan's Series - History and culture of the Indian people Vol II
5. K.A. Nilakanta Sastri - Avance History of India
G. Srinivasachari
6. K.A. Nilakanta Sastri - Age of the Nandas and Mauryas
7. R.C. Majkundar - Ancient India
8. Dr. V.A. Smith - Early History of Ancient India
9. Rama Shauka Tripati - History of Ancient Inndia
10 Romila Thapar - Asoka and Dechine of the Mauryas.

పాఠం - 10

# కుషాణులు - కనిష్కుడు - సాంస్కృతిక సేవ

## 10. 1 లక్ష్యం

మౌర్య సామ్రాజ్య పతనానంతరం భారతదేశంపై జరిగిన విదేశీయుల దండయాత్రల గురించి వానివలన కలిగిన రాజకీయ, సాంస్కృతిక ఫలితాలను గురించి ఈ పాఠంలో అధ్యయనం చేయబడుతుంది.

ముఖ్యాంశ సంగ్రహం

10. 2 ఆధారాలు

10. 3 ఉపోద్ఘాతం

10. 4 యవనులు

10. 5 శకులు

10. 6 పార్థియనులు

10. 7 కుషాణుల ఆగమనం, తొలిచరిత్ర

10. 8 కనిష్కుడు

10. 9 తరువాతి కుషాణులు

10. 10 సాంస్కృతిక ఫలితాలు

10. 11 సారాంశము

## 10. 2 ఆధారాలు

1. శాసనాలు
2. బంగారు నాణాలు
3. వాస్తు శిల్పాలు
4. దేశీయ సాహిత్యం : బుద్ధ చరిత్రము, సౌందరనందం సారి పుత్ర ప్రకరణలు, లలిత విస్తారం మున్నగునవి.
5. విదేశీ రచనలు : ది పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సీ, మొదటి హన్ రాజకుటుంబ గాథాలు, చివరి హన్ రాజకుటుంబ గాథలు.

## 10. 3 ఉపోద్ఘాతం

మౌర్య సామ్రాజ్య పతనానంతరం గుప్తరాజులు విజృంభించేవరకూ ఉత్తర భారతదేశాన్ని సమైక్యం చేసి సార్వభౌమాధికారాన్ని పునరుద్ధరించగలిగిన రాజవంశం ఉదయించలేదు. మగధలో శుంగులు, కాణులు, దక్షిణాపథంలో శాతవాహనులు పాలిస్తున్న కాలంలో వాయవ్య భారతం విదేశీ దండయాత్రలకు గురిఅయినది. ఇండో - బాక్ట్రియన్లు, శకులు, పార్థియన్లు కుషానులు ఆ ప్రాంతాలలో రాజ్యాలు స్థాపించి పాలించారు. ఈ యుగంలో ఉత్తరభారతదేశం రాజకీయంగా అల్లకల్లోలానికి గురిఅయినది. కాని సాంస్కృతిక పరంగా చాలా

విశిష్టమైన పరిణామాలు జరిగాయి. విదేశ జాతులతో దేశంలో ప్రవేశించిన వివిధ సాంస్కృతిక ప్రభావాలను జీర్ణం చేసుకొని భారతీయ సంస్కృతి సుసంపన్నమయినది. ప్రస్తుతం ఈ పాఠంలో విదేశీరాజ వంశాల పాలన, అందు ముఖ్యంగా కుషాణులు, వారు భారతీయ మతాలకు, కళలకు చేసిన సేవ అధ్యయనం చేయబడుతుంది.

## 10. 4 యవనులు

మౌర్యవంశం గతించిన తరువాత భారతదేశంపై ప్రథమంగా దండెత్తి వచ్చినవారు యవనులు. వీరే ఇండో - బాక్ట్రియన్‌లు లేక ఇండో - గ్రీకులు. వీరి రాజధాని బాక్ట్రియా. ఈ బాక్ట్రియా నగరము హిందూకుష్ పర్వతాలకు ఆక్స్ నదికి నడుము కలదు. మధ్య ఆసియా వర్తక వాణిజ్యాలకు ఇది కూడలి. ఆసియాలో గ్రీకు రాజ్యాన్ని పాలించుచున్న రెండవ ఆంటియోకస్‌పై బాక్ట్రియాలోని గ్రీకులు తిరుగుబాటు చేసి (క్రీ.పూ. 226) స్వాతంత్ర్యాన్ని ప్రకటించారు. బాక్ట్రియా స్వాతంత్ర్యాన్ని స్థాపించిన డియోడోటస్ తన రాజ్యాన్ని కాస్పియన్ సముద్రమునుండి ఆఫ్ఘనిస్థానం వరకు వ్యాపింపజేసెను. అతని మరణానంతరము యూథిడిమస్ బాక్ట్రియా సింహాసనం అధిష్ఠించెను. ఆసియాలోని గ్రీకు చక్రవర్తి మూడవ ఆంటియోకస్ చేసిన దండయాత్రను విఫలం చేసి సంధిని కుదుర్చుకొనెను. ఆ తరువాత భారతదేశంపై దాడి జరిపి మౌర్య వశంస్థుడైన సుభగసేనుని ఓడించి కాబూల్, కాందహారులను ఆక్రమించెను. యూథిడిమస్ మరణానంతరం డెమిట్రియస్ రాజ్యానికి వచ్చి భారతదేశంపై దండెత్తి పంజాబువరకు జయించాడు. పంజాబ్‌లోని సాకలా రాజధానిగా చేసుకొని పాటలీపుత్రం వరకూ దాడి జరిపినాడని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. డెమిట్రియస్ భారత్ దండయాత్రలలో ఉన్న కాలంలో యూక్రటైడిస్ అనే సేనాని బాక్ట్రియాలో తిరుగుబాటు చేసి స్వతంత్రుడయినాడు. డెమిట్రియస్ తిరిగి బాక్ట్రియాను జయింపలేక పోయెను. ఇతని రాజ్యం పంజాబుకు మాత్రమే పరిమితమయింది. పంజాబులో స్థిరపడిన డెమిట్రియసు వంశస్థులలో మీనాండరు ఘనుడు. ఇతడు బౌద్ధమత అభివృద్ధికి కృషిచేసెను. ఇతని మరణానంతరము అనతికాలానికే ఈ ప్రాంతాన్ని శకులు ఆక్రమించారు.

## 10. 5 శకులు

వీరి ఆదిమ నివాసం సర్‌డేరియా ఉత్తర ప్రాంతం. వీరు గ్రీకులను ఓడించి (క్రీ.పూ. 165) పార్థియా, బాక్ట్రియా రాజ్యాలను ఆక్రమించిరి. ఆఫ్ఘనిస్థాన్ దక్షిణ ప్రాంతంలో ఓ స్థిర నివాసము ఏర్పరచుకొని వీరు క్రమంగా పశ్చిమ ఉత్తర భారతాన్ని ఆక్రమించారు. శకుల మొదటిరాజు మవుస్. ఇతని తరువాత అజెస్ శకులకు రాజయినాడు. ఇతని తరువాత అనతికాలానికి ఈ ప్రాంతాన్ని పార్థియనులు ఆక్రమించారు. భారతదేశంలో శకుల రాజ్యంలోని రాష్ట్రపాలకులను క్షాత్రపులంటారు. వీరిలో మహారాష్ట్రంలో రాజ్యమేలిన క్షహరాట వంశానికి చెందిన నహపాణుడు, మాళవలో రాజ్యమేలిన కార్దమక వంశానికి చెందిన రుద్రదాముడు అగ్రగణ్యులు.

## 10. 6 పార్థియనులు

వీరినే పహ్లావులని కూడా అంటారు. వీరి ప్రథమ నివాసం కాస్పియన్ సముద్ర దక్షిణ ప్రాంతములోని పార్థియా. వానోనీస్ పార్థియాను స్వతంత్ర రాజ్యంగా ప్రకటించి తన రాజ్యాన్ని భారత సరిహద్దుల వరకు విస్తరింపజేసెను. పహ్లవరాజులలో అగ్రగణ్యుడైన గంధోఫర్నీస్ భారతదేశంలోని వాయవ్య ప్రాంతాన్ని జయించి పరిపాలించెను. ఇతని తరువాత కుషాణులు ఈ ప్రాంతాన్ని ఆక్రమించిరి.

## 10. 7 కుషాణుల ఆగమనం, తొలిచరిత్ర

మౌర్యుల పతనానంతరం గుప్త సామ్రాజ్య స్థాపనకు ముందు ఉత్తర భారతదేశముపై దండెత్తిన విదేశీజాతులలో ప్రముఖులు కుషాణులు. మౌర్యుల పతనానంతరము మధ్య ఆసియా, ఉత్తర భారతదేశాలను ఏకం చేసి సువిశాల భూభాగాన్ని పరిపాలించిన కుషాణుల కాలము భారతదేశ చరిత్ర - సంస్కృతిలో అత్యున్నత స్థానాన్ని అలంకరించెనని డి.సి. సర్కార్ అభిప్రాయం.

2. కుషాణులు ఏ జాతికి చెందిన వారనే విషయం చాలా క్లిష్ట సమస్యగా పరిణమించింది. దీనిపై పండితుల అభిప్రాయాలలో వైవిధ్యం కనిపించుచున్నది. కుషాణుల పేర్లు, వారి హోదాను తురుష్క భాషతో సన్నిహిత సంబంధం కలిగియుండుట, కుషాణుల వంశావళికలు తురుష్కులను పోలియుండుట ప్రాతిపదికపై అభిప్రాయాన్ని వెల్లడించారు. కుషాణులు శకజాతికి చెందినవారని

మరికొందరు పండితులు అభిప్రాయపడ్డారు. చైనాకు చెందిన తురుష్క భూభాగంలో వాడుకలో ఉన్న ఇరాన్ లేక శక భాషల్లో కుషాణుల పేర్లు, వారి హోదాలు సరిపోతాయి అనే ప్రాతిపదిగా వీరీ అభిప్రాయాన్ని వెల్లడించారు. ఈ రెండు అభిప్రాయాలు కాక, మరొక విషయాన్ని ఇంకా కొంతమంది పండితులు వ్యక్తం చేశారు. చైనీయులైన పాన్-కు వ్రాసిన మొదటి హన్ రాజు వంశగాథలు, పాన్-ఏ వ్రాసిన తరువాతి హన్ రాజ వంశ గాథలు ఆధారంగా జేసికొని వీరు, కుషాణులు మంగోల్ జాతికి చెందినవారనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. వీరి కథనంపై కుషాణులు బాక్ట్రియాను ఆక్రమించిన 'యూచీ' తెగవారి శాఖలలో అతి బలవంతులైన శాఖ. ఈ అభిప్రాయాన్ని పెక్కుమంది పండితులు అంగీకరిస్తున్నారు.

3. మధ్య ఆసియాలో చైనా సరిహద్దున గల కాన్ సూ ప్రాంతానికి చెందిన కుషాణులు యూచీ జాతిలోని ఒక తెగవారు. క్రీ.పూ. 2వ శతాబ్దంలో మధ్య ఆసియాకు చెందిన హూణులనెడి మరి ఒక జాతి యూచీ జాతిని ఓడించిన కాన్ సూ ప్రాంతంనుండి తరిమివేసింది. యూచీ జాతివారిలో కొందరు టిబెట్ సరిహద్దుకు పోయారు. మరికొందరు సర్‌డేరియా ప్రాంతంలో శకులతో తలబడి వారిని పారద్రోలి బాక్ట్రియాలో స్థిరపడ్డారు. బాక్ట్రియాలో స్థిరపడిన యూచీ తెగ అయిదు భాగాలుగా విడిపోయింది. వీటిలో ఒక భాగం కుషాణులది.

4. కుజులకాడ్ ఫైసిస్ : కుషాణులలో మొదటి రాజుగు కుజులకాడ్ ఫైసిస్ ఇతర నాలుగు యూచీ రాజ్యాలను జయించాడు. ఆ తరువాత ఇతడు పహ్లవులను ఓడించి కాబూల్, కాందహారులను స్వాధీన పరచుకొన్నాడు. కుజులకాడ్ ఫైసిస్ కాలంనాటి రాగి నాణాలు కొన్ని త్రవ్వకాలలో లభించాయి. ఈ నాణాల ద్వారా కుజుల మహారాజ, రాజాధిరాజ అను బిరుదులు ధరించినట్లు తెలియుచున్నది. ఇతని రాజ్యకాలం క్రీ.శ. 15 - 65.

5. వీమాకాడ్ ఫైసిస్ : కుజుల మరణానంతరం వీమాకాడ్ ఫైసిస్ కుషాణు సింహాసనాన్ని అధిష్ఠించెను. కుజులు ప్రారంభించిన ఉత్తర భారత దండయాత్రను వీమా పూర్తి చేసెను. అతను పంజాబ్‌ను, గంగామైదానాన్ని కుషాణు సామ్రాజ్యంలో విలీనం చేశాడు. అతను పంజాబ్‌ను, గంగామైదానాన్ని జయించి కుషాణు సామ్రాజ్యంలో విలీనం చేసాడు. పార్థియన్‌లను సంపూర్ణంగా జయించాడు. వీమా చైనా పాలకుడైన పాన్-చౌ తో యుద్ధానికి తలపడినాడు. కానీ వీమా చైనీయుల చేతిలో ఓడిపోయి చైనాకు కప్పం చెల్లించినట్లు తెలియుచున్నది. వీమా కాలంలో కుషాణులు చైనీయులతో, రోమన్‌లతో వర్తక వ్యాపారాలను చేసిరి. వీమా రాగి, బంగారు నాణాలను ముద్రించాడు. అతని నాణెములపైగల శివుని ప్రతిమను బట్టి వీమా శైవమతాన్ని స్వీకరించినట్లు తెలియుచ్నుది. ఈ నాణేలమీద శాసనం ఖరోష్ఠి లిపిలో ఉన్నది.

గొప్పరాజు, రాజాధిరాజు, సర్వ ప్రపంచానికి రాజు, మహేశ్వరుడు, రక్షకుడు అనే బిరుదులీతని నాణాలపై ఉన్నాయి. వీమా కాలమున కుషాణుల సామ్రాజ్యం పశ్చిమాన గల పార్థియానుండి తూర్పున వారణాసి వరకు విస్తరించి యుండెను. అనగా కుషాణుల సామ్రాజ్యంలో రష్యన్ టర్కిస్థాన్‌లో కొంతభాగం, బుఖారా, టర్కిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, సింధు, మాళ్వా మున్నగు దేశాలుండేవి. వీమా పాలనా కాలంపై చరిత్రకారులలో ఏకాభిప్రాయం లేదు. క్రీ.శ. 70 - 110 మధ్య వీమా పరిపాలించెనని వి.ఎ. స్మిత్ ప్రతిపాదించగా డి.సి. సర్కార్, ఆర్.కె. ముఖర్జీ, రాయచౌదరి మొదలగు చరిత్రకారులు క్రీ.శ. 65 - 75 మధ్య పరిపాలించెనని నిర్ధారించిరి.

## 10. 8 కనిష్కుడు

1. మధ్య ఆసియా వాసులైన 'యూచీ' తెగకు చెందిన కుషాణులలో కనిష్కుడు ప్రముఖుడు. మహాసేనానిగా, మహావిజేతగానే గాక, భారతీయమైన బౌద్ధమతాన్ని, సాహిత్యాన్ని, కళలను పోషించాడు. అందువలన అతనికి భారతదేశ చరిత్రలో ఒక శాశ్వత స్థానం ఏర్పడింది. జన్మరీత్యా విదేశీయుడైనా అవలంబన ద్వారా భారతీయుడని ఆచార్య ఘోష్ అన్నాడు.

2. పాలనాకాలం : శాసనలు, నాణాలు, అవి దొరికిన ప్రదేశాలు, త్రవ్వకాలలో వెలికితీసిన సామగ్రి, వాఙ్మయాధారాలు, ఖగోళశాస్త్ర ప్రామాణికాలు మొదలగునవి పరిశీలించిన తరువాత కనిష్కుడు సింహాసనానికి వచ్చిన సంవత్సరం, తన పేర కొనసాగు శక స్థాపనం గురించి పండితులు వేరువేరు అభిప్రాయములను వెలిబుచ్చినారు. వీమాకాడ్ ఫైసిస్ రాజ్యకాలం క్రీ.శ. 65 నుంచి 75 వరకు అని నిర్ణయించి కనిష్కుడు స్థాపించిన శకం క్రీ.శ. 78 లో ప్రారంభమయిందని. కనిష్కుని రాజ్యకాలం క్రీ.శ. 78 నుంచి క్రీ.శ. ~~102~~ వరకు

కావచ్చునని రాప్సన్, రాయ చౌదరీ మొదలగు పండితులు అభిప్రాయడినారు. కనిష్కుడు కుజులకాడ్ ఫైసిస్ కంటే గూడా : ఇతని శకం క్రీ.పూ. 58 నుంచి ప్రారంభమయిన తరువాత విక్రమశకంగా ప్రసిద్ధి చెందినదని ఫ్లీట్ మొదలగు పండితులు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. అయితే ఈ సిద్ధాంతాన్ని నేడు అంగీకరించేవారు లేరు. కనిష్కుడు క్రీ.శ. 130 సంవత్సరాలకు కొంచెం ముందుగ రాజ్యపాలన ప్రారంభించాడని మరికొందరు పండితులు తెలిపారు. టిబెట్టు, చైనా గ్రంథాలు క్రీ.శ. రెండవ శతాబ్దంలో కనిష్కుడు రాజ్యమేలినట్లు పేర్కొంటున్నాయి. ఎక్కువమంది చరిత్రకారులు ఆమోదించిన పట్టాభిషేక సంవత్సరం క్రీ.శ. 78 శాలివాహన శకంగా ప్రసిద్ధమైన శకాన్ని కనిష్కుడే స్థాపించాడని చాలామంది అభిప్రాయపడినారు.

**3. యుద్ధ విజయాలు :** కనిష్కుడు అధికారములోనికి వచ్చునాటికి కుషాణు సామ్రాజ్యము భారతదేశ వాయవ్య ప్రాంతంలో కొన్ని ప్రదేశాలకు మాత్రమే పరిమితంగా ఉండెను. గొప్ప యుద్ధవీరుడగు కనిష్కుడు తన పాలనాకాలంలో కుషాణుల అధికారాన్ని ఉత్తర భారతదేశంలో సువిశాల ప్రాంతాలకు విస్తరింపజేసెను. ప్రథమంలో కనిష్కుడు కాశ్మీరంపై దండెత్తి దానిని వశపరచుకొన్నాడు. ఈ ప్రాంతమునందు కనిష్కుడు అనేక నిర్మాణాలను చేసినట్లు తెలియుచున్నది. ఇతడు కాశ్మీరంలో క్రొత్తగా కనిష్కపురమను నగరాన్ని నిర్మించాడు. ఈ విషయం కల్హణుని రాజతరంగిణి ద్వారా తెలుస్తున్నది. ఆనాటి కనిష్కపురమే నేటి కనిష్పూర్ గ్రామం. తన మరణానంతరం తన సమాధిని కాశ్మీరంలోనే నిర్మించవలెనని కనిష్కుడు కోరినట్లు వాఙ్మయ ఆధారాల వలన తెలియుచున్నది. కాని కనిష్కునితో యుద్ధం చేసిన కాశ్మీరు పాలకులను గురించిన వివరాలు సమగ్రంగా లభించలేదు. క్రీస్తుశక ప్రారంభంలో కుషాణుల వలె భారతదేశానికి వచ్చిన విదేశీయులలో ముఖ్యులు శకులు. వీరు పశ్చిమోత్తర భారతదేశంలో అనేక ప్రాంతాలను వశపరచుకొని కుషాణుల విస్తరణను తీవ్రంగా ప్రతిఘటించారు. అందువల్ల కనిష్కునికి శకులకు మధ్య యుద్ధం అనివార్యమైంది. కనిష్కుడు శకులను ఓడించి గుజరాత్, మాళవ, మధుర ప్రాంతాలను కుషాను సామ్రాజ్యంలో విలీనము చేసెను. కనిష్కుడు మగధ పై దండెత్తి నాటి మగధ రాజును ఓడించి వారికి చెందిన గంగా మైదానమందలి కొన్ని ప్రాంతాలను కుషాను సామ్రాజ్యంలో విలీనం చేసినట్లు కొందరు పండితులు అభిప్రాయపడుచున్నారు. కనిష్కుడు ప్రసిద్ధ బౌద్ధమత తత్త్వవేత్త అయిన అశ్వఘోషుని మగధ నుండి తన రాజ్యానికి తీసుకొని పోయినట్లు తెలియుచున్నది. కనిష్కునికి గొప్ప పేరు తెచ్చిన యుద్ధం చైనా దండయాత్ర. వీమాకాడ్ ఫైసిస్ కాలంలో కుషాణులు చైనా పాలకుల చేతిలో ఓడిపోయి వారికి కప్పం కట్టుటకు అంగీకరించారు. కాని కనిష్కుడు చక్రవర్తి అయిన తరువాత కప్పం చెల్లించుట మానివేసి చైనీయులతో యుద్ధానికి దిగెను. యుద్ధ ప్రారంభంలో చైనీయులదే పైచేయి అయినను తుదకు కనిష్కుడు చైనాను ఓడించి వారికి చెందిన కాష్ఘర్, యార్కండ్, కోటాన్ ప్రాంతాలను తన సామ్రాజ్యంలో విలీనం చేసెను. ఈ విధంగా కనిష్కుడు అనేక దండయాత్రలు చేసి కుషాణ సామ్రాజ్యాన్ని సువిశాలమైన రాజ్యంగా తీర్చిదిద్దెను. కనిష్కుని సామ్రాజ్యంలో మధ్య ఆసియాలో ఆఫ్ఘనిస్థాన్, బాక్ట్రియా, యార్ఖండ్, కోటాన్, ఖాష్ఘర్‌లు భారతదేశంలో పంజాబ్, కాశ్మీర్, సింధు, ఉత్తరప్రదేశ్‌లో గయ వరకున్న ప్రాంతాలు చేరినాయి అతని రాజధాని పురుషపురం. అతడు కైజర్, సీజర్, దేవపుత్ర అను బిరుదులు స్వీకరించాడు.

4. పరిపాలనా వ్యవస్థ : కనిష్కుడు గొప్ప సైనిక విజేతయేగాక పరిపాలనాదక్షుడు కూడా. ఇతడు ప్రభుత్వ విషయాలలో శ్రద్ధ వహించాడు. భిన్న జాతులు, భిన్న మతాలు ఉన్న తన సామ్రాజ్యంలో అందరికి అనుకూలమైన పాలనా యంత్రాంగాన్ని రూపొందించాడు. కుషాణ సామ్రాజ్యములో అందరికి అనుకూలమైన పాలనా యంత్రాంగాన్ని రూపొందించాడు. కుషాణ సామ్రాజ్యంలో కనిష్కుడే సర్వాధికారి అయినను ఇతడు ప్రజాసంక్షేమానికి అనుకూలంగా రాజ్యపాలన చేసెను. రాజునకు సలహా సంప్రతింపుల నిమిత్తం మంత్రిమండలి అమలులో నుండేదని బౌద్ధ వాఙ్మయంలో ప్రస్తావనలున్ననూ, కుషాణుల శాసనాలలో ఈ విషయం ప్రస్తావించబడలేదు. కనిష్కుని రాజ్యములో ప్రధాన పాలనా విభాగాలు ఆఫ్ఘనిస్థానం, కోటాన్, యార్ఖండ్, కాష్ఘర్, పంజాబ్, సింధు, కాశ్మీరాలు. ఈ ప్రాంతాలను పాలించుటకు గవర్నర్‌లను నియమించెను. వారిని క్షాత్రపులని వ్యవహరించారు. వారికి స్వయంగా నాణేలను జారీచేయుటకు సంపూర్ణ అధికారం కలదు. మధుర రాజధానిగా ఖరపల్లాన అను మహాక్షాత్రపుడు, వారణాసి అధిపతిగా వనస్పర అనుక్షాత్రపుడు రాజ్యమేలినట్లు కనిష్కుని సారనాథ్ శాసనం పేర్కొన్నది. బహుశః దీనికి కారణం వారి వారి హోదాలలో ఉన్న ఆధిక్యతా భేదాలు తెలుపుటయే. పౌరవిధులలోను సైనిక వ్యవహారాలలోను రాజుకు సహాయపడుటకు మహాదండనాయకులు, దండనాయకులు అను రెండు శ్రేణులకు చెందిన సామంత

నాయకులుండేవారు. క్రింది స్థాయిలో గ్రామిక లేక పెద్రపాల అనే స్థానిక ప్రముఖులు పరిపాలన నిర్వహించెడివారు. వీరిలో చాలామంది గ్రామ పెద్దలు. వీరు కొన్ని ప్రత్యేక హక్కులను పొంది సదుపాయాలను అనుభవించుచుండిరి. ఈ ఉద్యోగాలు వంశపారంపర్యంగా ఉన్నట్లు తోచును. ప్రతిఫలం మున్నగు విషయాల గురించి కుషాణ శాసనాలలో సమాచారం కానరాదు.

**5. బౌద్ధమత సేవ :** భారతదేశ చరిత్రలో అశోకుని తరువాత బౌద్ధమతానికి గొప్ప సేవచేసిన చక్రవర్తి కనిష్కుడు యోధునిగా, పాలనాదక్షునిగానే కాక గొప్ప బౌద్ధమత చక్రవర్తిగా చరిత్రలో పేరుగాంచెనని రాయచౌదరి అను చరిత్రకారుడు అభిప్రాయపడెను. కనిష్కుడు గాధలలో రెండవ అశోకుడని అభిర్ణించబడినా నిజానికి వారిద్దరికి పొంతన లేదు. అయితే బౌద్ధమత వ్యాప్తిలో కనిష్కుని సుప్రసిద్ధుడుగా అంగీకరిస్తారు దానికి కారణం, అతనికృషి, ఆదరణల వలన బౌద్ధమతం అంతర్జాతీయ మతమైనది. ఇతడు ప్రసిద్ధి చెందిన అనేక మంది బౌద్ధమతాచార్యులను ఆదరించెను. బౌద్ధ సంఘంలోని విబేధాలను అశోకుడు నిషేధించినప్పటికి అవి రూపుమాసిపోక కొనసాగినవి. కనిష్కుని కాలంనాటికి బౌద్ధమతంలో 18 శాఖలు ఏర్పడినవి. అందు ముఖ్యమైనవి హీనయానము, మహాయానము. హీనయానులు బుద్ధుని బోధకునిగా భావింతురు. మహాయానులు బుద్ధుని దేవునిగా ఆరాధింతురు. కనిష్కుడు బౌద్ధమతాన్ని స్వీకరించిన తరువాత ఆ మతంలో సామరస్యాన్ని సాధించుటకు కాశ్మీరులోని కుంద గ్రామంలో నాల్గవ బౌద్ధ సమావేశాన్ని జరిపాడు. దేశంలోని ప్రముఖ బౌద్ధ భిక్షువులందరు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశమందు అశ్వఘోషుడు ఉపాధ్యక్షుడుగా వ్యవహరించిరి. ఇందు అన్ని విషయములు కూలంకషంగా చర్చించి బుద్ధుడు దేవుడని, మహాయనం ఆచరణ యోగ్యమని నిర్ణయింపబడింది. బౌద్ధగ్రంధాలన్నీ సంస్కృతంలో వ్రాయవలయునని తీర్మానింపబడింది. ఈ తీర్మానం ప్రకారం త్రిపిటకాలు సంస్కృతంలోనికి అనువదించబడినవి. బౌద్ధ సిద్ధాంతాలను మహావిభాషశాస్త్రం అను పేరుతో వసుమిత్రుడు క్రోడీకరించాడు. వీటిని రాగి రేకలపై చెక్కించి కనిష్కుడొక స్తూపంలో భద్రపరిచినట్లు బౌద్ధ వాఙ్మయం వల్ల తెలుస్తుంది. ఈ సంఘ సమావేశానంతరం చైనా, టిబెట్, జపాన్ మొదలగు దేశాలలో బౌద్ధమతాన్ని వ్యాప్తిచేయుటకు కనిష్కుడు గొప్ప కృషిచేసెను. తన రాజ్యమంతటా స్తూపాలు, విహారాలు, విగ్రహాలు నిలిపాడు. పురుషపురంలో 400 అడుగుల ఎత్తుగల బౌద్ధ గోపురాన్ని కలపతో కట్టించాడు. అందులో బుద్ధుని పెద్ద విగ్రహాన్ని స్థాపించాడు.

**6. మహాయాన బౌద్ధమతం :** కనిష్కుని కాలంలోనే బౌద్ధం హీనయాన, మహాయాన అను రెండు పంథాలుగా చీలి పోయింది. అశోకుడు హీనయాన బౌద్ధమతాన్ని పోషించినట్లే కనిష్కుడు మహాయాన బౌద్ధమతాన్ని పోషించాడు. మహాయానంలో బుద్ధుడు కరుణామయుడైన దేవునిగా ఆరాధింపబడ్డాడు. తనను నమ్మి పూజించు వారికి మోక్షాన్ని ప్రసాదించగల్గిన శక్తివంతుడు. హీనయానంలో బుద్ధుడు ప్రవక్తగా భావింపబడ్డాడు. ఆయన ప్రబోధాలను అనుసరించి నిర్యాణం పొందవచ్చు. హీనయానంలో సన్యాసులే నిర్యాణానికి అర్హులు. మహాయానంలో సన్యాసుల వలెనే గృహస్థులు కూడా మోక్షార్హులు. హీనయానంలో వ్యక్తిగత నిర్వాణమే లక్ష్యం. మహాయనంలో మానవజాతికి సేవచేయుట వలన నిర్యాణాన్ని పొందుతారు.

**7. సర్వమతాదరణ :** బౌద్ధమతాన్ని అభిమానించినప్పటికీ కనిష్కుడు అన్ని మతాలను ఆదరించినాడు. అతని నాణేలపై ఉన్న గ్రీకు, సుమేరియన్, పారశీక, హైందవ దేవతల ప్రతిమలాతని మతసహనాన్ని, సర్వమతాదరణను చాటుతున్నాయి.

**8. గాంధార శిల్పకళ :** కుషాణ యుగంలో ఉత్తర భారతదేశంలో, ప్రత్యేకంగా గాంధార, కాశ్మీర్, ఆఫ్ఘనిస్థాన్ ప్రాంతాలలో స్థూపాలు, విహారాలు నిర్మింపబడ్డాయి. మధ్య భారతదేశంలో గల స్థూపాలతో పోలిస్తే ఈ ప్రాంతాలలో స్థూపాలు, విహారాల నిర్మింపబడ్డాయి. మధ్య భారతదేశంలో గల స్థూపాలతో పోలిస్తే ఈ ప్రాంతాలలోని స్థూపాలు వేరే లక్షణాలు కలిగి ఉన్నాయి. ఇ చతురస్రాకారపు, తగ్గుతున్న అంతస్తుల పోలిన అండము, అంచెలంచెల శిఖరాలతో కూడివున్నాయి. వీటికి ప్రత్యేక ఉదాహరణ తక్షీ బాహిలోని స్థూపం. కనిష్కుడు తన నిర్మాణ కార్యక్రమంలో గ్రీకు శిల్పులను నియమించినట్లు యువాన్ చాంగ్ పేర్కొన్నాడ వీరివల్లనే గాంధార శిల్పకళ జనించెను. గాంధార శిల్పకళ భారతీయ సంస్కృతిలో ఒక విశిష్ట లక్షణం. ఇందు బౌద్ధుల మతాశయాల గ్రీకుల కళారూపాలు జోడింపబడ్డాయి. ఈ శిల్పరీతి గ్రీకుల రాకతో అంకురించి కుషాణుల కాలం నాటికి పరిపూర్ణ దశకు చేరుకుంది

భారతదేశానికి వాయవ్య దిశలో గాంధార రాజ్యం నెలకొని వున్నది. ఇది భారతదేశం, చైనా, పర్షియా, గ్రీకు, రోమన్ సంస్కృతు కూడలి ప్రదేశం. గాంధారం మీదుగానే ఎక్కువమంది విదేశీయులు భారతదేశం పైన దండె[illegible]ందువల్ల ఈ రాజ్యంలో తూ

పశ్చిమ శిల్పకళారీతులు మేలు కలయికను పొందాయి. గాంధార శిల్పాలు ముఖ్యంగా ఆఫ్ఘనిస్థాన్‌లోని తక్షశిలగాంధార రాజ్యాలకు పరిమితం కాలేదు. గాంధార శిల్ప రీతి ప్రతిమలు కాశ్మీరం, గుజరాత్, మధురలలో కూడా లభించాయి. ఇది ఉత్తరంగా మధ్య ఆసియాకు వ్యాపించి అక్కడ నుండి చైనా, జపాన్, కొరియాలకు కూడా విస్తరిల్లింది. గాంధార శిల్ప కళావస్తువు మహాయాన బౌద్ధం. ఇందులో బుద్ధుని విగ్రహాలు, అతని జీవితంలోని ప్రధాన ఘట్టాలు, పూర్వ జన్మల గాథలు చిత్రించబడినవి. ఈ శిల్పాలలో ప్రజల జీవిత విధానాలు ప్రతిఫలిస్తున్నాయి. గాంధార శిల్పాలపై గ్రీకు శిల్పం యొక్క ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ శిల్పరీతి మానవాకృతిని వాస్తవికంగా తీర్చి దిద్దడానికి ప్రాధాన్యం యిచ్చింది. శరీరం యొక్క భౌతికమైన కొంతలన్నీ ఆకర్షణీయంగా, ఆదర్శప్రాయంగా చెక్కడంలోను, కండలతో సహా అంగసౌష్టవం ప్రదర్శించడంలోనూ, గాంధార శిల్పులు అగ్రగణ్యులు. ఉంగరాలు తిరిగిన శిరో సౌందర్యం అందంగా చుట్టిన సిగముడి బుద్ధ విగ్రహాలు చెక్కబడ్డాయి. శిరస్సు చుట్టూ కాంతిపుంజం చెక్కడం ఒక లక్షణం. ఈ లక్షణాలన్నీ గ్రీకు శిల్ప ప్రభావం వల్ల రూపొందాయి. కాని ఈ ప్రభావం కేవలం సాంకేతికమైనది మాత్రమే. వస్తువు, ఆత్మ అన్నీ భారతీయమైనవే. ప్రతిమలపై కనిపించే ఉష్ణీషం, ముద్రలు, ఆసనం అన్నీ భారతీయ సాంప్రదాయాన్నే చాటి చెబుతున్నాయి. గాంధార శిల్పం భౌతిక సౌందర్యానికి ప్రాముఖ్యత నివ్వగా, భారతీయ శిల్పం ఆధ్యాత్మిక సౌందర్యానికి ప్రాముఖ్యత నిచ్చింది. గాంధార శిల్ప శైలి క్రీ.పూ. 2, 3 శతాబ్దాలలో బాక్ట్రియన్ గ్రీకుల కాలంలో అంకురించి క్రీ.శ. 2వ శతాబ్దంలో పరిణతి చెందింది. కనిష్కుని ఆదరణలో ఈ శైలి మహోన్నత స్థితిని చేరుకొంది. గుప్తుల కాలం నుండి భారతీయులు గాంధార శిల్పకళను నిరాదరణ చేసారు. ఇటువంటి పరిస్థితులలో హుణులు గాంధార దేశంపై దండెత్తి గ్రీకు శిల్పకళా స్థావరాలన్నింటినీ ధ్వంసం చేశారు. భారతదేశంలో ఈ కళ క్రీ.శ. 5వ శతాబ్దంలోనే అంతరించినప్పటికి ఆసియా ఖండమంతటా క్రీ.శ. 12 వ శతాబ్దంవరకు కొనసాగింది.

8. సాహిత్య పోషణ : కనిష్కుడు విద్యాభిమాని అతడు పెక్కుమంది భారతీయ, గ్రీకు విద్వాంసులు, పండితులను పోషించాడు. అతని ఆస్థానంలోగల వసుమిత్రుడు మహావిభాష శాస్త్రాన్ని రచించాడు. మాధ్యమిక సిద్ధాంతాన్ని విపులీకరించి మహాయానాన్ని ప్రచారం చేసిన ఆచార్య నాగార్జునుడు కనిష్కుని ఆస్థాన విద్వాంసుడేనని ప్రసిద్ధి. ఆయుర్వేద శాస్త్రవేత్త చరకుడు కనిష్కుని ఆస్థాన వైద్యుడు. ఇతని సంకలనమే చరక సంహిత. గ్రీకు విద్వాంసులైన ఎంజెనీర్, ఎజలస్‌లను కూడా కనిష్కుడు పోషించాడు.

9. అంచనా : భరత దేశాన్ని పాలించిన గొప్ప చక్రవర్తులలో కనిష్కుడు ఒకడు ఇతడు విదేశీయుడైనను భారతదేశాన్ని తన మాతృదేశంగా భావించాడు. సైనిక విజేతగా ఉత్తర భారతదేశంలో సువిశాల ప్రాంతాలను జయించి కుషాణ సామ్రాజ్య వైభవాన్ని అత్యున్నత దశకు తీసుకొనివచ్చెను. చైనా ప్రాంతాలపై దండయాత్ర చేసి భారతదేశ చరిత్రలో చైనా ప్రాంతాలను పాలించిన ఏకైక చక్రవర్తిగా శాశ్వత కీర్తి నొందెను. పరిపాలకునిగా సమర్ధవంతమైన పరిపాలనా విధానాన్ని ప్రవేశపెట్టి ప్రజల మన్ననలను పొందెను. సాహిత్య, శిల్ప, కళాపోషకుడుగా అనేకమంది కవి పండితులను పోషించి, గాంధార శిల్పకళకు రూపుదిద్ది భారతీయ సంస్కృతికి నూతన శోభ చేకూర్చెను. బౌద్ధమతాన్ని ఆదరించి పోషించాడు. కేవలం కనిష్కుని కృషి వలననే బౌద్ధమతం దూర ప్రాచ్యదేశాలకు వ్యాపించింది.

## 10. 9 తరువాత కుషాణులు :

కనిష్కుని తరువాత విసిష్కుడు, హావిష్కుడు, రెండో కనిష్కుడు, వాసుదేవుడు వరసగా రాజ్యపాలన చేసారు. కనిష్కుని వలె హావిష్కుడు బౌద్ధమతాన్ని ఆదరించాడు. మహారాజ, రాజాధిరాజ, దేవపుత్ర అను బిరుదులు వహించాడు. ఇతని నాణేలపైన గ్రీకు హైందవ దేవతల ప్రతిమలున్నాయి. భారతీయ సంస్కృతిని కుషాణులు క్రమంగా అనుసరించడం వాసుదేవుని నామమే చెబుతుంది వాసుదేవుని తరువత కుషానుల చరిత్ర అస్పష్టంగా ఉంది. కుషాణులు బలహీనులు కావడంతోనే ఉత్తరాపథంలో అనేక చిన్న రాజ్యాల వెలసాయి. ఇటువంటి సమయంలోనే గుప్తరాజులు విజృంభించి సామ్రాజ్య స్థాపనయత్నాన్ని ప్రారంభించారు.

## 10. 10 సాంస్కృతిక ఫలితాలు (లేక) మౌర్యుల అనంతర కాలపు సాంఘిక, ఆర్థిక, మత, సాంస్కృతిక పరిస్థితులు :

1. సాంఘిక పరిస్థితులు : మౌర్యుల తరువాత కాలంలో క్రీ.శ. 3వ శతాబ్దం వరకు పెక్కు విదేశ దండయాత్రలు జరగడమేగాక ఉత్తరాపథంలో విదేశీ పరిపాలన స్థాపించబడింది. క్రీ.శ. 1 వ శతాబ్దం నుండి క్రీ.శ, 3వ శతాబ్దం వరకు రాజ్యమేలిన కుషాణ సామ్రాజ్య

భారతదేశం, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ నుండి మధ్య ఆసియా వరకు విస్తరించింది. ఈ కాలంలో విభిన్న జాతులకు చెందిన వస్తువులు, ఆదర్శాలు, మనుష్యులు సంచరించి సామ్రాజ్య వివిధ భాగాలను ప్రభావితం చేయుటకు ఎక్కువగా దోహదం చేసింది. అంతర్జాతీయ వ్యాపారాభివృద్ధి, శ్రేణుల కార్యకలాపాలు ఆర్థిక సంపన్నతకు కారణమైంది. భారత సమాజాన్ని సంస్కృతిని రూపొందించడంలో ఈ పరిణామాలెంతో ఎక్కువగా తోడ్పడ్డాయి. సాంప్రదాయిక చతుర్వర్ణాలైన బ్రహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు సాంఘిక వ్యవస్థకు పునాదైనాయి. వృత్తిమార్పు క్రొత్త వృత్తిని స్వీకరించుట వలన అనేక క్రొత్త మిశ్రమ కులాలుద్భవించాయి. ఇండో - గ్రీకులు బౌద్ధమతాన్ని స్వీకరిస్తే, శకరాజులు బౌద్ధ, బ్రాహ్మణ మతాలను స్వీకరించడమే గాక శాతవాహనులతో వైవాహిక సంబంధాలు పెట్టుకొన్నారు. ఇండో గ్రీకులు, శకులు, కుషాణులు మొదలగు విదేశీ శక్తులు భారతీయ సమాజంలో చేరుట వలన సాంప్రదాయక వర్ణాశ్రమ ధర్మానికి పెద్ద ముప్పు ఏర్పడింది. ఈ సందర్భంగానే నాలుగు వర్ణాల మధ్య సంపర్కాన్ని నిరోధించినట్లు ఆంధ్రశాతవాహన రాజు గౌతమీపుత్ర శాతకర్ణి ప్రకటించాడు. బ్రాహ్మణ మతానికి ఇవ్వబడిన రాజకీయాధికారపు ప్రాపు, పోషణల కారణంగా పురాణాలు శకులను నీచ స్థితికి దిగజారిన క్షత్రియులు లేదా శూద్రులుగా, పరిగణించాయి. ఈ యుగంలో బానిసత్వం వుంది. రాజులు, స్వాధికార వర్గాల వారు బానిసలను నియమించుకొన్నారు.

2. ఆర్థిక పరిస్థితులు : రాజులు వ్యవసాయాన్ని ప్రోత్సహించారు. క్రొత్త భూములు సాగులోనికి వచ్చాయి. ఈ యుగంలో వర్తక వ్యాపారాలు పెద్ద ఎత్తున జరిగాయి. వ్యాపార అభివృద్ధి కొరకు భూమార్గాలను అభివృద్ధి పరచారు. ఇండో గ్రీకుల పాలనా కాలంలో భారతదేశం, మధ్య ఆసియా, మధ్యధరా సముద్ర దేశాల మధ్య సంబంధాలు అభివృద్ధి చెందాయి. చైనాతో వ్యాపారం మొదలైంది. రోమ్‌తో మిరియాలు, మస్లిన్, సిల్క్, మణులు మొదలగు విలువైన వస్తువులతో వ్యాపారం జరిగింది. దీనివలన భారతదేశంలో సిరిసంపదలు వెల్లివిరిశాయి. వర్తకం పెరగడం వల్ల నాణేలు చలామణి వృద్ధిలోకి వచ్చింది. ఇండో గ్రీకులు బంగారు, రాగి, నాణేలను మారకంగా ఉపయోగించేవారని, రోజువారీ వర్తకంలో రాగి, సీసపు నాణేలను వాడేవారని తెలుస్తుంది. వర్తక, వాణిజ్య కార్యకలాపాల వలన దేశంలో ప్రత్యేక నిపుణతగల వృత్తులను వృద్ధి చెందుటకు అవకాశమేర్పడింది. ఆనాటి సాహిత్యం వివిధ రకాలైన 60 వృత్తులను గూర్చి తెలుపుచున్నాయి. ఆర్థికవ్యవస్థ, వ్యాపారాభివృద్ధి వలన శ్రేణులు ప్రాముఖ్యతను సంతరించుకొన్నాయి. ఈ శ్రేణులు వస్త్రు, వృత్తి, పంపిణీని నిర్వహించేవి. పనివారు తమంతట తామే శ్రేణులుగా ఏర్పడేవారు. ప్రతి వృత్తి పనివారికి తమ శ్రేణి వుండేది. ఈ శ్రేణులు వారి వారి వృత్తులకు సంబంధించిన సాంకేతిక విద్యలను కూడా అందించేవి.

3. సాహిత్యం : విదేశీ సంబంధాల వల్ల ఏర్పడిన శాశ్వత పరిణామాలలో విజ్ఞానాభివృద్ధి ఒకటి. భారతీయ వైద్యశాస్త్రం క్రమబద్ధం చేయబడింది. కనిష్కుని కాలంలో వ్రాయబడిన చరక సంహిత వైద్య శాస్త్రంలో గొప్ప ప్రామాణిక గ్రంథం. గ్రీకు వృక్షశాస్త్రజ్ఞుడైన థియోఫ్రాస్టస్ తన గ్రంథంలో వైద్య శాస్త్రానికి ఉపయుక్తమైన అనేక మొక్కల గూర్చివివరించాడు. కనిష్కుని సమకాలికుడైన అశ్వఘోషుడు బుద్ధుని జీవితంపై నాటకాలను వ్రాశాడు.

4. బౌద్ధమతం : మౌర్య యుగంలో రెండు శాకలుగా చీలిన బౌద్ధమతం ఈ కాలంలో 18 శాఖలయ్యేను. థేరవాద శాఖకు చెందిన సర్వస్తివాదులు మధుర వద్ద ఉద్భవించి గాంధార, మధుర, కాశ్మీర్ ప్రాంతాలలో ప్రజాదరణను పొందారు. కనిష్కుని కాలంలో సర్వస్తివాదులు ప్రభావం కలవాడై పెషావర్‌లోని కనిష్కస్తూపం వీరి ఆధీనంలో ఉన్నట్లు తెలుస్తున్నది. కనిష్కుని యొక్క కృషి ఆదరణ వలన నాల్గవ బౌద్ధ సంగీత కాశ్మీర్‌లో సమావేశమైంది. ఈ సమావేశంలో సర్వస్థి వాదుల అభిధర్మ పరిశీలన చేపట్టబడింది. దీని ఫలితంగా సర్వస్థివాది సిద్ధాంతాలపై విజ్ఞాన సర్వసం లాంటిదైన మహావిభాష రచింపబడెను. ఈ యుగంలో బోధిసత్వ ఆదర్శం గొప్ప ప్రజాదరణ పొందింది. బోధిసత్వుడనే వాడు స్వలాభం కోసం కాకుండా, పరోపకారార్థం జ్ఞానోదయం పొందే లోక కళ్యాణ మూర్తి అనేది బోధిసత్వభావన. ఈ బోధిసత్వ సిద్ధాంతాల రూపకల్పనలో, విదేశీ శక్తుల ప్రభావాలు ముఖ్యపాత్ర వహించాయి.

5. సూర్యారాధన: ఈ కాలంలో వెలసిల్లిన మతోద్యమాలలో సూర్యారాధన ఒకటి. సూర్యారాధన వ్యాపకులైన ఇరాన్‌లోని మాగ ... ప్రభావ... ఈ మత శాఖ ప్రత్యేకతను సంతరించుకొన్నది. ఈ మతంలో సూర్యుడు ముక్తి సాధనకు ప్రతినిధిగను,

లక్ష్యం గాను చేయబడ్డాడు. సూర్యుని బుద్ధకాంతితో సమానంగా బౌద్ధులు పరిగణించారు. ఈ ధృవీకరణ వలన సూర్యుడు బౌద్ధ దేవతా కూటమిలో చేర్చబడుటకు దారితీసింది.

6. రాజారాధన : దైవాంశ సంభూతుడుగా రాజును ఆరాధించడం, కుషాణుల కాలంలో గమనించదగిన పరిణామం. కుషాణులు తాము దేవపుత్రులమని చెప్పుకున్నారు. పరిపాలకులు దేవాంశ సంభూతులనే భావం గ్రీకు రాజ్యాలలో బాగా ప్రచారంలో నుండెను. రాజాధికారం దైవ ప్రాప్తమనే భావనను ఈ కాలంలో మనువు కూడా వెలిబుచ్చాడు. మధుర రాజ ప్రాసాదాలలోని దేవాలయంలోని కనిష్క, లీమా మొదలయిన కుషాణ రాజప్రతిమలు లభ్యమైనాయి.

7. వాస్తు శిల్పాలు : కుషాణ యుగంలో ఉత్తర భారతదేశంలో ప్రత్యేకంగా గాంధార, కాశ్మీర్, ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతాలలో స్తూపాలు నిర్మింపబడ్డాయి. ఈ స్తూపాలు మధ్య భారతదేశంలోని స్తూపాలతో పోలిస్తే భిన్నంగా వుంటాయి. ఈ స్తూపాలు చతురస్రాకార పునాది కలిగివుంటాయి. దీనికి ఉదాహరణగా తక్షీ భాహిలోని స్తూపం పేర్కొనవచ్చు. ఈ కాలంలో శిల్ప కళ నూతన పంధాలననుసరించింది దీనికి ముఖ్య కేంద్రాలు మధుర, గాంధార, మధురలో శిల్పాలు దేశీయ సాంప్రదాయాన్ని అనుసరించగా గాంధార శిల్పాలలో గ్రీకు రోమన్, కళా ప్రభావం కనిపిస్తుంది. మొదటి సారిగా బుద్ధుని విగ్రహం కుషాణుల కాలంలోతయారుచేయబడింది. కుషాణుల కళలో మరియొక ముఖ్య లక్షణం రాజుల ప్రతిమలు. కనిష్క, లీమా, చస్తన, హువిష్క మొదలగు రాజుల విగ్రహాలు పర్షియాకళ ప్రభావాన్ని తెలియజేస్తాయి. ఈ కాలంలోనే పశ్చిమాసియా కళాభావ్యలు భారతీయతను సంతరించుకొని, భారతీయ కళా భావనతో మిళితమయ్యాయి.

## 10.10 సారాంశము

మౌర్య సామ్రాజ్య పతనానంతరము వాయవ్య భారతం విదేశీ దండయాత్రలకు గురిఅయింది. ఈ ప్రాంతాలలో ఇండో గ్రీకులు, శకులు, పార్థియన్లు, కుషాణులు రాజ్యాలు స్థాపించి పాలించారు. వీరిలో చాలామంది తన వ్యక్తిత్వ వైవిధ్యాన్ని విడనాడి, భారతీయ సమాజంలో కలసిపోవుటయే గాక బ్రాహ్మణీయ, బౌద్ధమతాల పోషకులుగా పేరుగాంచారు. సంస్కృత సారస్వతంలోను, వాస్తు శిల విద్యలలోను గణనీయమైన కృషి సల్పినారు. అన్ని విధాలా ఈ యుగము గుప్తరాజుల స్వర్ణయుగానికి నాందీ వాక్యము పలికారు.

## పదకోసం

| | | |
|---|---|---|
| అండము | : | స్తూపంలోని ప్రధాన బాగం. ఇది అర్ధగోళాకృతిలో దిబ్బలవలె ఉంటుంది. |
| ఖరోష్టి | : | వాయవ్య భారతాన ఎడమ నుండి కుడికి వ్రాయబడిన లిపి. |
| నిర్వాణం | : | స్వార్థ నిర్మూలన ద్వారా జన్మపరంపర నుండి విముక్తిపొందుట. |
| బోధిసత్వుడు | : | ప్రజల క్షేమం కొరకు కృషి చేస్తూ, పునర్జన్మ నుండి తన విముక్తిని వాయిదా వేసుకునే వ్యక్తి. |
| మాధ్యమిక వాదం | : | నాగార్జునుడు ప్రవచించిన బౌద్ధమత తాత్విక సిద్ధాంతం |
| యవనులు | : | ఈ పదం భారత ఆధారాలో గ్రీకులకు వాడబడింది. |
| విహారం | : | బౌద్ధ సన్యాసులుండే మఠం. |
| శ్రేణి | : | వర్తకులు, వివిధ వృత్తులకు చెందిన కళాకారులు పరస్పర సహాయార్థమై ఏర్పరచుకొన్న సంఘాలు. |
| స్తూపం | : | బుద్ధుడు లేక బౌద్ధులచే గౌరవింపబడిన ఇతరుల అవశేషాలపై నిర్మితమైన స్మారకం. |

## ప్రశ్నలు :

**I. వ్యాస ప్రశ్నలు :**

1. కనిష్కుడు సాధించిన కార్యాల వర్ణించుము?
2. భారతదేశంలో విదేశీ రాజ వంశాల పాలనా ఫలితా లెట్టివి ?

**II. సమస్య పూరిత ప్రశ్నలు :**

1. కుషాణుల కాలంలో గల పాలనా విధాన ముఖ్య లక్షణాలను తెలుపుము.
2. కనిష్కుడు రెండవ అశోకుడు చర్చింపుము.

**III. లఘుటీక ప్రశ్నలు**

1. మహాయాన బౌద్ధం
2. గాంధార శిల్పం

**అభ్యాసాలు :**

1. కుషాణులు ఎవరు ? కనిష్కుడు బౌద్ధనికి చేసిన సేవ ఎట్టిది ?
2. కుషాణులు భారత దేశానికి చేసిన సాంస్కృతిక సేవ ఎట్టిది?

## ఉపయుక్త గ్రంథాలు


1. వారణాసి యశోదా దేవి : భారతదేశ చరిత్ర - సంస్కృతి, ప్రథమ భాగం, తెలుగు అకాడమీ ప్రచురణ.
2. R.C. Majumdar & The Age off Imperial
   A.D. Dusalkar (eds) Unity, Bharatiya Vidya Bhavan Series.
3. E.J. Rapson (ed) : The Cambridge History of India vol.1
4. K.P. Jayaswal : History of India.
5. Percy Brown : Indian Architecture.

పాఠం - 17

# పల్లవులు - సాంస్కృతి సేవ, శిల్పకళ

## 17. 1. లక్ష్యం :

పల్లవుల రాజకీయ చరిత్ర, వారు దక్షిణ భారతదేశ సంస్కృతికి ముఖ్యంగా శిల్పకళకు చేసిన సేవ గురించి తెలియజేయడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

ముఖ్యాంశ సంగ్రహము :


17. 2. ఆధారాలు
17. 3. ఉపోద్ఘాతం
17. 4. పల్లవుల రాజకీయ చరిత్ర
17.4. 1. పల్లవుల వంశోత్పత్తి
17.4. 2. ప్రాచీన పల్లవులు
17.4. 3. నవీన పల్లవుల రాజకీయ చరిత్ర
17.4. 4. పరిపాలనా విధానం
17.4. 5. సాంఘిక పరిస్థితులు
17.4. 6. ఆర్థిక పరిస్థితులు
17. 5. సాంస్కృతిక సేవ
17.5. 1. మతము
17.5. 2. సాహిత్యము
17. 6. శిల్పకళ
17. 7. సారాంశము


## 17. 2. ఆధారాలు :

**1. సాహిత్యం :** మొదటి మహేంద్రవర్మ రచించిన 'మత్తవిలాస ప్రహసనం', నాయనార్లు, ఆళ్వార్లు స్తుతించిన భక్తి గేయాలు, శ్రీలంకకు చెందిన 'మహావంశ', హుయాన్‌త్సాంగ్ రచనలు.

**2. శిలాశాసనాలు :** తిరుచిరాపల్లి, మందగపెట్టు గ్రామాలలోని మొదటి మహేంద్రవర్మ కాలం నాటి గుహలలోని శిలాశాసనాలు, మొదటి నరసింహవర్మ బాదామి శాసనం, రెండవ పులకేశి ఐహోలు శాసనం, చాళుక్య, గాంగశాసనాలు.

**3. తామ్రశాసనాలు :** నందివర్మ ఉదయేందిరం తామ్రశాసనం, గద్వాల్ తామ్రశాసనం, కసక్కుడి తామ్రశాసనం.

**4. వాస్తు, శిల్ప, చిత్రలేఖనాలు.**

పాఠం - 11

# శాతవాహనులు - రాజకీయ, ఆర్థిక, సాంఘిక, మత పరిస్థితులు

## 11. 1 లక్ష్యం

దక్కన్‌లోని ప్రప్రథమ రాజవంశమైన ఆంధ్రశాతవాహనుల చరిత్ర వారి మతం, కళల అభివృద్ధికి చేసిన సేవ, దక్కనులోని ఆనాటి ఆర్థిక, సాంఘిక వ్యవస్థలు, విదేశాలలో నెలకొల్పబడిన వ్యాపార, వాణిజ్య సంబంధాల గురించి తెలియజేయడమే ఈపాఠం యొక్క లక్ష్యం

ముఖ్యాంశ సంగ్రహం


11. 2 ఆధారాలు

11. 3 ఉపోద్ఘాతం

11. 4 శాతవాహనుల పుట్టుపూర్వోత్తరాలు, రాజ్యకాల నిర్ణయం

11. 5 రాజకీయ చరిత్ర

11. 6 శాతవాహన రాజ్యపతనం

11. 7 పరిపాలనా వ్యవస్థ

11. 8 ఆర్థిక పరిస్థితులు, వాణిజ్యవ్యాపారాలు

11. 9 సాంఘిక పరిస్థితులు

11. 10 మతం, కళ, వాఙ్మయం

11. 11 సమీక్ష

11. 12 చేదివంశం ఖారవేలుడు


## 11. 2 ఆధారాలు :

1. వాఙ్మయం : (a) స్వదేశీ సాహిత్యం : పురాణాలు, హాలుని 'గాథా సప్తశతి' జైన, బౌద్ధ వాఙ్మయం

   (b) విదేశీ రచనలు : మెగస్తనీస్ రచించిన 'ఇండిక' 'పెరిప్లస్ ఆఫ్ ఎరిత్రియన్ సీ,' ప్లినీ, టోలమీ రచనలు

2. శాసనాలు : (a) నాగానిక నానాఘాట్ ప్రశస్తి

   (b) గౌతమి బాలశ్రీ, నాసిక్ ప్రశస్తి

   (c) ఖారవేలుని హాథీగుంఫ శాసనం

   (d) రుద్రదాముని గిర్నార్ శాసనం

3. నాణేలు

4. వాస్తు శిల్పాలు

## 11. 3 ఉపోద్ఘాతం

అశోకుని తరువాత మౌర్యసామ్రాజ్యం క్షీణదశలో పడడంతో శాతవాహనులు స్వతంత్రులై విజృంభించి సువిశాల సామ్రాజ్యం నిర్మించారు. వీరికాల మందు ఆర్థిక, సాంఘిక, కళా సాహిత్య రంగాలలో ప్రశస్తమైన కృషి జరిగినది.

## 11. 4 శాతవాహనుల పుట్టుపూర్వోత్తరాలు, రాజ్యకాల నిర్ణయం

1. భారతదేశంలో గల ప్రజలలో అతి ప్రాచీనులలో ఒకరు ఆంధ్రులు. వీరి ప్రసక్తి ఋగ్వేదానికి చెందిన 'ఐతరేయ బ్రాహ్మణం'లో గలదు. వీరి గురించిన కొన్ని వివరాలు పురాణాలలో ఉన్నాయి. పురాణాలలో వర్ణించబడిన ఆంధ్రరాజులు, శాసనాలలో, నాణేలలో పేర్కొనబడిన శాతవాహనులు ఒకరే. పురాణాలు, శాసనాలలో ప్రస్తావించబడిన పేర్లు ఒక్కటి కావడమే అందుకు కారణము. అశోకుని శాసనాలలో వీరు అతని సామ్రాజ్య ప్రజలలో ఒకరుగా పేర్కొనడమయింది. అశోకుని తరువాత వీరు స్వతంత్రించి సువిశాల సామ్రాజ్యం నిర్మించారు.

2. 'ఆంధ్ర' అనునది దేశనామమైనా కావచ్చు. జాతిని బట్టి దేశానికి, దేశాన్ని బట్టి జాతికి పేర్లు రావడం చరిత్రలో సాధారణమైన విషయము. ఆంధ్ర శబ్దాన్ని ఐతరేయ బ్రహ్మణంలో జాతి పరంగానే వాడడం జరిగినది. అందుచేత ఆంధ్రజాతినుంచే ఆంధ్ర దేశానికి ఆ పేరు వచ్చిందని ప్రస్తావించడం సమంజసము. 'శాత' అనునది ఒక వంశనామము. ఇది ఎలా ఉత్పన్నమయిందనే విషయం మీద అభిప్రాయ భేధాలున్నాయి. ఈ పదం 'సప్తవాహన'కు పర్యాయ పదంగా కొందరు భావించారు. అందువలన యీ వంశపురాజులు సూర్యారాధకులుగ పరిగణింపబడినారు. శాతవాహన అంటే వంద (శత) వాహనాలు పొందినవాడని మరికొందరు అభిప్రాయపడినారు. 'సాత' అనుయక్షుని వాహనంగా గల వాడగుటచే శాతవాహనుడయ్యెనని 'కథాపరిత్సాగరం' లోని ఒక కథ చెప్తుంది. శాతవాహనుడనెడి రాజొకడు కలడని నాణేల వల్ల తెలుస్తున్నది. ఈ ప్రాచీన రాజు యొక్క పేరు నుండి ఈ వంశానికి ఆ పేరు సంక్రమించి యుండవచ్చు.

3. మౌర్య సామ్రాజ్య పతనానంతరం మగధ నేలిన శుంగ, కాణ్వాయన వంశస్తులవలె శాతవాహనులు బ్రాహ్మణకులస్తులు. వాసిష్టపుత్రపులమాయి నాసిక్ శాసనం ఈ విషయాన్ని ధృవ పరుస్తుంది.

4. దక్షిణ భారతదేశంలో స్వతంత్ర రాజకీయ చరిత్ర శాతవాహనులతోనే ప్రారంభమయ్యెననెడిది నిర్వివాదాంశము. కాని శాతవాహనులు ఎవరు ? వీరు ఆంధ్రులా ? లేక మహారాష్ట్రులా ? శాతవాహనుల సామ్రాజ్యం ఆంధ్రలో తొలుత స్థాపించబడి మహారాష్ట్రకు విస్తరించెనా? లేక ముందు మహారాష్ట్రంలో నెలకొల్పబడి ఆంధ్రకు విస్తరించెనా ? అను అంశాలు నేటికి వివాదాస్పదమైన అంశాలుగా మిగిలిపోయినవి. ఈ అంశాలపై చరిత్రకారులలో ఏకాభిప్రాయంలేదు. (a) మొదటి శాతవాహన రాజులు శాసనాలు, నాణేలు పశ్చిమ దక్కనులో దొరికాయి. కొన్ని జైన ఐతిహ్యాలు, టాలమీ గ్రంథం శాతవాహనుల రాజధాని ప్రతిష్ఠానమని పేర్కొంటున్నాయి. ఇది ఔరంగాబాదు జిల్లాలో ఉంది. ఇవి ఆధారాలుగా శాతవాహనులు మహారాష్ట్రులని, వారి స్వతంత్ర రాజకీయ ప్రతిపత్తి మహారాష్ట్రలో ప్రారంభమయిందని డి.సి. సర్కార్ వంటి పండితుల అభిప్రాయం. (b) ఖారవేలుని హతిగుంఫా శాసనం, గౌతమీ పుత్రశాతకర్ణి నాసిక్ శాసనములందలి వర్ణనను ఆధారంగా చేసుకొని వి.వి. మిరాసి పండితుడు శాతవాహనులు విదర్భ ప్రాంతానికి చెందినవారని మరొక సిద్ధాంతాన్ని ప్రతిపాదించెను. (c) కర్ణాటక ప్రాంతంలో గల బళ్ళారి జిల్లా యందలి మూడోపులోమావి శాసనాలు ఆధారంగా శాతవాహనులు కన్నడిగులని, వారు ప్రారంభంలో కర్ణాటకలో అధికారాన్ని నెలకొల్పి క్రమంగా మహారాష్ట్ర, ఆంధ్రకు విస్తరించారని సుక్తాంకర్ అభిప్రాయపడినారు.

(d) శాతవాహనుల చరిత్రకు ముఖ్యాధారాలైన పురాణాలు శాతవాహనులను ఆంధ్ర భృత్యులు అని వర్ణించాయి. దీని ఆధారంగా శాతవాహనులు ఆంధ్రులని తూర్పు దక్కన్‌లోని కృష్ణా గోదావరుల మధ్య ప్రాంతం ప్రథమ స్థావరంగా అశోకుని మరణాంతరం స్వతంత్రించి విజృంభించి శకులతో పోరాడుతూ మహారాష్ట్రానికి వ్యాపించినారని విన్‌సెంట్‌స్మిత్, రాయచౌదరీ, రాప్సన్ మొదలగువారు అభిప్రాయపడినారు. వీరి ప్రకారం అమరావతిలో వున్న ధాన్యకటకం వీరి రాజధాని. ఇటీవల కరీంనగర్ జిల్లా కోటిలింగాల వద్ద ఇంగువ స్థాపకుడైన శ్రీముఖుని పేరు గల నాణేలను కనుగొనెను. దీనితో శాతవాహనులు ఆంధ్రులే అనెడి అభిప్రాయమునకు మరింత బలంచేకూరెను.

5. శాతవవాహనుల మాతృప్రాంతంపైన అభిప్రాయభేదములున్నట్లే వారిపాలనా ప్రారంభం, ముగింపులపైనను, రాజుల పాలన వరుసక్రమంపైనను చరిత్రకారులలో ఏకాభిప్రాయం లేదు. (a) కాణ్వులలో చివరి రాజైన సుశర్మను హతమార్చింది శాతవాహన వంశమూలపురుషుడయిన శ్రీముఖుడేనని, అందుచేత శాతవాహన సామ్రాజ్య పాలనా క్రీ.పూ 28లోనే ప్రారంభమయినదని కొందరి అభిప్రాయం. (b) పురాణాలలో శాతవాహనుల పాలనకు 450 సంవత్సరాలు కేటాయింపు చేయబడిన విషయం ఆధారంగా క్రీ.పూ. 3వ శతాబ్దంలో శాతవాహన పరిపాలన ప్రారంభమైందని మరికొందరి అభిప్రాయం. పురాణాలలోని అంతర్గత విభేదాలను పరిష్కరించుటకు రెండవ అభిప్రాయం ఎక్కువ ఉపయుక్తంగా వుంది. అశోకుని సమకాలీనులుగ శాతవాహనులు ఎపుడు అధికారంలోకి వచ్చిరను విషయంలో గూడా బేధాభిప్రాయాలున్నాయి. శాతవాహనులు క్రీ.పూ 271 లో, అశోకుని సమకాలీనులుగ అధికారంలోకి వచ్చిరని కొందరి అభిప్రాయం. మరికొందరు అశోకుని మరణానంతరం క్రీ.పూ 230 లో అని అభిప్రాయపడిరి. అయితే ఇందులో రెండవ అభిప్రాయమే అమోదయోగ్యము.

## 11. 5 రాజకీయ చరిత్ర

1. పురాణముల ననుసరించి శాతవాహన రాజులు మొత్తం 30 మంది 450 సంవత్సరాలు దక్షిణ భారతదేశాన్ని పరిపాలించిరి. 30 మంది రాజులు వారిలో, వారు సాధించిన ఘనకార్యాలు కారణంగా ముఖ్యంగా పదిమందిని పేర్కొనవచ్చు. వారిలో మొదటివాడైన శ్రీముఖుడు ఆంధ్రశాతవాహన సామ్రాజ్యానికి పునాదివేసినాడు. ఇతడు 23 సంవత్సరాల కాలం రాజ్యం చేసినాడు. అధిక, భోజక, పిటినిక, పుళింద జాతులను జయించెను.

| | | |
|---|---|---|
| 1. శ్రీముఖుడు | 11. మృగేంద్రశాతకర్ణి | 21. విలివ్యాకు |
| 2. కృష్ణ | 12. కుంతల శాతకర్ణి | 22. శివశాతకర్ణి |
| 3. శ్రీమల్ల కర్ణి | 13. శతశాతకర్ణి | 23. గౌతమీపుత్ర శాతకర్ణి |
| 4. పుర్ణోత్సంగ | 14. మొదటిపులోమాలి | 24. రెండవపులోమావి |
| 5. శాతకర్ణి | 15. మేఘశాతకర్ణి | 25. శివశ్రీశాతకర్ణి |
| 6. లంబోదర | 16. అరిష్టటశాతకర్ణి | 26. శివస్కందశాతకర్ణి |
| 7. అపీలక | 17. హలుడు | 27. యజ్ఞశ్రీ శాతకర్ణి |
| 8. సంఘ | 18. మాండలకుడు | 28. విజయశాతకర్ణి |
| 9. శతస్వతిశాతకర్ణి | 19. మురింద్రసేన | 28. చంద్ర శ్రీశాతకర్ణి |
| 10. స్కందశాతకర్ణి | 20. సుందరశాతకర్ణి | 30. మూడవ పులోమావి |

2. కృష్ణ : శ్రీముఖుని సోదరుడైన కృష్ణుడు తన రాజ్యాన్ని నాసిక్ వరకు విస్తరింపజేసెను. కన్హేరి గుహలోని శిల్పాలు ఈతని కాలంలో చెక్కబడినాయి.

3. మొదటి శాతకర్ణి : ఇతడు శ్రీముఖుని కుమారుడు, ఇతడు తన సామ్రాజ్యాన్ని పశ్చిమ మాళవ వరకు విస్తరింపజేసి కళింగ చక్రవర్తి ఖారవేలుని దండయాత్రలను అరికట్టి రాజసూయ, అశ్వమేధాధిక్రతువులు అనేకం చేసాడు. 'దక్షిణపథపతి' అను బిరుదు ధరించాడు. ఇతడు నాగనిక అను మహారధిరాజకుమార్తెను వివాహమాడినాడు. ఆమె నానాఘాట్ వద్ద శాసనం వేయించినది. అందు శాతకర్ణి విజయాలను గురించి ప్రశస్తి ఉన్నది.

4. రెండవ శాతకర్ణి : ఇతను శకులను ఓడించి కళింగ, మగధలను ఆక్రమించినట్లు తెలుస్తున్నది.

5. కుంతల శాతకర్ణి : ఇతడు శకులను ఓడించి ఉజ్జయినిని ఆక్రమించెను. పాటలీపుత్రం వరకు తన రాజ్యాన్ని విస్తరింపజేసెను. ఈతని ఆస్థానమందలి శర్వవర్మ 'కాతంత్ర వ్యాకరణం'ను గుణాఢ్యుడు 'బృహత్కథ'ను రచించిరి.

6. హాలుడు : శాతవాహన రాజులలో 17 వ వాడైన హాలుడు సాహిత్యాభిమాని. ఇతను అనేకమంది విద్వాంసులను పోషించుటవలన 'కవివత్సలుడు' అను బిరుదు పొందాడు. ఇతను పాకృత భాషలో 'గాథాసప్తశతి' అనుగ్రంథమందు 700 శృంగార గాథలను సంకలనం చేసాడు.

7. గౌతమీ పుత్రశాతకర్ణి : శాతవాహన రాజులలోనే గాక దక్షిణ భారతదేశ చరిత్ర గొప్ప చక్రవర్తులలో గౌతమీపుత్రశాతకర్ణి ఒకడు. ఈయన శాతవాహన రాజులలో 23వ వాడు. ఇతడు సింహాసనం అధిష్టించిన కాలంపై పండితులలో ఏకాభిప్రాయంలేదు. ఇతని కాలాన్ని క్రీ.శ. 106 - 30 అని ఆర్.పి. త్రిపాఠి పేర్కొనెను. ఈతని ఘనతను తల్లి బాలశ్రీ నాసిక్ శాసనం ద్వారా తెలియజేసెను. గౌతమీపుత్రశాతకర్ణికి ముందు శాతవాహన సామ్రాజ్యంలో భాగాలైన మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మాళ్వ, సౌరాష్ట్రాలు, పశ్చిమ క్షాత్రపుల ఆధీనంలో ఉండేవి. వీరు క్రీ.శ. 1,2 శతాబ్దాలలో ఉత్తర భారతాన్ని పరిపాలించిన శక - పహ్లవ రాజులకు లోబడి రాష్ట్ర పాలకులుగా వుండి ఆ తర్వాత శక్తివంతులై స్వతంత్ర పరిపాలకులైనారు. ఈ పశ్చిమ క్షాత్రపులు 'క్షహరాటులు' 'కార్దమకులు' అను రెండు కుటుంబాలుగా విడిపోయారు. భూమక, నహపానులు మొదటి కుటుంబానికి చెందిన వారు. వారు గౌతమీపుత్ర శాతకర్ణికిని, అంతకుముందు పాలించిన మరికొద్ది మందికి సమకాలీనులు.

కార్దమక రాజులైన చష్టన, రుద్రదామనులకు శాతవాహనులతో సంబంధాలు గలవు. భూమకుడు, అతని తర్వాత రాజ్యపాలన చేసిన నహపానుడు సౌరాష్ట్రలో తమ అధికారాన్ని సంఘటిత పరచుకొని శాతవాహన సామ్రాజ్యంలోని కొన్ని భాగాలను వశపరచుకొన్నారు. ఆ ప్రాంతాలలో తన శాసనాలను, నాణేలను జారీచేసిన ప్రతిష్ట నహపానునికి చెందగలదు. నహపానుడు శాతవాహన రాజైన సుందర శాతకర్ణిని ఓడించి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లోని కొన్ని భాగాలను వశపరుచుకొని పశ్చిమ సముద్రతీర వ్యాపార, వాణిజ్య సంపదను బలవంతంగా చేజిక్కించుకొన్నాడు. నహపానుని ఎదుర్కొనుటకు గౌతమీపుత్ర శాతకర్ణి 18 సంవత్సరాల పాటు ఎంతో కృషి చేసి తగిన సాధనసంపత్తిని సమకూర్చుకొన్నాడు. తన పాలనా కాలంలో 18 వ సంవత్సరంలో నహపానునిపై విజయం సాధించి, నహపానుని నాణేలను తన పేరున పునర్ముద్రణ గావించాడు. శాతవాహనులు అంతకుపూర్వం కోల్పోయిన భూఖండమంతయు మరల స్వాధీనపరచుకొని, దక్కన్‌లో పూర్తిగా శాతవాహనాధికారం, ఆధిక్యతను నెలకొల్పాడు. తెలంగాణా ప్రాంతాలైనా అసిక, అసకలు, పైఠాన్ రాజధానిగాగల ముళిక, సురట, కుకుర, అపరాంత, అనుప, అకర, అవంతి, విదర్భప్రాంతాలు గల విస్తృత సామ్రాజ్యానికి గౌతమీపుత్ర శాతకర్ణి ప్రభువని నాసిక్ శాసనం చాటుతుంది. గౌతమీపుత్ర శాతకర్ణి గొప్ప విజేతయేగాక పాలనాదక్షుడు, గొప్ప వైదికమత పోషకుడు. అనేక యజ్ఞయాగాది క్రతువులు చేసి బ్రాహ్మణులకు దానధర్మాలు చేసి 'ఏక బ్రాహ్మణ', 'ఆగమనిలయ' అను బిరుదములను పొందెను. తన సైనిక విజయములకు చిహ్నంగా 'క్షత్రియ దర్పమానమర్దన, 'త్రిసముద్రతోయ పీతవాహన' అను బిరుదములు ధరించెను. గౌతమీపుత్రశాతకర్ణి వైదిక మతాభిమాని అయినను బౌద్ధులకు అనేక దానధర్మాలు చేసి, బౌద్ధమతాభిమాని అయిన తన తల్లి బాలశ్రీ, మన్ననలను పొందాడు.

8. వాసిష్ఠ పుత్రపులోమావి : ఇతడు గౌతమీపుత్ర శాతకర్ణి కుమారుడు. ఇతనికాలంలో శకులు చష్టమని నాయకత్వాన విజృంభించి శాతవాహన సామ్రాజ్యంలోని ఉత్తర, వాయవ్య ప్రాంతాలను ఆక్రమించాడు.

9. శివశ్రీ శాతకర్ణి : ఇతడు శకరాజు రుద్రదాముని చేతుల్లో రెండు పర్యాయాలు ఓడిపోయాడు. కాని రుద్రదాముడు తన కుమార్తె రుద్రదమనికను శివశ్రీకిచ్చి వివాహంచేసాడు. మహారాష్ట్ర దేశాన్ని శాతవాహనులు శకులను స్వాధీనం చేయక తప్పిందికాదు.

10. యజ్ఞశ్రీ శాతకర్ణి : ఇతడు కడపటి శాతవాహనరాజులలో ముఖ్యుడు. ఇతడు మహారాష్ట్ర, మధ్యభారత్‌ల నుండి శకులను తరిమి వేసినట్లు కన్పిస్తుంది. ఈతని నాణేలపై ఓడ ముద్రింపబడి యుండుటచే సముద్రాంతర దేశాలతో వర్తక వ్యాపారములు బాగా అభివృద్ధికి వచ్చినదని భావించవచ్చు. ఇతనికి మూడు సముద్రాలలో నౌకాదళ ముండుట వలన 'త్రిసముద్రాధీశ్వరుడు' అను బిరుదు వచ్చింది. ఇతడు ప్రారంభంలో వైదిక మతస్థుడే. కాని ఆచార్య నాగార్జునుని బోధనలచే ప్రభావితుడై బౌద్ధమతాభిమాని అయ్యాడు. నాగార్జునుని ఉపయోగార్ధం శ్రీ పర్వతముపైన ఒక స్థూపాన్ని, మహాచైత్యాన్ని, విహారాన్ని నిర్మించాడు. ఇతని కొరకు నాగార్జునుడు 'సుహృల్లేఖ' అను గ్రంధాని రచించాడు.

## 11. 6 శాతవాహన రాజ్యపతనం

శక దండయాత్రల వలన, వారితో నిరంతర యుద్ధాలు చేయుట వలన శాతవాహనుల రాజ్యం బలహీనపడింది. వారి సామంతులైన ఆభీరులు, ఇక్ష్వాకులు, పల్లవులు తిరుగబడ్డారు. శాతవాహన రాజకుటుంబంలో వారసత్వయుద్ధాలు జరిగాయి. శాతవాహనులలో కడపటి వాడైన పులోమావి మరణానంతరం సామ్రాజ్యం విచ్ఛిన్నమై తూర్పు ప్రాంతం ఇక్ష్వాకులకు, ఆగ్నేయ ప్రాంతం పల్లవులకు, నైఋతి ప్రాంతం చుటువంశీయులకు, పశ్చిమోత్తర ప్రాంతం ఆభీరులకు స్వాధీనమయింది.

## 11. 7 పరిపాలనా వ్యవస్థ

1. ఆంధ్ర రాజులు 30 మంది 450 సంవత్సరాలు రాజ్యపాలన చేసినట్లు పురాణాల వలన తెలుస్తున్నది. వీరిలో మొదటి శాతకర్ణి, హాలుడు, గౌతమీపుత్రశాతకర్ణి, యజ్ఞశ్రీ శాతకర్ణి మొదలగువారు అత్యంత ప్రముఖులు. వీరు దక్షిణాపథానికి రాజకీయ ఐక్యతను సాధించి, శకదండ యాత్రలనుంచి రక్షించి శాంతిభద్రతలు చేకూర్చినారు. వీరి సామ్రాజ్యం మధ్య భారతం నుండి మద్రాస్, మైసూరులవరకు విస్తరించింది. వీరిపాలనలో ఆంధ్రులు, మహారాష్ట్రులు, కన్నడిగులు, ఘూర్జరులు, కళింగులేగాక విదేశీ జాతులైన శక, యవన, పహ్లవులు సైతం కలరని శాసనాధారముల వలన తెలియుచున్నది. "ఆర్యావర్త ద్రావిడ దేశాలమధ్య సువిశాలమయిన సామ్రాజ్యం స్థాపించి ఉత్తర దక్షిణ మధ్య సాంస్కృతిక సమన్వయం సాధించడంలో శాతవాహనులు చరిత్రాత్మకమైన పాత్రను నిర్వహించారు" అని కె. ఎమ్. పణిక్కర్ అభిప్రాయపడినారు.

2. ఆంధ్ర శాతవాహనుల పాలనా విధానం మౌర్యుల అడుగు జాడలలో నడిచి పల్లవులు మొదలుగా తరవాతి రాజవంశాలకు మార్గదర్శకమయింది. రాజు దైవాంశ సంభూతుడను భావం ఈ కాలంలోనే ప్రారంభమైనది. రాచరికము వారసత్వం, పరిపాలన నిరంకుశం కాదు. రాజులు మంత్రుల సలహాలను పాటించెడివారు. వారి మంత్రులకు 'విశ్వాసామత్య', 'రాజామాత్య' మహామాత్ర', 'మహాతారక', అని పేర్లు ఉన్నవి ఇంకా 'భండాగారిక', 'హేరణిక', 'ప్రతీహార', 'లేఖక', 'నిభాందకార' మొదలగు ఉద్యోగులు ఉండేవారు. వీరి ఉద్యోగాలు వారసత్వంగాదు. శాతవాహన రాణులు కూడా పరిపాలనలో భాగం పంచుకున్నారు. రాజరిక బాధ్యతలు నిర్వహించడానికి యువరాజుగా ఉన్నకాలంలోనే గణకశాస్త్ర, న్యాయశాస్త్రాలలో శిక్షణ నిచ్చేవారు.

3. శాతవాహన రాజులు పరిపాలనా సౌలభ్యం కొరకు తమ రాజ్యాన్ని జనపదాలు (సామంత రాజ్యాలు) గాను, ఆహారాలుగాను (జిల్లాలు) విభజించారు. జనపదాల పాలకులను రాజన్, మహాభోజ, మహారథ అని, ఆహార అధికారులను అమాత్యులని, మహామంత్రులని పిలిచేవారు. శాసనాలలో శాతవాహనహారం, కుడూరాహారం, గోవర్ధనాహం, మామలా ఆహార మొదలగు పేర్లున్నాయి.

4. మౌర్య సామ్రాజ్యంలో వలెనె ఈ కాలంలో పరిపాలనలో సలహానిచ్చుటకు పౌరసభలున్నట్లు భట్టిప్రోలు శాసనంలో కన్పించే 'నిగమసభ' వలన తెలుస్తుంది. ఈ నిగమసభలు నాటి పట్టణాలయిన పైఠాన్, బరుకచ్ఛ, ధాన్యకటకం మొదలగు నగరాలను పాలించేవి. ఇందలి సభ్యులను గహపతులు అనేవారు. నాటి పట్టణాలకు రక్షణ కోటలు ఉండేవి. ఆంధ్రప్రదేశంలో 30 దుర్గాలు కలవని మెగస్తనీసు వ్రాశాడు. 'గ్రామణి' గ్రామానికి పెద్ద.

5. ప్రభుత్వానికి భూమిశిస్తు ముఖ్యాదాయమార్గం. దేశంలోని అన్ని పంటపొలాలకు రాజు యజమానికాదు. 'రాజకంఖేట' అన్న మాటను బట్టి రాజు కొంత పొలానికి మాత్రమే యజమాని. భూదానం చేయవలసి వచ్చినపుడు రాజు భూమిని కొని దానంచేసిన సందార్భులున్నాయి. రేవులమీదా బాటలు మీదా సుంకాలుండేవి. వృత్తి పనివారు వృత్తి పన్నులు చెల్లించేవారు. భాండాగారిక, హేరణిక అన్న ఉద్యోగులను బట్టి, వివిధ ప్రాంతాలలో లభించిన శాతవాహన నాణేలను బట్టి పన్నులు ధనరూపంలో చెల్లించినట్లు తెలుస్తున్నది.

6. శాతవాహన రాజులు పటిష్ఠమైన సైన్యాన్ని పోషించిరి. వీరిసైన్యంలో పద, గజ, రథ, తురగ బలాలు ఉండెడివి. వీరు తరచు దిగ్విజయ యాత్రలను చేసిరి. యుద్ధవ్యూహాలను పన్నుటకు సైన్యాధిపతులు ఉన్నను అనేక సందర్భాలలో రాజులే సేనకు నాయకత్వం వహించిరి. సామ్రాజ్యము నందలి ముఖ్య నగరములన్నియు పటిష్ఠమైన కోటలలోను, స్కంధావారమనే సైనిక శిబిరముతోను, కటకములనెడి సైన్యాగారములతోను యుండెడివి. శాతవాహనుల కాలంలో సామాన్య ప్రజానీకాన్ని హింసించినారనుటకు నిదర్శనములు కలవు.

గౌతమీ పుత్ర శాతకర్ణికి గల క్షహరాట వంశనిరవ శేషకర అను బిరుదు ఇందులకు నిదర్శనం. ఖారవేలుడు తన హాతి గుంఫా శాసనంలో శాతకర్ణిని ఓడించి పితుండ నగరాన్ని ధ్వంసం చేసి గాడిదలతో దున్నించి నాడని చెప్పుకొనెను.

## 11. 8 ఆర్థిక పరిస్థితులు - వాణిజ్య వ్యాపారాలు

1. ఆర్థికంగా దక్షిణ భారతదేశం శాతవాహన యుగంలో గొప్ప పురోగతి సాధించింది. (క్రీ.పూ 230 క్రీ.శ. 220) దేశంలో వ్యవసాయరంగంలోను, పారిశ్రామికంగాను, దేశీయ, విదేశీయ వ్యాపారంలోను గణణీయమైన ప్రగతి గోరించును. నాటి ఆర్థిక వ్యవస్థకు మూలం వ్యవసాయం. నదీతీరాలలో డెల్టా భూములలో పంటలెక్కువగా పండేవి. వరి, చెరకు, జొన్న, జనుము, నువ్వులు నాటి ప్రధాన పంటలు. గాడిదలను, ఎద్దులను వ్యవసాయ పనులకు ఉపయోగించిరి. పంటపొలాలలో స్త్రీ పురుషులు కలిసి పనిచేసేవారు. వ్యవసాయం తరువాత ప్రజలకు పశుపోషణే ప్రధాన వృత్తి.

2. ఈ యుగంలో వ్యవసాయంతో బాటు చేతివృత్తులు, కుటీర పరిశ్రమలు అభివృద్ధి చెందెను. సాలివారు, కుమ్మరివారు, నూనెగానుగలవారు, కమ్మరివారు, స్వర్ణకారులు, మణికారులు, వడ్రంగివారు చేతి పనివాండ్రుగా ప్రముఖపాత్ర వహించారు. పురావస్తు త్రవ్వకాలములలో లభించిన వస్తుసముదాయములను బట్టి నాటి వృత్తి పనివారి నైపుణ్యము తెలియుచున్నది. శాతవాహనుల స్థావరాలలో లభించిన మిశ్రమలోహ ప్రతిమలు, దీపపు స్థంభములవలన లోహ పరిజ్ఞానంలో కూడా నాటి ప్రజలకు గొప్ప పరిజ్ఞానం ఉన్నట్లు తెలియుచున్నది. ఆభరణాల తయారీలో నాటకమ్మరులు మంచి పనితనమును చూపినను నాణేల తయారీలో శాతవాహనులు చాలా వెనుకబడియుండిరి. వీరి నాణేలు ఎక్కువగా సీసములో కలవు. ఈ నాణేలకు సరియైన ఆకారం, ఒకే ప్రమాణము లేవు.

3. శాతవాహనుల ఆర్థిక వ్యవస్థలో ప్రముఖంగా పేర్కొనదగిన అంశం శ్రేణులు. ఆనాడు వివిధ పరిశ్రమలకు చెందిన వారందరు శ్రేణులుగా ఏర్పడిరి. ఈ శ్రేణులు నేటి బ్యాంకులు వలె పనిచేసెను. ఈ శ్రేణుల అధికారిని 'శ్రేష్ఠి' అని పిలిచేవారు. ఈ శ్రేణులు అప్పులిచ్చేవి, తీసుకునేవి. అంతేగాక దానధర్మాలు చేసేవి. గోవర్ధన పట్టణంలో సాలెవాండ్రు 2 వేల కార్షాపణాలను(నాణేలు) ఒక శ్రేణి వద్ద దాచి దానిపై వచ్చేవడ్డీతో బౌద్ధ సన్యాసులకు ప్రతి సంవత్సరం బట్టలు ఇచ్చేఏర్పాటు చేశారని నాసిక శాసనం తెల్పుచున్నది.

4. శాతవాహనయుగంలో దక్షిణాపథములో దేశీయ విదేశీయ వాణిజ్యం విరివిగా సాగింది. వారి సామ్రాజ్యంలో ప్రతిష్టాన, తగరు, కరహాట, నాసిక, గోవర్ధన, వైజయంతి, ధాన్యకటక, విజయపురి, తామ్రా పనరసాల మొదలైనవి పెద్ద వర్తక కేంద్రాలు. తూర్పు పడమర పట్టణాల మధ్య వ్యాపారం సాగుతుండేది. అలాగే ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్యకూడా వ్యాపారం విరివిగా సాగెను. దక్కను నుండి ఆలిచిప్పలు, ముత్యాలు, వజ్రాలు, నవరత్నాలు, బంగారుదుప్పట్లు, బట్టలు ఉత్తర భారతదేశానికి ఎగుమతి చేశారు. అలాగే ఉత్తర భారతదేశం నుండి మందులు, గాజులోహాలు, సిల్క్, మిర్చి, సువాసన ద్రవ్యాలు దిగుమతి చేసుకొన్నారు. పట్టణాలు దేవు పట్టణాలతో వ్యాపార సంబంధాలు కలిగి ఉండేవి. నదులు కూడా వ్యాపారమునకు ఉపకరించినవి.

5. ఆనాడు పట్టణాలను కలుపుతూ పెద్ద బాటలుండేవి. మచిలీపట్నం నుండి వినుకొండకు మార్గముండేదట. అలాగే ఈ పట్టణమును కలుపుతూ ఉత్తర దక్షిణాలకు మార్గం కలదు. మగధ రాజ్యంలో గల సహస్రం నుండి రాయచూర్ మీదుగా కృష్ణ, తుంగభద్ర నదుల ప్రాంతం వరకు మార్గాలు కలవు. ఈ మార్గాలు వైజయింతీ పట్టణానికి కూడా కలుపును. తూర్పున ధాన్య కటకం ప్రతిష్ఠానపురం మీదుగా బరుకచ్ఛ, సోపార రేవులకు మార్గాలుండేవి. విదిశ నుండి పాటలీపుత్రం వరకు మార్గం కలదు. వర్తకులు సమూహాలుగా ప్రయాణం చేసేవారు. బండ్లలోను, నౌకల ద్వారా సరుకు రవాణా అయ్యేది. ఉషవదత్తుడు వర్తకులకు సదుపాయములు చేసి మార్గాల కిరువైపుల సత్రాలు కట్టించి, బావులను తవ్వించాడు.

6. శాతవాహన చక్రవర్తులు సముద్రవ్యాపారమును ప్రోత్సహించిరి. పాండిచ్చేరి, నాగార్జున కొండ, కొండాపూర్, అరికమేడులలో రోమన్ నాణేలు లభ్యమగుటవలన నాడు శాతవాహన రాజ్యం రోమ్‌తో వ్యాపారం చేసినట్లు తెలియుచున్నది. రోమ్ మార్కెట్లలో దక్కన్ వస్తువులకు మంచి గిరాకీ ఉండేది. టాలమీ చెప్పిన ప్రకారం బరుకచ్ఛం, కళ్యాణి, మైసోలి, ఘంటసాల, కోడూరు, నాటి గొప్ప రేవు పట్టణాలు. ఈ రేవులను కలుపుతూ మార్గాలుండేవి. రోమ్ అరేబియా దేశాలనుండి సారాయి, రాగి, సీసం, దంతం దిగుమతి

చేసుకొనేది. అలాగే పాశ్చాత్య దేశాలకు వస్త్రాలు, ముత్యాలు, దంతం, సుగంధ ద్రవ్యాలు, నవరత్నాలు, ఆలిచిప్పలు ఎగుమతి చేసేవి. ఐరోపానుండి దక్కన్‌కు బంగారం ఎక్కువగా దిగుమతి అయ్యేది. బర్మా, సయా, చైనా, తూర్పు సముద్ర దీవులతోకూడ వాణిజ్య సంబంధాలు కలవు. ప్రసిద్ధ కళ్యాణి రేవు పట్టణం కొరకు శకులు శాతవాహనులు కలహించుకొనిరి.

7. విదేశీ వ్యాపారం వలన శాతవాహన రాజ్యంలోని వర్తకులు, మతప్రవక్తలు, వృత్తి పనివారు విదేశాలలో స్థిరపడేవారు. తూర్పు పశ్చిమ భారతరేవుల నుండి బయలుదేరి తూర్పు ఆఫ్రికా, ఆగ్నేయాసియా దేశాలలో స్థిరపడి భారత సంస్కృతి మతం, భాషను వ్యాప్తి చేసిరి.

## 11.9. సాంఘిక పరిస్థితులు

1. శాతవాహన యుగంలో సమాజంలో చాతుర్వర్ణ వ్యవస్థ కలదు. బ్రాహ్మణులకు అధిక గౌరవ మర్యాదలు కలవు. వర్ణవ్యవస్థను కాపాడుట తమ ధర్మంగా భావించి రాజులు 'ఏక బ్రాహ్మణు'లను బిరుదు వహించిరి. విదేశీ తెగలు హిందూ సమాజంలో కలిసిపోయినాయి. శకకార్దమకులను క్షత్రియులుగా పరిగణించి శాతవాహనులు వారితో వివాహ సంబంధాలు చేసుకొన్నారు. హాలిక, గోలకాదులైన ఉపవర్ణాలు ఏర్పడ్డాయి. వృత్తి మార్పిడి కలదు. బ్రాహ్మణులు, వైశ్యులు ఉద్యోగులు నిర్వహించడం, క్షత్రియులు వాణిజ్యం సాగించడం జరిగింది.

2. సంఘంలో స్త్రీలకు గౌరవ మర్యాదలు కలవు. వారికి సొంత ఆస్తి హక్కు ఉన్నది. భర్తతో బాటు మత కార్యక్రమాలలో, పండిత చర్చలలో స్త్రీలు పాల్గొనేవారు. స్త్రీ పురుషులు ఇరువురు ఆభరణాలను ధరించేవారు కంకణాలు, చెవిపోగులు, ఉంగరాలు, గొలుసులు, ముత్యాల దండలు ధరించేవారు. అలంకరణ సామాగ్రి, అద్దం, దువ్వెన వారికి తెలుసు. పూలు అంటే స్త్రీలకు అమిత ఇష్టం. స్త్రీ ు వివిధ రకాల కొప్పులు, ముడులు, జడలు అల్లుకొనేవారు. పసుపు పారాణి పూతలు వాడుకలో ఉండేవి. స్త్రీలు సంగీత నాట్యాలు నేర్చుకొనేవారు. వీణ, శంఖం, మృదంగం, వేణువు నాటి వాద్యాలు. ఉద్యానవనాలు పెంచేవారు.

3. కుటుంబాలు చాలా వరకు ఉమ్మడికుటుంబాలే. అన్నాదమ్ములు, అత్తకోడళ్ళు అన్యోనంగా వుండేవారు. నైతికంగా జీవిస్తూ దానధర్మాలు చేస్తు బౌద్ధ ఆరామాలు దర్శిస్తూ క్రతువులు చేస్తూ ఆధ్యాత్మిక చింతనతో జీవించేవారు. రంగురంగుల వస్త్రాలు ధరించేవారు. నీలం, ఎరుపు, రంగులు ఎక్కువగా వాడేవారు. తలపాగాలు ధరించేవారు. శ్రీమంతులు అంతస్థులు కల్గిన ఇళ్ళలో నివసించేవారు. పేదలు గుడిశెలలో నివసించేవారు.

## 11. 10. మతం, కళ, వాఙ్మయం

1. ఆంధ్ర శాతవాహనుల వైదిక ధర్మాన్ని, వర్ణాశ్రమ ధర్మాన్ని అనుసరించారు, అమలు పరిచారు. శాతకర్ణి వంటి రాజులు అశ్వమేధ, రాజసూయాది వైదిక క్రతువులు అనేకం చేసారు. శైవ వైష్ణవ మతాలు ప్రజల అభిమానాన్ని చూరకొన్నాయి. ఈ మతాలు వేదధర్మానికి అనుగుణంగా నడుచునట్లు చేయుటకు పురాణాలు, ఆశయాలు ఏర్పాటయ్యాయి. భారత భాగవత్, రామాయణ గాధలు, దశావతార గాధలు విస్తార ప్రచారంలోనికి వచ్చాయి. ఈ మతాలకు భక్తి, దానధర్మాలు, అతిధి ఆదరణ, యాత్రలు చేయటం మొదలైనవి శకులను, యవనులను ఆకర్షించినాయి. వీరు వైదిక ధర్మాలను అవలంబించి భారత సమాజంలో కలసిపోయారు.

2. శాతవాహనులు వైదిక ధర్మావలంబకులైననూ పరమత సహనం ప్రదర్శించినందువల్ల ఈ యుగంలో దక్షిణ దేశంలో బౌద్ధమతం మహోజ్వలదశననుభవించింది. వృత్తిపనివారు, వర్తకులు, స్త్రీ జనం విశేషంగా బౌద్ధాన్ని ఆదరించి పోషించారు. శాతవాహనులు కంటే ముందు నుండి గూడా ఆంధ్రదేశం బౌద్ధమతానికి పట్టుకొమ్మగా ఉన్నది. ఈ యుగంలో ఈ స్థానం కొనసాగింది. మహారాష్ట్రలో గుహలు చైత్యాలయ్యాయి. ఆంధ్రలో స్థూపవిహారాలు వెలిసాయి. యజ్ఞశ్రీ శాతకర్ణి కాలంలో ఆచార్య నాగార్జునుడు ధాన్యకటక, శ్రీపర్వతాలలో ఉంటూ మహాయాన బౌద్ధం రూపొందించి ప్రచారం చేసినట్లు అనేక మంది చరిత్రకారులు నిర్ణయిస్తున్నారు. నాగార్జునుడు దక్షిణాపధంలో వేదలి అనేగ్రామంలో జన్మించాడు. ఇతడు మాధ్యమికవాది. మహాయాన మతాన్ని వ్యాప్తిచేసెను. ఇతడు సంస్కృత భాషలో గ్రంధాలను రచించెను. ప్రజ్ఞాపారమిత శాస్త్రము, మూలమాధ్యమిక శాస్త్రం, శూన్యసప్తాది, వివాదసమానశాస్త్రం, ప్రమాణ విహేతన శాస్త్రం, రత్నావళి, సుహృల్లేఖ మొదలుగునవి ఇతని రచనలు. ఇతడు ప్రకృతిశాస్త్ర వేదాంతి, సర్వవిద్యలందు నిష్ణాతుడు. వేదాంతం, తర్కం, రసాయనశాస్త్రం,

వైద్యం వృక్షశాస్త్రంలో మేధావి. దయార్ద్ర హృదయుడు. తన సంపూరామాన్ని ఒక పరిశోధనాగారంగా మార్చెను. వివిధ దేశాలనుండి పెక్కుమంది వచ్చి ఇతని దగ్గర విద్యనభ్యసించేవారు. ఇతని శూన్యవాదం శంకరాచార్యునికి మార్గదర్శకమైనదని అంటారు.

3. బౌద్ధమతంతో పాటు జైనమతాన్ని కూడా శాతావాహనులు ఆదరించారు. నాటి జైనమతాచార్యులలో ప్రముఖుడైన కొండకుండాచారి రచించిన 'సమయసారము' శ్వేతాంబర జైనులకు ముఖ్యగ్రంథము. జైన గ్రంథమైన 'ద్వాత్రింశ పుత్తిలక' కూడా ఈ కాలం నాటిదే.

4. శాతవాహనయుగంలో భాషా సాహిత్యాలు అభివృద్ధి చెందినవి. నాడు ప్రాకృత, సంస్కృత భాషలతో బాటు పైశాచి అనే దేశీయ భాషకూడా ఉన్నది. వైదిక, బౌద్ధ, జైన మతాలకు సంబంధించిన సాహిత్యమేగాక, తర్క, శబ్ద, అర్థ, జ్యోతిష్య, సాముద్రిక శాస్త్రాలలో కూడా పులువురు పండితులు అనేక గ్రంథాలను రచించారు. శాతవాహన రాజులలో హాలునికి 'కవివత్సలుడు' అని బిరుదుకలదు. ఇతడు స్వయంగా కవి. ఇతడు ప్రాకృతంలో 'గాధాసప్తశతి' అను గ్రంథాన్ని వ్రాసినాడు. కుంతల శాతకర్ణి ఆస్థానంలో గల గుణాఢ్యుడు పైశాచిక భాషలో 'బృహత్కథ' ను, 'శర్వవర్మ', 'కాతంత్ర వ్యాకరణము' ను రచించారు. ప్రసిద్ధ బౌద్ధమతాచార్యుడైన నాగార్జునుడు 'మాధ్యమిక సూత్రాలను, సుహృల్లేఖను రచించెను. నాగార్జునుని ప్రియశిష్యుడు ఆర్యదేవుడు చిత్తవిశుద్ధి అనే గ్రంథం వ్రాసి నాటి బ్రాహ్మణుల మూఢ భక్తిని పరిహసించాడు. జైనమతాచార్యుడైన కొండకుండాచారి 'మసెయు సారము' ను, వాత్స్యాయనుడు 'కామసూత్రా' లను రచించిరి.

5. శాతవాహనయుగంలో అనేక స్థూపాలు, చైత్యాలయాలు, విహారాలు నిర్మింపబడినవి. మహారాష్ట్రలో కార్లీ, కన్హేరి, నాసిక్, భాజ, బేడ్సా మొదలగు చోట్ల చైత్యాలయ విహారాలను పర్వతసానువులలో తొలచారు. ఈ గుహల ముందు భాగం, స్తంభకిరీటాలు శిల్పాలతో అలంకృతమైనవి. ఆంధ్రదేశంలో అమరావతి, జగ్గయ్యపేట, శ్రీపర్వతం మొదలగుచోట్ల స్తూపవిహారాలు ఇటుకలతో నిర్మించారు. ఈ స్తూపాలపై శిల్పాలు చెక్కిన పాలరాతి ఫలకలను అమర్చేవారు. స్తూపాల చుట్టూ శిల్ప సంశోభితమైన శిలాప్రాకారాలుండేవి. స్తూపాలలో అమరావతి స్తూపం ప్రపంచ ప్రసిద్ధి చెందింది. దేవీ ప్రసాద్ ఘోష్ మాటల్లో "ఉల్లాసకరమూ, నాగరికమూ అయిన జీవితము అమరావతీ శిల్పంలో ప్రతిఫలిస్తుందనీ, వివిధ భంగిమలలో మానవాకృతిని మలచడంలోనూ, క్లిష్టమైన మనోగత భావాలను చిత్రించడంలోనూ సిద్ధహస్తులైన అమరావతీ శిల్పులకు సాటి మరొకరులేరు". వాస్తు శిల్పాలతోబాటు చిత్రలేఖనం గూడా అభివృద్ధి చెందింది. ఆనాటి చిత్రలేఖనాలు అజంతా, జున్నార్, బేడ్స, పితల్‌కోర గుహలలో అద్భుతంగా చిత్రించబడినవి.

## 11. 11 ముగింపు

ఆంధ్ర శాతవాహన రాజులు 30 మంది 450 సంవత్సరాలు రాజ్యమేలారు. వీరు ఆంధ్రులైనను, మహారాష్ట్రులైనను తమ సుదీర్ఘ పాలనలో దక్షిణ భారతదేశములో రాజకీయ ఐక్యతను సాధించి, వైదిక, బౌద్ధమతాలను సమానంగా ఆదరించి సాహిత్య, శిల్ప, సాంస్కృతిక రంగములకు ఎనలేని సేవచేసి దక్షిణ భారత సంస్కృతికి గట్టిపునాదులు వేయుటలో సఫలీకృతులైరి.

## 11. 12 చేది వంశము - ఖారవేలుడు :

కళింగదేశాన్ని పాలించిన చేది వంశంలో సుప్రసిద్ధుడు ఖారవేలుడు. ఇతడు వేయించిన హాతిగుంపా శాసనం వల్ల అతని జీవిత విశేషాలు తెలుస్తున్నాయి. ఇతడు బాల్యాన్ని విద్యా వినోదాలతో గడిపాడు. 16 వ యేట యువరాజయ్యాడు. యువరాజుగా ఉన్న కాలంలో గణకన్యాయ శాస్త్రాలలో, పరిపాలన, యుద్ధ నిర్వహణలో శిక్షణ పొందాడు. 24 సంవత్సరాలు పూర్తికాగానే కళింగ చక్రవర్తి అయ్యాడు. ఇతడు జైనమతస్థుడు అయినప్పటికీ మత సహనం పాటించాడు. ఇతడు శాతకర్ణి రాజ్యంమీద దండెత్తి కృష్ణవేణీనది వరకు నడిచి ముసికనగరాన్ని హడలగొట్టాడు. పింతుడు నగరాన్ని ధ్వంసం చేసాడు. ఆ తరువాత అంగ, మగధ, రాజ్యాలను కొల్లగొట్టి పూర్వరాజులు తీసుకొనిపోయిన జైన ప్రతిమలను తిరిగి తెచ్చాడు. దక్షిణదేశంలో పాండ్యరాజును ఓడించి కప్పం పుచ్చుకున్నాడు ఖారవేలుడు విజేతయేకాదు. ప్రజాక్షేమాన్ని గుర్తించి ఉదార బుద్ధితో పాలించిన చక్రవర్తి. తన రాజధానీ నగరాన్ని మనోహరంగా పునర్నిర్మించుకొన్నాడు. నందరాజుల చేత ప్రారంభించబడిన కాలువను రాజధానివరకు తవ్వించి మంచినీటి సౌకర్యాలు కలిగించాడు

జైనులకోసం ఉదయగిరి కొండలలో గుహాలయాలు తొలిపించాడు. కుమారగిరిమీద జైన పరిషత్తును సమావేశపరచి జైనమత గ్రంథాలను క్రోడీకరించడానికి కృషి చేసాడు. సమకాలికులితనిని 'భిక్షరాజు' అని శ్లాఘించినారు. ఇతడు క్రీ.పూ. 2 వ శతాబ్దంవాడని చాలామంది చరిత్రకారుల అభిప్రాయము.

**పదకోశం**

| | | |
|---|---|---|
| ఆహారాలు | : | జిల్లాలు |
| క్షాత్రపులు | : | రాష్ట్రపాలకులు |
| చైత్యం | : | బౌద్ధ ఆలయం, బుద్ధుని అవశేషాలపై నిర్మించిన నిర్మాణం |
| ప్రశస్తి | : | రాజు కార్యకలాపాలను సామాన్యంగా మెచ్చుకుంటూ వెలువడిన శాసనాలు |
| మాధ్యమిక వాదం | : | ప్రాపంచిక జీవితం నిర్వాణ ఎంటిదే, వాటి మధ్య ఎటువంటి తేడా అని నమ్మబడింది. |
| విహారం | : | బౌద్ధ, జైన సన్యాసులుండే మఠం |
| స్తూపం | : | బుద్ధుని అవశేషాలపై నిర్మితమైన స్మారకం |
| శ్రేణి | : | వర్తకులు వివిధ వృత్తులకు చెందిన కళాకరులు పరస్పర సహాయార్థమై ఏర్పరచుకొన్న సంఘాలు |

## ప్రశ్నలు

**I. వ్యాస ప్రశ్నలు**

1. శాతవాహనులు రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులను తెల్పుము ?

**II. సమస్య పూరిత ప్రశ్నలు**

1. శాతవాహనుల పుట్టుపూర్వోత్తరాలు, రాజ్యకాల నిర్ణయం చర్చింపుము
2. గౌతమీపుత్ర శాతకర్ణి సాధించిన ఘనకార్యములను తెలుపుము ?

**I. లఘుటీక ప్రశ్నలు**

1. హాలుడు
2. నాగార్జునుడు
3. అమరావతి
4. విదేశీ వాణిజ్యం
5. హాతిగుంపా శాసనం

**కుశాగ్ర బుద్ధి పరీక్ష**

I. ఈ క్రింది ప్రశ్నలకు సరియైన సమాధానాలు బ్రాకెట్‌లో వ్రాయండి.

1. శాతవాహనుల గురించి ఈ శాసనము తెల్పును ( )

a) అశోక b) హాతిగుంపా c) ఆదాలాబాదు.

2. ఆంధ్ర శాతవాహన రాజ్య స్థాపకుడు ( )

a) మొదటి శాతకర్ణి b) శ్రీముకుడు c) హాలుడు

3. శాతవాహనుల రాజధాని ( )

a) ప్రతిష్ఠానపురం b) వాతాపి c) పాటలీపుత్రం

4. బృహత్కథ రచయిత ( )

a) హాలుడు b) శాతకర్ణి c) గుణాఢ్యుడు

5. హాలుడు రచించిన గ్రంధం ( )

a) బృహత్కథ b) గాధాసప్తశతి c) వ్యాకరణం

II. జతపర్చుము

| గ్రూపు - A | గ్రూపు - B |
|---|---|
| 1. నానాఘాట్ శాసనం | (a) బాలశ్రీ |
| 2. నాసిక్ వాసనం | (b) శర్వవర్మ |
| 3. కాతంత్ర వ్యాకంణం | (c) నాగనిక |
| --నాగునకొం-- | (d) రేవు పట్టణం |
| | (e) విశ్వవిద్యాలయం |

పాఠం - 12

# గుప్త సామ్రాజ్యం (క్రీ.శ. 320 - 550)

## 12.1 లక్ష్యం :

గుప్త సామ్రాజ్య స్థాపన, విస్తరణ, పతనం గురించి సామాన్యంగా సముద్ర గుప్తుని గురించి ప్రత్యేకంగా వివరించటమే పాఠం యొక్క ప్రధానాశంయం. ఇందులో ఫాహియాన్ ఉత్తర భారతదేశ యాత్రతోపాటు హూణుల దండయాత్రల్ని గురించి గూడా ప్రస్తావించ బడింది.

## ముఖ్యాంశాలు :

12. 2 గుప్తుల చరిత్రకు ఆధారాలు.

12. 3 తొలి గుప్త ప్రభువులు సామంత స్థాయిలో వున్నారు. మొదటి చంద్రగుప్తుడు స్వతంత్ర రాజ్య స్థాపన చేశాడు.

12. 4 గుప్త చక్రవర్తులలో ప్రముఖుడైన సముద్ర గుప్తుడు యుద్ధాల ద్వారా, రాజనీతి ద్వారా తన సార్వభౌమత్వాన్ని నెలకొల్పాడు. ఇతని అనంతరం రామగుప్తుడు రాజయ్యాడని ఒక అభిప్రాయం వుంది.

12. 5 రెండవ చంద్రగుప్త విక్రమాదిత్యుడు వివాహ సంబంధాల్ని నెలకొల్పి శత్రువుల్ని నిర్మూలించుటయే గాక చక్కటి పాలనా వ్యవస్థను నెలకొల్పి కవులను పోషించాడు.

12. 6 కుమార గుప్తుని కాలము నుండి గుప్త సామ్రాజ్యం క్షీణోన్ముఖమయ్యింది.

12. 7 గుప్త సామ్రాజ్యం అంతరంగిక లోపాల వల్ల విదేశీ దండయాత్రల వల్ల పతనమయ్యింది.

12. 8 హూణుల నాయకులు తోరమాణుడు మిహిరకులుడు పలుమారులు భారతదేశంపై దాడులు జరిపి గుప్త సామ్రాజ్య పతనానికి కారకులయ్యారు.

12. 9 చైనా యాత్రికుడు ఫాహియాన్ రెండవ చంద్రగుప్తుని కాలమునాటి పరిస్థితుల్ని గ్రంథస్థంచేశాడు.

12.10 ఉపసంహారం.

## 12. 2 గుప్తుల చరిత్రకు ఆధారాలు :

గుప్తుల చరిత్ర రచనకు ఆధారాలు రెండు విధాలు : (ఎ) రాత పూర్వక ఆధారాలు (బి) పురావస్తు ఆధారాలు.

### రాత పూర్వక ఆధారాలు :

1. పురాణాలు : వాయు, విష్ణు, మత్స్య పురాణాలు.
2. విశాఖదత్తుని దేవీచంద్ర గుప్తం, ముద్రారాక్షసం.
3. కామందకుని నీతిసారం, ధర్మశాస్త్రాలు
4. విజ్జిక విరచితమగు కౌముదీమహోత్సవం.
5. బౌద్ధ మత గ్రంథం మంజు శ్రీమూలకల్ప.

6. కాళిదాసురచనలు - అభిజ్ఞాన శాకుంతలం, రఘువంశం మె.

7. వరాహమిహిరుని బృహత్సంహితం, అమరసింహుని అమరకోశం.

8. చైనా యాత్రికుడు ఫాహియాన్ రచనలు.

9. బాణుని హర్ష చరిత్ర - రాత పూర్వక ఆధారాల వలన నాటి కాల పరిస్థితులు తెలుస్తాయి.

## 12.2. పురావస్తు ఆధారాలు

1. శాసనాలు : సముద్ర గుప్తుని అలహాబాద్, ఇరాన్ శాసనాలు ; రెండవ చంద్రగుప్తుని మెహరౌలి, మధుర, ఉదయగిరి, సాంచి శాసనాలు, కుమార గుప్తుని బిల్సాద్, మధుర, ఉదయగిరి శాసనాలు, స్కందగుప్తుని భిటారి, జునాగడ్ శాసనాలు మొదలైనవి. ఈ శాసనాల వల్ల గుప్త ప్రభువుల వంశ వృక్షం, వారి సైనిక విజయాలు, పరిపాలనా కాలాలు, రాజ్యపరిస్థితులు తెలుస్తాయి.

2. నాణాలు : గుప్త ప్రభువులు జారీ చేసిన బంగారు, వెండి, రాగి నాణాల వల్ల వారి గుణగణాలు నాటి రాజకీయ, సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితులు అవగతమవుతాయి.

3. కట్టడాలు, విగ్రహాలు, ముద్రలు : గుప్త యుగంలో నిర్మింప బడిన దేవాలయాలు భూమ, దేవఘర్, తిగ్వ, శివ, విష్ణు, బుద్ధ విగ్రహాలు; ప్రభుత్వాధికారులు వుపయోగించిన ముద్రలు, అజంతా చిత్రాలు మొదలైనవి నాటి వాస్తు, శిల్ప, చిత్ర లేఖనాలను గూర్చి తెలుసుకొనుటకు సాయపడతాయి

## 12. 3 తొలి గుప్త ప్రభువులు

గుప్తుల తొలి వృత్తాంతాన్ని గురించి తెలిసుకొనుటకు స్పష్టమైన ఆధారాలు లేవు. సముద్రగుప్తుని అలహాబాదు శాసనమును బట్టి శ్రీగుప్తుడు గుప్త వంశ మూలపురుషుడని తెలుస్తాయి. అతని కుమారుడు ఘటోత్కచగుప్తుడు. వారు మగధ పరిసర భూభాగాలను పాలించిరి. మహారాజులుగ ఉదహరింపబడుట వలన వారు సామంత పాలకులని తెలుస్తుంది. ఘటోత్కచుని కుమారుడే స్వతంత్రాధికారమును నెలకొల్పిన మొదటి చంద్రగుప్తుడు.

### మొదటి చంద్రగుప్తుడు (క్రీ.శ. 320 - 335)

గుప్త వంశంలో మొట్టమొదటి స్వతంత్ర ప్రభువు మొదటి చంద్రగుప్తుడు. ఇతడు మహారాజాధిరాజు అను బిరుదు వహించినాడు తన హోదాను, అధికారమును పెంపొందించుకొనుటకు చంద్రగుప్తుడు లిచ్ఛవీయుల ఆడపడుచు కుమారదేవిని వివాహమాడి వారి సాయంత తన అధికారాన్ని అయోధ్య, ప్రయాగ, దక్షిణ బీహారుల వరకు విస్తరింపజేశాడు. తుదుపరి ఉత్తర బీహారు గూడా అతని రాజ్యంలో అంతర్భాగమయింది. ఈ విజయాలతో అతడు చక్రవర్తి బిరుదు ధరించి, తన భార్య కుమార దేవీల ప్రతిమలతో బంగారు నాణాలు విడుదల చేయించాడు. చంద్రగుప్తుడు పట్టాభిషిక్తుడయిన క్రీ.శ. 320 వ సంవత్సరం గుప్త శకారంభంగా పరిగణింపబడుతుంది. అతడు క్రీ.శ. 335 లో మరణించాడు.

రాజ్యవిస్తీర్ణం : మొదటి చంద్రగుప్తుని రాజ్యంలో మగధ, బీహారు, అయోధ్య, ప్రయాగవరకు గల భూభాగము చేరి యున్నది.

## 12.4 సముద్రగుప్తుడు (క్రీ.శ. 335 - 380)

ప్రాచీన భారతదేశ చరిత్రలో పేరెన్నిక గన్న కొద్దిమంది చక్రవర్తులలో సముద్రగుప్తుడొకడు. ఇతడు మిక్కిలి పరాక్రమవంతుడు యుద్ధతంత్రంలో ఆరితేరినవాడు. పరాజయమెరుగని వీరుడు సైనిక విజయాలలో ఇతడు ప్రాచీన భారతచరిత్రలో సాటిలేనివాడు పరిపాలనాదక్షుడు. అనేక రాజ్యాలను స్వల్ప కాలంలో జయించుట వలన వి.ఎ. స్మిత్ ఈతనిని "ఇండియన్ నెపోలియన్"గా వర్ణించాడు కానీ నెపోలియన్ కంటె సముద్రగుప్తుడే ఘనుడు. నెపోలియన్ వలె ఇతడెప్పుడు పరాజితుడు కాలేదు. "సముద్రగుప్తుడు అనే

యుద్ధరంగములందు విజేతయై వెలుగొంది, తన జైత్ర యాత్రల ద్వారా భారతదేశంలోని వివిధ భాగముల పై తన సార్వభౌమాధికారమును నెలకొల్పిన దిట్ట" అని ఆర్.కె. ముఖర్జీ ప్రశంసించాడు.

1. ఆధారాలు : సముద్రగుప్తుని గురించి తెలుసుకొనుటకు గల ఆధారాలేవన : (ఎ) హరిసేనుడు సంస్కృత భాషలో అలహాబాదులోని అశోక శిలా స్తంభంపై కావ్యశైలిలో వ్రాసిన ప్రశస్తి (బి) ఇరాన్ శిలా శాసనము (సి) అతని నాణాలు

2. సింహాసనము నధిష్టించుట : సముద్ర గుప్తుడు మొదటి చంద్రగుప్త, కుమార దేవీదంపతుల కుమారుడు. అతని సద్గుణములకు సంతసించిన చంద్రగుప్తుడు సలహాదారులను, కుటుంబ సభ్యులను సంప్రదించి సముద్ర గుప్తుని తన వారసునిగా ప్రకటించాడు. కానీ ఆ నియామకాన్ని 'కచుడను' మరొక రాకుమారుడు ప్రతిఘటించాడు. కావున చంద్రగుప్తుని మరణానంతరం కచ, సముద్ర గుప్తుల మధ్య వారసత్వ యుద్ధం చెలరేగగా అందులో సముద్రగుప్తుడు విజయుడై క్రీ.శ. 335లో సింహాసనం నధిష్టించినాడని కొందరి చరిత్ర కారుల అభిప్రాయం. కానీ కచుడను రాకుమారుడు లేడనియు అది సముద్ర గుప్తుని నామాంతరమనియు మరికొందరి వాదన.

3. సముద్రగుప్తుని దండయాత్రలు : సముద్రగుప్తుడు సామ్రాజ్య వాది. భారతదేశం నంతటిని జయించి సామ్రాట్టు కావలెననునదే అతని ఆశయం. ఈ ఆశయ సిద్ధికొరకే అతడు అనేక దిగ్విజయ యాత్రలు చేపట్టినాడు. సముద్రగుప్తుని విజయ పరంపర అతని మంత్రియైన హరిసేనునిచే కూర్చబడిన అలహాబాదు ప్రశస్తిలో వర్ణితమయింది. అతడు సాధించిన సైనిక విజయాలను నాలుగు భాగములుగా విభజింప వచ్చును. అవి : 1. మొదటి ఆర్యావర్త దండయాత్ర 2. దక్షిణదేశ దిగ్విజయయాత్ర 3. రెండవ ఆర్యావర్త దండయాత్ర 4. ఆటవిక రాజ్యాల దండయాత్ర

4. మొదటి ఆర్యావర్త దండయాత్ర : మొట్టమొదట సముద్రగుప్తుడు ఆర్యావర్తనందలి నాగరాజ్యాలపై దండెత్తాడు. అహిచ్ఛత్ర పురాన్నేలు అచ్చుతనాగుని, మధురరాజు నాగసేనుని, పద్మావతి ప్రభువు గణపతినాగుని జయించి వారి రాజ్యాల నాక్రమించాడు. పిమ్మట కోటరాజును గూడా ఓడించి ఆర్యావర్తమున తన అధికారాన్ని సుస్థిరం గావించుకొన్నాడు.

దక్షిణదేశ దిగ్విజయ యాత్ర : తదుపరి సముద్రగుప్తుడు దక్షిణ దేశ దిగ్విజయయాత్రకు పూనుకొన్నాడు. ఇది అతని దండయాత్రలల్ అత్యంత విశిష్టమైనది. అలహాబాదు ప్రశస్తి అతని సైనిక విజయాలను వివరంగా వర్ణిస్తుంది. సముద్రగుప్తునిచే ఓడింపబడిన 12 మంది రాజులు వారి రాజ్యాలు దిగువసూచింపబడిట్లుగా వున్నాయి.

| రాజు | అతని రాజ్యము | నేటి ప్రదేశము |
|---|---|---|
| మహేంద్ర | కోసల | మధ్యాప్రదేశ్ లోని తూర్పు, దక్షిణ భాగములు |
| వ్యాఘ్రరాజు | మహాకాంతార | గొండ్వనం |
| మంతరాజు | కురల | మహారాష్ట్రంలోని చాందాజిల్లా |
| మహేంద్ర | పిష్టిపుర | తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురం |
| స్వామిదత్త | కొట్టూర | విశాఖపట్నంజిల్లాలోని కొండప్రాంతం |
| దమన | ఇరాండపల్ల | శ్రీకాకులం జిల్లాలోని ఆముదాలవలస ప్రాంతం |
| విష్ణుగోప | కాంచి | తమిళనాడు రాష్ట్రంలోని కాంచి |
| నీలరాజు | అవముక్త | వేంగీ పరిసరములలో గోదావరీ తీర ప్రదేశం |
| హస్తివర్మ | వేంగి | పశ్చిమ గోదావరి జిల్లా |
| ఉగ్రసేన | పాలక | నెల్లూరుజిల్లాలోని పులికాట్ |
| కుబేర | దేవరాష్ట్ర | విశాఖపట్నం జిల్లాలోని ఎలమంచిలి ప్రాంతం |
| ధనంజయ | కుశస్థలపుర | తమిళనాడులోని ఉత్తర ఆర్కాటు ప్రాంతం |

దండయాత్రా మార్గం : కొందరు చరిత్రకారులు (జె.యఫ్. ఫ్లీట్ మొ.) పై శాసనంలోని దేవరాష్ట్రను మహారాష్ట్రతోను, ఇరాండపల్లను ఖాందేష్‌లోని ఇరాంతోను గుర్తించి సముద్రగుప్తుడు దక్షిణ దేశమునకు వెళ్లునప్పుడు తూర్పుతీరమార్గమును తిరిగి వచ్చునప్పుడు పశ్చిమ తీరమార్గమును అనుసరించినట్లు అభిప్రాయపడినారు. కానీ ఆ అభిప్రాయం సహేతుకంగా లేదు. ఎందువలననగా ఆ ప్రదేశాలు పశ్చిమతీర ప్రాంతాలకంటె తూర్పుతీర ప్రదేశములతోనే సక్రమంగా సరిపోవుచున్నవి. అదియునుగాక నాడు వింధ్యపర్వత ప్రాంతమున వాకాటకులు శక్తిమంతులైనారు. సముద్రగుప్తుడు తూర్పుతీరాన పురోగమించి మరల తూర్పు తీరముననే తిరోగమించాడు.

పరాజిత ప్రభువుల యెడల అతని విధానము : దక్షిణ దేశ దిగ్విజయయాత్రలో అతడు అనుసరించిన విధానంతో గ్రహణ (ఓడించి బంధించుట) మోక్ష (విడుదల చేయుట) అనుగ్రహ (మరల సింహాసనమున ప్రతిష్ఠించుట) అనునవి ప్రధనాంశాలు. ప్రయాణ సౌకర్యాలు సరిగా లేని ఆ రోజులలో విశాలసామ్రాజ్యాన్ని నేరుగా పరిపాలించుట కష్టసాధ్యమని అతడు గ్రహించాడు. సముద్రగుప్తుడు విజేతయేగాక రాజనీతిజ్ఞుడు. ఈ సందర్భమున అతడు వివేకమును ప్రదర్శించి తానుజయించిన దక్షిణ రాజ్యాలను తన సామ్రాజ్యమున చేర్చక ఆయారాజులనుండి కప్పం మాత్రమే వసూలు చేసి తన సార్వభౌమత్వాన్ని నెలకొల్పాడు.

6. రెండవ ఆర్యావర్త దండయాత్ర : సముద్రగుప్తుడు దక్షిణ దిగ్విజయ యాత్ర నిర్వహించే సమయమున ఉత్తర భారతములోని తొమ్మిదిమంది రాజులు (మటిల, నాగదత్తుడు, చంద్రవర్మ, గణపతినాగుడు, నాగసేనుడు, అచ్యుతనాగుడు, నంది, బాలవర్మ) రుద్రదేవుని నాయకత్వాన ఏకమై గుప్త సామ్రాజ్యాన్ని నిర్మూలించుటకు సమకట్టిరి. రుద్రదేవుడు వాకాటక రుద్రసేనుడని కొందరు చరిత్ర కారుల అభిప్రాయం. కౌశాంబి సమీపమున, జరిగిన యుద్ధంలో సముద్రగుప్తుడు వారినోడించి, రుద్రదేవుని వధించి ఆర్యావర్తమున తన ఆధిపత్యాన్ని పదిల పరచుకొన్నాడు.

7. ఆటవిక రాజ్యాలు : పిమ్మట ఉత్తర దక్షిణభారతములకు మధ్యనున్న 18 అరణ్యరాజ్యాలనోడించి ఆక్రమించి సముద్రగుప్తుడు తన మార్గాన్ని నిష్కంటకము చేసుకొన్నాడు. ఈ ప్రదేశం నేటి ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్ జిల్లా, మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌ల మధ్య ఉన్నది.

8. సరిహద్దు రాజ్యాలు : సముద్రగుప్తుని విజయమును గాంచి భీతిల్లి కొందరు సరిహద్దురాజ్యాల ప్రభువులు అతని సామంతులయినారు. వారు (1) సమతత (తామ్రలిప్తికి తూర్పున వున్న ప్రదేశం) (2) దావక (అస్సాంలోని దబోక్) (3) కామరూప (అస్సాంలోని గోహతి ప్రాంతం) (4) నేపాల్ (5) కర్త్రిపుర (హిమాలయములను ఆనుకొనివున్న రోహిల్ ఖండ్ ప్రాంతం).

9. గణతంత్ర రాజ్యాలు : అదేవిధంగా అర్జునాయనులు (భరత్‌పూర్, ఆల్వార్ ప్రాంతం) యౌధేయులు (తూర్పుపంజాబు) మద్రకులు (రావి, చీనాబ్ నదులు మధ్యప్రదేశము) మాళవులు (మాళ్వ) అభీరులు (పశ్చిమ రాజస్థాన్) ప్రార్జునులు (మధ్యప్రదేశ్‌లోని నర్సిపూర్ జిల్లా) సనకనికులు (తూర్పు మాళ్వ) కాకలు (సాంచిప్రదేశం) ఖర్పరికుట (మధ్యభారతము) మున్నగు గణరాజ్యముల వారు గూడ సముద్రగుప్తుని సార్వభౌమత్వము నంగీకరించాడు.

10. విదేశీ రాజ్యాలు : సముద్రగుప్తుని విజయాలు, పేరుప్రఖ్యాతులు విన్న విదేశీరాజ్యాధిపతులు అతనితో స్నేహసంబంధాలు నెలకొల్పుకున్నారు. అట్టివారిలో కాబూల్ లోయనేలు కుషాను ప్రభువు (దైవపుత్ర షాహి షాహానుషాదిం) పశ్చిమ ఇండియానేలు శకరాజులు, సింహళరాజు మేఘవర్ణుడు, జావా, సుమత్రాప్రభువులు ముఖ్యులు. సింహళప్రభువు మేఘవర్ణుడు సముద్రగుప్తుని వద్దకు కానుకలతో సహారాయబారిని పంపి అతని అనుమతితో సింహళదేశ యాత్రికుల సౌకర్యార్థం బుద్ధగయలో ఒక విహారాన్ని నిర్మించాడు.

తాను సాధించిన విజయ సూచకంగా సముద్రగుప్తుడు అశ్వమేధ యాగం చేశాడు. ప్రాచీనకాలంలో అశ్వమేధయాగం సార్వభౌమాధికార స్థాపనకు చిహ్నంగా ఉండేది. ఈసందర్భంగా అతడు యాగాశ్వప్రతిమతో బంగారు నాణాలు ముద్రించాడు.

సామ్రాజ్య విస్తీర్ణం : ఈ విజయాలతో సముద్రగుప్తుని సామ్రాజ్యం ఉత్తరాన హిమాలయ పర్వతాలనుండి దక్షిణాన నర్మదానది వరకు పడమర తూర్పుపంజాబు, చంబల్ నదీలోయల నుండి తూర్పున బ్రహ్మపుత్ర వరకు విస్తరించింది.

సముద్రగుప్తుని ఘనత : చరిత్రకారుడు వి.ఎ. స్మిత్ అన్నట్లు సముద్రగుప్తుడు గొప్ప యోధుడు, మహామేధని, సమర్థుడైన పాలకుడు. అతని దిగ్వి[illegible]యాలు [illegible] నెపోలియన్‌కన్నా మిన్నయని చాటుచున్నాయి. పరాజితులైన ప్రభువులతో అతడు సత్సంబంధాలు

సెలకొల్పిన తీరు అతని దూరదృష్టికి, రాజనీతిజ్ఞతకు నిదర్శనం విదేశీరాజుల యెడల అతని వైఖరి అతని స్నేహశీలతను చాటుతుంది. అతడు పండితుడు, కవి "కవిరాజ" బిరుదాంకితుడు. సముద్రగుప్తుడు సంగీత విద్వాంసుడు. వీణ వాయించుచున్నట్లున్న అతని ప్రతిమగల నాణెము అతని సంగీతాభిమానానికి తార్కాణం. అతడు ప్రాజ్ఞుడైన ప్రభువు. తాను ప్రగాఢ వైష్ణవ మతాభిమాని యైనను పరమత సహనాన్ని పాటించిన విశాల హృదయుడు. సుప్రసిద్ధ బౌద్ధమత పండితుడు వసుబంధుని అతడు ఆదరించాడు. బుద్ధగయలో బౌద్ధవిహారము నిర్మించుటకు సింహళప్రభువును అనుమతించినాడు. ఇవి అతని పరమత సహనానికి నిదర్శనాలు. బి.జి. గోఖలే అభిప్రాయ పడినట్లు "ప్రాచీన భారతదేశ చరిత్రలో ఒక నూతన యుగకర్తగా సముద్రగుప్తుని పేరు సుస్థిరం".

ఈ విషయంలో మరికొంత సమాచారం లభించునంతవరకు రామగుప్తుని చారిత్రకతను నిర్ధారించి చెప్పుట తొందరపాటు చర్యకాగలదు.

## 12. 5 రెండవ చంద్రగుప్తుడు (క్రీ.శ. 380 - 414) :

రెండవ చంద్రగుప్త విక్రమాదిత్యుడు దత్తాదేవి సముద్ర గుప్తుల కుమారుడు. ఇతడు తండ్రికి తగ్గ తనయుడు. గుప్త చక్రవర్తులలోనే గాక భారతదేశమును ఏలిన ప్రముఖ చక్రవర్తులలో యితడొకడు. ఈతని పాలనా కాలం వివిధ రంగాలలో గణణీయమయిన అభ్యున్నతిని సాధించి స్వర్ణయుగముగ ప్రసిద్ధికెక్కింది. చంద్రగుప్తుని పరిపాలనా పాటవం పలువురి చరిత్రకారుల ప్రశంసలను అందుకొంది "బహుశ భారతదేశం చంద్రగుప్త విక్రమాదిత్యుని కాలమున పాలింపబడినట్లు మరెప్పుడును పరిపాలింపబడలేదని" వి.ఎ. స్మిత్ ప్రశంసించారు.

1. ఆధారాలు : (1) మెహరౌలి ఉక్కుస్తంభశాసనం, మధుర, సాంచీలలో వున్న శిలాశాసనాలు (2) అతని నాణాలు (3) విశాఖ దత్తుని దేవీచంద్రగుప్తనాటకం (4) చైనా యాత్రికుడు ఫాహియాన్ రచనలు.

రెండవ చంద్రగుప్తుడు తన అధికార సుస్థిరతకు, విస్తరణకు అనుసరించిన మార్గాలు రెండు విధాలు : (1) వివాహసంబంధాలు (2) యుద్ధాలు.

2. వివాహసంబంధాలు : మగధరాజ గుహర్యంక వంశ బింబిసారునివలె చంద్రగుప్త విక్రమాదిత్యుడు గూడా వివాహసంబంధాల ద్వారా తన అధికారాన్ని సుస్థిరం చేసుకొన్నాడు. (ఎ) అతడు నాగుల రాకుమారి కుబేరనాగను వివాహమాడుట వలన నాగజాతీయులతో సన్నిహిత సంబంధాలు ఏర్పడినాయి. (బి) వాకాటక రాజగు రెండవ రుద్రసేనునికి తనకుమార్తె ప్రభావతి గుప్తనిచ్చి పెండ్లిచేశాడు. ఈ వివాహం వలన చంద్రగుప్తుడు శకులను విజయవంతంగా నిర్మూలించగలిగాడు. (సి) తన కుమారుడగు కుమారగుప్తునికి కదంబ వంశీయుడైన కకుత్స వర్మ కుమార్తెతో పెండ్లి జరిపించి గుప్తసామ్రాజ్యాన్ని మరింత సుస్థిరం చేశాడు.

3 యుద్ధాలు : (ఎ) ఆనాడు మాళవ, సౌరాష్ట్ర ప్రాంతాలు శకక్షాత్రవుల అధీనమందున్నాయి. చంద్రగుప్త విక్రమాదిత్యుడు వారిపై దాడిచేసి ఆరుసంవత్సరాల దీర్ఘకాలిక పోరాటానంతరం శకరాజు మూడవ రుద్రసేనుని సంహరించి మాళ్వ, సౌరాష్ట్ర, గుజరాతులను ఆక్రమించాడు. ఈ విజయమునకు చిహ్నముగా అతడు 'శకారి' 'సాహసాంక' 'విక్రమాదిత్య' అను బిరుదులు ధరించాడు. ఈ విజయంవలన గుప్తసామ్రాజ్యానికి రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు కలిగాయి. సౌరాష్ట్ర విజయంతో గుప్తసామ్రాజ్య సరిహద్దు అరేబియా సముద్రతీరాన్ని తాకింది. పాశ్చాత్యవర్తకులతో నేరుగా వ్యాపార సంబంధాలు ఏర్పడినాయి. సారవంతమైన ప్రాంతాలు గుప్తుల పాలనలోకి వచ్చాయి. శకుల పాలనను శాశ్వతంగా అంతం చేయుట వలన గుప్తసామ్రాజ్య కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడించాయి. ఉజ్జయిని రాజధాని అయినది.

(బి) తదుపరి చంద్రగుప్తుని మెహరౌలి ఉక్కుస్తంభశాసనం పేర్కొన్నట్లు బాహ్లిక (బాల్క్) వంగదేశము (బెంగాల్) లను జయించాడు. కానీ ఈశాసనంలో పేర్కొనబడిన 'చంద్రుడ'ను రాజు రెండవచంద్రగుప్తుడు కాడని కొందరి చరిత్రకారుల వాదన.

3. సామ్రాజ్య విస్తీర్ణం : ఈ విజయములతో చంద్రగుప్త విక్రమాదిత్యుని కాలంనాటి గుప్తసామ్రాజ్యం ఉత్తరమున హిమాలయాలను దక్షిణాన నర్మదానదివరకు, పశ్చిమాన గుజరాత్ నుండి తూర్పున బెంగాల్ వరకు విస్తరించింది.

**4. పరిపాలన :** భారతదేశము చంద్రగుప్త విక్రమాదిత్యుని ఏలుబడిలో ముందెన్నడులేనంత సమర్ధవంతంగా పరిపాలింపబడింది. అతని పాలనా దక్షతకు నాడునెలకొన్న సుఖశాంతులే ప్రబల తార్కాణాలు. నాటి ప్రజల శాంతి యుత సహజీవనాన్ని గూర్చియు, ఆర్థికాభ్యుదయాన్ని గూర్చియు, ఉదారపాలనను గూర్చియు చైనాయాత్రికుడు ఫాహియాన్ వ్రాశాడు.

**5. సాహిత్యకపోషణ :** చంద్రగుప్తుని పాలనాకాలం గుప్తయుగంలో సంస్కృత భాషావికాసానికి సువర్ణాధ్యాయం. ఈతని ఆస్థానంలో "నవరత్నాల"ని ప్రసిద్ధిచెందిన కవులున్నట్లు ప్రతీతి. వారిలో అగ్రగణ్యుడు కాళిదాసు. ఈతని అభిజ్ఞాన శాకుంతలం, మాళవికాగ్ని మిత్రం, విక్రమోర్వశీయం అనునాటకాలు, మేఘసందేశం, రఘువంశం, కుమారసంభవం, అనుకావ్యాలు జగత్ప్రసిద్ధాలు. అభిజ్ఞానశాకుంతలం ప్రపంచంలోని వంద ఉత్తమగ్రంధాలలో ఒకటిగా కొనియాడబడుచున్నది. విశాఖదత్తుడు, శూద్రకుడు, అమరసింహుడు, విష్ణుశర్మ, వరాహమిహిరుడు, దన్వంతరి మున్నగువారు చంద్రగుప్తుని ఆస్థానం నలంకరించినట్లు చెప్పబడుచున్న యితర కవులు, పండితులు శాస్త్రకారులు.

**6 పరమత సహనం :** చంద్రగుప్తుడు తండ్రివలె వైష్ణవ మతాభిమాని. 'పరమ భట్టారక' 'పరమభాగవత' అను అతని బిరుదులు అతని వైష్ణవమతాభిమానాన్ని సూచిస్తాయి. అయినను పరమత సహనాన్ని పాటించిన విశాల హృదయుడు. భౌద్ధమతస్థుడగు ఆమరకరదేవుడు అతని సేనాని, శైవమతాభి మానియగు వీరసేనుడు అతని మంత్రి. ప్రధాన పదవులు పరమతస్తులకు యిచ్చిన తీరు అతని ఉదార మతవిధానానికి తార్కాణం.

**7. ఫాహియాన్ రాక :** ఫాహియాన్ రెండవ చంద్రగుప్తుని కాలమున గుప్తసామ్రాజ్యంలో పర్యటించిన చైనా యాంత్రికుడు. ఇతడు తన రచనలలో నాటి ఉదారపాలన, ఆర్థికాభ్యుదయం. ప్రజల ప్రశాంత సుఖజీవనం, వారిధర్మపరత్వం, వివిధ మతాను యాయుల మధ్య నెలకొన్న సామరస్య పూరిత వాతావరణం మొదలగు అంశాలను పేర్కొన్నాడు.

**8. ఘనత :** చంద్రగుప్త విక్రమాదిత్యుడు తన తండ్రి విధానమును అనుసరించి శకులపాలనను అంతముచేసి ఉత్తర భారతమున రాజకీయ ఐక్యత సాధించాడు. ప్రజాక్షేమం దృష్టిలో వుంచుకొని రాజ్యపాలన చేశాడు. సుఖశాంతులు నెలకొనుటచే ప్రజలు సాంస్కృతిక రంగమున పురోగమించారు. అతడు భాషాపోషకుడు. అతని ఆస్థానమున "నవరత్నముల" ని పేరొందిన సంస్కృతకవులు వుండేవారు. తాను హిందూ మతస్థుడైనను, బౌద్ధ,జైనమతస్థులను ఆదరించిన సహనశీలి, ఉదారహృదయుడు, రాజనీతిజ్ఞుడు. అతని ధైర్యసాహసాలు, ఘనవిజయాలు, ఔదార్యం, సత్పరిపాలన మున్నగువన్నియు ప్రజాహృదయాల యందు "విక్రమార్కుని"గా స్థిరపరచినాయి. "రెండవ చంద్రగుప్తుడు రాజకీయ ఔన్నత్యం, సాంస్కృతిక పునరుజ్జీవనములకు ప్రతీకగా నిలిచి ప్రజాహృదయాల యందు శాశ్వతస్థానం సంపాదించాడు" అని ఆర్. సి. మజుందార్ వ్రాశారు.

## 12. 6 కుమారగుప్తుడు (క్రీ.శ. 415 - 455)

రెండవ చంద్రగుప్తుని అనంతరం అతని కుమారుడు కుమారగుప్తుడు సింహాసనమునకు వచ్చినాడు. ఇతనికి 'మహేంద్రాదిత్య అను బిరుదుకలదు. ఇతడు తండ్రి అంతటి సమర్థుడు కాక పోయినను రాజ్యక్షీణతను అరికట్టి నలుబది సంవత్సరాలు పాలించాడు. అతని చివరి రోజులలో నర్మదానది లోయ ప్రాంతపు పుష్యమిత్ర తెగవారు గుప్తసామ్రాజ్యంపై దాడి చేయగా యువరాజు స్కందగుప్తుడు ఆ దాడిని త్రిప్పికొట్టి శాంతిని నెలకొల్పాడు. ఈ విజయచిహ్నంగా కుమారగుప్తుడు అశ్వమేధయాగం చేశాడు. ఇతడు శైవమతాభిమాని యైనను పరమత సహనము పాటించి బౌద్ధమతమును ఆదరించాడు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన నలందా విశ్వవిద్యాలయ నిర్మాత కుమారగుప్తుడేనని చరిత్రకారుల అభిప్రాయం.

**1. స్కందగుప్తుడు (క్రీ.శ. 455 - 467) :** తండ్రికాలంలో పుష్యమిత్రుల తిరుగుబాటు నణచుటలో ప్రముఖపాత్ర వహించిన స్కందగుప్తుడు తండ్రి తరువాత క్రీ.శ. 455 లో గుప్త సింహాసనము అధిష్టించాడు. ఈతని కాలంలో క్రూరులగు హూణులు పలుమారులు గుప్తసామ్రాజ్యముపై దాడులు జరిపారు. వారి దాడులవలన గుప్తుల అధికారం క్షీణించింది. శాంతి భద్రతలు కరువైనాయి. ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమయింది. స్కందగుప్తుడు గుజరాతులో మౌర్యుల కాలంనాటి సుదర్శన తటాకమునకు మరమ్మత్తులు చేయించి [illegible]గ్రామములకు నీటి సౌకర్యము కల్పించినాడు. ఇతడు వైష్ణవ మతాభిమాని.

**2. స్కందగుప్తుని వారసులు :** స్కందగుప్తుని అనంతరం పురుగుప్తుడు, నరసింహగుప్తుడు, కుమారగుప్తుడు మున్నగువారు రాజ్యపాలన చేశారు. విష్ణుగుప్తుడు ఈ వంశంలో చివరివాడు. వీరి అసమర్థత వలన గుప్తసామ్రాజ్యం క్రమక్రమంగా తుదకు క్రీ.శ. 550 ప్రాంతమున అంతరించింది.

## 12. 7 గుప్త సామ్రాజ్య పతనం - కారణాలు

గుప్త చక్రవర్తులు నూటయాభై సంవత్సరాలపాటు (క్రీ.శ. 320 - 470) ఉత్తర హిందూ దేశానికి రాజకీయ ఐక్యతను శాంతి సుస్థిరతలను ప్రసాదించి సర్వతోముఖాభివృద్ధిని సాధించారు. రెండవ చంద్రగుప్తుని కాలంవరకు విస్తరించిన రాజ్యం కుమారగుప్తుని కాలమున అలజడులకులోనై స్కందగుప్తుని కాలమున విదేశీదండ యాత్రలకు గురియై క్రమంగా క్షీణించింది. తుదకు క్రీ.శ. 6వ శతాబ్దం మధ్య కాలానికి విచ్ఛిన్నమయింది. గుప్తసామ్రాజ్య పతనానికి అనేక ఆంతరంగిక, బాహ్యాకారణాలు కలవు.

1. స్కందగుప్తుని వారసుల బలహీనత : సాధారణంగా రాజరిక విధానంలో పాలనాపటిష్టత రాజు సమర్థతపై ఆధారపడి వుంటుంది. కాని ఒక వంశమునకు చెందిన రాజులందరు సమర్థులయిన వారనుటకు వీలులేదు. బలహీనులైన చక్రవర్తులు విశాల సామ్రాజ్యాలను సంరక్షింపజాలరు. స్కందగుప్తుని తరువాత చక్రవర్తులందరు అసమర్థులు. వారు ఆంతరంగిక తిరుగుబాటుల నుండి విదేశీదాడుల నుండి సామ్రాజ్యాన్ని కాపాడి విచ్ఛిన్నతను అరికట్టలేకపోయారు.

2. వారసత్వకలహాలు : గుప్తవంశమున ఒకనియమిత వారసత్వ విధానం లేదు. సాధారణంగా జ్యేష్ఠపుత్రులు సింహాసనానికి వచ్చుట పరిపాటి. కాని కొన్ని సందర్భాలలో తమ పుత్రులలో ఒకరిని తనవారసునిగా ప్రకటించుట కద్దు. ఉదాహరణకు మొదటి చంద్రగుప్తుడు సముద్రగుప్తుని, సముద్రగుప్తుడు రెండవ చంద్రగుప్తుని తమవారసులుగా ప్రకటించారు. ఈ విధానం వారసత్వ కలహాలకు దారితీసింది. ఈ అంతః కలహాలు గుప్తసామ్రాజ్యాన్ని బలహీనపరిచాయి.

3. తిరుగుబాటులు : స్కందగుప్తుని మరణానంతరం సామ్రాజ్యమంతట అరాచకం చెలరేగింది. విదేశీయుల దండయాత్రల వలన, అంతరంగిక తిరుగుబాటులవలన రాష్ట్రాలపై కేంద్రప్రభుత్వపు అదుపు తప్పిపోయింది. వల్లభినేలు మైత్రకులు, గంగాతీరమునందలి మౌఖరీసు మాళవాధీశుడగు యశోధర్ముడు, బెంగాలునందు గౌడులు స్వాతంత్ర్యం ప్రకటించారు. తత్ఫలితంగా గుప్త సామ్రాజ్యం క్షీణించింది.

4. పాలనా యంత్రాంగములోని లోపాలు : పాలనా యంత్రాంగంలోని లోపాలు గూడా గుప్తసామ్రాజ్యాన్ని బలహీనపరిచాయి. కేంద్రమున అధికారమంతా చక్రవర్తి చేతుల్లో కేంద్రీకృతమై వుండగా, రాష్ట్రపాలనలో అధికారం వికేంద్రీకృతమై వుండెను. ఈ విధానం సఫలమగుటకు సమర్థుడయిన ప్రభువు శక్తివంతమైన సైన్యం అవసరమై యుండెను. చివరి గుప్త ప్రభువులు అసమర్థులు. విదేశీయుల దండయాత్రల వలన గుప్తసైన్యము బలహీనమై రాష్ట్రాలు స్వతంత్రములగుటచే గుప్త సామ్రాజ్యం పతనమయ్యింది.

5. సరిహద్దులలో రక్షణ దుర్భలమగుట : గుప్త చక్రవర్తులు సరిహద్దుల సంరక్షణయందు సరియైన శ్రద్ధ వహించలేదు. ముఖ్యంగా వాయవ్య సరిహద్దులో తగిన కాపుదల లేకుండుటచే విదేశీదండయాత్రలు విచ్చలవిడిగా కొనసాగాయి.

6. ఇతర కారణాలు : చివరి దశలో ఏర్పడిన ఆర్థిక దుస్థితి, సైనిక బలహీనత, బౌద్ధమత ప్రభావం, చివరి గుప్తప్రభువుల అహింసా విధానం మున్నగునవి గుప్తసామ్రాజ్య పతనానికి దారితీసిన యితర ఆంతరంగిక కారణాలు.

### (బి) బాహ్య కారణాలు :

7. హూణుల దండయాత్రలు : హూణులు మధ్య ఆసియాకు చెందిన అనాగరిక జాతీయులు పరమక్రూరులు. వీరు కాబూల్ లోయలోని కుషాన్ రాజ్యాన్ని కూలద్రోసి తోరమానుని నాయకత్వాన భారతదేశంపై దండెత్తివచ్చి క్రీ.శ. 466లో గుప్త సామ్రాజ్యంలోని పశ్చిమ రాష్ట్రాలను దోచుకున్నారు. స్కందగుప్తుడు అతికష్టంమీద వీరి దాడులను అరికట్టగలిగాడు. కానీ క్రమంగా తోరమానుడు మాళవ ప్రాంతం వరకుగల గుప్తసామ్రాజ్యభాగాలను ఆక్రమించాడు. పిమ్మట అతని కుమారుడు మిహిరకులుడు దండ యాత్రలు సాగించాడు. ఈ హూణ దండయాత్రల వలన గుప్త సామ్రాజ్య ఆర్థికస్థితి అస్తవ్యస్తమయింది. సైన్యము దుర్బలమయింది.

8. వాకాటకుల, పుష్యమిత్రులు దాడులు : గుప్తసామ్రాజ్యమునకు పొరుగు వారగు వాకాటకులు, పుష్యమిత్ర తెగవారు గుప్తసామ్రాజ్యంపై దండెత్తి దానిని బలహీన పరచినారు. వాకాటకులు గుప్తసామ్రాజ్య నైరుతీ ప్రాంతములను ఆక్రమించారు.

ఈ విధంగా వివిధ కారణాల వలన గుప్తసామ్రాజ్యం క్షీణించి కాలక్రమాన అదృశ్యమయింది.

## 12. 8 హూణులు

హూణులు అనాగరికులు, పరమక్రూరులు. తొలుత వీరు చైనాపరిసరములలో నివసించేవారు. జనాభా పెరుగుటవల, నిస్సారమైన భూములు, చైనా రాజ్యాధికారవిస్తరణ మున్నగు కారణాల వలన వారు అచ్చటినుండి ఆసియాలోని యితర ప్రాంతాలకు తరలివెళ్ళారు. చివరిలో ఒక శాఖవారు ఐరోపా పై విరుచుకుపడి వైభవోపేతమైన రోము సామ్రాజ్యాన్ని నాశనం చేశారు. మరొక శాఖ కాబూల్ లోయలోని కుషాను రాజ్యాన్ని కూలద్రోసి వాయవ్య మార్గం గుండా భారతదేశం ప్రవేశించినారు.

1. తోరమానుడు : సరియైన రక్షణలేని వాయవ్య ప్రాంతం గుండా హూణులు తోరమానుని నాయకత్వాన క్రీ.శ. 466 లో భారతదేశంలో ప్రవేశించి గుప్త సామ్రాజ్యంలోని పశ్చిమ రాష్ట్రాలను దోచుకున్నారు. స్కందగుప్తుడు అతికష్టం మీద వీరిదాడులను అరికట్టగలిగినాడు. కానీ క్రమక్రమంగా తోరమానుడు గుప్తసామ్రాజ్య పశ్చిమభాగాలను, మాళ్వను ఆక్రమించాడు.

2. మిహిరకులుడు : తోరమానుని కుమారుడు మిహిరకులుడు పరమ క్రూరుడు. ఇతడు బౌద్ధ స్థూపములను, వ్యవహారములను ధ్వంసం చేసాడు. సాకాల (నేటి సియాల్ కోట) అతని రాజధాని. మిహిరకులుని క్రూరకృత్యములు భరింపజాలక మాండసోర్ పాలకుడగు యశోధర్ముని నాయకత్వాన హిందూరాజులు ఏకమై అతనిని ఓడించి పారద్రోలిరి. తనకాశ్రయమిచ్చిన కాశ్మీరు రాజును వంచించి మిహిరకులుడు కాశ్మీరమునే గాక గాంధారమును గూడా వశపరచుకొన్నాడు. మిహిరకులుని మరణము తరువాత హూణుల ప్రాబల్యం తగ్గిపోయింది.

హూణుల దండయాత్రా ఫలితాలు :

1) హూణుల దండయాత్రల వలన గుప్తసామ్రాజ్యం చిన్నాభిన్నమై కూలిపోయింది. దానితో భారత దేశమున రాజకీయ సమైక్యత, సుఖశాంతులు కరువైనాయి.
2) హూణులు భారతదేశమున స్థిరపడి ముదోపజీవులై కాలక్రమమున రాజపుత్రులని పిలువబడినారు. వీరివలన హిందూ సమాజమున నూతన కులములు బలయులుదేరాయి. హూణుల వలన సంఘంలో నైతిక విలువలు దిగజారిపోయినవని హావెల్ పండితుని అభిప్రాయం.
3) హూణులు కళాఖండాలను, సారస్వత, శాస్త్ర గ్రంధాలను దహించివేసినారు. బౌద్ధస్థూపాలు, విహారాలు ధ్వంసం చేయబడినాయి. బౌద్ధభిక్షువులు వధింపబడినారు. ఈ విధంగా హూణులు ఉత్తర భారతంలో బౌద్ధమతాన్ని క్షీణింపజేశారు.

## 12. 9 ఫాహియాన్

ఫాహియాన్ రెండవ చంద్రగుప్తుని కాలంలో భారతదేశం సందర్శించిన చైనా యాత్రికుడు. బౌద్ధ పుణ్యక్షేత్రాల్ని దర్శించుటకు, బుద్ధుని అవశేషాలను, బౌద్ధమత గ్రంథాలను సేకరించుటకు అతడు భారతదేశం వచ్చినాడు. తక్షశిల, పురుషపురం (పెషావర్) మధుర, కాశి, కనోజ్, పాటలీపుత్రం, కపిలవస్తు, లుంబిని, కుశీనగరం, వైశాలి, శ్రావస్తి, నలంద, గయ మున్నగు పట్టణాలను దర్శిస్తూ అతడు పదిసంవత్సరాలకు పైగా (క్రీ.శ. 400 - 411) ఈ దేశంలో గడిపినాడు. భారతదేశము, అచటి ప్రజలను గురించి అతడు అనేక ఆసక్తికర విషయాలను తన గ్రంథం "ఫో - క్వో - కి" (Fo - Kuo - Ki బౌద్ధరాజ్యాల వృత్తాంతాలు) లో పొందుపరిచినాడు. కానీ తాను సంచరించిన రాజ్య ప్రభువు పేరుమాత్రం అతడు పేర్కొనలేదు.

అతని రాకలోని ప్రధానోద్దేశము మతమయిన్నటికిని అతడు నాటి సామాజిక, పాలనావిశేషాలను వివరించినాడు.

1 పరిపాలనా విశేషాలు : "మధ్యదేశంలో (Middle Kingdom) అనేక సంపన్న నగరాలు అలరారుచున్నాయి. ముఖ్యంగా రాజబాట మీద ఉన్న నగరాలలో విశ్రాంతి గృహాలు, సత్రాలు, వైద్యసదుపాయాలు ఉన్నాయి. యాత్రికులకు అనుమతిపత్రాలు అవసరంలేదు. పరిపాలన ప్రజానురంజకంగా ఉన్నది. కఠినమైన శిక్షలు లేవు. పన్నులభారం తక్కువ, ఉద్యోగులకు ప్రభుత్వం వేతనాలు చెల్లిస్తుంది ప్రభువులు ఉదారస్వభావులు. "

2 సాంఘిక, ఆర్థిక పరిస్థితులు : "ప్రజలు సుఖశాంతులతో, ఐశ్వర్యంతో సౌఖ్యప్రదమైన జీవితాలు గడుపుచున్నారు. ప్రజలు నిజాయితీపరులు, నీతివర్తనులు, అహింసా ధర్మాన్ని పాటించే వారు. ధనసంబంధమైన లావాదేవీలలో పత్రాలు లేవు, దొంగల భయం తక్కువ. బయటకు వెళ్లే సమయాల్లో గూడా ఇళ్ళకు తాళాలు వేసేవారుకాదు. ప్రజలు మద్యమాంసాలు , వెల్లుల్లి సేవించటం అరుదు. అతిథి అభ్యాగతులకు విశేషమైన ఆదరం చూపేవారు. పంచములు మాత్రం గ్రామాలకు దూరంగా వుండేవారు. గ్రామంలో ప్రవేసించునపుడు గంట వాయిస్తూ రావలె."

3. మతపరిస్థితులు : "పంజాబు, బీహారు, బెంగాలులలో మహాయాన బౌద్ధం నెలకొనివున్నది. పంజాబు ప్రాంతంలో 10,000 మంది, మధురలో 3,000 మంది బౌద్ధ భిక్షువులు వున్నారు. కానీ కపిలవస్తు, కుశినగరం, గయ మున్నగు బౌద్ధ క్షేత్రాలు తమ పూర్వపువైభవాన్ని కోల్పోయి నిర్జనంగా వున్నాయి; బౌద్ధమతం క్షీణిస్తున్నది. హిందూ మతం విజృంభిస్తున్నది. ప్రజలలో పరమతద్వేషంలేదు. బౌద్ధులు సోదర భావంతో శాంతియుత సహజీవనం చేస్తున్నారు. "

4. పాటలీపుత్ర వైభవము : ఫాహియాన్ పాటలీపుత్రంలో అశోకుని రాజప్రాసాద వైభవంగాంచి ముగ్ధుడైనాడు. ఆశ్చర్యచకితుడైన ఆ చైనా యాత్రికుడు " ఆ భవనం బహుశ అశోకుడు నియమించిన దేవతా శక్తుల నిర్మితమేమో"యని దాని నిర్మాణకౌశలమును కొనియాడినాడు. "పాటలీపుత్రమున ఒక ప్రజావైద్యశాల కలదు, దాని నిర్వహణకు ప్రభువులు, సంపన్నులు విరివిగా విరాళము నొసగిరి. ఇచటనున్న బౌద్ధారామంలో 700 మంది బౌద్ధ బిక్షువులు వున్నారు. విద్యార్జనకు దూర ప్రాంతాలనుండి అచటకు విద్యార్థుల వచ్చేవారు." ఫాహియాన్ ఇచటనే 3 సంవత్సరాలు బసచేసి సంస్కృతం నేర్చుకున్నాడు.

బౌద్ధమత దృక్పదంతో వ్రాయబడుట, చారిత్రక అవగాహన లోపించుట మున్నగు విమర్శలకు లోనైప్పటికి ఫాహియాన్ రచనల రెండవ చంద్రగుప్తుని కాలము నాటి ఉత్తర భారతదేశ రాజకీయ, సాంఘిక, మత, ఆర్థిక పరిస్థితులను తెలుసుకొనుటకు అత్యంత విలువైన ఆధారాలు.

## 12. 10 ముగింపు

1. మౌర్యసామ్రాజ్య పతనానంతరం ఉత్తర హిందుస్ధానంలో రాజకీయ ఐక్యత నశించి అనేక చిన్న రాజ్యాలు వెలిశాయి. కనిష్కుని విజయాలు తాత్కాలికమయినాయి. అట్టి సమయమున గుప్తులు విజృంభించి ఉత్తరభారతానికి రాజకీయ ఐక్యతను ప్రసాదించి శాంతి సుస్థిరతలు నెలకొల్పారు.

2. గుప్త వంశానికి మూలపురుషుడైన శ్రీగుప్తుడు, అతని కుమారుడగు ఘటోత్కచగుప్తుడు మగధ ప్రాంతమున సామంతులుగ వున్నారు. ఘటోత్కచగుప్తుని కుమారుడైన మొదటి చంద్రగుప్తుడు స్వతంత్ర రాజ్యాధికారాన్ని నెలకొల్పి ప్రబలురగు లిచ్ఛవీయుల రాకుమార్తె కుమారదేవిని వివాహమాడి వారి సాయంతో తన రాజ్యాధికారాన్ని తూర్పున బీహారువరకు, పశ్చిమాన ప్రయాగ, అయోధ్యల వరకు విస్తరింపజేసి విజయసూచకంగా అశ్వమేధయాగం చేసాడు.

3. మొదటి చంద్రగుప్తుని కుమారుడే "ఇండియన్ నెపోలియన్"గా వర్ణింపబడిన సముద్రగుప్తుడు. ఇతడు గొప్ప విజేత, రాజనీతిజ్ఞుడు. ఇతడు అనేక దండయాత్రలు నిర్వహించి ఆర్యావర్తమున గుప్తుల అధికారాన్ని విస్తరింపజేసి సుప్రతిష్ఠితం చేశాడు. దక్షిణ దిగ్విజయ యాత్రను విజయవంతంగా కొనసాగించిన సముద్రగుప్తుడు 12 మంది దక్షిణాపథ తూర్పు తీర రాజులనోడించి దూరదృష్టితో, రాజనీతిలో వారిరాజ్యములను వారికొసగి తనసార్వభౌమాధికారాన్ని నెలకొల్పినాడు. పిమ్మట 18 మంది ఆటవిక రాజ్యాలవారు నోడించి ఆక్రమించాడు. ఈ విజయాలతో భీతిల్లిన 5గురు సరిహద్దు రాజ్యాలవారు, 9మంది గణరాజ్యాల వారు అతని సార్వభౌమత్వమును గుర్తించినారు. అతని

రాజ్యప్రాభవాన్ని గమనించిన పొరుగు రాజ్యాల వారు అతనితో స్నేహసంబంధాలు నెలకొల్పుకొన్నారు. తాను సాధించిన విజ దృష్ట్యా సముద్రగుప్తుడు అశ్వమేధయాగం చేశాడు. అతడు సంగీతాభిమాని, కవి పోషకుడు, పరమత సహనము ప్రదర్శించిన విశాల హృదయుడు.

4. సముద్రగుప్తుని కుమారుడు రెండవ చంద్రగుప్త విక్రమాదిత్యుడు. ఇతడు తండ్రి ప్రారంభించిన దండయాత్రలు కొనసాగించి పశ్చిమాన శకుల అధికారాన్ని నిర్మూలించి, తూర్పున తన అధికారాన్ని బెంగాల్ వరకు విస్తరింపజేసాడు. వివాహ సంబంధాల ద్వారా తన అధికారాన్ని భద్రపరచుకున్నాడు. పరిపాలనను వ్యవస్థీకరించి సాహిత్యకళలను పోషించి విక్రమాదిత్యునిగా కీర్తికెక్కినాడు.

5. రెండవ చంద్రగుప్తుని అనంతరం కుమారగుప్తుడు, స్కందగుప్తుడు మున్నగువారు రాజ్యపాలన చేశారు. వారికాలంలో రాజ్యక్షీణత మొదలయింది. అనాగరికులు, క్రూరులు అగు హూణులు తోరమాన, మిహిరకులుల నాయకత్వంలో గుప్త సామ్రాజ్యంపై పదేపదే దాడులు జరిపి దోచుకొని పశ్చిమ ప్రాంతాలను ఆక్రమించి దాని క్షయమునకు వారసులయినారు. వీరిదాడుల వలన బౌద్ధమతంకూడా తీవ్రనష్టానికి గురిఅయింది. హూణుల దాడులతో పాటు రాష్ట్ర పాలకుల తిరుగుబాటులు, పొరుగు రాజ్యాలవారి దాడులు గుప్తసామ్రాజ్య పతనాన్ని వేగిర పరిచాయి.

6. చైనా యాత్రికుడు ఫాహియాన్ రెండవ చంద్రగుప్తుని కాలంలో ఉత్తర భారతదేశంలో పర్యటించి నాటి మత, సాంఘిక, రాజకీయ ఆర్థిక పరిస్థితులను గ్రంథస్థం చేశాడు. అతని రచనలు నాటి పరిస్థితులు తెలుసుకొనుటకు విలువైన ఆధారాలు.

## గుప్తుల వంశ వృక్షం

శ్రీ గుప్తుడు

ఘటోత్కచగుప్తుడు

మొదటి చంద్రగుప్తుడు - కుమారదేవి

సముద్రగుప్తుడు - దత్తాదేవి

(రామగుప్తుడు ?) రెండవ చంద్రగుప్తుడు - ధ్రువదేవి, కుబేరనాగ

మొదటికుమారగుప్తుడు - అనంతదేవి ప్రభావతిగుప్త

(మహేంద్రాదిత్యుడు)

స్కంధగుప్తుడు      పురుగుప్తుడు - చంద్రదేవి

(రెండవ కుమారగుప్తుడు ?)

బుద్ధగుప్తుడు      నరసింహగుప్తుడు - మిత్రదేవి

(బాలాదిత్యుడు)

మూడవ కుమారగుప్తుడు

(క్రమాదిత్యుడు)

విష్ణుగుప్తుడు

(చంద్రాదిత్యుడు)

## ప్రశ్నలు

### వ్యాస ప్రశ్నలు

1. సముద్రగుప్తుడు సాధించిన విజయములేవి ?
2. రెండవ చంద్రగుప్తుని కాలంనాటి ప్రధానాంశము లేవి ?

### లఘు వ్యాస ప్రశ్నలు

1. గుప్తవంశ చరిత్రకు ఆధారాలేవి ?
2. గుప్త వంశ తొలి ప్రభువులను గురించి నీకేమి తెలియును ?
3. సముద్రగుప్తుని దక్షిణ దేశ దిగ్విజయ యాత్రను విమర్శనాత్మకముగా పరిశీలింపుము.
4. గుప్త సామ్రాజ్య పతనమునకు కారణములేవి ?
5. హూణుల దండయాత్రలకు కాణములేవి ? ఫలితాలేవి ?
6. ఫాహియాన్ భారతదేశ రచనలలోని విశేషము లేవి ?

### లఘు ప్రశ్నలు

1. మొదటి చంద్రగుప్తుడు
2. రామగుప్తుడు
3. రెండవ చంద్రగుప్తుని కాలమునాటి వివాహసంబంధాలు
4. రెండవ చంద్రగుప్తుని సాహిత్యపోషణ
5. కుమారగుప్తుడు
6. స్కందగుప్తుడు , అతని వారసులు
7. మిహిరకులుడు
8. ఫాహియాన్ కాలమునాటి భారతదేశ బౌద్ధం

### కుశాగ్ర బుద్ధి ప్రశ్నలు

**1. ఈ క్రింది వానికి సరియైన సమాధానములు బ్రాకెట్లలో వ్రాయండి**

(1) రాజ్యవిస్తరణలో మొదటి చంద్రగుప్తునికి సాయపడిన వారు.

(ఎ) అర్జునాయనులు (బి) యౌధేయులు (సి) మద్రకులు
(డి) లిచ్ఛవీయులు (ఇ) సనకని

(2) సముద్రగుప్తుని అలహాబాదు ప్రశస్తి రచయిత

(ఎ) రవికీర్తి (బి) హరిసేనుడు (సి) వీరసేనుడు
(డి) అమరకళాదేవుడు (ఇ) రుద్రసేనుడు

(3) ఇండియన్ నెపోలియన్‌గా వర్ణింపబడిన గుప్తచక్రవర్తి ( )

(ఎ) మొదటి చంద్రగుప్తుడు (బి) రెండవ చంద్రగుప్తుడు (సి) సముద్రగుప్తుడు
(డి) కుమారగుప్తుడు (ఇ) స్కందగుప్తుడు

(4) సముద్రగుప్తుని విజయాలు ఈ శాసనంలో వర్ణించబడినాయి. ( )

(ఎ) మధురశాసనం (బి) ఇరాన్ శాసనం (సి) సారనాథ్ శాసనం
(డి) అలహాబాదు శిలాస్తంభ ప్రశస్తి (ఇ) మెహెరౌలి శాసనం

(5) సముద్రగుప్తునిచే ఓడింపబడిన వేంగి పాలకుడు ( )

(ఎ) మహేంద్రవర్మ (బి) హస్తివర్మ (సి) విష్ణుగోపుడు
(డి) ధనుంజయుడు (ఇ) దమనుడు

(6) గయలో బౌద్ధవిహార నిర్మాణానికి సింహళప్రభువును అనుమతించిన గుప్తచక్రవర్తి ( )

(ఎ) మొదటిచంద్రగుప్తుడు (బి) సముద్రగుప్తుడు (సి) రెండవ చంద్రగుప్తుడు
(డి) కుమారగుప్తుడు (ఇ) స్కందగుప్తుడు

(7) నాగరాజు కుమార్తె కుబేరనాగును వివాహమాడిన గుప్తచక్రవర్తి ( )

(ఎ) ఘటోత్కచగుప్తుడు (బి) కుమారగుప్తుడు (సి) స్కందగుప్తుడు
(డి) రెండవ చంద్రగుప్తుడు (ఇ) సముద్రగుప్తుడు

(8) 'శకారి' అను బిరుదు ధరించిన గుప్తచక్రవర్తి ( )

(ఎ) శ్రీగుప్తుడు (బి) సముద్రగుప్తుడు (సి) రెండవ చంద్రగుప్తుడు
(డి) పురుగుప్తుడు (ఇ) నరసింహగుప్తుడు

(9) 'నవరత్నము'లను కవులను పోషించిన గుప్తచక్రవర్తి ( )

(ఎ) మొదటి చంద్రగుప్తుడు (బి) సముద్రగుప్తుడు (సి) రెండవచంద్రగుప్తుడు
(డి) కుమారగుప్తుడు (ఇ) స్కందగుప్తుడు

(10) నలందా విశ్వవిద్యాలయ నిర్మాత ( )

(ఎ) రెండవ చంద్రగుప్తుడు (బి) కుమారగుప్తుడు (సి) స్కందగుప్తుడు
(డి) బుద్ధగుప్తుడు (ఇ) గోవింద గుప్తుడు

**అభ్యాసాలు**

1. దక్షిణ భారత దేశ సంస్కృతికి ఆంధ్ర శాతవాహనులు చేసిన సేవ వివరింపుము ?
2. క్రీ.పూ. 200 క్ర.శ. 200 మధ్యకాలంలో జరిగిన భారత స్వదేశీ వాణిజ్యం గూర్చి వివరింపుము ?

## ఉపయుక్త గ్రంథాలు


| | | |
|---|---|---|
| 1. ఖండల్లి లక్ష్మీ రంజనం, బాలేందు శేఖరం | : | ఆంధ్రుల చరిత్ర సంస్కృతి |
| 2. వారణాశి యశోదాదేవి | : | భారతదేశ చరిత్ర - సంస్కృతి ప్రథమ భాగం |
| 3. B.S.L. Hanumantha Rao | : | Indian History & Culture, |
| K. Basaveswara Rao | : | Vol. I |
| 4. E.J. Rapson | : | Cambridge History of India |
| 5. G. Yazdani | : | Early History of Dekkan, Vol. I & II |
| 6. B.V. Krishna Rao | : | Early dynastsri of Andhnedesa. |
| 7. K.A.N. Sastri | : | A History of South India |
| 8. Gopal Chari | : | Early History the Andhra Country |


3. ఈ క్రింది వానిని జతపర్చుము

| 'ఎ' గ్రూపు | | 'బి' గ్రూపు |
|---|---|---|
| 1. మొదటి చంద్రగుప్తుడు | ( ) | (ఎ) నలందా విశ్వ విద్యాలయం |
| 2. సముద్రగుప్తుడు | ( ) | (బి) కుమారదేవి |
| 3. రెండవ చంద్రగుప్తుడు | ( ) | (సి) హూణులు |
| 4. కుమారగుప్తుడు | ( ) | (డి) ఇండియన్ నెపోలియన్ |
| 5. తోరమానుడు | ( ) | (ఇ) నవరత్నాలు |

4. భారతదేశ రేఖా పటంలో సామ్రాజ్య విస్తీర్ణము స్థలములను గుర్తించండి

(ఎ) సముద్రగుప్తుని సామ్రాజ్యం

(1) పాటలీపుత్రం (2) మధుర (3) వేంగి

(బి) రెండవ చంద్రగుప్తుని సామ్రాజ్యం

(1) ఉజ్జయిని (2) సౌరాష్ట్రం (3) గయ

**జవాబులు:**

1. (1) డి (2) బి (3) సి (4) డి (5) బి (6) బి (7) డి (8) సి, (9) సి (10) బి.

2. (1) శ్రీగుప్తుడు (2) మేఘవర్ణుడు (3) సముద్రగుప్తుడు (4) సముద్రగుప్తుడు (5) సముద్రగుప్తుడు (6) దేవీచంద్రగుప్తం (7) ప్రభావతీగుప్త (8) రెండవ చంద్రగుప్తుడు (9) స్కందగుప్తుడు (10) గుప్త

3. (1) బి, (2) డి (3) ఇ (4) ఎ (5) సి

## అభ్యాసాలు

1. గుప్త సామ్రాజ్య విస్తరణలో ప్రధాన ఘట్టాలను వివరించండి.
2. గుప్త సామ్రాజ్య విస్తీర్ణమును భారతదేశ రేఖా పటంలో గుర్తించండి.

పాఠం - 13

# గుప్తయుగ విశేషాలు

## 13.1 లక్ష్యం

గుప్తుల పరిపాలన, నాటి సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితులు సాహిత్యాభివృద్ధి, కళావికాసములను వివరించటమే ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

## ముఖ్యాంశాలు

13.2 గుప్తుల పరిపాలనా విధానం - ఉపోద్ఘాతం - ప్రభుత్వ స్వరూపం - ఆధారాలు - కేంద్ర ప్రభుత్వం - చక్రవర్తి, మంత్రి పరిషత్, ఉద్యోగవర్గం - రాష్ట్రపాలన - జిల్లాపాలన - నగరపాలన - గ్రామపాలన - సైన్యం - ఆదాయ, వ్యయాలు - న్యాయ నిర్వహణ - ప్రభుత్వస్వభావం.

13.3 సాంఘిక పరిస్థితులు - వర్ణవ్యవస్థ - బ్రాహ్మణులు క్షత్రియులు, ఇతర వర్గాలవారు - వృత్తులు - సమిష్టి కుటుంబవ్యవస్థ, -స్త్రీల స్థానం - వివాహాలు - ఆహారం, దుస్తులు, అలంకరణలు, వినోదాలు - బానిసత్వం - ప్రజల స్థితిగతులు.

13.4 ఆర్థిక పరిస్థితులు - వ్యవసాయం - పరిశ్రమలు - వాణిజ్యం, దేశీయ, విదేశీయ, రవాణా మార్గాలు, ఎగుమతులు- శ్రేణులు, వాటి కార్యకలాపాలు - నాణాలు.

13. 5 మత పరిస్థితులు : హిందూ మతం, వైష్ణవమతం, శైవమతం, దేవాలయాలు, పురాణాలు, శాస్త్రాలు - బౌద్ధ, జైన మతాలు

13.6 సాహిత్యాభివృద్ధి - విద్యాకేంద్రాలు - సంస్కృత రచనలు - ప్రాకృతం - పురాణాలు, స్మృతులు - శాస్త్ర పరిణతి -వేదాంత, తర్క, శాస్త్రాలు - వైద్య శాస్త్రం

13.7 కళావికాసం - సంగీతం - వాస్తు నిర్మాణాలు - శిల్పకళ - చిత్రకళ - లోహకార కళ - నాణాలు

13.8 వలసలు - సంస్కృతి వ్యాప్తి

13.9 గుప్త వైశిష్ట్యం

13.10 ఉపసంహారం.

## 13. 2 గుప్తుల పరిపాలనా విధానం

భారతదేశ చరిత్రలో గుప్తుల పాలనాకాలం ఒక మహోజ్వల అధ్యాయం. మౌర్య సామ్రాజ్య పతనాంతరం ఉత్తర భారతమున విశాలసామ్రాజ్యంను స్థాపించి, రాజకీయ ఐక్యతను సాధించి ఒకటిన్నర శతాబ్దాలపాటు శాంతి సుస్థిరతలను నెలకొల్పి మత సహనమును పాటించి సాహిత్య కళలను పోషించిన ఘనులు గుప్త చక్రవర్తులు. సామ్రాజ్య నిర్మాణము చేయుటయే గాక సమర్థవంతమైన పాలనా వ్యవస్థను కూడా వారు రూపొందించారు. సుభిక్షమయిన, పరిపూర్ణమయిన, పటిష్టమయిన వారి పాలనలో గుప్తసామ్రాజ్యం సర్వతోముఖాభివృద్ధిని సాధించింది. వారి పాలనా విధానానికి ప్రాచీన పాలనావ్యవస్థలే పునాది. పాలనా విధానంలోని వినూత్నమైన మార్పులు చేయకున్నను వారు మౌర్యుల పాలనా వ్యవస్థను కాలానుగుణ్యమైన మార్పులతో పటిష్ఠంగా రూపొందించినారు.

గుప్తయుగమున ప్రభుత్వస్వరూపం రెండు విధాలుగావుండేది. (1) రాజరిక ప్రభుత్వం (2) గణతంత్ర ప్రభుత్వం. ... రాజరిక విధానమైనది. అర్జునాయనులు, యౌధేయులు, ముద్రకులు మున్నగువారి సామంతరాజ్యాలలో గణతంత్ర వ్యవస్థ వాడుకలో వుండేది.

ఆధారాలు : గుప్తుల పాలనా విశేషములు తెలుసుకొనుటకు ఆధారలేవనగా : (1) గుప్తుల శాసనాలు (2) నాణాలు (3) ముద్రలు (Seals) (4) కామందకుని నీతిసారం (5) ధర్మశాస్త్ర గ్రంథాలు (6) కాళిదాసు మున్నగు వారి సాహిత్య రచనలు (7) ఫాహియాన్ రచనలు.

గుప్తుల పాలనా విధానంలో మూడు స్థాయిలు కలవు. (1) కేంద్ర ప్రభుత్వం (2) రాష్ట్ర ప్రభుత్వం (3) స్థానిక ప్రభుత్వం

## 1.4 కేంద్ర ప్రభుత్వం :

చక్రవర్తి : వంశపారంపర్యమైన రాజరిక విధానమును గుప్తులు అనుసరించిరి. ఇందులో చక్రవర్తి రాజ్యానికి సర్వాధికారి. సాధారణంగా రాజు పెద్ద కుమారుడు రాజ్యానికి వారసుడు. రాజ్యంలో రాజు సర్వాధికారి. సైనిక, న్యాయ, పరిపాలనా అధికారాలన్నీ రాజునందు కేంద్రీకరింపబడినాయి. నిరంకుశ అధికారాలు ఉన్నప్పటికిని రాజు ప్రజాక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పరిపాలించేవాడు. నాటి రాజులు 'పరమభట్టారక', 'పరమదేవత', 'సామ్రాట్', 'రాజాధిరాజ', 'మహారాజాధిరాజ', 'పృధ్వీపాల', 'చక్రవర్తి', 'పరమేశ్వర', అను బిరుదులు ధరించారు.

మంత్రి పరిషత్ : రాజ్యపాలనలో రాజుకు సాయపడుటకు ఒక మంత్రి పరిషత్ ఉండేది. కానీ తుది నిర్ణయం రాజుదే.

ఉద్యోగవర్గం : గుప్తుల ఉద్యోగ వర్గంలో కుమారామాత్యులు అనువారు ప్రముఖులు. క్రమంగా వారిపదవులు కూడా వంశానుగతమైనవి. తత్ఫలితంగా రాజుల అధికారం బలహీనపడింది. పెద్ద ఉద్యోగులకు ధనరూపేణ, చిన్న ఉద్యోగులకు భూముల రూపేణ వేతనాలు చెల్లింపబడేవి.

రాష్ట్రపాలన : గుప్త సామ్రాజ్యంలో రాష్ట్రాలు రెండు విధాలుగా వుండేది. రాష్ట్రస్థాయిలోని సామంతరాజ్యాల పాలన గుప్త సామ్రాజ్యంలో అంతర్భాగమయిన ప్రదేశాలకు భిన్నంగా వుండేది. పరిపాలన సౌలభ్యం కోసం గుప్త సామ్రాజ్యం రాష్ట్రాలుగా విభజింపబడింది. రాష్ట్రానికి భక్తి లేక దేశం అనే పేరు గుప్త శాసనాలలో ఈ రాష్ట్రాల పేర్లు ప్రస్తావింపబడినాయి. సాధారణంగా యువరాజు, రాజకుటుంబీకులు రాష్ట్రాధిపతులుగా నియమింపబడినారు. రాష్ట్రరక్షణ, ప్రజాసంక్షేమం, శాంతి భద్రతలు వారి బాధ్యతలు, భోగిక, భోగపతి, రాజస్థానీయ మున్నగువారు రాష్ట్రంలోని ఇతర ఉద్యోగులు.

జిల్లా పాలన : రాష్ట్రాలు విషయాలు (జిల్లాలు) గా విభజిత మయినాయి. విషయకు అధిపతి విషయపతి. విషయపాల నిర్వహణకు 30 మంది సభ్యులు గల విషయమహత్తరము అను సంఘం ఉండేది.

నగరపాలన : 'పురపాలుడు' నగరపాలన అధికారి. ఇతడు 'నగర పరిషత్' సాయంతో తన విధులను నిర్వహిస్తాడు. ఆరోగ్యం, పారిశుద్యం, ప్రాథమిక విద్య మున్నగునవి నగరపాలనా పరిధిలోని అంశాలు.

గ్రామపాలన : పాలనా వ్యవస్థకు పునాది గ్రామం. 'గ్రామికుడు' లేక 'గ్రామాధ్యక్షుడు' గ్రామాధికారి. గ్రామ పంచాయితి (పంచమడల) సాయంతో గ్రామికుడు శాంతి భద్రతలు కాపాడేవాడు. గ్రామపాలన నిర్వహించేవాడు.

సైన్యం : గుప్తసైన్యంలో రథ, గజ, తురగ, పదాతిదళములను చతురంగ బలములు, నౌకాబలము కలవు. కాని రథబల ప్రాధాన్యం తగ్గింది.

ఆదాయ, వ్యయాలు : రాజ్యానికి ప్రధాన ఆదాయమార్గం భూమిశిస్తు. పంటలో ఆరవ భాగం భూమిశిస్తుగా నిర్ణయింపబడింది ...సారాన్ని బట్టి శిస్తు ఉండేగి. ధాన్యరూపంలో శిస్తు వసూలు చేయబడింది. భూమిశిస్తుతోపాటు రైతులు యుద్ధసమయములంద

కొంత సైనిక వ్యయం భరించవలసి ఉండేది. వ్యాపార సుంకాలు, రేవు సుంకాలు, వ్యాపారులపై విధింపబడే రాబడిపన్ను, యుద్ధసమయపు దోపిడిసొమ్ము, గనులు, అడవులు, జరిమానాలు మున్నగునవి ఇతర ఆదాయ మార్గాలు. ఈ ఆదాయంలో ఎక్కువ భాగం సైనిక నిర్వహణకు ఖర్చయ్యేది.

న్యాయనిర్వహణ : పూర్వకాలం కంటె గుప్తుల కాలంలో న్యాయవ్యవస్థ మెరుగుపడింది. ఈ యుగంలో నారద, యాజ్ఞవల్క్య, బృహస్పతి మున్నగువారి స్మృతులు తయారయినవి. సివిల్ (Civil) క్రిమినల్ (Criminal) వివాదాలకు ప్రత్యేక చట్టాలు ఏర్పడినాయి. చౌర్యము, వ్యభిచారము క్రిమినల్ నేరాలుగా, ఆస్తి సంబంధమైన విభేదాలు సివిల్ నేరములుగా నమోదయినాయి. పూర్వం వలె ఈ యుగంలో గూడా కులాన్ని బట్టి శిక్షలు ఉండేవి. ధర్మాన్ని కాపాడుట రాజు ప్రధాన విధి.

ప్రభుత్వ స్వభావం : మౌర్యుల ప్రభుత్వం వలె గుప్తుల ప్రభుత్వం గూడా వంశానుగత నిరపేక్ష రాజరికమే. కాని అప్పటి కఠినశిక్షలు గాని ఉద్యోగుల బెడదగాని గుప్తుల కాలమున లేవు. కేంద్ర ప్రభుత్వంలో కేంద్రీకృత అధికారం నెలకొల్పబడినను స్థానిక పాలనలో ఉద్యోగేతర సిబ్బంది ప్రమేయం ఎక్కువగా ఉండేది. ధర్మరక్షణార్థం 'వినయస్థితి స్థాపకులు' అను ఉద్యోగులను నియోగించింది. వరుణధర్మశాలల, దేవాలయాల, విద్యాలయాల కార్యకలాపాలను పర్యవేక్షించేవారు. వీరు అశోకుని కాలంనాటి 'ధర్మమహామాత్యుల' వంటివారు. ఈ విధమైన గుప్తుల ఉదాత్త, ఉదారపాలన నాటి సాంస్కృతిక పునర్వికాసానికి మార్గమేర్పరచింది.

## 13. 3 సాంఘిక పరిస్థితులు

వర్ణవ్యవస్థ : గుప్తుల కాలం నాటి సమాజంలో వర్ణవ్యవస్థ బలపడింది. కర్మను బట్టి పుట్టుక ఉంటుందని విశ్వసింపబడింది. వర్ణ సాంకర్య నిరోధం రాజుల బాధ్యత అయింది. హిందూ మతోద్ధరణతో వర్ణనిబంధనలు కఠినతరమయినాయి. వర్ణధర్మాలను పాటించని వారిని వెలివేసి శిక్షించేవారు. హిందూధర్మశాస్త్రమైన మనుధర్మశాస్త్రం ఈ రోజుల్లోనే క్రోడీకరింపబడింది. సమాజంలో బ్రాహ్మణుల ఆధిక్యత పెరిగింది. దానాలవలన, అగ్రహారాల వలన వారి ఆర్థిక పరిస్థితి బాగా మెరుగయ్యింది. వేద పాండిత్యంతో, ఆర్థిక పుష్టితో వారు ప్రత్యేక హక్కులు సాధించుకొన్నారు.

క్షత్రియులు ఆయుధోపజీవులు. వీరు గూడా ద్విజులుగా పరిగణింపబడినారు. క్షత్రియేతరులైన గుప్త ప్రభువులు బ్రాహ్మణులకు భారీగా భూదానములిచ్చి వారి మెప్పుపొంది సుక్షత్రియులుగా పరిగణింపబడినారు. ప్రజాదరణకు పాత్రులైనారు.

గుప్తులకు పూర్వం విదేశీయులనేకులు భారతదేశం వచ్చి స్థిరపడుటవలన, కులాల సంఖ్య పెరిగింది. ఈ యుగంలో శూద్రుల పరిస్థితి కొంచెం మెరుగుపడింది. ఇతిహాసాల, పురాణాల శ్రవణం వారికి కలిగింది. ప్రధానంగా వారు కర్షకులయినారు. కానీ పంచముల పరిస్థితి హీనముగా వున్నది. ఈ యుగంలో వారి సంఖ్య పెరిగింది. వారు గ్రామాల వెలుపల నివసించేవారు. హిందూసమాజంలో చేరిన యవనులు, శకులు మున్నగువారు పురాణాలలో, వరాహమిహిరుని బృహత్సం హితంలో మ్లేచ్ఛులుగా (అంటరానివారుగా) పిలువబడినారు. పాలకవర్గంనకు చెందిన హూణులు హీనక్షత్రియులుగా వ్యవహరింపబడినారు. వృత్తినిబట్టి గూడా కులాలు ఏర్పడినాయి.

వృత్తులు : సాధారణంగా కులాన్ని బట్టి వృత్తి ఉండేది. వృత్తిమార్పిడి జరిగిన సందర్భాలు గూడా వున్నాయి. బ్రాహ్మణులు రాజ్యమేలుట, ఉద్యోగ వర్గమున చేరుట, వ్యాపారం చేయుట, క్షత్రియులు పరిశ్రమలు నెలకొల్పుట, వ్యాపారం చేయుట, వైశ్యులు క్షత్రియ వృత్తిని చేపట్టుట (వైశ్యులయిన గుప్తులు రాజ్యమేలినారు) మున్నగు ఉదాహరణలు ఈ యుగంలో కన్పిస్తాయి. మౌర్యుల వలన కాయస్థకులం (లేఖకులు) ప్రతి వృత్తివారు ఒక సంఘంగా లేక శ్రేణిగా ఏర్పడినారు. ఈ వృత్తిసంఘాలు యువకులకు వారివారి వృత్తులలో శిక్షణా కేంద్రాలుగా ఉపయోగపడినాయి.

సమిష్టి కుటుంబ వ్యవస్థ : కుటుంబాలు సమిష్టిగా ఉండేవి. తండ్రి జీవిత కాలంలో కుటుంబ వేర్పాటును స్మృతులు నిషేధించాయి. తండ్రి మరణానంతరం గూడా సోదరులు తమ కుటుంబాలతో కలిసి జీవించినట్లు శాసనాధారాలు ఉన్నవి. కుటుంబం పితృస్వామ్యంపై ఆధారపడి ఉన్నది. ఆస్తిలో తండ్రీ కుమారులకు సమాన హక్కులు ఉండేవి.

స్త్రీల స్థానం : నాటి పైతృక కుటుంబ వ్యవస్థను బట్టి చూచిన సమాజంలో పురుషుని కంటె స్త్రీ స్థానం తక్కువని తెలుస్తుంది. బాల్య వివాహాలు, బహుభార్యాత్వం ప్రబలినాయి. సతీసహగమనం వాడుకలోకి వచ్చింది.

వివాహాలు : సాధారణంగా సవర్ణ వివాహాలు (endogamous marriages) వాడుకలో ఉన్నప్పటికిని వర్ణాంతర వివాహాలు గూడా జరిగినాయి. ఎక్కువగా ఏకపత్నీత్వం (Monogamy) వాడుకలో వున్నది. ఉన్నత వర్ణాలలో బహుభార్యాత్వం (Polygamy) సర్వసాధారణం.

ఆహారం, దుస్తులు అలంకరణాలు : ఎక్కువ మంది ప్రజలు శాకాహారులున్నట్లు ఫాహియాన్ రచనల బట్టి తెలుస్తుంది. మద్యమాంసాలను, ఉల్లి, వెల్లుల్లి మున్నగు వాటిని శూద్రులు, పంచములు ఎక్కువగా వాడినారు. పురుషులు అంగవస్త్రమును, ధోవతిని, స్త్రీలు చీరె, రవికెలను ధరించినారు. వారు నూలు, సిల్కు బట్టలను వాడినారు. స్త్రీ పురుషులిరువురు అనేక ఆభరణములు ధరించినారు. శరీర సౌందర్యానికి లేపనములు, పౌడర్లు వాడినారు. అజంతా చిత్రాలలోను శిల్పాలలోను నాణాల మీదను నాటి వస్త్రధారణ పద్ధతులు, అలంకరణలు కన్పిస్తాయి.

వినోదాలు : చదరంగం, పాచికల ఆట, పొట్టేళ్ల పందాలు, కోళ్ల పందాలు, వేట, పురుషులకు, కందుక క్రీడ (బంతి ఆట) పిల్లలకు, స్త్రీలకు, సంగీత, నృత్యములు స్త్రీలకు వినోదములు.

బానిసత్వం : ఈ యుగంలో బానిసత్వం ఉన్నది. యుద్ధఖైదీలు, దివాలా తీసిన వారు, పరాజిత జూదరులు క్షామపీడితులు బానిసలయినారు. కాని రుణ విముక్తులయి స్వేచ్ఛపొందు అవకాశము గూడా వారికి ఉండేది.

ప్రజల స్థితిగతులు : ప్రజలు ధర్మపరులు, ఉదారులు, ఐశ్వర్యవంతులు. జూద, చోర నేరాలు అరుదు, తగాదాలు లేవు. వారు శాకాహారులు, మద్యమాంసాలను ముట్టరు. వారి నైతిక ప్రమాణాలు ఉన్నతమైనవి. ధనం ఇచ్చి పుచ్చుకోడాలలో లిఖిత పూర్వక ఆధారాలు లేవు. బయటకు వెళ్లినపుడు ఇండ్లకు తాళాలు వేసేవారు కాదు అని ఫాహియాన్ పేర్కొన్నాడు. ఈతని రచనల్లో కొన్ని అతిశయోక్తులు కన్పిస్తాయి. సామాన్యుల పరిస్థితి ఫాహియాన్ రాసినంత సౌఖ్యప్రదంగా సంతృప్తికరంగా లేదు.

## 13. 4 ఆర్థిక పరిస్థితులు

గుప్తుల కాలంలో దేశం సిరిసంపదలతో తులతూగినట్లు ఫాహియాన్ రచనలు, శాసనాలు, నాణాలు తెలియజేస్తున్నాయి.

వ్యవసాయం : ప్రజల ప్రధాన వృత్తి అయిన వ్యవసాయం ప్రభుత్వంచే ప్రోత్సహింపబడి అభివృద్ధి దిశలో వున్నది. బంజరు భూములు సాగువలన వ్యవసాయ భూమి విస్తీర్ణం పెరిగింది. ప్రభుత్వం వ్యవసాయ భూములకు నీటిపారుదల వసతులు కల్పించినట్లు స్కందగుప్తుని కాలము నాటి సుదర్శన తటాక మరమ్మతులను విదితమవుతుంది. పారశీక నీటిచక్రం (Persian Wheel) ద్వారా చెరువులనుండి, బావులనుండి పంటభూములకు నీటి వసతి కల్పించబడింది. వరి, గోధుమ, చెరకు, కొబ్బరి, పత్తి, అల్లం, ఆవాలు, అరటి, మామిడి, నారింజ మున్నగు పంటలు పండింపబడినవి. ఈ యుగంలో కనబడు వినూత్న లక్షణం బ్రాహ్మణులు భూకామందులగుట. రాజులనుండి దానాలు, అగ్రహారాలు పొందిన బ్రాహ్మణులు భూకామందులయినారు.

పరిశ్రమలు : గుప్తులకాలం నాటి పరిశ్రమలలో ప్రధానమయింది వస్త్ర పరిశ్రమ. దీనితో పాటు లోహ పరిశ్రమ గూడా అభివృద్ధి దశలో వున్నది.

రాగి, కంచు, ఇనుము మున్నగు లోహాలతో వివిధ రకాల పరికరాలు తయారుచేసేవారు. నేటికి తుప్పుపట్టక ఆశ్చర్యాన్ని కలిగించే ఢిల్లీ సమీపమున మెహరౌలి వద్ద వున్న ఇనుప స్తంభం గుప్తుల కాలంలో పోతపోయబడినదే ! లోహంతో పెద్ద పెద్ద విగ్రహాలు పోతపోసేవారు.

వాణిజ్యం : గుప్తుల యుగమున దేశీయ, విదేశీయ వ్యాపారం చురుకుగా సాగింది. తమ సామ్రాజ్యం తూర్పు, పశ్చిమ సముద్రాల పర్యంతం విస్తరించినందున గుప్త ప్రభువులు విదేశవాణిజ్యాన్ని బాగా ప్రోత్సహించారు. పశ్చిమాన భరుకచ్ఛము (బరిగాజ, బ్రోచ్) తూర్పున తామ్రలిప్తి (తంలూక్) ప్రధాన రేవు పట్టణాలు. తామ్రలిప్తి రేవు ద్వారా ఆగ్నేయ ఆసియా, చైనా దేశాలతోను, భరుకచ్ఛ రేవు ద్వారా రోము మున్నగు పశ్చిమ దేశాలతోను విదేశ వ్యాపారం జరిగేది. తూర్పు, పశ్చిమ తీరాల మధ్య జరిగే వ్యాపారానికి సింహళం కేంద్రంగా వుండేది. తామ్రలిప్తి నుండి నౌకలు సింహళానికి, అచటినుండి తూర్పుఇండియా దీవులకు, చైనాకు వెళ్లేవి. అసంఖ్యాకంగా లభించిన గుప్తుల బంగారు నాణాలే నాటి లాభసాటి విదేశ వ్యాపారానికి నిదర్శనాలు.

శ్రేణులు : వృత్తి పనివారు, వ్యాపారులు తమ ప్రయోజనములు కాపాడుకొనుటకు శ్రేణులుగా లేక నిగమాలుగా లేక వృత్తి సంఘాలుగా ఏర్పడేవారు. సార్ధవాహుల, శ్రేణి (నిగమ), శ్రేష్టుల నిగమ, కులికుల నిగమ, నేత పనివారి శ్రేణి, నూనెగానుగల వారి శ్రేణి మున్నగు వృత్తి సంఘములు వున్నట్లు శాసనములు, ముద్రలు (Seals) పేర్కొన్నవి.

నాణాలు : గుప్త చక్రవర్తులు అనేక రకాల బంగారు, నాణాలు ప్రవేశపెట్టినప్పటికి రోజువారి లావాదేవీలలో వెండి, రాగి నాణాలు ఎక్కువగా వాడుకలో వున్నవి. బంగారు నాణాన్ని 'సువర్ణమ' ని వెండి నాణాన్ని 'రూపక' మని పిలిచేవారు. ఒక బంగారు నాణానికి పదిహేను వెండి నాణాలు. గవ్వలు కూడా ధనంగా వాడబడినట్లు ఫాహియాన్ రచనల వలన తెలుస్తుంది.

## 13. 5 మత పరిస్థితులు

హిందూమతం : నవ హిందూ మత ఆవిర్భావంలో గుప్తయుగం ఒక ప్రధాన ఘట్టం. వైదిక మతం ఆధునిక హిందూమతంగా పరిణమించింది ఈ యుగంలోనే, గుప్తచక్రవర్తులు వైదిక మతాభిమానులు, మొదటి చంద్రగుప్తుడు, సముద్రగుప్తుడు అశ్వమేధయాగాలు చేశారు. కాని క్రతువుల పట్ల ప్రజలకు ఆదరం తగ్గింది. భక్తి ప్రధానమైన పౌరాణిక మతం వైపు వారు ఆకర్షితులయ్యారు. వైదిక మతానికి జైన, బౌద్ధమతాల పోటీ ఎక్కువయింది. అదియునుగాక విదేశీయులను చేర్చుకొనుటకు వైదిక మతంలో మార్పులు చేయవలసిన అవసరము ఏర్పడింది. అందువలన విష్ణుభక్తులైన గుప్త ప్రభువుల ఆదరణలో వైదిక మతం నేటి హిందూమతంగా రూపొందినది. వైదిక దేవతల స్థానంలో క్రొత్త దేవుళ్ళు, దేవతలు వెలిశారు. త్రిమూర్తులుగా పరిగణింపబడిన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు వారి భార్యలు సరస్వతి, లక్ష్మి, పార్వతులు, విఘ్నేశ్వరుడు, హనుమంతుడు, సూర్యుడు మున్నగు పెక్కుదేవతలను ప్రజలు ఆరాధించినారు యవనులు, కుషాణులు, శకులు మున్నగు విదేశీయులు వైష్ణవం ద్వారా హిందూమతంలో చేరినారు.

వైష్ణవ మతం : త్రిమూర్తులలో సర్వరక్షకుడైన విష్ణువు భక్తి ప్రధానమైన దేవుడుగా అవతరించాడు. ఆయన్ని శ్లాఘిస్తూ ఆగమాలు, పురాణాలు వ్రాయబడి ప్రచారంలోకి వచ్చినాయి. విష్ణుమూర్తి అవతార కథలు గూడా ప్రాచుర్యం పొందినాయి. ఆయన దశావతారమును ప్రతిపాదించిన భాగవత మతం (వైష్ణవ మతం)విశేష ప్రజాదరణ పొందినది. దశావతారాలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆరాధింపబడినాయి. ప్రత్యేకాభిమానానికి పాత్రమయినాయి.

శైవమతం : వైష్ణవం తరువాత శైవం ఆదరింపబడింది. శైవులలో పాశుపతులు ప్రాచుర్యం పొందినారు. కుమారగుప్తుడు శైవమతాభిమాని. గుప్తుల కాలంలో దుర్గ, స్కంద, గణేశ మున్నగు శైవదేవతలు ఆరాధింపబడినారు.

దేవాలయాలు : గుప్తయుగం నుండి ఆలయాలలోని గృహ పూజ హిందూమత ప్రధాన లక్షణమయింది. అందువలన అనేక దేవాలయాలు నిర్మింపబడినాయి. దేవగఢ్‌లోని దశావతార దేవాలయం, టిగావాలోని విష్ణ్వాలయం, భూమ్రాలోని శివాలయం అట్టివే. మతానికి ఆలయం ప్రధాన కేంద్రమయింది. భక్తులు ఈ ఆలయాలకు దానధర్మాలు చేసేవారు. పురాణశ్రవణం, పుణ్యక్షేత్రాలను దర్శించడం, దానధర్మాలు చేయడం పుణ్యకార్యాలుగా భావించినారు.

పురాణాలు, శాస్త్రాలు : నవ హిందూ మత ప్రధానాంశాలు, వేదాంత విశేషాలు, నైతిక విలువలు పొందుపరుస్తూ సామాన్యులకు అర్థమగు రీతిలో ధర్మశాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు రూపొందింపబడినాయి. పురాణాలు, ధర్మశాస్త్రాలు, సాంఘిక నియమాల పవిత్రతను చాటినాయి. ధర్మార్థకామ మోక్షాలు మానవుని గమ్యాలుగా నిర్దేశింపబడినాయి.

బౌద్ధ, జైన మతాలు : గుప్త చక్రవర్తులు హిందూ మతాభిమానులయినను ఇతర మతస్థులను హింసించలేదు. వారు పరమ సహనం పాటించినారు. వారి కొలువులో అన్నిమతాల వారు ఉద్యోగులుగా ఉండేవారు.

## 13. 6. సాహిత్యాభివృద్ధి

ప్రాచీన భారతదేశ చరిత్రలో గుప్తయుగం ఒక ఉజ్వల అధ్యాయం. సాహిత్యం, శాస్త్రాలు, కళలు పురోగమించి, వికసించిన ఈ యుగాన్ని స్వర్ణయుగమనుట పరిపాటి. ఈ యుగాన్ని గ్రీసు చరిత్రలో పెరిక్లిస్ యుగంతోను, రోము చరిత్రలో ఆగస్టస్ యుగంతోను ఇంగ్లండు చరిత్రలో ఎలిజబెత్ యుగంతోను పోలుసారు.

విద్యాకేంద్రాలు : గుప్త ప్రభువులనేకులు పండితులు, కవులు. సముద్రగుప్తునకు 'కవిరాజు' అనే బిరుదు ఉంది. గుప్తరాజులు సంస్కృత భాషను పోషించినారు. పాటలీపుత్రం, నలందా, వల్లభి, ఉజ్జయిని, కాశినాడ భారతదేశంలో ప్రసిద్ధిచెందిన విద్యాకేంద్రాలు. నలందా విశ్వవిద్యాలయం అంతర్జాతీయ విద్యాకేంద్రంగా ప్రసిద్ధికెక్కింది.

సంస్కృత రచనలు : గుప్తయుగమున సాహిత్య కృషి ఒక్కమారుగా పెల్లుబికినది. హిందూమత పునరుజ్జీవనం వలన సంస్కృత భాషకు ఎనలేని ప్రోత్సాహం లభించింది. సంస్కృత సాహిత్య సృష్టి ఈ యుగమున పరాకాష్టనందుకొన్నది. 'అష్టాధ్యాయి' అను సంస్కృత వ్యాకరణాన్ని పాణిని రచించినాడు. పతంజలి 'మహాభాష్యము'ను వెలయించినాడు. గుప్తుల శాసనాలు సంస్కృతంలో కూర్చబడినాయి. బౌద్ధమత పండితులు గూడా తమ మత గ్రంథాలను ఈ భాషలోనే రచించినారు. మహాకవి కాళిదాసు ఈ కాలములోనివాడె. ఇతడు రఘువంశం, మేఘసందేశం, కుమారసంభవం అను కావ్యాలను, అభిజ్ఞాన శాకుంతలం, మాళవికాగ్ని మిత్రం, విక్రమోర్వశీయం అను నాటకాలను రచించి శాశ్వతకీర్తి నార్జించినాడు. శూద్రకుడు 'మృచ్ఛకటికమును', విశాకదత్తుని 'ముద్రారాక్షస' నాటకములను రచించినారు. అమరసింహుడు అమరకోశమును కూర్చినాడు. 'పంచతంత్రము'ను లోక ప్రసిద్ధమయిన నీతికథలను విష్ణుశర్మయను పండితుడు రచించినాడు.

ప్రాకృతం : ప్రాకృతం సామాన్య ప్రజల బాషగా ఉండేది. బౌద్ధులు, జైనులు మత ప్రచారం ఈ భాషలోనే చేశారు.

పురాణాలు, స్మృతులు : గుప్తయుగానికి పూర్వం ప్రచారంలో వున్న పురాణాలు ఈ యుగంలో తిరిగి రచింపబడినాయి. విష్ణు, వాయు, మత్స్య, భాగవత, బ్రహ్మాండ, శివ, స్కంద పురాణాలు గుప్తకాలానికి చెందినవే. రామాయణ, భారత ఇతిహాసాలు గూడా ఈ యుగంలో తుదిరూపులు దిద్దుకున్నాయి. ఆదిలో 24,000 శ్లోకాలు కలిగిన భారతం గుప్తయుగానికి లక్ష శ్లోకాల ఉద్గ్రంథంగా తయారయింది. ధర్మశాస్త్రాలు గూడా తిరిగి రచింపబడినాయి.

శాస్త్ర పరిణతి : గుప్తయుగంలో పలువిధ శాస్త్ర విజ్ఞానం వికసించింది. గణిత, ఖగోళశాస్త్రములందు గొప్ప విద్వాంసులు ఉండేవారు. ఆర్యభట్టు, వరాహమిహిరుడు, బ్రహ్మగుప్తుడు మున్నగు ప్రముఖ గణితశాస్త్రవేత్తలు ఈయుగంలోని వారే.

వేదాంత తర్క శాస్త్రములు : బుద్ధ పాలితుడు. భావవివేకుడు, వసుబంధుడు, దిజ్నాగుడు మున్నగు బౌద్ధవేదాంతులు తర్కశాస్త్ర పండితులు ఈయుగముననే విలసిల్లినారు.

వైద్యశాస్త్రం : ప్రసిద్ధ ఆయుర్వేద శాస్త్రజ్ఞులయిన వాగ్భటుడు, సుశ్రుతుడు, ధన్వంతరి గుప్త యుగంవారే.

## 13. 7 కళావికాసం

సంగీతం : గుప్తరాజుల ఆదరణలో సంగీత, నృత్యాలు పురోగమించినాయి. సముద్రగుప్తుడు సాహిత్యంలోనే గాక సంగీతంలో గూడ అభిమానము, ప్రవేశము కలవాడు. అతడు నాణెముల మీద తాను వీణ వాయిస్తున్నట్లు ముద్రించుకున్నాడు.

వాస్తునిర్మాణాలు : వాస్తు, శిల్ప, చిత్రలేఖనాలు అను మూడు సంబంధిత కళలను ఈ యుగమున పరాకాష్టనొందినట్లు చరిత్రకారులు అభిప్రాయపడినారు. గుప్త ప్రభువులు హిందూదేవాలయ నిర్మాణానికి తొలి రూపకల్పన చేశారు. నాటి ఆలయాలలో దేవగడ్‌లోని దశావతార దేవాలయం, టిగావాలోని విష్ణువు ఆలయం. భూమ్రాలోని శివాలయం, నాచ్నకుతారాలోని పార్వతి ఆలయం ప్రధానమైనవి. బౌద్ధాలయాలలో సాంచి, సారనాథ్‌లలోని స్థూపాలు పేర్కొనదగినవి. ఈ స్థూపాలు గుప్తయుగంన నూతన శోభను సంతరించుకొన్నాయి.

శిల్పకళ : గుప్త యుగంనాటి శిల్పకళలో కొన్ని మార్పులు సంభవించినాయి. గుప్తయుగ శిల్పం గాంధార శిల్ప ప్రభావం నుండి విముక్తి పొంది కేవలం దేశీయమైన ప్రతిభావిశేషాలను ప్రదర్శించసాగింది. ఈ మార్పులు దేవగడ్, టిగావా, భూమ్రా ఆలయాలలోని శిల్పాలలో గోచరిస్తాయి. వీరు నిర్మించిన దేవతా విగ్రహాలు దైవభక్తికి, ఆధ్యాత్మిక ఔన్నత్యానికి చిహ్నాలుగా కనిపిస్తాయి. ఈ యుగంలో శివతత్వానికి రూప కల్పన జరిగింది. శివునికి ఏకముఖ చతుర్ముఖ, బహుముఖ లింగాకార కృతి కల్పింపబడింది. అర్ధ నారీశ్వర విగ్రహాలు కూడా ఈ యుగంలోనే తయారయినాయి. మధుర, సాంచి, సారనాథలలో లభించిన బుద్ధ, బోధిసత్త్వుల విగ్రహాలు నాటి బౌద్ధ శిల్పాలకు ప్రతీకలు. ఈ విగ్రహాలలో బుద్ధుని చిరునవ్వు, అతని నిర్మల ధ్యానముద్ర కనబడతాయి. వీటిలో సారనాథ్ దగ్గర వున్న పద్మాసన బుద్ధ విగ్రహం, మధుర మ్యూజియంలో వున్న బుద్ధ విగ్రహం ప్రముఖమైనవి.

గుప్తుల లలితకళలలో ఎర్రమట్టితో బొమ్మలు (Terra Cotta) చేయడం ఒక ప్రత్యేకత. ఈ బొమ్మలు పేదల శిల్ప విగ్రహాలు . ఆనాడు ఎర్రమట్టితో తయారుచేయబడిన, విష్ణువు, సూర్యుడు, దుర్గ, గంగ, యమున బొమ్మలు, అనేక రకాల స్త్రీ పురుషుల బొమ్మలు, రకరకాల జంతువుల బొమ్మలు లభించినాయి.

**చిత్రకళ :** శిల్పకళయందే గాక చిత్రకళయందు గూడా గుప్తయుగ కళాకారులు అత్యంత నేర్పరులు. కుడ్యచిత్రాలను చిత్రించడంలో వీరు పేరుగాంచారు. అజంతాలో 16, 17, 18, 19 సంఖ్యలుగల గుహలలోని చిత్రాలు, బాగ్ గుహలలోని చిత్రాలు గుప్తుల కాలంలో చిత్రింపబడినవే.

**లోహకార కళ :** లోహకార కళ గూడా గుప్తయుగమున ఉన్నత శిఖరాలను అందుకొన్నది. లోహములను కరిగించి విగ్రహములను పోతపోయు పరిశ్రమ పలువురి ప్రశంసలను అందుకొన్నది.

**నాణాలు :** గుప్త చక్రవర్తులు బంగారు, వెండి, రాగి లోహములతో అనేక రకాలైన నాణాలను ముద్రించారు. సాధారణంగా గుప్తరాజుల ప్రతిమలు పైభాగాన, రెండవ వైపున సరస్వతి లేక లక్ష్మి లేక దుర్గ దేవతల ప్రతిమలు ఉండేవి.

## 13. 8 వలసలు - సంస్కృతి వ్యాప్తి

గుప్త ప్రభువులు విదేశములతో సన్నిహిత సంబంధములను ఏర్పరచుకొన్నారు. ఆ కాలమున మన దేశమునకు మధ్య ఆసియా, ఆగ్నేయ ఆసియా, చైనా, యవన, రోమన్, అస్సీరియా, ఈజిప్టు దేశములతో వర్తకము జగిపింది. భారతీయులు బలి, జావా మున్నగు తూర్పు ఇండియా యాదవులకు పోయి వర్తకం చేయుటయే గాక అచట వలసలు ఏర్పరచుకొని హిందూమతమును, భారతీయ సంస్కృతిని వ్యాపింపజేసినారు.

## 13. 9 గుప్తయుగ వైశిష్ట్యం

గుప్తుల కాలమున భారతదేశంలో సర్వతోముఖాభివృద్ధిని సాధించి అపూర్వ వైభవమును అనుభవించింది. కనుకనే ఆ యుగం స్వర్ణయుగమని పేరొందింది. సమర్థులైన గుప్తరాజుల పాలనలో రాజకీయ ఐక్యత చేకూరి సుస్థిర ప్రభుత్వం ఏర్పడింది. గుప్త ప్రభువులు సమర్దులు, విజ్ఞులు. వీరి రాజ్యం సంక్షేమ రాజ్యంగా విలసిల్లింది. అధికారుల దమనకాండ లేక ప్రజలు సుఖించారు. ప్రజోపయోగ నిర్మాణాలు యెడ ప్రభుత్వం శ్రద్ధ వహించింది. బీదలకు, అనాధలకు, ఉచిత వైద్యసౌకర్యం కల్పించి వైద్యాలయాలు నిర్మింపబడినాయి సమర్థులైన గుప్తుల పాలనలో సుఖశాంతులు నెలకొని ఆర్థికాభివృద్ధి జరిగింది. వ్యవసాయం, పరిశ్రమలు, వాణిజ్యం ప్రోత్సహింపబడి దే ఆర్థికాభ్యుదయానికి దోహదం చేశాయి. ఈ యుగమున వైదిక మతం ఆధునిక హిందూ మతంగా రూపొందింది. గుప్తరాజుల హిందువులయిన అన్యమతాలను ఆదరించారు. మత ప్రమేయం లేకుండా ఉన్నతోద్యోగాలలో బౌద్ధులను, జైనులను నియమించారు వీర పోషణలో సంస్కృత సాహిత్య సృష్టి పరాకాష్ట నందుకొన్నది. శాస్త్ర విజ్ఞానం పరిణతి చెందింది. కళలు వికసించాయి. భారత సంస్కృతి విదేశాలలో ప్రతిష్ఠింపబడింది. ఈ విధంగా రాజకీయ, సాంఘిక, ఆర్థిక మత వ్యవస్థలు, విద్య, సాహిత్యం, కళలు, మున్నగు అన్ని రంగములందును ఎనలేని ప్రగతిని సాధించుటవలన గుప్తయుగమును స్వర్ణయుగమనుట ఎంతయో తగియున్నదని అనేకమంది చరిత్రకారులు అభిప్రాయపడుచున్నారు.

కాని వరాహమిహిరుని బృహత్సంహితలో పేర్కొనబడిన ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా గుప్తయుగాన్ని స్వర్ణయుగంగా వర్ణించడంలో గల సామంజస్యాన్ని యస్.కె. మెయిటీ వంటి చరిత్రకారులు సందేహిస్తున్నారు. సామాజిక అసమానత, శూద్రుల, పంచముల దుస్థితి గూడ విమర్శింపబడింది. ఫాహియాన్ వర్ణించిన సౌఖ్యప్రదమైన జీవితాలు ఉన్నత వర్గాల వారికే పరిమితమైనాయని సామాన్యుల పరిస్థితి సంతృప్తికరంగా లేదని వీరి అభిప్రాయం. ఈ యుగంలో ఉన్నట్లు చెప్పబడుతున్న కొందరు ప్రముఖ కవులు, శాస్త్రజ్ఞులు వాస్తవానికి అపుడు లేరని కొందరి వాదన.

రాజకీయ క్యత, , సమర్థవంతమైన పరిపాలన, మత సామరస్యం, సాహిత్యాభివృద్ధి శాస్త్ర ప్రగతి, కళాభ్యుదయం - ఈ రంగాలలో మాత్రం గు యుగం స్వర్ణయుగమని నిస్సందేహంగా చెప్పవచ్చును.

## సారాంశము

గుప్త ప్రభువులు ఉత్తర హిందూ స్థానమున సామ్రాజ్య నిర్మాణము చేయుటయే గాక ప్రజానురంజకమైన పాలనా వ్యవస్థను నెలకొల్పినారు.

నాటి సమాజం వర్ణవ్యవస్థతో కూడినది. సంఘంలో బ్రాహ్మణులదే అగ్రస్థానం. శాస్త్రపాండిత్యం వలన, అగ్రహారాల వలన వారి ప్రాధాన్యత పెరిగింది.

వ్యవసాయం ప్రజల ప్రధానవృత్తి. ప్రభుత్వం వ్యవసాయాన్ని ప్రోత్సహించింది. వస్త్ర పరిశ్రమ, లోహపరిశ్రమ ప్రధాన పరిశ్రమలు. దేశీయ, విదేశీయ వ్యాపారం ముమ్మరంగా సాగింది.

ఈ యుగంలో ప్రధాన మత పరిణామాలు సంభవించినాయి. హిందూమతం భక్తి ప్రధానమైన నేటి హిందూమతంగా పరిణమించింది.

విద్యావంతులైన గుప్త ప్రభువులు విద్యాసంస్థలను, సంస్కృత సాహిత్యాన్ని పోషించినారు. గుప్తరాజుల పోషణలో వాస్తు, శిల్ప, చిత్రకళలు ఉన్నత శిఖరాలను అందుకొన్నాయి.

గుప్తయుగంలో ఆగ్నేయ ఆసియా దేశాలలో వలసలు స్థాపింపబడి, హిందూమతం, భారతీయ సంస్కృతి వ్యాపించింది.

రాజకీయ ఐక్యత, ఆర్థికాభ్యుదయం సాధించి, సాహిత్యసృష్టి, కళావికాసములకు దోహదం చేసి గుప్తులు తమ పాలనాకాలాన్ని స్వర్ణయుగం చేశారు.

## ఉపయుక్త గ్రంథాలు


1. R.C. Majumdar, H.C. Raychaudhari & K.K. Datta : An Advanced History of India
2. K.A. Nilakanta & Sastri, G. Srinivasachari : Advanced History of India
3. K.M. Panikkar : A survey of Indian History
4. K.A. Nilakanta Sastri : A History of South India
5. R.C. Makumdar (Ed) : A History and culture of the Indian People Vol III. The Classical Age.
6. R.C.Majumdal (Ed) : A comprehensive History of India Vol III Parts I & II
7. R.C. Majumdar & A.S. Altekar (Ed) : Age (C.200 - 550 A.D)
8. R. Sathianathaier : A political and Cultural History of India - Vol I
9. Romila Thapar : A History of India - Vol I
10. B.L. Lunia : Life and Culture in Ancient India
11. B.S.L. Hanumantha Rao & K. Basaveswara Rao : Indian History and Culture - Vol I
12. S. Natarayan & Prema Ramakrishna : Political and Culture History of India - Vol - I
13. Shri Ram Gopal : A History of the Imperial Guptas.
14. R.K. Mookerji : The Gupta Empire
15. B.N. Puri : History of Indian Administration Vol I
16. S.K. Maity : Economic Condition of North India During Gupta preriod
17. B.G. Gokhale : Samudragupta.
18. వారణాసి యశోదాదేవి : భారతదేశ చరిత్ర - సంస్కృతి ప్రథమ భాగము

## ప్రశ్నలు

వ్యాస ప్రశ్నలు : (Essay Questions)

1. గుప్తుల పరిపాలనా విధానములోని ప్రధానంశములేవి ?
2. గుప్త యుగమున సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితులు ఎట్లుండెను ?
3. గుప్త ప్రభువుల సారస్వత కళాపోషణలను గూర్చి నీకేమి తెలియును ?
4. గుప్తుల పాలనాకాలము స్వర్ణయుగమా ? వివరింపుము ?

II. లఘువ్యాస ప్రశ్నలు (Short Essay Questions)

1. గుప్తుల కేంద్ర పాలనా వ్యవస్థలోని ముఖ్యాంశములేవి ?
2. గుప్త యుగంలో మత పరిణామములు ఎట్లుండెను ?
3. తమ రాజ్య ఆర్థికాభ్యుదయ సాధనకు గుప్తులెట్లు కృషి చేసినారు ?
4. గుప్త యుగ సామాజిక పరిస్థితులెట్లుండెను ?
5. సారస్వతాభివృద్ధికి గుప్తరాజులు ఏవిధంగా దోహదం చేశార
6. గుప్తుల కళాసేవలను వివరింపుము.

II. లఘు వ్యాఖ్యలు (Short Notes)

1. గుప్తుల స్థానిక పాలన
2. గుప్త సమాజంలో స్త్రీ స్థానము
3. నవ హిందూమతం
4. శ్రేణులు
5. కాళిదాసు
6. నవరత్నాలు
7. గుప్తుల శిల్పకళ
8. గుప్తుల నాణాలు

IV. కుశాగ్ర బుద్ధి పరీక్ష (Objectiv Type Questions)

I. క్రింది దానికి సరియైన సమాధానములు బ్రాకెట్లలో వ్రాయుండి.

1. గుప్త ప్రభుత్వం
   ఎ) గణతంత్ర   బి) శిష్టపాలన
   సి) రాజరికము   డి) దుష్టపాలన   ఇ) అధిక సంఖ్యాకుల పాలన

2. గుప్త రాజ్యంలో రాష్ట్రపాలనాధిపతి
   ఎ) సంధివిగ్రహకుడు   బి) మహాదండనాయకుడు
   సి) ఉపారికుడు   డి) శ్రేష్ఠి   ఇ) కుమారామాత్యుడు

3. దేవీ చంద్ర గుప్త నాటక కర్త

ఎ) శూద్రకుడు బి) విశాఖదత్తుడు

సి) వసుబంధుడు డి) సుబందు ఇ) పాణిని

4. సంగీతాభిమాని అయిన గుప్త చక్రవర్తి

ఎ) స్కందగుప్తులు బి) పురుగుప్తుడు

సి) చంద్రగుప్త విక్రమాదిత్యుడు డి) సముద్రగుప్తుడు ఇ) కుమారగుప్తుడు

5. తర్క శాస్త్ర పిత

ఎ) వసుబంధుడు బి) వరామిహుడు

సి) దిజ్నాగుడు డి) భావవివేకుడు ఇ) వాగ్భటుడు

II. ఈ క్రింది వానిని జతపర్చుము

1. కాళిదాసు ( ) (ఎ) అష్టాధ్యాలు
2. శూద్రకుడు ( ) (బి) అష్టాంగసంగ్రహం
3. వరాహమిహిరుడు ( ) (సి) వాస్తవదత్త
4. ఆర్యభట్టు ( ) (డి) రఘువంశం
5. వాగ్భటుడు ( ) (ఇ) మృచ్ఛకటికం
6. పాణిని ( ) (యఫ్) ముద్రారాక్షసం
7. పతంజలి ( ) (జి) బృహత్సంహితం.
8. సుశ్రుతుడు ( ) (హెచ్) సూర్య సిద్ధాంతం
9. సుబంధు ( ) (ఐ) మహాభాష్యం
10. విశాఖ దత్తుడు ( ) (జె) శస్త్ర చికిత్స

3. భారతదేశ రేఖాపటంలో దిగువ పట్టణాలను గుర్తించండి.

(1) సాంచి (2) సారనథ్ (3) మధుర (4) నలంద (5) తామ్రలిప్తి (6) భరుకచ్ఛం.

**జవాబులు**

1. 1-సి, 2-సి, 3-బి, 4-డి, 5-సి.
2. 1-డి 2-ఇ 3-జి, 4-హెచ్, 5-బి 6-ఎ 7-ఐ 8-జె 9-సి 10 యఫ్

## అభ్యాసాలు

1. గుప్తయుగ విశేషములేవి ?
2. భారతదేశ రేఖాపటమున వైష్ణవ, శైవ, బౌద్ధలయ స్థలములను గుర్తించుము.

పాఠ్యం - 14

# హర్షవర్ధనుడు - హుయాన్‌సాంగ్

## 14.1. లక్ష్యం :

గుప్త సామ్రాజ్య పతనానంతరం ఉత్తర హిందూస్థానంలో తలెత్తిన స్వతంత్ర రాజ్యాలను పేర్కొంటూ పుష్యభూతి వంశీయుడగు హర్షవర్ధనుడు వివిధ రంగాలలో సాధించిన విజయాలను, అతని కాలంలో భారతదేశం సందర్శించిన చైనా యాత్రికుడు హుయాన్‌సాంగ్ యాత్ర విశేషాలను వివరించడమే ఈ పాఠం ప్రధానోద్దేశం.

ముఖ్యాంశాలు :

14.2. ఆధారాలు

14.3. పుష్యభూతి వంశం

14.4. రాజ్యవర్ధనుడు

14.5. హర్షవర్ధనుడు

14.6. హుయాన్‌సాంగ్

14.7. సారాంశము

## 14.2. ఆధారాలు

గుప్త యుగానంతర పరిస్థితులను తెలిసికొనుటకు అనేక ఆధారాలు ఉన్నాయి. అవి:

1. శాసనాలు-అనంతర గుప్తులు, మౌఖరుల, మైత్రకుల, బాదామి చాళుక్యులు, యశోవర్మ, గౌడ శశాంకుని, హర్షుని శాసనాలు.
2. హర్షుని కాలం నాటి నాణాలు, ముద్రలు
3. బాణుని హర్షచరిత్ర, కాదంబరి
4. హుయాన్‌సాంగ్ రచన (సి.యూ.కి)
5. చైనా బౌద్ధ సన్యాసి హు-లీ- రచించిన హుయాన్‌సాంగ్ జీవిత చరిత్ర
6. నలందా శిధిలాలు.

గుప్త సామ్రాజ్య పతనానంతరం ఉత్తర భారతదేశం లో రాజకీయ ఐక్యత నశించి అనేక చిన్న చిన్న ప్రాంతీయ రాజ్యాలు తలెత్తాయి. ఈ రాజ్యాధిపతులు అంతర్యుద్ధాలలో నిమగ్నులగుటవలన దేశంలో సుస్థిరత కరువయ్యింది. కొన్ని చిన్న రాజ్యాలు అనంతర గుప్తులు, మైత్రకులు, మౌఖారులు, పుష్యభూతి వంశము మొదలగునవి.

**14.3. పుష్య భూతి వంశం :** స్థానేశ్వర రాజ్యస్థాపకులు పుష్యభూతి వంశీయులు పుష్యభూతి అను శివభక్తుని పేర ఈ వంశనామము ఏర్పడినట్లు బాణుని హర్షచరిత్రను బట్టి తెలుస్తుంది. ఈ వంశం వారికి స్థానేశ్వరము రాజధాని. ఈ వంశంలో నరవర్ధనుడు,

రాజ్యవర్ధనుడు అను మొదటి ఇద్దరు ప్రభువులు నామ మాత్రులు, వీరు మౌఖరుల సామంతులై వుండవచ్చు. మూడవవాడైన ఆదిత్య వర్ధనుడు మౌళ్వరాజగు మహాసేనగుప్తుని సోదరిని పెండ్లియాడి తన బలాన్ని పెంచుకున్నాడు. ఇతని కుమారుడే ప్రసిద్ధి చెందిన పరమ భట్టారక, మహారాజాధిరాజ ప్రభాకరవర్ధనుడు (క్రీ.శ. 580-605) ఇతని భార్య యశోమతిదేవి. ఈ దంపతులకు రాజ్యవర్ధనుడు, హర్షవర్ధనుడను, ఇద్దరు కుమారులు, రాజ్యశ్రీ అను కుమార్తె కలరు. రాజ్యశ్రీ కనూజ్ పాలకుడగు గృహవర్మను వివాహమాడింది. ప్రభాకరవర్ధనుడు పలుమారులు హూణులతో పోరాడి హూణహరిణాలకు సింహము వంటివాడని ప్రసిద్ధి చెందాడు. ఇతడు మౌఖరి, మౌళ్వ రాజ్యాల మధ్య జరిగిన యుద్ధాలను అవకాశంగా తీసికొని తన రాజ్యాన్ని విస్తరింపజేశాడు. క్రీ.శ. 604లో స్థానేశ్వర రాజ్యంపై హూణ దండయాత్ర జరిగింది. రాజ్యవర్ధనుడు, హర్షవర్ధనుడు హూణులతో పోరాడుచున్న సమయంలో ప్రభాకరవర్ధనుడు మరణించినాడు.

## 14.4. రాజ్యవర్ధనుడు

తండ్రి మరణానంతరం రాజ్యవర్ధనుడు స్థానేశ్వర ప్రభువయినాడు. ఈలోపు రాజ్యవర్ధనునికి మరొక ఉపద్రవం ఎదురయింది. మౌళ్వరాజైన దేవగుప్తుడు కనూజ్‌పై దండెత్తి వెళ్ళి గృహవర్మను వధించి రాజ్యశ్రీని చెరసాలలో నిర్బంధించినట్లు వర్తమానం అందింది. గృహవర్మ మరణానికి ప్రతీకారం తీర్చుకొనుటకు, రాజ్యశ్రీని రక్షించుటకు రాజ్యవర్ధనుడు కనూజ్‌పై దాడికి వెడలి దేవగుప్తుని ఓడించి వధించినాడు. కాని అతని మిత్రుడు, గౌడరాజు అయిన శశాంకుడు మాయోపాయంతో రాజ్యవర్ధనుని కడతేర్చినాడు. ఇట్టి క్లిష్ట పరిస్థితులలో హర్షవర్ధనుడు స్థానేశ్వర సింహాసనం అధిష్టించినాడు.

## 14.5. హర్షవర్ధనుడు (క్రీ.శ. 606-647)

భారతదేశము నేలిన ప్రముఖ చక్రవర్తులలో హర్షుడు ఒకడు. పుష్యభూతి వంశీయులలో ఇతడు అగ్రగణ్యుడు. హర్షుడు గొప్ప విజేత. సమర్థుడగు పాలకుడు, మహాపండితుడు. గుప్తుల తరువాత ఉత్తర భారతమున రాజకీయ ఐక్యతను సాధించి నాటి వైభవమును స్మరణకు తెచ్చి సకలోత్తరపథనాథునిగా గణతికెక్కినాడు. శాంతి భద్రతలను పరిరక్షించి, ప్రజానురంజక పాలన నెలకొల్పి, సాహిత్యవేత్తగా సాహిత్య పోషకునిగా పేరుపొంది ప్రాచీన భారతదేశ చరిత్రలో చివరి గొప్ప హిందూ ప్రభువుగా పరిగణింపబడినాడు. చరిత్ర పుటలలో హర్షుడు ఆకర్షణీయమైన వ్యక్తిత్వంతో వెలుగొందుచున్నాడని రాలిన్సన్ పేర్కొనినాడు.

(i) **ఆధారాలు :** హర్షుని గూర్చి తెలిసికొనుటకు అనేక ఆధారాలు ఉన్నాయి. అవి (1) హర్షుని మధువనీ, సోనాపేట్, బన్సేరా శాసనాలు, రెండవ పులకేశి, ఐహోల్ శాసనం (2) హర్షుని నాణాల్ను, ముద్రలు (3) బాణుని హర్షచరిత్ర (4) హర్షుని నాటకాలు (5) హుయాన్‌సాంగ్ రచనలు.

(ii) **సింహాసనమధిష్ఠించుట :** హర్షుని సోదరుడు రాజ్యవర్ధనుడు గౌడ శశాంకుని కుట్రకు బలియైనాడు. సోదరి రాజ్యశ్రీ చెరసాల పాలయింది. ఇట్టి క్లిష్ట పరిస్థితులలో హర్షుడు మంత్రి మండలి సలహా పై క్రీ.శ. 606 లో స్థానేశ్వర సింహాసనం అధిష్టించినాడు.

(iii) **హర్షుని విజయపరంపర :** హర్షుడు సింహాసనం అధిష్టించిన వెంటనే కామరూప పాలకుడగు భాస్కరవర్మతో సంధి చేసుకొని కనూజ్‌పై దండెత్తినాడు. ఈ సంధి హర్షుని రాజనీతికి నిదర్శనం. దీనితో గౌడరాజ్యం పశ్చిమ, తూర్పు దిశల నుండి దండయాత్రకు గురియగు ప్రమాదం ఏర్పడింది. కాని ఈలోపు రాజ్యశ్రీ చెరసాల నుండి తప్పింపబడి వింధ్యాడవులకు పారిపోయినట్లు సమాచారం అందింది. వెంటనే హర్షుడు వింధ్యాడవులకేగి దివాకర మిత్రుడను బౌద్ధ భిక్షువు సాయంతో అగ్ని ప్రవేశం చేయబోవు రాజ్యశ్రీని రక్షించాడు. ఇంతలో శశాంకుడు కనూజ్ నుండి మరలి పోయినాడు. అంతట పురప్రముఖులు మంత్రుల ఆహ్వానం మేరకు హర్షుడు కనూజ్‌ను ఆక్రమించినాడు. కనూజ్ రాజధానిగా స్థానేశ్వర, కనూజ్ రాజ్యాలను విలీనం చేసి శిలాదిత్యుడను బిరుదుతో పట్టాభిషిక్తుడయినాడు. కనుజ్ (కన్యాకుబ్జం) అతని రాజధానిగా అయింది. కనూజ్ రాజ్యాధిపత్యతని ప్రతిష్ఠను, అధికారాన్ని, ఆర్థిక వనరులను పెంచింది. చైనీయుల రచనల ప్రకారం హర్షుడు రాజ్యశ్రీ, కలసి క్రీ.శ. 612 వరకు కనూజ్ రాజ్యం పాలించినట్లు తెలుస్తుంది. హర్షుడు అపార సేనావాహినితో ఆరు సంవత్సరాలపాటు నిరంతర పోరాటం సాగించి (తూర్పు పంజాబు), కన్యాకుబ్జం, గౌడ, మిథల, ఉత్కళ (ఒరిస్సా) జయించి ఉత్తర హిందూస్థానమున తన రాజ్యాధికారాన్ని విస్తరింపజేసినట్లు హుయాన్‌సాంగ్ రచనలు తెలియజేస్తున్నాయి.

(iv) **తూర్పు దిగ్విజయయాత్ర :** పూర్ణవర్మను ఓడించి మగధరాజ్యంలో తమ సామంతునిగా నియమించినాడు. మ...లో ఉన్న అయోధ్య, ప్రయాగ, శ్రావస్తి, కజంగల మున్నగు చిన్న రాజ్యాలవారు అతని ఆధిపత్యాన్ని గుర్తించినారు. తుదకు ఉంద్ర వర్ధనం సమీపంలో జరిగిన యుద్ధంలో శశాంకుని ఓడించి పుండ్రవర్ధన ప్రాంతాన్ని వశపర్చుకున్నాడు. క్రీ.శ. 619 వరకు శశాంకుడు బెంగాలు, దక్షిణ బీహారు, ఒరిస్సాలపై ఆధిపత్యం వహించినట్లు శాసనాలు, నాణాలు, బౌద్ధ రచనలు తెల్పుచున్నాయి. కావున శశాంకుడు క్రీ.శ. 620 లో మరణించిన తరువాతనే ఆ ప్రదేశాలను హర్షుడు ఆక్రమించి ఉండవచ్చు. శశాంకుని మరణానంతరం హర్షుడు రెండవ పర్యాయం అతని రాజ్యంపై దండెత్తి వెళ్లి సమతత్త (తామ్రలిప్తికి తూర్పు ప్రాంతం) తామ్రలిప్తి, కర్ణసువర్ణలను జయించి శశాంక మండలాన్ని తన సామ్రాజ్యంలో చేర్చినాడు.

(v) **పశ్చిమ దిగ్విజయయాత్ర :** కనూజ్ పశ్చిమ వైపునగల స్థానేశ్వర రాజ్య భాగాలపై గూడా తన అధికారం స్థిరపర్చుకొనుటకు హర్షుడు దండయాత్ర నిర్వహించాడు. తత్ఫలితంగా కపిథ (నేటి సంలిస) అదించ్ఛత్ర (తూర్పు రోహిల్ఖండ్), గొవిసన (కాశీపూర్ సమీప ప్రాంతం) బహ్మపుర (గఢ్వాల్, కుమావూన్ ప్రాంతం) మటిపుర (నేటి మదవార్) స్థానేశ్వర, మధుర, పరియాత్ర (జయపూర్ ఉత్తర ప్రాంతం) శతద్ర (సర్‌హింద్) కలూట (కుల్లు) జలంధర, చనభక్తి (తూర్పు పంజాబు) మున్నగు ప్రాంతాలు హర్షుని అధికారం గుర్తించినాయి.

(vi) **మాళ్వ :** దేవగుప్తుని సోదరుడు మాధవగుప్తుని మాళ్వ సింహాసనంపై నిలిపి హర్షుడు అతనిని తన సామంతునిగా చేసుకొన్నాడు.

(vii) **వలభిరాజ్యం :** రెండవ ధ్రువసేనుడు వలభి రాజ్య వల్లభుడు హర్షుడు రాజ్యంపై క్రీ.శ. 630 లో దండయాత్ర జరిపి ధ్రువసేన పరాజితునిగావించి అతనికి తన కుమార్తెనిచ్చి పెండ్లి జరిపించి బాంధవ్యం ఏర్పరుచుకొన్నాడు. తాను జయించిన పశ్చిమ మాళ్వ కొంతభాగాన్ని వలభి రాజ్యంలో చేర్చినాడు.

(viii) **రెండవపులకేశితో యుద్ధం :** రెండవ పులకేశి సుప్రసిద్ధ బాదామి చాళుక్య. హర్షుడు రెండవ పులకేశితో యుద్ధానికి తలపడ్డాడు. క్రీ.శ. 634 లో నర్మదానది ఉత్తరతీరంలో జరిగిన యుద్ధంలో రెండవ పులకేశి సకలోత్తరపథనాథుడైన హర్షుని ఓడించినాడు.

(ix) **హర్షుని మరణం :** హర్షవర్ధనుడు క్రీ.శ. 647లో మరణించినాడు. అతని మరణంతో ఉత్తర హిందూ దేశంలో రాజకీయ ఐక్యం నశించి అనేక చిన్నచిన్న స్వతంత్ర రాజ్యాలు అవతరించినాయి.

(x) **చైనాతో సంబంధాలు :** హుయాన్‌సాంగ్ ప్రభావం వలన హర్షుడు చైనాతో స్నేహసంబంధాలు నెలకొల్పినాడు. క్రీ.శ. 641 లో హర్షుడు తన రాయబారిని చైనా పంపినాడు.

(xi) **హర్షుని పరిపాలన :** హర్షుడు గొప్ప విజేతయేగాక సమర్థుడైన పాలకుడు ప్రజాసంక్షేమమును పెంపొందించుటలో అతడు ప్రత్యేక శ్రద్ధ వహించాడు.

(xii) **దానధర్మాలు :** హర్షుడుగొప్ప దానశీలి. బీదలకు, అనాథలకు దాన ధర్మాలు చేయుటలో హర్షుడు అశోకుని ఆదర్శంగా భావించాడు. పేదలకు, రోగులకు, బాటసారులకు ధర్మశాలలు నిర్మింపబడినాయి. అచట అన్నపానాదులు, మందులు సమకూర్చబడినాయి.

(xiii) **హర్షుని మతం :** హర్షుని మతాన్ని గురించి భిన్నాభిప్రాయాలు ఉన్నవి. ఇతడు అశోకునివలె బౌద్ధమతం స్వీకరించి ప్రచారం చేశాడని ఒక అభిప్రాయం. తన పూర్వీకుల వలె హర్షుడు గూడా శైవుడని పెక్కుమంది చరిత్రకారుల విశ్వాసం. అతని నాణాలు ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నాయి. ప్రయాగసభలో బుద్ధునితోపాటు తనకుల దైవమయిన శివుని గూడా అతడు ఆరాధించినాడు. కాలక్రమేణా సోదరి రాజ్యశ్రీ, చైనా యాత్రికుడు హుయాన్‌సాంగ్‌ల ప్రోద్బలం వలన హర్షుడు బౌద్ధమతం వైపు మొగ్గినట్లు తెలుస్తుంది. బౌద్ధమతాభిమానిగా హర్షుడు తన సామ్రాజ్యమంతటా జంతువధను నిషేధించాడు. అశోకుని వలె గంగా మైదానంలో పెక్కుస్థూపాలను, విహారాలను నిర్మించాడు. కాశ్మీరు రాజునుండి తెచ్చిన బుద్ధధాతువును ఒక స్థూపమున నిక్షేపించినాడు. కనూజ్‌లో 100 అడుగుల ఎత్తుగల గోపురంతో ఒక మహావిహారమును నిర్మించి అందులో నిలువెత్తు బంగారు బుద్ధ విగ్రహాన్ని ప్రతిష్ఠించినాడు.

(xiv) **సాహిత్య పోషణ :** హర్షుడు కవి పండిత పోషకుడేగాక తాను స్వయంగా విద్వత్కవి. అతడు సంస్కృతంలో నాగానంద, రత్నావళి, ప్రియదర్శిక అను మూడు గొప్ప నాటకాలను రచించినాడు. నాగానంద నాటకం జపానులో గూడా బాగా ప్రాచుర్యం పొందినది. అతని ఆస్థానంలో బాణభట్టు, మయూరుడు, మతంగుడు, దివాకరుడు, భర్తృహరి, జయసేనుడు అను గొప్ప సంస్కృత కవులు ఉండేవారు. వారిలో బాణుడు సుప్రసిద్ధుడు. అతడు కాదంబర, హర్షచరిత్రలను రచించాడు. భర్తృహరి నీతి, శృంగార, వైరాగ్య శతకాలను, మయూరుడు, సూర్య శతకాన్ని రచించినారు. హర్షుడు విద్యావ్యాప్తికి కృషిచేసి ప్రభుత్వ ఆదాయంలో నాలుగవ వంతు కవి పండితుల పోషణకు వినియోగించినాడు. నలందా విశ్వ విద్యాలయ నిర్వహణకు 100 గ్రామాల ఆదాయం కేటాయించినాడు.

(xv) **హర్షుని ఘనత :** పరాక్రమశాలి, విజేత, సమర్ధుడైన పాలకుడు, కవి, కవిపోషకుడు అయిన హర్షవర్ధనుడు మౌర్య, గుప్త చక్రవర్తుల ఘనతకు వారసుడని చెప్పవచ్చు. హర్షుడు తన జైత్రయాత్రలచే సముద్రగుప్తుని వలె ఉత్తర భారతదేశంలో విశాల సామ్రాజ్యం నెలకొల్పినాడు. అతని రాజ్యం సామ్రాజ్యంగా రూపొందింది. సకలోత్తర పథేశ్వరునిగా సమకాలీన ప్రభువులు అతనిని గుర్తించినారు. అశోకుని వలె ప్రజా సంక్షేమ సాధనకు, వారి ఆర్థికాభ్యుదయానికి ఆధ్యాత్మిక ఔన్నత్యానికి కృషిచేసినాడు. చంద్రగుప్త విక్రమాదిత్యునివలె కవిపోషకుడు. అన్ని మతాలను సమంగా ఆదరించిన సహనశీలి. దానశీలం హర్షుని విశిష్ట లక్షణం.

### 14.6. హుయాన్‌సాంగ్ :

1. హుయాన్‌సాంగ్ చైనాదేశపు బౌద్ధ యాత్రికుడు. ఇతనికి యాత్రిక చక్రవర్తి, అపరశాక్యముని, తాత్విక చక్రవర్తి అను బిరుదులు కలవు. క్రీ.శ. 600 సంవత్సరంలో జన్మించిన హుయాన్‌సాంగ్ తన 20 వ ఏట సన్యసించి బౌద్ధ పుణ్యక్షేత్రములను దర్శించుటకు, బుద్ధుని అస్థికలు, బౌద్ధ మతగ్రంథాలు సేకరించుటకు భారతదేశం సందర్శించ నిశ్చయించినాడు. తగిన అనుమతి పత్రాలు లభించనందున ఇతడు రహస్యంగా చైనా వదలి తాష్కెంట్, సమర్ఖండ్, బాక్ట్రియాల మీదుగా గాంధారము చేరినాడు. హుయాన్‌సాంగ్ క్రీ.శ. 630 నుండి 644 వరకు భారతదేశములోని వివిధ ప్రాంతాలలో పర్యటించినాడు. కాశ్మీరులో రెండు సంవత్సరాలు గడిపి పంజాబు చేరినాడు పిమ్మట బౌద్ధక్షేత్రాలైన కపిలవస్తు, కుశినగరం, ప్రయాగ, కాశి, సారనాథ్, శ్రావస్తి, కౌశాంబి, పాటలీపుత్ర, గయలను సందర్శించినాడు నలందా విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా, ఉపాధ్యక్షునిగా కొంతకాలం గడిపినాడు. కామరూప (భాస్కర్‌వర్మ) కనుజ్ (హర్షుడు) ప్రభువులు అతనిని తమ రాజ్యాలకు ఆహ్వానించి సన్మానించారు. అతడు హర్షునికి ఆప్తమిత్రుడయినాడు. హర్షుడు ఏర్పాటుచేసిన కనుజ్ ప్రయాగ సభలలో సత్కరింపబడినాడు. హుయాన్‌సాంగ్ దక్షిణ హిందూదేశంలోని బాదామి, నాగార్జునకొండ, ధాన్యకటకం, వేంగి, కాంచీనగరాలను గూడా సందర్శించాడు. ధాన్యకటకంలో బౌద్ధ ధర్మాన్ని అభ్యసించినాడు. బుద్ధుని అవశేషాలను, 659 బౌద్ధ మతగ్రంథాలను సేకరించి క్రీ.శ. 644 లో చైనా చేరినాడు. అతడు తన భారతదేశ యాత్రా విశేషాలను సి.యు.కి. అను గ్రంథంలో పొందుపరచినాడు. దీనిని వాటర్స్ (On Yuan Chwangs Travels in India) బీల్ (Buddhist Record of the Western world) అను ఆంగ్ల పండితులు ఆంగ్ల భాషలోనికి చక్కగా అనువదించారు. ఈ గ్రంథం వలన ఆనాటి రాజకీయ, సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితులు చక్కగా తెలుస్తున్నాయి. సమాచార సంపదలోను, వివరణాత్మక విశేషములలోను హుయాన్‌సాంగ్‌కు ఎంతో రుణపడి ఉన్నది అనుట అతిశయోక్తికాదు.

హర్షుని పాలనా నైపుణ్యాన్ని హుయాన్‌సాంగ్ ప్రశంసించాడు. ప్రజల కష్టసుఖాలను, ఉద్యోగుల నడవడిని గూర్చి తెలుసుకొనుటకై హర్షుడు తరచుగా రాజ్యంలో పర్యటించేవాడు. ప్రజలమీద పన్నులభారం తక్కువ. పంటలో ఆరవభాగం మాత్రమే భూమిశిస్తుగా వసూలు చేయబడేది. ఉద్యోగులకు మాన్యముల ద్వారా ప్రతిఫలం ముట్టేది. ప్రభుత్వ వ్యవహారాలన్నీ లిఖిత రూపంలో ఉండేవి. బీదలు, రోగులు, బాటసారులు, మున్నగు వారికి సహాయపడుటకై సామ్రాజ్యం అంతటా ధర్మసంస్థలు నెలకొల్పబడినాయి. బాటసారులకు దొంగలబెడద ఎక్కువ. (హుయాన్‌సాంగ్ కూడా దొంగల దోపిడికి గురియైనాడు). న్యాయం తప్పిన వారికి శిక్షలు కఠినంగా ఉండేవి. నీతి నియమాలు ఉల్లంఘించేవారికి ముక్కు, చెవులు కోయించే శిక్ష ఉండేది. అంగవిచ్ఛేదం, ద్వీపాంతరవాసం మున్నగునవి ఇతర శిక్షలు. పట్టాభిషేక సమయంలో ఖైదీలను విడిచి పెట్టే సాంప్రదాయం ఉంది. ప్రభుత్వ ఆదాయం నాలుగు భాగాలుగా-రాజకుటుంబీకులకు. ఉద్యోగుల సైనికుల జీతభత్యాలకు, సాహిత్య పోషణకు, ధర్మకార్యాలకు - వెచ్చింపబడేది. హర్షుని వద్ద పెద్దసైన్యం ఉండేది.

అందులో లక్ష కాల్బలం, 50 వేల అశ్వబలం, 60 వేల గజబలం ఉండేవట. ఈ బలంతో హర్షుడు తన సామ్రాజ్యాన్ని రక్షించేవాడు. రక్ష భటులు ఎల్లవేళలా రాజభవనాన్ని అప్రమత్తతతో కాపాడేవారు.

**2 సాంఘిక పరిస్థితులు :** నాటి సమాజంలో నాలుగు వర్ణాలు ఉండేవి. వర్ణ వ్యవస్థ కట్టుదిట్టంగా ఉంది. బ్రాహ్మణులు మత విషయాలు నిర్వహించేవారు. క్షత్రియులు రాజ్యపాలన చేసేవారు. వారు స్వాధికార వర్గంగా చెలామణి అవుతూ హక్కులు, అధికారం కలిగి ఉండేవారు. బ్రాహ్మణులకు సమాజంలో గౌరవ ప్రదమైన స్థానం ఉండేది. అందువలన విదేశాలలో భారతదేశాన్ని 'బ్రాహ్మణదేశం' గా పిలిచేవారు. వైశ్యులు, శూద్రులు వ్యవసాయదారులు, పంచముల పరిస్థితి దయనీయంగా ఉండేది. నాటి సంఘంలో అస్పృశ్యత ప్రబలంగా ఉంది. కసాయివారు, మాంసవిక్రేతలు, మరణశిక్షలు అమలు పరచేవారు, పాకీపనివారు నగరం వెలుపల నివసించేవారు.

నాటి ప్రజలు నిరాండబరులు, నిజాయితీపరులు, ఉదారులు, దయాధర్మాలు కలవారు. వారికి మోసం తెలియదు. జగడ స్వభావులు కారు. కష్టజీవులు, ప్రమాణాలన్నా, ప్రతిజ్ఞలన్నా వారికి గౌరవం. ఆడిన మాట తప్పరు. ధనసంబంధమైన లావాదేవీలలో ఎట్టి పత్రాలు ఉపయోగించేవారు కాదు.

**3 ఆర్థిక పరిస్థితులు :** ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. దేశంలో ఎక్కువ భాగం నేలలు సారవంతమైనవి. అనేక రకాల ధాన్యాలు, పండ్లు అపారంగా పండించేవారు. గోధుమ, వరి, చెరకు, మామిడి, నారింజ, ద్రాక్ష, కొబ్బరి, చింతపండు ఆనాటి ప్రధాన పంటలు. మగధప్రాంతంలో పరిమళ భరితమైన వడ్లు పండింపబడేవి. కాశ్మీరు కుంకుమపువ్వుకు ప్రసిద్ధి. సాధారణంగా కులాన్ని బట్టి వృత్తి ఉండేది. వృత్తి మార్పిడులు అరుదు. బహువిధ పరిశ్రమలు వృద్ధిచెందాయి. లోహ, దంత, వస్త్ర, చందన పరిశ్రమలు నాటి ముఖ్య పరిశ్రమలు. రత్నాలు, వజ్రాలు పొదిగిన బంగారు ఆభరణములు తయారుచేయుటలో భారతీయ కళాకారులు నేర్పరులు.

హూణులు దండయాత్రలతో చితికిపోయిన భారతదేశం క్రమక్రమంగా కోలుకుంది. ఆర్థికంగా దేశం సర్వసంపదలతో తులతూగింది. హిందూదేశ సంపద చూచి హుయాన్‌సాంగ్ ఆశ్చర్యచకితుడైయ్యాడు. ప్రజలు ఉన్నత జీవన ప్రమాణాలను అనుభవించారు అని అతడు పేర్కొన్నాడు.

**4 మత పరిస్థితులు :** హుయాన్‌సాంగ్ రచనల ప్రకారం హర్షుని కాలంలో హిందూ, బౌద్ధ జైనమతాలు వ్యాప్తిలో వున్నట్లు తెలుస్తుంది. హిందూమతం బహుళ ప్రజాదరణ పొందింది. కాశి, శ్రీశైలం గొప్ప క్షేత్రాలుగా విరాజిల్లాయి. నాడు శైవంలో కాలాముఖ, కాపాలికాది శాఖలు ఉన్నాయి. తీర్థయాత్రలు, వ్రతాలు, దానధర్మాలు, పండుగల ఉత్సవాలు, ఊరేగింపులు, పురాణశ్రవణం మున్నగునవి మత వ్యవస్థలో ప్రముఖపాత్ర వహించాయి.

**5. విద్యావ్యాసంగం :** హర్షుడు గొప్ప విద్యాపోషకుడు. విద్యాభివృద్ధికి, సాహిత్య పోషణకు ఆదాయంలో నాలుగవ భాగం కేటాయించాడు. ఆ కాలంలో విద్యప్రధానంగా మతపరమైనది. మత సంబంధమైన విషయాలు బోధింపబడేవి. విద్యార్థులు తొమ్మిది సంవత్సరాలనుండి ముప్పయి సంవత్సరాల వరకు గురుకులంలో విద్యనభ్యసించేవారు. విద్యాభ్యాసం ముగిసిన తరువాత విద్యార్థులు గురువులకు దక్షిణ చెల్లించేవారు. తక్షశిల, వలభి, ఉజ్జయిని, కాశి, నాగార్జునకొండ, నలందాలు నాటి ప్రసిద్ధ విద్యాకేంద్రాలు. ఈ కేంద్రాలలో మత విద్యలతోపాటు వ్యాకరణం, తర్కం, తత్వశాస్త్రం, వైద్యం యాంత్రిక విద్యలు బోధింపబడేవి. నాటివిద్యా కేంద్రాలలో అగ్రగణ్యమైనది నలందా విశ్వవిద్యాలయం. ఈ విద్యాలయానికి సంపన్నులు, రాజులు భూరి విరాళాలు ఇచ్చారు. హర్షుడు నూరుగ్రామాలు, ఇతర ప్రభువులు రెండు వందల గ్రామాలు ఈ విద్యాలయానికి దానం చేశారట ! ఇక్కడ విద్యనభ్యసించడానికి చైనా, టిబెట్టు, కొరియా, మంగోలియా, సింహళం మున్నగు విదేశాల నుండి విద్యార్థులు వచ్చేవారు.

## 14.7 సారాంశము

గుప్తుల తరువాత ఉత్తర హిందుస్థానంలో రాజకీయ ఐక్యతను సాధించినవాడు పుష్యభూతి వంశీయుడైన హర్షవర్ధనుడు. స్థానేశ్వర రాజ్య ఔన్నత్యానికి పునాది వేసినవాడు ప్రభాకర వర్ధనుడు. ఆ విధానాన్ని కొనసాగిస్తూ స్థానేశ్వర కనూజ్ రాజ్యాలను ఏకంచేసి తూర్పు దిగ్విజయ యాత్ర జరిపి బెంగాలులోని పుండ్రవర్ధనం వరకు గల భూభాగాన్ని జయించి ఆక్రమించాడు. పశ్చిమ దండయాత్రతో సైన్యక

రాజ్యాధిపత్యం స్థిరపడుటయేగాక సింధూ ప్రాంతంగూడా హర్షుని ఎ... ...ుంది. శశాంకుని మరణంతో అతని శేషరాజ్యభాగాలు హర్షుని సామ్రాజ్యంలో చేర్చబడినాయి. పిమ్మట వలభిరాజ్యధ్రువసేనుని ఓడించి మైత్రి నెరపినాడు. కాని దక్షిణాపథం ఆక్రమించుటకు అతడు చేసిన ప్రయత్నాలు నిష్ఫలమయ్యాయి. హర్షుడు సామ్రాజ్య నిర్మాణంతోపాటు సమర్థమైన పాలనా వ్యవస్థను నెలకొల్పి, ప్రజల స్థితిగతులను తెలిసికొనేందుకు రాజ్యంలో పర్యటించి, వారి సంక్షేమాన్ని పెంపొందించి, సర్వమత సమానత్వాన్ని పాటించి, సాహిత్యాన్ని పోషించి, కవియై గ్రంథరచన చేసినాడు. అతని దానశీలత భారతదేశచరిత్రలో నిరుపమానం.

బౌద్ధక్షేత్రాల్ని దర్శించుటకు, బుద్ధుని అవశేషాలు సేకరించుటకు భారతదేశం వచ్చిన చైనా యాత్రికుడు హుయాన్‌సాంగ్, క్రీ.శ. 63( - 644 మధ్యకాలంలో హర్షుని సామ్రాజ్యంలోను, భారతదేశంలోని యితర ప్రాంతాల్లోను పర్యటించి తాను చూసిన విశేషాలను సి.యు.: అను గ్రంథంలో పొందుపరచినాడు. హర్షుని విజయాలు, పరిపాలన, కనూజ్ మతసమావేశం, ప్రయాగ మహామోక్షపరిషత్, నాటి సాంఘి: ఆర్థిక, మత, విద్యా విషయాలు అందులో చోటు చేసుకొన్నాయి. కావున హర్షవర్ధనుని కాలంనాటి భారతదేశ పరిస్థితులను తెలిసికొనుట: హుయాన్‌సాంగ్ రచనలు అవశ్యపఠనీయాలు.

## ఉపయుక్త గ్రంథాలు


1. Majumdar R.C. Raychaudhari H.C.& Datta K.K. : An Advanced History of India
2. R.C. Majumdar (Ed) : A History and culture of the Indian People Vol III. The Classical Age.
3. R.C.Majumdar (Ed) : A comprehensive History of India Vol III Parts I & III
4. Nilakanta Sastri & G. Srinivasachari : Advanced History of India
5. Romila Thapar : A History of India, Vol I.
6. Sathianathaiyer : A political and cultural History of India, Vol I.
7. Hanumantha Rao, B.S.L Basavaeswara Rao : Indian History and culture, Vol I
8. Natarajan, S and Prema Rama Krishna : Political and cultural History of India Vol I
9. Tripathi R.S : History of Kanuj
10. Chopra P.N. Puri B.N and Das M.N : A social, cultural and Economic History of India Vol I
11. R.K. Mookerji : Harsha
12. Devahuti : Harsha, A political study
13. Baijnath sharma : Harsha and His Times
14. Rawlinson, H.G. : India: A short Cultural History
15. యశోదాదేవి వారణాసి హనుమంతరావు B.S.L : భారతదేశ చరిత్ర - సంస్కృతి, ప్రథమ భాగము తెలుగు అకాడమి ప్రచురణ.


## పుష్యభూతి వంశ వృక్షం

మహారాజ నరవర్ధనుడు - వజ్రినీదేవి.

మహారాజ రాజ్య వర్ధనుడు - అప్సరాదేవి.

మహారాజ ఆదిత్యవర్ధనుడు - మహాసేనగుప్తాదేవి.

పరమభట్టారక, మహారాజాధిరాజ, ప్రభాకర వర్ధనుడు - యశోమతిదేవి.

పరమ భట్టారక పరమభట్టారక
మహారాజాధిరాజ మహారాజాధిరాజ
రాజ్యవర్ధన హర్షవర్ధన
కుమార్తె - వలభి రెండవ ధ్రువసేనుడు

## ప్రశ్నలు

### I. వ్యాస ప్రశ్నలు : (Essay Questions)

1. హర్షుని ఘనతకు కారణములేవి ?
2. హుయాన్ సాంగ్ రచనలు హర్షుని సమకాలీన పరిస్థితులు తెలిసికొనుటకు ఎట్లు తోడ్పడుచున్నవి ?

### II. లఘు వ్యాస ప్రశ్నలు (Short Essay Questions)

1. గుప్త సామ్రాజ్య పతనం తరువాత ఉత్తర భారతదేశంలో అవతరించిన స్వతంత్ర రాజ్యములేవి ?
2. గుప్త యుగంలో మత పరిణామములు ఎట్లుండెను ?
3. హర్షవర్ధనుని పాలనా విశేషములేవి ?
4. హర్షుని కాలంనాటి సాంఘిక, మత, ఆర్థిక పరిస్థితులు హుయాన్ సాంగ్ రచనలలో ఎట్లు ప్రతిబింబిస్తున్నాయి.

### III. లఘు వ్యాఖ్యలు (Short Notes)

1. అనంతరగుప్తులు
2. మౌఖరులు
3. మైత్రకులు
4. గౌడశశాంకుడు
5. కనూజ్ మత మహాసభ
6. ప్రయాగ మహామోక్షపరిషత్
7. హర్షుని సాహిత్యసేవ
8. నలందా విశ్వవిద్యాలయం

### IV. దిగువ వానిలో సరియగు సమాధానాన్ని గుర్తించి బ్రాకెట్లలో వ్రాయుము.

1. యశోధర్మని విజయాలు వర్ణింపబడిన శాసనం. ( )

ఎ) సోనాపేట్ శాసనం బి) ఐహల్ శాసనం
సి) మందసోర్ శాసనం డి) అలహాబాద్ ఇ) మధువన్ శాసనం

2. హూణ హరిణముల పాలిటి సింహంగా వర్ణింపబడినవాడు. ( )

ఎ) నరవర్ధనుడు బి) రాజ్యవర్ధనుడు
సి) ఆదిత్య వర్ధనుడు డి) ప్రభాకరవర్ధనుడు ఇ) హర్షవర్ధనుడు

3. హర్షుని ఓడించిన వాడు ( )

ఎ) శశాంకుడు బి) దేవగుప్తుడు

సి) ధృవసేనుడు డి) రెండవపులకేశి ఇ) కీర్తివర్మ.

4. హర్షుని కాలమున దక్షిణ భారతదేశంలో పర్యటించిన చైనా యాత్రికుడు. ( )

ఎ) ఫాహియాన్ బి) హుయాన్ సాంగ్

సి) ఇత్సింగ్ డి) హులి ఇ) టైచుంగ్.

5. హర్షుడు మహామోక్షపరిషత్తును సమావేశ పరచిన స్థలం ( )

ఎ) నలంద బి) తక్షశిల

సి) కనూజ్ డి) ప్రయాగ ఇ) స్థానేశ్వరం

II. ఈ క్రింది వానిని జతపర్చుము

| "ఎ" గ్రూపు | | "బి" గ్రూపు |
|---|---|---|
| 1. బాణుడు | ( ) | (ఎ) నీతిశతకం |
| 2. హర్షుడు | ( ) | (బి) సూర్యశతకం |
| 3. మయూరుడు | ( ) | (సి) సి-యు-కి |
| 4. భర్తృహరి | ( ) | (డి) హర్షచరిత్ర |
| 5. హుయాన్ సాంగ్ | ( ) | (ఇ) నగానందం |

3. భారతదేశ రేఖాపటంలో దిగువ పట్టణాలను గుర్తించండి.

(1) స్థానేశ్వరం (2) కనూజ్ (3) ప్రయాగ (4) నలంద

**జవాబులు**

1. 1-సి, 2-డి, 3-డి, 4-బి, 5-డి.
2. 1-డి 2-ఇ 3-బి, 4-ఎ 5-సి.

## అభ్యాసాలు

1. పుష్యభూతి వంశీయులు ఉత్తర భారతదేశంలో రాజకీయ సమైక్యతను ఎట్లు సాధించారు.
2. భారతదేశ రేఖా పటంలో హర్షుని కాలంనాటి ప్రముఖ రాజ్యాలను వాటి రాజధానులను గుర్తింపుము.

పాఠం - 15

# రాజపుత్ర యుగం (క్రీ.శ. 650 - 1200)

## 15.1. లక్ష్యం :

హర్షవర్ధనుని మరణానంతరం ఉత్తరాపథమును అయిదున్నర శతాబ్దాలపాటు ఏలిన రాజపుత్రులు పుట్టు పూర్వోత్తరాలను, ప్రముఖ రాజపుత్ర వంశాల చరిత్రను, వారు భారతదేశ సంస్కృతికి చేసిన సేవను వివరించుటయే ఈ పాఠం ప్రధాన లక్ష్యం.

## ముఖ్యాంశాలు :

15. 2 రాజపుత్ర యుగ చరిత్రకు ఆధారాలు.

15. 3 రాజపుత్రుల పుట్టు పూర్వోత్తరాలు

15. 4 ప్రముఖ రాజ పుత్ర వంశాలు.

15.4.1 కనూజ్ నేలిన ఘూర్జరప్రతిహారులు, గహద్వాలులు.

15.4.2 మాళ్వము పాలించిన పరమారులు.

15.4.3 బుందేల్ ఖండపు చందేలులు.

15.4.4 గుజరాత్‌ను పాలించిన సోలంకీలు, వాఘేలులు

15.4.5 చేదినేలిన కాలచుర్యులు

5.4.6 అజ్మీరు, ఢిల్లీలను ఏలిన చౌహానులు.

15.5 సమకాలిన ఇతర ప్రాంతీయ రాజ్యాలు

(1) బెంగాలు బీహారులను పాలించిన పాల, సేవ వంశాలు

(2) కాశ్మీరును పాలించిన కర్కోట, ఉత్పల, లోహర్ వంశాలు.

(3) గాంధార, పంజాబులు నేలిన తురుష్కషాహి, హిందూ షాహి వంశాః

15.6 రాజపుత్ర యుగ విశేషాలు

15.6.1 పరిపాలన.

15.6.2 సామాజిక పరిస్థితులు.

15.6.3 ఆర్థిక పరిస్థితులు.

15.6.4 మత పరిస్థితులు.

15.6.5 సాహిత్యాభివృద్ధి.

15.6.6 వాస్తు, శిల్ప కళాభ్యుదయం

15.6.7 రాజపుత్రులలోని లోపాలు.

15.7 సారాంశము

## 15. 2 ఆధారాలు :

(1) వివిధ రాజపుత్ర ప్రభువులు శాసనాలు, నాణాలు - గ్వాలియర్, జోధపూర్, సీయదోని, అస్ని, సంజన్, మాంసిర్, నలందా, మున్నగు చోట్ల లభించిన శిలాశాసనాలు, తామ్రశాసనాలు

(2) కల్హణుని 'రాజతరంగిణి' అను చారిత్రక రచన.

(3) బిల్హణుని 'విక్రమాంకదేవచరిత్రం' పద్మగుప్తుని 'నవసాహసాంకచరిత్రం నయచంద్రసూరి రచిం... హమ్మీరమహాకావ్యం' చాంద్‌బర్దాయ్ విరచితమగు 'పృధ్వీరాజ్‌రాసో' జయాంకుని 'పృధ్వీరాజవిజయం' మున్నగు చారిత్రక కావ్యాలు, జీవిత చరిత్రలు.

(4) రాజశేఖరుడు, హలాయుధుడు, కృష్ణ మిత్రుడు, క్షేమేంద్రుడు, సోమదేవుడు, భవభూతి మున్నగు వారు రచించిన కావ్యాలు, నాటకాలు కథలు.

(5) ఆల్బెరూని రచించిన 'కితాబుల్ హింద్', ఉత్బీ రచించిన 'తారీఖ్-ఇ-యామినీ', ఆబూజైద్‌సులేమాన్ మున్నగు అరబ్బుబాటసారుల రచనలు.

## 15.3 రాజపుత్రుల పుట్టు పూర్వోత్తరాలు :

ఉత్తర భారతదేశంలో హర్షుని మరణమునుండి (క్రీ.శ. 647) ఢిల్లీలో ముస్లిం రాజ్యస్థాపన వరకు (క్రీ.శ. 1206) గల అయిదున్నర శతాబ్దాలకాలాన్ని రాజపుత్ర యుగం అంటారు. హర్షుని మరణంతో ఉత్తరా పథాన మరల రాజకీయ ఐక్యత లోపించి అనేక చిన్న చిన్న రాజ్యాలుగా నెలకొల్పబడ్డాయి. ఆ రాజ్యాధిపతులు 'రాజపుత్రులుగా' వ్యవహరింపబడినారు. అచంచలదేశ భక్తికి, అప్రతిహత ధైర్య సాహసాలకు వాసికెక్కి ముస్లిం దండయాత్రల నుండి భారతదేశాన్ని, భారత సంస్కృతిని, హైందవ ధర్మాన్ని కాపాడుటకు బద్ధకంకణులై వీరోచితముగ పోరాడిన ధీరులు రాజపుత్రులు. ఒకవైపున తమలో తాము, మరొకవైపున తురుష్కులతో ఎడతెగని పోరాటం సాగించినప్పటికీ వారు గత సాంస్కృతిక వైభవాన్ని పరిరక్షించుటయేగాక హిందూ మతానికి నూతన ఉత్తేజాన్ని, శక్తిని సమకూర్చి వన్నె తెచ్చారు. తురుష్కాదాడుల నుండి హైందవ ధర్మ రక్షణకు పూనుకొన్న ఈ రాజపుత్రులు ఎవరు అనునది సంతృప్తి కరమైన సమాధానం లభించని ప్రశ్న.

### రాజపుత్రుల పుట్టుక :

రాజపుత్రులు ఎవరు అనునది వివాదగ్రస్తమైన సమస్య. వారి పుట్టుకను గూర్చి మూడు ప్రధాన సిద్ధాంతాలు ఉన్నాయి. అవి :

#### 1. స్వదేశీయులు :

సి.వి. వైద్య, జి.పి.ఓఝూ మున్నగు చరిత్రకారులు రాజపుత్రులు స్వదేశీయులు అని తీర్మానించినారు. అందుకు వారు దిగువ ఉదహరించిన కారణాలు సూచించారు. రాజపుత్రులు తమ శాసనాలలోను, తమ ఆస్థానాలలో తయారయిన గ్రంథాలలోను తాము ఇతిహాసకాలంనాటి సూర్య, చంద్ర క్షత్రియ వంశాలకు చెందినట్లు చెప్పుకున్నారు. పృధ్వీ రాజు ఆస్థాన కవి చాంద్ బర్దాయ్ 'పృధ్వీ రాజరాసో' అను హిందీ కావ్యంలో రాజపుత్రులను 'అగ్నికుల క్షత్రియులుగా' పేర్కొన్నాడు. క్షత్రియులందరిని నాశనం చేసిన పరశురాముడు బ్రాహ్మణుల కోరికపై అబూ శిఖరం మీద హోమాగ్ని చేయగా దానిలో నుండి ఒక క్షత్రియ వీరుడు ఉద్భవించాడట ! ఆ వీరుని సంతతి వారే అగ్నికుల క్షత్రియులయినారని ఈ కథ సారాంశం. రాజపుత్రుల అవయవ సౌష్టవం, హిందూ మతాభిమానం మున్నగునవి వీరు స్వదేశ సంతతి వారని తెలియచేయుచున్నవి. కావుననే వీరు తురుష్కుల బారి నుండి మాతృదేశాన్ని, హిందూ సంస్కృతిని రక్షించుటలో ప్రాణాలొడ్డి సుదీర్ఘ పోరాటం కొనసాగించారు.

#### 2. విదేశీయులు

రాజపుత్రుల ఆచార వ్యవహారాలు, రాజపుత్ర వంశాలలో ప్రచారమందున్న గాథల్ని పరిశీలించి, పరిశోధించి 'రాజస్థాన గాథా వళి' అను ఉద్గ్రంథమును రచించిన టాడ్ సేనాని వారు విదేశీయులు అని నిర్ధారించినాడు. భండార్కర్, విలియం బ్రూక్స్, ఎడ్వర్డ్స్ మున్నగు వారు ఈ అభిప్రాయాన్ని బలపరచారు. తమ వాదనకు అనుకూలంగా వీరు క్రింది అంశాలను ప్రతిపాదించారు.

శక, పహ్లవ, ఘూర్జర, హూణ మున్నగు విదేశీ జాతులవారు భారతదేశంలో స్థిరపడి, హిందూ మతాన్ని అవలంభించి, హిందూ స్త్రీలను వివాహం చేసుకొని హిందువులలో కలసిపోయి తాము సూర్యవంశ, చంద్రవంశ క్షత్రియులమని చాటుకున్నారు. రాజపుత్రులలో అములులోవున్న ఆయుధాలను, అశ్వాలను పూజించటం, రథాలను ఉపయోగించడం విపరీతమైన మధుపానాసక్తి, శకునాలలో ప్రగాఢ విశ్వాసం కలిగి ఉండడం, స్థానికులలో కొన్ని వివాహ నిబంధనలు సతీసహగమనం మున్నగునవి విదేశీ సాంప్రదాయాలు. టాడ్ సేనాని పరిశోధనా ఫలితంగా రాజపుత్రులలోగల అనేక తెగలలో హూణ తెగ ఒకటి అని తేలింది. హూణులు విదేశీయులు.

రాజ పుత్రులలో ఒక తెగకు చెంధిన ఘూర్జర ప్రతీహారులుతాము విదేశీయులమని తమ శాసనాలలో తెల్పినారు.

**3. మిశ్రమ సంతతి :**

రాజపుత్రులు మిశ్రమ జాతికి (విదేశీయుల + స్వదేశీయుల కలయికవలన ఏర్పడిన జాతి) చెందిన వారు అని వి.ఎ. స్మిత్, భండార్కర్, సత్యానాధ అయ్యర్ మున్నగు చరిత్రకారుల అభిప్రాయం. వీరి వాదనలోని ముఖ్యాంశములేవనగా భారతదేశంపై దండెత్తి వచ్చి ఇచట స్థిరపడిన కుషాను, శక, పహ్లవ, హూణాది విదేశీ తెగలవారు స్థానికులగు భిల్లులు, గొండులు మున్నగు పర్వత, ఆటవిక తెగల వారితో వివాహ సంబంధాలు ఏర్పరచుకొని, హిందూ మతం అవలంభించి భారతీయులయ్యారు. యుద్ధప్రియులు, ఆయుధోప జీవులు అయినందున వీరు క్షత్రియులుగా పరిగణింపబడ్డారు. ఆబూ శిఖరంపై జరిగిన హోమాగ్ని వీరికి ప్రాయశ్చిత్తం జరిపి క్షత్రియులుగా మార్చే సందర్భంలో జరిగిన శుద్ధికర్మ అయిఉండవచ్చు. వీరు తమ పూర్వపు యుద్ధ ప్రియత్వాన్ని భారతీయుల హిందూ మతాభిమానాన్ని మేళవించి రాజపుత్రులుగా వ్యవహరింపబడ్డారు. హిందూ మతం పుచ్చుకొన్న ఈ విదేశీ జాతులవారు ఆ మతమునందు అత్యంత శ్రద్ధాసక్తులను, అభిమానాన్ని ప్రదర్శించారు. దేశం క్లిష్ట పరిస్థితులలో వున్నపుడు హిందూ ధర్మ రక్షణకు బద్ధకంకణులైనారు. అందువల్ల వారి ఆస్థాన కవులు వారిని సూర్యవంశ, చంద్ర వంశ క్షత్రియులుగా కీర్తించారు. ఆయుధోపజీవులయిన వీరు రాజపుత్రులుగా వ్యవహరింపబడినారు. అంతేగాని 'రాజపుత్ర' అను మాట జాతి పరమైనది కాదు. రాజపుత్రులలో సూర్యారాధన, సర్పారాధన మున్నగు అనేక దేశీయ, విదేశీయ ఆచారాలు, సాంప్రదాయలు మిళితమై ఉన్నాయి. ఉదాహరణకు సూర్యారాధన పారశీక సాంప్రదాయం. సర్పారాధన దేశీయ సాంప్రదాయం. వారి పుట్టుపూర్వోత్తరాలను గురించిన సమాచారం లేదు. అందువల్ల వారు మిశ్రమ సంతతివారని తెలియుచున్నది. హర్షుని మరణానంతరం ప్రబలిన అరాచక పరిస్థితులలో వీరు స్వతంత్ర రాజ్యాలు స్థాపించి, తురుష్క దండయాత్రలను ఎదుర్కొని, ప్రజలను రక్షించి రాజ పుత్రులుగా కీర్తింపబడినారు.

నేడు రాజపుత్రులు మిశ్రమ సంతతివారు అను వాదమే పెక్కుమందికి ఆమోద యోగ్యముగా వుంది. తమ ధైర్య సాహసాలతో, పరిపాలనా దక్షతతో రాజపుత్రులు క్షత్రియత్వానికి అర్హుల మనిపించుకున్నారు.

## 15. 4. ప్రముఖ రాజపుత్ర వంశాలు

### 15.4. 1. కనూజ్‌ను ఏలిన ఘూర్జర ప్రతీహారులు, గహద్వాలులు

**(ఎ) ఘూర్జర ప్రతీహారులు . (క్రీ.శ. 783 - 1019) :** రాజపుత్రులలో మొట్టమొదట ప్రాబల్యంలోనికి వచ్చినవారు ప్రతీహారులు. వీరిది మధ్య ఆసియాలోని ఘూర్జర జాతి. హూణుల తరువాత వీరు భారతదేశంలో ప్రవేశించారు. వీరి వల్లనే రాజపుత్ర స్థానానికి ఘూర్జర దేశము అనే పేరు కలిగింది. 'ప్రతీహారి' అనగా ద్వారపాలకుడని అర్థం. శ్రీరామునికి ద్వారపాలకుడుగా వున్న లక్ష్మణుని సంతతివారు అగుటవల్ల వీరికీ పేరు వచ్చిందని ఒక గాధ - వీరి మూల పురుషుడు మొదట రాష్ట్ర కూటులకు ద్వారపాలకుడుగా ఉన్నందున ఈ పేరువచ్చినదని మరియొక అభిప్రాయం. వీరు సూర్యవంశ క్షత్రియులని పిలువబడ్డారు.

ప్రతీహార రాజ్య స్థాపకుడు నాగభటుడు. ఇతని రాజధాని జోధ్‌పూర్ ప్రాంతంలోని భినమల్. ఇతడు అరబ్బుల దండయాత్రల్ని విజయవంతంగా ఎదుర్కొని తన రాజ్యాన్ని భరంకచ్చం వరకు విస్తరింపజేశాడు. ఇతని రాజ్యంలో రాజపుత్ర స్థానం, మాళ్వ గుజరాత్‌లలో భాగాలు చేరిఉండేవి.

వత్సరాజు (క్రీ.శ. 783 - 815) నాగభటుని కుమారుడు. ఈయన కనూజ్, కోసల రాజ్యాలను జయించి ఆక్రమించాడు. ఆనాడు కనూజ్ ఉత్తరాపథంలో రాజకీయ కేంద్రంగా ఉండేది. అందువల్ల కనూజ్ ఆధిపత్యమునకై ప్రతీహారులు, రాష్ట్రకూటులు, పాలవంశీయులు పోటీ పడ్డారు. వత్సరాజు గౌడ (బెంగాలు) రాజయిన ధర్మపాలుని ఓడించి అతని రాజ లాంఛనాలను పొందినాడు. కానీ రాష్ట్ర కూట ధ్రువుడు వత్సరాజును ఓడించి కనూజ్ నుండి తరిమివేసాడు. తుదకు ధర్మపాలుడు కనూజ్‌ను ఆక్రమించి చక్రాయుధుణ్ణి అచట తవ తన ప్రతినిధిగా నిలిపాడు.

రెండవ నాగభటుడు (క్రీ.శ. 805 - 833) వత్సరాజు కుమారుడు. ఈయన చక్రాయుధుని పారదోలి కనూజ్‌ను వశపర్చుకొని రాజధానిగా చేసుకొన్నాడు. కాని ఇతనిని రాష్ట్ర కూట మూడవ గోవిందుడు పరాజితుని గావించాడు. ఇతని కుమారుడు రామ భద్రుడు మూడు సంవత్సరాలు రాజ్యపాలన చేశాడు. రామ భద్రుని కుమారుడు మిహిర భోజుడు.

మిహిర భోజుడు (క్రీ.శ. 836 - 885) ప్రతిహార వంశంలో సుప్రసిద్ధుడు. ఈయన కాలంలొ ప్రతీహార రాజ్య ప్రతిష్ఠ పతాక స్థాయిని చేరుకొంది. కనూజ్ ఇతని రాజధాని. పరాక్రమశాలి అయిన భోజుడు తన అధికారాన్ని పటిష్ఠ పరుచుకొని ఉత్తరాన హిమాలయాలవరకు, దక్షిణాన రాజపుత్ర స్థానం ఉజ్జయిని పరిసర ప్రాంతాల వరకు, పశ్చిమాన గుజరాత్ వరకు, తూర్పున బీహారు వరకు తన రాజ్యాన్ని విస్తరింప జేశాడు. బెంగాల్ రాజు దేవపాలుడు, రాష్ట్రకూట రెండవ కృష్ణుడు మిహిర భోజునిచే ఓడింపబడినారు. ఈయన గొప్ప యోధుడేకాక కవి పోషకుడుగా కూడా పేరుగాంచాడు. సుప్రసిద్ధ కవి రాజశేఖరుడు ఇతని ఆస్థాన కవి. ఇతడు వైష్ణవ మతాభిమాని. మిహిర భోజుని కాలంలో అరబ్ బాటసారి సులేమాన్ అతని రాజ్యంలో పర్యటించి "రాజ్యం సిరిసంపదలతో తులదూగుచున్నది, శక్తివంతమైన రాజ్యం, ప్రజలకు చోరభయం లేదు" అని వ్రాసాడు.

మహేంద్ర పాలుడు (క్రీ.శ. 885 - 907) మిహిర భోజుని కుమారుడు. ఇతడు బీహారు, బెంగాలులో అధిక భాగాన్ని జయించి ఆక్రమించాడు. ప్రతీహారులు ఉత్తర భారతదేశానికి సార్వభౌములయ్యారు. హర్షవర్ధనుని తరువాత మరల ఉత్తరాపధానికి రాజకీయ ఐక్యత చేకూరింది.

కాని ప్రతీహారుల ప్రాబల్యం ఎంతో కాలం నిలువ లేదు. మహేంద్రపాలుని మరణానంతరం రాష్ట్రకూటులు మూడవ ఇంద్రుని నాయకత్వాన దండెత్తి వచ్చి కనూజ్ నగరాన్ని, ప్రయాగ వరకుగల భూ భాగాన్ని దోచుకున్నారు. ఈ దండ యాత్రతో ప్రతీహారుల బలం క్షీణించింది. తత్ఫలితంగా వారి సామంతులయిన సోలంకీలు, పరమారులు, చౌహానులు, కాలచుర్యులు, తోమరులు స్వతంత్ర రాజ్యాలు స్థాపించుకున్నారు. ఈ వంశంలో చివరి వాడైన రాజ్యపాలుని కాలంలో ఘజ్నీ మహమ్మద్ క్రీ.శ. 1018 లో కనూజ్ పై దాడిచేసి దోచుకొని ధ్వంసం చేశాడు. దీనితో ప్రతీహారుల ప్రభ అంతరించింది.

ప్రతీహారులు హిందూ మతాభిమానులు. వీరు రమారమి రెండు శతాబ్దాలపాటు అరబ్బుల దండయాత్రల నుండి హిందూ దేశమును కాపాడుటయే గాక ఆర్యావర్తమునకు రాజకీయ ఐకత్యను ప్రసాదించారు. మహమ్మదీయుల పాలనకు ముందున్న చివరి హిందూ సామ్రాజ్యం ఇదే !

### (బి) గహద్వాలులు (క్రీ.శ. 1085 - 1202)

ప్రతీహారులు తరువాత అర్థశతాబ్దంపాటు కనూజ్ రాష్ట్రకూటుల ఆధీనంలో వుంది. వారి తరువాత కనూజ్ పై ఆధిపత్యం నెలకొల్పిన వారు గహద్వాలులు లేక రాథోర్‌లు. రాష్ట్ర కూటుల అధికారాన్ని తుదముట్టించి కనూజ్ రాజధానిగా స్వతంత్ర రాజ్యం స్థాపించిన వాడు చంద్రదేవుడు (క్రీ.శ. 1085 - 1100). ఇతని వారసులలో ప్రముఖుడు గోవింద చంద్రుడు (క్రీ.శ. 1114 - 1155). ఇతడు పాంచాల, ప్రయాగ, కాశీ, మగధ ప్రాంతాలు జయించి ఆక్రమించినాడు. ఇతని కాలంలో కనూజ్ నగరం ఉత్తరాపథంలో ప్రధాన నగరంగా ప్రసిద్ధి చెందింది. గహద్వాలులు 'తురక దండ' అను పన్ను వసూలు చేసి సైనిక బలాన్ని పెంచుకొని తురుష్క దండయాత్రల నుండి తమ రాజ్యాన్ని కాపాడుటకు కృషి చేసారు.

గహద్వాలులలో చివరివాడు జయచంద్రుడు (క్రీ.శ. 1170 - 1193). ఇతడు ఈ వంశంలో అగ్రగణ్యుడు. జయచంద్రుడు పృథ్వీరా చౌహాన్‌తోను, బెంగాలునేలు లక్ష్మణ సేనునితోను పోరాడవలసివచ్చింది. 'పృథ్వీరాజ్ రసో' కథనం ప్రకారం జయచంద్రుడు తన కుమా సంయుక్త వివాహ విషయంలో పృథ్వీరాజుతో వైరము పెంచుకొని అతనిని నాశనం చేయుటకు ఘోరీ మహమ్మద్‌ను భారతదేశంపై దండె

రావలసినదిగా ఆహ్వానించినట్లు తెలుస్తుంది. కానీ దీనిని సమర్థించు చారిత్రక ఆధారాలు లేవు. ఇందలి చారిత్రకత లోని సత్యాసత్యము లెట్లున్నను వీరిద్దరి మధ్య బద్ధవైరం వున్నట్లు కన్పిస్తుంది. రెండవ స్థానేశ్వర (తరైన్) యుద్ధంలో (క్రీ.శ 1192) పృథ్వీరాజు పరిస్థితి క్లిష్టంగా ఉన్నపుడు జయచంద్రుడు ఉదాసీనంగా వున్నాడు. తదుపరి ఘోరీమహమ్మద్ చందావర్ యుద్ధంలో (క్రీ.శ. 1193) జయచంద్రుని వధించాడు. కనూజ్ మహమ్మదీయుల వశమయ్యింది. ఈతని మరణంతో గహద్వాలులు లేక రాఠోరుల అధికారం అస్తమించింది. తదుపరి రాఠోరులు రాజపుత్రస్థానానికి తరలి వెళ్లి జోధ్‌పూర్ కేంద్రంగా రాఠోర్ సంస్థానాన్ని నెలకొల్పారు.

### 15.4. 2. మాళ్వను పాలించిన పరమారులు (క్రీ.శ. 950 - 1055)

పరమారులు రాష్ట్రకూట వంశం వారని చరిత్రకారుల అభిప్రాయం. వీరికి మూలపురుషుడయిన ఉపేంద్రుడు రాష్ట్ర కూటుల ప్రతినిధిగా మాళ్వను పాలించాడు. క్రీ.శ 950 ప్రాంతంలో ధారా నగరం రాజధానిగా మాళ్వలో పరమారులు స్వతంత్ర రాజ్యం స్థాపించారు. వీరు సూర్యవంశ క్షత్రియులు.

ముంజరాజు అను నామాంతరం గల వాక్పతి రాజు (క్రీ.శ. 970 - 997) పరమారులలో సుప్రసిద్ధుడు. ఇతడు చౌహానులతో పోరాడి ఆ భూప్రాంతాన్ని ఆక్రమించాడు. ఇతని ప్రబల శత్రువు కల్యాణి చాళుక్య ప్రభువైన రెండవ తైలపుడు. అతని దాడులకు ప్రతీకారంగా ముంజరాజు చాళుక్య రాజ్యం పై దండెత్తి వెళ్లి, యుద్ధంలో హతుడయ్యాడు. ముంజరాజు గొప్ప యోధుడే గాక పరిపాలనా దక్షుడు; సారస్వత పోషకుడు. ధనుంజయ, ధనిక, హలాయుధ, పద్మగుప్త మున్నగు వారు అతని ఆస్థానము నలంకరించిన కవి శ్రేష్ఠులు. ముంజరాజు అనేక ఆలయాలు, తటాకాలు నిర్మించాడు.

పరమారులలో సాహిత్య స్రష్టగా పేరొందిన వాడు భోజరాజు (క్రీ.శ. 1010 - 1055), ఇతడు ముంజరాజు సోదరుని కుమారుడు. సంస్కృత చరిత్రలో భోజుడు అద్వితీయుడు. ఇతడు సాహిత్య స్రష్ట; కవిపోషకుడు; అలంకార శాస్త్రం, వాస్తు శాస్త్రం, ఆయుర్వేదం, వేదాంతం, జ్యోతిష్యం, వ్యాకరణం, మతం మున్నగు వివిధ విషయాలపై 20 పైగా గ్రంథాలు రచించాడు. ఆయన ఆస్థానంలోని కవులలో ధనపాల సాల్వార్ అను వారు ప్రముఖులు; కవయిత్రి సీత, భోజుని భార్య అరుంధతి గొప్ప విద్వాంసురాలు. ఆయన 'భోజపురి' అనే నగరాన్ని అందులో 'భోజశాల' అనే కళాశాలను నిర్మించాడు. భోజుడు సాహిత్యాభిమానియేగాక గొప్ప యోధుడు. అతడు చందేలులను, కాలచుర్యులను, సోలంకీలను, లాట, కనూజ్, ఒరిస్సా పాలకులను ఓడించాడు. ముస్లింలను ఓడించి స్థానేశ్వర్, హాన్సి, నగరకోటలను ఆక్రమించాడు. తుదకు సోలంకీలు, కాలచుర్యులు కలిసి మాళ్వపై దండెత్తివచ్చి భోజుని సంహరించి పరమార రాజ్యాన్ని పంచుకున్నారు.

### 15.4. 3. బుందేల్ ఖండపు చందేలులు (క్రీ.శ. 950 - 1202)

బుందేల్ ఖండం ప్రతీహార్ సామ్రాజ్యంలో ఒక రాష్ట్రం. ప్రతీహారుల అధికారం క్షీణించుటతో చందేలులు బుందేల్ ఖండంలో స్వతంత్ర రాజ్యస్థాపన చేశారు. వారి రాజధాని ఖజురాహో (ఖర్జూరవాహ).

చందేలు వంశ మూలపురుషుడు జయశక్తి. ఇతని వల్లనే చందేల రాజ్యానికి 'జజకశక్తి' అనే పేరువచ్చింది. స్వతంత్ర చందేల రాజ్య స్థాపకుడు యశోవర్మ. క్రమక్రమంగా చందేల రాజ్యం యమునానది నుండి సాంచీవరకు విస్తరించింది. చందేల రాజులలో సుప్రసిద్ధుడు విద్యాధరుడు. ఇతని కాలంలోనే ఘజ్నీమహమ్మద్ భారతదేశంపై అనేక దండయాత్రలు జరిపాడు. మహమ్మద్‌కు దాసోహమన్న కనూజ్ రాజ్యపాలుని విద్యాధరుడు వధించాడు. అందుకాగ్రహించిన మహమ్మద్ బుందేల్ ఖండంపై రెండుసార్లు (క్రీ.శ. 1019, 1022) దాడిజరిపి కలంజర్ దుర్గాన్ని వశపర్చుకోలేక విద్యాధరునితో సంధి చేసుకొని వెనుదిరిగినాడు. ఆ విధంగా మహమ్మద్ దండయాత్రల్ని అరికట్ట గలిగిన గౌరవం విద్యాధరునికి మాత్రమే దక్కింది.

విద్యాధరుని మరణానంతరం పరమారులు, సోలంకీలు, చౌహానులు, కాలచుర్యులు తరచుగా బుందేల్ ఖండంపై దాడులు జరిపి చందేలుల అధికారాన్ని బలహీన పరచారు. సోలంకీలు, సాంచి ప్రాంతాన్ని ఆక్రమించారు. చౌహానుల ప్రాబల్యం నాశనం చేసిన ముస్లింలు కుతుబుద్దీన్ నాయకలంజర్ ఆక్రమించినారు. తుదకు అల్లావుద్దీన్ ఖిల్జీ క్రీ.శ. 1309 లో బుందేలు ఖండ్‌ను జయించి ఢిల్లీ సామ్రాజ్యంలో చేర్చినాడు. కథియవాడ్, దక్షిణ రాజస్థాన్‌లు ఈయన సామ్రాజ్యంచేరి వున్నవి. ప్రముఖ జైన విద్వాంసుడైన హేమచంద్రుడు ఇతని మంత్రి [illegible] ుని కాలంలో క్రీ.శ. 1178 - 1242 లో ఘోరీ మహమ్మద్ గుజరాత్ పైదాడి జరిపి క్రీ.శ. 1178 పరాజితు[illegible]

అతని సేనాని కుతుబుద్దీన్ క్రీ.శ. 1198 లో దండెత్తి వచ్చి భీమదేవుని ఓడించినాడు. ఈ దండయాత్రవలన భీమ దేవుని అధికారం బలహీనపడింది. దీనినవకాశంగా తీసుకొని వాఘేలులు అధికారమును చేజిక్కించుకొన్నారు.

**(బి) వాఘేలులు (క్రీ.శ. 1242 - 1299)**

వాఘేలులలో అర్జునుడు (క్రీ.శ. 1274 - 96) ప్రసిద్ధుడు. ఇతనికుమారుడు కర్ణదేవుడు క్రీ.శ. 1296 - 99 సుల్తాన్ అల్లాఉద్దీన్ ఖిల్జీ గుజరాత్‌పై దండయాత్ర జరిపి (1299) కర్ణదేవుని ఓడించినాడు. గుజరాత్ ఢిల్లీ సామ్రాజ్యంలో చేర్చబడింది. కర్ణదేవుడు దేవగిరి యాదవుల రాజ్యంలో తలదాచుకొన్నాడు.

**15.4. 4. గుజరాత్‌ను పాలించిన సోలంకీలు, వాఘేలులు**

**(ఎ) సోలంకీలు (క్రీ.శ. 945 -1242) :** సోలంకీలు ప్రతీకార సామ్రాజ్య విచ్ఛిన్నమైన తరువాత అన్హిల్‌వాడ రాజధానిగా గుజరాత్‌లో స్వతంత్ర రాజ్యం స్థాపించారు. వీరు దక్షిణాపథంలో రాజ్యమేలిన చాళుక్య వంశ శాఖ అని చరిత్రకారుల అభిప్రాయం. మూలరాజు వీరి మూలపురుషుడు. మొదటి భీమసేనుని కాలంలో క్రీ.శ. (1022 -1064) ఘజ్నీ మహమ్మద్ క్రీ.శ. 1026లో గుజరాత్‌పై దండెత్తి వచ్చి సోమనాధ ఆలయాన్ని ధ్వంసం చేసి దోచుకుపోయాడు. తదుపరి భీమదేవుడు విజృంభించి మాళ్వ, భినమల్, అబూ ప్రాంతాలను జయించి తన రాజ్యమున చేర్చినాడు. భీముని కుమారుడయిన కర్ణుడు సాహితీప్రియుడు. ఈయన బిల్హణుడు అనేకవిని పోషించినాడు. కర్ణుని కుమారుడయిన జయసింహుడు గొప్ప యోధుడు. ఈయన కాలంలో సోలంకీ రాజ్యం అత్యున్నత స్థితికి పొందింది. గుజరాత్, కచ్, కధియావార్, దక్షిణ రాజస్థాన్‌లు ఈయన సామ్రాజ్యంలో చేరి వున్నవి. ప్రముఖుడైన విద్వాంసుడైన హేమచంద్రుడు ఇతని మంత్రి. రెండవ భీమదేవుని కాలంలో (క్రీ.శ. 1178 - 1242) ఘోరీ మహమ్మద్ గుజరాత్‌పై దాడి జరిపి (క్రీ.శ. 1178) పరాజితుడైనాడు. అతని సేనాని కుతుబుద్దీన్ క్రీ.శ. 1198లో దండెత్తి వచ్చి భీమదేవుని ఓడించాడు. ఈ దండయాత్రవలన భీమదేవుని అధికారం బలహీన పడింది. దీనినవకాశంగా తీసుకొని వాఘేలుల అధికారమును చేజిక్కించుకొన్నాడు.

**(బి) వాఘేలులు (క్రీ.శ. 1242 - 1299) :** వాఘేలులలో అర్జునుడు (క్రీ.శ. 1274 -96) ప్రసిద్ధుడు. ఇతని కుమారుడు కర్ణదేవుడు (క్రీ.శ. 1296 -99) ఢిల్లీ సుల్తాన్ అల్లాఉద్దీన్ ఖిల్జీ గుజరాత్‌పై దండయాత్రజరిపి (1299) కర్ణదేవుని ఓడించాడు. గుజరాత్ ఢిల్లీ సామ్రాజ్యంలో చేర్చబడింది. గుజరాత్ సామ్రాజ్యంలో చేర్చబడింది. కర్ణదేవుడు దేవగిరి యాదవుల రాజ్యంలో తలదాచుకొన్నాడు.

**15.4. 5. కాలచుర్యులు (క్రీ.శ. 845 - 1212)**

చేది రాజ్యస్థాపకులు హైహేయులు. వీరిని కాలచుర్యులు అని గూడా అంటారు. వీరి రాజధాని త్రిపుర. ఈ వంశానికి మూలపురుషుడు కోకల్లుడు (క్రీ.శ. 845 - 880). ఇతని వారసులలో ఒకడైన గంగయదేవుడు (క్రీ.శ. 1009 - 1041) కాశ్మీరమునుండి కర్ణాటకం వరకు దిగ్విజయ యాత్రలు జరిపి "విక్రమాదిత్య" "త్రికళింగాధిపతి" అను బిరుదులు ధరించాడు. అతని కుమారుడు కర్ణదేవుడు క్రీ.శ. 1041 - 72 తండ్రి విధానం అనుసరించాడు. ఇతవి అధికారం గుజరాత్ నుండి బెంగాలు వరకు గంగానది నుండి నర్మదానది వరకు విస్తరించింది. కర్ణదేవుని కుమారుడైన యశః కర్ణుని కాలంలో రాఠోరులు ప్రయాగ, కాశీ ప్రాంతాలను వశపర్చుకొన్నారు. చివరి కాలచురి ప్రభువైన జయసింహుని కాలంలో చందేలులు రాజ్యాన్ని జయించి ఆక్రమించినారు.

**15.4. 6. అజ్మీరు ఢిల్లీలనేలిన చౌహానులు (క్రీ.శ. 956 -1192)**

తొలుత చౌహానులు (చహమానులు) ప్రతీహారుల అధికారం క్షీణించుటతో క్రీ.శ. 956 ప్రాంతాన చౌహానుల సింహరాజు నాయకత్వాన శకంభరి రాజధానిగా స్వతంత్రులయినారు. క్రమంగా అజయరాజు, విశాలదేవుడు చౌహాన్ రాజ్యాన్ని విస్తరింపజేశారు. అజయరాజు నిర్మించిన నగరమే అజ్మీరు (అజయమేరు). విశాలదేవుడు పంజాబు నేలు ఘజ్నీ మహ్మద్ వారసులనుండి యమునా - సట్లెజ్ నదులు మధ్యనున్న ప్రదేశమును ఆక్రమించినాడు. తోమరవంశీయులనుండి ఢిల్లీ నగరాన్ని దాని పరిసర ప్రాంతాలను వశపర్చుకొన్నాడు. ఈ విజయాలతో అతని రాజ్యం దక్షిణాన వింధ్యపర్వతాలనుండి ఉత్తరాన హిమాలయముల వరకు విస్తరించింది. చౌహానుల కీర్తి ప్రతిష్టతల

ఇనుమడించాయి. విశాలదేవుడు సారస్వతాభిమాని, కవి. ఈయన ఆజ్మీరులో ఒక కళాశాలను స్థాపించినాడు. హరకేళి అను నాటకమును ఈయన రచించినట్లు తెలియుచున్నది. లలిత విగ్రహరాజ నాటకం అను నాటకాన్ని రచించిన సోమదేవ మహాకవి ఈయన ఆస్థానకవి.

చౌహాన్ వంశీయులలో అగ్రగణ్యుడు మూడవ పృధ్వీరాజు. (క్రీ.శ. 1178 - 92). ఇతని ధైర్య సాహసాలు, యుద్ధనైపుణ్యం గురించి అనేక పాటలు కథలు ప్రచారంలో వున్నాయి. పృధ్వీరాజురాసో అను హిందీ కావ్యం, పృధ్వీరాజవిజయం అను సంస్కృత కావ్యం పృధ్వీరాజు శౌర్యప్రతాపాలను కీర్తించి అతడిని చిరస్మరణీయుడిగా చేశాయి. పృధ్వీరాజు తన దిగ్విజయ యాత్రల ద్వాచౌహాన్ రాజ్య విస్తరణ చేశాడు. చందేల రాజు పరమార్ది దేవుని ఓడించి (1182) అతని రాజధాని మహూబాను ఆక్రమించినాడు. తదుపరి గుజరాత్‌పై దండెత్తి వెళ్లి (1187) రెండవ చాళుక్య భీముని ఓడించినాడు. ఈ విజయాలవలన అతని సామ్రాజ్యంలో ఆజ్మీరు, సాంభారు, ఢిల్లీ, బుందేల్ ఖండ్‌లో కొంతభాగం చేరిఉన్నవి. పృధ్వీరాజు ప్రబల శత్రువు కనుజ్‌పాలకుడైన జయచంద్రుడు. జయచంద్రుడు తన కుమార్తె సంయుక్త స్వయంవరం ఏర్పాట్లు చేయగా అనాహుతుడుగా వెళ్లిన పృధ్వీరాజు అత్యంత సాహసంతో ఆమెను తీసుకొని వెళ్లి వివాహమాడినాడని, అందుకు జయచంద్రుడు ఆగ్రహించి ఆతనిని నాశనం చేయుటకు ఘోరీ మహమ్మద్‌ను ఆహ్వానించినాడని ఒక ఐతిహ్యాంకలదు కానీ అందుకు తగిన చారిత్రక ఆధారాలు లేవని చరిత్రకారుల అభిప్రాయం. పృధ్వీరాజుకు శాశ్వత కీర్తినార్జించి పెట్టినది ముస్లిం అధికార విస్తరణకు అతడు ఘోరీమహమ్మద్‌తో జరిపిన యుద్ధాలు. ఈయన క్రీ.శ. 1191 లో జరిపిన మొదటి తరయిన్ యుద్ధంలో మహమ్మద్‌ను ఓడించి తరిమివేసి తబరింద్ దుర్గమును ఆక్రమించాడు. కానీ క్రీ.శ. 1192 లో జరిగిన రెండవ తరయిన్ యుద్ధంలో ఘోరీమహమ్మద్ పృధ్వీరాజును ఓడించి వధించినాడు. ఈతని మరణంతో చౌహానుల ప్రాబల్యం నశించింది.

### 15.4. 4. సమకాలీన ఇతర ప్రాంతీయ రాజ్యాలు

#### బెంగాలు నేలిన పాల, సేన వంశాలు

**ఎ) పాల వంశం (క్రీ.శ. 750 - 1138) :** బెంగాలును పాలించిన పాలవంశీయులు ప్రతీహారులకు సమకాలీనులు. వీరు రాజపుత్రులుకారు; స్థానిక ప్రభువులు. గోపాలుడు వీరి మూలపురుషుడు. క్రీ.శ. 750 ప్రాంతంలో గోపాలుడు స్వతంత్ర్యరాజ్య స్థాపన చేశాడు. ఇతని కుమారుడు ధర్మపాలుడు క్రీ.శ. 770-810 ఉత్తరాపథ సార్వభౌమత్వానికై రాష్ట్రకూటులతో ప్రతీహారులతో పోటీపడిన కనూజ్ సింహాసనమీద చక్రాయుధుని తన ప్రతినిధిగా నిలిపాడు. ఇతడు అనేక దిగ్విజయ యాత్రలు నిర్వహించి పాలరాజ్యాన్ని బ్రహ్మపుత్రానది నుండి వారణాసి వరకు విస్తరింపజేశాడు. ఈయన బౌద్ధమతస్థుడు. నలందా విశ్వవిద్యాలయ నమూనాపై విక్రమశిల విశ్వవిద్యాలయమును స్థాపించినది ఇతడే.

ధర్మపాలుని కుమారుడు దేవపాలుడు క్రీ.శ. 810 - 850. ఇతడు కామరూప, ఒరిస్సాలను జయించి ఆక్రమించాడు. దేవపాలుని అనుమతితో జువాద్వీపశైలేంద్ర ప్రభువు బాలపుత్రదేవుడు నలందాలో ఒక విహారం నిర్మించాడు. దేవపాలుని వారసులలో ముఖ్యుడు మహీపాలుడు క్రీ.శ. 1008 - 30. మహీపాలుని కాలంలో తంజావూరు చోళప్రభువు రాజేంద్ర చోళుడు గంగానది వరకు దండయాత్ర సాగించాడు. చోళులు వెనుదిరిగినపిమ్మట మహీపాలుడు విజృంభించి తురుభుక్తి, మగధప్రాంతాలను ఆక్రమించాడు.

మహీపాలుని తరువాత పాలరాజ్యం కళింగగాంగుల కాలచర్యుల దండయాత్రల వలన, కాంభోజ మున్నగు అనాగరిక జాతుల దాడుల వలన పాలరాజ్యం క్షీణించగా వారి సామంతులైన సేనవంశీయులు క్రీ.శ, 1140 ప్రాంతంలో అధికారం చేజిక్కించుకున్నారు.

పాలవంశ ప్రభువులు బౌద్ధ మతాభిమానులు. వీరి పోషణలో బౌద్ధ మతం పునర్జీవితమయింది. నేపాల్, టిబెట్ మున్నగు దేశాలనుండి అనేక బౌద్ధ మతగ్రంథాలను సేకరించి గ్రంథాలయంలో భద్రపరచారు. వీరి కాలంలో విక్రమశిల, జగద్దల, ఉద్దంతపుర విశ్వవిద్యాలయాలు నెలకొల్పబడ్డాయి. వీరు అనేక విహారాలు నిర్మించారు. పాలరాజుల నిర్మాణాలలో వినూత్నమైన వాస్తుశిల్ప సాంప్రదాయాలు రూపొందాయి.

**బి) సేనవంశం. (క్రీ.శ. 1138 - 1199) :** సేన వంశీయులు కర్ణాటక ప్రాంతంనుండి బెంగాలువలస వచ్చి స్థిరపడిన క్షత్రియులని చరిత్రకారుల అభిప్రాయం. వీరి రాజధాని నాడియా, వీరు హిందూమతాభిమానులు. హిందూమతాభిమానియైన బ్రాహ్మణాది వర్గాలను కూడగట్టుకొన్న విజయసేనుడు బౌద్ధమతాభిమానులై ప్రజాభిమానమును కోల్పోయిన పాలరాజుల అధికారాన్ని కూలద్రోశాడు. అస్సాం,

ఉత్తరబెంగాల్, నేపాల్, కళింగలను తాను జయించినట్లు జయసేనుడు చెప్పుకున్నాడు. ఇతడు సనాతన శైవ మతాన్ని పునరుద్ధరించి అనేక ాలయాలు నిర్మించాడు. ఇతని కుమారుడు బల్లాలసేనుడు.

బల్లాలసేనుడు మిథిలను జయించాడు. ఈతని కాలంలో బెంగాలు, బీహారు ప్రాంతాలలో హిందూ ధర్మశాస్త్ర ప్రకారం సమాజం పునర్ నిర్మించబడింది. బ్రాహ్మణ క్షత్రియవర్ణాలలో వారివారి వంశగౌరవాన్ని బట్టి తరగతులేర్పడినాయి. బ్రాహ్మణులలో ముఖర్జీ, బెనర్జీ, చటర్జీ కుటుంబాలు కులీనులుగా నిర్ణయించబడ్డారు. బల్లాలసేనుడు సంస్కృత విద్వాంసుడు. దానసాగర్, అద్భుతసాగర్ అనే గ్రంథాలను ఈయన రచించాడు.

సేన వంశంలో లక్ష్మణసేనుడు సుప్రసిద్ధుడు, చివరివాడు. ఈయన దిగ్విజయ యాత్రలు జరిపి పూరి, వారణాసి, ప్రయాగలలో విజయస్తంభాలు నాటాడు. గౌడ, కళింగ, కామరూప, కాశీరాజులు ఇతనిచే ఓడించబడ్డారు. ఇతడు కవి, పండిత పోషకుడు ఇతని ఆస్థానంలో పంచరత్నాలు అనే ప్రసిద్ధి చెందిన కవులు వుండేవారు. వీరిలో గీతగోవింద కావ్యకర్త అయిన జయదేవుడు అగ్రగణ్యుడు.

లక్ష్మణసేనుని కాలంలోనే ఘోరీ మహమ్మద్ సేనాని మహమ్మద్ భక్తియార్‌ఖిల్జీ బెంగాలుపై దాడిచేసి ఆతనిరాజధాని అయిన నాడియాన ముట్టడించారు. పరాజితుడైన లక్ష్మణసేనుడు పారిపోగా క్రీ.శ. 1199 లో ముస్లింలు బెంగాలును ఆక్రమించారు.

**కాశ్మీర రాజవంశాలు :** రాజపుత్రయుగంలో కాశ్మీరును కర్కోట, ఉత్పల లోహర వంశాలు వరుసగా పరిపాలించాయి. వీరి చరిత్రక ప్రధాన ఆధారం కల్హణుని రాజతరంగిణి.

**(ఎ) కర్కోట వంశం :** ప్రాచీన కాశ్మీరుచరిత్ర స్పష్టంగా తెలియదు. కల్హణుని రాజతరంగిణి ద్వారా క్రీ.శ. 7వ శతాబ్దం నుండి కాశ్మీరు చరిత్ర తెలియుచున్నది. దుర్లభ వర్ధనుడు అనే నాగరాజు క్రీ.శ. 7వ శతాబ్దంలో కాశ్మీరులో శక్తివంతమైన రాజ్యాన్ని స్థాపించాడు. కర్కోటకుడు ఇతని పూర్వీకుడగుట వల్ల ఈ వంశానికి కర్కోట వంశమనే పేరు వచ్చింది. దుర్లభవర్ధనుడు తన రాజ్యాన్ని తక్షశిల వరకు విస్తరింజేసాడు. ఇతడు సనాతన వైదిక మతస్థుడైనను బౌద్ధ భిక్షువులను ఆదరించాడు. దుర్లభవర్ధనుడు హర్షవర్ధనునితో మైత్రివహించి బుద్ధధాతువును అతనికి బహుకరించాడు.

కాశ్మీరు రాజులలో అగ్రగణ్యుడు లలితాదిత్యముక్తా పీడుడు. ఇతడు దుర్లభవర్ధమని మనుమడు. ఇతడు పంజాబులో కొంత భాగం ఆక్రమించి గంగా మైదానంలో బెంగాలు వరకు దండయాత్ర నిర్వహించి కనూజ్, గౌడపాలకులను ఓడించాడు. ముస్లిం దండయాత్రలను వీరోచితంగా ఎదుర్కొన్నాడు. లలితాదిత్యుడు విజేతయేగాక కళాభిమానము గూడా కలవాడు. ఇతడు అనేక బౌద్ధ విహారాలను నిర్మించి పోషించినట్లు హుయాంగ్‌సాంగ్ పేర్కొన్నాడు. లలితాదిత్యుడు శివకేశవులకు, మార్తాండునికి (సూర్యునికి) ఆలయాలు నిర్మించాడు. వీటిలో ప్రసిద్ధమైన మార్తాండ ఆలయం తనకి కీర్తి ప్రతిష్టలను చేకూర్చింది.

లలితాదిత్యుని మనుమడు జయాపీడ వినయాదిత్యుడు. ఇతడు కనూజ్, పుండ్రవర్దన, నేపాలుల మీద దాడులు జరిపినట్లు తెలుస్తుంది. వినయాదిత్యుడు సాహిత్యపోషకుడు. ఈతని ఆస్థానంలో క్షీరస్వామి, ఉద్భటుడు, దామోదరగుప్తుడు, వామనుడు మున్నగు కవిపండితులు ఉండేవారు. సంస్కృత విద్యకు కాశ్మీరు కేంద్రమయ్యింది.

లలితాదిత్య, వినయాదిత్యుల యుద్ధాల వలన కర్కోట వంశం బలహీనపడగా ఉత్పల వంశీయులు అధికారానికి వచ్చారు.

**(బి) ఉత్పల వంశం :** ఉత్పల వంశస్థాపకుడు అవంతివర్మ. ఇతడు క్రీ.శ. 856 లో కర్కోట వంశాన్ని నిర్మూలించి కాశ్మీరులో ఉత్పల వంశాన్ని స్థాపించాడు. దేశ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుటకు జీలం నదికి వరదకట్టలు నిర్మించి వ్యవసాయభూములకు నీటిపారుదల వసతులు కల్పించి అవంతివర్మ వ్యవసాయాన్ని ప్రోత్సహించాడు. ఇతడు సారస్వతాభిమాని. 'ధ్వన్యాలోక' రచయిత ఆనందవర్ధనుడు, 'హరి విజయ'మనే ఇతిహాసకావ్యాన్ని రచించిన రత్నాకరుడు, బాణుని కాదంబరి ని పద్యకావ్యంగా రచించిన అభినందుడు. శివస్వామి మున్నగువారు ఇతనిచే పోషింపబడిన కవి పండితులు. అవంతివర్మ వైష్ణవ మతాభిమానంతో అనేక దేవాలయాలు నిర్మించాడు. ఇతని కుమారుడు శంకరవర్మ.

శంకరవర్మ కనూజ్ ప్రతీహారులను, ఉదభాండపురషాహీరాజును ఓడించి పంజాబులో అధికభాగాన్ని ఆక్రమించినాడు. యుద్ధాలవలన పన్నుల భారం మితిమీరినందున ప్రజలు తిరుగుబాటు చేసి శంకరవర్మను వధించారు. కాశ్మీరు అరాచక మయ్యింది. రాజ్యంలో శాంతి నెలకొల్పుటకు అతని రాణి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అంతట బ్రాహ్మణ పరిషత్తు సమావేశమై యశస్కరుడు అనే బ్రాహ్మణుని కాశ్మీరప్రభువుగా ఎంపిక చేసింది.

**(సి) లోహరవంశం :**

లోహర వంశస్థాపకుడు యశస్కరుడు. అతడు తన తొమ్మిది సంవత్సరాల పాలనలో శాంతిని నెలకొల్పుటకు ప్రయత్నించాడు. మంత్రి పార్వగుప్తుడు కుమారుడు క్షేమగుప్తుడు. ఇతడు లోహర వంశ రాకుమార్తె దిద్దాదేవిని పెండ్లియాడినాడు. అతని మరణానంతరం దిద్దాదేవి సమర్థతతో పరిపాలనా బాధ్యతలు నిర్వహించి తుదకు రాజ్యభారాన్ని తనమేనల్లుడైన సంగ్రామ రాజుకు అప్పగించింది. దీనితో మరల లోహరవంశం అధికారంలో వచ్చింది. ఈ సమయానికే భారత దేశం మీద తురుష్కదండయాత్రలు మొదలయినాయి. క్రీ.శ. 1014 లో ఘజ్నీమహమ్మద్ షాహిరాజ్యం మీద దండయాత్ర జరిపాడు. షాహిరాజ్యాధిపతి త్రిలోచన పాలునితో పాటు అతనికి సాయంగా వెళ్లిన లోహర సైన్యాలు కూడా ఓటమి పొందాయి. క్రీ.శ. 1021 లో మహమ్మద్ లోహరులను శిక్షించుటకై కాశ్మీరుపై దండెత్తాడు. కానీ కాశ్మీరు అతనివశం కాలేదు. అట్టి పరిస్థితులలో అధికారానికి వచ్చిన హర్షుడు విలాసాలతో మునిగి ప్రజలను హింసించాడు. అతని వారసుల కాలంలో కూడా పరిస్థితులు మెరుగుపడలేదు. కాశ్మీరులో అరాచకం చెలరేగింది. తుదకు కాశ్మీరు రాజ్యాన్ని క్రీ.శ. 1139 లో షామీర్ అను తురుష్క యోధుడు ఆక్రమించాడు.

## 15. 3. గాంధార, పంజాబుల నేలిన షాహీ వంశాలు :

రాజపుత్ర యుగంలో గాంధార పంజాబు ప్రాంతలను షాహీవంశీయులు పాలించారు. వీరిలో 'తురుష్కషాహి', 'హిందూషాహి అను రెండుశాఖలుగా గలవు. వీరిని గూర్చి తెలుసుకొనుటకు కల్హణుని 'రాజతరంగిణి', ఆల్బెరూని, రచనలు ప్రధాన ఆధారాలు.

(ఎ) తురుష్కషాహీలు : తురుష్కషాహీలు కుషాను వంశంలోనివారు. వీరి రాజధాని కాబూలు. వీరు గాంధార, పంజాబు ప్రాంతాలను పరిపాలిస్తూ అరబ్బుల వ్యాప్తిని అరికట్టుటకై కృషి చేసారు.

(బి) హిందూషాహీలు : తురుష్కషాహీలను తుద ముట్టించి హిందూషాహీలు అధికారం కైవశం చేసుకున్నారు. వీరికి సింధునది ఒడ్డునవున్న ఉదభాండపురం (ఉండ్) రాజధాని. ఈ వంశంలో జయపాలుడు, ఆనందపాలుడు ముఖ్యులు.

జయపాలుని కాలంలో తురుష్క ముస్లిం దండయాత్రల ప్రమాదం ఎక్కువయింది. తురుష్కులు ఆఫ్ఘనిస్థానం ఆక్రమించారు అంతట జయపాలుడు తన రాజధానిని భటిండాకు (త్రి భాండపురం) మార్చాడు. ఆఫ్ఘనిస్థాన్‌ని రెండుపర్యాయములు జయపాలుడు ఓడించాడు. రెండవ పర్యాయం అజ్మీర్ కలంజర్, కనూజ్ ప్రభువులు కూడా జయపాలునకు సాయమువచ్చినను ఫలితం లేకపోయింది సబక్తజిన్ కుమారుడు మహ్మూద్ క్రీ.శ. 1001 లో జయపాలుని ఓడించి బందీగావించాడు. ఆ అవమానం భరించలేక జయపాలుడు అగ్నిలోదూకి ఆత్మాహుతి చేసుకున్నాడు. క్రీ.కశ. 1008 లో మరొకసారి పంజాబుపై దాడిచేసాడు. జయపాలుని కుమారుడు ఆనందపాలు అభ్యర్థన మేరకు ఢిల్లీ, అజ్మీర్, కలంజర్, గ్వాలియర్, కనూజ్ ప్రభువులు అతనికి సైనిక సహాయం చేసారు. అయినను మహ్మూద్ విజయ సాధించి పంజాబును ఆక్రమించాడు. దీనితో పంజాబులో హిందూషాహి పాలన అంతరించింది.

## 15.6 రాజపుత్ర యుగ విశేషాలు

రాజపుత్రులు 5 1/2 శతాబ్దాలపాటు ఉత్తరాపథమున వివిధ ప్రాంతములలో రాజ్యములు స్థాపించుకొని అంతఃకలహములలో నిమగ్నులై తురుష్క దండయాత్రలనుండి భారతదేశాన్ని కాపాడుటలో విఫలురయినను భారతదేశ మత, సంస్కృతులకు వారు అపారమైన సే చేసారు. విదేశ దండయాత్రల వలన హైందవ సంస్కృతి నశింపకుండ కాపాడిన ఘనులు రాజపుత్రులు.

**15.6.1 పరిపాలన :** రాజపుత్రులు కాలానుగుణ్యమైన స్థానిక మార్పులతో పూర్వపు పరిపాలనా విధానాన్నే అనుసరించినారు. ఈ యుగంలో కూడా మంత్రి, మహామాత్య, సంధివిగ్రహిక, భాండాగారిక, ప్రతీహార్త, దండాధీశ మున్నగు ఉద్యోగులు ఉన్నట్లు తెలుస్తుంది ప్రతిహార సామ్రాజ్యం వంటి పెద్ద రాజ్యాలు రాష్ట్రాలుగా విషయాలుగా విభజింపబడినాయి. పరిపాలనా విభాగాలలో గ్రామమే చివరి అంశ

ాజపుత్రులు నిరంతరం యుద్ధాలలో నిమగ్నులై వుండుట వల్ల బలిష్టమైన సైన్యం అవసరమైవుండెను. అందువల్ల యుద్ధావసరములకు ుగినట్లు వీరు తమ పాలనను రూపొందించుకున్నారు.

రాజ్యం చిన్న చిన్న భాగాలుగా విభజింపబడింది. విభాగానికి ఒక సైనికధికారి నియమింపబడినాడు. సైనిక పోషణ నిమిత్తం అతనికి కొంత పంట భూమి కేటాయింపబడేది. క్రమంగా అతడు భూస్వామిగా మారి తన ప్రాబల్యం పెంచుకున్నాడు. ఈ విధంగా రాజపుత్ర యుగంలో భూస్వామ్య వ్యవస్థ ఏర్పడింది. భూస్వాముల ప్రాబల్యం వల్ల రాజులు బలహీనులయ్యారు. వీరు సైన్యాన్ని పోషిస్తూ యుద్ధ సమయములందు రాజుకు సైనిక సహాయం చేస్తూ ఏటేటా కప్పం చెల్లించేవారు. శాసనాలలో కనబడు గజపతి, అశ్వపతి, నారపతి, అనుపదవుల పేర్లను బట్టి రాజపుత్ర సైన్యంలో గజదళం అశ్వదళం, పదాతి దళం ప్రధాన విభాగాలుగా ఉండేవని తెలుస్తున్నది. సైనికులు కత్తులు, ఈటెలు, ధనుర్బాణాలు మున్నగు ఆయుధాలతో పోరాడేవారు. సైనికుడు మరణించినచో అతని కుటుంబ సభ్యులను ప్రభుత్వం పోషించేది. యుద్ధంలో మరణించిన సైనికుల కుటుంబాల పోషణకు వ్యవసాయ భూములు ఇచ్చేవారు. రాజపుత్రులు సమకాలీన మారణాయుధాలను గురించి తెలుసుకొనకపోవుట వలన సశిక్షితులైన, మేలైన ఆయుధాలను కలిగిన ముస్లింలను సమర్థవంతంగా ఎదుర్కొనలేకపోయారు.

ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ మార్గం భూమి శిస్తు. పంటలో మూడవ భాగం శిస్తుగా నిర్ణయింపబడింది. భూమిశిస్తు వసూలు చేయు అధికారులకు వేతనాలకు బదులుగా పంట భూములు కేటాయింపబడింది. క్రమ క్రమంగా వారు భూస్వాములయ్యారు. సమాజంలో వారి ప్రాబల్యం హెచ్చింది. ఈ విధానం గూడా భూస్వామ్యవ్యవస్థకు దారి తీసింది.

**15.6. 2 సాంఘీక పరిస్థితులు :** రాజపుత్ర యుగంలో తరతరాలుగా వస్తున్న చతుర్వర్ణాలే గాక అనేక ఉపవర్ణాలు కూడా ఏర్పడినాయి. ఈ ఉపకులాలు చాలా వరకు అనులోమ, ప్రతిలోమ వివాహాల వలన, వివిధ వృత్తుల వలన ఏర్పడినవే. మహమ్మదీయ దండయాత్రల వలన వర్ణవ్యవస్థ మరింత జటిలమయింది. వర్ణ ధర్మాలకు వ్యతిరేకంగా ప్రవర్తించిన వారికి సమాజంలో గౌరవం ఉండేది కాదు.

బ్రాహ్మణులకు సమాజంలో సమున్నత స్థానం ఉండేది. తమకు క్షత్రియత్వాన్ని ప్రసాదించిన బ్రాహ్మణుల పట్ల రాజ పుత్రులు కృతజ్ఞతా భావంతో వారిని ఆదరించుటయే గాక వారి ఆధిక్యతను గౌరవించి భూదానాలు చేసారు. పన్నులమండి వారికి మినహాయింపు ఉండేది. బ్రాహ్మణులు వర్ణనియమాలను ఖచ్చితంగా పాటించేవారు. కాని జనంలో బ్రాహ్మణాధిక్యత పట్ల నిరసన బయలు దేరింది. ప్రజారక్షకులుగా క్షత్రియులుకు గూడా సమాజంలో గౌరవ ప్రదమైన స్థానం ఉండేది. వీరికి పట్టుదల, కార్యదీక్ష ఎక్కువ. కార్యసాధనలో ప్రాణాలను కూడా త్యాగం చేయు విశిష్ట లక్షణం వీరికి కలదు. వీరికి ప్రాణం కన్న ఆత్మగౌరవం మిన్న. యుద్ధరంగంలో శత్రువులకు తలవంచుట కన్న మరణమే మేలని భావించేవారు. విజయమో లేక వీరస్వర్గమో వీరి లక్ష్యం. స్త్రీలను, గో, బ్రాహ్మణులను రక్షించుట తమ ధర్మంగా తలచేవారు. ప్రాధాన్యంలో తరువాత స్థానం వైశ్యులది. శూద్రులు కష్ట జీవనులు. కర్షకులు, వివిధ వృత్తులవారు ఈ వర్గమునకు చెందిన వారు. నాస్తికులు, పంచములు అధమ వర్ణీకులుగా పరిగణింపబడ్డారు. వారి పరిస్థితి దయనీయంగా ఉండేది. ఈ వర్ణ విభేదాల వలన సాంఘిక ఐక్యత లోపించి జాతీయ భావం కొరపడి దేశ సమైక్యతకు హానికలిగింది.

వర్ణమును బట్టి వృత్తిని అనుసరించే విషయంలో నిబంధనలు కొంత వరకు సడలాయి. బ్రాహ్మణులు వ్యవసాయ వృత్తిని చేపట్టినట్లు శూద్రులు, క్షత్రియ ధర్మాన్ని నిర్వర్తించినట్లు తెలుస్తుంది.

నాటి వివాహాలు చాలావరకు సవర్ణ వివాహాలే. రాచకుటుంబాలలో 'స్వయంవరం' ఉన్నట్లు నాటి సారస్వతాన్ని బట్టి తెలుస్తుంది. రాజపుత్రులలో బహు భార్యాత్వం ఎక్కువ వివాహనిబంధనలు కఠిన తరం కావడం బహుభార్యాత్వానికి ఒక కారణం. ప్రేమ వివాహాలు, రాక్షస వివాహాలు ఈ యుగంలో కన్పిస్తాయి.

రాజపుత్ర యుగపు తొలి దశలో సంఘంలో స్త్రీకి గౌరవ ప్రదమైన స్థానం ఉండేది. స్త్రీలు విద్యావంతులు లలితకళలతోను ప్రభుత్వ నిర్వహణలోను, ఆయుధధారణలోను ఆరితేరిన వారు. సుగంధ, దిద్ద, ఉభయ భారతి, అవంతి సుందరి, అక్కాదేవి మున్నగు ప్రఖ్యాత స్త్రీలు ఈ యుగమున విలసిల్లారు. సుగంధ, దిద్ద కాశ్మీరు రాణులు, పరిపాలనా సామర్థ్యం కలవారు. మండన మిశ్రుని భార్య అయిన

ఉభయ భారతి వేదాంతి. ఆమె తన భర్తకు, శంకరాచార్యునకు మధ్యజరిగిన చర్చలో న్యాయమూర్తిగా వ్యవహరించెనట. రా. ఖరుని భార్య అంతి సుందరి సంస్కృతిలో గొప్ప విద్వాంసురాలు. చాళుక్య విక్రమార్కుని సోదరి అక్కాదేవి. ధైర్యసాహసాలతో పాటు పరిపాలనా సామర్థ్యం కలది. నాటి సంస్కృత కవయిత్రులలో ఇందులేఖ, కురులు, షీల, లక్ష్మీవిజయ, పద్మశ్రీలు ప్రముఖులు. రాజ పుత్ర స్త్రీలు స్త్రీత్వమునకు గౌరవం కల్పించారు. గృహిణులుగా వీరు ఆదర్శప్రాయులు. ప్రాణం కన్న ఆత్మగౌరవం మిన్నగా భావించేవారు. శత్రువుల చుట్టడికి గురియై తప్పించుకొనుటకు అవకాశం లేని సందర్భాలలో రాజపుత్ర స్త్రీలు 'జోహారు' ద్వారా అగ్నికి ఆహుతి అయ్యేవారు. ఈ యుగంలో జోహారు తరుచుగా విన్పిస్తుంది. కాని యుగాంతానికి స్త్రీల పరిస్థితి క్షీణించింది. కన్యాశుల్కం, వరకట్నం, సతీసహగమనం, పరదాపద్ధతి, బాల్యవివాహాలు, బహు భార్యత్వం మున్నగు దురాచారాలు ప్రబలినాయి. "భర్త తినగా మిగిలిన దానితో తృప్తిపడి మారు మాటాడని స్త్రీ "ఆదర్శ గృహిణిగా" పరిగణింపబడింది. స్త్రీలు పరపురుషుని ముఖం చూడరాదు. అంతఃపుర స్త్రీలు సూర్యుని ముఖం కూడా చూడరాదు. (అసూర్యం పశ్యలు) కొన్ని రాజపుత్ర తెగలలో ఆడపిల్లలు పుట్టిన వెంటనే చంపే ఆచారం వుంది. తురుష్క దండయాత్రల వలన స్త్రీల రక్షణ పెద్ద సమస్యగా తయారయింది. వితంతువుల జీవితం దుర్భరంగా ఉండేది. స్త్రీలకు కొంత ఊరట 'స్త్రీ ధనం' అను సాంప్రదాయం పేరిట ఏర్పాటు చేయబడిన సొమ్ము. కొన్ని ధర్మ శాస్త్రాలు కూడా వారికి భర్త ఆస్తిమీద హక్కు కల్పించాయి.

సామాన్య ప్రజలలో విద్యార్జనయందు ఆసక్తి తక్కువగా వున్నట్లు కన్పిస్తుంది. ప్రజలు నీతి నిజాయితీలు కలవారు. వారిలో మూఢ విశ్వాసాలు ఎక్కువ. శకునాలలో, స్వప్నాలలో, మంత్రతంత్రాలలో, తాయెత్తులు జాతకాలలో వారికి ప్రగాఢ విశ్వాసం ఉండేది. గుజరాత్‌లో పక్షిశకునం చూసి బయలు దేరేవారట ! వర్తకులు తమ నీడల పొడవున బట్టి బేరసారాలు సాగించేవారట ! గోపూజ ఎక్కువయ్యింది. ఈ మూఢ విశ్వాసాలు హిందూ సమాజంలో ప్రగతి శీలక మార్పులకు అవకాశం లేకుండా పోయింది.

వేట, చదరంగం, సంగీతం, నాట్యం రాజపుత్రుల ప్రధాన వినోదాలు. వీరు నల్లమందు, మత్తుపానీయాలు సేవించేవారు.

**15.6.3 ఆర్థిక పరిస్థితులు :** ఆర్థిక రంగంలో గణనీయమైన మార్పులు లేవు. యధాస్థితి కొనసాగింది. గ్రామాలలో స్వయం సమృద్ధి సాధింపబడింది. రాకపోకల సౌకర్యాలు, రవాణా సౌకర్యాలు సరిగా లేనందున, నిరంతర యుద్ధాల వలన అధికోత్పత్తి సాధించాలనే ఆసక్తి ప్రజలలో కొరవడింది.

వృత్తి పనివారు శ్రేణులుగా ఏర్పడి తమ తమ వృత్తులను సాగించారు. కానీ ఈ యుగంలో శ్రేణుల ప్రాధాన్యం తగ్గింది. శ్రేణులు, నిర్వహించే కార్యాలను భూస్వాములు నిర్వహించ నారంభించారు.

రాజ్యాస్థానాలలో, సామంత ప్రభువుల కొలువులలో, కులీనుల ప్రాసాదాలతో నెలకొన్న విలాసజీవనం వలన జాతీయ ఆదాయం దుర్వ్యయమగుటవలన పారిశ్రామికాభివృద్ధికి అవరోధం ఏర్పడింది. ధర్మశాస్త్రాలు విదేశీ పర్యటన నిషేధించుటవలన విదేశ సంబంధాలు సన్నగిల్లి విదేశ వాణిజ్యం కుంటుపడింది. తత్ఫలితంగా నగరాలు వృద్ధి చెందలేదు. భారతదేశంలో నగరాల సంఖ్య తక్కువని అరబ్బు బాటసారులు పేర్కొన్నారు. వడ్డీ వ్యాపారం మాత్రం జోరుగా సాగింది. రుణాల మీద 15 శాతం వడ్డీ వసూలు చేసేవారు. కొన్ని సందర్భాలలో 30 శాతం గూడా వడ్డీ వసూలు చేసినట్లు తెలియుచున్నది. వడ్డీ రేటు కులాన్ని బట్టిమారుతూ ఉండేది. బ్రాహ్మణుల నుండి తక్కువ వడ్డీ, శూద్రులు నుండి ఎక్కువ వడ్డీ వసూలు చేయబడేది.

దేవాలయాలకు, బ్రాహ్మణులకు ప్రభువులు, ప్రజలు చేసిన దానాలను బట్టి దేశం సుభిక్షంగా వున్నట్లు తెలుస్తుంది.

**15.6. 4 మత పరిస్థితులు :** రాజపుత్ర యుగంలో మత వ్యవస్థలో గణనీయమైన మార్పులు జరిగినాయి. రాజపుత్రులలో ఎక్కువమంది హిందూ మతాభిమానులు. వారి ఆదరణలో హిందూ మతానికి నూతన చైతన్యం బలం చేకూరినాయి. ఈ విధంగా హిందూ మతం శక్తి సంపన్నమగుటకు ప్రధాన కారణం కుమారిలభట్టు, త్రిమతా చార్యులని పేరొందిన శంకర, రామానుజ, మధ్వాచార్యులను వారు.

శంకరాచార్యులు దక్షిణాదిన (క్రీ.శ. 700 - 820) కేరళలోని కాలడి గ్రామంలో జన్మించాడు. బాల్యంలోనే సన్యసించిన శంకరాచార్యులు తన జీవితాన్ని హిందూ మతోద్ధరణకు అంకితం చేశాడు. ఈయన భగవద్గీతలకు, బ్రహ్మసూత్రాలకు భాష్యాలు వ్రాసి అద్వైత సిద్ధాంతమును ప్రచారం చేసాడు.

హిందూ మతంలోని అనాచారాలను, జైన, బౌద్ధాలను ఖండిస్తూ అద్వైతాన్ని బోధిస్తూ దేశ వ్యాప్తంగా పర్యటించాడు. ఈయన యజ్ఞయాగాది క్రతువులను నిరసించి భక్తి, జ్ఞాన, వైరాగ్య మార్గాల ద్వారా మోక్షం పొందవచ్చునని బోధించాడు. ప్రతి జీవిలోను పరమాత్మకలదని, జీవాత్మ పరమాత్మలో కలియుటయే మోక్షమని శంకరాచార్యుడు చెప్పాడు. ఈయన విధానాన్ని ఉత్తర మీమాంస పద్ధతి అంటారు. తన సిద్ధాంతాలను ప్రచారం చేయుటకు ఆయన దేశం నలుమూలలా మఠాలు స్థాపించి పరివ్రాజక వర్గాన్ని రూపొందించాడు. కాశ్మీరులో బదరీ మఠం, గుజరాత్‌లో ద్వారకామఠం, ఒరిస్సాలో పూరీమఠం, మైసూరులో శృంగేరి మఠం, తమిళనాడులో కాంచీమఠం శంకరాచార్యులు నెలకొల్పిన ప్రసిద్ధ మఠాలు. ఆయన అనుయాయులను స్మార్తులు అంటారు.

త్రిమతాచార్యులలో రెండవవాడు రామానుజాచార్యులు క్రీ.శ. (1017 - 1137) ఈయన విశిష్టాద్వైత మార్గమును ప్రతిపాదించాడు. మోక్షసాధనకు విష్ణు భక్తియే సాధనమని, జీవాత్మ పరమాత్మ చెంతకు చేరుటయే మోక్షమని రామానుజుడు బోధించినాడు. ఈయన శ్రీరంగం, తిరుపతి, కాంచీ నగరాలను ప్రధాన కేంద్రాలుగా చేసుకొని విశిష్టాద్వైతమత ప్రచారం చేశాడు. రామానుజుడు సామాన్య జనులకు ప్రపత్తి మార్గాన్ని బోధించాడు.

కర్ణాటకంలోని ఉడిపి నివాసి యగు మధ్వాచార్యులు (క్రీ.శ. 1238 - 1317) త్రిమతాచార్యులలో మూడవవాడు. ఈయన ద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. పరమాత్మ, జీవాత్మ వేరనియు, భక్తి ద్వారా జ్ఞానం సంపాదించిన వారికి మోక్షప్రాప్తికలుగునని ఈయన బోధించాడు. ఈయన విష్ణుభక్తి ద్వారా మోక్షము కలుగునని చాటాడు.

రామానుజుని సమకాలీనుడైన నింబార్కుడు ఆంధ్రుడు. ఈయన ద్వైత, అద్వైత సిద్ధాంతాలను సమన్వయ పరచి భేదాభేదా సిద్ధాంతాన్ని ప్రతిపాదించినాడు. నింబార్కుడు తన మత ప్రచారానికి మధురను కేంద్రంగా చేసుకున్నాడు.

ఈ మతాచార్యుల బోధనలవలన హిందూ మతం నూతన ఉత్తేజాన్ని పొందింది. మోక్షమార్గం సుగమం చేయుట వలన హిందూ మతానికి విశేష ప్రజాదరణ లభించింది. భగవద్భక్తిని చాటు పురాణాలు పవిత్ర గ్రంథాలయ్యాయి. వీటి వలన వ్రతాలలో, దాన ధర్మాలలో, తీర్థాటనలలో, దేవతా రాధనలో ప్రజలలో శ్రద్ధాసక్తులు పెరిగాయి. త్రిమూర్తులతో పాటు దుర్గ, గణపతి, సూర్యుడు మున్నగు దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించి, పూజించటం అధికమయ్యింది.

ఈ యుగంలో కృష్ణా రాధన, సూర్యారాధన అధికమయినట్లు కన్పిస్తుంది. ఇవి విశేష ప్రజాదరణ పొందాయి. ఆలయ నిర్మాణం పవిత్ర కార్యంగా భావించబడింది. దేవాలయాలు మతంతో పాటు సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక కార్యక్రమాలకు కేంద్రాలయినాయి స్మార్తులను అనుకరిస్తూ శైవులు, వైష్ణవులు మఠాలు నెలకొల్పి మత ప్రచారం కొనసాగించారు.

రాజపుత్ర యుగంలో హిందూ మతం విశేష ఆదరణ పొందినప్పటికీ బౌద్ధ జైన మతాలు పూర్తిగా అదృశ్యం కాలేదు. పాల వంశీయుల ఆదరణలో తాంత్రిక లేక వజ్రయాన బౌద్ధమతం బెంగాలులో వ్యాపించింది. ఇందులో బహుదేవతారాధన, శక్తి ఆరాధన, బలి సమర్పణ మున్నగుదురాచారాలు ఉన్నందున ఈ మతం ప్రజాదరణ కోల్పోయింది. అంతేగాక గుప్త యుగంలో వలె ఈ యుగంలో కూడా బుద్ధుడు దశావతారాలలో ఒక అవతారంగా భావింపబడ్డాడు. దీనితో బౌద్ధమతం తన ప్రత్యేకతను కోల్పోయింది. జైనమతం గుజరాత్, రాజస్థాన్, మైసూర్ ప్రాంతాలలో ఆదరణ పొందింది. గుజరాత్ నేలిన సోలంకీ ప్రభువులు కొందరు జైన మతాన్ని పోషించారు.

రాజ పుత్రయుగంలో ఈ మతాలేగాక భారతదేశంలో క్రొత్తగా ప్రవేశించిన ఇస్లాం మతం గూడా వ్యాపించుట ప్రారంభమయింది. అరబ్బులు, తురుష్కులు మున్నగు ముస్లిం దండయాత్రికులు వలన ఇస్లాం ఉత్తరాపథంలో కాలుమోపింది. కుల భేదాలు లేని ఇస్లాం వ్యవస్థ హైందవ సమాజంలోని క్రింది వర్ణాల వారిని ఆకర్షించింది. వత్తిడుల వల్ల, ఆర్థిక పరమైన ఆకరషణలవల్ల గూడా మతాంతరుల సంఖ్య పెరిగింది.

**15.6. 5 సాహిత్యాభివృద్ధి :** రాజపుత్ర యుగంలో గుప్తయుగంలో వలె అపార సాహిత్య సృష్టి జరిగింది. అనేక మంది రాజపుత్ర ప్రభువులు విద్యాభిమానులు, కవులు, కవిపోషకులు, ఈ యుగంలో విద్యాలయాలు నెలకొల్పబడ్డాయి. నలందా విశ్వవిద్యాలయానికి పోటుగా పాలవంశ ప్రభువులు విక్రమశిల, జగల, ఉద్దంతపురి విశ్వవిద్యాలయాలు స్థాపించినారు. సేనవంశీయుల కాలంలో బెంగాలులోని నవద్వీపం వైదిక విద్యలకు కేంద్రమయింది. శ్రీనగర్, వారణాసి, కనూజ్, ధారా, మున్నగు నగరాలు నాటి ప్రసిద్ధ సంస్కృత కేంద్రాలు.

సంస్కృత విద్యలతో పాటు అచట ఖగోళ గణిత, వైద్యశాస్త్రాలలో విశేష కృషి జరిగింది. కులాన్ని బట్టి విద్యలు ఉండేవి. బ్రాహ్మణులు ప్రత్యేక పాఠశాలలుండేవి. వారి విద్య ప్రధానంగా మతపరమైనది. ఇతరులకు వృత్తి పరమైన విద్యలు బోధింపబడేవి. పాఠశాలలు దేవాలయాలకు అనుబంధంగా ఉండేవి. శైవ, వైష్ణవ మతాలు విద్యాకేంద్రాలుగా కూడా పనిచేసేవి. బౌద్ధులకు, జైనులకు ప్రత్యేకంగా వారివారి పాఠశాలలు కలవు. తురుష్కులు నలందా విశ్వవిద్యాలయం నాశనం చేసిన తరువాత బౌద్ధ విద్యలకు తీవ్రనష్టం వాటిల్లింది. జైన విద్యా కేంద్రాలు గుజరాత్, రాజస్థాన్‌లలో ఎక్కువగా ఉండేది.

ఈ యుగంలో మొదట ప్రాకృత భాషకు ప్రాపకం లభించింది. ఈ భాషలో అనేక కావ్యాలు రచింపబడ్డాయి. కనూజ్ ప్రభువైన మహేంద్రపాలుని రాజశేఖరుడు ప్రాకృత భాషలో 'కర్పూర్ మంజరి' అను నాటకాన్ని రచించాడు. అదే విధంగా హేమచంద్రడు 'కుమారచరితం' అనే వ్యాకరణం రాసాడు. పద్మకీర్తి, ధనపాల, హరిభద్ర, పుష్పదంత మున్నగువారు నాటి యితర ప్రసిద్ధ ప్రాకృత కవులు.

రాజపుత్ర రాజులలో అనేక మంది కవులు పండితులు కలరు. వారిలో శిరోభూషణం వంటివాడు పరమాత ప్రభువైన భోజుడు. ఈయన అలంకారం, ఆయుర్వేదం, వేదాంతం, జ్యోతిష్యం, వ్యాకరణం మున్నగు వివిధ విషయాలపై 20 పైగా గ్రంథాలు రచించాడు. వానిలో ముఖ్యమైనవి 'చంపూరామాణం' 'సరస్వతి కంఠాభరణం', 'శృంగారప్రకాశ' మనే అలంకార శాస్త్రం, 'యుక్తి కల్పతరువు' అనే రాజనీతిశాస్త్రం, 'సమరాంగణ సూత్రధార' యను వాస్తు శాస్త్రం, 'తత్వ శాస్త్రం' అనే శైవ తత్త్వ గ్రంథం, యోగసూత్రాల మీద 'రాజమార్తాండం' అనే భాష్యం. బెంగాలునేలిన లక్ష్మణసేనుడు, అన్హిల్ వాడ ప్రభువు మహీపాలుడు గొప్పకవులు.

రాజపుత్ర ప్రభువుల పోషణలో పద్య, గద్య, నాటక, చారిత్రక, రాజనీతి, శాస్త్రీయ గ్రంథ రచన సాగింది. నాటి రచనలలో క్షేమేంద్రుని 'బృహత్కథా మంజరి' సోమదేవుని 'కథా సరిత్సాగరం' కథా సాహిత్యమునకు చెందినవి.

మాఘుని 'శిశుపాలవధ' శ్రీహర్షుని 'నైషధచరిత్ర' లీలా శుకుని 'కృష్ణకర్ణామృతం', జయదేవుని 'గీతగోవిందం', సోమదేవుని 'యశస్తిలదకం' మున్నగునవి నాటి ప్రసిద్ధ కావ్యరచనలు.

భవభూతి సుప్రసిద్ధ నాటక కర్త, కనూజ్ ప్రభువగు యశోవర్మ ఆస్థాన కవి కాళిదాసుకు సాటి అయినవాడు. ఈయన ఉత్తర రామచరితం, 'మాలతీమాధవం', 'మహావీరచరిత్ర' అనే నాటకాలు రాశాడు. రాజశేఖరుడు. 'విద్ధసాల భంజిక' 'బాలరామాయణం' 'కర్పూర మంజరి' అను ప్రసిద్ధ నాటకాలను రచించాడు. 'కర్పూరమంజరి' భారతదేశ సారస్వతంలోని ప్రముఖ సుఖాంత నాటకాలలో ఒకటిగా కొనియాడబడింది. కృష్ణ మిశ్రుని 'ప్రబోధ చంద్రోదయం' నాటి మరొక నాటకరచన. నాటి చారిత్రక రచనలలో కల్హణుని 'రాజతరంగిణి' తలమానికం వంటిది. ఇది భారతదేశంలో మొట్ట మొదటి చారిత్రక గ్రంథం; కాశ్మీర రాజుల చరిత్రను వివరిస్తుంది. క్షేమేంద్రుని 'నృపావళి' పద్మ గుప్తుని 'నవసాహసాంక చరిత్ర', బిల్హణుని 'కర్ణసుందరి', 'విక్రమాంక దేవ చరిత్ర' నాటి చారిత్రక రచనలలో ప్రధానమైనవి. పరమార సింధురాజును గూర్చి తెలుసుకొనుటకు 'నవసాహసాంకచరిత్ర' అత్యంత ఉపయుక్తం.

గణిత, ఖగోళ, వైజ్ఞానిక శాస్త్ర రచనలు కూడా ఈ యుగమున వెలువడ్డాయి. వరాహమిహిరుని 'బృహత్సంహిత'కు భట్టోత్పలుడు, వాత్సాయనుని 'కామసూత్రాలకు యాదవభట్టు, పురుషోత్తమదేవుడు వ్యాఖ్యానాలు వ్రాశారు. "సిద్ధాంత శిరోమణి" అనేగణిత శాస్త్ర గ్రంథాన్ని భాస్కరాచార్యుడు, 'చికిత్సాసారసంగ్రహం' అనే వైద్య గ్రంథాన్ని చక్రపాణి దత్తుడు, 'సంగీతరత్నాకరం' అనే సంగీత శాస్త్ర గ్రంథాన్ని సారంగదేవుడు రచించాడు.

ఆనంద వర్ధనుని 'ధ్వన్యాలోకం, 'కుంతకుని వక్రోక్తి' ధనుంజయుని 'దశరూపకం', హేమచంద్రుని 'కుమారపాలచరిత్ర' మున్నగునవి నాటి వ్యాకరణ, అలంకార శాస్త్ర గ్రంథాలు. 'అభిదాన చింతామణి' హేమచంద్రుని చేకూర్చబడిన పర్యాయ పదకోసం. ముమ్మటుని 'కావ్యప్రకాశం' ఈ యుగమునకు చెందినవి.

ఈయుగంలో ప్రాంతీయ భాషలలో కూడా అనేక గ్రంథాలు రాయబడ్డాయి. హిందీ, గుజరాతి, మరాఠి, బెంగాలీ మున్నగు ప్రాంతీయ భాషలలో గ్రంధాలు వెలువడ్డాయి. హిందీలో ఆదిగ్రంథంగా పరిగణింపబడు 'పృధ్వీరాజరాసో' ను చాంద్ బర్దాయ్ రచించాడు.

**15.6.6 వాస్తు శిల్ప కళాభ్యుదయం :** సాహిత్య పోషణతోపాటు వాస్తుశిల్పకళా రంగాలకు కూడా రాజపుత్రులు గణనీయమైన సేవచేశారు. వారు బలిష్టమైన దుర్గాలను అందులో సుందరమైన రాజప్రాసాదాలను, దేవాలయాలను నిర్మించారు. గ్వాలియర్, కలంజర్, అజ్మీర్, చిత్తోడ్, జయపూర్, ఉదయపూర్, జోధ్‌పూర్, రణదంభోర్ మున్నగు శత్రు దుర్భేద్యములైన దుర్గాలను వారు నిర్మించారు. ఇవి వారి వాస్తు నిర్మాణ కౌశల్యానికి నిదర్శనాలు. అట్టివానిలో గ్వాలియర్‌లోని మాన్‌సింగ్ భవనం, జయపూర్, ఉదయ్‌పూర్‌లలోని భవనాలు పేర్కొనదగినవి.

రాజపుత్రులు అనేక సుందరమైన దేవాలయాలు నిర్మించారు. వారి ఆలయనిర్మాణంలో ప్రధాన కేంద్రాలు మూడు, అవి : గుజరాత్, మధ్యప్రదేశ్, ఒరిస్సాలు. ఈమూడు ప్రాంతాలలో నగర, ద్రావిడ, వేసర అనుమూడు ప్రత్యేకశైలులు రూపొందాయి.

గుజరాత్ లోని ఆలయాలలో కధియవాడ్‌లోని సోమనాథ్ ఆలయం, మొఢేరాలోని సూర్యదేవాలయం, ఆబూశిఖరం మీద వస్తుపాల, తేజపాల అనే వర్తక సోదరులు నిర్మించిన జైన ఆలయాలు ప్రముఖమైనవి. జైనాలయాలు పూర్తిగా పాలరాతితో నిర్మింపబడ్డాయి. ఈ ఆలయాలలో ప్రతి అంగుళము అద్భుత శిల్పకళా సమన్వితం. ఇవి అత్యున్నత దశను చేరిన గుజరాత్ శిల్పకళాశైలికి తార్కాణాలు.

మధ్య ఇండియాలోని శిల్పశైలి ఖజురహో దేవాలయాలలో కన్పిస్తుంది. ఈ ఆలయాలను చందేలులు నిర్మించినారు. ఇవి ఎత్తైన వేదికలమీద నిర్మింపబడినాయి. వీటి గోపురశిఖరాలు అత్యంత సుందరంగా ఉన్నాయి. ఈ ఆలయాలకు లోపల, వెలుపల అపూర్వ శిల్ప సంపద కనుల విందుచేస్తుంది. మహదేవ ఆలయంలోని శిల్పసంపద శృంగారభరితం.

ఉదయపూర్ సమీపంలోని ఏకలింగాలయం, చిత్తోడ్‌ఘర్‌లోని కాళిక ఆలయం, జోధ్‌పూర్ సమీపమున నిర్మింపబడిన అద్భుతమైన హిందూ, జైన ఆలయాలు రాజపుత్రస్థానంలోని ప్రముఖ ఆలయాలు. కాంగ్రాలోని జ్వాలాముఖి ఆలయం, మధురలోని ఆలయాలు, ఉజ్జయినిలోని మహాకాళి ఆలయం ఈ యుగానికి చెందిన ప్రసిద్ధ ఆలయాలు. మధురలోని ఒక ఆలయాన్ని గురించి ఘజ్నీ మహమ్మద్ ఆస్థాన చరిత్రకారుడైన ఉత్బీ "మంచి అనుభవజ్ఞులైన శిల్పులయినప్పటికి దీనితోసాటి అయిన ఆలయనిర్మాణం రెండువందల సంవత్సరాలలో పూర్తి చేయగలరనేది అనుమానం" అని రాసినాడు.

భువనేశ్వర్‌లోని లింగరాజ ఆలయం, రాజారాని ఆలయం, ముక్తేశ్వర ఆలయం, కోణార్కలోని సూర్యదేవాలయం, పూరీలోని జగన్నాథ్ ఆలయం ఒరిస్సాలోని ప్రసిద్ధ ఆలయాలు.

ఈ విధంగా రాజపుత్రులు భారత దేశ సారస్వత, కళారంగాలకు అపారమైన సేవ చేసారు.

**15.6.7 రాజపుత్రులలో లోపాలు :** పరస్పర అంతఃకలహాలు అనైక్యత అనేవి రాజపుత్రులలో ప్రధానలోపాలు. మహమ్మదీయుల దండయాత్రను అరికట్టుటకై సమైక్య సామ్రాజ్య ఆవశ్యకతను వారు గుర్తించలేదు. తమశక్తి యుక్తులను అంతఃకలహాలలో వ్యర్థపరచారు. వారు చక్కని పాలనాయంత్రాంగమును ఏర్పరచలేకపోయారు. వారి యుద్ధ ప్రక్రియ, సాధనాలు లోపభూయిష్టాలు. ఈ లోపాలవలన వారు మహమ్మదీయులచే జయింపబడ్డారు.

## 15.7 సారాంశము

ఉత్తరాపథంలో హర్షుని మరణం నుండి ముస్లిం రాజ్యస్థాపనవరకు మధ్యగల కాలాన్ని రాజపుత్ర యుగం అంటారు. ఉత్తర భారతదేశంలో అనేక చిన్న చిన్న స్వతంత్ర రాజ్యాలను ఏర్పరచుకొన్న రాజపుత్రులు పరస్పర అంతఃకలహములలో నిమగ్నులయి తమ శక్తి యుక్తులను వ్యర్థ పరచుకొన తురుష్క దండయాత్రలనుండి భారతదేశమును కాపాడలేకపోయినను హైందవధర్మాన్ని, దేశ సంస్కృతిని రక్షించారు.

### ఉపయుక్త గ్రంథాలు


| | | |
|---|---|---|
| 1. | Majumdar R.C. Raychaudhari H.C., Datta K.K. | : An Advanced History |
| 2. | Makumdar R.C.(Ed) | : The History and culture of the Indian People Vol IV. The Imperial Kanuj. |
| 3. | Romila thapar | : History of India - Vol I |
| | ...nathaier | : A Political and Culture History of India - Vol I |

5. Hanumantha Rao, B.S.L Basavaeswara Rao : Indian History and culture, Vol I
6. Col. James Tod : Annals and Antiquitis of Rajasthan
7. Tripathi R.S : History of Kanuj
8. Sharma R.S : Inidan Feudalism
9. Vidya C.V : History of Medieval Hindu India
10. Majumdar B.P : Socio - Economic History of Northern India
11. Chopa P.N Puri B.N & Das M.N : A Social, Cultural and Economic History of India Vol II
12. Wolseley Haig (Ed) : History of India Vol III
13. Iswari Prasad : History of Medieval India from 647 A.D. to 1526 A.D
14. Mehta J.L. : Advanced Study in the History of Medieval India Vol I
15. Habibullah, A.B. M. : Foundation of Muslim Rule in India
16. వారణాసి యశోదాదేవి హనుమంతరావు B.S.L : భారతదేశ చరిత్ర - సంస్కృతి, ప్రథమ భాగము తెలుగు అకాడమి ప్రచురణ.


## ప్రశ్నలు

I. వ్యాస ప్రశ్నలు : (Essay Questions)

1. రాజపుత్రుల పుట్టు పూర్వోత్తరాలను గురించిన సిద్ధాంతాలలోని గుణదోషాలను చర్చింపుము.
2. రాజపుత్రయుగ విశేషాలను వివరింపుము

II. లఘు వ్యాస ప్రశ్నలు (Short Essay Questions)

1. ఘూర్జరప్రతీహారులు సాధించిన విజయాలేవి ?
2. గౌడ దేశమునకు పాలవంశీయులు చేసిన సేవ లెట్టివి ?
3. రాజపుత్రయుగ మత పరిణామములను వివరింపుము
4. రాజపుత్ర యుగమున జరిగిన సాహిత్యాభివృద్ధిని తెల్పుము
5. రాజపుత్రులు కళారంగమునకు ఎట్టి సేవచేసిరి ?

III. లఘు వ్యాఖ్యలు (Short Notes)

1. చౌహానులు
2. సోలంకీలు
3. కాలచుర్యులు
4. చందేలులు
5. గహద్వాలులు
6. పరమారులు
7. కర్కోట వంశం
8. హిందూ షాహీలు
9. ఉత్పలవంశం
10. లోహరవంశం

IV. కుశాగ్ర బుద్ధి పరీక్ష (Objectiv Type Questions)

ఈ క్రింది వానికి సరియగు సమాధానములు బ్రాకెట్లలో వ్రాయండి

1. ప్రతీహరుల రాజధాని ( )
   ఎ) స్థానేశ్వరం బి) నాడియ
   సి) కనూజ్ డి) కలంజర్ ఇ) అజ్మీర్

2. పరమారులలో సుప్రసిద్ధ కవిరాజు ( )
   ఎ) ఉపేంద్రుడు బి) ముంజరాజు
   సి) జయశక్తి డి) భోజుడు ఇ) మహీపాలుడు

3. ఖజురహో దేవాలయ నిర్మాతలు ( )
   ఎ) కాలచుర్యులు బి) చందేలులు
   సి) సోలంకలు డి) సేవవంశీయులు ఇ) గహద్వాలులు

4. చౌహాను వంశంలో ప్రసిద్ధుడు ( )
   ఎ) విశాలదేవుడు బి) సింహరాజు
   సి) జయచంద్రుడు డి) పృధ్వీరాజు ఇ) యశోవర్మ

5. జయచంద్రుడు ఏ వంశానికి చెందిన వాడు ( )
   ఎ) ప్రతీహారులు బి) పరమారులు
   సి) గహద్వాలులు డి) పాలవంశం ఇ) వాఘేలులు

6. గీతాగోవింద రచయిత ( )
   ఎ) రాజశేఖరుడు బి) సోమదేవుడు
   సి) పద్మగుప్తుడు డి) లీలాశుకుడు ఇ) జయదేవుడు

7. సోమనాధ దేవాలయాన్ని ధ్వంసం చేసినవాడు ( )
   ఎ) కుతుబుద్దీన్ బి) మహమ్మద్ బీన్ ఖాసిం
   సి) షామీర్ డి) ఘజ్నీ మహమ్మద్ ఇ) ఘోరీమహమ్మద్

8. రాజతరంగిణి రచయిత ( )
   ఎ) బిల్హణుడు బి) మాఘుడు
   సి) పద్మగుప్తుడు డి) కల్హణుడు ఇ) క్షేమేంద్రుడు

9. చాంద్ బర్దాయ్ రచించిన కావ్యం ( )
   ఎ) పృధ్వీరాజు విజయం బి) పృధ్వీరాజరాసో
   సి) బృహత్కధ డి) నవసాహసాంకచరిత్ర ఇ) కథాసరిత్సాగరం

10. విక్రమశిల విశ్వవిద్యాలయ స్థాపకుడు ( )
    ఎ) ధర్మపాలుడు బి) గోపాలుడు
    సి) దేవపాలుడు డి) మహీపాలుడు ఇ) లక్ష్మణ సేనుడు

II. ఈ క్రింది వానిని జతపర్చుము

| | | |
|---|---|---|
| 1. రాజశేఖరుడు | ( ) | (ఎ) విక్రమాంక దేవ చరిత్ర |
| 2. భవభూతి | ( ) | (బి) శిశుపాలవధ |
| 3. బిల్హణుడు | ( ) | (సి) కధాసరిత్సాంగరం |
| 4. క్షేమేంద్రుడు | ( ) | (డి) కర్పూరమంజరి |
| 5. మాఘుడు | ( ) | (ఇ) సిద్ధాంత శిరోమణి |
| 6. శ్రీ హర్షుడు | ( ) | (యఫ్) ఉత్తర రామచరితం |
| 7. సోమదేవసూరి | ( ) | (జి) సరస్వతి కంఠాభరణం |
| 8. భాస్కరాచార్యుడు | ( ) | (హెచ్) బృహత్కధామంజరి |
| 9. పద్మగుప్తుడు | ( ) | (ఐ) నైషచరిత్ర |
| 10. భోజుడు | ( ) | (జె) నవసాహసాంక చరిత్ర |

3. భారతదేశ రేఖాపటంలో దిగువ రాజపుత్ర రాజ్యాలను సూచింపుము.

(1) సోలంకీలు (2) చౌహానులు (3) కాలచుర్యులు (4) బుందేలులు (5) ప్రతీహారులు

జవాబులు

1. 1-సి, 2-డి, 3-బి, 4-డి, 5-సి, 6- ఇ, 7-డి, 8-డి, 9-బి, 10- ఎ

2. 1-డి 2-ఎఫ్ 3-ఎ, 4-హెచ్, 5-బి 6-ఐ 7-సి 8-ఇ 9-జె 10-జి

పాఠం - 16

# భారతీయ సంస్కృతి వ్యాప్తి - ఆగ్నేయాసియా

## లక్ష్యం

ప్రాచీన భారతీయ సంస్కృతి ఇతర రాజ్యాలకు ఎప్పటినుండి విస్తరించింది ? మన సంస్కృతి విస్తరించటానికి దోహదపడిన అంశములు ఏవి ? మన సంస్కృతి ఏ ఏ రాజ్యాలకు విస్తరించింది. భారతీయ సంస్కృతి ఇతర రాజ్యాలలో విస్తరించుట వలన కల్గిన ఫలితాలు ఏమిటి ? మొదలగు విషయాలను తెలుసుకొనటం ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

**16.1 ఉపోద్ఘాతం**

**16.2 భారతీయ సాంస్కృతిక వ్యాప్తికి దోహదపడిన అంశములు**

**16.3 విదేశాలలో భారతీయ సాంస్కృతిక వ్యాప్తి**

**16.4 ఇతర దేశములలో భారతీయ సంస్కృతి విస్తరణ :**

**16.5 ఆగ్నేయ ఆసియాలో భారతీయ సంస్కృతి - దేశపరిస్థితులు.**

**16.6 ముగింపు**

## 16.1 ఉపోద్ఘాతం

ప్రాచీనకాలం నుండి భారతదేశానికి ఇతర ప్రపంచ రాజ్యాలతో దగ్గర సంబంధాలు ఉండేవి. నూతన శిలాయుగ కాలంలోనే భారత ప్రజలు ఇండో - చైనా మొదలగు దేశాలకు వెళ్ళి స్థిరపడినారు. ప్రాచీన భారతదేశ చరిత్రలోనే కాక, అఖిల ఆసియాఖండ చరిత్రలో కూడ భారతీయ సంస్కృతి విస్తరణ చెప్పుకోదగినది. అనాదిగా భారతదేశమునకు పశ్చిమ దేశాలైన బాబిలోనియా, సిరియ, ఈజిప్టులతో వర్త సంబంధాలు కలిగియుండిరి. గ్రీకు, పారశీక దండయాత్రల ఫలితముగ భారతదేశంనకు విదేశంతో గల సంబంధాలు బలపడెను. అజ్ఞాత యాత్రికుడు రాసిన "ది పెరిప్లాన్ ఆఫ్ ది ఎరిధియన్సీ" అనే గ్రంథంలో సింధు దేశానికి, పశ్చిమ రాజ్యాలకు మధ్య వాణిజ్య సంబంధాలు ఉన్నాయని పేర్కొనెను. భారతదేశములోని ముత్యాలు, రత్నాలు, వజ్రాలు, సుగంధ ద్రవ్యాలు, మస్లిన్ బట్టలకు పశ్చిమ దేశాలలో మంచి గిరాకి ఉండేది. ప్రాచీన భారతీయ వాఙ్మయంలో మలయా, ఇండోనేషియాలు "సువర్ణ ద్వీపం" గా ప్రసిద్ధిచెందినాయి. అంటే ఆ ప్రాంతాలలో బంగారం విరివిగా లభిస్తుందని నాటి ప్రజల విశ్వాసం. ఇండోనేషియాలోని జావాను 'యవద్వీపం' అనేవారు. ఇటువంటి ఆశలతోనే భారతీయులు ఆయా దేశాలతో వాణిజ్యాన్ని సాగించినారు. ఆనాడు అనేక రేవుపట్టణంలు గలవు. బరుకచ్ఛం, కల్యాణి, నాగపట్టణం, కావేరిపట్టణం, మోటుపల్లి, కోడూరు, కోరంగి, కళింగపట్టణం, దంతపురి, తామ్రలిప్తి, మొదలగునవి పేర్కొనదగినవి. 'ప్లిని' రాసిన గ్రంథంలోకూడా పై విషయాలను రూఢీ చేయుచున్నవి. భారతదేశంలోని అనేక ప్రాంతంలలో ఆనాటి రోమన్ నాణెంలు లభ్యమయ్యాయి. క్రీ.పూ. 26 లో ఒక పాండ్యరాజు ఒక వ్యాపార బృందాన్ని రోమన్ చక్రవర్తి ఆగస్టస్ వద్దకు పంపెనట.

అశోకుని కాలం నుండి బౌద్ధమత ప్రచారకులు అసాధారణ ధైర్యసాహసాలతో, మతదీక్షతో మధ్య ఆసియా, చైనా, టిబెట్టు, సింహళం, మొదలగు దేశంలకు వెళ్లి బౌద్ధమత ప్రచారంను గావించిరి. భారతదేశంలో రాజ్యాధికార అవకాశాలులేని రాకుమారులు ఆయా దేశాలకు వెళ్లి ప్రజల ఆదరాభిమానాలు పొంది రాజ్యాలు స్థాపించినారు. ఇట్లు స్థాపించిన ఈ వలస రాజ్యంలందు భారతీయులు రాజకీయ, ఆర్థికరంగంలందు విశేషపాత్రను వహించి, ఆ దేశంలో సంస్కృతిని నిర్మూలింపక, తమ మాతృ సంస్కృతిని విడనాడక - రెండింటిని జోడించి వినూత్నమైన సంస్కృతిని రూపొందించిరి. ఈ వలస రాజ్యాలు క్రీ.శ. 15 శతాబ్ది నాటికి దాదాపు అంతరించినను, ఆవరల రాజ్యాల సంస్కృతియందు భారతీయ సంస్కృతి ప్రభావం నేటికిని చెక్కుచెదరక యున్నది.

## 16.2 భారతీయ సంస్కృతిక వ్యాప్తికి దోహదపడిన అంశంలు :

(1) ప్రాచీన భారతదేశంలో లభించు వస్తువులను విదేశీ మార్కెట్లలో విక్రయించి, అధిక లాభాలు పొందాలని భారతీయ వ్యాపారుల ఆశించుట.

(2) బౌద్ధమత ప్రచారకులు, శైవ, వైష్ణవ మతప్రచారకులు తమ మతంలను విదేశంలందు వ్యాప్తి చేయాలని సంకల్పించి, ఆయా దేశంలకు వెళ్లుట.

(3) వారసత్వ రీత్యా అధికారము పొందని భారతీయ రాజ కుటుంబంలందలి వ్యక్తులు నూతన దేశాలకు తమ బలంతో అచ్చట రాజ్యాంలను ఏర్పాటుచేసుకొని, పరిపాలన సాగించుట.

ఇట్లు విదేశాలకు వ్యాపారసంస్థతో, మతప్రచార ఆశయ సాధనతో, సామ్రాజ్య స్థాపనాశయంతో వెళ్లిన భారతీయులు కొందరు స్థిరపడి, నూతన సంస్కృతి వ్యాప్తికి దోహదపడిరి.

ప్రాచీనకాలంన భారతీయులు విదేశంలందు స్థాపించిన వలసప్రాంతాలు ఏమనగా, సింహళం, ఆగ్నేయాసియా రాజ్యనములైన, బర్మా, మలయా, ఇండోనేషియా, ఇండోచైనా మరియు చైనా, టిబెట్, కొరియా, జపాన్, మధ్యఆసియా, ఆఫ్ఘనిస్తాన్, ఈజిప్టు, మెక్సికోలలో కూడా భారతీయ సంస్కృతి విస్తరించెను.

## 16.3 విదేశాలలో భారతీయ సంస్కృతిక వ్యాప్తి :

**16.3.1 సింహళం (SIMHALAM) :** సింహళం ద్వీపానికి భారతదేశానికి చాలా ప్రాచీనకాలం నుండి సన్నిహిత సంబంధాలు కలవు. దీనినే పురాణాలలో లంక అనీ, బౌద్ధమత వాఙ్మయంలో నాగలోకమని, తామ్రపర్ణి, అని పేర్కొనబడెను. ముత్యాలకోసమై భారతీయులు ఈ దీవితో వర్తకం సాగించినారు. సింహళ బౌద్ధమత గ్రంథమైన మహావంశాన్ని బాట్టి క్రీ.పూ. 5 వ శతాబ్దంలో విజయుడనే ఉత్తరదేశ రాకుమారుడు సింహళ దేశాన్ని జయించి రాజ్యస్థాపన చేసినట్లు తెలియుచున్నది. భారతీయ నాగరికతా సంస్కృతులు వ్యాప్తిచేసినాడు. ఇతడు గౌతమబుద్ధుని సమకాలికుడు.

తదుపరి కాలంలో అశోకుడు తన బంధువగు మహేంద్ర, సంఘమిత్రులను బౌద్ధమత ప్రచారం, కొరకు సింహళంనకు పంపెను. నాడు సింహళంను 'దేవానాంపియతిస్స' అనే రాజు పాలించుచుండెను. అతడు బౌద్ధమతంను స్వీకరించి, బుద్ధుని ధాతువును సంపాదించి 'అనురాధపురంలో, ఒక బౌద్ధ స్థూపంను నిర్మించెను. క్రమంగా ఉభయ దేశాలమధ్య రాజకీయ సంబంధాలు ఏర్పడినాయి.

సంగం యుగంలో భారతీయ దక్షిణాపథ పాలకుడైన కరికాలచోళుడు కరికాలచోళుడు సింహళంపై దాడిచేసి దానిని జయించెను.

చేరరాజైన నేడుంజెలియని ఆహ్వానంపై సింహాధిపుడైన గజబాహు భారతదేశాన్ని దర్శించినాడు.

గుప్తపాలకుడైన సముద్రగుప్తునితో సింహళ పాలకుడైన, మేఘవర్ణుడు స్నేహ సంబంధంలు చేసి, సముద్రగుప్తుని అంగీకారంతో సింహళ బౌద్ధ యాత్రికుల కొరకు బుద్ధగయలో బౌద్ధ విహారంను నిర్మించెను.

పల్లవ, చోళ, పాండ్యరాజులు సింహళ రాజకీయాలలో జోక్యం చేసుకొన్నట్లు తెలియుచున్నది. విజయనగర ప్రభువులు "దక్షిణ సముద్రాధీశ్వర" అను బిరుదాన్ని ధరించినారు.

సాంస్కృతికంగా సింహళం భారతదేశానికి చాలా రుణపడింది. ఉభయదేశాల మధ్య ఏర్పడిన రాజకీయ సాంస్కృతిక సంబంధాల ఫలితంగా భారతీయులు అసంఖ్యాకంగా సింహళానికి వలసవెళ్లినారు. ఆ ఫలితంగా బౌద్ధమతమూ, శైవ, వైష్ణవాలు సిహళంలో ప్రచారమయినాయి. దేవానం పియతిస్స నిర్మించిన స్థూపాన్ని దర్శించటానికి కృష్ణాతీరంలో 'పల్లవభోగ' అనే ప్రాంతం నుండి పదివేల మంది బౌద్ధ భిక్షువులు అనురాధపురం వెళ్లినట్లు 'మహావంశ' గ్రంథం పేర్కొంటున్నది. సింహళం నుంచి బౌద్ధ భిక్షువులు అసంఖ్యాకంగా భారతదేశాన్ని దర్శిస్తూ ఉండేవారు. అటువంటి యాత్రికుల ఉపయోగార్థమే నాగార్జున కొండలో 'సింహళవిహారం' నిర్మించడం జరిగింది నాగార్జునాచార్యుడు, ఆర్యదేవుడు, బుద్ధఘోషుడు, బుద్ధదత్తుడు మొదలైన ప్రసిద్ధ బౌద్ధాచార్యులు సింహళానికి వెళ్లి అక్కడ ధర్మబో‹ జరిపినట్లు తెలుస్తుంది.

సింహళ ప్రజలు భారతీయ వాస్తుశిల్ప రీతులను కూడా అనుసరించినాడు. అనూరాధపురంలోని బౌద్ధ నిర్మాణాలలో ఉండవల్లి గుహాలయాల ప్రభావం కనిపిస్తుంది. శాగిరియా చిత్రాలు అజంతా, బాగ్ చిత్రాలను పోలిఉన్నవి. అటులనే సింహళ బౌద్ధ గ్రంథములైన 'దీపవంశ' 'మహావంశము లందు అనేక భారతీయ చారిత్రక అంశంలు ఉన్నవి.

**16.3.2 బర్మా :** భారతదేశానికి తూర్పుదిక్కున బర్మావుంది. అందుచేత భారత రాజకీయ సాంస్కృతిక ప్రభావానికి బర్మాలోను కావడంలో ఆశ్చర్యంలేదు. భారతీయ సారస్వతంన బర్మా 'సువర్ణ భూమిగా' పేర్కొనబడెను. క్రీ.పూ. 6వ శతాబ్ది నుండి భారతీయ వలసలు బర్మాలో నెలకొనియున్నట్లు తెలియుచున్నది. ప్రధానంగా ఆంధ్ర, కళింగవాసులు అచ్చట వలసలు స్థాపించిరి. మౌర్యపాలకుడైన అశోకుని కాలంలో బర్మాలో బౌద్ధమతం ప్రవేశించింది. మూడో సంగీతి అనంతరం అశోకుడు సోన, ఉత్తర అనే భిక్షువులను బర్మాకు పంపినట్లు తెలుస్తుంది. బర్మాలో అనేక హిందూ రాజవంశీయులు పాలనచేసిరి. "శాన్‌లాన్‌క్రోమ్" వేంగిని పాలించిన శాలంకాయన వంశీయుడని చరిత్రకారులు అభిప్రాయపడిరి. బర్మాలో వాడుకలోగల 'తైలంగి' లిపి క్రీ.శ. 4వ శతాబ్దిలో వేంగిపాలకుల లిపి ఒకటేనని ఎలియట్ పండితుని అభిప్రాయం. బర్మాను పాలించిన హిందూ పాలకులలో ముఖ్యులు 'మ్రామ్మనులు' (క్రీ.శ. 9వ శతాబ్ది) వీరిలో ముఖ్యపాలకుడు అవిరుదుద్దడు. వీరి రాజధాని పాగన్ (అరిమర్దనపురం). ఇతడు భారతీయ స్త్రీని వివాహమాడి, బౌద్ధమతంను స్వీకరించి, అనేక దిగ్విజయ యాత్రలుచేసి సువిశాల సామ్రాజ్యంను స్థాపించెను. ఇతడు 'పాగన్' నందు సుప్రసిద్ధ ష్విజగాన్ (SHEWZIGON) దేవాలయంను నిర్మించెను. బర్మీయుల న్యాయశాస్త్రం, యాజ్ఞల్క్య, నారదుల, ధర్మ స్మృతుల నాధారంగా ఏర్పడినవే. బర్మాలో అనేక సంస్కృత, పాళీ సంబంధించిన శాసనములు దొరికినవి.

**16.3.3 ఇండోనేషియా :** ప్రాచీనకాలంన ఇండోనేషియా ప్రాంతమును భారతీయులు 'సువర్ణ ద్వీపము' అని పిలిచిరి. మలయా ద్వీపకల్పం, సుమిత్రా, జావా, బలి, బోర్నియా ద్వీపములను కలిపి ఇండోనేషియా అందురు.

**16.3.4 మలయా ద్వీపకల్పము :** : మలయాలోని "తకువాసా" (తక్కుల) నౌకాశ్రయం. ఆద్వీపంలో భారతీయ సంస్కృతి విస్తరణకు ముఖద్వారంగా పనిచేసింది. తకువాసా సాహిత్యంలో 'తక్కోళంగా' పిలువబడిందని కొందరి అభిప్రాయం. ఈ తక్కోళం చుట్టూ అనేక హిందూదేవతా విగ్రహాలు, తమిళ శాసనంలు లభించినవి. మలయాలో భారతీయులు లిగర్, జైయపాలటుంగ్ మొదలగు ప్రదేశములందు వలసలు స్థాపించిరి.

**16.3.5 సుమిత్రా :** సుమిత్రానందం భారతీయులు క్రీ.పూ. 3వ శతాబ్దిలోనే తమ వలసలను స్థాపించిరి. కాశ్మీరు రాజైన గుణవర్మ సుమిత్రానందు బౌద్ధమత ప్రచారం చేసినట్లు తెలియుచున్నది. క్రీ.శ. 7వ శతాబ్దిలో శ్రీ విజయ రాజ్యమునకు సుమిత్రా కేంద్రమయ్యెను. చైనా యాత్రికుడయిన ఇత్సింగ్ సుమిత్రాయందు సంస్కృత భాష వ్యాకరణము నభ్యసించెను. సుమిత్రా యందు 100 బౌద్ధ భిక్షులు కలరని అతడు తన రచనలో పేర్కొనెను. ఈ సామ్రాజ్యము శైలేంద్ర వంశీయుల పాలనలో మహోన్నతస్థాయి నందుకొనెను. శైలేంద్రులు తమ సామ్రాజ్యమును మలయా, జావా, బలి, బోర్నియోలకు విస్తరింపచేసిరి. వీరికాలంలోనే బౌద్ధమతం ఆదరణపొంది వ్యాప్తిచెందినది. ఈ శైలేంద్రులు కళింగను పాలించిన శైలోద్భవ శాఖయని చరిత్రకారుల అభిప్రాయం. వీరు తమ శాసనములందు సంస్కృత భాషను ఉపయోగించిరి. వీరు బెంగాల్‌ను పాలించిన పాలవంశీయులతో స్నేహ సంబంధములను కలిపి ఉండిరి. శైలేంద్రుల కాలంలో సుమిత్రా బహుముఖ పురోగతి సాధించెను. నలందా విశ్వ విద్యాలయాధ్యక్షుడైన ధర్మపాలుడు విక్రమశాల, శైలేంద్ర రాజైన బంపుత్ర దేవుడు నలందా విశ్వవిద్యాలయమునకు అనేక దానధర్మాలు చేసినట్లు తెలియుచున్నది.

**16.3.6 జావా :** ఇండోనేషియాలోని రాజ్యములలో జావా ఐశ్వర్యవంతమైనది. దీనిని యువద్వీపమని పిలిచెడివారు. క్రీ.శ. 2వ శతాబ్దిలో జావాను 'దేవవర్మ' అనే హిందూరాజు పాలించినట్లు తెలియుచున్నది. కళింగులు అనేకమంది జావాకు వలసవెళ్లి అచ్చట స్థిరనివాస మేర్పరచుకొన్నట్లు, అచ్చట గల ఒక ప్రాంతమునకు కళింగము అనే పేరుండుట వలన తెలియుచున్నది. జావానందు భారతీయ సంస్కృతి ప్రస్ఫుటంగా కాననగును.

(1) క్రీ.శ. 414 లో ఫాహియాన్ జావాను దర్శించినట్లు, జావాలో వైదికమతం వ్యాప్తిలో ఉన్నట్లు తన రచనలలో పేర్కొనెను.

(2) క్రీ.శ. 424 లో కాశ్మీరు రాకుమారుడైన 'గుణవర్మ' జావాకు వెళ్లి బౌద్ధమతమును ప్రచారముచేసి జావాను బౌద్ధమత కేంద్రముగ చేసెను.

(3) జావాను పరిపాలించిన రాజుల పేర్లను పరిశీలించిన భారతీయ పాలకుల పేర్లను పోలియున్నవి. క్రీ.శ. 6వ శతాబ్దిలో జావాను పూర్ణవర్మన్ అనే రాజుపాలించెను. ఇతడు ఒక కాలువను త్రవ్వించి, వేయి ఆవులను బ్రాహ్మణులకు దానముగా నొసంగెనట.

(4) జావాలో లభించిన పెక్కు శాసనములు సంస్కృత భాషలో, వేంగి లిపిలో ఉన్నవి. ఈ శాసనములందు శాలివాహన శకమును ఉపయోగించుట మరియొక విశేషము.

(5) క్రీ.శ 8వ శతాబ్దిలో జావాను సంజయుడు పాలించెను. ఇతడు "మతరము" ను రాజధానిగా చేసికొని పాలించెను. ఇతడు శైవ మతాభిమాని. తన రాజధానియందు శివలింగమును ప్రతిష్ఠాపన చేసెను.

(6) సంజయుని తదుపరి జావాను శైలేంద్రులు పరిపాలించిరి. వీరు బౌద్ధ మతాభిమానులు. వీరిపాలనలో క్రీ.శ. (778 - 879) జావా సుప్రసిద్ధ బౌద్ధమత కేంద్రముగా విరాజిల్లెను. వీరి ఆదరణలో ప్రసిద్ధిగాంచిన "బోరుబుదుర్" మహాస్థూపము నిర్మించబడెను. ఈ స్థూపములపై బౌద్ధ గాథలుగా శిలా ఫలకములు రూపొందింపబడినది. ఈ స్థూపములపై గల విగ్రహములను ఒకదాని ప్రక్కన పేర్చుకుంటూపోయిన రెండు మైళ్ళ పొడవుకాగలవట. ఈ శిల్పములందు భారతీయ బౌద్ధ శిల్పకళా నైపుణ్యము ప్రస్ఫుటముగ గోచరించును.

(7) సంజయుని వంశీయుల తదనంతరము జావాలో "ముజపహిత్" ప్రధాన స్థావరముగా మరొక రాజ్యము స్థాపించబడెను. వీరిపాలనా కాలము జావా చరిత్రలో స్వర్ణయుగముగా పరిగణింతురు. ముజపహిత్ సామ్రాజ్యము పతనమైన వెంటనే జావాను ముస్లిములు ఆక్రమించిరి. అంతట అచ్చటగల హిందువులు బాలి ద్వీపమునకు వలసవెళ్లిరి. జావాలోని కవి భాషలో 3/4 వంతు సంస్కృతము అటులనే జావాలోని ముఖ్య వినోదమైన వాయాంగ్ (తోలు బొమ్మలాట) భారతీయ సాంప్రదాయమే.

**16.3.7 బాలి :** జావాను మహ్మదీయులు ఆక్రమించాక అక్కడ రాజవంశం వారు, చాలామంది హిందువులు, బాలిద్వీపమునకు వలస వచ్చిరి. అప్పటికే హిందూ సంస్కృతికి బాలి ఒక ముఖ్య కేంద్రము. బాలి ద్వీపవాసులు తాము హిందువులమని సగర్వముగ చెప్పుకొందురు. భారతీయ సమాజమునందువలె బాలి సమాజమునందునూ వర్ణవ్యవస్థ కలదు. ఆ ద్వీపంలోని నదుల పేర్లన్నీ భారతదేశంలోని నదుల పేర్లను పోలిఉన్నవి. క్రీ.శ. 6వ శతాబ్దిలో బాలిలో హిందూ రాజ్యస్థాపన జరిగెను. బాలి ద్వీపమును పరిపాలించిన రాజులు కౌండిన్య వంశజులు. ఈ రాజులందు సుప్రసిద్దుడైన పాలకుడు ఉగ్రసేనుడు. బాలిలోని నగర వీధులకు, భీమ, అర్జునల మొదలగు ఇతిహాస వీరుల పేర్లు కలవు.

**16.3.8 బోర్నియా :** బోర్నియోను వాయుపురాణంలో 'బార్హిన' గా పేర్కొనబడినది. దీనినే భారతీయులు వరుణద్వీపమని పిలిచెడివారు. క్రీ.శ. 4వ శతాబ్దికి బోర్నియోలో హిందూరాజ్యం, రూపొందెను. బోర్నియో పాలకుల పేర్లు భారతీయ పాలకుల పేర్లు పోలిఉన్నవి. బోర్నియోను పరిపాలించిన మూలవర్మన్ అనే పాలకుడు నైదిక క్రతువులను సల్పి, అనేక గోవులను బ్రాహ్మణులకు దానము చేసెను. బోర్నియోలో మౌరకామన్ అనే ప్రదేశములో ఈ రాజుల శాసనములు సంస్కృత భాషలో, కావ్యశైలిలో, వేంగి లిపిలో లభించినవి. ఈ దీవిలో అనేక హిందూ, బౌద్ధ విగ్రహములు దొరికినవి.

**16.3.9 ఇండో - చైనా :** ఈనాటి కాంబోడియా, అన్నాం, ప్రాంతములు ఇండోచైనా వలసలు. ఈ రెండు ప్రాంతములతో పాటు నేటి థాయిలాండ్‌కు (సమానం) కూడా భారతీయ సంస్కృతి విస్తరించెను.

**16.3.10 కాంబోడియా : :** కాంబోడియాను ప్రాచీనకాలమున 'కాంభోజ' రాజ్యమని పిలిచెడివారు. ఇక ఐతిహ్యం ప్రకారం కౌండిన్యుడు సోమ అనే నాగకన్యను పెండ్లాడి కాంభోజ దేశంలో 'ఫూనాన్' లో తన వంశపాలనను ప్రారంభించాడు. క్రీ.శ. మొదటి శతాబ్దినాటికి భారతీయులు కాంబోడియాలో వలసలు స్థాపించిరి. కంబుస్వయంబు అను భారతీయుని పేరనే ఈ రాజ్యము కాంభోజ రాజ్యమైన [illegible] ంబు వంశస్థులు క్రీ.శ. 7వ శతాబ్ది అంతము వరకు కాంబోడియాను పాలించిరి. వీరు భారతీయఆచార సాంప్రదాయ[illegible] ప్రవేశపెట్టిరి.

తదుపరి కాంబోడియాను శైలేంద్రులు క్రీ.శ. 8,9 శతాబ్దంలలో 'అంగకోర్' ను రాజధానిగా చేసుకొని పాలించిరి. ఈ వంశంలో భావవర్మ, మహేంద్రవర్మ, జయవర్మ, యశోవర్మలు ముఖ్యులు. జయవర్మ మహారాణి 'కుప్రభావతి' వేయించిన శాసనము ద్వారా కాంబోజి చరిత్రను గురించి తెలుసుకొనవచ్చును. ఈ శాసనంలు సంస్కృత భాషలోకలవు. వీరు హిందూ మతమును ఆదరించి, శైవ, వైష్ణవ వ్యాప్తికి కృషిచేసిరి.

వీరిలో యశోవర్మ (882 - 908) సుప్రసిద్ధుడైన పాలకుడేగాక, గొప్ప పండితుడు. ఇతడు పతంజలి మహా భాష్యమునకు వ్యాఖ్యానం రాసెను. ఇతని ఆస్థానంన అనేకమంది పండితులు కలరు. ఇతడే యశోధపురం (కంబపురము) అను రాజధానిని నిర్మించెను. ఇతని తదనంతరము కాంబోడియాను పాలించిన రెండవ సూర్యవర్మ (1133 - 45) గొప్ప పండితుడు. ఇతడు సంస్కృత భాషను ప్రోత్సహించెను. ప్రపంచంలోని మహాద్భుతాలలో చేర్చదగిన అంగ్కోర్వాట్ (ANGKORAVAT) అనే విష్ణు ఆలయమును నిర్మించెను. ఈ ఆలయ నిర్మాణము పల్లవ, చాళుక్య వాస్తురీతులలో జరిగెను. ఈ ఆలయ గోడలపై భారత రామాయణ గాథలు మనోహరముగ చెక్కబడెను. ఇతడు అంగకోర్ థామ్ అనే నగరమును నిర్మించి తన రాజధానిగ చేసుకొనెను. తదుపరి 7వ జయవర్మ కాలమున కాంబోడియా అత్యున్నత స్థాయికి చేరుకొనెను.

కాంబోడియా వాసులు హిందూమతంతో పాటు, బౌద్ధమతమును కూడ ఆదరించిరి. వారికి వేదములు, మహాభాష్యము, అష్టాధ్యాయి, ధర్మ సూత్రములు, అర్థశాస్త్రములనిన అపారమైన అభిమానము. కాంబోడియానందు దొరికిన శాసనములందు కావ్యశైలిలో రచించిన సంస్కృత శ్లోకములుండుట ఒక విశేషము. క్రీ.శ. 14వ శతాబ్దిలో కాంబోడియా రాజ్యం క్షీణించెను.

**16.3.11 అన్నాం లేక చంపారాజ్యము** : ఫ్రెంచి ఇండో - చైనాలోని ఒక భాగము అన్నాం. ప్రాచీనకాలమున దీని రాజధాని చంపానగరమగుట వలన ఇది 'చంపా' రాజ్యముగా ప్రసిద్ధి చెందినది. క్రీ.శ. 2వ శతాబ్దినాటికి దక్షిణ హిందూదేశీయులు అన్నాం నందు వలసలు స్థాపించిరి. చంపాలో అమరావతి, విజయ, పాండురంగ అనే మూడు రాష్ట్రములు గలవు.

సుమారు 12 హిందూ రాజవంశీయులు చంపాను పాలించెను. చంపాలలోని పేర్లన్నియు భారతీయ నామములే. బహుశ ఇచ్చట లభించిన పాలకుల పేర్లను బట్టి ఈ రాజ్యాన్ని ఆంధ్రులు స్థాపించి ఉండవచ్చునని పండితుల అభిప్రాయం. చంపాను పరిపాలించిన రాజులలో భద్రవర్మన్ అనే రాజు 'ధర్మరాజు' అనే బిరుదమును ధరించెను. ఇతడు శైవ మతాభిమాని. ఇతడు చంపాలో 'భద్రేశ్వరాలయమును' కట్టించెను. అన్నాం నందు బౌద్ధ, శైవ, వైష్ణవ మతములు ఆదరింపబడినవి. అంతేగాక ఈ రాజ్యవాసులు భారతీయ ధర్మశాస్త్రములలో షడ్దర్శనములలో ప్రత్యేక శ్రద్ధ కనపరచిరి. ఈ రాజ్యమును కాంబోజ రాజులు 12వ శతాబ్దిలో జయించిరి.

**16.3.12 సయాం (లేక) థాయిలాండ్** : క్రీ.శ. 2వ శతాబ్ది నాటికే సయాంనందు భారతీయ వలసలు ఏర్పడినవి. భారతీయ సంస్కృతిపై సయాం ప్రజలకు అత్యంతభిమానము. సయాం నందు గాంధారా, మిధిల, విదేహ, కేశాంచి మొ. భారతీయ నగరముల పేర్లు కలవు. సయాం దేశీయ భాషలో అనేక సంస్కృత, పాళీ పదజాలములు కలవు. బౌద్ధ, హిందూమతముల రెండింటిని వారు ఆదరించిరి. నేటికిని సయాం నందు అనేక హిందూ పండుగలు జరుపుకొందురు. వారి న్యాయశాస్త్రము హిందూ ధర్మశాస్త్రముల ననుసరించి రాయబడినది. వేదములు, త్రిపేటికలు బహుజనాదరణ పొందునని గ్రంథములు.

**16.3.13 చైనా** : భారతదేశమునకు, చైనాకు గల సంబంధిములు కడు ప్రాచీనము. అనాదిగా ఈ రెండు దేశముల మధ్య వాణిజ్య సంబంధములు కలవు.

క్రీ.శ. 1వ శతాబ్దిలో బౌద్ధ మతాచార్యులైన కాస్యసమాతంగ, ధర్మ రక్షితలు చైనాకు వెళ్లి చైనా చక్రవర్తి మింగ్ట్ ఆస్థానమును సందర్శించిరి. వీరు అనేక బౌద్ధ గ్రంథములను చైనా భాషలోనికి తర్జుమాచేసిరి.

క్రీ.శ. 406లో కాశ్మీరునుండి కుమార జీవుడు, బోధిధర్ముడు, గుణవర్మ అనేవారు చైనాలో బౌద్ధమత వ్యాప్తికి కృషిచేసిరి. వీరి కృషి ఫలితముగా చైనాలో బౌద్ధమతము వ్యాప్తిలోనికి వచ్చినది. ఈ కుమారజీవుని శిష్యుడే ఫాహియాన్.

క్రీ.శ. 546 లో పరమార్థుడు అను బౌద్ధ పండితుడు మగధనుండి చైనా వెళ్లి అనేక గ్రంథములను చైనా భాషలోనికి తర్జుమా చేసెను.

వీరి కృషి ఫలితముగా చైనాలోని తీర్థ మతము ప్రచారములోనికి వచ్చెను. తత్ఫలితముగా అనేక మంది తీర్థ భిక్షువులు బౌద్ధమత ప్రభావమునకులోనై, భారతదేశమును సందర్శించుటకు వచ్చిరి. వారిలో ఫాహియాన్, హుయాన్‌సాంగ్, ఇత్సింగ్‌లు ముఖ్యులు. చైనాలోని దేవాలయము భారతీయ స్థూపములు నమూనాలో నిర్మింపబడెను. భారత గణిత, ఖగోళ, వైద్య, సంగీత శాస్త్రములు చైనాలో ఆదరింపబడెను. చైనాలోని 'నాన్ హింగ్స్ టాంగ్' (Non - Hings - Tang) లోని గుహాలయ శిల్పములు అమరావతి శిల్పముల అనుకరణమే. ఇట్టి ప్రగాఢ ప్రభావము కల్గియుండుటచే చైనాదేశ ప్రాచీన యుగచరిత్ర భారతీయాకరణ యుగమని చరిత్రకారుని నుడివిరి.

**16.3.14 ఆఫ్ఘనిస్తాన్ :** ప్రాచీన కాలంలో ఆఫ్ఘనిస్తాన్ భారతదేశంలోని ఒక అంతర్భాగం. వైదిక ఇతిహాసయుగాల ఆర్యులకు అఫ్ఘనిస్తాన్ వేరేదేశమనీ అభిప్రాయంలేదు. క్రీ.పూ. 6వ శతాబ్దినాటి ఆర్యుల జనపదాలలో గాంధార (కాందహార్) ఒకటి, మౌర్య, కుషాణ్ సామ్రాజ్యంలో అఫ్ఘనిస్తాన్ అంతర్భాగంగా ఉంది. వైదిక, బౌద్ధమతములు రెండూ ఆదేశ ప్రజాదరణ పొందినాయి. అఫ్ఘనిస్తాన్‌లోని స్వాటి నదిలోయ (ఉద్యానము) తాంత్రిక బౌద్ధమతమునకు పట్టుకొమ్మ, అని హుయాన్‌సాంగ్ పేర్కొనెను. ఇక్కడ అనేక సంస్కృత గ్రంథాలు భారతీయ శైలిలోని చిత్రాలు లభ్యమయ్యాయి. ఇటీవలకాలంలో ఒక బౌద్ధవిహారం బయలుపడింది. కాబూల్‌లోని (ఖా) - ఖాయిర్ ఖనే పర్వత శిఖరం మీద గుప్తరాజుల నాటి దేవాలయము, సూర్యవిగ్రహము కనిపించినాయి.

## 16.4 ఇతరదేశములలో భారతీయ సంస్కృతి వ్యాప్తి :

పైన పేర్కొనబడిన అనేక దేశములతోపాటు మరికొన్ని దేశములందు భారతీయ సంస్కృతి విస్తరించింది.

**16.4.1 కొరియా :** క్రీ.శ. 4వ శతాబ్దిలో కొరియానందు బౌద్ధమతము ప్రవేశపెట్టబడెను. కొరియా పండితులైన హ్యునిచ్ (Huieh - Neih) నలందా విశ్వవిద్యాలయంనందు ఆచార్యుడుగా పనిచేసెను. కొరియా రాజు సిల్లా అనుచోట భారత బౌద్ధాచార్యుని గౌరవార్థము భారతీయ శిల్పశైలిలో ఒక దేవాలయమును నిర్మించెను.

- **16.4.2 జపాన్ :** బౌద్ధమతము కొరియానుండి జపాన్‌కు విస్తరించెను. జపాన్ రాజగు షోటోకో (SHOTOKI) (593 -622 A.D) బౌద్ధమతమును ఆదరించి దాని అభివృద్ధికి అవిరళ కృషిచేసెను. క్రీ.శ. 8వ శతాబ్దిలో మరోజపాన్ రాజు 'బౌద్ధత్రిరత్నదాస' (SLAVE OF BUDHIST TRINITY) అనే అర్థంవచ్చే బిరుదు ధరించినాడు. ఇతడే వారా అనేచోట బుద్ధుని కంచు విగ్రహం నిలిపినాడు. ఇది ప్రపంచంలోని కంచు విగ్రహాలన్నింటిలో పెద్దది.

భోదిసేనుడనే భారతీయ బౌద్ధాచార్యుడు చైనామీదుగా క్రీ.శ. 736 లో జపాన్ వెళ్లినాడు. జపాన్ ప్రజలు, ప్రభువులు, భోదిసేనుని ఎంతగానో ఆదరించినారు. ఇతడు జపాన్ పూజారులతో సంస్కృతంలోనూ, జపాన్ భాషలోనూ ధారాళంగా ప్రసంగించినాడట. దీనినిబట్టి బౌద్ధమతంతో పాటు, సంస్కృత భాష జపాన్‌లో అభ్యసించేవారని తెలుస్తోంది జపాన్‌లో ప్రచారంలో ఉన్న సంప్రదాయాన్ని బోధి అనే బ్రాహ్మణుడు జపాన్ వెళ్లి అక్కడ 'బోధిసత్వ' సంగీత పద్ధతిని ప్రవేశపెట్టినాడు. దీనినే జపాన్‌భాషలో 'భైరో' అంటారు. 'బుగకు' (Bugaku) అనే నృత్య సంగీత (DANCE - MUSIC) పద్ధతి చైనా. భారతీయ సంప్రదాయాల సమ్మేళనమే. హోరియూజి (Horiyuzi) దేవాలయంలోని కుడ్యచిత్రాలు - అజంతా చిత్రాలను పోలిఉన్నవి.

**16.4.3 టిబెట్ :** క్రీ.శ. 7వ శతాబ్దంలో టిబెట్‌లోకి బౌద్ధమతం ప్రవేశించింది. నాడు టిబెట్ రాజయిన స్రోన్ - సగ - గమ్‌పో చైనా రాకుమార్తెను, నేపాల్ రాకుమార్తెను వివాహమాడినాడు. బౌద్ధధర్మమును, భారతీయలిపిని టిబెట్‌లో ప్రవేశపెట్టి ఒక నూతన సంస్కృతి వికసించుటకు అతడు దోహదపడెను. బెంగాల్‌లోని పాలరాజులు టిబెట్‌తో సత్సంబంధాలు కలిగిఉండిరి. టిబెట్‌లోని బౌద్ధ భిక్షువులు నలందా, విక్రమశిల విశ్వవిద్యాలయాలలో అధ్యయనం చేసిరి. ధాన్యకటక విశ్వవిద్యాలయము నమూనాగా లాసాలో ఒక బౌద్ధ విశ్వవిద్యాలయం నిర్మితమయినట్లు లామా, తారానాథుడు రాసిరి. చైనా, టిబెట్, భారతదేశాల పండితులు కలిసి 'మహావ్యుత్పత్తి' అనే బౌద్ధ పదకోశాన్ని తయారుచేసినారు.

**16.4.4 మెక్సికో - ఈజిప్టు :** "దివాన్ చమల్ లాల్" అను పండితుడు తన గ్రంథమగు 'హిందూ అమెరికా' నందు భారతీయ సంస్కృతి మెక్సికో, ఈజిప్టులకు సైతము వ్యాపించెనని పేర్కొనెను. ఈజిప్టునందు అనేక శివాలయములు, మెక్సికో నందు వినాయక విగ్రహములు లభించెను.

## 16.5 ఆగ్నేయ ఆసియాలో భారతీయ సంస్కృతి - దేశ పరిస్థితులు :

ఆగ్నేయ ఆసియాలో వలసలు స్థాపించిన భారతీయులు స్థానిక సంస్కృతిని నిర్మూలించడానికి ప్రయత్నించక తమ సంప్రదాయాలను జోడించి వినూత్నమైన జీవన విధానాన్ని రూపొందించినారు. ఈ క్రొత్త సంస్కృతిలో అన్ని రంగాలలోను భారతీయ ప్రభావం విశేషంగా గోచరిస్తుంది.

**16.5.1 సాంఘిక పరిస్థితులు :** ఆగ్నేయాసియాలోని అనేక రాజ్యాలలో భారతీయ సమాజ వ్యవస్థ అనుసరింపబడింది. బ్రాహ్మణులు గౌరవింపబడ్డారు. స్త్రీలకు సమాజంలో ప్రాధాన్యత ఉండేది. ఆహారం, వస్త్రధారణ, ఆటపాటలలో భారతీయ పద్ధతులనే ఆయారాజ్యాలలోని ప్రజలు అనుసరించిరి. జావాలో ప్రజల ముఖ్య వినోదం తోలు బొమ్మలాట. ఈ తోలుబొమ్మలాటలోని ఇతివృత్తం, రామాయణ, మహాభారతగాథలు శాసనాలలో వీరు "శాలివాహనశకాన్ని" అనుసరించారు.

**16.5.2 మత పరిస్థితులు :** ఈ రాజ్యాలలో బౌద్ధమతం, వైదికమతం, సముచిత స్థానాన్ని పొందాయి. ఆంధ్రప్రదేశంలోని అమరావతి నుంచి బౌద్ధమతం ఆగ్నేయాసియాకి వ్యాపించింది. వైదికక్రతువులలో బర్మా రాజులు వారి పట్టాభిషేకాన్ని చేసుకొనేవారు. ఆగ్నేషియాలోని రాజులు యజ్ఞాలు చేసి గోవులను, దానాలు చేసేవారు. మనువు వారి ఆదర్శరాజు. పాశుపతశైవం అక్కడ ప్రాధాన్యత పొందినప్పటికి హరిహర విగ్రహాలు కూడా లభ్యమయ్యాయి. శివవిష్ణువులేకాక హిందూ దేవతలైన గణపతి, దుర్గ సరస్వతి మొదలైన వారిని వీరు ఆరాధించారు. బ్రాహ్మణులు, క్షత్రియులు, వేదవేదాంగాలలో, పురాణ ఇతిహాసాలలో ధర్మశాస్త్రాలలో నిష్ణాతులు. ఏ మతం యొక్క లక్ష్యమైన మానవులలో నైతిక సంపదను, నిజాయితీని పెంచటమేనని వారు విశ్వసించారు.

**16.5.3 భాష :** ఆగ్నేయ ఆసియా రాజ్యాలలో దొరికిన శాసనాలవల్ల అక్కడి ప్రజలు సంస్కృతభాషను అభ్యసించి, పోషించినట్లు తెలియుచున్నది. శాసనాలలో భారతీయ లిపులు రాయబడ్డాయి. వేంగిలిపి, తైలంగ ఒకే విధంగా ఉన్నాయి. రామాయణ, మహభారతాలు పంచతంత్రం మొదలగునవి వారి దేశభాషలలోకి అనువదింపబడ్డాయి. ప్రస్తుతం ఇండోనేషియా ముఖ్యపట్టణం జమకర్త (జకార్తా), మరో ముఖ్యపట్టణం 'సుకర్త' (సురకర్త), బలి ద్వీపంలో వీధుల పేర్లు కూడా భీముడు, అర్జునుడు, నలుడు పేర్లతో ఉంటాయి. ఈనాటికి భారతీయ సంస్కృతి ప్రభావం ఆ దేశాలలో మనకు కనిపిస్తుంది.

**16.5.4 వాస్తు - శిల్పాలు :** భారతీయ వాస్తు శిల్పకళల ప్రభావం ఆ రాజ్యాలలోని దాదాపు అన్ని ఆలయాలలో సుస్పష్టంగా కనిపిస్తుంది. 'అంగ్కోర్ వాట్' దేవాలయంలో పల్లవ, చాళుక్య వాస్తుశైలులు కనిపిస్తాయి. అని డాక్టర్ R.C మజుందార్ అభిప్రాయం. రాతిలో మానవ కల్పనాశక్తి అందుకొన్న మహోన్నత శిఖరము 'అంగ్కోర్ వాట్' అని ఆల్బర్ట్ సిట్‌వెల్ వర్ణించెను. బరాబదూర్ మహాస్తూప నిర్మాణానికి ప్రేరణ భారతదేశంలోని స్తూపాలే. అసలు బారాబదూర్ అంటేనే "బహుబుద్ధులు" అని అర్థం.

## 16.6 ముగింపు :

ఈ విధంగా ప్రాచీన కాలంలో ఏర్పడిన వాణిజ్య సాంస్కృతిక సంబంధాలు క్రీ.శ. 15వ శతాబ్దం కొనసాగినాయి. దక్షిణదేశంలో రాజ్యంచేసిన కాకతీయ, రెడ్డి, విజయనగరాధీశులు తూర్పు ఆసియా రాజ్యాలలో వాణిజ్యాన్ని ప్రోత్సహించినట్లు వారిశాసనాల ద్వారా, ఆనాటి సారస్వతం ద్వారా తెలుస్తుంది. 15వ శతాబ్దంలో విజయనగరాన్ని దర్శించిన అబ్దుల్ రజాక్ అనే పారశీక రాయబారి తూర్పు పశ్చిమ తీరాలలోని రేవు పట్టణాలను, అవి సాగించిన వాణిజ్యాన్ని విపులంగా వర్ణించినాడు.

భారతీయ మతాలు, ధర్మాలు, పాలనావిధానం ఈ ప్రాంత ప్రజల జీవితాన్ని తీర్చిదిద్దాయి. భారతీయ మతాలు, సాహిత్యం, కళలు వారిలో నైతికనిష్టను, సదభిరుచిని పెంచాయి. రెండు జాతుల కలయిక ద్వారా విశాల భారతదేశం ఆవిష్కరింపబడింది. హిందూమతం భారతదేశంలో శక్తివంతంగా ఉన్నంతకాలం ఈ రాజ్యాలలో కూడా హిందూమతం శక్తి వంతంగానే ఉంది. భారతదేశంలో హిందూ రాజ్యాలపతనం, ఈ రాజ్యాల విచ్ఛిత్తికి దారితీసింది. హిందూమతాన్ని విదేశీయులు స్వీకరించలేదన్న ఒక దురభిప్రాయం ఉంది. అయితే ఈ వాదన సత్యదూరమని తెలుస్తూనే ఉంది కదా !

"The Colonial and Cultural Expansion of India was one of the most brilliant but forgotten episodes of Indian History of which many Indians may Justfy feel Proud". R.C. MAJUNDAR, ROY - CHOWDARY And DATTA

## అభ్యాసాలు :

I వ్యాసరూప ప్రశ్నలు : (Essay Type Questions)

(1) ప్రాచీన భారతీయ సంస్కృతి ఆగ్నేయాసియా దేశములకెట్లు విస్తరించెనో వివరింపుము ? (లేక)
భారతీయ సంస్కృతి సామ్రాజ్య విస్తరణను గూర్చి సంగ్రహముగా రాయుము ?

II లఘు వ్యాసరూప ప్రశ్నలు : ( SHORT NOTES )

(1) సింహళంలో భారతీయ సంస్కృతి
(2) బర్మాలో భారతీయ సంస్కృతి
(3) ఇండోనేషియాలో భారతీయ సంస్కృతి
(4) భారతీయ సంస్కృతి విస్తరణ ద్వారా విదేశాలలో కలిగిన మార్పులు లేదా పరిస్థితులు ?

V. ఈ క్రింది వానిలో సరైన సమాధానం గుర్తించండి ?

(1) జావాను ఏమని పిలిచేవారు ? ( )
(A) యవద్వీపం (B) సువర్ణద్వీపం
(C) ఇండోనేషియా (D) పైవి ఏవికావు

(2) బర్మాను భారతీయ సారస్వతంలో ఏమని పేర్కొనిరి ? ( )
(A) సువర్ణభూమి (B) అనురాధపురం
(C) సువర్ణదీపం (D) యవద్వీపం

(3) ప్రపంచంలోని మహాద్భుతాలలో చేర్చదగిన అంగ్కోర్ వాట్ దేవాలయ నిర్మాత ఎవరు ? ( )
(A) యశోవర్మ (B) జయవర్మ
(C) భావవర్మ (D) మహేంద్రవర్మ

(4) హిందూ అమెరికా గ్రంథ రచయిత ఎవరు ? ( )
(A) దివాన్ చమన్‌లాల్ (B) లామా
(C) ఫాహియాన్ (D) తారానాథుడు

## ఉపయుక్త గ్రంథాలు

(1) The Wonder that India By - A.L. Bhasham
(2) A brief survey of Indian History By - K.M. Panikkar.
(3) Indian History and Culture vol. No. By. B.S.L. Hanumantha Rao & K. Basaveswara Rao.
(4) An Advanced History of India by - Roy Choudary and K.K. Datta
(5) History and Culture of India People
(Bharateeyes Vidyabhavan Bombay Vol. III.) by - R.C. Majumdar

**C. Ravindra Raju,** *Lecturer in History*
Andhara Loyola college, VIJAYAWADA - 8.

పాఠం - 17

# పల్లవులు - సాంస్కృతి సేవ, శిల్పకళ

## 17. 1. లక్ష్యం :

పల్లవుల రాజకీయ చరిత్ర, వారు దక్షిణ భారతదేశ సంస్కృతికి ముఖ్యంగా శిల్పకళకు చేసిన సేవ గురించి తెలియజేయడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

ముఖ్యాంశ సంగ్రహము :


17. 2. ఆధారాలు
17. 3. ఉపోద్ఘాతం
17. 4. పల్లవుల రాజకీయ చరిత్ర
17.4. 1. పల్లవుల వంశోత్పత్తి
17.4. 2. ప్రాచీన పల్లవులు
17.4. 3. నవీన పల్లవుల రాజకీయ చరిత్ర
17.4. 4. పరిపాలనా విధానం
17.4. 5. సాంఘిక పరిస్థితులు
17.4. 6. ఆర్థిక పరిస్థితులు
17. 5. సాంస్కృతిక సేవ
17.5. 1. మతము
17.5. 2. సాహిత్యము
17. 6. శిల్పకళ
17. 7. సారాంశము


## 17. 2. ఆధారాలు :

1. **సాహిత్యం :** మొదటి మహేంద్రవర్మ రచించిన 'మత్తవిలాస ప్రహసనం', నాయనార్లు, ఆళ్వార్లు స్తుతించిన భక్తి గేయాలు, శ్రీలంకకు చెందిన 'మహావంశ', హుయాన్‌త్సాంగ్ రచనలు.

2. **శిలాశాసనాలు :** తిరుచిరాపల్లి, మందగపెట్టు గ్రామాలలోని మొదటి మహేంద్రవర్మ కాలం నాటి గుహలలోని శిలాశాసనాలు, మొదటి నరసింహవర్మ బాదామి శాసనం, రెండవ పులకేశి ఐహోలు శాసనం, చాళుక్య, గాంగశాసనాలు.

3. **తామ్రశాసనాలు :** నందివర్మ ఉదయేందిరం తామ్రశాసనం, గద్వాల్ తామ్రశాసనం, కసక్కుడి తామ్రశాసనం.

4. **వాస్తు, శిల్ప, చిత్రలేఖనాలు.**

## 17. 3. ఉపోద్ఘాతం

దక్షిణ భారతదేశంలో శాతవాహనుల తరువాత ప్రఖ్యాతి వహించిన వంశం పల్లవ వంశం. వీరు ఉత్తరభారతదేశంలో గుప్తుల వలె దక్షిణ భారతదేశంలో హిందూ సంస్కృతికి ముఖ్యంగా శిల్పకళకు అపూర్వమైన సేవ చేసారు. వీరికాలంలో దేవాలయ నిర్మాణానికి సంబంధించిన అన్ని వాస్తు లక్షణాలు నిర్దుష్టమైన రూపాన్ని సంతరించుకున్నాయి, ఆ తరువాత దక్షిణ దేశాన్ని పాలించిన చోళ, పాండ్య మొదలగు రాజవంశాలన్నీ వీరి కళనే విస్తృత రూపంలో కొనసాగించాయి.

## 17. 4. పల్లవుల రాజకీయ చరిత్ర

**17. 4. 1. పల్లవుల వంశోత్పత్తి :** శాతవాహన సామ్రాజ్య పతనాంతరము పల్లవులు స్వతంత్రులై కంచి రాజధానిగా 5 శతాబ్దాల కాలం దక్షిణదేశ చరిత్రలో గణనీయమైన పాత్ర నిర్వహించారు. సింహళ బౌద్ధ గ్రంథమైన మహావంశమునందు కృష్ణా నదీ తీరమున పల్లవబొగ్గ కలదని పేర్కొనెను. ఈ ప్రాంతమే నేటి గుంటూరు జిల్లాలోని పలనాడు. ఈ ప్రాంతములోనే తొలి పల్లవులకు చెందిన మంచికల్లు, మైదవోలు శాసనాలు లభించుటవలన, పల్లవులు ఆంధ్రులని పలువురు చరిత్రకారుల అభిప్రాయం. వీరి అభిప్రాయం ప్రకారం పల్లవుల ప్రథమ నివాసము పల్నాడని, అచట నుండి తొండై మండలమునకు పోయి నాగవంశీయులతో సంబంధములు చేసికొని శాతవాహనులకు సామంతులుగా వుంటూ ఆ తరువాత స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించారు అని కొందరు చరిత్రకారుల అభిప్రాయము ఇది కాక మరికొన్ని సిద్ధాంతములు కూడా కలవు.

**17.4. 2. ప్రాచీన పల్లవులు :** పల్లవుల రాజకీయ చరిత్రను ప్రాచీన పల్లవులు, నవీన పల్లవులు అని రెండు భాగాలుగా విభజించవచ్చు. ప్రాచీన పల్లవులకు మూల పురుషుడు సింహవర్మ. ఇతని కుమారుడు శివస్కందవర్మ. ఇతని కాలంలో పల్లవ రాజ్యం కృష్ణా కావేరీ నదుల మధ్య వరకు విస్తరించెను. ఇతడు వైదికమతాభిమానియై అనేక యజ్ఞ యాగాది క్రతువులు చేసెను. ఇతనికి ధర్మమహారాజు అను బిరుదు కలదు. ఈతని తరువాత ప్రాచీన పల్లవ చరిత్ర స్పష్టముగా లేదు. సముద్రగుప్తుని అలహాబాద్ ప్రశస్తి వల్ల క్రీ.శ. నాల్గవ శతాబ్ది మధ్య కాలంలో కాంచీపురాన్ని విష్ణుగోపుడు పాలిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇతని తరువాత కుమార విష్ణువు, సింహవర్మ, నందివర్మ రాజ్యమేలారు. ఆ తదుపరి ప్రాచీన పల్లవ రాజశాక అంతరించి క్రీ.శ. 575 లో సింహవిష్ణువు నవీన పల్లవ రాజవంశం స్థాపించినాడు.

### 17.4. 3. నవీన పల్లవుల రాజకీయ చరిత్ర :

**17.4.3. 1.** దక్షిణ భారతదేశంలో పల్లవుల అధికార వైభవాలను సింహ విష్ణువు క్రీ.శ. 575 లో పునరుద్ధరించాడు. ఇతని సంతతివారే నవీన పల్లవులు. వీరి పాలన కాలంలోనే దాక్షిణాత్య సంస్కృతి రూపురేఖలు దిద్దుకొన్నది. సింహ విష్ణువు చోళ, పాండ్య, సింహళ రాజులను ఓడించి పల్లవ రాజ్యాన్ని పునరుద్ధరించాడు. ఇతనికి అవనీసింహ అను బిరుదు కలదు.

**17.4.3. 2. మహేంద్రవర్మ (క్రీ.శ. 600 - 630) :** సింహ విష్ణువు కుమారుడైన మహేంద్రవర్మ తన రాజ్యాన్ని ఉత్తరాన కృష్ణానది వరకు విస్తరింపచేసాడు. ఇతని కాలంలోనే పల్లవ - చాళుక్య స్పర్ధ ఆరంభమయింది. బాదామి చాళుక్య చక్రవర్తి రెండవ పులకేశి కృష్ణాప్రాంతమైన కర్మ రాష్ట్రాన్ని ఆక్రమించాడు. ఆ తరువాత పులకేశి క్రీ.శ. 630 లో పల్లవ రాజ్యం మీద దండెత్తి పల్లలూర్ యుద్ధంలో మహేంద్రవర్మను ఓడించాడు. ఇతడు సంస్కృతంలో 'మత్తవిలాసప్రహసనము' అను నాటకాన్ని రచించాడు. మహాబలిపురం పల్లావరం, మామండూర్, దళవానూర్‌లలో గుహాలయాలను తొలిపించాడు. వ్యవసాయాభివృద్ధికొరకు అనేక చెరువులను త్రవ్వించి ప్రజాహిత కార్యక్రమాలను చేపెట్టెను. ఇన్ని విశిష్ట గుణాలు ఉన్నవాడయినందువల్లనే మహేంద్రవర్మ 'గుణభారుడనీ', 'చిత్రకారపులి అని, 'విచిత్ర చిత్తుడనీ' ప్రశంలందుకొన్నాడు.

**17.4.3. 3. నరసింహవర్మ I (630 - 668) :** మహేంద్ర వర్మ కుమారుడైన నరసింహవర్మ పల్లవ రాజులందరిలో అగ్రగణ్యుడు. ఇతడు తన తండ్రి మరణానికి కారకుడైన రెండవ పులకేశిపై దండయాత్ర చేసి అతనిని ఓడించి వధించి, చాళుక్య రాజధాని వాతాపిని ధ్వంసము చేసి వాతాపికొండ, మహామల్ల అను బిరుదులను పొందెను. ఇతని కాలములోనే ప్రసిద్ధ చైనా యాత్రికుడు హుయాన్‌త్సాంగ్ పల్లవ సామ్రాజ్యాన్ని సందర్శించెను. (క్రీ.శ. 640) ప్రసిద్ధ సంస్కృత కవి భారవి ఇతని ఆస్థానమందుం "కిరాతార్జునీయం" అను కావ్యమును రచించెను. మహాబలిపురం నందలి రాతిరథాలలో చాలా భాగం ఈతని నిర్మాణాలే.

**17.4.3. 4. మహేంద్రవర్మ II (క్రీ.శ. 668 - 670) :** మొదటి నరసింహవర్మ కుమారుడైన రెండవ మహేంద్రవర్మ సమర్ధుడు కాడు. ఇతడు చాళుక్యుల చేతిలో ఓడినాడు.

**17.4.3. 5. పరమేశ్వర వర్మ I (క్రీ.శ. 670 - 700) :** ఇతడు చాళుక్యులను పెరువళ నల్లూర్ యుద్ధంలో ఓడించడమేగాక సాహసించి చాళుక్య రాజ్యం మీద దాడి చేసాడు.

**17.4.3. 6. నరసింహవర్మ III (క్రీ.శ. 700 - 728) :** ఈతని కాలం ప్రశాంతంగా సాగింది. ఇతడు గొప్ప శిల్పకళా పోషకుడు. మహాబలిపురం నందలి తీరదేవాలయం కంచిలోని కైలాసనాథాలయం నిర్మించెను. ఇతనికి "రాజసింహ" అను బిరుదు కలదు. ఇతడు చైనాకు దౌత్య వర్గాలను పంపాడు.

**17.4.3. 7. పరమేశ్వర వర్మ II (క్రీ.శ. 728 - 731) :** ఈతని కాలములో చాళుక్య యువరాజు విక్రమాదిత్యుడు కాంచీపురాన్ని దోచుకున్నాడు. దీనితో పల్లవ రాజ్యంతో అరాచకం ప్రవేశించి పరమేశ్వరవర్మ మరణానికి దారితీసింది.

**17.4.3. 8. నందివర్మ (క్రీ.శ. 731 - 796) :** ఇతనికి "పల్లవ మల్ల" అను బిరుదు కలదు. ఇతని కాలంలో పెక్కుమంది పల్లవ రాజ్యంపై దండయాత్రలు చేశారు.

**17.4.3. 9. పల్లవ రాజ్య అస్తమయం :** నందివర్మ తరువాత రాజ్యమేలిన దంతివర్మ, మూడవ నందివర్మ, నృపతుంగవర్మ నిరంతరం శత్రువులతో పోరాడవలసివచ్చింది. నృపతుంగవర్మ కుమారుడైన అపరాజితవర్మ పల్లవ రాజులలో చివరివాడు. పల్లవ రాజ్యాన్ని రక్షించడానికి ఇతడు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. చివరకు చోళరాజైన మొదటి ఆదిత్య చోళుడు అపరాజితవర్మను ఓడించి వధించుటతో పల్లవుల రాజకీయ చరిత్ర దక్షిణ భారతదేశ చరిత్రనుండి శాశ్వతముగా అదృశ్యమయింది.

**17.4. 4. పరిపాలనా విధానం :** అన్ని దక్షిణ రాజవంశములవలే పల్లవులు కూడ శాతవాహన పరిపాలనా పద్ధతులను అనుసరించారని మీనాక్షి అభిప్రాయము. వీరికాలమునుంచి ఉత్తర దక్షిణ దేశాల మధ్య వ్యత్యాసాలు తగ్గి సాంస్కృతికంగా భారతదేశ సమైక్యానికి అవకాశమేర్పడింది. పల్లవరాజులు "ధర్మమహారాజాధిరాజ", "పంచమలోక పాలక" అను బిరుదులు వహించి పరిపాలించినారు. పరిపాలనలో రాజుకు ఉద్యోగులు సహాయపడేవారు. సామ్రాజ్యంలో అధికభాగం తెలుగుచోడ, గాంగ, చోళ మొదలగు సామంతుల పాలనలో ఉండేది. రాజ్యమును రాష్ట్రాలు, భుక్తులు, గ్రామాలుగా విభజించారు. రాష్ట్రానికి రాష్ట్రకుడు, భుక్తులకు మడిచిక అనువారు అధిపతులు. గ్రామాలలో గ్రామసభలుండేవి. నేరస్థులను విచారించి శిక్షించడానికి 'ధర్మాసనాలు' అనే న్యాయస్థానాలున్నట్లు తెలుస్తుంది. మొత్తం మీద ప్రతి గ్రామమూ స్వయంసంపూర్ణమైన చిన్న గణతంత్ర రాజ్యాన్ని పోలిఉండేది. పల్లవరాజులు చతురంగ బలాలను పోషించారు. విల్లు, కత్తి, బల్లాలు, ప్రధాన ఆయుధాలు యుద్ధాలకు పోవునపుడు వాయిద్యాలను వాయించుకుంటూ వెళ్లేవారట. ప్రభుత్వానికి భూమిశిస్తు ముఖ్యాదాయమార్గం. నాడు 18 రకాల పన్నులు ప్రభుత్వం వసూలు చేసినట్లు శాసనాల వల్ల తెలియుచున్నది. వృత్తి పన్నులు, వివాహం మీద పన్ను, ఉప్పు. చక్కెర మొదలయిన పదార్థాల తయారీ మీద పన్నులు ఉండేవి.

**17.4. 5. సాంఘిక పరిస్థితులు :** పల్లవులు వర్ణ ధర్మాలను పోషించారు. తుడియం, పణం, పరియన్, కడంబన్ అనే నాల్గు వర్ణాలను పురనానూర్ అనే కావ్యం పేర్కొంటుంది.

**17.4. 6. ఆర్థిక పరిస్థితులు :** పల్లవులు పంట 'సర్వే' చేయించి నీటి వనరులు కల్పించి వ్యవసాయాభివృద్ధికి దోహదం చేసినారు. మహేంద్ర తటాకం, చిత్రమేఖ తటాకం, పరమేశ్వర తటాకం, కావేరి పాక్కన్ తటాకం మొదలగు తటాకాల పేర్లు శాసనాలలో కనిపిస్తున్నవి. ప్రతి కుటీర పరిశ్రమ ఒక శ్రేణిగా ఏర్పడేది. వర్తక సంఘాలుండేవి. 'నానాదేశి', మణిగ్రామం', అనే వర్తక సంఘాల పేర్లు శాసనాలలో కన్పిస్తున్నాయి. పల్లవుల కాలంలో తమిళదేశం చైనా, ఆగ్నేయ ఆసియా రాజ్యాలతో వాణిజ్యం చేసింది.

## 17. 5. సాంస్కృతిక సేవ

**17.5. 1. మతము :** పల్లవులు వైదిక మతాభిమానులు. ప్రాచీన పల్లవులలో శివస్కందవర్మ, కుమార విష్ణువు అశ్వమేధాది వైదిక క్రతువులు చేసారు. శైవ, వైష్ణవ మతము రాజాదరణను, ప్రజాభిమానాన్ని చూరగొన్నాయి. శివ విష్ణువులకు అనేక దేవాలయాలు నిర్మించబడ్డాయి. దేవాలయాల నగరంగా కంచి ప్రసిద్ధి చెందింది. పల్లవుల కాలంలో శివభక్తిని నాయనారులు, విష్ణుభక్తిని ఆళ్వారులు అను మహా భక్తుల

ప్రబోధించారు. నాయనార్లు తమిళంలో రచించిన తమ భక్తి గేయాల ద్వారా శివభక్తిని ప్రచారం చేశారు. తిరుమంగై, తొండరడిప్పొడి అను అళ్వారులు వైష్ణవాన్ని ప్రచారం చేసినారు. పల్లవ రాజులు తమ రాజ లాంఛనంగా వృషభాన్ని, జెండాపై ఖట్వంగాన్ని లాంఛనంగా స్వీకరించారు. శైవులలో కాలముఖులు, పాశుపతులు అను తీవ్ర మత సాంప్రదాయాలు ఏర్పడ్డాయి. తిరుపతి, శ్రీరంగం, కంచి పుణ్య క్షేత్రాలుగా ఖ్యాతి గడించాయి. పల్లవులు జైన బౌద్ధమతాలను కూడా ఆదరించారు. హుయాన్ త్సాంగ్ రచనలు బట్టి కంచిలో 10 వేలమంది సన్యాసులతో కూడిన బౌద్ధ విహారం వర్ధిల్లినదని, దిగంబర జైనులు కూడా ఉన్నారని తెలియుచున్నది. కాని శైవ వైష్ణవాల విజృంభణ వల్ల జైన బౌద్ధాలకు ఆదరణ తగ్గింది.

**17.5. 2. సాహిత్యం :** పల్లవులు ఘటికలు స్థాపించి సంస్కృతాన్ని వైదిక విద్యలను పోషించారు. కంచి నాటి ప్రసిద్ధి గాంచిన విద్యాకేంద్రము, ఈ విద్యా కేంద్రము దూర ప్రాంతాలనుంచి విద్యార్థులను ఆకర్షించింది. నాటి దేవాలయాలు, శైవ, వైష్ణవ మతాచార్యులు స్థాపించిన మఠాలు కూడా విద్యానిలయాలు అయినవి. బ్రాహ్మణ అగ్రహారాలు కూడా విద్యా కేంద్రాలై భాసిల్లాయి. పల్లవ రాజులలో మహేంద్రవర్మ కవి మత్తవిలాస ప్రహసనాన్ని వ్రాసినాడు. సంస్కృత మహాకవులయిన భారవిని, దండిని పల్లవులాదరించినారు. భారవి కిరాతార్జునీయం, శిశుపాలవధ వ్రాయగా దండి దశకుమార చరిత్ర, కావ్యదర్శనమును వ్రాసాడు. పల్లవుల కాలంలో సంస్కృతముతో బాటు తమిళ భాష కూడ అభివృద్ధి చెందింది. తిరువళ్ళువర్ రచించిన కురల్ నాటి తమిళ సాహిత్యంలో ప్రసిద్ధి చెందింది. పల్లవుల కాలంలో విద్యలతో బాటు నాట్య సంగీతాలలో విశేషమయిన కృషి జరిగింది. మృదంగం, యాళి, విరళి మొదలయిన వాయిద్యాలను నాటి వాఙ్మయము పేర్కొంది.

## 17.6. శిల్పకళ

**17.6. 1.** దాక్షిణాత్యంలో కాంచిపురాన్ని రాజధానిగా చేసుకొని విజృంభించి 3 శతాబ్దాలకు పైగా (క్రీ.శ భారతదేశ చరిత్ర-సంస్కృతి 575-85) పల్లవులు పాలించారు. వీరు తమ రాజ్యానికి ఉత్తరంగా వున్న బాదామి చాళుక్యులతోను, దక్షిణంగా ఉన్న పాండులలోను నిరంతరం యుద్ధాలు కొనసాగించినా మరోవైపు తమలో రగిలే కళాదీప్తిని రవళింపచేసి మహోన్నత శిల్పాలను సృష్టించి ద్రవిడ శిల్పకళారీతులకు శ్రీకారం చుట్టి దాక్షిణాది ఆలయరీతులకు సరి అయిన పునాది వేశారు. పల్లవులు ప్రారంభించిన దేవాలయ నిర్మాణమునకు దక్షిణ దేశ వాస్తు శైలికి మూలము అని గులసెట్ ప్రస్తుతించెను. వి.ఎ. స్మిత్ మాటలలో వాస్తవంగా దక్షిణ భారతదేశంలో వాస్తు శిల్ప కళలచరిత్ర పల్లవుల కాలంలో ప్రారంభమైనది.

**17.6. 2.** పల్లవుల శిల్పకళ మొదటి మహేంద్రవర్మ కాలంలో మొదలయి చివరి పల్లవ రాజు అపరాజిత వర్మ కాలం నాటికి హిందూ దేవాలయ నిర్మాణ పద్ధతులు పూర్తి రూపు రేఖలను దిద్దుకున్నవి. పల్లవుల కాలంనాటి శిల్పకళ నాలుగు దశలలో అభివృద్ధి చెందినది. ఈ నాల్గు దశలను అభివృద్ధి చేసినవారు మహేంద్రవర్మ, నరసింహవర్మ, రాజసింహ, నందివర్మ.

**17.6. 3. మొదటి దశ (గుహాలయాలు) :** కొండలను తొలచి గుహాలయాలను నిర్మించే శిల్ప ప్రవేశ పెట్టినవాడు మొదటి నరసింహవర్మ. ఇతడు మహాబలిపురం, మామండూర్, దళవానూర్, తిరుచినాపల్లి, మండగపట్టు మొదలగు చోట్ల గుహాలయాలను తొలిపించాడు. వీటికి ముఖ భాగంలో స్తంభాలతో కూడిన వరండా, అందులోంచి బయట కుడ్యస్తంభాల రూపకల్పనలోను, శిల్పమూర్తులను తీర్చి దిద్దుటలోను పల్లవుల అపూర్వకల్పనా శక్తి వ్యక్తమవుతుంది.

**17.6. 4. రెండవ దశ (రాతిరధాలు) :** మొదటి మహేంద్రవర్మ కుమారుడు మొదటి నరసింహవర్మ తన తండ్రి ప్రారంభించిన గుహాలయాలను కొనసాగించాడు. మహాబలిపురంలో మహిషాసురమర్దని, ధర్మరాజా, శివుడు, త్రిమూర్తి దుర్గ, వరాహామూర్తులకు గుహాలయాలు తొలిపించాడు. అంతేగాక నరసింహవర్మ, నూతన తరహా దేవాలయాలను రధాల రూపంలో తొలిపించాడు. ఈ రధాలు ఏకశిలా నిర్మితాలు. ఈ రధాలు పంచపాండవులకు, గణేశునకు, కౌరవులకు అంకితంచేయబడ్డాయి. ఆకారాలను బట్టి చూస్తే ఇవి ఆనాటి బౌద్ధ విహారాలకూ, చైత్యశాలలకూ కొంతవరకు అనుకరణలని స్పష్టమవుతుంది. నరసింహవర్మకు మామల్లుడని బిరుదున్నందువల్ల దీనికి మామల్లశైలి అని పేరు వచ్చింది.

**17.6. 5. మూడవ దశ (రాజసింహశైలి) :** మొదటి నరసింహవర్మ మనుమడు రెండవ నరసింహవర్మకు రాజసింహ అను బిరుదు కలదు. ఇతడు సముద్రతీరాన శివ, విష్ణువుల కిద్దరికి కలిపి ఒక దేవాలయాన్ని నిర్మించాడు. దీనినే తీర దేవాలయమంటారు. దీనిని దేవాలయ నిర్మాణంలో మూడవ దశ అన్నారు. అంతేగాక ఇందులో హిందూ దేవాలయానికి ఉండవలసిన వాస్తు లక్షణాలన్ని

వున్నాయి. రెండవ నరసింహవర్మ నిర్మాణాలలో ముఖ్యమైనది కంచిలోని కైలాసనాధ దేవాలయం, పల్లవ వాస్తు కళలో మహోన్నతమైన సృష్టి అని వి.ఎ. స్మిత్ ప్రశంసించెను.

**17.6. 6. నాల్గవ దశ (నందివర్మ, అపరాజిత కాలం) :** నాల్గవ దశలో పెద్ద పెద్ద దేవాలయాలు నందివర్మ, అపరాజిత వర్మలు నిర్మించారు. ఈ దశలోని ఆలయాలకు నిదర్శనము కంచిలో నందివర్మ నిర్మించిన వైకుంఠపెరుమాళ్ ఆలయం. దంతివర్మచే నిర్మించబడిన ఉత్తర మేరూర్ లోని సుందర పెరుమాళ్ ఆలయం, అపరాజితవర్మ తిరుత్తణిలో నిర్మించిన వీరాటేశ్వర ఆలయం గూడా చెప్పుకోదగినవే.

**17.6. 7.** పల్లవులు దేవాలయ నిర్మాణంతో బాటు అద్భుతమైన శిల్పాలను సృష్టించారు. పల్లవ శిల్పాలలో ముఖ్యమైనవి దుర్గ, మహిషాసుర మర్దని, వరాహశివ, విష్ణు శిల్పాలు, గజలక్ష్మి, గణేశ, సప్తమాతృకలు మొదలుగునవి పల్లవుల శిల్పాలన్నింటిలోకి ప్రసిద్ధి చెందినది. మహాబలిపురంలోని అర్జునుని తపస్సు దృశ్యం, దీనిని శిలలో మలచిన కుడ్యచిత్రముగా గ్రూసెట్ వర్ణించవచ్చును.

**17.6. 8.** పల్లవులు శిల్ప కళతో బాటు చిత్ర కళను కూడా పోషించిరి. వారి చిత్రకళకు తమిళనాడు లోని చిత్తన్నవాసల్ గుహల యందలి చిత్తరువులు చక్కని నిదర్శనము.

**17.6. 9.** పై విధముగా దక్షిణ భారత సంస్కృతిని పల్లవులు ఎంతో శోభాయమానంగా తీర్చి దిద్దుటలో గణనీయమైన పాత్రను నిర్వహించి చరిత్రలో శాశ్వత కీర్తిని పొందారు. ఏ యుగమునందూ జరగని శిల్ప కళాభివృద్ధి భారతదేశ చరిత్రలో పల్లవుల కాలములో జరిగింది అని పెర్సీబ్రౌన్ అభిప్రాయపడినారు.

## 17. 7. సారాంశము

పల్లవులు దక్షిణ భారత చరిత్రలో ఐదు శతాబ్దముల కాలం ప్రముఖ స్థానాన్ని అలంకరించారు. వీరి కాలములో రాజకీయ, మత, విద్యా, శిల్పకళా రంగాలలో విశేష ప్రగతి సాధించబడింది. ప్రాచీన భారత చరిత్రలో పల్లవుల పాలనా కాలం చిరస్మరణీమైందని చరిత్రకారుల అభిప్రాయం.

### పదకోశం :

ఆళ్వారులు : వైష్ణవ మతాచార్యులు
కర్మ రాష్ట్రం : గుంటూరు జిల్లా
ఘటికలు : విశ్వవిద్యాలయాలు
నాయనార్లు : శైవ మతాచార్యులు
తామ్ర శాసనాలు: రాగిరేకులుపై లిఖింపబడ్డ శాసనాలు
తొండై శాసనాలు: కంచి పరిసరప్రాంతం

## ప్రశ్నలు

### I. వ్యాస రూప ప్రశ్నలు

1. పల్లవుల రాజకీయ చరిత్రను వివరింపుము
2. దక్షిణ భారత సంస్కృతికి పల్లవులు చేసిన సేవ వివరింపుము

### II. సమస్య పూరిత పశ్నలు :

1. పల్లవుల పుట్టుపూర్వోత్తరాలను గురించి చర్చించుము.
2. పల్లవుల శిల్ప కళకు చేసిన సేవ ఎట్టిది

## III. లఘుటీక ప్రశ్నలు :

1. మహేంద్రవర్మ
2. మహాబలిపురం
3. కాంచీపురం
4. నాయనార్లు, ఆళ్వార్లులు

## IV. కుశాగ్ర బుద్ధి పరీక్ష

**I. సరియైన సమాధానమును బ్రాకెట్టులో గుర్తింపుము**

1. నవీన పల్లవ రాజవంశ స్థాపకుడు ( a )
   a) సింమ విష్ణువు b) మహేంద్రవర్మ c) నరసింహవర్మ
2. మహేంద్రవర్మ బిరుదము ( c )
   a) మహామల్ల b) వాతాపి కొండ c) విచిత్ర చిత్తుడు
3. వాతాపి కొండ ఇతని బిరుదము ( b )
   a) మహేంద్రవర్మ b) నరసింహవర్మ c) రాజరాజు
4. దశ కుమార చరిత్ర రచయిత ( a )
   a) దండి b) భారవి c) మహేంద్రవర్మ
5. మొదటి నరసింహ వర్మ కాలంలో కాంచీపురాన్ని దర్శించిన చైనా యాత్రికుడు ( b )
   a) ఫాహియాన్ b) హుయాన్ త్సాంగ్ c) ఇత్సింగ్

**II. జతపర్చుము**

| గ్రూపు - A | | గ్రూపు - B |
|---|---|---|
| 1. పంచ పాండవ రథాలు | (b) | (a) చిత్రలేఖనం |
| 2. చిత్తన్న వాసల్ | (a) | (b) మహాబలిపురం |

**అభ్యాసాలు :**

1. దాక్షిణాత్య సంస్కృతికి పల్లవులు చేసిన సేవ వివరింపుము.

## ఉపయుక్త గ్రంథాలు


1. వారణాసి యశోదా దేవి : భారతదేశ చరిత్ర - సంస్కృతి, ప్రథమభాగం
2. K.A. Nilakanta Sastry : The Cholas
3. Romila Thapar : History of India
4. K.R. Srinivasan : South India Temples
5. R.C. Majumdar : A Comprehensive history of India Vol III



రచయిత

వి.కె. మోహన్

పాఠం - 18

# బాదామి (పశ్చిమ) చాళుక్యులు - రెండవ పులకేశి

## 18. 1. లక్ష్యం :

క్రీ.శ. ఆరవ, పన్నెండవ శతాబ్దాల మధ్య కాలంలో దక్కన్‌లో అవతరించిన సామ్రాజ్య శక్తుల, ముఖ్యంగా బాదామి చాళుక్యుల, రాజకీయ, సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితులు, శిల్పకళ గురించి తెలియజేయడమే ఈ పాఠం లక్ష్యం.

**ముఖ్యాంశ సంగ్రహము**


18. 2. ఆధారాలు

18. 3. ఉపోద్ఘాతం

18. 4. చాళుక్య వంశోత్పత్తి

18. 5. చాళుక్య రాజ్య స్థాపన

18. 6. రెండవ పులకేశి

18. 7. చివరి పాలకులు

18. 8. చాళుక్య సామ్రాజ్య పరిస్థితులు

18. 9. సారాంశము


## 18. 2. ఆధారాలు :

**18.2. 1. శిలా శాసనాలు :** బాదామి కోటలోని మొదటి పులకేశి శాసనం, రెండవ పులకేశి కాలంలో వేయబడిన రవికీర్తి ఐహోలు శాసనం, నరసింహవర్మ బాదామి శిలాశాసనం.

**18.2. 2. తామ్ర శాసనాలు :** రెండవ పులకేశికి సంబంధించిన రెండు హైదారాబాదు తామ్ర శాసనాలు, గద్వాలు, మారుటూరు తామ్రశాసనాలు, విక్రమాదిత్యుని ఆముదాలపాడు తామ్ర శాసనం.

**18.2. 3. నాణెములు**

**18.2. 4. వాస్తుశిల్పాలు**

**18.2. 5. సాహిత్యం :** బౌద్ధ చైనా యాత్రికుడు హుయాన్‌త్సాంగ్, పర్షియా చరిత్రకారుడు తబరి రచనలు.

## 18. 3. ఉపోద్ఘాతం :

శాతవాహనుల తరువాత దక్షిణాపథాన్ని సమైక్యం చేసి బాదామి లేదా వాతాపి రాజధానిగా చాళుక్యులు రెండు శతాబ్దాలకాలం పరిపాలించారు. ఈ వంశ శాఖవారే గుజరాత్, వేంగి, వేములవాడ, ముదిగొండలలో రాజ్యాలు స్థాపించారు. ఈ కాలంలో స్థానిక భాషల అభివృద్ధి జరిగింది. నిర్మాణంలోనూ, శిల్పంలోనూ ప్రసిద్ధిమైన చాళుక్యశైలిని రూపొందించి విస్తృత ప్రచారం కలిగించారు.

## 18. 4. చాళుక్య వంశోత్పత్తి

చాళుక్య వంశోత్పత్తిని గురించి చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. చాళుక్యులు మధ్య ఆసియాలోని సెల్యూవిడులని కొందరు, ఉత్తరాపథంలోని సులికులే చాళుక్యులని ఇంకా కొందరు అభిప్రాయపడ్డారు. మరికొందరు చాళుక్యులు బహ్మ చుళకం నుంచి ఉద్భవించారని అభిప్రాయపడ్డారు. వీనిలో ఏ ఒక్కటీ సంతృప్తికరమైన సిద్ధాంతం కాదు. చాళుక్యులు అభిమాన దేవత అయిన 'హారీతి' దేవాలయం నాగార్జున కొండలో బయల్పడడం, క్రీ.శ. 3వ శతాబ్దికి చెందిన నాగార్జున కొండ శాసనం హిరణ్యరాష్ట్ర అధిపతిగా ఖంద చలికి రెమ్మణకుని పేర్కొనడం, క్రీ.శ. 11 వ శతాబ్దికి చెందిన వేంగి చాళుక్య శాసనంలో చాళుక్యవంశ కర్తకు కడప జిల్లాతో సంబంధమున్నట్లు సూచించడం, బాదామి చాళుక్యుల శాసనాలు మహబూబ్‌నగర్ జిల్లా ప్రాంతాన్ని 'చాళుక్యవాటి' గా పేర్కొనటం ఆధారాలుగా చాళుక్యకలు అనాదిగా దక్షిణాత్యులేనని తెలుగు - కన్నడ ప్రాంతాలలో నివసించారని పెక్కుమంది చరిత్రకారులు అభిప్రాయపడుచున్నారు.

## 18. 5. చాళుక్య రాజ్యస్థాపన

చాళుక్య వంశానికి మూలపురుషుడు జయసింహవల్లభుడు. ఇతని కుమారుడు రణరాగుడు. రణరాగుని కుమారుడైన మొదటి పులకేశి స్వతంత్ర చాళుక్య రాజ్యం స్థాపించాడు. ఇతడు వాతాపిని ఆక్రమించి అశ్వమేధాన్ని చేశాడు. పులకేశి కుమారుడైన మొదటి కీర్తివర్మ (క్రీ.శ. 576 -598) బనవాసి కదంబులను, కొంకణ మౌర్యులను, నలవాడి రాజులను జయించి చాళుక్య రాజ్యాన్ని విస్తరింప చేశాడు. కీర్తివర్మ తరువాత అతని తమ్ముడు మంగళేశుడు (క్రీ.శ. 598 -609) సింహాసనమెక్కి గుజరాత్‌లోని కాలచుర్యులతో పోరాడి 'రేవతీ' ద్వీపాన్ని స్వాధీనం చేసుకొన్నాడు. కీర్తివర్మ కుమారుడైన పులకేశి సోదరుల సహాయంతో పినతండ్రిని చంపి క్రీ.శ. 609 లో సింహాసన మధిష్టించాడు.

## 18. 6. రెండవ పులకేశి (క్రీ.శ. 609 - 642)

రెండవ పులకేశి బాదామి చాళుక్యులలోనే గాక మధ్యయుగ భారతదేశ చరిత్రలో ప్రసిద్ధి చెందిన గొప్ప సైనిక విజేత. ఇతడు క్రీ.శ 609 నుండి 642 వరకు రాజ్యపాలన చేశాడు. ఇతడు మొదటి కీర్తివర్మ కుమారుడు మొదట పులకేశి మనుమడు. ఇతడు పినతండ్రి అగు మంగలేశుని చంపి రాజ్యానికి వచ్చెను. ఇతని గుణగణములను, సైనిక విజయములను అతని ఆస్థానకవి రవికీర్తి ఐహోలు శాసనములో వివరించాడు. రెండవ పులకేశి పరిస్థితులను చక్కదిద్దుటకు పటిష్ఠమైన సైన్యమును సమకూర్చుకొనెను. అంతరంగికముగా తిరుగుబాటు చేసిన అప్పయిక, గోవిందులను అణిచివేసి తన శక్తి సామర్థ్యమును ప్రత్యర్థులకు చాటాడు. తన దండయాత్రలలో ముందుగా బనవాసి పై దాడిచేసి కదంబులను జయించి ఆ ప్రాంతమును వశపరచుకొనెను. ఆ తరువాత దక్షిణ కర్ణాటక కోస్తా తీరంలో అళువ వంశం వారిని, దక్షిణ కర్ణాటకంలోని తళకాడ్ గాంగులను ఓడించాడు. ఈ విజయ యాత్రల తరువాత గాంగులతో వివాహ సంబంధాల నేర్పరచుకొని, కొంకణ మౌర్యులనోడించి పూరి (నేటి ఎలిఫెంటా) నగరాన్ని ఆక్రమించుకొన్నాడు. పులకేశి పాలనలో పేర్కొనదగిన ఘట్టం ఉత్తర భారత దేశంలోకి చాళుక్య అధికార విస్తరణ. నేటి గుజరాత్, మధ్యప్రదేశ్ ప్రాంతాలలో ఆనాడు వెలసిన లాట, మాళవ, గూర్జర రాజ్యాలను జయించాడు. దీని వల్ల ఉత్తర భారత దేశానికి నేతగావున్న హర్షునితో పులకేశి వైరానికి దిగవలసి వచ్చింది. పులకేశి విజయాలన్నింటిలోను ముఖ్యమైనది క్రీ.శ 620 లో హర్షునిపై సాధించిన ఘన విజయం. సకలోత్తరాధిపతి ఐన హర్షుడు దక్షిణ దిశవైపు తన సామ్రాజ్యాన్ని విస్తరించటానికి ప్రయత్నించగా రెండవ పులకేశి నర్మదా నదీతీరములో హర్షుని ఎదిరించి, ఓడించి తరిమి కొట్టాడు. ఈ విజయానికి చిహ్నంగా హర్షుడు 'పరమేశ్వర' అను బిరుదును పొందాడు. హర్షునిపై విజయం సాధించిన పిమ్మట పులకేశి తూర్పుదిశగ దండయాత్రలను చేసి ఆంధ్రలో గోదావరి జిల్లాల వరకు తన సామ్రాజ్యమును వ్యాప్తి చేసి, తూర్పు ప్రాంతాలకు వేంగిని ముఖ్యపట్టణంగా చేసి తమ్ముడైన కుబ్జ విష్ణువర్ధనుని పాలకునిగా నియమించెను. పులకేశి మరణాంతరం కుబ్జవిష్ణు వర్ధనుడు స్వతంత్ర వేంగి చాళుక్య సామ్రాజ్యమును స్థాపించెను. ఈ సామ్రాజ్యాన్ని గురించి మరొక పాఠంలో వివరించడం జరిగింది. పులకేశి దండయాత్రలలో ముఖ్యమైనవి పల్లవులతో చేసిన యుద్ధాలు. పులకేశికి సమకాలికంగా పల్లవ రాజ్యమును మొదటి మహేంద్రవర్మ పరిపాలించేవాడు. క్రీ.శ. 630 లో పులకేశి కోస్తా ప్రాంతాన్ని ఆక్రమించాడు. మరొకమారు పులకేశి పల్లవ రాజ్యంపై క్రీ.శ. 641 లో దాడిచేసినపుడు పల్లవరాజు నరసింహ వర్మ పులకేశిని

ఓడించి, మనిమంగళ యుద్ధంలో క్రీ.శ. 642లో అతనిని వధించి, అతని సేనలను బాదామి వరకు తరుముకుంటూ వెళ్ళి బాదామి నగరాన్ని దోచుకున్నాడు. ఈ విధంగా పులకేశి మహత్తర జీవితం విషాదంగా పరిసమాప్తమయ్యింది. పారశీక చక్రవర్తి రెండవ ఖుస్రూ పులకేశితో రాయబార సంబంధాలను ఏర్పరచుకున్నట్లు పారశీక చరిత్రకారుడు తబారీ వ్రాసెను. పారశీక రాయబారి పులకేశి ఆస్థానమును దర్శించిన దృశ్యము అజంతా మొదటి గుహలో చిత్రించబడెను. పులకేశి కాలంలో చైనా యాత్రికుడు హుయాన్‌త్సాంగ్ చాళుక్య రాజ్యాన్ని సందర్శించెను. ఇతని రచనల ప్రకారం రెండవ పులకేశి పాలనలో ప్రజలు ఎంతో గర్వముగా, యుద్ధ పిపాసకులుగా, ఉత్సాహవంతులుగా ఉండేవారు. నాటి ప్రజలు చేసిన మేలును మరిచిపోరు. ద్రోహమునకు ప్రతీకారం తీర్చుకొనక మానరు. సమర్ధవంతుడైన రెండవ పులకేశికి అతని సామంతులందరు విధేయులైయుండే వారు. రెండవ పులకేశి రాజ్యం నర్మదానది నుండి కావేరి వరకు వ్యాపించింది. గౌతమ పుత్రశాతకర్ణి తరవాత ఇంత విశాల రాజ్యాన్ని పాలించిన దక్షిణ భారతరాజు మరొకడు కనిపించడు.

## 18. 7. చివరి చక్రవర్తులు

రెండవ పులకేశి మరణానంతరం అతని కుమారుడు మొదటి విక్రమాదిత్యుడు (క్రీ.శ 642 - 681) అధికారానికి వచ్చి రాజ్యంలో శాంతి నెలకొల్పాడు. ఆ తరువాత తండ్రి పరాజయానికి ప్రతీకారం చేసే ఉద్దేశంతో పల్లవ రాజ్యం మీద దండెత్తాడు. కాని పరమేశ్వరవర్మ చేతిలో పెరువల నల్లూర్ యుద్ధంలో ఓడిపోయాడు. విక్రమాదిత్యుని కుమారుడైన వినయాదిత్యుని కాలం (క్రీ.శ. 681 - 696) ప్రశాంతంగా గడిచింది. ఇతని కుమారుడైనర విజయాదిత్యుడు (క్రీ.శ. 696 - 733) కనోజ్ పాలకుడైన వత్సరాజును ఓడించాడు. రెండవ విక్రమాదిత్యుడు (క్రీ.శ. 733 - 746) పల్లవ రాజ్యం మీద దండెత్తి నందివర్మ నోడించి కాంచీ పురాన్ని ఆక్రమించి అక్కడి దేవాలయాలకు దానధర్మాలు చేశాడు. బాదామి చాళుక్యులలో చివరి వాడు రెండవ కీర్తివర్మ (క్రీ.శ. 744 - 757). ఇతడు సింహాసన మెక్కే నాటికి పల్లవ, అరబ్బు దండయాత్రల వల్ల చాళుక్య సామ్రాజ్యానికి విపరీతమైన నష్టం వాటిల్లింది. సైనిక బలం క్షీణించింది. ధనాగారం వట్టిపోయింది. కొందరు చాళుక్య సామంతులు స్వతంత్రులైతె, మరి కొందరు బలపడ్డారు. రాష్ట్రకూటులు దంతిదుర్గుని, కృష్ణుని నాయకత్వాన విజృంభించి చాళుక్యుల భూభాగాలన్నింటినీ ఆక్రమించడంతో చాళుక్య అధికారం అస్తమించింది.

## 18. 8. చాళుక్య సామ్రాజ్య పరిస్థితులు

**18.8. 1. పరిపాలనా విధానం :** హిందూ ధర్మశాస్త్రములకనుకూలంగా చాళుక్యుల పాలన కొనసాగెంది, "రాజే" రాజ్యానికి సర్వాధికారి. పరిపాలనలతో రాజుకు మంత్రులు, అధికారులు సహాయపడేవారు. చాళుక్యులు తమ రాజ్యాన్ని విషయాలుగా, ప్రాంతాలుగా విభజించారు. పరిపాలనలో గ్రామము ప్రధానపాత్ర వహించింది. నాటి పన్నులలో భూమిశిస్తు, ఇంటిపన్ను, సంతలు, రహదార్లపై పన్నులు ప్రధానమైనవి.

**18.8. 2. మతపరిస్థితులు :** చాళుక్య రాజులు వైదికమాతాభిమానులు, వీరు 'సత్యాశ్రయ' పరమ భట్టారక, పరమబ్రహ్మణ్య మొదలగు బిరుదులు ధరించిరి. యజ్ఞయాగాది క్రతువులు చేశారు. బాదామి, ఐహోలు, పట్టడకల్ నగరాలలో త్రిమూర్తులకు ఆలయాలు నిర్మించారు. హిందూ మతాభిమానులైనప్పటికీ చాళుక్యులు మత సహనాన్ని ప్రదర్శించారు. రెండవ పులకేశి సేనాని రవికీర్తి ఐహోలులో జైన దేవాలయాన్ని నిర్మించాడు. విజయాదిత్య, రెండవ విక్రమాదిత్యులు జైనాచార్యులను ఆదరించి పోషించారు.

**18.8. 3. భాష - సాహిత్యము :** చాళుక్యులు సంస్కృత భాషను రాజభాషగా ఆదరించారు. ఈ కాలములోనే తెలుగు, కన్నడ భాషలు తలెత్తినవి. రెండవ పులకేశి ఆస్థానమునందు గల గాంగ దుర్వినీతుడు 'శబ్దావతార' అనే సంస్కృత వ్యాకరణ గ్రంధాన్ని రచించాడు. చాళుక్యుల శాసనాలలో తెలుగు, కన్నడ భాషలకు సంబంధించిన కొన్ని దేశీయ పదములు తొలిరూపులో మనకు గోచరిస్తాయి.

**18.8. 4. వాస్తు శిల్పకళలు :** చాళుక్యులు వాస్తు, శిల్పకళలకు గణనీయమైన సేవచేసిరి. వీరి దేవాలయ నిర్మాణము ఒక ప్రత్యేక శైలిలో జరిగెను. ఈ శైలికే ప్రసిద్ధ పండితుడు పెర్గూసన్ 'చాళుక్యశైలి' గా నామకరణం చేసెను. ఉత్తర భారతదేశము నందలి 'నాగర' శైలి నందలి లక్షణములను దక్షిణ భారతదేశమునందలి 'ద్రావిడ' శైలి లక్షణములను మిళితము చేసి చాళుక్యులు నూతన శైలిలో అనేక

దేవాలయాలను నిర్మించారు. వాటిని 'వేసర' శైలి దేవాలయాలని కొందరు వ్యవహరించారు. వీరు నిర్మించిన ఆలయాలు ఐహోలు, బాదామి, పట్టడకల్, ఆలంపూర్, మహాకూట, సత్యవోలు మొదలగు స్థలాలలో కలవు. ఐహోలులోని 'లతడ్‌ఖాన్' 'కొంటుగుడి' దుర్గాలయము, హుచ్చిమల్లిగుడి, మోగూతి ఆలయం, బాదామిలోని 'మాలెగిత్తి' శివాలయం, పట్టడకల్‌లో నిర్మించిన 'నవబ్రహ్మ' ఆలయాలు బాదామి చాళుక్యుల వాస్తు శిల్పనైపుణ్యానికి తిరుగులేని నిదర్శనాలు. చాళుక్యులు దేవాలయాల కుడ్యాలపై అనేక పౌరాణిక గాథలను సృష్టించారు నాటి ఆలయాలు కేవలం ఆధ్యాత్మిక ప్రయోజనాలకే పరిమితంగాక సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక జీవనంలో ప్రధానపాత్ర వహించేవి. దేవాలయాలతోపాటు చాళుక్యులు గుహాలయాలు తొలిపించారు ఇట్టివి బాదామిలో గలవు. ఇవి స్తంభాలు కలిగిన మండపము, దాని వెనుక గది కలిగి, శివ - నటరాజ, విష్ణు శిల్పాలకు ప్రసిద్ధిగాంచాయి.

## 18. 9. సారాంశము

దక్షిణాపథములో శాతవాహనుల తరువాత రాజ్యాలను ఏలిన వారిలో రాజకీయ ఐక్యతను సాధించి రాజ్యమేలినవారిలో బాదావి చాళుక్యులు ఒకరు. ఈ యుగంలో స్థానికమైన దేశభాషలభివృద్ధి జరిగింది. అమరావతి శైలి తరువాత ప్రసిద్ధమైన చాళుక్య శైలి రూపొందించి విస్తృత ప్రచారం కలిగించారు.

**పదకోశం :**

| | | |
|---|---|---|
| చాళుక్య శైలి | : | నిర్మాణంలో బాదామి చాళుక్యులు అనుసరించిన పద్ధతి. దీనికి వేసరశైలి అనికూడా అంటారు. భౌగోళికంగా దక్కనులోని ఆలయాలు. |
| నాగరశైలి | : | ఔత్తరాహిక ఆలయాల నిర్మాణ పద్ధతి |
| ద్రావిడ శైలి | : | దక్షిన దేశంలోని ఆలయాల నిర్మాణ పద్ధతి |
| తామ్రశాసనం | : | రాగి రేకులపై వ్రాసినవి. |
| రేవతీ ద్వీపం | : | గోవా |
| హిరణ్య రాష్ట్రం | : | కడప జిల్లా |

### ప్రశ్నలు :

**I. వ్యాస ప్రశ్నలు :**

1. బాదామి చాళుక్యుల రాజకీయ చరిత్రను, సంస్కృతిని వివరింపుము ?
2. కళ్యాణి చాళుక్యుల రాజకీయ చరిత్రను, సంస్కృతిని వివరింపుము

**II. సమస్య పూరిత పశ్నలు :**

1. రెండవ పులకేశి సాధించిన ఘనకార్యములను వివరింపుము ?
2. రాష్ట్ర కూటులు ఎవరు ? వారి ఘనతను వివరింపుము ?

**III. లఘుటీక ప్రశ్నలు :**

1. ఐహోలు (అయ్యావోలు) ప్రశస్తి
2. బాదామి చాళుక్య శిల్పకళ (చాళుక్యశైలి)

3. అమోఘ వర్షుడు
4. బసవేశ్వరుడు

## IV. కుశాగ్ర బుద్ధి పరీక్ష

1. తొలి పశ్చిమ చాళుక్యుల రాజధాని ( a )
   a) వాతాపి/బాదామి b) వేంగి c) కంచి
2. చాళుక్య వంశ మూల పురుషుడు ( b)
   a) పులకేశి b) జయసింహ వల్లభుడు c) రాజరాజు
3. బాదామి చాళుక్యులలో అగ్రగణ్యుడు ( a )
   a) రెండవ పులకేశి b) కీర్తివర్మ c) మంగలేశుడు
4. నర్మదా నదీ తీరములో రెండవ పులకేశిచే ఓడింపబడిన రాజు ( c )
   a) నరసింహ వర్మ b) మహేంద్రవర్మ c) హర్షుడు
5. రెండవ పులకేశిని గురించి తెలియజేయు శాసనము ( a )
   a) అయ్యావోలు b) నాసిక్ c) కంచి
6. అయ్యావోలు జైనదేవలయ స్థాపకుడు ( c )
   a) విజయాదిత్యుడు b) పులకేశి c) రవికీర్తి
7. రాష్ట్రకూట వంశ మూలపురుషుడు ( a )
   a) దంతిదుర్గుడు b) కృష్ణుడు c) అమోఘవర్షుడు
8. రాష్ట్ర కూటులలో గొప్పరాజు ( b )
   a) ధృవుడు b) అమోఘవర్షుడు c) గోవిందుడు
9. కళ్యాణి చాళుక్యులలో మొదటి రాజు ( c )
   a) విక్రమాదిత్యుడు b) సోమేశ్వరుడు c) తైలపుడు
10. రాజధానిని మాన్యఖేటము నుండి కళ్యాణికి మార్చిన రాజు ( a )
   a) మొదటి సోమేశ్వరుడు b) తైలపుడు c) కృష్ణుడు

## I. జతపర్చుము

| గ్రూపు - A | | గ్రూపు - B |
|---|---|---|
| 1. రవికీర్తి | (b) | (a) శబ్దావతార్ |
| 2. గాంగదుర్వినీతుడు | (a) | (b) అయ్యావోలు ప్రశస్తి |
| 3. అలంపురం | (d) | (c) 3వ సోమేశ్వరుడు |
| 4. ఖడ్గావలోక | (e) | (d) నవ బ్రహ్మ ఆలయాలు |
| 5. మానసోల్లాసము | (c) | (e) దంతి దుర్గుడు |

**అభ్యాసాలు :**

1. రెండవ పులకేశి సాధించిన ఘనకార్యములను వివరింపుము ?

**ఉపయుక్త గ్రంథాలు**


| | | |
|---|---|---|
| 1. బి. యస్. ఎల్. హనుమంతరావు | : | భారతదేశ చరిత్ర - సంస్కృతి ద్వితీయ భాగము, తెలుగు అకాడమి ప్రచురణ |
| 2. ఇండవల్లి లక్ష్మీరంజనం - బాలేందు శేఖరం | : | ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి |
| 3. Romila Thapar: | : | History of India |
| 4. G. Gazdani | : | The Early History of the Deccan |
| 5. R.C. Majumdar | : | A Comprehensive history of India, Vol III |
| 6. K.A.N. Sastri | : | A History South India from Pre histroric times to the fall of Vijayanagar |
| 7. K.r. Srinivasn | : | South Indian Temples |



పాఠ్య రచయిత

**వి.కె. మోహన్**

పాఠం - 18

# బాదామి (పశ్చిమ) చాళుక్యులు - రెండవ పులకేశి

## 18. 1. లక్ష్యం :

క్రీ.శ. ఆరవ, పన్నెండవ శతాబ్దాల మధ్య కాలంలో దక్కన్‌లో అవతరించిన సామ్రాజ్య శక్తుల, ముఖ్యంగా బాదామి చాళుక్యుల, రాజకీయ, సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితులు, శిల్పకళ గురించి తెలియజేయడమే ఈ పాఠం లక్ష్యం.

**ముఖ్యాంశ సంగ్రహము**


18. 2. ఆధారాలు

18. 3. ఉపోద్ఘాతం

18. 4. చాళుక్య వంశోత్పత్తి

18. 5. చాళుక్య రాజ్య స్థాపన

18. 6. రెండవ పులకేశి

18. 7. చివరి పాలకులు

18. 8. చాళుక్య సామ్రాజ్య పరిస్థితులు

18. 9. సారాంశము


## 18. 2. ఆధారాలు :

**18.2. 1. శిలా శాసనాలు :** బాదామి కోటలోని మొదటి పులకేశి శాసనం, రెండవ పులకేశి కాలంలో వేయబడిన రవికీర్తి ఐహోలు శాసనం, నరసింహవర్మ బాదామి శిలాశాసనం.

**18.2. 2. తామ్ర శాసనాలు :** రెండవ పులకేశికి సంబంధించిన రెండు హైదారాబాదు తామ్ర శాసనాలు, గద్వాలు, మారుటూరు తామ్రశాసనాలు, విక్రమాదిత్యుని ఆముదాలపాడు తామ్ర శాసనం.

**18.2. 3. నాణెములు**

**18.2. 4. వాస్తుశిల్పాలు**

**18.2. 5. సాహిత్యం :** బౌద్ధ చైనా యాత్రికుడు హుయాన్‌త్సాంగ్, పర్షియా చరిత్రకారుడు తబరి రచనలు.

## 18. 3. ఉపోద్ఘాతం :

శాతవాహనుల తరువాత దక్షిణాపథాన్ని సమైక్యం చేసి బాదామి లేదా వాతాపి రాజధానిగా చాళుక్యులు రెండు శతాబ్దాలకాలం పరిపాలించారు. ఈ వంశ శాఖవారే గుజరాత్, వేంగి, వేములవాడ, ముదిగొండలలో రాజ్యాలు స్థాపించారు. ఈ కాలంలో స్థానిక భాషల అభివృద్ధి జరిగింది. నిర్మాణంలోనూ, శిల్పంలోనూ ప్రసిద్ధిమైన చాళుక్యశైలిని రూపొందించి విస్తృత ప్రచారం కలిగించారు.

## 18. 4. చాళుక్య వంశోత్పత్తి

చాళుక్య వంశోత్పత్తిని గురించి చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. చాళుక్యులు మధ్య ఆసియాలోని సెల్యూవిడులని కొందరు, ఉత్తరాపథంలోని సులికులే చాళుక్యులని ఇంకా కొందరు అభిప్రాయపడ్డారు. మరికొందరు చాళుక్యులు బ్రహ్మ చుళకం నుంచి ఉద్భవించారని అభిప్రాయపడ్డారు. వీనిలో ఏ ఒక్కటీ సంతృప్తికరమైన సిద్ధాంతం కాదు. చాళుక్యులు అభిమాన దేవత అయిన 'హారీతి' దేవాలయం నాగార్జున కొండలో బయల్పడడం, క్రీ.శ. 3వ శతాబ్దికి చెందిన నాగార్జున కొండ శాసనం హిరణ్యరాష్ట్ర అధిపతిగా ఖంద చలికి రెమ్మణకుని పేర్కొనడం, క్రీ.శ. 11 వ శతాబ్దికి చెందిన వేంగి చాళుక్య శాసనంలో చాళుక్యవంశ కర్తకు కడప జిల్లాతో సంబంధమున్నట్లు సూచించడం, బాదామి చాళుక్యుల శాసనాలు మహబూబ్‌నగర్ జిల్లా ప్రాంతాన్ని 'చాళుక్యవాటి' గా పేర్కొనటం ఆధారాలుగా చాళుక్యకలు అనాదిగా దక్షిణాత్యులేనని తెలుగు - కన్నడ ప్రాంతాలలో నివసించారని పెక్కుమంది చరిత్రకారులు అభిప్రాయపడుచున్నారు.

## 18. 5. చాళుక్య రాజ్యస్థాపన

చాళుక్య వంశానికి మూలపురుషుడు జయసింహవల్లభుడు. ఇతని కుమారుడు రణరాగుడు. రణరాగుని కుమారుడైన మొదటి పులకేశి స్వతంత్ర చాళుక్య రాజ్యం స్థాపించాడు. ఇతడు వాతాపిని ఆక్రమించి అశ్వమేధాన్ని చేశాడు. పులకేశి కుమారుడైన మొదటి కీర్తివర్మ (క్రీ.శ. 576 -598) బనవాసి కదంబులను, కొంకణ మౌర్యులను, నలవాడి రాజులను జయించి చాళుక్య రాజ్యాన్ని విస్తరింప చేశాడు. కీర్తివర్మ తరువాత అతని తమ్ముడు మంగళేశుడు (క్రీ.శ. 598 -609) సింహాసనమెక్కి గుజరాత్‌లోని కాలచుర్యులతో పోరాడి 'రేవతీ' ద్వీపాన్ని స్వాధీనం చేసుకొన్నాడు. కీర్తివర్మ కుమారుడైన పులకేశి సోదరుల సహాయంతో పినతండ్రిని చంపి క్రీ.శ. 609 లో సింహాసన మధిష్టించాడు.

## 18. 6. రెండవ పులకేశి (క్రీ.శ. 609 - 642)

రెండవ పులకేశి బాదామి చాళుక్యులలోనే గాక మధ్యయుగ భారతదేశ చరిత్రలో ప్రసిద్ధి చెందిన గొప్ప సైనిక విజేత. ఇతడు క్రీ.శ 609 నుండి 642 వరకు రాజ్యపాలన చేశాడు. ఇతడు మొదటి కీర్తివర్మ కుమారుడు మొదట పులకేశి మనుమడు. ఇతడు పినతండ్రి అగు మంగలేశుని చంపి రాజ్యానికి వచ్చెను. ఇతని గుణగణములను, సైనిక విజయములను అతని ఆస్థానకవి రవికీర్తి ఐహోలు శాసనములో వివరించాడు. రెండవ పులకేశి పరిస్థితులను చక్కదిద్దుటకు పటిష్ఠమైన సైన్యమును సమకూర్చుకొనెను. అంతరంగికముగా తిరుగుబాటు చేసిన అప్పయిక, గోవిందులను అణిచివేసి తన శక్తి సామర్ధ్యమును ప్రత్యర్థులకు చాటాడు. తన దండయాత్రలలో ముందుగా బనవాసి పై దాడిచేసి కదంబులను జయించి ఆ ప్రాంతమును వశపరచుకొనెను. ఆ తరువాత దక్షిణ కర్ణాటక కోస్తా తీరంలో అళువ వంశం వారిని, దక్షిణ కర్ణాటకంలోని తళకాడ్ గాంగులను ఓడించాడు. ఈ విజయ యాత్రల తరువాత గాంగులతో వివాహ సంబంధాల నేర్పరచుకొని, కొంకణ మౌర్యులనోడించి పూరి (నేటి ఎలిఫెంటా) నగరాన్ని ఆక్రమించుకొన్నాడు. పులకేశి పాలనలో పేర్కొనదగిన ఘట్టం ఉత్తర భారత దేశంలోకి చాళుక్య అధికార విస్తరణ. నేటి గుజరాత్, మధ్యప్రదేశ్ ప్రాంతాలలో ఆనాడు వెలసిన లాట, మాళవ, గూర్జర రాజ్యాలను జయించాడు. దీని వల్ల ఉత్తర భారత దేశానికి నేతగావున్న హర్షునితో పులకేశి వైరానికి దిగవలసి వచ్చింది. పులకేశి విజయాలన్నింటిలోను ముఖ్యమైనది క్రీ.శ 620 లో హర్షునిపై సాధించిన ఘన విజయం. సకలోత్తరాధిపతి ఐన హర్షుడు దక్షిణ దిశవైపు తన సామ్రాజ్యాన్ని విస్తరించటానికి ప్రయత్నించగా రెండవ పులకేశి నర్మదా నదీతీరములో హర్షుని ఎదిరించి, ఓడించి తరిమి కొట్టాడు. ఈ విజయానికి చిహ్నంగా హర్షుడు 'పరమేశ్వర' అను బిరుదును పొందాడు. హర్షునిపై విజయం సాధించిన పిమ్మట పులకేశి తూర్పుదిశగ దండయాత్రలను చేసి ఆంధ్రలో గోదావరి జిల్లాల వరకు తన సామ్రాజ్యమును వ్యాప్తి చేసి, తూర్పు ప్రాంతాలకు వేంగిని ముఖ్యపట్టణంగా చేసి తమ్ముడైన కుబ్జ విష్ణువర్ధనుని పాలకునిగా నియమించెను. పులకేశి మరణానంతరం కుబ్జవిష్ణు వర్ధనుడు స్వతంత్ర వేంగి చాళుక్య సామ్రాజ్యమును స్థాపించెను. ఈ సామ్రాజ్యాన్ని గురించి మరొక పాఠంలో వివరించడం జరిగింది. పులకేశి దండయాత్రలలో ముఖ్యమైనవి పల్లవులతో చేసిన యుద్ధాలు. పులకేశికి సమకాలికంగా పల్లవ రాజ్యమును మొదటి మహేంద్రవర్మ పరిపాలించేవాడు. క్రీ.శ. 630 లో పులకేశి కోస్తా ప్రాంతాన్ని ఆక్రమించాడు. మరొకమారు పులకేశి పల్లవ రాజ్యంపై క్రీ.శ. 641 లో దాడిచేసినపుడు పల్లవరాజు నరసింహ వర్మ పులకేశిని

ఓడించి, మనిమంగళ యుద్ధంలో క్రీ.శ. 642లో అతనిని వధించి, అతని సేనలను బాదామి వరకు తరుముకుంటూ వెళ్ళి బాదామి నగరాన్ని దోచుకున్నాడు. ఈ విధంగా పులకేశి మహత్తర జీవితం విషాదంగా పరిసమాప్తమయ్యింది. పారశీక చక్రవర్తి రెండవ ఖుస్రూ పులకేశితో రాయబార సంబంధాలను ఏర్పరచుకున్నట్లు పారశీక చరిత్రకారుడు తబారీ వ్రాసెను. పారశీక రాయబారి పులకేశి ఆస్థానమును దర్శించిన దృశ్యము అజంతా మొదటి గుహలో చిత్రించబడెను. పులకేశి కాలంలో చైనా యాత్రికుడు హుయాన్‌త్సాంగ్ చాళుక్య రాజ్యాన్ని సందర్శించెను. ఇతని రచనల ప్రకారం రెండవ పులకేశి పాలనలో ప్రజలు ఎంతో గర్వముగా, యుద్ధ పిపాసకులుగా, ఉత్సాహవంతులుగా ఉండేవారు. నాటి ప్రజలు చేసిన మేలును మరిచిపోరు. ద్రోహమునకు ప్రతీకారం తీర్చుకొనక మానరు. సమర్ధవంతుడైన రెండవ పులకేశికి అతని సామంతులందరు విధేయులైయుండే వారు. రెండవ పులకేశి రాజ్యం నర్మదానది నుండి కావేరి వరకు వ్యాపించింది. గౌతమ పుత్రశాతకర్ణి తరవాత ఇంత విశాల రాజ్యాన్ని పాలించిన దక్షిణ భారతరాజు మరొకడు కనిపించడు.

## 18. 7. చివరి చక్రవర్తులు

రెండవ పులకేశి మరణానంతరం అతని కుమారుడు మొదటి విక్రమాదిత్యుడు (క్రీ.శ 642 - 681) అధికారానికి వచ్చి రాజ్యంలో శాంతి నెలకొల్పాడు. ఆ తరువాత తండ్రి పరాజయానికి ప్రతీకారం చేసే ఉద్దేశంతో పల్లవ రాజ్యం మీద దండెత్తాడు. కాని పరమేశ్వరవర్మ చేతిలో పెరువల నల్లూర్ యుద్ధంలో ఓడిపోయాడు. విక్రమాదిత్యుని కుమారుడైన వినయాదిత్యుని కాలం (క్రీ.శ. 681 - 696) ప్రశాంతంగా గడిచింది. ఇతని కుమారుడైనర విజయాదిత్యుడు (క్రీ.శ. 696 - 733) కనోజ్ పాలకుడైన వత్సరాజును ఓడించాడు. రెండవ విక్రమాదిత్యుడు (క్రీ.శ. 733 - 746) పల్లవ రాజ్యం మీద దండెత్తి నందివర్మ నోడించి కాంచీ పురాన్ని ఆక్రమించి అక్కడి దేవాలయాలకు దానధర్మాలు చేశాడు. బాదామి చాళుక్యులలో చివరి వాడు రెండవ కీర్తివర్మ (క్రీ.శ. 744 - 757). ఇతడు సింహాసన మెక్కే నాటికి పల్లవ, అరబ్బు దండయాత్రల వల్ల చాళుక్య సామ్రాజ్యానికి విపరీతమైన నష్టం వాటిల్లింది. సైనిక బలం క్షీణించింది. ధనాగారం వట్టిపోయింది. కొందరు చాళుక్య సామంతులు స్వతంత్రులైతే, మరి కొందరు బలపడ్డారు. రాష్ట్రకూటులు దంతిదుర్గుని, కృష్ణుని నాయకత్వాన విజృంభించి చాళుక్యుల భూభాగాలన్నింటినీ ఆక్రమించడంతో చాళుక్య అధికారం అస్తమించింది.

## 18. 8. చాళుక్య సామ్రాజ్య పరిస్థితులు

**18.8. 1. పరిపాలనా విధానం :** హిందూ ధర్మశాస్త్రములకనుకూలంగా చాళుక్యుల పాలన కొనసాగెంది, "రాజే" రాజ్యానికి సర్వాధికారి. పరిపాలనలతో రాజుకు మంత్రులు, అధికారులు సహాయపడేవారు. చాళుక్యులు తమ రాజ్యాన్ని విషయాలుగా, ప్రాంతాలుగా విభజించారు. పరిపాలనలో గ్రామము ప్రధానపాత్ర వహించింది. నాటి పన్నులలో భూమిశిస్తు, ఇంటిపన్ను, సంతలు, రహదార్లపై పన్నులు ప్రధానమైనవి.

**18.8. 2. మతపరిస్థితులు :** చాళుక్య రాజులు వైదికమాతాభిమానులు, వీరు 'సత్యాశ్రయ' పరమ భట్టారక, పరమబ్రహ్మణ్య మొదలగు బిరుదులు ధరించిరి. యజ్ఞయాగాది క్రతువులు చేశారు. బాదామి, ఐహోలు, పట్టడకల్ నగరాలలో త్రిమూర్తులకు ఆలయాలు నిర్మించారు. హిందూ మతాభిమానులైనప్పటికీ చాళుక్యులు మత సహనాన్ని ప్రదర్శించారు. రెండవ పులకేశి సేనాని రవికీర్తి ఐహోలులో జైన దేవాలయాన్ని నిర్మించాడు. విజయాదిత్య, రెండవ విక్రమాదిత్యులు జైనాచార్యులను ఆదరించి పోషించారు.

**18.8. 3. భాష - సాహిత్యము :** చాళుక్యులు సంస్కృత భాషను రాజభాషగా ఆదరించారు. ఈ కాలములోనే తెలుగు, కన్నడ భాషలు తలెత్తినవి. రెండవ పులకేశి ఆస్థానమునందు గల గాంగ దుర్వినీతుడు 'శబ్దావతార' అనే సంస్కృత వ్యాకరణ గ్రంధాన్ని రచించాడు. చాళుక్యుల శాసనాలలో తెలుగు, కన్నడ భాషలకు సంబంధించిన కొన్ని దేశీయ పదములు తొలిరూపులో మనకు గోచరిస్తాయి.

**18.8. 4. వాస్తు శిల్పకళలు :** చాళుక్యులు వాస్తు, శిల్పకళలకు గణనీయమైన సేవచేసిరి. వీరి దేవాలయ నిర్మాణము ఒక ప్రత్యేక శైలిలో జరిగెను. ఈ శైలికే ప్రసిద్ధ పండితుడు పెర్గూసన్ 'చాళుక్యశైలి' గా నామకరణం చేసెను. ఉత్తర భారతదేశము నందలి 'నాగర' శైలి నందలి లక్షణములను దక్షిణ భారతదేశమునందలి 'ద్రావిడ' శైలి లక్షణములను మిళితము చేసి చాళుక్యులు నూతన శైలిలో అనేక

దేవాలయాలను నిర్మించారు. వాటిని 'వేసర' శైలి దేవాలయాలని కొందరు వ్యవహరించారు. వీరు నిర్మించిన ఆలయాలు ఐహోలు, బాదామి, పట్టడకల్, ఆలంపూర్, మహాకూట, సత్యావోలు మొదలగు స్థలాలలో కలవు. ఐహోలులోని 'లతడ్‌ఖాన్' 'కొంటుగుడి' దుర్గాలయము, హుచ్చిమల్లిగుడి, మెగూతి ఆలయం, బాదామిలోని 'మాలెగిత్తి' శివాలయం, పట్టడకల్‌లో నిర్మించిన 'నవబ్రహ్మ' ఆలయాలు బాదామి చాళుక్యుల వాస్తు శిల్పనైపుణ్యానికి తిరుగులేని నిదర్శనాలు. చాళుక్యులు దేవాలయాల కుడ్యాలపై అనేక పౌరాణిక గాథలను సృష్టించారు నాటి ఆలయాలు కేవలం ఆధ్యాత్మిక ప్రయోజనాలకే పరిమితంగాక సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక జీవనంలో ప్రధానపాత్ర వహించేవి. దేవాలయాలతోపాటు చాళుక్యులు గుహాలయాలు తొలిపించారు ఇట్టివి బాదామిలో గలవు. ఇవి స్తంభాలు కలిగిన మండపము, దాని వెనుక గది కలిగి, శివ - నటరాజ, విష్ణు శిల్పాలకు ప్రసిద్ధిగాంచాయి.

## 18. 9. సారాంశము

దక్షిణాపథములో శాతవాహనుల తరువాత రాజ్యాలను ఏలిన వారిలో రాజకీయ ఐక్యతను సాధించి రాజ్యమేలినవారిలో బాదామి చాళుక్యులు ఒకరు. ఈ యుగంలో స్థానికమైన దేశభాషలభివృద్ధి జరిగింది. అమరావతి శైలి తరువాత ప్రసిద్ధమైన చాళుక్య శైలి రూపొందించి విస్తృత ప్రచారం కలిగించారు.

**పదకోశం :**

| | | |
|---|---|---|
| చాళుక్య శైలి | : | నిర్మాణంలో బాదామి చాళుక్యులు అనుసరించిన పద్ధతి. దీనికి వేసరశైలి అనికూడా అంటారు. భౌగోళికంగా దక్కనులోని ఆలయాలు. |
| నాగరశైలి | : | ఔత్తరాహిక ఆలయాల నిర్మాణ పద్ధతి |
| ద్రావిడ శైలి | : | దక్షిన దేశంలోని ఆలయాల నిర్మాణ పద్ధతి |
| తామ్రశాసనం | : | రాగి రేకులపై వ్రాసినవి. |
| రేవతీ ద్వీపం | : | గోవా |
| హిరణ్య రాష్ట్రం | : | కడప జిల్లా |

**ప్రశ్నలు :**

**I. వ్యాస ప్రశ్నలు :**

1. బాదామి చాళుక్యుల రాజకీయ చరిత్రను, సంస్కృతిని వివరింపుము ?
2. కళ్యాణి చాళుక్యుల రాజకీయ చరిత్రను, సంస్కృతిని వివరింపుము

**II. సమస్య పూరిత ప్రశ్నలు :**

1. రెండవ పులకేశి సాధించిన ఘనకార్యములను వివరింపుము ?
2. రాష్ట్ర కూటులు ఎవరు ? వారి ఘనతను వివరింపుము ?

**III. లఘుటీక ప్రశ్నలు :**

1. ఐహోలు (అయ్యావోలు) ప్రశస్తి
2. బాదామి చాళుక్య శిల్పకళ (చాళుక్యశైలి)

3. అమోఘ వర్షుడు
4. బసవేశ్వరుడు

## IV. కుశాగ్ర బుద్ధి పరీక్ష

1. తొలి పశ్చిమ చాళుక్యుల రాజధాని ( a )
   a) వాతాపి/బాదామి b) వేంగి c) కంచి
2. చాళుక్య వంశ మూల పురుషుడు ( b)
   a) పులకేశి b) జయసింహ వల్లభుడు c) రాజరాజు
3. బాదామి చాళుక్యులలో అగ్రగణ్యుడు ( a )
   a) రెండవ పులకేశి b) కీర్తివర్మ c) మంగలేశుడు
4. నర్మదా నదీ తీరములో రెండవ పులకేశిచే ఓడింపబడిన రాజు ( c )
   a) నరసింహ వర్మ b) మహేంద్రవర్మ c) హర్షుడు
5. రెండవ పులకేశిని గురించి తెలియజేయు శాసనము ( a )
   a) అయ్యావోలు b) నాసిక్ c) కంచి
6. అయ్యావోలు జైనదేవలయ స్థాపకుడు ( c )
   a) విజయాదిత్యుడు b) పులకేశి c) రవికీర్తి
7. రాష్ట్రకూట వంశ మూలపురుషుడు ( a )
   a) దంతిదుర్గుడు b) కృష్ణుడు c) అమోఘవర్షుడు
8. రాష్ట్ర కూటులలో గొప్పరాజు ( b )
   a) ధృవుడు b) అమోఘవర్షుడు c) గోవిందుడు
9. కళ్యాణి చాళుక్యులలో మొదటి రాజు ( c )
   a) విక్రమాదిత్యుడు b) సోమేశ్వరుడు c) తైలపుడు
10. రాజధానిని మాన్యఖేటము నుండి కళ్యాణికి మార్చిన రాజు ( a )
   a) మొదటి సోమేశ్వరుడు b) తైలపుడు c) కృష్ణుడు

## I. జతపర్చుము

| గ్రూపు - A | | గ్రూపు - B |
|---|---|---|
| 1. రవికీర్తి | (b) | (a) శబ్దావతార్ |
| 2. గాంగదుర్వినీతుడు | (a) | (b) అయ్యావోలు ప్రశస్తి |
| 3. అలంపురం | (d) | (c) 3వ సోమేశ్వరుడు |
| 4. ఖడ్గావలోక | (e) | (d) నవ బ్రహ్మ ఆలయాలు |
| 5. మానసోల్లాసము | (c) | (e) దంతి దుర్గుడు |

**అభ్యాసాలు :**

1. రెండవ పులకేశి సాధించిన ఘనకార్యములను వివరింపుము ?

**ఉపయుక్త గ్రంథాలు**


1. బి. యస్. ఎల్. హనుమంతరావు : భారతదేశ చరిత్ర - సంస్కృతి ద్వితీయ భాగము, తెలుగు అకాడమి ప్రచురణ
2. ఇండవల్లి లక్ష్మీరంజనం - బాలేందు శేఖరం : ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి
3. Romila Thapar : : History of India
4. G. Gazdani : The Early History of the Deccan
5. R.C. Majumdar : A Comprehensive history of India, Vol III
6. K.A.N. Sastri : A History South India from Pre histroric times to the fall of Vijayanagar
7. K.r. Srinivasn : South Indian Temples



పాఠ్య రచయిత

**వి.కె. మోహన్**

పాఠం - 19

# వేంగి చాళుక్యులు లేక తూర్పుచాళుక్యులు

## 19. 1. లక్ష్యం

తూర్పు చాళుక్య లేదా వేంగి చాళుక్య రాజ్య స్థాపన ఎట్లు జరిగెను, దాని స్థాపకులెవరు, తూర్పుచాళుక్య రాజకీయ చరిత్ర మరియు వారి యుగ ప్రశస్తి మొదలగు అనేక విషయాలను తెలుసుకోవటం ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.


19. 2. ఉపోద్ఘాతం:
19. 3. రాజకీయ చరిత్ర
19.3. 1. కుబ్జ విష్ణువర్ధనుడు (క్రీ.శ. 624 - 642)
19.3. 2. మొదటి విజయాదిత్యుడు (క్రీ.శ. 753 - 770)
19.3. 3. రెండవ విజయాదిత్యుడు (నరేంద్ర మృగరాజు) (క్రీ.శ. 806- 846)
19.3. 4. గుణక విజయాదిత్యుడు లేక మూడవ విజయాదిత్యుడు (క్రీ.శ. 848 - 890)
19.3. 5. గుణక విజయాదిత్యుని వారసులు.
19.3. 6. చోళ - కళ్యాణి చాళుక్య సంఘర్షణ.
19.3. 7. రాజ రాజ నరేంద్రుడు (క్రీ.శ. 1019 - 1060)
19. 4. చాళుక్య యుగ ప్రశస్తి
19.4. 1. పాలనా వ్యవస్థ
19.4. 2. ఆర్థిక పరిస్థితులు
19.4. 3. సాంఘిక పరిస్థితులు
19.4. 4. మత పరిస్థితులు
19.4. 5. సారస్వతసేవ
19.4. 6. సంగీత - నాట్యకళలు
19.4. 7. వాస్తు - శిల్పము
19. 5. సారాంశము


## 19. 2. ఉపోద్ఘాతం

వేంగి చాళుక్యులు బాదామి చాళుక్య వంశశాఖ. బాదామి చాళుక్య రాజైన రెండవ పులకేశి (609 - 642 A.D ) పిష్టపుర, కునాల యుద్ధములలో ఆంధ్రదేశమును జయించి వేంగి ప్రాంతమును ఆక్రమించి, తన సోదరుడైన కుబ్జ విష్ణువర్ధనుని వేంగి ప్రతినిధిగ నియమించెను. రెండవ పులకేశి వేంగిప్రాంతమును ఆక్రమించిన కాలం గురించి చరిత్రకారులలో భేదాభిప్రాయములు కలవు. నేడ ఎక్కువ మంది చరిత్రకారులు క్రీ. శ. 616 సం-నకు రెండవ పులకేశి వేంగి ప్రాంతమును ఆక్రమించినట్లు అంగీకరించుచున్నారు. క్రీ.శ 616 నుంచి రాజ ప్రతినిధిగా ఉన్న కుబ్జవిష్ణువర్ధనుడు, క్రీ.శ 624 లో రెండవ పులకేశి అనుమతితో స్వతంత్రుడైనట్లు తెలియుచున్నది. ఈతని సంతతి వారు తూర్పు చాళుక్యులుగా ప్రసిద్ధులై సుమారు నాలుగున్నర శతాబ్దాల కాలము వేంగి, రాజమహేంద్రవరాలు రాజధానులగా తీరాంధ్రాన్ని పాలించినారు. రాష్ట్రకూట విజృంభణలోను, చాళుక్య - చోళ సంఘర్షణలోను వేంగి రాజ్యము రాజకీయ సంక్షోభాలకు గురి అయింది. కాని సాంస్కృతికంగా తెలుగువారికి గొప్ప వారసత్వాన్ని ప్రసాదించింది.

## 19. 3. రాజకీయ చరిత్ర

**19.3. 1. కుబ్జ విష్ణువర్ధనుడు (క్రీ.శ. 624 - 642) :** వేంగి చాళుక్య వంశస్థాపకుడు కుబ్జవిష్ణువర్ధనుడు. ఇతడు ఉత్తరమున విశాఖపట్టణమునుండి దక్షిణమున గుంటూరు వరకు వేంగి రాజ్యమును విస్తరింపజేసి పరిపాలించెను. పల్లవ నరసింహవర్మతో బాదామి దగ్గర జరిగిన యుద్ధంలో రెండవ పులకేశితో బాటు (క్రీ.శ. 642 మణిమంగళ్ యుద్ధం) కుబ్జవిష్ణువర్ధనుడు మరణించినాడని చరిత్రకారులు భావిస్తున్నారు. ఇతని కుమారుడైనప జయసింహవల్లభుడు బాదామి చాళుక్యులకు, పల్లవులకు జరుగు సంఘర్షణలో తలదూర్చక తన రాజ్యాన్ని కట్టుదిట్టం చేసుకొని, తన పెదతండ్రి సంతతి వారికెట్టి సహాయము చేయలేదు.

**19.3. 2. మొదటి విజయాదిత్యుడు (క్రీ.శ. 753 - 770) :** వేంగి చాళుక్య రాజులలో మొదటి విజయాదిత్యుడు తొమ్మిదవ వాడు. నాటికి బాదామి చాళుక్య రాజ్యము అంతరించి రాష్ట్రకూటుల పరమయ్యెను. విజయాదిత్యుని కాలముననే వేంగి చాళుక్యులకు - రాష్ట్ర కూటులకు పోరు ప్రారంభమయ్యెను.

సమస్త భువనాశ్రయ, త్రిభువనాంకుశ, మహారాజాధిరాజ, పరమేశ్వర, భట్టారక, అను బిరుదులు గల విజయాదిత్యుడు పరాక్రమశాలి. ఇతని శాసనములలో చారిత్రాత్మక విషయాల వివరణ కానరాదు. ఇతని చివరి రోజులలో రాష్ట్రకూట యువరాజు గోవిందుడు వేంగి మీద దండెత్తి 'మూసి' యుద్ధంలో విజయాదిత్యుని ఓడించి కప్పం పుచ్చుకొనినాడు. విజయాదిత్యుని కొడుకు నాల్గవ విష్ణువర్ధనుడు తన కూతురు శీతమహాదేవిని రాష్ట్రకూట ధృవునికిచ్చి పెండ్లిచేసినాడు. అయితే ఈ బంధుత్వాన్ని లక్ష్యంచేయక మూడో గోవిందుడు వేంగి మీద దండెత్తినాడు.

**19.3. 3. రెండవ విజయాదిత్యుడు** (నరేంద్ర మృగరాజు) (క్రీ.శ. 806 - 846) : రెండో విజయాదిత్యుడు, నాల్గవ విష్ణువర్ధనుని కుమారుడు. స్వతంత్రాభిలాషి. ఇతడు రాష్ట్ర కూటులకు కంటక ప్రాయమైనాడు. యుద్ధ ప్రియుడైన రెండో విజయాదిత్యునికి 'నరేంద్రమృగరాజు' 'చాళుక్యరామ', 'విక్రమధావళి', అను బిరుదులుకలవు.

నాల్గవ విష్ణువర్ధనుని మరణానంతరము రెండవ విజయాదిత్యునకు, భీమసలునికి మధ్య చెలరేగిన వారసత్వ యుద్ధమును అవకాశముగా తీసుకొని, రాష్ట్రకూట మూడో గోవిందుడు తనపై కత్తిగట్టిన రెండవ విజయాదిత్యుని పారద్రోలి, భీమసలుకిని వేంగిరాజుగా చేసెను. కాని మూడవ గోవిందుడు మరణానంతరము రెండవ విజయాదిత్యుడు భీమసలుకిని తరిమివేసి వేంగిని తిరిగి ఆక్రమించటమేకాక, రాష్ట్రకూటులపై దండెత్తెను. అంతట రాష్ట్రకూట అమోఘవర్షుడు తన సోదరిని, రెండవ విజయాదిత్యుని కుమారుడైన కలి విష్ణువర్ధనుకిచ్చి, సంధిచేసుకొనెను. విజయాదిత్యుడు 108 యుద్ధములు చేసిన వీరుడుగా పేరుమోసెను.

**19.3. 4. గుణగ విజయాదిత్యుడు లేక మూడవ విజయాదిత్యుడు (క్రీ.శ. 848 - 890) :** వేంగి చాళుక్యులలో అగ్రగణ్యుడు, కలిసి విష్ణువర్ధనుని కుమారుడైన గుణగ విజయాదిత్యుడు. ఇతని పరిపాలనా కాలంలో తూర్పు చాళుక్యుల అధికారం మున్నెన్నడెరుగనంతగా వృద్ధి పొందినది. ఇతడవు యుద్ధ ప్రియుడు. ఇతడు పల్లవులను, పాండ్యులను ఓడించి చోళ రాజ్య సుస్థిరతకు దోహదముచేసినాడు. అటులనే కళింగ, కోసల రాజ్యములను జయించెను. రాష్ట్రకూట రాజైన రెండవ కృష్ణుని, అతని బావమరిది యైన కామచు సంకిలుని, కిరాణపుర, అనలపురముల వద్ద ఓడించి దక్షిణపథమునంతటికి తన సార్వభౌమత్వమును చాటి గుణక, నల్లాట, పరచక్రరామ, త్రిపుర మర్త్యమహేశ్వర, వల్లభి మొదలగు బిరుదములు ధరించినవాడు గుణగ విజయాదిత్యుడు.

**19.3. 5. గుణగ విజయాదిత్యుని వారసులు :** మూడవ విజయాదిత్యుని కాలమున పరాభవము పొందిన రాష్ట్రకూటులు చాళుక్యభీముని కాలమున (క్రీ.శ. 890- 918) వేంగి నాక్రమింపయత్నించిరి. కాని వారిని నిరవద్యపుర, పురువంగూరు యుద్ధములందు చాళుక్యభీముడు ఓడించి వేంగి రాజ్యమును కాపాడెను. చాళుక్యభీముని మనుమడైన మొదటి అమ్మరాజు యనంతరము వేంగి సింహాసనమునకు వారసత్వ యుద్ధం ప్రారంభమయ్యెను. ఈ వారసత్వ యుద్ధములో రాష్ట్రకూటులు తలదూర్చి వేంగి రాజ్యమును తన స్వప్రయోజనముల కుపయోగించుకొనిరి. ఇట్లు మొదటి యుద్ధమల్లుడు, రెండవ చాళుక్యభీముడు, రెండవ అమ్మరాజు, దానార్ణవుడు, జటాచోడభీముడు, వరుసగా ఒకరినొకరు పదవీభ్రష్టుల చేసిగాని, వర్త నిహతుల చేసిగాని వేంగిని పాలించిరి. రెండవ అమ్మరాజు రాజమహేంద్రవరమును రాజధానిగా చేసికొని పాలించెను. జటాచోడభీముడు దానార్ణవుని వధించి వేంగి నాక్రమించినపుడు, దానార్ణవుని కుమారులయిన శక్తివర్మ, విమాలాదిత్యులు చోళుల సాయమర్థించిరి.

**19.3. 6. చోళ - కళ్యాణి చాళుక్య సంఘర్షణ :** చోళరాజగు రాజరాజ వేంగి రాజకీయములో జోక్యం చేసుకొని జటాచోడభీముని వధించి శక్తివర్మను పాలకునిగా చేసి, తన కుమార్తెయగు కుందవ్వను విమలాదిత్యుని కిచ్చి వివాహముచేసెను. దానితో తూర్పు చాళుక్య - చోళ మైత్రి ధృడతరమయ్యెను. మరియు వేంగిలో చోళ ప్రాభల్యము ప్రారంభమయ్యెను. ఇంతలో రాష్ట్రకూటులనంతము చేసిన కళ్యాణి చాళుక్యులు ఇది సహింపక వేంగిని తమ ఆధీనములో నుంచుటకు ప్రయత్నించసాగిరి. తత్ఫలితంగా వేంగి సార్వభౌమాత్వము కొరకు చోళ - కళ్యాణి చాళుక్యులు సుమారు 125 సం.లు (క్రీ.శ. 1000 - 1125) పోరు సల్పిరి. ఆ పోరుకు వేంగి రంగస్థల మగుటచే అది అశాంతికి గురియై క్రమముగా క్షీణింపదొడగెను. కళ్యాణి చాళుక్యరాజగు సత్యాశయుడు శక్తి వర్మ కాలమున వేంగిపై దండెత్తెను, కాని ఎట్టి విజయము సాధించలేదు.

**19.3. 7. రాజరాజ నరేంద్రుడు (క్రీ.శ 1019 - 1060) :** శక్తివర్మ మరణానంతరము మరల వేంగి సింహాసనము కొరకు అతని కుమారుడైన విజయాదిత్యునకు, అతని సోదరుని (విమాలాదిత్యుడు) కుమారుడైన రాజరాజనరేంద్రునకు మధ్య వారసత్వయుద్ధము ప్రారంభమయ్యెను. ఈ యుద్ధముల వలనచోళ - కళ్యాణిచాళుక్య సంఘర్షణ తీవ్రరూపం దాల్చెను. మొదట విజయాదిత్యుడు కళ్యాణి జయసింహ వల్లభుని సాయంతో వేంగినాక్రమించెను. అపుడు చోళ రాజేంద్రుడు జోక్యము చేసుకొని, విక్రమాదిత్యుని తరిమి వైచి, రాజరాజనరేంద్రుని వేంగి సింహాసన మెక్కించి తన కుమార్తెయగు ' అమ్మాంగదేవిని' అతనికిచ్చి వివాహము చేసెను.

రాజరాజ నరేంద్రుడు రెండు మారులు రాజ్యం కోల్పోయి చోళుల సాయంతో తిరిగి సంపాదించినాడు. చివరికాతడు చాళుక్య సోమేశ్వరునికి సామంతుడై వేంగి నేలినాడని కొందరి చరిత్రకారుల అభిప్రాయం. చాళుక్య ప్రాబల్యాన్ని వేంగి నుంచి తొలగించడానికై చోళులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. రాజరాజ నరేంద్రుడు గొప్ప యుద్ధవీరుడు కాకపోయినప్పటికి చక్కని కళాపోషకుడు. ఆదికవియగు నన్నయ్యను పోషించి తెలుగు భాషకు ఎనలేని సేవచేసెను. క్రీ.శ. 1061 లో రాజరాజనరేంద్రుని మరణంతో వేంగిలో అల్లకల్లోలము ప్రారంభమయ్యెను. అపుడు విజయాదిత్యుడు కళ్యాణి సోమేశ్వరుని సాయంతో రాజరాజనరేంద్రుని కుమారుడైన రాజేంద్రుని తొలగించి, తన కుమారుడైన రెండవశక్తివర్మను వేంగిరాజుగా చేసెను. అంతట చోళరాజు వీరరాజేంద్రుడు వేంగిపై దండెత్తి రెండవశక్తి వర్మను వధించి తిరిగి రాజేంద్రుని వేంగి అధిపతిగా చేసి తన కుమార్తెనిచ్చి వివాహము చేసెను.

వీరరాజేంద్రుని మరణానంతరము చోళ రాజ్యమున అరాచకము ప్రబలి ఆ అరాచకములో అతని కుమారుడగు అధిరాజేంద్రుడు వధింపబడెను. అధిరాజేంద్రుని మరణానంతరము చోళ సింహాసనమునకు వారసులు లేకపోవుటచే వేంగి ప్రభువైన రాజేంద్రుడు (రాజరాజ నరేంద్రుని కుమారుడు) తంజావూరు వెళ్ళి, 'కులోతుంగ' అను బిరుదముతో చోళ సింహాసనమధిష్టించెను. అపుడు విజయాదిత్యుడు (శక్తి వర్మ కుమారుడు) కులోత్తుంగుని అనుమతితో వేంగి రాజ్యమును క్రీ.శ. 1076 వరకు పాలించెను. విజయాదిత్యుని మరణానంతరము వేంగి రాజ్యము కులోత్తుంగుని సామ్రాజ్యమున విలీనమయ్యెను. దీనితో వేంగి చాళుక్యుల చరిత్ర అంతర్ధానమైనది. ఈ కాలంలోనే తీరాంధ్రంలో నెల్లూరు చోళులు, చందోలు వెలనాటి రాజులు మొదలయిన మాండలిక రాజ వంశాలు బలపడి స్వతంత్రులయినాయి. కళ్యాణి చాళుక్య వంశంకూడా క్షీణించడంతో కాకతీయులు అనుమకొండలో బలవంతులైనారు.

## 19. 4. చాళుక్య యుగ ప్రశస్తి

తూర్పు చాళుక్యులు సుమారు నాలుగున్నర శతాబ్దములు ఆంధ్రావనిని పాలించి తీవ్ర రాజకీయ సంక్షోభమును అనుభవించిరి, రాజకీయముగా దక్షిణా పథ చరిత్రలో ఎట్టి విశిష్ట పాత్రను వహింపలేకపోయిరి. అయినప్పటికి వారు సంస్కృతికముగా ముఖ్యముగా ఆంధ్రబాషకు చేసిన సేవ అపారమైనది.

**19.4. 1. పాలనా వ్యవస్థ :** తూర్పు చాళుక్యులు కర్ణాటక దేశంనుంచి వచ్చినప్పటికి వేంగినే తమజన్మభూమిగా భావించినారు. వారి రాజ్యంలో సాంప్రదాయక పాలనా విధానమే అమలు జరిగింది. పరిపాలనా సౌలభ్యము కొరకు రాజ్యమును నాడులుగా, లేక విషయములుగా విభజించిరి. చాళుక్య భీముని మసులా (మచిలీపట్టణం) శాసనమును బట్టి చోళపాలనలో గ్రామములందు గ్రామసభలున్నట్లు తెలియుచున్నది. అంతరంగిక, వారసత్వ యుద్ధములవలన పొరుగు రాజ్యముల దాడుల వలన ప్రజలు అనేక కష్టనిష్టూరములకు గురి అయినారని చెప్పక తప్పదు.

**19.4. 2. ఆర్థిక పరిస్థితులు :** నాటి ఆర్థిక పరిస్థితులను గురించి స్పష్టమైన సమాచారం లభ్యం కావటంలేదు. కాని నాటి ప్రజల ముఖ్యవృత్తి వ్యవసాయం. బ్రాహ్మణులు భూములు, అగ్రహారాలు పొంది, భూస్వాములుగా రూపొందిరి. వారి భూములను శూద్రులు సాగుచేస్తూ వారిపట్ల విధేయులై ఉండేవారు. నాడు వ్యవసాయంతో పాటు పశుసంపద పట్ల ఆసక్తి కలదు. వర్తక, వాణిజ్యములు కూడా గలవు. చాళుక్యులు విదేశీ వ్యాపారం కూడా చేసినట్లు తెలియుచున్నది. ఉదాహరణకు శక్తి వర్మ బంగారునాణేలు సయాందేశంలో దొరికినాయి మాడలు, ద్రమ్మములు, గద్యాణములు మొదలగు నాణెములు కూడా అమలులో ఉన్నవి. వర్తకులు 'నకరములు' అనే శ్రేణులుగా వ్యవహరింపసాగిరి.

**19.4. 3. సాంఘిక పరిస్థితులు :** నాడు సమాజములో బ్రహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణములతోపాటు బోయలు, సవరులు అను వర్ణములు కూడా కలవు. సమాజమున బ్రహ్మణులకు ఉన్నత స్థానము కలదు. శీలసంపన్నులు, శాస్త్ర పారంగతులైన బ్రాహ్మణులను గౌరవించి, ఉత్సవ సమయాలలో ధనధాన్యములిచ్చి సత్కరించు ఆచారము కలదు. క్షత్రియులు రాజ్య రక్షణాభారమును వహించెడివారు. వైశ్యులు వర్తక - వ్యాపారాలు చేసేవారు.

7 వ శతాబ్దంలో ఆంధ్రదేశం పర్యటించిన హుయాన్‌సాంగ్ భూమి సారవంతమైనదని, తేమయున్న ఉష్ణమండలమనీ, ప్రజలు ఉద్రేకులని, చామనఛాయ వర్ణపువారనీ, కళాప్రియులనీ, అటవీ ప్రాంతాలలో దారిదోపిడీదొంగలు బహిరంగముగానే తిరుగుచుండిరనీ దేవతాపూజ విరివిగా ఉన్నదని తన రచనలలో పేర్కొనెను.

**19.4. 4. మత పరిస్థితులు :** తూర్పు చాళుక్య యుగంలో బౌద్ధమతం పూర్తిగా క్షీణించినట్లు హుయాన్‌సాంగ్ రచనల ద్వారా తెలియుచున్నది. బౌద్ధారామములు హిందూ దేవాలయాలుగా మార్పు చెందెను. చాళుక్య రాజులు ఎక్కువమంది శైవ మతాభిమానులు. తీరాంధ్రదేశమున 'కుమారిలభట్టు' శంకరాచార్యుల బోధనల వలన 'స్మార్త' హైందవ మతము ప్రచారమునందుండెను. శైవులలో తీవ్రవాదులయిన కాలముఖులు, పశుపతుల వలన బౌద్ధ, జైన మతములు క్షీణింపదొడగినవి. చాళుక్యులు సామర్లకోట, నిడదవోలు, ద్రాక్షారామము నందు అనేక శివాలయములను నిర్మించిరి. వీరి ఆదరణలో ద్రాక్షారామము, అమరారామము, కొమరారామము, క్షీరారామము చాళుక్య రామము అను పంచారామములు ప్రసిద్ధి పుణ్యక్షేత్రములుగా వెలుగొందెను.

**19.4. 5. సారస్వత సేవ :** తూర్పు చాళుక్యులు సాహిత్యపోషకులు. వీరు వైదిక విద్యలను ప్రోత్సహించి, అనేక కవులను, పండితులను ఆదరించి, పోషించినారు.

తెలుగు భాషా సారస్వతమునకు వేంగి చాళుక్యులు చేసిన సేవ చిరస్మరణీయమైనది. రెండవ యుద్ధమల్లుని బెజవాడ శాసనమందు చాళుక్యుల సేనానియగు పండరంగని శాసనమందు తెలుగు ఛందస్సులయిన తరువోజ - మధ్యాక్కరలుండుట గొప్ప విశేషము.

రాజరాజనరేంద్రుడు ఆదికవియగు బిరుదును కలిగిన నన్నయ భట్టుని పోషించెను. అతని ప్రోత్సాహముతోనే నన్నయ్యభట్టు తన మిత్రుడగు నారాయణ భట్టు సాయముతో మహాభారతములోని ఆది, సభాపర్వములను, అరణ్యపర్వములో సగభాగము తెనిగించెను.

రాజరాజనరేంద్రుని ఆస్థానము నలంకరించిన వారిలో 'కుమార సంభవము' రచించిన నన్నెచోడుడు, 'గణిత సార సంగ్రహము' ను రాసిన 'పావులూరి మల్లన్న' సుప్రసిద్ధులు.

**19.4. 6. సంగీత - నాట్యకళలు :** తూర్పు చాళుక్య ప్రభువులు సంగీత, నాట్య కళలను కూడా ప్రోత్సహించిరి. గాంధర్వ విద్యా ప్రవీణ చల్లవ్వకు గుణక విజయాదిత్యుడు బహుమతులు ఇచ్చి గౌరవించినాడు. అమ్మరాజు 'చామకాంబ' నాటక ముభారిహిదాలకు సూర్యరశ్మియని పేరు పొందింది. బాడవుడు నటులను, గాయకులను పోషించినాడు. నాడు క్రొత్తగా వెలసిన శివాలయాలు కళాకారులకు అవకాశాలు కల్పించినాయి.

**19.4. 7. వాస్తు శిల్పము :** తూర్పు చాళుక్య ప్రభువులు వాస్తు శిల్ప కళాభివృద్ధికి ఎనలేని సేవచేసిరి. నాడు బౌద్ధారామములు, హిందూ దేవాలయాలుగా మార్పుచెందెను. చేబ్రోలు మహాసేనుని ఆలయం, పీఠాపుర - హుంకార, శంకరి ఆలయం, బెజవాడ మల్లేశ్వరుని ఆలయాలు చెప్పుకోదగినవి. రెండవ విజయాదిత్యుడు వేద నరేంద్ర మృగరాజు 108 నరేంద్రేశ్వరాలయాలు నిర్మించినాడు. మొదటి యుద్ధమల్లుని కార్తికేయుని ఆలయం విశిష్టమైనది. వీరి ఆదరణలో ద్రాక్షారామము, అమరారామము, కొమరారామము, క్షీరారామము, చాళుక్యరామము అను పంచారామములు చాళుక్య - చోళ వాస్తు సంప్రదాయాలకు పట్టుకొమ్మలు.

## 19. 5. ముగింపు

తూర్పు చాళుక్య ప్రభువుల కాలంలో రాజకీయ సంక్షోభము పొందినప్పటికి సాహిత్య సేవలో వారు చూపిన ఉత్సాహము చెప్పుకోదగినది. ముఖ్యంగా తెలుగు సాహితీ చరిత్రలో వారుచేసిన సేవ ప్రజల మన్ననలను అందుకొన్నది.

### వేంగి చాళుక్య వంశ వృక్షం

1. కుబ్జ విష్ణువర్ధన - 624 - 642
2. జయసింహ
3. ఇంద్ర భట్టారక
4. రెండో విష్ణువర్ధనుడు
5. మంగియువరాజు
6. రెండో జయసింహుడు
7. కొక్కిలి
8. మూడో విష్ణువర్ధనుడు
9. విజయాదిత్యుడు
10. నాల్గో విష్ణువర్ధనుడు
11. రెండో విజయాదిత్యుడు
12. కలి విష్ణువర్ధనుడు (5)
13. గుణగ విజయాదిత్యుడు
    విక్రమాదిత్యుడు
    యుద్ధమల్లుడు
14. చాళుక్యభీముడు
15. నాల్గో విజయాదిత్యుడు
16. అమ్మరాజు
    మూడోభీముడు
    చాడప
    తాడప
17. బీటవిజయాదిత్యుడు
20. రెండో భీముడు
24. దానార్ణవుడు
23. అమ్మరాజు విజయాదిత్యుడు (6)
25. శక్తివర్మ
26. విమలాదిత్యుడు - కుందవ్వ
27. రాజరాజనరేంద్రుడు విజయాదిత్యుడు (7)
29. రాజేంద్ర కులోత్తుంగుడు
28. రెండో శక్తివర్మ

## అభ్యాసాలు

ఈ క్రింది వ్యాసరూప ప్రశ్నలు రాయుము.

1. వేంగి చాళుక్యులు లేక తూర్పు చాళుక్యుల రాజకీయ చరిత్రను వర్ణింపుము
2. తూర్పు చాళుక్యుల లేక వేంగి చాళుక్యులు యుగ ప్రశస్తిని వివరింపుము.

## లఘు వ్యాస రూప ప్రశ్నలు

1. కుబ్జ విష్ణువర్ధనుడు
2. రెండవ విజయాదిత్యుడు
3. గుణగ విజయాదిత్యుడు
4. రాజరాజనరేంద్రుడు.

## ఈక్రింది వానిలో సరయైన సమాధానమును గుర్తించుము

1. వేంగి చాళుక్య లేదా తూర్పు చాళక్య రాజ్యస్థాపకుడెవరు ? ( )
   - ఎ) రెండవ పులకేశి  బి) కుబ్జవిష్ణువర్ధనుడు
   - సి) రాజరాజ నరేంద్రుడు  డి) కులోత్తుంగుడు
2. కుబ్జ విష్ణువర్తనుడు ఏ సం.లో స్వతంత్రము ప్రకటించెను ( )
   - ఎ) 616  బి) 618
   - సి) 619  డి) 624
3. కుబ్జవిష్ణువర్ధనుడు ఏ యుద్ధంలో చనిపోయెను ? ( )
   - ఎ) మణిమంగళ్ యుద్ధం  బి) జీలం యుద్ధం
   - సి) కొప్పం యుద్ధం  డి) అర్బిలా యుద్ధం
4. 108 శివాలయములను నిర్మించిన చాళుక్యరాజు ( )
   - ఎ) రాజరాజనరేంద్రుడు  బి) మూడవ విజయాదిత్యుడు
   - సి) నరేంద్రమృగరాజు  డి) కుబ్జ విష్ణువర్ధనుడు

## ఉపయుక్త గ్రంథాలు :


1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (ప్రథమ భాగము) - వారణాసి యశోదాదేవి.
2. ఆంధ్రుల చరిత్ర - డా.బి.యస్. యల్. హనుమంతరావు.
3. ఆంధ్ర దేశ చరిత్ర - సంస్కృతి(తెలుగు అకాడమి ప్రచురణ) - ఆచార్య పిలుపాటి శ్రీరామశర్మ
4. Indian History and Culture - Vol I - Dr. B.S.L. Hanumantha Rao & K. Basaveswara Rao.


రచయిత

పి. రవీంద్రరాజు

పాఠం - 20

# నవీన చోళులు
# పరిపాలన - సాంస్కృతిక సేవ

## 20.1 లక్ష్యం :

దక్షిణ భారతదేశంలో పల్లవుల తరువాత రాజ్యమేలిన చోళుల రాజకీయ చరిత్ర, వారి పరిపాలనా విధానము, దాక్షిణాత్య సంస్కృతికి వారు చేసిన సేవ గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

ముఖ్యాంశ సంగ్రహము :

| | |
|---|---|
| 20.2 | ఆధారాలు |
| 20.3 | చోళవంశ రాజకీయ చరిత్ర |
| 20.4 | పరిపాలనా విధానము |
| 20.5 | గ్రామ పరిపాలనా విధానము |
| 20.6 | సాంఘిక పరిస్థితులు |
| 20.7 | ఆర్థిక పరిస్థితులు |
| 20.8 | మతం |
| 20.9 | సాహిత్యం |
| 20.10 | శిల్పకళ |
| 20.1 | ముగింపు |

## 20.2 ఆధారాలు :

1. శాసనాలు : పరాంతకుని ఉత్తరమేరూర్ శాసనాలు, కొదంబలూర్ శాసనం, వీరరాజేంద్రుని తరుముక్కుడల్ శాసనం, తంజావూరులోని రాజరాజు శాసనాలు, మూడవ కులోత్తుంగుని తిరుమంగళం శాసనం, మద్రాస్ మ్యూజియంలోని ఉత్తమ చోళుని తామ్ర శాసనాలు, రాజేంద్రుని తిరువలంగాడు, రాజరాజు లెడెన్ తామ్ర శాసనాలు మొదలగునవి చోళుల శాసనాలలో అతి ప్రసిద్ధమైనవి. ఇంకా తమిళ, సంస్కృతి, తెలుగు, కన్నడ భాషల్లో దేవాలయాలలో గల వందల కొద్దీ శిలాశాసనాలు చోళుల చరిత్ర రచనకు ఉపకరిస్తాయి.

2. సాహిత్యం : 'కళింగుట్టుపరిని' అనే గ్రంథం, శ్రీలంకకు చెందిన 'మహావంశ', 'చౌ - జు - కువా' అనే చైనా గ్రంథం, జైన, శైవ, వైష్ణవ మతాచార్యుల రచనలు.

3. చోళుల కట్టడాలు : తంజావూర్, గంగైకొండ, చోళపురం, త్రిభువనం, దారాసురం మొదలగు స్థలాలలో గల ఆలయాలు.

4. నాణెములు :

## 20.3 చోళవంశ రాజకీయ చరిత్ర :

1. ఉపోద్ఘాతం : చోళ చక్రవర్తులు దక్షిణ భారతదేశ చరిత్రలో అత్యంత ప్రముఖ స్థానాన్ని ఆక్రమించారు. రాజరాజ రాజేంద్రుల వంటి విజేతలైన చక్రవర్తులను ఈ వంశం ప్రభవించింది. వీరికాలం ఆదర్శవంతమైన స్థానిక పరిపాలనా వ్యవస్థకు, విదేశీ వ్యాపారాభివృద్ధికి, సాంస్కృతిక ప్రగతికి ప్రసిద్ధి గడించింది.

**2. చోళరాజ్య స్థాపన :** చోళుల ప్రస్తావన మహాభారతములోనూ, మెగస్థనీస్ 'ఇండిక' నందు, అశోకుని శాసనాలలోను కలదు. చారిత్రకముగా చోళులలో మొదటి పాలకుడు కరికాల చోళుడు. ఇతడు క్రీ.శ. 2వ శతాబ్దిలో కావేరి పట్టణమును రాజధానిగా చేసుకొని పాలించాడు. ఆ తరువాత పల్లవ, పాండ్య రాజ్యాలు విజృంభించటంతో కొన్ని శతాబ్దాలపాటు చోళులు రాజకీయంగా మరుగున పడిపోయ్యారు. క్రీ.శ. 9వ శతాబ్ది ప్రారంభము నాటికి పల్లవ, పాండ్య రాజ్యాలు అస్తమించి చోళులు మరలా రాజకీయముగా వెలుగులోనికి వచ్చిరి. వీరినే నవీన చోళులు అని పిలిచారు. నవీన చోళ సామ్రాజ్య స్థాపకుడు విజయాలయ చోళుడు. ఇతడు ఉరైయూర్‌లో పల్లవ సామంతుడుగా ఉంటూ క్రీ.శ. 850 ప్రాంతంలో పాండ్య సామంతుడైన ముత్తరయ్యార్ నోడించి తంజావూరును స్వాధీనం చేసుకొని చోళ రాజ్యమును పునః స్థాపితము చేశాడు.

**3. ఆదిత్య చోళుడు (క్రీ.శ. 870 - 907) :** విజయాలయుని తరువాత అతని కుమారుడు ఆదిత్య చోళుడు అధికారమునకు వచ్చాడు. ఇతడు మంచి రాజనీతిపరుడు; పల్లవ - పాండ్య యుద్ధాలలో పాల్గొని చివరకు పల్లవరాజు అపరాజిత వర్మను పారదోలి కాంచీపురముతో సహా తొండైమండలాన్ని ఆక్రమించాడు.

**4. పరాంతకుడు (క్రీ.శ. 907 - 955) :** ఆదిత్యుని తరువాత అతని కుమారుడు పరాంతకుడు సింహాసనమధిష్టించాడు. ఇతడు గొప్ప పరాక్రమవంతుడు. ఇతడు పాండ్యులమీద అనేకమార్లు దాడిచేసి పాండ్య రాజైన రాజసింహుని సింహళానికి పారదోలి మధుర నాక్రమించి 'మధురై కొండ' అను బిరుదు ధరించాడు. బాణ, వైదుంబి రాజుల నోడించి ఉత్తరాన తన అధికారాన్ని నెల్లూరు వరకు విస్తరింపజేశాడు. ఇతని కాలంలో రాష్ట్రకూట రెండవ కృష్ణుడు చోళ రాజ్యంమీద దండెత్తగా అతనిని వల్లాల యుద్ధంలో (క్రీ.శ. 916) ఓడించి పారదోలినాడు.

5. పరాంతకుని తరువాత దాదాపు 3 దశాబ్దాల కాలము చోళ సామ్రాజ్యము బలహీనపడ్డది. ఈ కాలములో నల్గురు బలహీన రాజులు చోళ సింహాసనము అధిష్టించారు. వీరు రాజకేసరి గండరాదిత్యుడు, పరకేసరి అరింజయుడు, రాజకేసరి సుందర చోళుడు, పరకేసరి ఉత్తమ చోళుడు. రాష్ట్రకూటుల ప్రాబల్యం క్షీణించిన తరువాత మరల చోళులు విజృంభించారు.

**6. రాజరాజ చోళుడు (క్రీ.శ. 985 - 1014) :** ఉత్తమ చోళుని మరణానంతరము సుందర చోళుని కుమారుడైన అరుణ్ మొళి క్రీ.శ. 985లో రాజరాజ బిరుదముతో చోళ సింహాసన మధిష్టించాడు. ఇతడు నవీన చోళ రాజులలో ప్రసిద్ధిచెందిన చక్రవర్తి ఇతడు చోళ రాజ్య ప్రతిష్టను పునరుద్ధరించి, చోళుల చరిత్రలో నూతన అధ్యాయాన్ని ప్రారంభించాడు. తంజావూరు ఆలయంలోని శాసనాలు, లెడెన్, తిరువలంగాడు తామ్ర శాసనాలు రాజరాజ చరిత్ర తెలుసుకొనడానికి ముఖ్య ఆధారాలు. ఇతడు ప్రప్రథమములో చేర రాజ్యంపై దండెత్తి వెళ్ళి దాని పాలకుడైన భాస్కర రవి వర్మను కందలూర్ శాలాయ్ (తిరువనంతపురం) నౌకాయుద్ధంలో ఓడించి కొల్లం, ఉడగైలను స్వాధీన పరచుకొన్నాడు. పాండ్యుల నోడించి మధురై, కుడుమలైలను ఆక్రమించాడు. ఆ తరువాత రాజరాజ సింహళం మీద దండెత్తి అనూరాధపురాన్ని ధ్వంసంచేసి 'పొలొన్నరువా'లో శివుని దేవాలయము నిర్మించాడు. సింహళ ప్రభువు మహేంద్రుడు దక్షిణ ప్రాంతానికి పారిపోయ్యాడు. ఉత్తర సింహళానికి 'ముమ్మడి చోళ మండలము' అనిపేరు పెట్టి దానిని చోళ సామ్రాజ్యంలో కలుపుకొన్నాడు. దక్షిణ ప్రాంతాలను జయించి ఆక్రమించిన తరువాత రాజరాజు తన దృష్టిని ఉత్తరమువైపు మరల్చి గంగవాడి నొలంబవాడి, తడిగపాడి, తలైక్కాడు, దక్షిణ మైసూరు ప్రాంతాలను తన ఆధీనం కిందికి తెచ్చుకొన్నాడు. ఇదే కాలంలో దక్కనులో రాష్ట్రకూడుల అధికారం క్షీణించి కళ్యాణి చాళుక్యులు విజృంభించారు. కళ్యాణి చాళుక్య వంశ స్థాపకుడైన రెండవ తైలపుడు చోళ రాజ్య విస్తరణను అరికట్టడానికి ప్రయత్నించాడు. అందువల్ల సుమారొక శతాబ్దం మీద చోళ కళ్యాణి చాళుక్య వంశాల మధ్య భీకర పోరాటాలు జరిగాయి. ఈ పోరాటానికి వేంగి రాజ్యం రంగస్థలమైయ్యింది. రెండవ తైలపుడు చోళసైన్యాల నోడించి వారి గజబలాలను సంగ్రహించాడు రాజరాజు వేంగి రాజకీయాలలో తలదూర్చి జటాచోళుని వధించి శక్తివర్మను వేంగి సింహాసన మెక్కించినాడు. అంతేగాక శక్తివర్మ సోదరుడైన విమలాదిత్యునకు తన కుమార్తె కుందవ్వ నిచ్చి పెండ్లిచేసి చోళ వేంగి చాళుక్యల మైత్రిని దృఢతరం చేశాడు. చోళ రాజరాజ వేంగిలో తన ప్రాబల్యం నెలకొల్పినందుకు వ్యతిరేకంగా కళ్యాణి చాళుక్య రాజు సత్యాశ్రయుడు వేంగిమీద దండెత్తాడు. వెంటనే రాజరాజు వేంగి, మాన్యఖేటాల మీద ఒకేమారు సేనలను పంపాడు. చోళ యువరాజైన రాజేంద్రుడు పశ్చిమ చాళుక్య రాజ్యం వీరవిహారం చేసి దారుణ కృత్యాలతో ప్రజలను భయోత్పాతంలో ముంచెత్తాడు. వేంగినుంచి సత్యాశ్రయుడు మరలక తప్పలేదు

వేంగితో జోక్యం కలిగించుకొంటున్న కళింగ గాంగులను సైతం రాజరాజు ఓడించాడు. రాజరాజు తన చివర రోజులలో మాల్దీవులపై కూడా దండయాత్రచేసి ఆక్రమించాడు. రాజరాజు సువిశాల సామ్రాజ్యాన్ని నిర్మించడమే గాక దానిలో క్రమబద్ధమైన పరిపాలనా విధానాన్ని కూడా ఏర్పాటు చేశాడు. పంట పొలాలను సర్వేచేయించి న్యాయ సమ్మతమైన పన్నులు వసూలు చేశాడు. రాజరాజు శివభక్తుడు. తంజావూరులో బృహదీశ్వరాలయాన్ని నిర్మించాడు. రాజరాజు శైవుడైనప్పటికీ పరమత సహనము కలవాడు. శైలేంద్ర (సుమిత్రా) పాలకుడైన శ్రీమార విజయోత్తుంగ వర్మ నాగపట్టణంలో సుదామణి అనేపేరుతో బౌద్ధవిహారము నిర్మించడానికి అనుమతి ఇవ్వడమే గాక ఆ విహారానికి స్వయంగా ఒక గ్రామాన్ని దానం చేశాడు. రాజరాజుకు 'ముమ్మడి చోళ', 'జయంగొండ', శివపాద శేఖర', 'నిత్యవినోద', 'చోళమార్తాండ' మొదలైన బిరుదులున్నాయి.

**7. రాజేంద్ర చోళుడు (క్రీ.శ. 1014-1044):** రాజరాజు కుమారుడైన రాజేంద్రుడు తండ్రిని మించిన శూరుడు. తండ్రి కాలములోనే యుద్ధములలోను, పరిపాలనలోను రాజేంద్రుడు ఆరితేరినాడు. రాజరాజు ప్రారంభించిన చోళ సామ్రాజ్య విస్తరణను రాజేంద్రుడు పూర్తిచేశాడు. ఇతడు సింహళాన్ని జయించి దాని పాలకుడైన ఐదవ మహిందను బందీని చేశాడు. పాండ్య, కొరల ప్రాంతాలను స్వాధీనపరచుకొని తన కుమారుని రాజ ప్రతినిధిగా నియమించాడు. కళ్యాణి చాళుక్యుల పైకి దండయాత్రలను నిర్వహించి జయసింహుని ఓడించాడు. దీనితో ఇరు రాజ్యాలవారికి తుంగభద్రా నది సరిహద్దుగా గుర్తింపబడింది. వేంగిలో అధికారము కొరకు జరిగిన వారసత్వ యుద్ధంలో జోక్యము కల్పించుకొని రాజరాజనరేంద్రుని వేంగి పాలకునిగా నియమించి తన కుమార్తె అమ్మంగదేవి నిచ్చి వివాహం చేశాడు. ఆ తరువాత కళింగపై దాడిచేసి ఆ ప్రాంత పాలకుడైన ఇంద్రరథుని జయించాడు. ఈ సందర్భములోనే రాజేంద్రుడు గంగాతీరం వరకూ నడిచి బెంగాలు నేలుతున్న మహీపాలుని ఓడించి 'గంగైకొండ చోళ' బిరుదు ధరించాడు. దక్షిణాపథానికి మలయాదీవులకు మధ్య జరిగే వాణిజ్యాన్ని పెంపుచేసే ఆశయంతో గొప్ప నౌకాబలాన్ని నిర్మించి శ్రీవిజయ రాజ్యంమీద దండెత్తి శైలేంద్ర వంశీయుడైన సంగ్రామ విజయోత్తుంగ వర్మ నోడించి అతని రాజధాని 'కటాహ' (కడారం)ను పుట్టుకొన్నాడు. దీనికి సూచనగా రాజేంద్రుడు 'కడారంగొండ' అనే బిరుదాన్ని ధరించాడు. బెంగాల్ విజయానికి చిహ్నంగా 'గంగైకొండ చోళపుర'మను సర్వాంగ సుందరమైన నగరాన్ని నిర్మించి దానిని తన రాజధానిగా చేసుకొన్నాడు. ఆ నగరం దేవాలయాలతో, భవనాలతో ఉన్నత వేద విద్యాలయాలతో వర్ధిల్లినది.

**8. చివరి చోళులు :** రాజేంద్రుని కుమారుడైన రాజాధి రాజు (క్రీ.శ. 1044 - 52) మధురలోను, సింహళములోను ప్రారంభమయిన తిరుగుబాట్లను అణచి శాంతినెలకొల్పాడు. ఆ తరువాత కళ్యాణి చాళుక్య రాజ్యంపై దండెత్తి సోమేశ్వరుని ఓడించి కళ్యాణిని పట్టుకొని వీరాభిషేకం చేసుకొని 'విజయ రాజేంద్ర' అను బిరుదాన్ని ధరించాడు. కొప్పం దగ్గర జరిగిన మరొక యుద్ధంలో సోమేశ్వరుని ఓడించాడు గాని ప్రాణాలు కోల్పోయాడు. రాజాధిరాజు తమ్ముడైన రెండవ రాజేంద్రుడు (క్రీ.శ. 1054-64) యుద్ధభూమిలోనే పట్టాభిషేకం చేసుకొని చాళుక్య రాజ్యంలో కోల్హాపురం వరకు దాడిచేసి విజయస్తంభం నాటాడు. చాళుక్య సేనలను మరొకమారు కూడల్ సంగమ యుద్ధంలో పూర్తిగా ఓడించాడు. రాజేంద్రుని తరువాత అతని తమ్ముడైన వీర రాజేంద్రుడు సింహాసన మెక్కాడు. ఇతడు వేంగి, కళింగ, చక్రకూటాలమీద దాడులు జరిపి చాళుక్య విక్రమాదిత్యుని ఓడించాడు. కాని ఈ విజయయాత్రలు సుఖాంతంగా ముగిసాయి. వీర రాజేంద్రుడు తన కుమార్తెలలో ఒకరిని విక్రమాదిత్యునకు ఇచ్చి పెండ్లి చేశాడు. వీరరాజేంద్రుని కొడుకైన అధి రాజేంద్రుడు క్రీ.శ. 1970లో సింహాసన మెక్కాడు. ఇతడు కొద్ది వారాలు మాత్రమే రాజ్యమేలాడు. ఇతడు ప్రజా తిరుగుబాటులో దుర్మరణం పాలైయ్యాడు. ఇతని మరణంతో విజయాల చోళవంశ మంతరించింది. చోళ సింహాసనము ఖాళీ అయ్యింది.

**9. చాళుక్య - చోళులు :** చోళ సింహాసనము ఖాళీ కావడంతో వేంగీరాజు రాజరాజ నరేంద్రునకూ, చోళ రాజేంద్రుని కుమార్తె అమ్మంగదేవికీ జన్మించిన రాజేంద్రుడు గంగైకొండ చోళపురం వెళ్ళి చోళ సింహాసన మధిష్ఠించాడు. చోళ - చాళుక్య వంశోద్ధారకుడైనందువల్ల రాజేంద్రుడు 'కులోత్తుంగ' అను బిరుదాన్ని ధరించాడు. ఇతని వారసులు రెండు శతాబ్దాల కాలం తంజావూరును పాలించినందువల్ల వీరిని చాళుక్య - చోళులని అంటారు. కులోత్తుంగడు (క్రీ.శ. 1070 - 1122) చోళ సామ్రాజ్య ప్రతిష్టను ఇనుమడింప చేయడానికి ప్రయత్నించాడు. వేంగి మీద తన అధిపత్యం నెలకొల్పడానికి కళ్యాణి చాళుక్యరాజు ఆరవ విక్రమాదిత్యుడు చేసిన ప్రయత్నాలను కులో... చేశాడు. రెండుమారులు కళింగమీద దండెత్తి దాని పాలకుడు అనంతవర్మ నుంచి కప్పం పుచ్చుకొన్నాడు.

1076లో 7వ విజయాదిత్యుడు మరణించిన తరువాత వేంగిని చోళ సామ్రాజ్యములో విలీనం చేశాడు. పాండ్య, చేర రాజ్యాలలో సైనిక స్థావరాలు నెలకొల్పి శాంతి భద్రతను కాపాడాడు. సింహళ రాజుకు తన కుమార్తెనిచ్చి పెండ్లిచేసి స్నేహ సంబంధాలను నెలకొల్పాడు. యుద్ధాలలో మునిగి ఉన్నప్పటికీ ప్రజాక్షేమాన్ని గుర్తించి పంటపొలాలకు నీటివనరులు కల్పించాడు. విద్యలను పోషించాడు. ఇతని ఆస్థాన కవి జయంగొండార్ 'కళింగట్టుపరణి' అనే కావ్యంలో కళింగ దండయాత్రలను గురించి విపులంగా వర్ణించాడు. కులోత్తుంగుడు గొప్ప శైవ మతాభిమాని. విశిష్టాద్వైత సిద్ధాంత కర్తయైన రామానుజాచార్యులను హింసించాడు. ఇతని బాధలకు తాళలేక రామానుజుడు హోయసాల రాజ్యమునకు పారిపోయెనని తెలియుచున్నది. కులోత్తుంగుని తరువాత చాళుక్య - చోళ ప్రాబల్యము క్రమంగా క్షీణించింది. కులోత్తుంగుని తరువాత రాజ్యమేలిన విక్రమచోళ (క్రీ.శ. 1121-33), రెండో కులోత్తుంగుల (క్రీ.శ. 1133-50) పాలనా కాలము ప్రశాంతంగా గడిచింది. రెండవ రాజరాజు కాలంలో (క్రీ.శ. 1146-73) నెల్లూరు తెలుగు ౨ . లు, బాణులు, కాడవులు మొదలైన చాళుక్య-చోళ సామంతులు బలవంతులయ్యారు. రెండవ రాజరాజు తరువాత సింహాసన మెక్కిన మూడవ కులోత్తుంగుడు (క్రీ.శ. 1178-1216) మైసూరులోని హోయసాలులను, నెల్లూరు చోళులను అణిచాడు. పాండ్య, సింహళ రాజులను ఓడించి సామంతులుగా జేసుకున్నాడు. మూడవ కులోత్తుంగుని తరువాత రాజ్యం చేసిన మూడవ రాజరాజు (క్రీ.శ. 1216-56) బలహీనుడు. ఇతడు సామంతులు చేతి కీలుబొమ్మగా అయ్యాడు. మూడవ రాజరాజు తరువాత సింహాసన మధిష్టించిన మూడవ రాజేంద్రుడు (1256-80) చోళ చక్రవర్తులలో చివరివాడు. ఇతని తరువాత పాండ్యులు చోళమండలాన్ని ఆక్రమించారు.

## 20.4 పరిపాలనా విధానము :

**1. ఉపోద్ఘాతము :** చోళరాజుల గొప్ప సామ్రాజ్య నిర్మాతలే గాక గొప్ప పరిపాలనాదక్షులు. వీరి పరిపాలన దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిచెంది తరువాత దక్షిణాది రాజ్యవంశాలకు మార్గదర్శకమైనది. ముఖ్యంగా వారి గ్రామపరిపాలన భారతదేశ చరిత్రలో గొప్ప ప్రశంసను పొందింది. కె. ఎ. నీలకంఠశాస్త్రి మాటలలో 'చోళుల పరిపాలన నిష్కళంకమై, దక్షతలో ఉన్నతస్థాయి నందుకున్నది.

**2. ఆధారాలు :** తామ్ర, శిలాశాసనాల ద్వారా చోళుల పాలనా వ్యవస్థను తెలుసుకొనవచ్చు. వందల సంఖ్యలోవున్న దేవాలయ శాసనాలలో ప్రత్యేకంగా పేర్కొనదగినట్టువంటివి వీరరాజేంద్రుని తిరుముక్కుడల్ శాసనం, పరాంతకుని ఉత్తరమేరూర్ శాసనం, తంజావూర్ దేవాలయంలోని రాజరాజు శాసనాలు, మూడవ కులోత్తుంగుని తిరుమంగళం శాసనం.

**3. కేంద్ర ప్రభుత్వము, రాజు :** చోళ చక్రవర్తి సర్వాధికారి. కాని అతడు ధర్మబద్ధుడు, ప్రజారంజకుడు. చక్రవర్తి స్వయంగా సైన్యాన్ని పర్యవేక్షించెను. రాజరికము వంశపారంపర్యము పెద్ద కుమారుడు ఉత్తరాధికారి. చిన్నకుమారులను రాష్ట్ర పాలకులుగా నియమించేవారు. రాజు దానధర్మాలు చేసేవాడు. చోళ రాజులు మొదట్లో తంజావూరు రాజధానిగా రాజేంద్ర చోళుని కాలం నుండి గంగైకొండ చోళపురము రాజధానిగా రాజ్యమేలారు.

**4. మంత్రిమండలి :** పరిపాలనలో చోళ చక్రవర్తి సహాయపడుటకు ఉద్యోగమండలి (ఉడనా కుట్టమ్) ఉండేది. ఇందు ఐదుగురు సభ్యులుండేవారు. వీరిని దేశంలోని సచ్ఛీలురైన ప్రజల నుండి నియమించేవారు. రాజ్యానికి సంబంధించిన పరిపాలనా వ్యవహారాలను ఈ సభలో చర్చించి నిర్ణయించి రాజాజ్ఞలు తాకీదు తయారుచేస్తారు. ఈ తాకీదు మీద రాజు సంతకంతోపాటు ఉద్యోగమండలి సభ్యుల సంతకాలు వుండేవి. ఈవిధముగా తయారైన రాజాజ్ఞలను 'ఓలైనాయగన్' అనే ఉద్యోగి అమలుపరుస్తాడు. ఇంకా వివిధ శాఖలకు వివిధ ఉద్యోగులను ప్రత్యేకంగా అధ్యక్షులుగా నియమించారు. ఉన్నత ఉద్యోగులను 'పెరుందరమ్' అని, చిన్న ఉద్యోగులను 'సిరున్ తరమ్' అని వ్యవహరించారు. ఉద్యోగులకు భూములను ఈనాములుగా ఇచ్చేవారు. మంచి సేవలు చేసినందుకు బిరుదులు ఇచ్చేవారు. రాజోద్యోగులందరూ శ్రమించి పనిచేసేవారు.

**5. రాచబాటలు :** పరిపాలనా సౌలభ్యం కొరకు దేశాన్నంతటిని కలుపుతూ నలమూలలకు రాచమార్గాలు నిర్మించారు. ఇవి రాజకీయ, వ్యాపార కార్యకలాపాలకు చక్కగా ఉపయోగపడ్డాయి.

**6. ఆదాయ వ్యయములు :** భూమిశిస్తు ప్రభుత్వానికి ప్రధాన ఆదాయము. పంటపొలాలు సర్వేచేయించి పంటలో మూడోవంతు పన్నుగా నిర్ణయించారు. కొన్ని సందర్భాలలో 6వ వంతు వసూలు చేసేవారు. భూమిని కౌలుకు తీసుకొనే ఆచారం వుంది. భూములలో

ప్రజల భూములుపోను మిగిలిన భూములన్నీ రాజుకే చెందును. వ్యవసాయాభివృద్ధికి చోళరాజులు తగిన శ్రద్ధ తీసుకొన్నారు. భూమిశిస్తుకు తోడు వృత్తిపన్నులు (మగ్గం పన్ను), స్వర్ణకారులపై పన్ను, అడవులపై పన్ను, నీటివనరులపైనా, సంతలపైనా, వర్తక సుంకాలు ఉండేవి. ఉప్పుమీద పన్ను వసూలు చేసేవారు. కొన్ని ప్రాంతాలలో పాడికావల్ కూలి (రక్షణ) ఉండేది. మొత్తం మీద పన్నుల భారం ఎక్కువే. భూమిశిస్తు చెల్లించని రైతుల భూములను (పట్టం) ప్రభుత్వము జప్తు చేసేది. అయితే కరువులపుడు పన్నులు రద్దుచేయడం గూడా కలదు. ఆదాయాన్ని రాజుగారి అంతఃపురం, సైన్యం, నౌకాదళం, రహదారులు, నీటిపారుదల కాల్వలు, ఇతర ప్రజాసౌకర్యాల మీద వెచ్చించారు.

7. సైన్యము : చోళ సైన్యానికి రాజే అధిపతి. గజ, అశ్వ, నౌకా, పదాతి దళాలు సైన్యంలోని ప్రధానాంగాలు. సైనిక విభాగాల అధిపతులుగా 'సేనాపతు' లుండేవారు. రాజులు, రాజకుమారుల్లు స్వయంగా యుద్ధాలలో పాల్గొని మరణించిన సందర్భాలు గలవు. 'వెల్లారుల' నేవారు ముఖ్యంగా సైన్యంలో చేరుతుండేవారు. వారేగాక బ్రాహ్మణులు గూడ సైన్యంలో చేరినట్లు ఉదాహరణ లున్నవి. 'కడగమ్' అనే పేరుతో రాజసేనలు ప్రత్యేకంగా వున్నాయి. చోళ చక్రవర్తులు గొప్ప నౌకాబలాన్ని పోషించారు. రాజరాజు నౌకాబలంతో సింహళాన్ని జయించాడు. చేర రాజులను మట్టు బెట్టాడు. రాజేంద్రుడు మలయా, సుమిత్ర, జావాదీవులపై దండెత్తి విజయం సాధించాడు. అండమాన్, నికోబార్ దీవులు గూడ అతని ఆధిపత్యంలోనికి వచ్చినవి. బంగాళాఖాతానికి 'చోళ తటాకం' అనిపేరు ఉండేది. చోళ సైన్యము క్రమశిక్షణకు పేరొందింది. కాని చాళుక్యుల తోటి యుద్ధాలలో చోళసైన్యాలు శత్రు నగరాలను, గ్రామాలను, ఆలయాలను దోచుకొని చాలా అమానుషంగా ప్రవర్తించాయి.

8. న్యాయవ్యవస్థ : చక్రవర్తి ఉన్నత న్యాయాధీశుడు. మండలాలలో మండలసభ, నాడులలో నాట్టార్, గ్రామాలలో గ్రామసభలు న్యాయవిచారణ చేసి శిక్ష విధించేవి. నేరాలు తక్కువ. శిక్షలు కఠినంగా లేవు. జ్యూరీ పద్ధతి వున్నదని ఎస్. కృష్ణస్వామి అయ్యంగారు అభిప్రాయపడ్డారు.

9. సామ్రాజ్య విభజన : పాలనా సౌలభ్యం కోసం చోళరాజులు తమ సామ్రాజ్యాన్ని మండలాలుగా విభజించారు. మండలాన్ని రాజ ప్రతినిధి పాలించేవాడు. ఈతడు సాధారణముగా రాజకుమారుడై ఉంటాడు. కొన్ని మండలాలను సామంతులు పాలించేవారు. చోళ సామంతులలో వెలనాట రాజులు, నెల్లూరు తెలుగు చోళులు, పాండ్యులు, హోయసాలులు బలవంతులు, మండలాన్ని వలనాడులుగా, వలనాడును, నాడులుగా విభజించారు. నాడుకే 'కుఱ్ఱం', 'కొట్టం' అని పేర్లు. గ్రామమే చోళుల పాలన యంత్రాంగానికి పునాది. నాడులలో 'వెల్లల' అనే భూమి పెత్తందార్ల ఆధిపత్యం సాగెడిది. కాని 12, 13 శతాబ్దాలలో మారుతున్న వ్యవసాయ పరిస్థితుల వలన వర్తక సంఘాలవారు, చేనేతగాండ్రు భూమిని సంపాదించి 'నాడు' పరిపాలనలో పాల్గొనటం ప్రారంభించారు. నాడుకు చెందిన ప్రధాన అధికారులను 'నాడు ఉదయన్', 'నాడు కిలవన్', 'నలవన్' అని పిలిచేవారు. నాడు పాలనలో 'బ్రహ్మదేయ' ముఖ్య పాత్ర వహించింది. చోళ రాజ్యంలో దాదాపు 300 లకు పైగా 'బ్రహ్మదేయాలు' వుండెను. 'ఉర్', 'సభ', 'నగరమ్' అనే గ్రామసభలు నీటిపారుదల, దేవాలయాల నిర్వహణ, వర్తకం, రాజోద్యోగులు, పాలకులలో సత్సంబంధాలను కొనసాగించడం వంటి విధులను నిర్వర్తించేవారు. ఈ విధముగా ఉన్నత పరిపాలనను ప్రవేశపెట్టి చోళులు మిగిలిన రాజవంశాల వారికి మార్గదర్శకులైయ్యారు.

## 20.5 గ్రామ పరిపాలనా విధానం (స్థానిక పరిపాలన)

1. ఉపోద్ఘాతము : చోళుల పరిపాలనా వ్యవస్థలో అతివిలక్షణమైన అంశము స్థానిక పరిపాలన. ఈ సంస్థలు, పట్టణాలలో, పల్లెలలో పనిచేసిన తీరు ఆశ్చర్యకరమైంది. గ్రామపరిపాలనా విశేషాలు ఉత్తర మేరూర్ శాసనంలో సంపూర్ణంగా లభించాయి.

2. స్థానికపాలన : మండల, పట్టణ, గ్రామ ప్రాంతాల పరిపాలనను స్థానికపాలన అని అంటారు. పట్టణాలలో, పల్లెలలో ప్రజాసభ లుండేవి. మండలాలలో మండలసభ, నాడులలో 'నట్టార్' అను ప్రజాసభ లుండేవి. 'నగరత్తార్' నగర ప్రజాసభ అధిపతి. సభలు పాలన వ్యవహారాలు చూచుటయే గాక న్యాయ నిర్ణయాలు గూడ చేయును.

3. గ్రామసభలు : గ్రామాన్ని పాలించునది గ్రామసభ, ఈ సభలో ఆ గ్రామంలో అచటి పరిస్థితులను బట్టి స్వల్ప మార్పులతో ండును. నాటి గ్రామాలలో మూడు రకాలుండేవి. 'ఊర్' అనే సభలో గ్రామంలోని భూకామందులందరూ సభ్యులు. 'నగరం' అనేది

వర్తకుల సభ. బ్రాహ్మణుల అగ్రహారాలలోని సభకు 'సభ' అనిపేరు. గ్రామానికి సంబంధించిన అన్ని పాలనాంశాలపై గ్రామసభకు సర్వాధికారాలు ఉన్నాయి.

**4. ఎన్నికల నియమ నిబంధనలు :** గ్రామసభకు ప్రతినిధులను ఎన్నుకొనుటకు ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నిక నిర్వహణకు అనేక కట్టుదిట్టాలు చేయబడ్డాయి. ప్రతి సంవత్సరము కొత్త సభ్యులు ఎన్నిక కావాలి. గత 3 సంవత్సరాలలో ఎన్నికయిన వ్యక్తి తిరిగి ఎన్నికకు నిలబడరాదు. ఎన్నికకు నిలబడు అభ్యర్థికి ఉండవలసిన అర్హతలు (ఎ) ధర్మశాస్త్రాలను చదివి ఉండవలె. (బి) మంచి ఆరోగ్యం కలిగినవాడై, స్థిరచిత్తుడై ఉండాలి. (సి) గ్రామ వ్యవహారాలలో అతనికి శ్రద్ధాసక్తులు ఉండవలె. (డి) అతనికి ఆ గ్రామంలో కనీసం 1 3/4 ఎకరాల భూమి ఉండి, పన్ను చెల్లించువాడై ఉండవలె. (ఇ) స్వంత గృహము ఉండవలె. (ఎఫ్) వయస్సు 35 నుండి 70 సంవత్సరముల మధ్య ఉండవలెను. (జి) పంచ మహాపాపాలు చేసి ఉండరాదు. (హెచ్) ఆస్తిపాస్తులను అభ్యంతర మార్గాల ద్వారా సంపాదించి ఉండరాదు.

**5. ఎన్నికల విధానం :** ప్రతి గ్రామమూ 30 వార్డులుగా విభజించి ప్రతి వార్డునుంచి ఒక సభ్యుని లాటరీ (కుడవోలై) పద్ధతి మీద ఎన్నుకొనే వారు. ఇది అదృష్టంపై ఆధారపడిన ఎన్నిక.

**6. గ్రామసభ విధులు - అధికారాలు :** లాటరీ ప్రకారం, అర్హత గల్గిన అభ్యర్థులను ఎన్నుకొనగా ఏర్పడిన సభ గ్రామపాలనను నిర్వహించేది. ఈ సభ సభ్యులను 'పెరుమక్కల్' అని అంటారు. ఈ సభా సమావేశాలకు రాజప్రతినిధులైన అధికారులు హాజరవుతారు. వీరు గ్రామసభలకు సలహాలిచ్చేవారు. గ్రామసభల విధులు, అధికారాలు (ఎ) పన్నులు వసూలు చేయుట, (బి) పన్ను చెల్లించని వారి ఆస్తిని జప్తుచేయుట, (సి) కరువు కాటకాలలో పన్నులు తగ్గించుట, (డి) నేర విచారణచేసి శిక్షలు విధించుట, (ఇ) గ్రామాభివృద్ధికి పాటుపడుట, (ఎఫ్) జీవకారుణ్య కార్యములకు దానధర్మాలు చేయుట, (జి) ప్రాథమిక విద్యాసంస్థలను నెలకొల్పుట. (హెచ్) తోటల పెంపకం, (ఐ) దేవాలయ నిధులు నిర్వహణ, (జె) నీటిపారుదల సౌకర్యములను సమకూర్చుట, (కె) బంగారు నాణెల తనిఖీ చేయుడం.

7. ఈవిధంగా చోళుల కాలంలో గ్రామాలు స్వయం పాలనాధికారం కల్గి అద్భుతముగా వెలిగాయి. ఇవి ప్రాచీన గ్రీసు, రోమ్‌లలోని పౌర రాజ్యాలను పోలి ఉన్నవి. అంతకన్నా ఉన్నతంగా సంఘ విధులకు ప్రజలను బాధ్యులుగా చేసి స్థానిక పరిపాలనలో చోళులు విశిష్టతను సాధించారని నీలకంఠ శాస్త్రి శ్లాఘించాడు.

## 20.6 సాంఘిక పరిస్థితులు

పల్లవుల కాలంలోవలె చోళుల కాలంలో కులవ్యవస్థ వున్నది. వృత్తిభేదంగా ఉపకులాలున్నవి. వరి ప్రధాన ఆహారం. రాజులు, రాజాధికారులు పట్టు వస్త్రాలు, సామాన్య ప్రజలు నూలువస్త్రాలు ధరించేవారు. నిరుపేదలు బానిసలుగా అమ్ముడుపోయే ఆచారము ఉండేది. స్త్రీలకు స్వేచ్ఛలేదు. భద్రతలేదు. యుద్ధ సమయాలలో స్త్రీలపై అత్యాచారాలు జరుగుచుండేవి. దేవదాసీ వృత్తి అమలులోకి వచ్చింది. సతిసహగమనము తరచుగా కన్పిస్తుంది.

## 20.7 ఆర్థిక పరిస్థితులు

ప్రజల ప్రధానవృత్తి వ్యవసాయం. వరి, నువ్వులు, పత్తి, నూనెగింజలు పండించేవారు. చోళ చక్రవర్తులు చెరువులు, కాలువలు త్రవ్వించి వ్యవసాయాన్ని వృద్ధిచేసారు. దేశంలో అనేక వృత్తుల వారుండేవారు. వారు మణిగ్రాం, అయినూర్వార్ మొదలగు శ్రేణులుగా ఏర్పడి వ్యాపారం చేశారు. రాగి, ఇత్తడి మొదలగు పంచలోహాలను పోతపోసే పరిశ్రమలుండేవి. విదేశీ వ్యాపారం కూడ ఎక్కువగానే ఉండేది. చైనా, జావా, అరేబియా, మలయా, శ్రీలంక, సయామ్ మొదలగు దేశాలతో ఎక్కువగా వ్యాపారం జరిగేది. నాగపట్టణం, కావేరి పట్టణం నాటి ముఖ్య రేవులు.

## 20.8 మతం :

1. చోళుల కాలంలో శైవ, వైష్ణవ మతాలు ఉన్నతస్థాయి నందుకున్నవి. జైన, బౌద్ధమతాలు పూర్తిగా నశించాయి. చోళ చక్రవర్తులలో ఎక్కువమంది శైవులు. వీరు అనేక శైవాలయాలు నిర్మించారు, పల్లవయుగంలో ప్రారంభమయిన నాయకుల ఉద్యమం

ఈ కాలంలో కొనసాగి శైవమత ప్రచారం జరిగింది. ఈ మత ప్రచారకులలో ముఖ్యులు మైకం దేవుడు, ఉమాపతి, జ్ఞాన సంబందార్, అరుల్ నంబి. వీరు శివ తత్వంపై గ్రంథాలు వ్రాశారు. శివ సిద్ధాంత బోధకులలో శ్రీకాంతుడు అతిముఖ్యుడు. శైవమతంలో కాపాలిక, కాలాముఖి అను రెండు శాఖలుండెను. వీరు కపాలాలలో భోజనం చేసి, శ్మశానాలలో నివశిస్తారు. వీరభద్రుని కొలుస్తారు. మాంసభక్షణ, మధుపానం చేస్తారు తాంత్రిక శక్తులను నమ్ముతారు. వంటికి బూడిద రాసుకుంటారు. ఈ యుగంలోనే ఈ శాఖలు క్షీణించి శంకరుని స్మార్త మతము ప్రచారమయింది. ఆత్మకు పరమాత్మకు భేదం లేదు. అంతా బ్రహ్మ పదార్థమే, ఆత్మ పరమాత్మలో చేరుటయే మోక్షము. మోక్షానికి అందరూ అర్హులే. యజ్ఞయాగాదులు నిష్ప్రయోజనమని భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను బోధించి మోక్షానికి జ్ఞానమే ప్రధానమని శంకరుడు ఒక్కాణించాడు. ఇతని సిద్ధాంతానికి అద్వైత సిద్ధాంతమని పేరు వచ్చినది. ఇతని అనుయాయులను స్మార్తులని అందరు. తన సిద్ధాంతాలు కలకాలం నిలిచి ఉండుటకు శృంగేరి, పూరి, ద్వారక, బదరీలలో మఠాలు స్థాపించాడు.

2. ఈ కాలంలో ప్రబలమైన మతం వైష్ణవ మతం. ఆళ్వారులు అని పిలువబడే విష్ణుభక్తులు ఈ మతాన్ని వ్యాప్తిలోనికి తెచ్చారు. రామానుజాచార్యుడు ఈ మతాన్ని బహుళవ్యాప్తి చేశాడు. ఈతని ప్రభావం వల్ల దక్షిణ భారతదేశంలో క్రింది కులాలవారు వైష్ణవ మతస్తులయ్యారు. యమునాజార్యుల వారికి శిష్యుడైన ఈతడు శ్రీరంగ మఠానికి అధిపతి అయ్యాడు. బ్రహ్మసూత్రాల మీద 'శ్రీభాష్యం' అనేపేర వ్యాఖ్యానం చేశాడు. శంకరుని అద్వైత సిద్ధాంతాన్ని ఖండించి విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని ప్రబోధించాడు. ఈతని సిద్ధాంతం ప్రకారం జీవాత్మ పరమాత్మకు సన్నిహితంగా చేరాలిగాని కలిసిపోరాదు. మోక్షానికి విష్ణుభక్తే కారణమని ఇతడు బోధించాడు.

## 20.9 సాహిత్యం

1. చోళుల కాలంలో విద్య, భాషలు, తమిళ సంస్కృతి, సాహిత్యము అభివృద్ధి చెందాయి. చోళ చక్రవర్తులు కళాశాలలు స్థాపించి విద్యను ప్రోత్సాహించారు. దక్షిణ ఆర్కాటు జిల్లాలోని ఎన్నాయిరం అనేచోట రాజేంద్రచోళుడు స్థాపించిన కళాశాలలో వేద, వేదాంత, మీమాంస, వ్యాకరణాలు బోధించేవారు. పుదుచ్చేరి సమీపంలోని త్రిభువని కళాశాలలో పై విషయాలతో బాటు ఇతిహాస, ధర్మశాస్త్రాలు బోధించారు. తిరుముక్కూడల్ కళాశాలకు అనుబంధంగా ఒక వసతిగృహము, వైద్యశాల ఉండేవి. మద్రాస్ సమీపంలోని తరువొర్రియూర్‌ల్ వ్యాకరణ పాఠశాల ఉండేది. తంజావూరు జిల్లా తిరువదుతుఱై దగ్గర వైద్య కళాశాలలో చరకసంహిత, వాగ్భటుని అష్టాంగ హృదయసంహి బోధించేవారని ఒక శాసనం వలన తెలియుచున్నది. పై విషయాల వల్ల తమిళదేశంలో చోళుల కాలంలో సంస్కృతంలో విశేష పరిశ్రమ జరిగినట్లు తెలియుచున్నది.

2. చోళుల కాలం నాటి సంస్కృత గ్రంథాలలో ముఖ్యమైనవి ఉమాపతి 'శివ ప్రకాశం', మైకంద దేవుని 'శివ జ్ఞాన భోదం', అరు నంబి 'శివజ్ఞాన సిద్ధాంతం', కేసవస్వామి 'నానార్థనవ సంక్షేమము' అనే సంస్కృత నిఘంటువు. మొదటి పరాంతకుని కాలంలో వెంక మాధవుడు ఋగ్వేదానికి భాష్యం వ్రాసినాడు. రామానుజాచార్యుడు బ్రహ్మ సూత్రాల మీద 'శ్రీ భాష్యం' రచించాడు.

3. చోళుల కాలంలో తమిళ సారస్వతం పునరుజ్జీవనం పొందింది. తమిళ సారస్వత చరిత్రలో ఈ కాలం స్వర్ణయుగం పరిగణిస్తారు. తమిళానికి చోళ రాజాదరణ విశేషంగా లభించింది. తిరుతక్కదేవర్ అను జైనభిక్షువు 'జీవక చింతామణి' అను తమి కావ్యాన్ని శృంగార భరితంగా వ్రాశాడు. తమిళ కవులందరలోకి సుప్రసిద్ధుడైన 'కంబన్' తమిళంలో 'రామాయణం' వ్రాసాడు. బ కుట్టాన్ యుద్ధగేయాలు (పరణీన్, ఉలావ్) వ్రాసాడు. నలదమయంతుల కథను పుంగళింది తమిళంలో కావ్యంగా వ్రాశాడు. అవ్వయ్యా అనేక భక్తి గీతాలను రచించి తమిళ దేశమంతా పర్యటించాడు. శైవులకు పవిత్రమైన 'పెరియ పురాణ' కర్త అయిన శెక్కిలార్, శై సిద్ధాంతం మీద ప్రామాణిక గ్రంథాలు రచించిన నంబి ఆండార్ నంబి ఈ కాలం వారే. కొందరు కవులు తమిళ సంస్కృతాలను కలి కావ్యాలను వ్రాశారు. దీనిని 'మణి ప్రవాళము' అని అంటారు. ఇటువంటి రచనలు చేసినవారు నంబియాల్, పెరియా వాచ్చాన్ పిళ్ళై కులోత్తుంగుని ఆస్థానకవి జయంగొండార్ కులోత్తుంగుని కళింగ దండయాత్రను 'కళింగ త్తుప్పరణి' అను కావ్యంగా వ్రాశాడు. ఒ కూత్తూర్ అస్థానకవి విక్రమచోళుని విజయాలను 'పరణి' అను కావ్యంగా వ్రాశాడు. అమిత సాగరుడను జైనకవి 'యాప్పరుంగళం' అ ఛందో గ్రంథాన్ని వ్రాశాడు. సంగం యుగంలో ప్రసిద్ధిచెందిన 'శిలప్పాదికారమ్'కు అడియార్క్ వల్లర్ అనుకవి, 'కురల్' అను కావ్యాని పరిమేళగర్ అనుకవి వ్యాఖ్యానాలు వ్రాశారు. అలాగే 'తొల్కాప్పియం' అనే మరొక గ్రంథానికి ఇళం పురాణార్ అనుకవి వ్యాఖ్యానాల వ్రాశాడు.

## 20.10 శిల్పకళ

1. పల్లవుల కాలములో ప్రారంభమైన దక్షిణ భారత దేవాలయ నిర్మాణము చోళుల కాలంలో విశ్వరూపం దాల్చినది. ఎస్. ఆర్. బాలసుబ్రమణ్యం వ్రాసినట్లు చోళుల కాలంలో ద్రావిడ వాస్తుశిల్పం అత్యున్నత ప్రమాణాలను అందుకొంది. చోళులు కొంతవరకు పల్లవ సాంప్రదాయాలను ఆలయ నిర్మాణంలో అనుసరించారని కె. ఎ. నీలకంఠ శాస్త్రి వ్రాశాడు. దేవాలయాల దేవుళ్ళకు వారి పేర్లు పెట్టడం, దేవతా విగ్రహాలతోబాటు రాజు పట్టపురాణి విగ్రహాలు ప్రతిష్టించడం చోళుల ప్రత్యేకత. ఎత్తైన గోపురాలు, పెద్ద ప్రాకారాలు వీరి వాస్తు లక్షణాలు.

2. తొలిదశ దేవాలయాలు : తొలిదశలో చోళులు నిర్మించిన ఆలయాలు పరిమాణంలో చిన్నవి. నర్తమలైలోని 'విజయాలయ చోళేశ్వరా'లయము, కొండబలూరులోని 'మువర్ కోయిల్', శ్రీనివాస నల్లూరులోని 'కొరంగ నాథాలయం', కుంభకోణంలోని 'నాగేశ్వరాలయం' మొదలైనవి తొలి చోళ వాస్తుశైలికి (800-1000) చక్కటి ఉదాహరణలు. ఆంధ్రదేశంలో తొలిదశకు చెందిన చోళ ఆలయాలు తొండమానాడులోని 'అదిత్యేశ్వర' ఆలయం, లద్దిగంలో గల 'ఇరుంగోలీశ్వర' ఆలయం. సాధారణంగా ఈ దశలో దేవాలయాల అంగాలు గర్భగుడి, మండపము.

3. మధ్యదశ దేవాలయాలు : రాజరాజు పాలనా కాలం నుండి మొదటి కులోత్తుంగుని కాలం వరకు నిర్మించబడిన దేవాలయాలు మధ్యదశను కనబరుస్తాయి. ఈ దశలోని దేవాలయాలు ప్రధాన పూజామందిరం, ఇతర పూజా మందిరాలు, జప గృహం, గోపురాలతో కూడిన ప్రాకారాలను కలిగివున్నాయి. ఈ కాలంలో స్తంభం చివరి భాగంలో త్రిభుజాకారపు కుసిని (కార్బెల్) ప్రవేశపెట్టబడింది. ఈ కాలపు ఆలయాలలో ముఖ్యమైనవి తంజావూరు, గంగైకొండ చోళపురంలోని దేవాలయాలు. తంజావూరులో రాజరాజు నిర్మించిన బృహదీశ్వరాలయము భారతీయ వాస్తుశిల్పకళకే గర్వకారణము.

4. ఆఖరి దశ దేవాలయాలు : కులోత్తుంగుని కాలం నుండి నిర్మితమైన దేవాలయాలు ఆఖరి దశకు చెందినవి. ఈ కాలంలో ఆలయ కట్టడాల సమూహంలో 'అమ్మన్'కు ప్రత్యేక పూజామందిరం నిర్మితమైంది. 'పుష్పపోటిక' అనేపేరుతో కొత్త కార్బెల్ విధానాన్ని ప్రవేశపెట్టారు. మండపాల సంఖ్య పెరిగింది. కడపటి చోళ వాస్తుశైలికి చెందిన దేవాలయాలలో చెప్పుకోదగినవి దారాసురంలోని ఐరావతేశ్వర ఆలయం, త్రిభువనంలోని కంపహరేశ్వరాలయం.

5. చోళులు శిల్పాలను గూడా చక్కగా మలిపించారు. వీరి శిల్పాలకు అలంకారాలు, వస్త్రధారణలలో ప్రత్యేకత కన్పించును. మూర్తులకు అంగాలు, ప్రసన్న ముద్రలు చక్కగా రూపొందించారు. నంది, గంగాదేవి, దక్షిణామూర్తి, శివమూర్తి, నవగ్రహాలు, శైవ ఆచార్యుల విగ్రహాలు, నటరాజ విగ్రహం ఈ కాలపు శిల్పాల్లో అద్భుతమైనవి. ఈ కాలపు మరియొక ప్రత్యేక లక్షణం కంచుతోనూ, పంచలోహ విగ్రహాలను తయారుచేయడం, శైవ, వైష్ణవ ఆచార్యుల విగ్రహాలు, నటరాజు, పార్వతి, లక్ష్మి, కృష్ణుడు, రాముడు మొదలగు విగ్రహాలు పంచలోహాలతో కోకొల్లలుగా తయారుచేయబడ్డాయి. వీటిలో నటరాజ విగ్రహము సౌందర్యానికి, భావవైశిష్ట్యానికి అగ్రగణ్యమైనది.

6. చోళుల కాలం నాటి చిత్రలేఖనాన్ని తంజావూర్‌లోని 'బృహదీశ్వరాలయం'లో చూడవచ్చు. గర్భగుడి చుట్టూవున్న ప్రదక్షణపథ గోడలమీద, పైకప్పుమీద చిత్రాలను వేశారు. 'యోగదక్షిణామూర్తి', 'త్రిపురాంతక', 'నటరాజు' వంటి శివుని రూపాలను వేర్వేరు భాగాలలో చిత్రీకరించారు. రాజరాజుని చిత్తరువు, చోళ యుద్ధవీరుల చిత్రాలు పేర్కొనదగినవి.

## 20.11 ముగింపు

చోళ చక్రవర్తులు గొప్ప సామ్రాజ్య నిర్మాతలే గాక గొప్ప పరిపాలనాదక్షులు. ముఖ్యంగా వారి స్థానిక స్వపరిపాలన నేనో కొనియాడబడుతూ వుంది. ద్రావిడ నాగరికత, తమిళ సంస్కృతికి ఇది సువర్ణయుగమని చెప్పవచ్చు. శైవ వైష్ణవాలు స్థిరంగా నెలకొన్నాయి. శిల్పకళ విరాజిల్లినది. తమిళ వాఙ్మయం సర్వతోముఖ వికాసము పొందింది.

**పదకోశం:**

**దేవకోష్ఠ :** దైవ ప్రతిమను ఉంచు గూడు.

**గర్భ గృహం :** మూల విరాట్టు నివాసం

పుష్పపోటిక : స్తంభ పైభాగంలో పద్మంవంటి అలంకారం.

**ప్రశ్నలు :**

**I వ్యాస ప్రశ్నలు**

1. రాజరాజు, రాజేంద్రచోళుల పాలన చోళుల అధికార వ్యాప్తిని సమీక్షించుము?
2. తమిళదేశ సంస్కృతికి చోళులు చేసిన సేవను వ్రాయుము?

**II సమస్యాపూర్తిత ప్రశ్నలు :**

1. చోళుల పరిపాలనా విధానమును వ్రాయుము?
2. చోళుల గ్రామపరిపాలనా విధానాన్ని వ్రాయుము?

**III లఘుటీక ప్రశ్నలు**

1. కులోత్తుంగ చోళుడు
2. రామానుజుడు
3. తమిళ సాహిత్యం
4. తంజావూరు.

**/ కుశాగ్ర బుద్ధి పరీక్ష :**

ఈ క్రింది ప్రశ్నలకు సరియైన సమాధానాలు వ్రాయుము.

చోళుల రాజధాని ( a )

ఎ) తంజావూరు బి) కంచి సి) వేంగి

చోళరాజ్య స్థాపకుడు ( b )

ఎ) ఆదిత్యుడు బి) విజయాలయుడు సి) రాజరాజు

'మధురై కొండ' అను బిరుదు పొందిన చోళరాజు ( c )

ఎ) ఆదిత్యుడు బి) రాజరాజు సి) మొదటి పరాంతకుడు

4. చోళ చక్రవర్తులలో ప్రసిద్ధుడు ( c )

ఎ) రాజేంద్రుడు బి) విక్రమాదిత్యుడు సి) రాజరాజు

5. తంజావూరు బృహదీశ్వరాలయ నిర్మాత ( a )

ఎ) రాజరాజు బి) రాజేంద్రుడు సి) కులోత్తుంగుడు

6. 'గంగైకొండ చోళ' బిరుదు ధరించిన వాడు ( b )

ఎ) రాజరాజు బి) రాజేంద్రుడు సి) పరాంతకుడు

7. 'కులోత్తుంగ' అను పేరుతో సింహాసన మెక్కినవాడు ( b )

ఎ) రాజరాజు బి) రాజేంద్రుడు సి) కరికాలుడు

చోళ రాజులలో చివరివాడు ( a )

ఎ) మూడవ రాజేంద్రుడు బి) రాజరాజు సి) కులోత్తుంగుడు

9. జీవక చింతామణి కర్తతిరుత్తక్కదేవర ఈ మతస్తుడు ( a )

ఎ) జైన  బి) హిందూ  సి) బౌద్ధ

10. తమిళంలో రామాయణం రచించినవాడు ( b )

ఎ) శెక్కిలార్  బి) కంబన్  సి) జయంగొండార్

III. జతపరచుము :

| | | | |
|---|---|---|---|
| 1. పెరియ పురాణం | ( b ) | ఎ) జయంగొండార్ |
| 2. కళింగత్తు పరణి | ( a ) | బి) శెక్కిలార్ |
| 3. తిరువదుతురై | ( d ) | సి) రామానుజుడు |
| 4. విశిష్టాద్వైత్వం | ( c ) | డి) వైద్యకళాశాల |

## అభ్యాసాలు

1. చాళుక్య - చోళ సంఘర్షణలను వివరింపుము.
2. చోళుల గ్రామపరిపాలనా విధానము వివరింపుము.

## ఉపయుక్త గ్రంథాలు :


1. బి.యస్.యల్. హనుమంత్ రావు : భారతదేశ చరిత్ర - సంస్కృతి, ద్వితీయ భాగము, తెలుగు అకాడమీ ప్రచురణ.
2. K. A. Nilakanta Sastry : The Cholas
3. R.C. Majumder : A comprhensice History of India, Vol. I.
4. Romila Thapar : History of India
5. N. Venkataramayya : Eastern Chalukups of Vengi
6. G. Yazdari : The Early History of the Deccern
7. N. Subrahmaniam : History of Tamilnad
8. A. L. Basham : The Wonders that was India
9. K. R. Srinivasan : South Indian Temples
10. Percy Brown : Indian Architecture



రచయిత

వి. కె. మోహన్.

పాఠం - 21

# మహమ్మద్ ఘజనీ - మహమ్మద్ ఘోరీ దండయాత్రలు - ఫలితాలు

## 21.1 లక్ష్యం

మహమ్మద్ అనుచరులుగా మహమ్మద్ ఘజనీ, మహమ్మద్ ఘోరీ భారతదేశ దండయాత్రలకు గల కారణాలు, తత్ ఫలితాలు, ముస్లింల చేతిలో హిందువుల ఓటమికి గల కారణాలు ఏమిటి? మొదలగు అంశాలను తెలుసుకుందాం.

ప్రధానాంశాలు :


21.2 ఉపోద్ఘాతం

21.3.1. అరబ్బుల దండయాత్ర

21.3.2. అరబ్బుల దండయాత్ర ఫలితాలు

21.4. తురుష్కుల దండయాత్ర

21.4.1. గజనీ మహమ్మద్

21.4.2. దండయాత్రల ఫలితాలు

21.4.3. మహమ్మద్ ఘనత

21.5. మహమ్మద్ ఘోరీ

21.5.1. మహమ్మద్ ఘోరీ ఆశయాలు, విజయాలు

21.5.2. ఘనత

21.6. తురుష్కుల చేతిలో హిందువుల ఓటమికి గల కారణాలు


## 21.2. ఉపోద్ఘాతం :

భారతదేశంలో మొదట ప్రవేశించి, సింధు రాష్ట్రాన్ని ఆక్రమించుటకు ప్రయత్నించిన వారు అరబ్బులు. అయితే వీరికి ముందు కూడా భారతదేశానికి ముస్లింలతో పరిచయం ఉంది. అరబ్బులు ఇస్లాం మత ప్రభావం చేత ఉత్సాహవంతులై భారతదేశంలో ప్రవేశించి, తమ అధికారంను స్థాపించుటకు ప్రయత్నించి విఫలులైయ్యారు. క్రీ.శ. 9 వ శతాబ్దం నాటికి భారతదేశంపై అరబ్బులు అధికారం పూర్తిగా అంతమయ్యింది. అరబ్బులు ప్రారంభించిన కార్యక్రమం తురుష్కులు పూర్తిచేశారు. తురుష్కులు కూడా ఇస్లాం మతాన్ని అనుసరించారు. అరబ్బుల కన్నా మతాభిమానం కలవారు తురుష్కులు. వీరిలో మతావేశం ఎక్కువ. పరమతస్తులను శత్రువులుగా భావించెడివారు.

## 21.3.1. అరబ్బు దండయాత్ర :

భారతదేశం జయించిన మహమ్మదీయులలో మొదటివారు అరబ్బులు. అనాదిగా అరబ్బులు భారతదేశంలో వాణిజ్యం చేస్తూ ఉండేవారు. పశ్చిమతీరంలో వారికి కొన్ని వర్తక కేంద్రాలుండేవి. ఇస్లాం వల్ల కలిగిన మతావేశంతో నూతనోత్సాహంతో భారతదేశంలో విగ్రహారాధన నిర్మూలించవలెననీ సిరిసంపదలు దోచుకోవలెననీ తమ మతాన్ని వ్యాపింపచేయవలెననీ సంకల్పించారు.

మూడవ ఖలీఫా ఉమర్ (633 - 44 (A.D.) కాలంలోనే భారత తీరంలోని ఠాణాపై దాడి జరిపారు. ఈ దాడి విఫలమైంది. తదుపరి బ్రోచ్ (భరుకచ్ఛం), సింధురాష్ట్రంలోని దేబాల్ (643) పైనా దాడులు చేశారు. ఈ ప్రయత్నాలు కూడా ఫలించలేదు. క్రీ.శ. 663 లో కూడా సింధు రాష్ట్రాల మీద మరొక దాడిచేయగా విఫలమైంది. ఇంతలో ఆఫ్ఘనిస్తాన్ అరబ్బుల వశమయింది. (క్రీ.శ. 700). నాటి నుండి రెట్టింపు ఉత్సాహంతో సింధురాష్ట్రాన్ని జయించే కృషి ప్రారంభించాడు.

సింధురాజ్యాన్ని 'దాహర్' అనే హిందూరాజు పరిపాలిస్తుండేవాడు. ప్రజలు 'జాట్' రసపుత్ర తెగకు చెందినవారు. దాహర్ సమర్థుడు కాదు. అతని అసమర్ధతను ఆసరాగా తీసుకొని సామంతులు స్వతంత్రంగా వ్యవహరిస్తూ ఉండేవారు. దీనికి తోడు దాహర్ పరమత సహనం పాటింపక ప్రజలలో అధిక సంఖ్యాకులయిన బౌద్ధులను నానా హింసలకూ గురిచేయగా, ప్రజలు అతనిని ద్వేషించసాగారు. ఇటువంటి పరిస్థితులలో క్రీ.శ. 708 లో సింహళం నుంచి ఇరాన్ రాష్ట్ర పాలకుడయిన 'ఆల్‌హజ్జాజు' కు కానుకలు తీసుకొనిపోతున్న సింధునదీ ముఖద్వారంలోని దేబాల్ రేవు సమీపంలో ఓడను దొంగలు దోచుకున్నారు. హజ్జాజ్ తనకు నష్టపరిహారం చెల్లించవలసినదిగా 'దాహర్' ను కోరాడు. దాహరే అతని కోరికను నిరాకరించాడు. అందుచేత అతనిని శిక్షించే ఉద్దేశంతో ఖలీఫా మొదటి తాలిద్ అనుమతితో హజ్జాజ్ రెండు మారులు సింధుపై దాడులు చేయగా, ఈ రెండు దాడులను దాహర్ ఓడించి తిప్పికొట్టాడు. వారినాయకులైన బబైదుల్లా, బాదాయిల్ సేనలను వధించాడు. తదుపరి హజ్జాజ్ తన అల్లుడైన 'మొహమ్మద్‌బిన్ కాశిం' నాయకత్వాన పెద్ద అరబ్ సైన్యంను క్రీ.శ. 710 లో సింధు రాజ్యం పైకి పంపాడు. కాశిం పదిహేడు సంవత్సరాల యువకుడు. కాని ధైర్యసాహసాలు, యుద్ధనైపుణ్యం ఉన్న మంచి సేనాని. బెలూచిస్తాన్ గుండా నడిచి కాశిం దేబాల్‌ను సులభంగా ఆక్రమించాడు. దాహర్ సేనలు అతని ముందు నిలవలేక పోయాయి. నీరూన్ మొదలైన నగరాలు సైతం కాశిం స్వాధీనమైయ్యాయి. సింధు, రాజస్తాన్ ఉద్యోగులైన మెకా మొదలయినవారు కాశింతో చేతులు కలుపగా కాశిం సింధునదిని దాటి రోర్ దగ్గర దాహర్‌తో యుద్ధంనకు తలపడ్డాడు. ఈ యుద్ధంలో పెద్ద సంఖ్యలో అరబ్బులు హతులైనారు. దాహర్ మరణించాడు. అతడి సేనలు చెల్లాచెదురయ్యాయి. బ్రహ్మణాబాద్ నగరం, ఆరోర్ దుర్గం, కాశిం వశమైయ్యాయి. తదుపరి ముల్తాన్‌లో అపార ధనరాసులు అతని వశమైయ్యాయి. ముల్తాన్ వశమయిన తర్వాత కాశిం, కనూజ్ కాశ్మీర్ రాజ్యాలను జయించుటకు ప్రయత్నించుచుండగా, ఖలీఫా కాశింను స్వదేశంకు రప్పించెను. అసంపూర్ణంగా వదలివెళ్ళిన భారతదేశ దండయాత్రలను అరబ్బులు పూర్తిచేయుటకు ప్రయత్నించి, విఫలులైరి. ఫలితంగా అరబ్బుల అధికారం సింధురాష్ట్రానికే పరిమితమైయ్యింది. అబ్బాస్ వంశం ఖలీఫా పదవిలోకి వచ్చాక భారతదేశం పట్ల అరబ్బుల శ్రద్ధ తగ్గింది. దానితో సింధురాష్ట్రం ఖలీఫాకు వ్యతిరేకంగా స్వతంత్రమైంది. 'మన్సూరా', 'ముల్తాన్' కేంద్రాలుగా రెండు చిన్న ముస్లిం రాజ్యాలుగా సింధురాష్ట్రం విడిపోయింది. వీటిని క్రీ.శ. 11 వ శతాబ్దిలో గజనీ మహమ్మద్ జయించాడు.

## 21.3.2. అరబ్ దండయాత్ర ఫలితాలు :

అరబ్బుల దండయాత్ర భారతదేశ చరిత్రపై ఎట్టి శాశ్వత రాజకీయ, సాంఘిక, మత, సాంస్కృతిక ప్రభావం కల్గి ఉండలేదు. అందుచే 'లేనేపూల్' పండితుడు 'అరబ్‌ల సింధు ఆక్రమణ భారత-ఇస్లాం చరిత్రలో ఒక ఉదంతమని, సత్ఫలితముల నీయని ఒక ఘనవిజయమని అభివర్ణించెను.

(The Arab conquest of Sind was an episode in the history of India and Islam a triumph without result - Lanepoole)

1. అరబ్బులు సువిశాల భారతదేశంలో కొద్దిప్రాంతంనే ఆక్రమించారు. మిగిలిన ప్రాంతంలోనికి వారు రాలేదు. వారు ఆక్రమించిన సింధు, ముల్తాన్‌లు కూడా శాశ్వతంగా నిలవలేదు.
2. అరబ్బుల దండయాత్రల నుండి భారతీయులు ఎటువంటి గుణపాఠములు నేర్చుకొనలేదు. అటులనే అరబ్బుల వలన భారతీయ సంఘంలో ఏ విధమైన మార్పు రాలేదు.
3. ఇస్లాం మతంను భారతదేశంనకు తీసికొని వచ్చిన ఘనత అరబ్బులకు దక్కినది. ఇస్లాంను వారు వ్యాప్తి చేయుటకు ప్రయత్నించగా, భారతీయులు మత స్వేచ్ఛ కోసం వారికి 'జిజియా' పన్నును చెల్లించారు.

4. అరబ్బుల రాక వల్ల గుజరాత్, సింధు రాష్ట్రాలకు విదేశాలతో వాణిజ్యం పెరిగిన కారణంగా ఈ ప్రాంతాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాయి.

5. అరబ్బులు భారతీయ గణిత, ఖగోళ, వైద్య, వేదాంత శాస్త్రములను నేర్చుకున్నారు. ఈ వేదాంత ప్రభావం వలననే మహమ్మదీయులందు కర్మ సిద్ధాంతమైన 'సుఫి' సిద్ధాంతం బయలుదేరింది.

## 21.4. తురుష్కుల దండయాత్రలు :

ఉమర్ వంశపతనంతో ఇంచుమించుగా ఆగిపోయిన ఇస్లాం విస్తరణ తురుష్కుల నాయకత్వంలో మహోద్యమంగా సాగింది. తురుష్కులు మధ్య ఆసియా జాతులలోని వారు. క్రూరస్వభావులు. 9,10 శతాబ్దాలలో ఇస్లాంను స్వీకరించి విపరీతమైన ఆవేశంతో ఆ మతాన్ని వ్యాప్తి చేయుటకు పూనుకొన్నారు. అరబ్‌లలో కనిపించే సమరసదృష్టి తురుష్కులలో కడబడదు. "మహమ్మదీయులంటే మతసహనం లేని వారనే" సర్వసాధారణమైన అభిప్రాయం తురుష్కుల వల్లనే వ్యాపించింది.

### 21.4.1. గజనీ మహమూద్ : (998 - 1030 (A.D.)

'అలప్తజిన్' (Alaptajin) అనే తురుష్క సేనాని నాయకత్వంలోని ఆఫ్ఘనిస్తాన్‌లోని గజనీలో స్వతంత్ర రాజ్యం ఏర్పడ్డది. అతని అల్లుడైన 'సబక్తజిన్' (Sabuktajin) మధ్య ఆసియా పైననే గాక వాయువ్య భారతంపై కూడా దాడులు జరిపాడు. రాజపుత్ర రాజులకూటమిని ఇతడు ఛేదించుటకు ప్రయత్నించుచుండగా, రాబోవు ప్రమాదాన్ని గుర్తించి పంజాబ్ పాలకుడైన జయపాలుడు సబక్తిజిన్‌ను నిరోధించుటకు క్రీ.శ. 978లో పెద్ద సైన్యంతో ఘజనీపై దండయాత్ర చేశాడు. వీరిరువురి మధ్య జరిగిన యుద్ధంలో జయపాలుడు ఓడిపోయి, సబక్తజిన్‌తో సంధిచేసుకొని, యుద్ధ నష్టపరిహారంగా కొంత ధనంను, కొంత భూభాగంను ఇచ్చుటకు అంగీకరించాడు. కానీ జయపాలుడు లాహోర్ చేరగానే సంధి షరతులను ఉల్లంఘించాడు. తిరిగి సబక్తజిన్ జయపాలునిపై దండెత్తి లాంఘన్ (నేటి జలాలాబాద్) కొల్లగొట్టి పెషావరును స్వాధీనపరచుకున్నాడు.

సబక్తజిన్ క్రీ.శ. 997 లో మరణించెను. అతని కుమారుడు మహమూద్ గజనీ సుల్తానయినాడు. అతడు సింహాసన మధిష్టించేనాటికి గజనీ రాజ్యం ఆఫ్ఘనిస్తాన్, ఖురసాన్ ప్రాంతాలకు మాత్రమే విస్తరించింది. మహమూద్ మహాయోధుడు, పర్షియా మధ్య ఆసియా, ఆఫ్ఘనిస్తాన్ లను కలిపి గొప్ప సామ్రాజ్యం స్థాపించవలెనని ఆశయంతో, సిరిసంపదలు కల్గిన భారతదేశంను కొల్లగొట్టుటకు 'ఖలీఫా' ఆమోదంను పొందాడు. 'ఖలీఫా' అతనికి 'యామీన్ ఉద్దౌలా' 'అమీన్ ఉల్‌ముల్లా' అనే బిరుదులు ఇచ్చి ప్రోత్సహించెను.

అత్యంత కాంక్షాపరుడైన మహమూద్ భారతదేశంపై ప్రతి సంవత్సరము ఒకే పర్యాయం దండయాత్ర జరుపగలనని కలీఫా సమక్షమున ప్రతిన బూనెను.

మహమూద్ భారతదేశంపై జరిపిన దండయాత్ర గూర్చి చరిత్రకారులలో ఏకాభిప్రాయం లేదు. 12 పర్యాయంలు భారతదేశంపై దండయాత్రలు జరిపినట్లు చరిత్రకారుల అభిప్రాయం. ఇవి క్రీ.శ. 1000 లో ప్రారంభమయ్యాయి. 1029 వరకు కొనసాగుతూనే ఉన్నాయి.

మహమ్మద్ భారతదేశంపై మొదటి దండయాత్ర క్రీ.శ. 1000 ప్రాంతంలో జరిగినది. ఈ దండయాత్రలో మహమూద్ కొన్ని సరిహద్దు కోటలు స్వాధీనమైయ్యాయి. మరుసటి సంవత్సరం పెషావర్ దగ్గర జరిగిన యుద్ధంలో జయపాలుని పట్టుకొని డబ్బు తీసుకొని విడిచిపెట్టాడు. 'ఉదభాండపురం' అతని వశమైయ్యింది. తనకు జరిగిన అవమానం భరింపలేక జయపాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. క్రీ.శ. 1003 లో మహమూద్ సింధు నదినిదాటి భాటియా రాజ్యాన్ని ఆక్రమించాడు.

మహమూద్ తరువాత దండయాత్ర షియా ముస్లింలచే పరిపాలించబడే 'ముల్తాన్‌'పై. దండయాత్రకు ముందు జీలం నది ఒడ్డున గల 'ఖేరా' రాజ్యంను ముట్టడించాడు. ఇచ్చటనే ఆనందపాలుడు మహమూద్ నెదిరించి అతనిచే ఓడింపబడినాడు. క్రీ. 1006లో మహమూద్ ముల్తాన్‌పై దండెత్తి జయించాడు. ముల్తాన్ పాలకునిగా పూర్వం తానుబందీగా కొనిపోయిన జయపాలు మనుమడు సుఖపాలుని నియమించెను. సుఖపాలుడు ఇస్లాం మతాన్ని స్వీకరించి తను పేరు 'నౌసాషా' గా మార్చుకొన్నాడు. మహమూ[illegible]న్ విడచి ఘజనీ చేరగానే సుఖపాల[illegible] [illegible]ం మతం విడిచి [illegible] మతం [illegible] చేశాడు. మహమూద్ క్రీ

1008లో ముల్తాన్‌చేరి సుఖపాలుడినోడించి బంధీ చేశాడు. ముల్తాన్ మహమూద్ విశాల సామ్రాజ్యంలో భాగమైయ్యింది. మహమూద్ పంజాబ్ నాక్రమించి అచటనుండి భారతదేశ మధ్యప్రాంతాలు ఆక్రమించి కొల్లగొట్టాలని తలంచాడు. మహమూద్ ముల్తాన్ ఆక్రమించుట, ఆనందపాలుడు మహమూద్ యొక్క పథకాలను గ్రహించ గలిగాడు. అతని ప్రయత్నాలను కొనసాగనివ్వకూడదని చాలామంది రాజపుత్ర రాజులను కూడగట్టుకొని పెద్ద సైన్యాలను సమాయత్తపరచి పెషావరుపై దాడి జరిపాడు. మహమూద్ ఆనందపాలుని సైన్యాలను 'వైహింద్' (waihind) వద్ద అడ్డగించి తీవ్రంగా ఓడించాడు. మహమూద్ నాగర్‌కోటను దోచుకున్నాడు. 1009-10 లో జరిపిన దాడిలో నారాయణపూర్, నందనగరాలను దోచుకున్నాడు. 1014లో జరిగిన దండయాత్రలో త్రిలోచనపాలుని ఓడించి, స్థానేశ్వరం, మధుర ఆలయాలను కనూజ్ నగరాన్ని దోచుకున్నాడు. కనుజ్‌పై దండెత్తి రాగా రాజ్యపాలుడు భీతిచెంది పారిపోయినందుకు బందేల రాజు విధ్యాదరుడు రాజ్యపాలుని చంపివేశాడు. ఇది విన్న మహమూద్ 1019 నుండి 1022 వరకు బందేల రాజ్యంపై ప్రతీకారం కోసం దాడులు జరిపాడు. అయితే గ్వాలియార్ దుర్గాన్ని వశపర్చుకోలేక మహమూద్ విద్యాధరునితో సంధి చేసుకున్నాడు.

భారతదేశంపై జరిపిన దాడులన్నింటిలోనూ 1026 లో మహమూద్ కథియవాడ్‌లో గల సోమనాథ్ దేవాలయంపైన జరిపిన దాడికి ప్రత్యేకత ఉంది. ఎంతో ఐశ్వర్యవంతమూ, పవిత్రమూ అయిన ఈ సుప్రసిద్ధ దేవాలయంలోని లింగాన్ని అతడు బద్దలు కొట్టి, అశేషమైన ఆలయ సంపదను దోచుకుని వెళ్ళాడు. అయితే మార్గమధ్యంలో 'జాట్'లు ఇతని సేనలపైబడి తీవ్రమైన నష్టం కలుగజేశారు. వీరిని శిక్షించేందుకు 1029 లో ప్రతీకార దాడి జరిపాడు. ఈ దాడిలో జాట్‌లను పెద్ద సంఖ్యలో వధించి పగసాధించాడు. వీరి గ్రామాలను దోచుకున్నాడు. ఇదే మహమూద్ భారతదేశంపై చేసిన చివరి దండయాత్ర. ఆ మరుసటి సంవత్సరమే అతడు మరణించాడు.

### 21.4.2. దండయాత్ర ఫలితాలు

మహమూద్ భారతదేశాన్ని జయించి పాలించవలెనని ఆశించలేదు. పంజాబ్ వరకు గజనీ రాజ్యంలో కలిపాడు. ధనం కొల్లగొట్టడమే అతని ప్రధాన లక్ష్యం. అతని దాడులు విపరీత రాజకీయ పరిణామాలకు దారితీసినవి.

1. పంజాబ్ నందలి హిందూషాహి పాలన, మూల్తాన్ ముస్యరా లందున్న అరబ్బుల పాలన, కనూజ్ యందు ప్రహారుల పాలన అంతమయ్యెను.
2. ఉత్తర భారతదేశంలోని అనేక పట్టణాలను దోచుకొనెను.
3. మహమ్మద్ దాడులు జరిపి రసపుత్రుల సైన్యం క్షీణింపజేశాడు. వారి సిరి సంపదలను కొల్లగొట్టాడు. తత్ ఫలితంగా వారు బలహీనులైరి, తదుపరి వచ్చిన విదేశీ దాడులను ఎదుర్కోనలేకపోయారు.
4. మధుర, బృందావన్, కనూజ్, సోమనాథ్ మొ. హిందూ దేవాలయములను ధ్వంసం చేసి భారతీయ వాస్తుశిల్ప కళకు తీరని నష్టం కల్గించారు.
5. మహమూద్ దాడుల వలన భారతదేశంలో ఇస్లాం మతం బాగుగా ప్రచారంలోనికి వచ్చెను. ఈ పరిస్థితులలో తదుపరి వచ్చిన ఘోరీ మహమ్మద్‌కు అనుకూలించెను.

### 21.4.3. మహమూద్ ఘనత

మహమూద్ గొప్ప యుద్ధవీరుడే గాక, గొప్ప సారస్వత, కళాభిమాని. అతని ఆస్థానంలో ఫిరదౌసి, అల్‌బెరూనీ, ఉత్బీ మొదలగు పండితులు కలరు. వారి రచనలు భారతదేశ చరిత్ర రచనకు ఎంతో ఉపయోగపడుచున్నవి. ఫిరదౌసి పారశీక భాషన హోమర్ వంటివాడు. మహమూద్ గుణగణాలను విజయాలను 'షానామా' అను గ్రంధంను రచించెను. "ప్రపంచ చారిత్రక మహాపురుషులలో మహమూద్ ఒకడు" అని ఆచార్య ఈశ్వరీ ప్రసాద్ వర్ణించెను.

మహమూద్ మరణానంతరం అంతర్యుద్ధాలు కారణంగా గజనీ సామ్రాజ్యం పతనమైంది. తరువాత 'ఘోరీ' సామ్రాజ్య ప్రాముఖ్యత పొందింది.

## 21.5. మహమ్మద్ ఘోరి : (1175 - 1206)

ఆఫ్ఘనిస్థాన్ నందు గజనీ, హిరట్‌లకు మధ్య వెలిసిన రాజ్యం ఘోరీ. ఘోరీను పాలించిన వారు ఆఫ్ఘనులుగాని పారశీకుల గాని, అయిఉండవచ్చును. మహమూద్ మరణానంతరం గజనీ ప్రతిభ అంతరించి దాని స్థానం నందు ఘోరీ బలపడసాగింది. ఘో

సుల్తాన్ అల్లాఉద్దీన్ హుస్సేన్ ఘజనీ నాక్రమించి ఘోరీ రాజ్యమునకు పునాదులు వేసెను. ఈ ఉద్దీన్ వంశీయులలో సుప్రసిద్ధుడు షిహాబుద్దీన్ లేక ఘోరీ మహమ్మద్. భారతదేశం నందు మహమ్మదీయ రాజ్యస్థాపన చేసినవాడు - మహమ్మద్ ఘోరీ.

## 21.5.1. మహమ్మద్ ఘోరీ ఆశయాలు, విజయాలు

మహమ్మద్ ఘోరీ సైతం భారతదేశంపై అనేక సార్లు దండయాత్రలు జరిపాడు. కాని ఘోరీ కేవలం ధనాన్ని మాత్రమే ఆశించినవాడు భారతదేశంలో ముస్లిం సామ్రాజ్యాన్ని స్థాపించవలెనన్నదే అతని ఆశయం. క్రమంగా భారతదేశంలోని ముస్లిం పాలకులందరినీ తన అధికారంలోనికి తీసుకొని వచ్చి ముస్లింల రాజ్యానికి పునాదులు వేశాడు.

మహమ్మద్ ఘోరీ క్రీ.శ. 1175 లో భారతదేశంపై మొదటిసారి దండయాత్ర జరిపాడు. ముల్తాన్ జయించాడు. అదే సంవత్సరంలో ఉచ్ (Uch) ప్రాంతంను కూడా జయించాడు. క్రీ.శ. 1179 లో అతడు గుజరాత్ పై దండయాత్ర జరిపి, దాని పాలకుడు సోలంకి వంశస్థుడైన రెండవ మూలరాజు చేతిలో ఓడిపోయాడు. 1180లో పెషావరు పై దండెత్తి ఘజనీ వంశస్థుల నుండి పెషావరుని జయించి ఆక్రమించెను. 1181 లో లాహోర్, సియాల్ కోటను, ఆక్రమించాడు. 1186 లో పంజాబ్ పై దండయాత్ర జరిపి ఖుస్రూ మాలిక్‌ను ఓడించి బందీగావించాడు. పంజాబ్‌లో గజనీ వంశమంతరించింది.

పంజాబ్ ఆక్రమణతో ఘోరీ సామ్రాజ్యం సట్లెజు నదివరకు విస్తరించింది. ఆ నదికి దక్షిణంగానే చౌహాన్ రాజ్యముంది. చౌహాన్ రాజ్యాన్ని పృధ్వీరాజు పాలిస్తున్నాడు. అందుచేత ఘోరీ, పృధ్వీరాజులకు యుద్ధం తప్పలేదు. క్రీ.శ. 1190లో ఘోరీ సట్లెజు నది దాటి చౌహాన్ రాజ్యంలోని సర్‌హింద్ (భటిండా) ను పట్టుకొన్నాడు. పృధ్వీరాజు పెద్ద సైన్యం కూర్చుకొని ఘోరీని అడ్డుకొనెను. క్రీ.శ. 1191 లో 'తరయిన్' (TARAIN) వద్ద జరిగిన యుద్ధంలో ఘోరీ ఓడిపోయి స్వదేశానికి వెళ్లిపోయ్యాడు. ఈ యుద్ధంనకే చరిత్రలో మొదటి తరయిన్ యుద్ధం లేదా మొదటి స్థానేశ్వర యుద్ధం అని పేరు.

స్వదేశానికి చేరిన ఘోరీ మహమ్మద్ తిరిగి సైన్యంను వృద్ధి చేసుకొని 1192 లో తిరిగి పృధ్వీరాజుపై దండయాత్రకు వచ్చాడు. పృధ్వీరాజు సోకార రసపుత్రరాజుల సహాయంతో ఘోరీని తరయిన్ దగ్గర ఎదుర్కొనెను. వీరిరువురి మధ్య తీవ్రమైన యుద్ధం జరిగింది. చివరకు విజయం ఘోరీని వరించింది. రాజపుత్ర సైన్యాలు తీవ్రంగా నష్టపడ్డాయి. పృధ్వీరాజు పారిపోగా 'సరసుతి' దగ్గర ముస్లింలు పట్టుకొని అతనిని వధించారు. ఢీల్లీ, అజ్మీరులు అతని వశమయ్యాయి. ఈ యుద్ధంనకు చరిత్రలో రెండవ తరయిన్ యుద్ధం లేదా రెండవ స్థానేశ్వర యుద్ధం అని పేరు.

అజ్మీర్ పాలకునిగా పృధ్వీరాజ్ కొడుకును నియమించాడు. అతడు ఘోరీకి ప్రతి సంవత్సరం కప్పం చెల్లించుటకు అంగీకరించాడు. భారతదేశంలో తాను జయించిన ప్రాంతాలు సంరక్షణకై ఘోరీ తన అనుచరులతో సమర్ధుడైన కతుబుద్దీన్ ఐబక్‌ను ఢీల్లీ వద్ద తన ప్రతినిధిగా నియమించాడు.

క్రీ.శ. 1193లో ఘోరీ కనూజ్‌పై దండెత్తి చాందవారు (CHANDAWAR) యుద్ధంలో జయచంద్రుని ఓడించి, అతని రాజ్యాన్ని ఆక్రమించాడు. ఈ విజయంతో ఘోరీ రాజ్యం వారణాసి వరకు విస్తరించెను. 1195 లో ఘోరీ బయానా, గ్వాలియర్ రాజ్యాలను జయించాడు. 1206 లో ఘోరీ సింధునది ఉత్తర తీరాన ఆకస్మిక దాడుల వల్ల కల్గిన గాయలతో మరణించాడు.

## 21.5.2. ఘనత

గజనీ మహమూద్ కంటె మహమ్మద్ ఘోరీ గొప్ప మేధాగ్రేసరుడు కాకపోయినను, చరిత్రలో ఘోరీ మహమ్మద్‌కు వచ్చిన ఘనత, మహమూద్‌కు రాలేదు. హిందూ రాజుల చేతిలో ఘోరీ అనేక మార్లు పరాజయం పొందినను, రాజనీతిలోను, శక్తి సామర్ధ్యంలలోను సామ్రాజ్య సాధనలోను, ఘోరీ ప్రతిభను గుర్తింపక వీలులేదు. అతని విజయాలకు కారణం అతని శక్తి సామర్ధ్యాలే. ఓర్పు, పట్టుదల అతని విజయాలకు తోడ్పడ్డాయి.

## 21.6. తురుష్కుల చేతిలో హిందూవుల ఓటమికి గల కారణాలు :

వీరాధివీరులుగా, యుద్ధ ప్రియులుగా ప్రసిద్ధులైన రసపుత్ర నాయకులు అచిరకాలంలోనే పరాజయం పొందటం హిందూస్థాన్ సులభంగా తురుష్కుల పాదాక్రాంతం కావటం భారతదేశ చరిత్రలో ప్రముఖ సంఘటనగా కన్పిస్తుంది. రమేశ్ చంద్ర, ఆర్. సి. మజుందార్ వంటి చరిత్రకారులు నాటి భారతదేశ పరిస్థితులే ఓటమికి కారణం అని పేర్కొన్నారు.

**హిందూ ఓటమికి గల కారణాలు :**

1. రాజపుత్రులందు ఐక్యతలేదు, వారు సంకుచిత స్వభావంతో విదేశీయులతో చేతులు కలుపుట.
2. భారతదేశ రాజుల సైన్యం సాంప్రదాయ పద్ధతుల పైననే ఆధారపడి, ఆధునిక శిక్షణను గాని, పద్ధతులుగానీ నేర్చుకొనకపోవుట. కనుకనే మొగల్ చక్రవర్తి బాబార్ హిందూ సైన్యాలకు "ఎల్లా చనిపోవటమో తెలుసుగానీ ఎలా పోరాడాలో తెలియదు" అని విమర్శించాడు యుద్ధంను ఆటగా భావించిన రాజపుత్రులు కూడా ఆధునిక యుద్ధపద్ధతులు అనుసరించలేదు.
3. సామాన్య ప్రజలు రాజకీయ విషయములకు మక్కువ చూపలేదు. వారు ఎటువంటి సహకారం రాజులకు ఇవ్వలేదు.
4. శక్తి, యుక్తులు గల గజనీ మహమూద్, మహమ్మద్ ఘోరీలు విజయాలు సాధించుటలో ఆశ్చర్యం లేదు.
5. మతోన్మాదులైన ముస్లింలు తమ మతస్థాపనకు, వ్యాప్తికి కృషిచేశారు. అటువంటి మతోత్సాహం హిందువులకు అంతగా లేదు

## ప్రశ్నలు

1. ఈ క్రింది వ్యాసరూప ప్రశ్నలను వివరించండి.

1. భారతదేశంలో గజనీ మహమ్మద్ సాధించిన విజయాలను వివరించండి?
2. మహమ్మద్ ఘోరీ దండయాత్రలను వర్ణింపుము?

2) ఈ క్రింది లఘు వ్యాసరూప ప్రశ్నలను వివరించండి.

1. మహమ్మద్ ప్రవక్త జీవితంను, ఆయన బోధనలు - ఇస్లాం మత సిద్ధాంతాలను వివరించండి?
2. తురుష్కుల చేతిలో హిందువుల ఓటమికి కారణాలను వివరించండి?

3) ఈ క్రింది ప్రశ్నలకు సరైనౌన సమాధానం గుర్తించండి?

1. భారతదేశంను జయించిన మొదటి మహమ్మదీయులు ఎవరు?

   ఎ) అరబ్బులు    బి) తురుష్కులు    సి) గజనీ మహమూద్    డి) మహమ్మద్ ఘోరీ

2. అరబ్బులు భారతదేశంను ఎప్పుడు జయించిరి.

   ఎ) 612    బి) 712    సి) 700    డి) 708

3. కల్మా అనగానేమి?

   ఎ) ప్రతి ముసల్మాను రోజుకు ఐదుసార్లు ప్రార్ధన    బి) మక్కాను సందర్శించుట

   సి)మతంపై నమ్మకం    డి) పేదలకు దానం

4. సోమనాధ దేవాలయం ముట్టడి

   ఎ) 1026    బి) 1022    సి) 1024    డి) 1025

5. తురుష్కుల దండయాత్రలలో హిందువుల ఓటమికి గల కారణం ఏమిటి?

ఎ) హిందువులలో ఐక్యత లేక పోవుట బి) పురాతన యుద్ధ పద్ధతులు

సి) శాంతి కాముకులు డి) మతావేశం లేకపోవుట.

3. జతపరచుము :

| | | | |
|---|---|---|---|
| 1. | పెరియ పురాణం | ( ) | ఎ) జయంగొండార్ |
| 2. | కళింగత్తు ప్పరణి | ( ) | బి) శెక్కిలార్ |
| 3. | తిరువదుతురై | ( ) | సి) రామానుజుడు |
| 4. | విశిష్టాద్వైతం | ( ) | డి) వైద్యశాల |

**Reference Books :**


(1) Indian History and culture Vo1. I - B.S.L. Hanumantha Rao, K. Basaveswara Rao

(2) The wonder that was india - A.L. BASHAM

(3) Political History of Ancient India - Ray Chowadary



రచయిత

పి. రవీంద్రరాజు

పాఠం - 22

# ఢిల్లీసుల్తానత్ యుగం

## 22.1 లక్ష్యం

మనదేశంలో స్వతంత్ర ముస్లిం రాజ్యంను స్థాపించిన రాజవంశం ఏది? ఘోరీ మహమ్మద్ మరణానంతరం విజృంభించిన ముస్లింల సుల్తానత్ యుగంగా ఎందుకు పిలువబడెను. బానిస వంశ స్థాపకుడెవరు, ఈ వంశంలో ప్రముఖ వ్యక్తులు ఎవరు, వీరి పాలనలో వచ్చి సాంఘిక, సాంస్కృతిక మార్పులు ఏమిటి, మొదలగు విషయాలు తెల్సుకుందాం.

ప్రధానాంశాలు :

| | |
|---|---|
| 22.2 | ఉపోద్ఘాతం |
| 22.3. | బానిస వంశం - కుతుబుద్దీన్ ఐబక్ (1206 - 1210) |
| 22.4. | ఆరామ్ షా (1210 - 11) |
| 22.5. | ఇల్ టుట్ మిష్ (1211 - 36) |
| 22.6. | రుక్న్ ఉద్దీన్ ఫిరోజ్షా (1236) |
| 22.7. | సుల్తానా రజియా ( 1236-40) |
| 22.8. | బహరాం షా (1240-42) |
| 22.9. | మసూద్ షా (1242-45) |
| 22.10. | నాసర్ ఉద్దీన్ మొహమ్మద్ (1245 - 65) |
| 22.11. | ఘియాస్ ఉద్దీన్ బాల్బన్ (1266-87) |
| 22.12. | బానిస వంశ పతనం |

## 22.2. ఉపోద్ఘాతం :

ఘోరీ మహమ్మద్ మరణించిన తరువాత భారతదేశంలో అతని ప్రతినిధి కుతుబుద్దీన్ ఐబక్ సుల్తాన్ గా అధికారంలోకి వచ్చి ఢిల్లీలో స్వతంత్ర ముస్లిం రాజ్యాన్ని స్థాపించడం మనదేశ చరిత్రలో ఒక ముఖ్య సంఘటన. ఢిల్లీని రాజధానిగా చేసుకొని ముస్లింల 'సుల్తాను' అను బిరుదంతో పాలించుట వలన వారిని 'ఢిల్లీ సుల్తానులని' వారి రాజ్యంను 'ఢిల్లీ సుల్తానత్ రాజ్యమని', అందురు కుతుబుద్దీన్ ఐబక్ స్థాపించిన వంశాన్ని బానిస వంశంగా పిలువబడింది. దీనిని 'మామ్లుక్ వంశమని అంటారు. మామ్లుక్ అంటే బానిస అని అర్థం. ఈ వంశ పాలకుల్లో ఎక్కువ మంది బానిసలో, బానిస కొడుకులో కావడం వల్ల ఆ పేరు వచ్చింది. కుతుబుద్దీన్, అతని అనుచరులు తరుష్కులు కావటం వలన వారిని ఆఫ్ఘనులు, పఠానులు, తురుష్కులు అని కూడా పిలుతురు. ఢిల్లీని రాజధానిగా చేసుకొని క్రీ.శ. 1206 నుండి క్రీ.శ. 1526 వరకు ఐదు రాజవంశీయులు ఢిల్లీని పాలించాయి. అందులో మొదటి రాజవంశం 'బానిసవంశం'

## 22.3. బానిస వంశం - కుతుబుద్దీన్ ఐబక్ (1206 - 1210) AD :

భారత దేశంలో తురుష్క వంశాన్ని స్థాపించిన కుతుబుద్దీన్ ఐబక్ టర్కిస్థాన్‌లో తురుష్క వంశంలో జన్మించాడు. బానిసగా జీవితంను ప్రారంభించి మొదట నిషాపూర్ కాజీకి బానిసగా ఉండి విద్యాబుద్ధులు నేర్చుకొన్నాడు. తదుపరి గజనీ నగరంనకు వచ్చి, మహమ్మద్ ఘోరీకి బానిసయ్యాడు. క్రమంగా ఘోరీ అభిమానం సంపాదించి, అశ్వశాల మీద అధిపతి అయ్యాడు. భారతదేశ దండయాత్రలో ఘోరీకి అండదండగా ఉంటూ రెండో తరాయిన్, యుద్ధానంతరం తన భారతదేశ సామ్రాజ్య భాగాలపై కుతుబ్ ఉద్దీన్ ఐబక్‌ను ఘోరీ రాజప్రతినిధిగా నియమించాడు.

తురుష్క సర్దారుల అభిమానాన్ని పొందుటకు ప్రముఖ తురుష్క నాయకులతో వివాహ సంబంధాలు ఏర్పరుచుకున్నాడు. ఘోరీ సేనానులలో 'యల్ డజ్' కూతురును పెండ్లిచేసుకొని, పంజాబ్ పాలకుడైన నాసర్ ఉద్దీన్ కుబాచా (Nasir - ud - din - Qubacha) తన సేనానులలో ఒకడైన ఇల్ టుట్‌మిష్ (Iltutmish) కు తనకుమార్తెను ఇచ్చి వివాహం చేశాడు.

క్రీ.శ. 1206లో మహమ్మద్ ఘోరీ మరణించాడు. అతనికి వారసులు ఎవరు లేరు. తాజుద్దీన్‌ల్ డజ్ గజనీ సింహాసనాన్ని ఆక్రమించుకొన్నాడు. ఐబక్ బల సామర్ధ్యాలను గుర్తించి బెంగాల్ ఇక్తియార్ ఉద్దీన్ సర్దారులు అతనిని భారతదేశంలో సుల్తాన్‌గా ఎన్నుకొన్నారు. మాలిక్ అనే బిరుదుతో లాహోరు రాజ్యాధికారంలను స్వీకరించారు. క్రీ.శ. 1206లో ఐబక్ పట్టాభిషేకం జరిగింది.

ఐబక్ అధికారానికి రావడం, ఘజనీ రాజైన తేజుద్దీన్ ఈల్డజ్‌కు నచ్చలేదు. ఈల్డజ్ ఘోరీ ప్రముఖుడైన సుల్తాను మహమ్మద్‌కు చెడ్డ సలహీలిస్తున్నాడని. ఘజనీ పై దండెత్తి ఈల్డజ్‌ను ఓడించి, ఘజనీని ఆక్రమించాడు. సుల్తాను మహమ్మద్‌ను కూడా తనవైపునకు మలర్చుకొన్నాడు. సుల్తాను నుండి ఐబక్ స్వేచ్ఛా పత్రంను సర్వలాంచనంలతో పొంది ఘజనీని భారతదేశమును పరిపాలించు అధికారంను సంపాదించాడు. 1210లో లాహోర్ నగరంలో బేగాన్ (polo) ఆడుతూ ప్రమాదానికిలోనై ఐబక్ మరణించాడు.

భారతదేశంలో ముస్లిం రాజ్యస్థాపకుడు ఐబక్ భారతదేవాన్ని ఘజనీ రాజకీయాల నుంచి వేరుచేసి స్వతంత్ర ముస్లిం రాజ్యంగా ఏర్పరచి రాజ్యాభివృద్ధికి కృషిచేశాడు. జీవితాంతం శత్రువుల మధ్య పోరాటాలతో గడపవలసి వచ్చినందువల్ల తాను స్థాపించిన రాజ్యంలో పటిష్టమైన ప్రభుత్వంను రూపొందిచలేక పోయాడు.

విశాల హృదయం, ఉదారబుద్ధి ఉన్నవాడు. ముస్లిం విద్యలన్నా కళలన్నా అతనికి విపరీతమైన అభిమానం. అనేక మంది కవులను పండితులను పోషించాడు. పండితులు అతనిని 'లక్‌బ' అని (అక్షర లక్షలిచ్చే వాడని) కీర్తించారు.

ఢిల్లీలో కువ్వత్ ఉల్ ఇస్లామ్ (The Might of Islam) మసీదును, అజ్మీర్‌లో అర్హదిన్ కాంజోంప్రా మసీదును నిర్మించాడు. భారత భూమిపై ఇస్లామ్ విజయానికి చిహ్నంగా కుతుబ్ మీనార్‌కు పునాదులు వేశారు. చాలామంది మహమ్మదీయ రాజుల వలెనే ఇతడు కూడా పరమత ద్వేషి.

## 22.4. ఆరామ్‌షా (1210 - 11)

కుతుబ్ ఉద్దీన్ మరణించటంతో ఢీల్లీలోని తురుష్క సర్దారులు ఆరామ్‌షాను సింహాసనం ఎక్కించారు. ఐబక్, ఆరామ్‌షాల మధ్యఉన్న సంబంధమేమీ స్పష్టంగా తెలియదు. కొందరు మాత్రం తండ్రి కొడుకులని చెపుతున్నారు. ఆరామ్‌షా సమర్థుడు కానందువల్ల సర్దారులు బడయున్ రాష్ట్ర పాలకుడుగా ఉన్న ఇల్ టుట్‌మిష్‌ను ఆహ్వానించారు. ఆరామ్‌షా ఓడిపోయాడు. ఇల్‌టుట్ మిష్ ఢీల్లీ సింహాసనాన్ని అధిష్టించాడు.

## 22.5 ఇల్ టూట్ మిష్ (1211-36) (Iltutmish) :

ఇల్‌టూట్‌మిష్ తురుష్కులలో ఇల్బారీ (Ilbari) తెగకు చెందినవాడు. మంచి తెలివి తేటలు కలవాడు, సుర్వర రూపి అయినందువల్ల సోదరులే అసూయచెంది ఇతనిని బానిసగా అమ్మివేశారు. వర్తకుల నుండి బానిసవెల చెల్లించి కుతుబ్‌ఉద్దీన్ ఐబక్ ఇతనిని కొనుక్కొన్నాడు. క్రమంగా ఇల్‌టూట్‌మిష్ శక్తిసామర్ధ్యాలకు ఉద్దీన్ సంతసించి తన కుమార్తెను ఇచ్చి వివాహం చేసి బడయాన్ రాష్ట్ర పాలకునిగా నియమించాడు.

ఇల్‌టూట్‌మిష్ నందలి ప్రతిబను, గొప్పతనంను గుర్తించి సర్దారులు అతనిని ఢీల్లీ సుల్తాన్‌గా ఎన్నుకొన్నారు.

**ఎ) ఇల్ టూట్‌మిష్ ఎదుర్కొన వలసిన సమస్యలు :** భారతేదశంలో ఇల్ టూట్‌మిష్ అధిష్టించిన సింహాసనం పూలపాన్పు కాదు. అనేక తీవ్ర ప్రమాదకర సమస్యలు అతనిని చుట్టుముట్టాయి. నిరుత్సాహం చెందక అత్యంత ధైర్య సాహసాలతో సమస్యలను ఎదుర్కోని అధిగమించ కల్గెను. ఎదరించిన అమీరులను ఓడించాడు. తన అధికారాన్ని సుస్థిరపరచుకున్నాడు. ఈల్డజ్ నుండి స్వేచ్ఛ పత్రాన్ని కూడా సంపాదించాడు.

**బి) ఈల్డజ్ (Yildiz)** తాజుద్దీన్ ఈల్డజ్‌ను శక్త్వంతుడైన ఇల్‌టూట్‌మిష్ 1214లో 'టరాయిన్' (Tarain) యుద్దంలో ఓడించాడు. బందీగా ఈల్డజ్‌ను బడయూన్ కోటకు తరలించి, అచ్చటనే అతనిని చంపివేశాడు.

పి) కుబాచా : (Qubacha) నాసరుద్దీన్ కుబాచాపై కూడా ఇల్ టూట్‌మిష్ విజయం సాధించాడు. కుబాచాపై ఇల్ టూట్‌మిష్ యుద్ధం ప్రకటించి , పంజాబ్ నుండి తరిమివేశాడు, కుబాచా అధికారం పూర్తిగా నాశనం కాలేదు. మరి కొంతకాలం స్వతంత్రుడుగానే ఉన్నాడు. తిరిగి 1227లో ఇల్ టూట్‌మిష్ కుబాచాపై దండెత్తి 'ఉచ్'ను ఆక్రమించాడు. దానితో దిక్కుతోచని కుబాచా ఇల్ టూట్‌మిష్‌తో సంధికి అంగీకరించాడు. తన కొడుకు బహరామ్‌ను ఇల్ టూట్‌మిష్‌తో సంధికి పంపగా, ఇల్ టూట్‌మిష్ బహరామ్‌ను బంధించి కుబాచాపై సైన్యాలను నడిపాడు, కుబాచా భక్కర్ నుండి పారిపోయి ప్రయత్నంలో అతనిని సింధునదిలో ముంచివేయడం జరిగింది.

డి) బెంగాల్ : ఆలీ మర్దాన్‌ఖాన్ మరణానంతరము బెంగాల్ నందు హిసాముద్దీన్ ఐవాజ్ ఖిల్జీ స్వతంత్రుడయ్యాడు. ఇల్ టూట్‌మిష్ కుమారుడు ఐవాజుఖిల్జీ తిరుగుబాటు నణచి, అతనిని వధించి బెంగాల్ నాక్రమించాడు. తదుపరి సింహాసన మధిష్టించిన బల్కా ఖిల్జీ 'లక్నోతి' (Lakhnati) నందు తిరుగుబాటు చేశాడు. ఈసారి ఇల్‌టూట్‌మిష్ తానే స్వయంగా వెళ్లి బాల్కాఖిల్జీని వధించి, బెంగాల్ బీహారులను ఆక్రమించాడు.

ఇ) మంగోలులు : ఇల్ టూట్‌మిష్ కాలంలో ఢిల్లీ సామ్రాజ్యానికి మంగోలుల దాడి ప్రమాదం ఉండేది. 1221లో మొదటి సారిగా భారతదేశ సరిహద్దుల్లో మంగోలులు ప్రవేశించారు. మధ్య ఆసియాలో క్రూరస్వభావులైన మంగోలులు చెంగిజ్‌ఖాన్ నాయత్వాన మధ్య పశ్చిమ ఆసియా ప్రాంత రాజ్యలను జయించి 1221లో క్వారిజామ్‌ను ముట్టడించారు. క్వారిజామ్ పాలకుడు మనబార్‌నీ ఇల్ టూట్‌మిష్ సహాయం కోరాడు. అయితే మనబార్ నీకు సహాయం చేస్తే మంగోలులను భారతదేశానికి ఆహ్వానించినట్లు అవుతుంది అని గ్రహించిన ఇల్ టూట్‌మిష్ సహాయం చేయుటకు నిరాకరించాడు. ఆశాభంగంతో మనబారనీ పరిష్యాకు పారిపోయాడు. మార్గమధ్యంలో కుబాచాను ఓడించి సింధు ప్రాంతాన్ని కొల్లగొట్టాడు. భారతదేశంలో వేడి భరించలేక మంగోలులు తమ సైన్యంతో వెనుకకు వెళ్లిపోయారు. ఇల్ టూట్‌మిష్ రాజనీతి వలన భారతదేశానికి మంగోలుల ప్రమాదం తప్పింది.

ఎఫ్) రాజపుత్రులు : కుతుబ్ ఉద్దీన్ ఐబక్ మరణానంతరం స్వతంత్రులైన రాజపుత్ర రాజ్యంలను తిరిగి ఆక్రమించదలచి ఇల్ టూట్‌మిష్ రణతంభోర్, మాన్‌డోర్, గ్వాలియరులను ఆక్రమించాడు. కాని చాందేలులు, సోలంకీలు, గుజరాత్ మొదలగు రాజ్యపుత్రుల చేతిలో పరాజయం పొందాడు.

అటులనే కనూజ్, బెనారస్ రాజ్యంలపై అతని ఆదిపత్యం ఎక్కువ కాలం కొనసాగలేదు. తుదకు బనియన్ రాజపుత్రులను జయించు యత్నంలో అతడు క్రీ.శ. 1236లో మరణించాడు.

బానిస వంశ రాజులలో ఇల్ టూట్‌మిష్ అగ్రగణ్యుడు. సైనిక యోధుడు, రాజనీతి ధురంధరుడు. బాల్య దశలో నున్న ఢిల్లీ ముస్లీమ్ రాజ్యాన్ని శత్రువుల భారి నుండి కాపాడి సుస్థిరం చేశాడు. ఢిల్లీరాజ్యానికి గల శత్రువులను గుర్తించి సైనిక బలాన్ని అభివృద్ధి పరిచాడు. ఢిల్లీ సమీపంలో కుతుబ్‌ఉద్దీన్ ఐబక్‌చే పునాదులు వేయబడిన కుతుబ్ మీనార్ నిర్మాణం ఇతడు పూర్తి చేశాడు.

ఇల్ టూట్ మిష్ విద్యాభివృద్ధికి శ్రద్ధ వహించాడు. ఢిల్లీని గొప్ప విద్యా కేంద్రంగా రూపొందించి, ఢిల్లీని రెండవ బాగ్దాదుగా పేర్కొనడం జరిగింది. ఢిల్లీ సుల్తానుల పరిపాలనా విధానానికి ప్రారంభం చేశాడు. స్వతంత్రంగా అరబ్ నాణాలనుముద్రించడం ఇతని కాలంలోనే ప్రారంభం అయింది. వెండి, రాగి, జిటాల్, మొదలగు లోహాలు అమలులోనికి వచ్చాయి. ఈవిధంగా తురుష్కాధికారాన్ని భారత దేవంలో సుస్థిరం చేసినందువల్ల ఇల్ టూట్ మిష్‌కు ఖలీఫా 'నాజర్ అమీర్ ఉల్‌ముమినిన్' (Aid of the Commandy of the Faithful) అనే బిరుదును ఇచ్చారు. ఇల్‌టూట్‌మిష్ కూడా పరమత సహనం పాటింపలేదు.

## 22.6 రుక్‌న ఉద్దీన్ ఫిరోజ్‌షా : (1236) (Rukn -ud -din -Firozshah)

ఇల్ టూట్‌మిష్ తన కుమారులు సమర్థులు కారని గుర్తించిన అనంతరం, తన కుమార్తె రజియాను సుల్తాన్ చేయవలసిందిగా సర్దారులను కోరాడు. కాని అహంకార పూరితులైన అమీరులు ఒక స్త్రీ తమపై అధికారం చెలాయించటం ఇష్టం లేక ఇల్ టూట్‌మిష్ మరణించిన తరువాత అతని పెద్ద కుమారుడైన రుక్న్ ఉ్ న్ ఫిరోషాను సింహాసన మధిష్టింపచేశారు. ఫిరోషా భోగలాలసుడు, వ్యసనపరుడు,

అయి పరిపాలనకు పూర్తి సమర్థుడని నిరూపించుకొన్నాడు. పరిపాలనా వ్యవహారమంతా అతని తల్లి షాతుర్ఖాన నిర్వహించారు. షాతుర్ఖాన్‌కు వ్యతిరేకంగా జరిగిన కుట్రలో ఆమెయు రుక్‌ఉద్దీన్ మరణించారు. ఇటువంటి పరిస్థితులలో ఢిల్లీ సింహాసనంను రజియా అధిష్టించింది.

## 22.7 సుల్తాన్ రజియా (1236 - 40)

ఢిల్లీ సింహాసనాన్ని అధిష్టించిన ఏకైక మహారాణి సుల్తానా రజియా. ధైర్య సాహసాలు, సమర్ధవంతమైన పరిపాలనా దక్షత, విధ్యాబుద్ధులు గల్గి పురుషవేషం ధరించి రాజ్య కార్యాలు నిర్వహించేదని 'మిన్‌రాజ్ ఉద్దీన్' వంటి సమకాలిక చరిత్ర కారులు పేర్కొన్నారు.

ఇల్ టూట్‌మిష్ కాలంలో బానిసలుగా చేరి అమీరులైన తురుష్కులు నలభై మంది చిహల్‌గని అనే కూటమిగా ఏర్పడి సుల్తానా రజియా అధికారంను కూలద్రోయుటకు ప్రయత్నించారు. రజియా వీరిని ఎదిరించి స్వతంత్రంగా పరిపాలన చేసి చిహల్‌గనీని నిర్మూలించాలని తలచింది. అదే సమయంలో తురుష్క, తురుష్కేతర ముస్లింల మధ్య విభేదాలు తీవ్రరూపం పొందాయి. ఈ విభేదాలు మంచి అవకాశంగా భావించి రజియా తురుష్కులు కాని ముస్లింలను ఉన్నత పదవులలో నియమించింది. మాలిక్‌యాకుత్ అనే అబిసీనియా ముస్లిమ్‌ను అశ్వశాలాధిపతిగా నియమించింది. దీనితో తురుష్క సర్దారులు రెచ్చిపోయారు. లాహోర్, భటిండా రాష్ట్రపాలకులు తిరుగుబాటు చేశారు. వీరి మధ్య విబేదాలు సృష్టించి ఓడించ తలచి భటిండా పాలకుడైన 'ఆల్‌తునియా' ను వివాహమాడింది. అతని సహాయంతో పెద్ద సైన్యంతో ఢిల్లీకి చేరే మార్గంలో అమీరుల చేతిలో రజియా, అల్‌తునియాలు ఇరువుమరణించారు.

## 22.8. జహరాంషా (1240 - 42)

రజియా ఢిల్లీ నుంచి నిర్గమించడంతో రాజధానిలో అధికారం 'చిహల్‌గనీ' హస్తగతమయినది. వారు ఇల్ టూట్‌మిష్ మూడవ కుమారుడైన జహరామ్‌షాను రజియాకు వారసుడుగా ఢిల్లీ సింహాసన మధిష్టింప చేశారు. జహరాంషా సమర్ధుడు కాదు. అయినప్పటికీ చిహల్ గనీ నిరంకుశత్వాన్ని సహించలేక తురుష్క నాయకులను రహస్యంగా చంపించడానికి ప్రయత్నించాడు. కాని ఢిల్లీ అమీరులు కుట్రపన్ని జహరామ్‌షాను అంతమొందించారు.

## 22.9. మసూద్ షా : (1242 - 45)

జహరాంషా మరణం తరువాత చిహల్‌గనీ అధికారానికి తిరుగులేక పోయింది. వారు మసూద్‌షాను సింహాసనం అధిష్టింప చేశారు. అయితే ఇదే సమయంలో అమీరులలో అధికారం కొరకు తగాదాలు ప్రారంభమైనవి. చివరకు చిహల్‌గనీ నాయకుడైన "ఘియాస్ ఉద్దీన్ బాల్బన్' మసూద్‌షాను తొలగించి నాసరుద్దీన్‌ను సింహాసన మెక్కించాడు.

## 22.10. నాసర్ ఉద్దీన్ మొహమ్మద్ (1245 - 65)

నాసర్ ఉద్దీన్ ఇల్ టూట్‌మిష్ మనుమడు సింహాసనం ఎక్కే నాటికే అరవై సంవత్సరాలు నిండినవాడు. అతనిలో దైవ చింతన హెచ్చు. నిరాడంబర జీవితం గడిపాడు. కొరాన్ ప్రతులను రాసి అమ్మగా వచ్చిన డబ్బుతో తన కుటుంబ పోషణచేసుకొనేవాడు. పండిత గోష్టిలో కాలం గడిపేవాడు.

నాసర్ ఉద్దీన్ అధికారానికి రావడం తురుష్క అమీరుల చర్యయే కనుక ఇతని పరిపాలనలో అధికారం పూర్తిగా తురుష్క అమీరుల పరమైనది. వారిలో ముఖ్యుడైన బాల్బన్ సర్వాధికారి అయ్యాడు. కేవలం నామ మాత్రంగా నాసరుద్దీన్ సుల్తానుగా 20 సం.లు ఉండ గలిగాడు.

బాల్బన్ ప్రధాని, సుల్తానుప్రతినిధిగా నాసర్ ఉద్దీన్‌కు మామగా తన అధికార హోదాను పెంచుకొన్నాడు. బాల్బన్ ప్రభుత్వానుభవం కల్గి ప్రభుత్వాన్ని సుస్థిరపరచి తిరుగుబాటు దారులైన హిందూ జమిందారులను, అదుపులోనికి తెచ్చాడు. ఢిల్లీ చుట్టుపట్ల ఉన్న అడవులలో స్థావరమేర్పరచుకొని దారిదోపిడీలు చేస్తు, అశాంతిని సృష్టించుచున్న "మీ వాటీలు" అనే దొంగల గుంపులను నిర్మూలించాడు. ఈ చర్యల వలన బాల్బన్ గౌరవ ప్రతిష్టలు ఇనుమడించాయి. కాని సరారులు అసూయతో 'ఇమాద్ ఉద్దీన్ రేహాన్' నాయకత్వంలో ఒక

ముఠాగా ఏర్పడి బాల్బన్ పై సుల్తాన్‌కు చాడీలు చెప్పారు. దీనితో బాల్బన్ (1253) లో పదవి నుండి తొలగించబడ్డాడు. కాని హిందూస్థానీ సర్దార్ ప్రభుత్వాధిపత్యం వహించడం తురుష్క సర్దారులకు కంటకమైయింది. తిరిగి వారి కోరిక ప్రకారమే 'సుల్తాన్ రేహాన్'ను పదవి నుండి తొలగించి 1254లో బాల్బన్‌ను తిరిగి మంత్రిగా నియమించారు.

ప్రధానిగా తిరిగి నెలకొన్న తరువాత బాల్బన్ హులగు నాయకత్వంలో వచ్చిన మాంగోల్ దండయాత్రలను తిప్పి కొట్టడమే గాక తిరుగుబాట్లు చేసిన రణతంభోర్, రసపుత్రుల నణిచి దేశంలో శాంతి నెలకొల్పాడు. తన అనంతరం బాల్బన్‌నే ఢిల్లీ సుల్తాన్‌గా ప్రకటించి 1266లో నాసర్ ఉద్దీన్ మరణించాడు.

## 22.11 ఘియాస్ ఉద్దీన్ బాల్బన్ : (1266 - 87)

బాల్బన్ 1266లో ఢిల్లీ సింహాసన మదిష్టించాడు. ఇతడు తురుష్కులలో 'ఇల్బారీ' (Ilbari) తెగుకు చెందినవాడు. ఇతని అసలు పేరు. 'బహ ఉద్దీన్' బాల్బన్ తండ్రి మధ్య ఆసియాలో చిన్న సంస్థానాధీశుడు. చిన్నతనంలో బాల్బన్‌ను మంగోలులు ఎత్తుకొని పోయి బస్రాలోని క్వాజా జమాల్ ఉద్దీన్‌కు బానిసగా అమ్మి వేసిన తరువాత బాల్బన్ 1232 నాటికి ఇల్ టూట్‌మిష్ కొలువులో చేరి క్రమంగా 'చిహల్ గనీ'లో సభ్యుడయ్యాడు. రజియా కాలంలో మృగయా దళాధికారిగా ఆమెను వ్యతిరేకించి బహరాంషాను సింహాసనం ఎక్కించటంలో బాల్బన్ ప్రముఖ పాత్ర వహించాడు. అదుకు కృతజ్ఞతతో బాల్బన్‌కు రీవారీ, హాన్సీ జాంగీరుల నిచ్చి బహరాం గౌరవించాడు. క్రమంగా 'చిహాల్ గనీ' నాయకత్వం వహించి 'ఉల్గూఖాన్' బిరుదం పొంది నాసర్ ఉద్దీన్‌కు ప్రధాని వ్రజీర్, ప్రతినిధి (నాయబ్) అయ్యాడు. నాసర్ ఉద్దీన్ కాంలో సర్వాధికారియైన పరిపాలన నిర్వహించాడు. సుల్తానుకు తన కుమార్తె నిచ్చి వివాహంచేయడం ద్వారా తన అధికారాన్ని మరింత సుస్థిర పరచుకొన్నాడు. పరిపాలనలో విశేషానుభవం గడించాడు.

నాసర్ ఉద్దీన్ మహమ్మద్ మరణానంతరం క్రీ.శ. 1266లో బాల్బన్ సర్వాధికారిగా సింహాసన మదిష్టించి "ఘియాజ్ ఉద్దీన్ బాల్బన్" అను బిరుదు స్వీకరించాడు.

**22.11.1 బాల్బన్ సుల్తాన్ అయినప్పుడు దేశ పరిస్థితులు :** బాల్బన్ సింహాసన మదిష్టించినప్పుడు ఢిల్లీ రాజ్యం అనేక సమస్యలకు లోనై క్లిష్టదశ యందుండెను. ఇల్ టూట్‌మిష్ మరణానంతరం జరిగిన సంఘర్షణ వల్ల సర్దారులలో సుల్తాన్ పట్ల భయగౌరవాలు క్షీణించాయి. స్వార్థం ద్రోహచింత, అధికార కాంక్ష మితిమీరాయి. ఖజానా వట్టిపోయింది. రాష్ట్రపాలకులు కట్టుబాట్లు లేకుండా వ్యవహరిస్తుండేవారు. మేవాడ్, రోహిత్ ఖండ్‌లోని రసపుత్రులు స్వతంత్రులుగావడానికి ప్రయత్నిస్తూ ఉండేవారు. ఢిల్లీ పరిసరాలలోని 'మియో'ల దోపిడీలతో రవాణా సౌకర్యాలకు అంతరాయం కలిగి దేశీయ వాణిజ్యం స్తంభించిపోయింది. ఈ ఆంతరంగిక అరాచకానికి తోడు మంగోల్ దాడులు ఆందోళనకరంగా పరిణమించాయి.

**22.11.2 చిహల్‌గనీ నిర్మూలన :** చిహల్‌గనీ కార్యకలాపాలలో స్వయంగా అనుభవం ఉన్నవాడైనందు వల్ల ఆ సంస్థ సుల్తాన్ అధికారానికి బెడదగా పరిణమించిదని గ్రహించి దానిని నిర్మూలించడానికి బాల్బన్ నిర్ణయించాడు. సర్దారుల, రాష్ట్రపాలకుల, ఇతర ఉద్యోగుల చర్యలను కనిపెట్టి తనకు నివేదించుటకు ప్రత్యేక గూఢచారులను నియమించాడు. ఈ గూఢచారుల ద్వారా అత్యంత సమర్థవంతంగా చిహల్‌గనీ వర్గంను నిర్మూలించాడు.

**22.11.3 సైనిక సంస్కరణలు :** బాల్బన్ తన సైన్యాన్ని 'ఉముద్ ఉల్‌ముక్' ఆధీనంలో ఉంచాడు. ఇతడు చురుకైన సమర్థుడైన అధికారి. సైనికులను చేర్చుకొనుటలో, వారికి ఆయుధాలను సమకూర్చుటలో జీతాల చెల్లింపులో ప్రత్యేక శ్రద్ధ వహించడం జరిగింది. క్రమశిక్షణ, నిజాయితీ, ప్రత్యేకంగా గమనించబడింది. సమర్థవంతమైన సైన్యంను పోషించారు. ఇటువంటి సమర్థవంతమైన సైన్యం ద్వారా దేశంలో శాంతి భద్రతలు చేకూర్చెను. దారిదోపిడి దొంగలకు 'మియో' అను శక్తివంతమైన సైన్యం ద్వారా నిర్మూలించారు. గంగా యమున, అంతర్వేదిలోను మిగిలిన ప్రాంతాలలోను రాజపుత్ర తిరుగుబాట్లు నణచి శాంతి స్థాపించాడు. ముఖ్యప్రాంతాలలో సైనిక స్థావరాలేర్పరచి శాంతి భద్రతల సుస్థిరతకు శ్రద్ధ వహించాడు. దేశ ఆర్థికాభివృద్ధికి కృషిచేశాడు.

**22.11.4 టుగ్రిల్ తిరుగుబాటు :** బాల్బన్ కాలంలో జరిగిన తిరుగుబాట్లన్నింటిలో బెంగాల్ పాలకుడైన టుగ్రిల్ ఖాన్ 1279లో జరిపిన తిరుగుబాటు ప్రబలమైయ్యింది. టుగ్రిల్, సులాన్ బిరుదు దరి[illegible] నాణేలు ముద్రించినారు. అయోధ్య నవాబు

అయిన అమీర్‌ఖాన్ సేనాపతిగా బాల్బన్ తన పైకి పంపిన ఢీల్లీ సైన్యాన్ని ఓడించి తరిమి వేశాడు. బాల్బన్ ఆగ్రహావేశంతో పరాజయ పొందిన నేరానికి అమీరుఖాన్‌ను ఉరితీయించాడు. అనంతరం స్వయంగా బెంగాల్ పైకి దాడిచేసి రాజధాని అయిన లక్నోతిని వశపరుచుకొని పారిపోయిన టుగ్రిల్‌ఖాన్‌ను, అతని అనుచరులను బంధించి అవిధేయులయిన అమీరులను అతిదారుణంగా చంపించాడు. బెంగాల్‌ను ఢీల్లీ సామ్రాజ్యంలో చేర్చి తన కొడుకైన బుగ్రాఖాన్‌ను పాలకునిగా నియమించాడు.

**22.11.5 రాజగౌరవాధికారంను పునరుద్ధరించుట :** సుల్తాన్ పట్ల, రాజరికం పట్ల ప్రజలకు ఉద్యోగులకున్న చులకన భావంను పూర్తిగా తొలగించి వారిలో సుల్తాను పట్ల భీతి, గౌరవంలు కల్గించి రాజరిక ఔన్నత్యంను, దర్పంను నెలకొల్పుటకు బాల్బన్ అనేక చర్యలు తీసుకొన్నాడు. ప్రజలలో 'రాజు దైవాంశ సంభూతుడు' అనుభావమును, రాజు హృదయం భగవదను గ్రహానికి స్థానమని చాటెను. అనేక పారశీక రాజమర్యాదలను తన ఆస్థానమందు ప్రవేశ పెట్టాడు. ముఖ్యంగా సాష్టాంగదండ ప్రణామం, సుల్తాన్ పాదాలను గాని, సింహాసనంను గానిముద్దుపెట్టుకొనుట, నారోజ్ పండుగ జరుపుట మొదలగునవి. రాజరికపు రాజసంను పెంపొందించుటకై ఎల్లవేళల చివరకు తన సేవలకు ఎదుట వారికి సైతం రాజదుస్తులలోనే కనిపించేవాడు. అటులనే సభాముఖంన పరిహసించుట, బాధపడుట, చేసేవాడుకాదు. సభలో ఏవ్వరు నవ్వినను సహించేవాడు కాదు. తన పెద్ద కుమారుడు చనిపోయినప్పుడు సైతం సభాముఖంన తన బాధను వ్యక్తపరచలేదు.

**22.11.6 మంగోలుల దాడులు :** మంగోలు దండయాత్రలు బాల్బన్ కాలంలో ఒక ప్రధాన సమస్యగా తయారయి లాహోరు మంగోలుల ప్రధాన ముట్టడి ప్రాంతంగా మారింది. బాల్బన్ ఈ ప్రాంతాలలో కోటలను నిర్మించి వాటిని ఆఫ్ఘన్ సైనికులతో నింపి బలమైన స్థావరాలు గా తయారు చేయుటకు నిశ్చయించినాడు. కొంతకాలం వరకు భటిండా, భట్నాయిర్, సమానా, సునీమ్ దుర్గాలను బాల్బన్ దాయాది షేర్‌ఖాన్ పాలిస్తుండేవాడు. షేర్‌ఖాన్ సమర్థుడయినందువల్ల మంగోలులకు హడలుగా ఉండేది. అయితే వాయువ్య సరిహద్దులకు రక్షకునిగా ఉన్న అతనిని చంపించడం బాల్బన్ తప్పిదాలలో ఒకటి. షేర్‌ఖాన్ మరణంతో తిరిగి మంగోలులు రెచ్చిపోయ్యారు. బాల్బన్ ఈ ప్రాంతాలను రెండు భాగాలుగా వేరుచేసి 'సునామ్' 'సమీనాలను' తన రెండవ కుమారుడు, బుఘరగాఖాన్‌కు, ముల్తాన్, సింధు, లాహోర్ ప్రాంతాలను తన పెద్దకుమారుడు 'మహమ్మద్‌ఖాన్'కు అప్పగించాడు. మహమ్మద్ ఖాన్ సర్దుడైన సైనిక యోధుడు. పరిపాలన దక్షుడు. పైగా మంచి విద్యావంతుడు. ఇతని కొలువులో 'ఆమీర్ ఖుస్రూ' 'అమీర్ హాసన్' వంటి ప్రసిద్ధ కవులు తమ రచనలు కొనసాగించారు. మంగోలుల దాడులను నివారించుటకు అనేక చర్యలు తీసుకొన్నాడు. కానీ మంగోలులు ఎగువ పంజాబును ధ్వంసం చేసి సట్లజ్ నదిని దాట కల్గినారు. మహమ్మద్ ఖాన్, బుగ్రాఖన్‌లు పంపిన సైన్యం మంగోలులను తరిమి కొట్టారు. కాని తిరిగి మంగోలులు 1286లో భారతదేవం ప్రవేశించి మహమ్మద్ ఖాన్‌ను చపివేశారు. మహమ్మద్ రాజకుమారుని మరణవార్త బాల్బన్‌ను కృంగదీశాయి. మహమ్మద్ మృతికి దేశంలో దుఃఖించని వారు లేరు, దేశ రక్షణకై ప్రాణాలర్పించిన అతనిని ప్రజలు 'షహీద్' (Martyr) అని శ్లాఘించారు.

**22.11.7 బాల్బన్ మరణం:** మొహమ్మద్ మరణ వార్త వృద్ధుడయిన సుల్తాన్ బాల్బన్‌కె పిడుగుపాటయింది. అయినప్పటికి రాజతీవి విరుద్ధంగా సర్దారుల ముందుగాని, కొలువులోగాని బాధపడ్డలేదు. తనకు మరణమాసన్న మయినదని గ్రహించి తన రెండః కుమారుని బుగ్రాఖాన్‌ను వారసునిగా చేయుటకు నిశ్చయించుకొన్నాడు. కాని బాధ్యతారహితుడై బుగ్రాఖాన్ తండ్రి శిక్షణకు భయపడ్డాడు అతడు లక్నోకి వెళ్ళిపొయ్యాడు. అట్టి పరిస్థితులలో బాల్బన్ తన పెద్దకుమారుడు మహమ్మద్‌కాన్ కుమారుడు 'ఖుస్రూను' తన వారసునిగ ప్రకటించి కొద్ది కాలానికి 1287లో మరణించాడు.

పుట్టింది ప్రభు కులంలోనే అయినా బానిసగా నీటికావళ్ళు మోస్తూ జీవితం ప్రారంభించిన బాల్బన్, బానిస వంశంలోనే గాక, ఢీ సుల్తానులలోని ప్రముఖులలో ఒకడయ్యాడు. కుతుబ్ ఉద్దీన్ ఐబక్, ఇల్ టూట్‌మిష్ కంటే కూడా ఢీల్లీ సుల్తానత్ బాల్బన్‌కు ఎక్కువగ రుణపడిందని చరిత్రకారుల అభిప్రాయం. సుమారు నలభై సంవత్సరాల కాలం సుల్తానత్ చరిత్రలో అతని కత్తికి ఎదురు లేక పోయింది బాల్బన్ యోధాగ్రేసరుడు రాజనీతి దురందరుడు, న్యాయబుద్ధి ఉన్న పాలనా దక్షుడు. సామాన్య ప్రజల కష్టసుఖాల పట్ల శ్రద్ధ వహించాడు చిహల్‌గనీ నిర్మూలించి, ప్రభుత్వంలో, సైన్యంలో క్రమశిక్షణ కలిఃపంచాడు. సుల్తాన్ అధికారాన్ని పటిష్టంచేసి, రాచరికానికి ఔన్నత్యము తీవి చేకూర్చాడు. పారశీక చక్రవర్తుల వలె కవులను, పండితులను పోషించాడు. ఇన్ని సుగుణాలు ఉన్నప్పటికి, అతని నిరంకుశ విధానా వలన ఢీల్లీ సుల్తానత్‌కు రెండు నష్టాలు కలిగాయి. సమతాభావానికి స్వస్తిచెప్పుట వలన ముస్లిమ్ ప్రభు - ఉద్యోగి వర్గం క్రమంగా

నిరసించింది. తురుష్క సర్దారులు అందరు నిహతులైనందు వలన బాల్బన్ ఆశయమైన తన వంశాన్ని ఢిల్లీలో సుప్రతిష్ఠితం చేయవలెననెడి కోరిక వమ్ముఅయింది.

## 22.12 బానిస వంశపతనం

బాల్బన్ ఆశలు అడియాసలై అతని మరణంతోనే బానిస వంశం పతనోన్ముఖమయ్యింది. తురుష్క అమీరుల ఢిల్లీ కొత్వాలు ఫకృద్దీన్ నాయకత్వములో ముఠాగా ఏర్పడి, బాల్బన్ తన వారసునిగా నియమించిన 'ఖుస్రూను' తొలగించి, 'బుగ్రాఖాన్' కుమారుడైన కైకుబాద్‌ను సింహాసన మధిష్ఠింప చేశారు. ఇతడు కూడా బాల్బన్ క్రమశిక్షణ లోపించబడినవాడే. కాని సింహాసన మధిష్ఠించిన తరువాత అతనిలో అణగి ఉన్న కోర్కెలు ఒక్కసారిగా విజృంభించి, భోగలాలసుడు, మధుపాన వ్యసనపరుడుగా తయారయ్యాడు. పరిపాలనను పూర్తిగా నిర్లక్ష్యం చేశాడు. ఫలితంగా తురుష్క, ఖిల్జీ జాతుల మధ్య అధికారం కొరకు కలహాలు ప్రారంభమయి, తురుష్క నాయకుడు నిజాముద్దీన్, అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడు. ఇతడు చివరకు ఖిల్జీ పక్షనాయకుడైన జలాలుద్దీన్ ఫిరోజ్‌చే వధింపబడ్డాడు తురుష్క సర్దారులు యిది సహించలేక కైకుబాద్ కుమారుడైన 'కయుమార్స్'ను సింహాసన మధిష్ఠింపచేశారు. కాని 1290లో జలాలుద్దీన్ ఖిల్జీ కయుమార్స్, కైకుబాద్‌లను అంతమొందించి ఢిల్లీ సింహాసనంను ఆక్రమించినాడు. అంతటితో బానిస వంశమంతరించింది.

I. ఈ క్రింది వ్యాసరూప ప్రశ్నలను వివరించండి. (Essay type Questions)

1. ఇల్ టూట్‌మిష్ పరిపాలన సుస్థిరపరచిన విధం తెల్పండి?
2. బానిస వంశంలో బాల్బన్ అగ్రగణ్యుడు అని ఎట్లు చెప్పగలవు?

II. ఈ క్రింది లఘు వ్యాసరూప ప్రశ్నలు వర్ణింపుము (Short Essay Questions)

1. కుతుబ్ ఉద్దీన్ ఐబక్
2. సుల్తానా రజియా
3. టుగ్రిల్ ఖాన్

III. ఈ క్రింది ప్రశ్నలకు సరైన సమాధానంను గుర్తించండి.

1. ఢిల్లీ సుల్తాన్ సామ్రాజ్య లేక బానిస వంశస్థాపకుడెవరు?
   ఎ) కుతుబ్ ఉద్దీన్ ఐబక్ బి) బాల్బన్ సి) ఇల్ టూట్‌మిష్ డి) మహమ్మద్ ఘోరీ
2. ఢిల్లీ వద్ద 'కుతుబ్ మినార్'కు పునాదులు వేసినవాడు?
   ఎ) బాల్బన్ బి) ఇల్ టూట్‌మిష్ సి) కుతుబ్ ఉద్దీన్ ఐబక్ డి) జహరామ్‌షా
3. సుల్తానా రజియా ఎవరి కుమార్తె?
   ఎ) బాల్బన్ బి) ఇల్ టూట్‌మిష్ సి) ఐబక్ డి) రుక్న్ ఉద్దీన్
4. చిహల్‌గనీ నిర్మూలించినవాడు
   ఎ) బాల్బన్ బి) రజియా సి) ఐబక్ డి) ఇల్ టూట్‌మిష్

**Reference Books :**


1. Delhi sultanate : Bharatiya Vidhya Bhavan
2. A short History of Muslim Rule in India : Iswari Prasad
3. Mushlim rule in India : V.D. Mahajan
4. Indian History & Culture. II : B.S.L. Hanumantha Rao
   K. Baseverswara Rao.

పాఠం - 23

# ఖిల్జీవంశం (క్రీ.శ. 1290 - 1320)

## 23.1 లక్ష్యం

ఖిల్జీవంశీయుల అధికార స్థాపన, విస్తరణ, పతనం గురించి సామాన్యంగా, అల్లాఉద్దీన్ ఖిల్జీ విజయాలను, విధానాలను గూర్చి ప్రత్యేకంగా, వివరించటమే ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

23.2 ఆధారాలు

23.3 జలాలుద్దీన్ ఫిరోజ్ ఖిల్జీ

23.4 అల్లా ఉద్దీన్ ఖిల్జీ

23.5 ఖిల్జీల పతనమునకు కారణాలు

23.6 సారాంశము

## 3.2 ఖిల్జీవంశ చరిత్ర పతనమునకు గల ఆధారాలు :

జియాఉద్దీన్ బరానీ రచించిన "తారీఖ్ - ఇ - ఫిరోజ్, ఈ రచన క్రీ.శ. 1359లో ముగిసింది. ఇది బాల్బన్ పాలనాకాలంతో ప్రారంభమయి ఫిరోజ్‌షా తుగ్లక్ ఆరవ పాలనా సంవత్సరంతో ముగుస్తుంది. ఖిల్జీల చరిత్రకిది అత్యంత విలువైన ఆధారం

. అమీర్ ఖుస్రూగా ప్రసిద్ధి చెందిన అబుల్‌హసన్ రచనలు

౧. "ఖజానుల్ ఫుతూహ్" - ఇది అల్లాఉద్దీన్ విజయాలను వర్ణిస్తుంది.

౨. "మిఫ్‌తాహుల్ ఫుతూహ్" జలాలుద్దీన్ ఖిల్జీ విజయాలను వివరిస్తుంది.

౩. "నొసిఫేర్" ముబారక్ సా ఖిల్జీ విజయాలను తెలుపుతుంది.

ఈ. "తుగ్లక్‌నామా" అల్లఉద్దీన్ కుమారుల విషాదాంతాన్ని వర్ణిస్తుంది.

3. ఖజ్యా అబ్దుల్లా మాలిక్ ఇసామీ రచించిన "ఫుతూహీ సలాతిన్" ఘజనీమహమ్మద్ కాలం నుండి మహమ్మద్ బీన్ తుగ్లక్ వరకు గల చరిత్రను వివరిస్తుంది.

### 23.2.1 విదేశీ రచనలు :

4. ఇబిన్‌బతూతా ఆఫ్రికా నుండి భారతదేశము సందర్శించుటకు వచ్చిన యాత్రికుడు. ఇతడు తన "రహ్లా"లో అల్లా ఉద్దీన్ కాలం నాటి విశేషాలు గ్రంధస్థం చేశాడు.

5. అబ్దుల్లాబీన్ ఫజ్‌లుల్లావసాఫ్ పర్షియా దేశస్థుడు. ఇతడు తాను రచించిన "తారీఖ్-ఇ-వసాఫ్" అను గ్రంథంలో అల్లా ఉద్దీన్ కాలంలో జరిగిన మంగోలుల దండయాత్రలను గురించి, అతని అవసాన దశను గుర్తించి విపులంగా వర్ణించాడు. అల్లాఉద్దీన్ ఆస్థానమును సందర్శించి[illegible] రాయబారమును గూర్చి తెలిపే రచన ఇదొక్కటే.

6. పారశీ[illegible]ైన రషీదుద్దీన్‌చే రచింపబడిన "జమత్‌తారీఖ్" గూడా మంగోలుల దండయాత్రలను వర్ణిస్తుంది.

## 23.3 జలాలుద్దీన్ ఫిరోజ్ ఖిల్జీ (క్రీ.శ. 1290 - 1296)

**23.3.1. తొలి జీవితం :** ఖిల్జీవంశమునకు మూలపురుషుడు మాలిక్ ఫిరోజ్ ఖిల్జీ. ఇతడు బాల్బన్ కాలమున భారతదేశమునకు వచ్చి అతని కొలువులో ఉద్యోగిగా చేరాడు. పదవులు నిర్వహించిన తరువాత సైనిక వ్యవహారాల మంత్రి అయ్యాడు. తదుపరి అసమర్థుడు, భోగలాలసుడు అయిన కైకుబాద్‌ను, పసివాడగు అతని కుమారుడు కాయుమార్స్‌ను కడతేర్చి బానిస వంశీయుల పాలనకు అంతమొందించి క్రీ.శ. 1290 జూన్ నెలలో ఢిల్లీ సుల్తాన్‌గా ప్రకటించుకొని ఖిల్జీ వంశపాలనకు అంకురార్పణ చేశాడు.

**23.3.2. పట్టాభి షిక్తుడగుట :** మాలిక్ ఫిరోజ్ ఆఫ్ఘన్ జాతీయుడని అపోహపడిన ఢిల్లీసర్దారులు అతనికి వ్యతిరేకంగా కుట్రలు పన్నసాగినారు. ఆ కుట్రలకు జంకిన ఫిరోజ్ ఖిల్జీ తురుష్కులు ప్రబలంగా వున్న ఢీల్లీ ప్రవేశించక ఆ నగర సమీపములోని కిలోఘరీ వద్ద క్రీ.శ. 1290లో "జలాలుద్దీన్ ఫిరోజ్ ఖిల్జీ" అను బిరుదుతో ఢిల్లీ సుల్తాన్ గా పట్టాభిషిక్తుడయ్యాడు.

సింహాసనమునకు వచ్చునాటికి జలాలుద్దీన్ డెబ్బది సంవత్సరాల వృద్ధుడు. సౌమ్యస్వభావము, ఉదార ఆశయాలు, బంధుప్రీతి కలవాడు. యుద్ధ నిర్వహణలో ఆరితేరిన వాడు. ఆయన శాంతి కాముక విధానాలనే అనుసరించినాడు. అల్లాఉద్దీన్, అల్మాస్ బేగ్‌లను ఉన్నత పదవులలో నియమించి తన అధికారాన్ని పదిలపర్చుకున్నాడు.

### 23.3.3 ఆంతరంగిక విధానం :

**23.3.1 మాలిక్ చజ్జా తిరుగుబాటు (క్రీ.శ. 1290) :** కారాపాలకుడైన మాలిక్ చజ్జా జలాలుద్దీన్ సౌమ్యస్వభావమును బలహీనతగా నెంచిన చజ్జా క్రీ.శ. 1290లో తిరుగుబాటు చేసి బందీ అయినాడు. కానీ మృదుస్వభావియైన జలాల్ చజ్జాను సగౌరవంగా విడుదల చేశాడు.

**23.3.2 థగ్గులు :** థగ్గులు దారిదోపిడి దొంగలు. వారి దోపిడీ వలన గంగా, యుమునా అంతర్వేదీలో శాంతి భద్రతలు క్షీణించాయి. అందువలన జలాల్ వారిపై దాడులు జరిపించి వేయికి పైగా థగ్గులను నిర్బంధించి వారిని బెంగాలు పరిసరములలో విడిచిపెట్టించాడు. శిక్షార్హులైన దొంగలను యిట్లు వదలుట అతని దుర్బల విధానానికి మరొక నిదర్శనం.

**23.3.3 సిద్దీమౌలావధ :** సౌమ్యుడైన జలాల్ సిద్దీమౌలా విషయంలో నిర్దాక్షిణ్యంగా వ్యవహరించాడు. సిద్దీమౌలా ఒక మతాధికారి. అతడు సుల్తాన్‌ను పదవీభ్రష్టునిగా చేయుటకు కుట్రలు పన్నుచున్నాడని తెలిసి జలాల్ సిద్దీమౌలాను రాజాస్థానమునకు రావించగా అర్కాలీఖాన్ అతనిని ఏనుగులచే త్రొక్కించి చంపాడు. ఈ సంఘటన జరిగిన కొద్దికాలానికే ఢీల్లీ పరిసరములలో కరువు కాటకములు వ్యాపించగా అవి సిద్దీమౌలా వధ ఫలితమేనని ప్రజలు విశ్వసించారు.

### విదేశాంగ విధానం :

**23.3.4. రాజపుత్ర రాజ్యములపై దండయాత్రలు (క్రీ.శ. 1290 - 92) :** చౌహాన్ రాజపుత్రులను అణచి వారి రాజ్యమును ఆక్రమించుటకై జలాల్ క్రీ.శ. 1290 లో రణతంభోర్ పై దాడిచేశాడు. కానీ దుర్గము వశము కాలేదు. సైనిక నష్టమ్మునకు వెరచిన సుల్తాన్ ఆ దండయాత్రను అర్థాంతరంగా ముగించి వెనుదిరిగాడు. తదుపరి మందవార్ దుర్గమును పట్టుకొని (క్రీ. శ. 1292) ఝైన్ మండలం ఆక్రమించాడు. ఈ దండయాత్రల సందర్భంగా జలాల్ అనేక హిందూదేవాలయాలను ధ్వంసం చేయించాడు.

**23.3.5. మంగోలుల దండయాత్ర (క్రీ.శ. 1292) :** గతంలో వలె జలాలుద్దీన్ కాలంలో గూడా మంగోలు భారతదేశంపై దండెత్తి వచ్చారు. 'హలాగు' మనుమడు అబ్దుల్లా నాయకత్వాన లక్షన్నర మంగోలు సైన్యం పంజాబులోనికి చొచ్చుకు వచ్చింది. అంతట సుల్తాన్ వారినోడించి తరిమివేశాడు. కానీ కొందరు మంగోలులు ఉల్లుఖాన్ నాయకత్వాన భారతదేశంలోనే స్థిరపడుటకు నిశ్చయించారు. జలాల్ వారికి ఆశ్రయమిచ్చుటయే గాక ఉల్లుఖాన్‌కు తన కుమార్తెనిచ్చి వివాహం చేశాడు. ఆ విధంగా భారతదేశంలో స్థిరపడిన మంగోలులు 'నయాముస్లిములు' గా ప్రసిద్ధికెక్కారు. క్రమేణా వారు ఉన్నత పదవులు పొంది ప్రత్యేకహక్కులు అనుభవిస్తూ ఢిల్లీ ప్రభుత్వానికి ప్రమాదకరంగా పరిణమించారు.

**23.3. 6. అల్లాఉద్దీన్ నిర్వహించిన దండయాత్రలు :** అల్లాఉద్దీన్ జలాల్ సోదరుని కుమారుడు. మాలిక్ చజ్జా తిరుగుబాటు తరువాత కారా గవర్నర్‌గా నియమింపబడ్డాడు. సుల్తాన్ కుటుంబంపై ద్వేషం పెంచుకున్న అల్లాఉద్దీన్ సింహాసనమాక్రమించుటకు ప్రయత్నములారంభించాడు. ఆ ప్రయత్నాల ఫలితమే మాళ్వ దేవగిరులపై జరిపిన దండయాత్రలు.

**23.3. 7. మాళ్వ దండయాత్ర (క్రీ.శ. 1292) :** సుల్తాన్ అనుమతితో అల్లాఉద్దీన్ క్రీ.శ. 1992లో మాళ్వపై దాడి జరిపి ఆక్రమించాడు. భిల్లా కొల్లగొట్టబడింది. అపారధనరాసులు అతని వశమయ్యాయి. ఈ విజయానికి సంతోషించిన జలాల్ అయోధ్య రాష్ట్రమునకు గూడా అల్లాఉద్దీన్‌ను పాలకునిగా నియమించాడు.

**23.3. 8. దేవగిరి దండయాత్ర (క్రీ.శ. 1295) :** మాళ్వ దండయాత్ర సందర్భంగానే అల్లాఉద్దీన్ దేవగిరి సంపదను గూర్చి తెలుసుకున్నాడు. దానిని కైవసం చేసుకొనుటకు రహస్యంగా సైనిక సన్నాహాలు చేసుకొని సుల్తాన్‌కు తెలియకుండా క్రీ.శ. 1295 లో మహారాష్ట్ర ప్రాంతమున నున్న దేవగిరి రాజ్యంపై హఠాత్తుగా దాడిచేశాడు. శత్రువు నెదుర్కొను స్థితిలో లేని దేవగిరి ప్రభువు రామచంద్రదేవుడు అల్లాఉద్దీన్ కోరిన ధనమునిచ్చి సంధి చేసుకున్నాడు. అంతలో తీర్థయాత్రల నుండి తిరిగి వచ్చిన యాదవ యువరాజు శంకరదేవుడు ఆ సంధికి సమ్మతించక యుద్ధమునకు తలపడ్డాడు. కానీ యాదవ సైన్యం మరొకసారి పరాజితమైయ్యింది. గత్యంతరం లేని రామచంద్రదేవుడు 17,250 పౌనుల బంగారం, 28,250 పౌనుల వెండి, 200 పౌనుల ముత్యాలు, 58 పౌనులు రత్నాలు అల్లాఉద్దీన్‌కు సమర్పించుకొని ప్రతియేటా ఎల్లిచ్‌పూర్ ఆదాయాన్ని కప్పంగా చెల్లించునట్లు సంధి చేసుకున్నాడు.

**23. 3. 9. జలాల్ హత్య (క్రీ.శ. 1296) :** అశేష ధనరాసులతో వస్తువాహనాలతో కారాకు తిరిగి వచ్చిన అల్లాఉద్దీన్‌కు ఆత్మ విశ్వాసం కలిగింది. సుల్తాన్ హత్యకు రంగం సిద్ధమైయ్యింది. తన సోదరుడు అల్మాస్‌బేగ్ సహాయంతో సుల్తాన్‌ను కారాకు రప్పించాడు. అల్లాఉద్దీన్ సాధించిన విజయాలకు మైమరిచిన జలాల్ కారాలో అతని కుట్రకు బలియైయ్యాడు. కల్లాకపటమెరుగని జలాలుద్దీన్ సైతము సహజమరణం పొందలేక పోవుట విధి వైపరీత్యం. అందునా తన ప్రియాతి ప్రియమైన అల్లుని చేతిలో దుర్మరణం పాలగుట అత్యంత శోచనీయం. ఈ సాంప్రదాయమే కడవరకు కొనసాగింది. సుల్తానులందరు తమ అభిమానుల చేతిలో హతులైనవారే!

**జలాల్ ఘనత :** ప్రాజ్ఞ నిరంకుశ పద్ధతులలో ప్రభుత్వాన్ని నిర్వహించి ప్రజాభిమానం పొందుటకు ప్రయత్నించిన వారిలో మొట్టమొదటి ఢిల్లీ సుల్తాన్ జలాలుద్దీన్ ఖిల్జీ. అతడు శాంతి కాముకుడు, దయార్ద్ర హృదయుడు. రాజ్యంలోని అన్ని వర్గాల వారినీ - తురుష్క, ఆఫ్ఘన్, హిందూస్థానీలను సంతృప్తి పరచుటకు ప్రయత్నించాడు. అతడు తన ప్రజల యెడల పితృప్రేమను ప్రదర్శించాడని కె.యస్. లాల్ వంటి చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. జలాలుద్దీన్‌లో కొన్ని లోపాలు లేకపోలేదు. అతడు పరమతద్వేషి. రాజపుత్రస్థాన దండయాత్రలలో అనేక హిందూ దేవాలయాలను ధ్వంసం చేయించాడు. శత్రువుల యెడల కఠినవైఖరి అనురించకపోవుట వలన ముస్లిం సర్దారులలో అతడికున్న గౌరవాభిమానాలు తగ్గినవి. తిరుగుబాటు ధోరణులు ప్రబలినవి. అనుయాయులు అతని దుర్బల విధానమును ఏవగించుకొన్నారు. తుదకాతని దుర్బల విధానమే అతని ప్రాణములు బలిగొన్నది.

## 23.4 అల్లాఉద్దీన్ ఖిల్జీ (క్రీ.శ. 1296-1316)

**23.4.1 తొలి జీవిత విశేషాలు :** అల్లాఉద్దీన్ జన్మ నామం ఆలీగుర్షాప్. అతడు జలాల్ అగ్రజుడగు షిహాబుద్దీన్ మసూద్ ఖిల్జీ జ్యేష్ఠపుత్రుడు. క్రీ.శ. 1266లో జన్మించిన ఆలీ చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి తమ్ముడగు అల్మాస్‌బేగ్‌తో సహా పినతండ్రి జలాల్ పెంపకంలో పెరిగాడు. అతనియందు అత్యంత ప్రేమానురాగాలు గల జలాల్ అతనిని పెంచి పెద్దచేసి తనకుమార్తెనిచ్చి వివాహం చేశాడు. తాను సుల్తానైన పిమ్మట అతనిని ఉన్నత పదవిలో నియమించి మాలిక్ చజ్జా తిరుగుబాటు తరువాత కారా - మాణిక్‌పూరల్ గవర్నర్‌గా చేశాడు. అల్లా ఉద్దీన్ గృహస్థ జీవితం సౌఖ్యప్రదంగా లేకుండెను. అతడన్న భార్యకు, ఆమె తల్లికి చులకన భావం. అందువలన అతడు జలాల్ కుటుంబం పట్ల ద్వేషం పెంచుకొని దానిని నాశనం చేయ సమకట్టాడు. అతని ఆశలకు ఆశయాలకు ఈ క్రొత్త పదవి అవకాశం కల్పించింది. కారాలోని చజ్జా అనుచరులు అతని ద్వేషాన్ని మరింత రెచ్చగొట్టినారు. అతడు తన లక్ష్య సాధనకవసరమగు ధనమును సమకూర్చుకొనుటకు క్రీ.శ. 1292లో మాళ్వ ప్రాంతం మీద, క్రీ.శ. 1295లో దేవగిరి మీద దండయాత్రలు జరిపాడు. అపారధనరాసులతో

వస్తు వాహనాలతో దేవగిరి దండయాత్రనుండి తిరిగి వచ్చిన అల్లాఉద్దీన్ మాయోపాయంతో జలాల్‌ను కారాకు రప్పించి అతనినచ్చట హతమార్చి క్రీ.శ. 1296 జూలైలో ఢిల్లీ సుల్తాన్‌గా ప్రకటించుకున్నాడు.

**23.4.2 ఢిల్లీ సింహాసనం అధిష్టించుట (క్రీ.శ. 1296) :** జలాల్‌ను కడతేర్చిన అల్లాఉద్దీన్ ఢిల్లీవైపు పురోగమిస్తూ ధన సహాయంతో మార్గమునందలి ప్రముఖులను తనవైపు త్రిప్పుకొన్నాడు. తనతో పోరాడుటకు ఢిల్లీ నుండి వచ్చిన సైన్యమును ధనము వెదజల్లి లోబరచుకున్నాడు. జలాల్ భార్య మల్లికాజహాన్, సుల్తాన్‌గా ప్రకటింపబడిన ఆమె చిన్న కుమారుడు రక్నుద్దీన్ ఇబ్రహీం (ఖాదర్‌ఖాన్) ఢిల్లీనుండి పారిపోయి ముల్తాన్‌లో తలదాచుకున్నారు. అంతట అల్లాఉద్దీన్ విజయవంతంగా ఢిల్లీ ప్రవేశించి ధనాశజూపి జలాల్ అనుయాయులను తన కనుకూలురుగా చేసుకొని క్రీ.శ. 1296 అక్టోబరు 26వ తేదీన 'అబుల్ ముజఫర్ అల్లా ఉద్దీన్ మహమ్మద్ షా ఖిల్జీ' అను బిరుదుతో ఢిల్లీ సుల్తాన్‌గా పట్టాభిషిక్తుడయ్యాడు. అల్లా ఉద్దీన్ రాకతో ఢిల్లీ సుల్తానుల చరిత్రలో నూతన అధ్యాయం ఆరంభమైంది.

**23.4.3 ఢిల్లీసుల్తాన్‌గా అల్లాఉద్దీన్ ఎదుర్కొన్న సమస్యలు :** ఢిల్లీ సింహాసనం పూలపాన్పుగాదు. ఢిల్లీ సుల్తాన్‌గా అల్లాఉద్దీన్ అనేక సమస్యలు ఎదుర్కొనవలసి వచ్చెను. అవి : 1) జలాలుద్దీన్ అభిమానులు అతని హత్యకు ప్రతీకారం తీర్చుకొనుటకు ప్రయత్నించుచుండిరి. 2) జలాల్ భార్య మలికా జహాన్, కుమారులు అర్కాలీఖాన్, రుక్నుద్దీన్ ఇబ్రహీంలు సింహాసనమాక్రమించుటకు సన్నాహాలు చేస్తున్నారు 3) ఢిల్లీ రాజ్యానికి మంగోలుల దండయాత్ర బెడద ఎక్కువయ్యెను.

దృఢచిత్తుడు, సమర్థుడు అయిన అల్లాఉద్దీన్ ఈ సమస్యలను సునాయాసంగానే పరిష్కరించాడు. తాను దేవగిరి నుండి కొల్లగొట్టి తెచ్చిన ధనరాసులను పంచిపెట్టి పదవులను ఎరజూపి జలాల్ అనుయాయుల ప్రేమాభిమానములను చూరగొన్నాడు. అతడు పంచిన సొమ్ము అనతికాలంలోనే జలాల్ దారుణ హత్యను మరిపింపజేసింది. అవిధేయులైన వారిని అణచివేశాడు. ఉలుగ్‌ఖాన్ (అల్మాస్‌బేగ్) జాఫర్‌ఖాన్‌ల నాయకత్వంలో ముల్తాన్ వెళ్ళిన సైన్యం జలాల్ కుమారులను ఓడించి, అంధులు గావించి మలికాజహాన్‌తో సహా వారిని చెరసాలలో నిర్బంధించింది. తన అధికారం స్థిరపడిన పిమ్మట ధనాశతో తన పక్షం చేరిన జలాల్ అనుయాయులను కడతేర్చి వారి జాగీరులను, సంపదను స్వాధీనపర్చుకొన్నాడు. స్వామి ద్రోహులను విశ్వసించరాదనునది అల్లాఉద్దీన్ సిద్ధాంతం.

**23.4.4 ఆశయాలు :** అల్లాఉద్దీన్ సామ్రాజ్యవాది. తొలి దశలో తాను సాధించిన విజయాలు అతని అహంభావాన్ని రెచ్చగొట్టాయి. దుర్లభమైన కోరికలను జనింపజేశాయి. వానిలో ఒకటి క్రొత్త మతస్థాపన. మహ్మదు ప్రవక్తకు వలె తనకు కూడా నలుగురు సమర్థులైన అనుచరులు ఉల్లుఖాన్, నస్రత్‌ఖాన్, జాఫర్‌ఖాన్, అలప్‌ఖాన్ - కలరని తానుగూడా నూతన మతమును స్థాపించెదనని ప్రకటించాడు. అలెగ్జాండరు వలె తాను కూడా ప్రపంచ విజేత కావలెననునది అతని రెండవ ఆశయము. అవి అసాధ్యములైన కోర్కెలను ఢిల్లీ కొత్వాల్ అలా ఉల్ముల్క్ అల్లాఉద్దీన్‌కు నచ్చజెప్పి ఆ ప్రయత్నములను విరమింపజేశాడు. కానీ అల్లా ఉద్దీన్ "రెండవ అలెగ్జాండరు" అను బిరుదును మాత్రం ధరించాడు. ఆ బిరుదు నాణెముల మీద, ఖుద్బాలోను వాడబడ్డాయి.

## దిగ్విజయ యాత్రలు

అల్లాఉద్దీన్ దండయాత్రలను రెండు శీర్షికలుగా విభజింపవచ్చును అవి : ఉత్తర హిందూ దేశ దండయాత్రలు, దక్షిణ హిందూదేశ దండయాత్రలు.

**23.4.5 ఉత్తర హిందూదేశ దండయాత్రలు :** అల్లాఉద్దీన్ నిర్వహించిన దండయాత్రల ఫలితంగా గుజరాత్, రాజపుత్ర స్థానం, మాళ్వాల మీద ఢిల్లీ ఆధిపత్యం నెలకొల్పబడింది. ఆ విజయాలను సాధించిన శూరులు : ఉల్లుఖాన్, నస్రత్‌ఖాన్, జాఫర్‌ఖాన్, అలప్‌ఖాన్‌లు.

**23.4.6 గుజరాత్ (క్రీ.శ. 1299) :** అల్లాఉద్దీన్ సాధించిన మొదటి ఘనవిజయం గుజరాత్ ఆక్రమణ. క్రీ.శ. 1299లో ఉల్లుఖాన్, నస్రత్‌ఖాన్‌ల నాయకత్వాన గుజరాత్ దండయాత్ర నిర్వహించబడింది. గుజరాత్ ప్రభువు వాఘేల వంశీయుడగు కర్ణదేవుడు. అన్హిల్‌వాడ్ అతని రాజధాని. హఠాత్తుగా జరిగిన ముస్లిం దాడి నెదుర్కొనలేక తన కుమార్తె దేవలదేవితో సహా కర్ణదేవుడు దేవగిరి యాదవ రాజ్యమునకు పారిపోయి అచట ఆశ్రయం పొందాడు. అన్హిల్‌వాడ్ శత్రు హస్తగతమయ్యింది. కర్ణదేవుని పట్టమహిషి కమలాదేవితో పాటు అనేకమంది అంతఃపుర స్త్రీలు బందీలయ్యారు. తదుపరి కమలాదేవి అల్లాఉద్దీన్ పట్టమహిషి అయ్యింది. అల్లాఉద్దీన్ దండయాత్రలలో అతని అవసానదశలో ప్రముఖ పాత్ర నిర్వహించిన మాలిక్ కాఫర్ (హజార్ దీనార్) బందీగా చిక్కినది ఈ దండయాత్రలోనే. ధనకనకరాసులు అల్లాఉద్దీ

అధీనమయ్యాయి. సోమనాథాలయం, ప్రముఖ వర్తక కేంద్రం అయిన కాంబే దోపిడీకి గురియైనాయి. గుజరాత్ ఢిల్లీ సామ్రాజ్యంలో అంతర్భాగమైంది. అలప్‌ఖాన్ గుజరాత్ గవర్నర్‌గా నియమింపబడ్డాడు.

ధనకనక రాసులతో, కమలాదేవి, మాలిక్ కాఫర్‌లతో సైన్యం ఢిల్లీకి తిరుగు ప్రయాణమైయ్యింది. మార్గమధ్యంలో ఖామ్స్ వసూలులో సేనానులు అనుసరించిన కఠిన విధానమునకు నిరసనగా నయా ముస్లింలు తిరుగుబాటు చేసారు. కడు ప్రయాసతో ఆ తిరుగుబాటు అణచబడింది. తిరుగుబాటు నాయకులు కొందరు తప్పించుకొని రాజపుత్ర స్థానమునకు పారిపొయ్యారు. ఈ వార్త అందిన వెంటనే అల్లాఉద్దీన్ తిరుగుబాటు దారుల భార్యాబిడ్డలను బందీలుగావించాడు. తిరుగుబాటు దారులను లోబరుచుకొనుటకు వారి భార్యాబిడ్డలను బందీలుగావించు సాంప్రదాయమునకు ఇదియే నాంది. ఈ తిరుగుబాటులో మొత్తమం మీద 30,000 మంది నయా ముస్లింలు హతులైయ్యారు. వారి స్త్రీలు అనేక విధములైన అవమానములకు గురిచేయబడినారు. ఈ కఠిన చర్యల వలన ఢిల్లీ రాజ్యానికి నయా ముస్లింల బెడద తప్పింది.

**23.4.7. రణతంభోర్ (క్రీ.శ. 1300-1301) :** రాజపుత్ర స్థానంలోని ప్రముఖ దుర్గాలలో రణతంభోర్ దుర్గమొకటి. జలాలుద్దీన్ కాలంలో ఈ దుర్గము నాక్రమించుటకు విఫల ప్రయత్నం జర్గినట్లు చదివినారు గదా! రణతంభోర్ ప్రభువు చౌహాన్ వంశీయుడగు హమ్మీర దేవుడు. పృథ్వీరాజు వారసులలో ఒకడు. గుజరాత్ ఆక్రమణతో ఢిల్లీ రాజ్యం రణతంభోరుకు మూడు వైపుల విస్తరించుట వలన ఆ దుర్గ ఆక్రమణ సుగమమయింది. తన అధికారాన్ని విస్తరింపనెంచిన అల్లాఉద్దీన్ తిరుగుబాటు చేసిన నయా ముస్లింలకు రణతంభోర్ ప్రభువు ఆశ్రయ మిచ్చినాడను నెపమున ఆ దుర్గముపై క్రీ.శ. 1300 లో ఉల్లుఖాన్, నస్రత్‌ఖాన్‌ల నాయకత్వాన దండయాత్ర జరిపించినాడు. రాజపుత్రులు ఆ దండయాత్రను తీవ్రంగా ప్రతిఘటించారు. దుర్గముట్టడిలో నస్రత్‌ఖాన్ వధింపబడినాడు. దీర్ఘకాలిక ముట్టడి దాదాపు సంవత్సరం అనంతరం హీమ్మీరుని మంత్రి రణమల్లు సహాయంతో అల్లాఉద్దీన్ రణతంభోరు నాక్రమించాడు. హమ్మీరుడు యుద్దంలో ప్రాణాలు కోల్పోయాడు. అంతఃపుర స్త్రీలు జోహారు చేసినారు. దుర్గమును స్వాధీనం చేసుకొన్న పిమ్మట అల్లాఉద్దీన్ ధనాశతో తన ప్రభువును మోసగించి తనకు సాయపడిన రణమల్లును అతని అనుచరులను వధించినాడు. స్వామి ద్రోహుల పట్ల అతని విధానమదియే కదా!

**23.4.8 చితోడ్ (క్రీ.శ. 1303) :** చితోడ్ మేవార్ రాజ్యరాజధాని, శత్రుదుర్భేద్యమైన గిరిదుర్గం. మేహర్ ప్రభువు గుహిలాట్ వంశీయుడైన రాణారతన్‌సింగ్. అతని భార్య అద్భుత సౌందర్యరాశియైన పద్మిని. రాజ్యవిస్తరణాభిలాషతోపాటు నిరుపమాన లావణ్యావతియైన పద్మినీని పొందుటయే అల్లాఉద్దీన్ చితోడ్ దండయాత్రకు ప్రధాన కారణమని రాజపుత్ర స్థానమున ఒక గాథ ప్రచారంలోనున్నది. ఈ గాథకు మూలం క్రీ.శ. 1540లో మాలిక్ మహమ్మద్ జయశీ రచించిన "పద్మవత్" అను కావ్యం సమకాలీన రచనలలో పద్మినీ ఉదంతం పేర్కొనబడలేదు. అందువలన ఇది చారిత్రక సత్యం కాదని, కల్పిత కథయని గౌరీశంకర్ ఓ ఝ.కె.యస్. లాల్ వంటి చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. కానీ సమకాలీన రచయిత అయిన అమీర్‌ఖుస్రూ రచనలను నిశితంగా పరిశీలించిన ఎ.ఎల్. శ్రీవాత్సవ అను చరిత్రకారుడు ఈ గాథలో కొంత చారిత్రక సత్యం లేకపోలేదను అభిప్రాయమును వెలిబుచ్చాడు. ఏది ఏమైనను రాజపుత్ర స్థానమునంతయు ఆక్రమింపనెంచిన అల్లాఉద్దీన్ క్రీ.శ. 1303లో చితోడ్‌పై దండెత్తి వచ్చి ఎనిమిది మాసముల ముట్టడి అనంతరం రాణారతన్ సింగ్‌ను వధించి దుర్గము నాక్రమించాడు. పద్మినీతో సహా అంతఃపుర స్త్రీలందరు జోహారు చేశారు. దీర్ఘకాలిక ముట్టడి జరిగినందున ఆగ్రహించిన అల్లాఉద్దీన్ స్త్రీ పురుష బాల వృద్ధులను విచక్షణ లేకుండా ఒక్క రోజులో 30 వేలమంది రాజపుత్రులను వధించినట్లు అమీర్‌ఖుస్రూ రాశాడు. సుల్తాన్ పెద్దకుమారుడు ఖిజర్‌ఖాన్ యువరాజుగా ప్రకటింపబడి చితోడ్ గవర్నర్‌గా నియమింపబడ్డాడు. చితోడ్ పేరు ఖిజ్రాబాద్‌గా మార్చబడింది.

**23.4.9 ఇతర ఆక్రమణలు (క్రీ.శ. 1305) :** అల్లాఉద్దీన్ రణతంభోర్, చితోడ్‌ల ఆక్రమణలను గాంచిన పొరుగు రాజ్యాల వారు ధైర్యం కోల్పోయినారు. ఆ ప్రభావం మధ్య ఇండియా మీద గూడా పడింది. తత్ఫలితంగా ఢిల్లీ సైన్యాలకు చెప్పుకోదగ్గ ప్రతిఘటన లేకపోయింది. మధ్య భారతాన్ని జయించుటకు సుల్తాన్ క్రీ.శ. 1305లో ఐనుల్ ముల్క్‌ను నియమించాడు. అతడు చాందేరి, మాండు, ఉజ్జయిని, ధారామున్నగు దుర్గముల నాక్రమించి మాళ్వ ఆక్రమణ పూర్తిగావించాడు. తదుపరి మార్వర్ జాలోర్‌లు సైతం ఢిల్లీ రాజ్యంలో చేర్చబడ్డాయి.

## దక్షిణదేశ దండయాత్రలు :

**23.4.10 దక్షిణదేశ రాజకీయ పరిస్థితి :** ఉత్తరాపథంలో అధిక భాగము[illegible]న పాదాక్రాంతం చేసుకొన్న అల్లాఉద్దీన్ దక్షిణాపథంపై తన దృష్టిని సారించాడు. నాడు దక్షిణ హిందూదేశంలోగల ప్రముఖ రాజ్యములు ఏవనగా : 1) మహారాష్ట్ర ప్రాంతమున దేవగిరి కేంద్రంగానున్న

యాదవరాజ్యం 2) ఆంధ్ర దేశమున ఓరుగల్లు కేంద్రంగా నున్న కాకతీయరాజ్యం 3) కర్ణాటక ప్రాంతమునున్న హోయసాల రాజ్యమునకు రాజధాని ద్వార సముద్రం. ఈ మూడు రాజ్యాలు కల్యాణి చాళుక్య రాజ్య శిథిలాలపై వెలసిన స్వతంత్ర రాజ్యాలు. 4) నేటి తమిళనాడు రాష్ట్రమున మధుర కేంద్రముగా వున్న పాండ్యులరాజ్యం. ఈ రాజ్యాల మధ్య స్నేహ సహకారాలులేవు. ఇవి పరస్పర వినాశకరమయిన యుద్ధాలలో నిమగ్నమయి అల్లాఉద్దీన్ ఖిల్జీకి సువర్ణావకాశాన్ని అందించాయి.

**23.4.11 కారణాలు :** అల్లాఉద్దీన్ దక్షిణ దేశ దండయాత్రలకు కారణాలు : 1) భారతదేశమునంతటిని తన ఆధిపత్యములోనికి తెచ్చుటకు 2) దక్షిణ దేశంలో ప్రోగుపడిన ధనరాశులను కొల్లగొట్టుటకు 3) సంధిప్రకారం తనకు చెల్లించవలసిన కప్పమును నిలిపివేసిన రామచంద్ర దేవుని శిక్షించుటకు 4) తన శత్రువైన వాఘేల కర్ణదేవునికి ఆశ్రయం మిచ్చిన రామచంద్ర దేవునికి గుణపాఠం నేర్పుటకు 5) అల్లాఉద్దీన్ పట్టమహిషియైన కమలాదేవి (కర్ణదేవుని భార్య) కుమార్తె దేవలదేవిని తల్లి వద్దకు చేర్చుటకు.

అల్లాఉద్దీన్ దక్షిణ దేశ దండయాత్రలను విజయవంతంగా నిర్వహించినవాడు గుజరాత్ దండయాత్రలో బందీగా తీసుకొని రాబడిన కాఫర్. ఇతడు అనతికాలంలోనే తన శక్తి సామర్థ్యాలచే స్వామి భక్తిచే అల్లాఉద్దీన్ ప్రేమాభిమానాలు పొంది సుల్తాన్‌కు నమ్మినబంటు అయి ప్రముఖ సేనానాయకుని స్థాయికి ఎదిగాడు.

**23.4.12 దేవగిరి (క్రీ.శ. 1307) :** దేవగిరి ప్రభువు యాదవ రామచంద్ర దేవుడు. ఇతడు క్రీ.వ. 1295లో అల్లాఉద్దీన్ చే ఓడింపబడి ఎల్లిచ్ పూర్ ఆదాయమును ఏటేటా కప్పంగా చెల్లించుటకు అంగీకరించాడు. ఒప్పందం ప్రకారం కప్పం చెల్లించకపోవుటయే గాక తన శత్రువైన గుజరాత్ కర్ణదేవునికి ఆశ్రయమిచ్చి అతని కుమార్తె దేవలదేవిని తనకుమారుడగు శంకర దేవునికిచ్చి వివాహం చేయ సంకల్పించి అల్లాఉద్దీన్ ఆగ్రహమునకు గురియైయ్యాడు. గుజరాత్, మాళ్వగవర్నర్లు వెంటరాగా మాలిక్‌కాఫర్ క్రీ.శ. 1307లో 30,000 సైన్యంతో దేవగిరిపై దండెత్తి వచ్చి రామచంద్ర దేవుని ఓడించి ఢిల్లీకి పంపాడు. సుల్తానుకు సామంతుడుగా వుండి ఏటేటా కప్పం చెల్లించుటకు, అతనికి తన కుమార్తె నిచ్చి వివాహము చేయుటకు రామచంద్రేవుడు సమ్మతించి యధోచిత సత్కారములు పొంది దేవగిరి చేరాడు. ఈలోపల దేవలదేవి జాడ తెలుసుకొని ఆమెను గూడా ఢిల్లీకి పంపగా ఖిజర్‌ఖాన్ ఆమెను వివాహమాడాడు. వీరి ప్రేమోదంతమునే అమీర్ ఖుస్రూ "దేవల్‌రాణి" యను కావ్యంగా రచించాడు.

**23.4.13 ఓరుగల్లు (క్రీ.శ. 1309) :** ఓరుగల్లు కాకతీయ రాజ్యానికి రాజధాని. ప్రభువు రెండవ ప్రతాపరుద్రుడు (క్రీ.శ. 1290-1323). గజాశ్వములను, కోశాగారంలోని సంపదను సమర్పించి కప్పం చెల్లిస్తూ సామంతుడుగానుండుటకు అంగీకరించినట్లయిన అందుకు సమ్మతించి ఓరుగల్లు ప్రభువును వదలివేయవలసినదనియు, కఠిన నిబంధనలు విధించరాదనియు ఆదేశించి అల్లా ఉద్దీన్ మాలిక్ కాఫర్‌ను పంపాడు. కాఫర్ రామచంద్రుని సాయంతో క్రీ.శ. 1309లో ఓరుగల్లు దుర్గమును ముట్టడించి ప్రతాపరుద్రుని ఓడించి 100 ఏనుగులను, 7000 అశ్వములను, కోశాగారంలోని బంగారు వెండి లోహాలతో పాటు అమూల్యమైన వజ్రాలను సంగ్రహించినాడు. ఈ వజ్రాలలో 'కోహినూర్' వజ్రమున్నట్లు ఫెరిష్టా పేర్కొన్నాడు. ప్రతాపరుద్రుడు అలాల్లఉద్దీన్ సార్వభౌమత్వము నంగీకరించి ప్రతి సంవత్సరం కప్పం చెల్లించుటకు సమ్మతించినాడు.

**23.4.14 ద్వారసముద్రం (క్రీ.శ. 1311) :** ద్వార సముద్ర ప్రభువు హోయసాల వంశీయుడైన మూడవ వీరబల్లాలుడు. ఈయన దేవగిరి, ఓరుగల్లులపై జరిగిన దండయాత్రలను చూచి జాగ్రత్త వహించినట్లు కన్పించదు. కావుననే ఇతడు నామ మాత్రపు ప్రతిఘటన అనంతరం అల్లాఉద్దీన్ సామంతునిగానుండుటకు, ప్రతియేటా కప్పం చెల్లించుటకు, గజాశ్వములను, కోశాగారంలోని ధనకనకములను సమర్పించుటకు అంగీకరించాడు.

**23.4.15 మధుర క్రీ.శ. 1311 :** దక్షిణాపథంలోని చిట్టచివరి రాజ్యం మధుర కేంద్రముగా వున్న పాండ్య రాజ్యం. యజకులశేఖర పాండ్యుడు. అతనికి వీరపాండ్యుడు, సుందర పాండ్యుడు అను ఇరువురు కుమారులు కలరు. వీరపాండ్యుని యందభిమానముగల తండ్రిని వధించి మధుర సింహాసనము నాక్రమించుటలో విఫలుడైన సుందర పాండ్యుడు మాలిక్ కాఫర్ సాయమర్థించాడు. దానిని మహదావకాశంగా నెంచిన కాఫర్ మూడవ వీరబల్లాలుని సహాయంతో పాండ్యరాజ్యంపైకి దండెత్తాడు. వీరపాండ్యుని బంధించు నెపమున రాజ్యములోని పలు ప్రాంతములను దోచుకొనుచు, దేవాలయములను ధ్వంసం చేయుచు ముస్లిం సైన్యం స్వైర్య విహారం చేయుటగాంచి సుందర పాండ్యుడు

తన తప్పిదము గ్రహించి మాలిక్ కాఫర్‌ను వీడి అడవులకు పారిపోయాడు. సుల్తాన్‌తో సంధి చేసుకొనుటకు ఎవరును ముందుకు రాలేదు. అందువలన రాజకీయంగా ఈ దండయాత్ర ఫలప్రదం కాలేదని చెప్పవచ్చును. కానీ ఆర్థికంగా ఇది మిక్కిలి లాభసాటియైంది. ఈ సందర్భంగా కాఫర్ 612 గజాలను 20,000 అశ్వాలను, 2750 పౌనుల బంగారాన్ని (96,000 మణుగులు) అమూల్యమైన వజ్రాలను, రత్నాలను (500 మణుగులు) సంగ్రహించి ఢిల్లీకి చేరవేశాడు. ఏ ఒక్క దండయాత్రలోను అల్లాఉద్దీన్‌కు యింత భారీఎత్తున ధనం సమకూరలేదు. సమాధిలోనున్న ఘజ్నీమహ్మద్ గూడా ఈర్ష్య పడునంత ధన, కనక, వస్తువాహన ప్రాప్తి కలిగినది.

**23.4.16 దేవగిరిపై రెండవ దండయాత్ర (క్రీ.శ. 1312)** : రామచంద్ర దేవుడు క్రీ.శ. 1312లో మరణించగా అతని కుమారుడు శంకర దేవుడు దేవగిరి ప్రభువై స్వాతంత్ర్యం ప్రకటించి అల్లా ఉద్దీన్‌కు కప్పము కట్టనిరాకరించాడు. అంతట మాలికాఫర్ రెండవ పర్యాయం దేవగిరిపై దండెత్తివచ్చి క్రీ.శ. 1312లో శంకరదేవుని వధించాడు. దేవగిరి ఢిల్లీ సుల్తాన్‌లో అంతర్భాగమైయ్యింది. తదుపరి కాఫర్ కృష్ణా - తుంగభద్రా అంతర్వేదిని ఆక్రమించి గుల్బర్గా, రాయచూర్, ముద్గల్ మున్నగు కేంద్రాలలో సైనిక స్థావరములు ఏర్పాటు చేశాడు.

**23.4.17 దక్కను విధాన స్వభావం** : దక్షిణాపథ రాజ్యముల పట్ల అల్లాఉద్దీన్ విభిన్నమైన విధానమును అనుసరించాడు. ప్రయాణ సౌకర్యాలు, వార్తా సౌకర్యాలు సరిగాలేని ఆరోజులలో దూర ప్రదేశాలను అదుపులో నుంచుటలోని సాధక బాధకాలను గ్రహించాడు. అతడు ఆదర్శవాది కాదు. ఆచరణవాది. అతనికి కావలసినది ధనము, అధికారము. అల్లాఉద్దీన్, సముద్రగుప్తుని వలే దక్షిణ రాజ్యాలపై సార్వభౌమాధికార స్థాపనతో సంతృప్తి చెందాడు. అందువలననే ఢిల్లీ సార్వభౌమాధికారం ఆమోదించి కప్పం చెల్లించుటకు అంగీకరించిన దక్షిణాత్య ప్రభువులను ఆదరించవలెనని అవమానపరచరాదని అల్లాఉద్దీన్ మాలిక్ కాఫర్‌ను ఆదేశించాడు. ఇట్టి విధానం అతని రాజనీతిజ్ఞతకు దూరదృష్టికి నిదర్శనం.

**23.4.18 ఫలితాలు** : 1) అల్లా ఉద్దీన్ సాధించిన విజయాలవలన దక్షిణ దేశ రాజ్యాలు అభేద్యాలను భావము పటాపంచలైనది. 2) ఈ దండయాత్రలు భావితరాల ముస్లిం పాలకులకు మార్గదర్శకమైయ్యాయి. ఇచట క్రమక్రమంగా ముస్లింల సంఖ్య పెరిగి బ్రహ్మనీ రాజ్యస్థాపనకు, తద్వారా మొఘలాయీల అధికార విస్తరణకు అవకాశం కలిగింది. 3) ఈ దండయాత్రల వలన దక్షిణాపథ సంపద దోపిడీకి గురి అయింది. 4) దండయాత్రల సందర్భంగా ఆలయాలు ధ్వంసం చేయబడుట వలన వాస్తు శిల్ప సంపదకు హానికలిగింది. 5) ఈ దండయాత్రవలన దాక్షిణాత్య సంస్కృతి తన ప్రత్యేకతను కోల్పోయింది.

**23.4.19 సామ్రాజ్య విస్తీర్ణం** : ఈ విజయాలతో అల్లాఉద్దీన్ ఖిల్జీ సామ్రాజ్యం వాయవ్యమున సింధునది నుండి తూర్పున బీహారువరకు, ఉత్తరమున హిమాలయములనుండి దక్షిణాన ద్వార సముద్రం వరకు విస్తరించింది. అందులో నేటి సింధు, పంజాబు, ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజపుత్ర స్థానం, మాళ్వ చేరివున్నాయి. బీహార్, బెంగాల్, అస్సాం, ఒరిస్సాలు అందులోలేవు. వింధ్య పర్వతాల నుండి ద్వారసముద్రం వరకున్న దాక్షిణాత్యరాజ్యాలు సామంతరాజ్యాలు. చివరిదశలో దేవగిరి మాత్రం ఢిల్లీ సుల్తాన్‌ల అంతర్భాగమైయ్యింది. ఇట్లు మొట్టమొదటిసారిగా ఢిల్లీ సుల్తానుల ఆధిపత్యం హిమాలయాలనుండి కర్ణాటకం వరకు విస్తరించింది.

**23.4.20 మంగోలుల దండయాత్రలు** : అల్లా ఉద్దీన్ కాలంలో జరిగినన్ని మంగోలుల దండయాత్రలు మరే సుల్తాను కాలంలోను జరుగలేదు. మంగోలులకు అంతటి భీతిని కలిగించినవారు కూడా ఎవ్వరూలేరు. ఈ దాడులను విజయవంతంగా ఎదుర్కొనుటలో ప్రధాన భూమిక నిర్వహించిన సేనానులు జాఫర్ ఖాన్, ఉలుఖాన్, మాలిక్ కాఫర్, ఘాజీమాలిక్ అనువారు. క్రీ.శ. 1296-1307 సంవత్సరాల మధ్య ఆరు పర్యాయములు మంగోలులు భారత దేశంపై దాడులు జరిపారు.

క్రీ.శ. 1296-97 లో మంగోలులు ఖాదర్‌ఖాన్ నాయకత్వాన పంజాబు సింధు ప్రాంతములపై దాడులు సాగించి దోచుకొని లాహోరు నాక్రమించారు. ఉల్గుఖాన్, జాఫర్‌కాన్‌ల నాయకత్వంలో సుల్తాన్ సైన్యం మంగోలులను జలంధర్ సమీపమున ఓడించి 20,000లకు పైగా వారిని వధించారు. అనేకులు బందీలుగా చిక్కి శిరశ్చేద శిక్షకు గురియైయ్యారు.

క్రీ.శ. 1298లో సాల్డినాయకత్వాన రెండవ సారి మంగోలులు దాడిజరిపి సింధును దోచుకొని సివిస్థాన్ (సెహ్వాన్) ప్రధాన స్థావరంగా చేసుకొన్నారు. జాఫర్‌కాన్ సివిస్థాన్‌ను ముట్టడించి సంకుల సమరంలో మంగోలులను ఊచకోత కోశాడు. సాల్డి తదితర మంగోల నాయకులు భార్యాబిడ్డలతో సహా బందీలుగా ఢిల్లీకి పంపబడ్డారు. ఈ విజయం వలన బరానీ జాఫర్‌ఖన్‌ను "రుస్తుం"గా అభివర్ణించినారు. అతడు పంజాబులోని సమానాకు గవర్నర్‌గా నియమింపబడ్డాడు.

క్రీ.శ. 1299లో కుత్‌లుగ్ ఖ్వాజానాయకత్వంలో 2,00,000 మంగోలు దండు ఢిల్లీపై విరుచుకుపడింది. ఢిల్లీ పరిసరాలలో గంద ందోళనలు వ్యాపించి ప్రజలు రాజధానికి చేరినారు. అట్టి విపత్కర పరిస్థితిలో అల్లాఉద్దీన్ వీరోచితంగా వ్యవహరించి ఉల్ఘుఖాన్, జాఫర్‌ఖాన్‌ల సాయంతో మంగోలులనోడించి తరిమివేశాడు. పారిపోవతున్న మంగోలులను వెంటాడిన జాఫర్‌ఖాన్‌ను మంగోలులు మాటువేసి మట్టుబెట్టారు. పరమ క్రూరులైన మంగోలులకు భీతావహుడు జాఫర్‌ఖాన్. అతడన్న మంగోలులకు సింహస్వప్నం.

తార్ఘీబేగ్ నాయకత్వాన 1,20,000 మంగోలులు క్రీ.శ. 1303లో నాలుగవ పర్యాయం భారతదేశంలో ప్రవేశించినారు. చితోడ్ దండయాత్రనుండి తిరిగివచ్చినసుల్తాన్ సిరి దుర్గంలో తలదాచుకొన్నాడు. మంగోలులు 40 రోజులపాటు రాజధానిని ముట్టడించి పరిసర ప్రాంతాలను ధ్వంసం చేశారు. అల్లాఉద్దీన్ పరిస్థితి క్లిష్టంగా తయారయ్యింది. అంతలో రాష్ట్రాల సైన్యం రాకతో తమ పరిస్థితి ప్రమాదకరంగా పరిణమిస్తుందేమోనను భయంతో మంగోలులు అర్థాంతరంగా ముట్టడి విరమించి మాతృదేశం తిరిగి వెళ్ళిపోయారు. ఈసారి గూడా అదృష్ట దేవత అల్లాఉద్దీన్‌నే వరించింది.

పరాజయ పరంపర వలన నిరుత్సాహపడుటకు బదులు ద్విగుణీకృతోత్సాహంతో క్రీ.శ. 1305లో ఐదవ పర్యాయం 50,000 మంగోలు సైన్యం ఆలీబేగ్, తార్ఘీబేగ్‌ల నాయకత్వాన ముల్తాన్, పంజాబ్‌లను దోచుకుంటూ శివాలిక్ కొండలవైపు పురోగమించింది. ఢిల్లీతో సహా ప్రధాన నగరాలను వదలి గంగా-యమునా అంతర్వేదిలో మారణహోమం సృష్టించింది. వారి లక్ష్యాన్ని అవగతం చేసుకొన్న సుల్తాన్ వారి తిరోగమన మార్గాన్ని అడ్డగించవలసిందిగా మాలిక్ కాఫర్‌ను ఆదేశించాడు. కాఫర్ వారి నోడించి నాయకులతో సహా ఎనిమిదివేల మందిని బంధించి ఢిల్లీ వీధుల వెంట ఊరేగించి క్రూరంగా వధించాడు. వారి శిరస్సులు శిరిదుర్గంలో నిర్మింపబడిన గోపురాలలో పొదగబడ్డాయి. మాలికాఫర్ వలలో నుండి తప్పించుకున్న వారిని దీపాల్‌పూర్ గవర్నరయిన ఘాజీమాలిక్ చుట్టుముట్టి హతమార్చాడు.

క్రీ.శ. 1306-07 ఇక్బల్‌మంద్, కుబక్‌ల సారధ్యంలో 50,000 మంగోలు దండు ఆరవసారి, చివరిసారి, వేర్వేరు మార్గముల వెంట భారతదేశంలోనికి చొచ్చుకు వచ్చారు. మాలికాఫర్, ఘాజీమాలిక్‌లు రావినదీ తీరాన కుబక్ దళములను ఓడించి వేలకొలది మంగోలులను నాయకులతో సహా, బందీలుగా ఢిల్లీకి పంపారు. ఇక్బల్‌మంద్ నాయకత్వంలోని మంగోలు దండు గూడా ఘోరంగా ఓడింప బడింది. కాని కొద్దిమంది పరివారంతో ఇక్బల్‌మంద్ తప్పించుకు పారిపోయాడు. ఢిల్లీకి తీసుకొని రాబడిన బందీలను అల్లాఉద్దీన్ ఏనుగులచే త్రొక్కించి క్రూరంగా చంపించాడు. పదే పదే తమకెదురైన పరాజయముల వలన, అల్లాఉద్దీన్ విధించిన క్రూర శిక్షలవలన భీతిచెందిన మంగోలులు భారతదేశంపై తమ దాడులను విరమించుకున్నారు.

తరచుగా సంభవిస్తున్న మంగోలుల దండయాత్రల నరకట్టుటకు శాశ్వత ప్రాతిపదికపై తీసుకోవలసిన చర్యల ఆవశ్యకతను అల్లాఉద్దీన్ గుర్తించాడు. బాల్బన్ వలె అతడు వాయవ్య ప్రాంతములో రక్షణకు తగుచర్యలు తీసుకొన్నాడు. పాత దుర్గాలు మరమ్మత్తుచేయించి, కొత్త దుర్గాలు నిర్మించి వాటిలో సైనికదళములను ఏర్పాటుచేశాడు. ఆ విధంగా అల్లాఉద్దీన్ బాల్బన్ ప్రారంభించిన విధానమును పూర్తిగావించి మంగోలుల బెడదనుండి భారతదేశాన్ని కాపాడాడు.

**7.7 ఫలితాలు :** (1) మంగోలుల దండయాత్రల వలన ఎక్కువ సైన్యం అవసరమయి సైనిక వ్యయం పెరిగింది (2) సైనిక వ్యయం పెరుగుటవలన భూమిశిస్తు రేటు 50 శాతం వరకు పెంచబడ్డాయి. (3) సైనికుల సంఖ్య అపారంగా పెరుగుట వలన (కేంద్రప్రభుత్వ మూల బలం 4,75,000) అల్లాఉద్దీన్ ధరలు అదుపు చేయు బలంవంటి వినూత్న ప్రయోగాలు చేశాడు. (4) మంగోలుల దండయాత్రలను విజయవంతంగా ఎదుర్కొని వారి బారినుండి భారతదేశాన్ని కాపాడుటవలన అతని కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడించాయి. (5) పలుపర్యాయములు మంగోలులు భారతదేశంపై దాడులు జరిపి ప్రజలను హింసించినారు. సంహరించారు; దోచుకున్నారు. ఆస్తులు దగ్ధం చేసినారు. అందువలన దేశ ఆర్థికాభివృద్ధి కుంటుపడింది.

8. పరిపాలనా విధానం : అల్లాఉద్దీన్ గొప్ప విజేతయేగాక పరిపాలనా దక్షతగూడా కలవాడు. ఢిల్లీసుల్తానత్‌కు క్రమబద్ధమైన పాలనావ్యవస్థను ప్రసాదించిన ఘనుడితడే. అతడు ప్రవేశపెట్టిన కొన్ని సంస్కరణలు షేర్షా అక్బరుల వంటి ప్రఖ్యాత ముస్లిం చక్రవర్తులకు

మార్గదర్శకములయ్యాయి. ఆర్థికరంగంలో అతడు చేసిన వినూత్న ప్రయోగాలు 'నభూతో నభవిష్యతి' (అతనికి పూర్వం లేదు. తరువాత గూడా లేవు).

8.1 రాజధర్మ స్వరూపం : అల్లాఉద్దీన్ అనుసరించిది నిరంకుశ రాజరిక విధానము. బాల్బన్‌వలె అతడు గూడా రాజ్యాధికారం దైవదత్తమనే విశ్వసించాడు. రాజు దైవాంశ సంభూతుడు. మానవులలో అతనికి సాటియగు వారెవ్వరూ లేరు అని అతని భావన. అందువలన రాజ్యపాలనలో ఎవరి జోక్యమును అతడు సహించెడివాడు కాదు. రాజ్యాధికారాన్ని ఉలేమాల ప్రభావంనుండి వియుక్తి చేశాడు. రాజ్యపాలనలో మత ప్రమేయం లేకుండా చేసిన మొట్టమొదటి ఢిల్లీసుల్తాన్ అల్లాఉద్దీన్ ఖిల్జీయే. తుదకు ఇస్లాం ప్రపంచాధినేత ఖలీఫా కటాక్షమునకు గూడా చూడకుండా పరిస్థితులకు అనుగుణంగా, రాజ్య శ్రేయస్సుకు, సుస్థిరతకు అవసరమైన శాసనాలను నేను అమలు జరుపుతాను" అని నిర్భయంగా తన విధాన ప్రకటన చేశాడు.

8.2 అవిధేయతను తిరుగుబాటులను అణచుటకు తీసుకున్న చర్యలు : అల్లాఉద్దీన్ చండశాసనుడైనను అతనికాలంలో గూడా అనేక తిరుగుబాటులు జరిగాయి. నవముస్లింలు, ఆకత్‌ఖాన్, అమీర్ ఉమర్ (బదౌన్), మంగూఖాన్ (అయోధ్య), మున్నగువారి తిరుగుబాటులు, ఢిల్లీలో హాజీమౌలా కుట్రలు మున్నగు సంఘటనలను గమనించిన సుల్తాన్ కఠినతర విధానముల ఆవశ్యకతను గుర్తించాడు. సన్నిహిత సలహాదారులతో జరిపిన చర్చల ఫలితంగా అధికారులలోను, ప్రజలలోను అవిధేయత, నిర్లక్ష్యం పెరుగుటకు గల కారణాలను గ్రహించాడు. అవి : (1) రాజ్యవ్యవహారాలలో సుల్తాన్ ఉదాసీనత (2) మద్యపానం (3) సర్దారుల మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడుట (4) ప్రజల వద్దనున్న సంపద అనునవి. ఈ లోపములను సవరించి పరిస్థితులను అదుపులో నుంచుటకు తన అధికారమును పటిష్ఠ పర్చుకొనుటకు అల్లాఉద్దీన్ నాలుగు శాసనములు చేశాడు.

(1) సమర్ధవంతమైన గూడచార వ్యవస్థను నెలకొల్పి రాజ్యవిషయాలు, ప్రభువర్గ కార్యకలాపాలు ఎప్పటికప్పుడుతెలుసుకుంటూ కుట్రలను అరికట్టినాడు. గూఢచారులకు భయపడి ప్రభువర్గీయులు తమ భావములను సంజ్ఞల ద్వారా తెలుపుకొనెడివారట !

(2) మత్తు పదార్థముల సేవనం సర్వార్థములకు మూలమని దానిని నిషేధించి మద్యం నిలవలను పారబోయించాడు.

(3) సుల్తాన్ అనుమతి లేకుండా ప్రభువర్గీయుల మధ్య వివాహ సంబంధాలు వారి సమావేశాలు విందులు నిషేధించబడినాయి.

(4) రాజ్యంలో తిరుగుబాటు ధోరణులు ప్రబలుటకు ధనం కారణమని గ్రహించిన సుల్తాన్, ప్రభువర్గమనుభవించు భరణాలు మతసంస్థలకిచ్చిన భూదానాలను, గ్రామాధికారులు జమిందారులు అనుభవించు వాససత్వపు హక్కులను రద్దుచేశాడు.

8.3 హిందూవుల నణచుటకు తీసుకున్న చర్యలు : అల్లాఉద్దీన్ హిందువుల పట్ల నిర్దాక్షిణ్యంగా అమానుషంగా వ్యవహరించినాడు హిందువులు రాజకీయాధికారం కోల్పోయినను ఆర్థికంగా కొన్ని ప్రత్యేక వసతులు అనుభవించుచున్నారు. వారిలో సామాన్యులు, జమిందారుల అని రెండు వర్గముల వారున్నారు. చౌదరీలు, ఖుద్‌లు, ముఖద్దంలు జమిందారులు. వీరు ప్రభుత్వానికిప్రజలకు మధ్య దళారీలుగ వ్యవహరించేవారు. భూసంబంధమైన వ్యవహారాలలో అనుభవజ్ఞులగుట వలన వీరు స్థానికంగా పలుకుబడి పెంచుకొని ఫ్లరి మున్నగ పన్నులనుండి వినహాయింపులు పొంది సంపన్నులయ్యారు. విలువైన వస్త్రాలు ధరించి, తాంబూలం సేవిస్తూ మేలు అశ్వాల మీద స్వారిచేస్తు హిందువులు విలాసవంతంగా, నిర్లక్ష్యంగా జీవిస్తున్నారని బరానీ పేర్కొన్నాడు. అల్లాఉద్దీన్ వారిని పేదలుగాను రాజ్యానికి విధేయులుగాన చేయుటకు అనేక చర్యలు తీసుకున్నాడు. (1) వంశపారంపర్యంగా చౌదరీలు, ఖుద్‌లు, ముఖద్దంలు అనుభవించు హక్కులను రద్దుచేశాడు (2) వారినుండి పంటలో సగభాగం భూమిశిస్తుగా వసూలుచేయబడింది. (3) జిజియా, ఇల్లరి, పుల్లరి వంటి పన్నులు వారిమీద విధింపబడ్డాయి వారు మేలుజాతి అశ్వాలు అధిరోహించరాదని విలువైన దుస్తులు ధరింపరాదని, తాంబూలం సేవింపరాదని, ఆయుధాలు ధరింపరాద ఆంక్షలు విధింపబడ్డాయి. నిరుపేదలుగా మారిన చౌదరీల, ముఖద్దంల భార్యలు సైతం గత్యంతరం లేక ముస్లిం గృహాలలో పనిచే జీవించారట ! ఇట్లు అల్లాఉద్దీన్ హిందువులను ఆర్థికంగా, సామాజికంగా అణగద్రొక్కినారు.

**8.4 ఆర్థిక సంస్కరణలు :** (1) మంగోలుల దండయాత్రలు వలన పెరిగిన సైనిక వ్యయం పెక్కు ఆర్థిక సంస్కరణలక దారితీసింది. ఖుద్‌లు, చౌదరీలు, ముఖుద్దంలు అనుభవిస్తున్న రెవిన్యూ మినహాయింపులు రద్దుచేయబడ్డాయి. (2) అందరి నుండి పంటల

సగభాగం భూమిశిస్తుగా వసూలుచేయబడింది. (3) పంటభూమి విస్తీర్ణము మరియు దిగుబడిని బట్టి శిస్తు నిర్ణయింపబడింది. ఈ విధంగా భూమిశిస్తు నిర్ణయించిన మొదటి ముస్లిం ప్రభువు అల్లా ఉద్దీన్ ఖిల్జీయే. ఈ విధానం వలన భూకామందుల మీద, రైతుల మీద ప్రభుత్వానికి గట్టి అదుపు ఏర్పడింది. (4) ఇల్లరి, పుల్లరి మున్నగు పన్నుల విధింపబడ్డాయి. (5) సామాన్యుల నుండి 10 టంకాలు, మధ్యతరగతి నుండి 20 టంకాలు, సంపన్నుల నుండి 40 టంకాలు జిజియాపన్నుగా వసూలుచేయబడింది. (6) ఖామ్స్ ద్వారా లభించు సొమ్ము ప్రభుత్వానికి మరొక ఆదాయమార్గం. (7) గంగా - యమునా అంతర్వేది వంటి సమీప ప్రాంతాలలో నగదుకు మారుగా ధాన్యరూపంలో శిస్తు వసూలుచేయబడింది. (8) ఉద్యోగుల వేతనాలు పెంచి రెవిన్యూ శాఖలో అవినీతిని తొలగించుటకు అల్లా ఉద్దీన్ ప్రయత్నించాడు.

**ఫలితాలు :** అల్లా ఉద్దీన్ ఆర్థిక సంస్కరణల వలన రైతుల నిరుపేదలైయ్యారు ; తిరుగుబాటులు తగ్గిపోయినవి; ప్రభుత్వానికి, కర్షకులకు నేరుగా సంబంధాలు ఏర్పడినాయి; ప్రభుత్వాదాయం గణనీయంగా పెరిగింది. శిస్తు విధింపులోను, వసూళ్లలోను సుల్తాన్ తీసుకున్న కఠిన చర్యలవలన కర్షకులు, భూకామందులు, రెవిన్యూ ఉద్యోగులు మున్నగు అన్ని వర్గాలలో తీవ్ర అసంతృప్తి చెలరేగింది.

**8.5. సైనిక సంస్కరణలు :** బరానీ అన్నట్లు "రాజరికమే సైన్యం, సైన్యమే రాజరికం". నాడు, నేడు రాజ్యాల ఉనికి సైనిక శక్తి మీదనే ఆధారపడి ఉంది. రాజ్య సంపాదనలో, నిర్వహణలో, రక్షణలో అపార సైనిక శక్తి ఆవశ్యకతను - అందునా కేంద్రప్రభుత్వమూల బల అవసరాన్ని - అల్లాఉద్దీన్ గుర్తించాడు. కావుననే ఇతడు 4,75,000 ల ఆశ్విక సైన్యాన్ని ఏర్పర్చాడు. ఇదిగాక 50,000 బానిసదళమున్నది. సైనిక నిర్వహణలో అల్లాఉద్దీన్ అనేక ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నాడు. (1) తనకు పూర్వం ఏ సుల్తానుకాలంలో లేనంత భారీసంఖ్యలో కేంద్రప్రభుత్వ అధీనంలో సిద్ధసైన్యమును ఏర్పాటు చేసి వారికి నగదు రూపంలో వేతనాలు చెల్లించాడు. సైన్యంలో అశ్వికదళం, పదాతిదళం, గజదళం ఉండేవి. దండయాత్రల సమయంలో మరికొందర్ని తాత్కాలికంగా సైన్యంలో చేర్చుకునేవారు. (2) సైనిక నిర్వహణ దశాంశ పద్ధతిలో జరిగేది. (3) మస్తరు సమయమున సైనికులలో మోసములను నివారించుటకు వారి ఆనవాళ్లను కూడిన పట్టికలు తయారుచేయించినాడు. (4) మేలుజాతికి చెందిన ప్రభుత్వ అశ్వాలను మార్చుటకు వీలులేకుండా వాటిపై రాజముద్రలు వేయించినాడు. (5) సైనికుల నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని పెంపొందించుటకు క్రమబద్ధమైన శిక్షణతోపాటు మంచి ఆయుధాలను, మేలుజాతి అశ్వాలను వారికి సమకూర్చినాడు. ప్రభుత్వ ఆదాయంలో అధిక భాగం నిర్వహణకే ఖర్చయ్యింది.

## 8.6 మార్కెట్ ధరల నియంత్రణ :

ఆవశ్యకత : సామంతులు చెల్లించు కప్పముల వలన, దండయాత్రల ద్వారా లభించు దోపిడీ సొమ్మువలన, సైనికులకు నగదురూపంలో చెల్లించు వేతనాలవలన, మంగోలుల దండయాత్రల వలన చిన్నా భిన్నమైన వర్తకము వలన నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగినాయి. ధరలుపెరిగి సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. సైనికుల పరిస్థితి మరీ దుర్భరంగా తయారయ్యింది. పరిస్థితిని చక్కదిద్దుటకు అతని ముందు రెండు మార్గాలున్నాయి. ఒకటి సైనికుల వేతనాలు పెంచుట : రెండవది వస్తువుల ధరలు అదుపులోనుంచి స్వల్ప వేతనములోనే వారు సౌఖ్య ప్రదంగా జీవించునట్లు చేయుట. అల్లాఉద్దీన్ రెండవ మార్గాన్నే ఎంచుకున్నాడు.

**ప్రధానాంశాలు :** అల్లాఉద్దీన్ మార్కెట్ ధరల నియంత్రణ మూడు అంశాలపై ఆధారపడి వుంది: (1) స్థిరమైన వేతనాలు (2) స్థిరీకరింపబడిన ధరలు (3) ఆహారపదార్థాలు మరియు ఇతర వస్తువుల సరఫరా.

**వేతనాలు :** ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు స్థిరంగా నిర్ణయించబడినాయి. ఉదా. ఆశ్విక సైనికుని సాలుసరి వేతనం 234 టంకాలు. మొరక అశ్వాన్ని పోషించిన వారికి అదనంగా 78 టంకాలు ముట్టేవి. కాల్బటుని సాలుసరి వేతనం 78 టంకాలు.

**ధరలు :** ఆహారపదార్థాలు, రొట్టెలు, కూరగాయలు,వస్త్రాలు, బానిసలు, అశ్వాలు, టోపీలు, పశువులు, మున్నగువాని ధరలు నిర్ణయింపబడ్డాయి. ఉదా. మణుగు బియ్యం ధర 5జీతాలు; గోధుమలు 7 1/2 జీతాలు; శేరు చక్కెర 1 1/2 జీతాలు; వెన్న 1 జీతాలకు 2 1/2 శేర్లు; అశ్వాల ధరలు 65 నుండి 120 టంకాలు; బానిసలు ధరలు 5నుండి 30 టంకాలు. ప్రభుత్వ ధరలు అమలుపర్చని వారు కఠిన దండనలకు గురిచేయబడ్డారు. లాభాపేక్షతో తక్కువ తూకములు తూచిన వ్యాపారుల శరీరం నుండి తగిన తూకమంత మాంసమును కోయించేడివారట ! మార్కెట్‌లో ఒకే విధమైన ధరలుండుట నాటి వింతలలో నొకటియని బరానీ పేర్కొన్నాడు.

**సరఫరాలు :** ధాన్యము మరియు ఇతర వస్తువుల, సరుకుల సరఫరా జరుగుటకు అల్లాఉద్దీన్ అనేక చర్యలు తీసుకొన్నాడు. వర్తకుల పేర్లను రిజిష్టరులో నమోదు చేయించాడు. ప్రభుత్వ అనుమతి పొందినవారే ధాన్యం కొనుగోలు చేయవలెను. దొంగ వ్యాపారం, అక్రమనిల్వలు నిషేధింపబడ్డాయి. ధాన్యమును ప్రభుత్వ గిడ్డంగులలో నిల్వచేయించి అత్యవసర పరిస్థితులలో మామూలు ధరలకు సరఫరా చేయించాడు. విదేశాలనుండి దిగుమతి సరుకుల మీద కలిగే నష్టాన్ని ప్రభుత్వం భరించేది.

**ఉద్యోగులు :** మార్కెట్ వ్యవహారాల పర్యవేక్షణకు దివాన్ - ఇ - రియాసత్, షహానాయినుండి మున్నగు అధికారులతు నియమింపబడ్డారు.

ఫలితాలు : సమర్ధవంతమైన గూఢాచార వ్యవస్థ మార్కెట్ నిబంధనలు, వాటిని ఉల్లంఘించిన వారిని కఠినంగా శిక్షించుట మున్నగు అంశాలవలన అల్లాఉద్దీన్ విధానం విజయవంతంగా పనిచేసింది. తద్వారా అతడు అపారసైన్యాన్ని పోషింపగలిగినాడు. అతని ఆశయం నెరవేరింది. సైనికులు సంతృప్తి చెందారు. ప్రభుత్వోద్యోగులు హర్షించారు. కార్మికులు, కర్షకులు వ్యాపారులు తీవ్ర అసంతృప్తికి గురియ్యారు. కర్షకులు నష్టపోయారు. వ్యాపారాభివృద్ధి కుంటుపడింది.

**8.7. సారస్వత, కళాపోషణ :** తాను విద్యానంతుడు కాకున్నను అల్లాఉద్దీన్ విద్యాభిమాని. తన ఆస్థాన వైభవాని కనుగుణ్యాంగా సారస్వత కళలను పోషించాడు. అమీర్ ఖుస్రూ, అమీర్ హసన్, అర్స్‌లాన్ కోహ్లి, కబీరుద్దీన్, షేక్ నిజాముద్దీన్ మున్నగు ప్రముఖ కవులాతని పోషణ నందుకొన్నారు. 'అలైదర్వాజా' సిరిదుర్గం, సహస్రస్తంభ ప్రాసాదం అతని కళాభిమానమునకు నిదర్శనములుగా నిలిచివున్నవి. 'అలైదర్వాజా' భారతదేశంలోని తురుష్క వాస్తురీతిని ప్రతీకయని విమర్శకుల అభిప్రాయం.

**8.8. అల్లాఉద్దీన్ విధానాలలో లోపాలు :** అపార సైనిక శక్తితో, సమర్థవంతమైన గూఢచార దళ సహాయంతో అల్లాఉద్దీన్ ఆరాచక శక్తులనుంచి సర్వాధికారి అయినాడు. మంత్రులు సుల్తాను అజ్ఞలును తలదాల్చు కార్యదర్శులైనారు.

రాష్ట్రాధికారులు పూర్తి అదుపులోనున్నారు. రాజద్రోహకర కార్యకలాపాలు తుడిచి పెట్టబడ్డాయి. రాజాజ్ఞధిక్కారం కఠినంగా శిక్షింపబడింది. సుల్తాను నిరంకుశాధికారం మును పెన్నడూ లేనంత ఉన్నతస్థాయికి చేరుకుంది. కానీ అతని విధానాలలో కొన్ని లోపాలున్నాయి. అవి : (1) అల్లాఉద్దీన్ ప్రభుత్వం కేవలం సైనిక నియంతృత్వము. అంతేకాని ఈ అధికారమంతా ప్రజల ఆదరాభిమానముల మీద ఉద్యోగుల సహకారం మీద ఆధారపడింది కాదు. సైనిక నియంతృత్వాల పునాదులెప్పుడు స్థిరంగా ఉండజాలవు. (2) మితిమీరిన అధికార కేంద్రీకరణ, అణచివేత చర్యలు, గూడాచారుల కార్యకలాపాలు క్రమేణాపాలనా యంత్రాంగాన్ని నిర్వీర్యం చేశాయి. (3) గూఢచారుల చర్యలకు తురుష్క సర్దారులు కలతచెందారు. వారికి ప్రశాంతత కరువయ్యింది. (4) క్రూర హత్యలకు గురియైన నయా ముస్లింలతో సామరస్య సాధనకు కృషి జరగకపోవుటచే వారు సుల్తాన్‌ను ద్వేషించు చుండిరి. (5) అన్ని విధాల అణగద్రొక్కబడిన హిందువులు అవకాశం కొరకు ఎదురుచూస్తున్నారు. (6) వర్తక వర్గాలవారు మార్కెట్ నిబంధనలు నిరసించినారు. (7) ఉద్యోగులలో ఉదాసీనత చోటు చేసుకున్నది. (8) అధికారమంతా సుల్తాన్ వ్యక్తిత్వం మీద ఆధారపడి వుంది. ఎంత సమర్థుడైనప్పటికీ సువిశాల సామ్రాజ్యపాలన బాధ్యతలను ఒకేవ్యక్తి నిర్వహించుట అసాధ్యం.

**9. అవసాన దశ - మరణం :** పైబడుతున్న సుల్తాన్ వయస్సు, క్షీణిస్తున్న ఆయన ఆరోగ్యం రాజ్యపరిస్థితులను దిగజార్చాయి. రాజ్యసౌధం బీటలువారు చిహ్నాలు గోచరించినాయి. సుల్తాన్‌పట్ల భయగౌరవాలు తగ్గజొచ్చినవి. దూరప్రాంతాలలో తిరుగుబాటు ధోరణులు తలలెత్తినవి. మేవార్, దేవగిరి రాజ్యాలు స్వాతంత్ర్యం ప్రకటించినాయి. రాజధాని కుట్రలకు నిలయమయింది. కుమారులు విద్యాబుద్ధులు లేక విషయలోలురైయ్యారు. తన నమ్మిన బంటు మాలిక్‌కాఫర్ భస్మాసురుడైయ్యాడు. సుల్తాన్ కాఫర్ చేతిలో కీలుబొమ్మ అయ్యాడు. యువరాజైన ఖిజర్‌ఖాన్‌కు కాఫర్‌కు విభేదాలు పెరిగినాయి. ఖిజర్‌ఖాన్‌కు ఖైదుచేయించి, అతని పక్షం వహిస్తున్నాడనే ఆగ్రహంతో గుజరాత్ గవర్నరయిన అలప్‌ఖాన్‌ను హత్యచేయించాడు. గుజరాత్‌లో తిరుగుబాటు చెలరేగింది. అదృష్టదేవత చంచలమైయ్యింది. తాను నిర్మించిన సామ్రాజ్య వ్యవస్థ తన కళ్లముందే కూలిపోతూవుంటే మహోదర వ్యాధిపీడితుడైన సుల్తాన్ నిస్సహాయంగా చూస్తూ క్రీ.శ 1316 జనవరి 6వ తేదీన శ్వాసవదిలాడు. విషప్రయోగ ద్వారా మాలిక్‌కాఫర్ అల్లాఉద్దీన్‌ను చంపించాడనే వదంతి ఉంది.

10. **అల్లాఉద్దీన్ ఘనత :** ఢిల్లీ సుల్తానులలో అల్లాఉద్దీన్ అగ్రగణ్యుడు; అత్యంత సమర్థుడు. ఉత్తర, దక్షిణ భారతదేశాలలో అనేక ఘనవిజయాలు సాధించి విశాల సామ్రాజ్య నిర్మాత అయ్యాడు. ముస్లింల అధికారాన్ని దక్షిణాపథంలో మొదటిసారిగా ప్రతిష్టించిన ఘనత అల్లాఉద్దీన్‌కే దక్కుతుంది. "విద్యా విహీనుడు గూడా రాజ్యమేలగలడన్న" టెన్నిసన్ కవిసూక్తి అల్లాఉద్దీన్ విషయంలో యదార్థమయ్యింది. పరిపాలనలో అతడు చేసిన సంస్కరణలు షేర్షాకు అక్బర్‌కు మార్గదర్శకములయ్యాయి. రాజ్య వ్యవహారాలలో మతప్రమేయం లేకుండా చేసిన తొలి ముస్లింప్రభువు అతడే. మార్కెట్ ధరలను అదుపులో నుంచుటకు అతడు తీసుకొన్న చర్యలు నిరుపమానాలు. పరమక్రూరులయిన మంగోలుల దాడులనుండి భారతదేశాన్ని కాపాడిన ఘనుడు అల్లాఉద్దీన్. షేర్షా, అక్బర్, ఔరంగజేబులు మినహా అతనితో సాటిఅయిన ముస్లిం ప్రభువులేడు. కానీ రాజ్య నిర్మాణంలోను, నిర్వహణలోను అతడు నిర్దాక్షిణ్యంగా వ్యవహరించాడు. బదౌనీ మాటలలో చెప్పవలెనన్న "ఏ ఫారోగూడా అల్లాఉద్దీన్ చిందించినంత రక్తపాతానికి పాల్పడలేదు". ఇబన్ బతూతా అభిప్రాయంలో సుప్రసిద్ధ సుల్తాన్‌ల కోవలోచేరినవాడు అల్లాఉద్దీన్.

## 23. 5. ఖిల్జీవంశ పతనమునకు కారణాలు :

అల్లాఉద్దీన్ నిరంకుశ విధానాలు, అతని సైనికతత్వం, మార్కెట్ నిబంధనలు, మతవిధానం, హిందువులపట్ల అతని విధానం, అతని వారసుల అసమర్థత, ఒకే వ్యక్తి సామర్థ్యం మీద ఆధారపడిన రాజ్యవ్యవస్థ స్వభావం, దూర రాష్ట్రముల పాలకుల తిరుగుబాట్లు, మంగోలుల దండయాత్రలు, మాలిక్‌కాఫర్, ఖుస్రూఖాన్‌ల వంటి బానిసల మితిమీరిన అధికారాలు, వారి స్వార్థచింతన మున్నగు కారణాల వలన ఖిల్జీవంశం అనతికాలంలోనే అంతర్ధానమైయ్యింది.

తుష్కర అమీరులు ఢిల్లీ కొత్వాలు 'ఫక్రుద్దీన్' నాయకత్వములో ముఠాగా ఏర్పడి, బాల్బన్ తన వారసునిగా నియమించిన 'ఖుస్రూను తొలగించి, 'ఖుగ్రాఖాన్' కుమారుడైన 'కైకుబాద్' ను సింహాసన మధిష్టంప చేశారు. ఇతడు కూడా బాల్బన్ క్రమశిక్షణలో పెంచబడినవాడే కాని సింహాసన మధిష్టించిన తరువాత అతనిలో అణగి ఉన్న కోర్కెలు ఒక్కసారిగా విజృంభించి, భోగలాలసుడు, మధుపాన వ్యసనపరుడుగ తయారయ్యాడు. పరిపాలనను పూర్తిగా నిర్లక్ష్యం చేశాడు. ఫలితంగా తురుష్క, ఖిల్జీ జాతుల మధ్య అధికారం కొరకు కలహాలు ప్రారంభమయి తురుష్క నాయకుడు నిజాముద్దీన్, అధికారాన్ని హస్తగతం చేసుకొన్నాడు. ఇతడు చివరకు ఖిల్జీ పక్షనాయకుడైన జలాలుద్దీన్ ఫిరోజ్‌చే వధింపబడ్డాడు. తురుష్క సర్దారులు యిది సహించలేక కైకుబాద్ కుమారుడైన 'కయుమార్స్' ను సింహాసన మధిష్టింపచేశారు. కాని 1290లో జలాలుద్దీన్ ఖిల్జీ కయుమార్స్, కైకుమార్స్, కైకుబాద్‌లను అంతమొందించి ఢిల్లీ సింహాసనంను ఆక్రమించినాడు. అంతటితో బానిస వంశమంతరించింది.

## 23.6 సారాంశము

సామ్రాజ్య నిర్మాణంతోపాటు పరిపాలనా యంత్రాంగానికి గూడా అల్లాఉద్దీన్ రూపకల్పన చేశాడు. ప్రభువర్గంలో, ప్రజలలో రాజద్రోహచింతన అరికట్టుటకు, తిరుగుబాట్లు అణచివేయుటకు అనేకచర్యలు తీసుకొన్నాడు. హిందువులపై కఠినమైన ఆంక్షలు విధించి వారిని అణచివేశాడు. మొట్టమొదటిసారిగా భూమిని సర్వే చేయించి శిస్తు నిర్ణయం చేసాడు. కేంద్రప్రభుత్వ ఆధీనంలో అపారసేనావాహినిని ఏర్పాటుచేసి సైనిక నిర్వహణలో మోసములు జరుగకుండా తగుచర్యలు తీసుకొన్నాడు. సామ్రాజ్య సైనికావసరాలను, ఆర్థికపరిస్థితిని దృష్టిలోనుంచుకొని మార్కెట్ ధరలను అదుపుచేశాడు. సార్వస్వతాభిమానియై అమీర్ ఖుస్రూ, అమీర్ హసన్‌లకు ఆశ్రయమిచ్చాడు. కళాభిమానంతో లైదర్వాజా మున్నగు కట్టడాలను నిర్మించాడు.

ఈవిధంగా వివిధ రంగాలలో ఘనవిజయాలు సాధించిన అల్లాఉద్దీన్ తన అవసాన దశలో మాలిక్ కాఫర్ కుట్రవలన అశాంతితో బాధపడి క్రీ.శ. 1316లో మరణించాడు.

## సంప్రదించిన మరియు ఉపయుక్త గ్రంథాలు


1. Lal. K.S. : History of the Khiljis
2. Ajyangar. K.S. : South India and Her Mohammadan Invaders
3. Iswari Prasad : A History of Medieval India from A.D. 647 to 1526
4. Srivastava A.L : The Delhi Sultanate
5. Sharma S.R. : The Crescent in India
6. Mehta J.L. : Advanced Study in the History of Medieval IndiaVol I
7. Pomdeg A.B. : Early Medieval India
8. Meera Singh : Medieval History of India
9. Majumdar R.C. Ray Choudhuri H.C. & Datta K.K. : An Advanced History of India
10. Majumdar R.C. (Ed) : The History and culture of Indian People, Vol VI - The Delhi Sultanate
11. వారణాసి యశోదాదేవి బి.యస్. యల్. హనుమంతరావు : భారతదేశ చరిత్ర - సంస్కృతి, ప్రథమ భాగము, తెలుగు అకాడమి.


## ప్రశ్నలు

### I. వ్యాస ప్రశ్నలు (Essay Questions)

1. అల్లాఉద్దీన్ ఖిల్జీ రాజ్యవిస్తరణలో వివిధ ఘట్టములేవి?
2. అల్లాఉద్దీన్ పరిపాలనా విధానములోని ప్రధానాంశములేవి?

### II. లఘువ్యాస ప్రశ్నలు (Short Essay Questions)

1. జలాలుద్దీన్ కాలమునాటి ప్రధాన సంఘటనలను పేర్కొనుము.
2. అల్లాఉద్దీన్ ఖిల్జీ తరువాత ఖిల్జీల అధికారమెట్లు క్షీణించెను?
3. అల్లాఉద్దీన్ కాలమునాటి మంగోలుల దండయాత్రలను వివరింపుము.

### III. లఘు ప్రశ్నలు (Short Notes)

1. నయాముస్లింలు 2. అల్లాఉద్దీన్ మార్కెట్ నిబంధనలు
3. మాలిక్‌కాఫర్ 4. ముబారక్ షా 5. నాసరుద్దీన్ ఖుస్రూషా

### IV. కుశాగ్రబుద్ధి ప్రశ్నలు (Objective Type Questions)

1. క్రింది వానికి సమాధానములు బ్రాకెట్లలో వ్రాయండి.

1. జలాలుద్దీన్ వధించిన మతగురువు ( )

ఎ) షేక్ సలీంచిష్టి బి) నిజాముద్దీన్ ఔలియా సి) సిద్దిమౌలా
డి) షేక్ ముబారక్ ఇ) ముల్లా మొహమ్మద్ యజ్దీ

2. జలాలుద్దీన్ కాలమునాటి దారిదోపిడి దొంగలు ( )

ఎ) మియోలు బి) దగ్గులు సి) పిండారీలు
డి) మంగోలులు ఇ) పఠానులు

3. ఢిల్లీ సామ్రాజ్యంపై పలుమారులు దండెత్తిన జాతి ( )

ఎ) ఆఫ్ఘనులు బి) పఠానులు సి) తురుష్కులు
డి) మంగోలులు ఇ) హుణులు

4) అల్లాఉద్దీన్ చితోడ్ దాడికి ప్రధాన కారణంగా చెప్పబడింది ( )

ఎ) రాజ్య విస్తరణ బి) ఇస్లాం వ్యాప్తి సి) పద్మినీని చేపట్టుట
డి) రాణారతన్ సింగ్‌ను శిక్షించుట ఇ) మేవార్ సంపదను కొల్లగొట్టుట

5) రాణి పద్మినీని చేపట్టుటకు అల్లాఉద్దీన్ చితోడ్ దుర్గమును ముట్టడించెనను ఇతివృత్తముగల కావ్యం ( )

ఎ) మాలతీమాధవం బి) పద్మావత్ సి) దేవల్ రాణి
డి) ఖజానుల్ ఫుతూహ్ శిక్షించుట ఇ) తాలీఖ్ - ఇ - ఫిరోజ్ షాహి

5) మార్కెట్ నియంత్రణ ఇతడు చేశాడు ( )

ఎ) ఇల్ టుట్‌మిష్ బి) బాల్బన్ సి) జలాలుద్దీన్
డి) ముబారక్ షా ఇ) అల్లాఉద్దీన్

పాఠ్య రచయిత

డా. ఒంగోలు సాంబయ్య

పాఠం - 24

# తుఘ్లక్ (క్రీ.శ. 1320 - 1413)

## 24.1 లక్ష్యం :

తుఘ్లక్ వంశీయుల అధికార స్థాపన, విస్తరణ పతనాలను గురించి సామాన్యంగా, మహమ్మద్‌బిన్ తుఘ్లక్ విధానాలను గురించి ప్రత్యేకంగా వివరించడమే ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం. ఢిల్లీ సల్తనత్ కాలంలో కడపటి వారైన సయ్యద్, లోడీ రాజవంశాల వారిని గురించి గూడా ఇందులో ప్రస్తావించబడినది.

**ప్రధానాంశాలు :**

- 24.2 చారిత్రకాధారాలు
- 24.3 ఘియాజ్ ఉద్దీన్ తుఘ్లక్
- 24.4 మహమ్మద్ బిన్ తుఘ్లక్ - పాలనా సంస్కరణలు
- 24.5 విదేశాంగ విధానం
- 24.6 తిరుగుబాట్లు
- 24.7 మహ్మద్ వైఫల్యానికి కారణాలు
- 24.8 ఘనత
- 24.9 ఢిల్లీ సుల్తనత్ పతనమునకు కారణాలు
- 24.10 సారాంశము

## 24.2. చారిత్రకాధారాలు :

స్వదేశీ రచనలు :

1) అమీర్‌ఖుస్రూ విరచితమైన "తుఘ్లక్‌నామా"
2) జియాఉద్దీన్ బరనిచే రచింపబడిన "తారీఖ్ - ఇ - ఫిరోజ్‌షాహి" "ఫతావా - ఇ -జహాన్‌దారీ"
3) ఇసామీ రచించిన "ఫుతూహ్ సలాటీన్"
4) షమ్స్ - ఇ - సిరాజ్ ఆఫీఫ్ విరచితమగు "తారీఖ్ - ఇ - ఫిరోజ్‌షాహి"
5) యాహ్యాబిన్ అహ్మద్ రచించిన "తారీఖ్ - ఇ - ముబారక్‌షాహి"

విదేశీ రచనలు :

6) ఆఫ్రికా బాటసారి ఇబిన్‌బతూతా యాత్రా విశేషములతో కూడిన "రిహ్లా"
7) తాష్కెంట్ చెందిన బ్రదుద్దీన్ గేయకావ్యాలు.
8) తైమూర్ ఆత్మకథ "మల్‌ఫూజాత్ - ఇ - తైమూర్"
9) బాబర్ స్వీయ చరిత్ర "తుజక్ - ఇ - బాబరీ"

**తుఘ్లక్ వంశం (క్రీ.శ. 1320 - 1413) :** తుఘ్లక్ వంశీయులు కరౌనా తెగకు చెందిన తురుష్కులు. వీరు సింధు తుర్కిస్థాన్‌ల మధ్య పర్వత ప్రాంతాలలో నివసించేవారు. తురుష్కతండ్రులకు తురుష్కేతర తల్లులకు జన్మించిన సంకరజాతి

సంతానమే కరౌనాతెగ. తుఘ్లక్ అనునది వ్యక్తిపేరు. తెగపేరుకాదు. "కుత్‌లఘ్" భ్రష్టరూపమే తుఘ్లక్ అని ఫెరిషా పేర్కొన్నాడు. కావున తుఘ్లక్ అనేది వ్యక్తినామమని తెలియుచున్నది. బాల్బన్ వద్ద బానిసగా నున్న తుఘ్లక్ ఈ వంశమునకు మూలపురుషుడు. ఇతడొక జాట్‌వనితను వివాహమాడగా ఘాజీ తుఘ్లక్, రజబ్, అబూబకర్ అను ముగ్గురు కుమారులు కలిగారు.

## 24.3 ఘియాజ్ ఉద్దీన్ తుఘ్లక్ (క్రీ.శ. 1320 - 25)

**24.3.1. తొలి జీవిత విశేషాలు :** ఘియాజ్ ఉద్దీన్ తుఘ్లక్ అసలు పేరు ఘాజీతుఘ్లక్. అతడు అల్లాఉద్దీన్ ఖిల్జీకాలంలో సామాన్య సైనికునిగా తన ఉద్యోగ జీవితం ప్రారంభించినాడు. ప్రభుభక్తి పరాయణుడైన ఘాజీ తుఘ్లక్ ఖిల్జీ వంశస్థులందరూ మరణించినారని తెలిసి క్రీ.శ. 1320లో సెప్టెంబరు 8వ తేదీన ఘియాజ్ ఉద్దీన్ తుఘ్లక్ పేరుతో ఢిల్లీ సింహాసన మధిష్టించినాడు. ఢిల్లీ సమీపంలో తుఘ్లకాబాద్ అను నూతన దుర్గమును నిర్మించి దానిని తన రాజధానిగా చేసుకొన్నాడు. ఘియాజ్ ఉద్దీన్ ఆంతరంగిక విధానాలు అతని ఉదార స్వభావాన్ని ప్రతిబింబిస్తాయి. తన పెద్ద కుమారుడు ఫక్రుద్దీన్ జునా ఖాన్‌ను యువరాజుగా ప్రకటించాడు. కర్షకుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచి ప్రభుత్వ ఆదాయమును పెంచుటకు కృషిచేసిన మొట్టమొదటి ఢిల్లీ సుల్తాన్ ఘియాజ్ ఉద్దీన్ తుఘ్లక్. శిస్తు పెంపుదల పంటల పదవవంతు లేక పదకొండవ వంతును మించరాదని రెవిన్యూ ఉద్యోగులను అతడు ఆదేశించాడు. బంజరు భూమిని సాగులోనికి తెచ్చుట ద్వారా అదనపు ఆదాయమును సమకూర్చుట ఉత్తమ మార్గమని అతడు భావించాడు. రాజ్యరక్షణార్థం శక్తివంతమైన సైన్యం ఆవశ్యకతను ఘియాజ్ గ్రహించినాడు. సైనిక నిర్వహణలో మోసాలు నివారించుటకు అల్లాఉద్దీన్ ప్రవేశపెట్టిన విధానాలు - గుర్రాలకు రాజముద్రలు వేయించుట, సైనికులకు ఆనవాళ్ళు వ్రాయించుట కొనసాగించాడు. సైనికులను తృప్తిపరచుటకు వారి వేతనములు పెంచాడు. న్యాయనిర్వహణలో ఘియాజ్ నిష్పాక్షికంగా వ్యవహరించినట్లు సమకాలిక చరిత్రకారులు పేర్కొన్నారు. పులి మేక ఒకే రేవులో నీరు త్రాగినవట! శిక్షల కాఠిన్యమును తగ్గించుట కతడు ప్రయత్నించాడు. ప్రభుత్వనిధుల దుర్వినియోగము, రాజద్రోహము వంటి అపరాధములకు మినహా చిత్రహింసలను నిషేధించాడు. సారస్వత, కళాపోషణలో గూడా ఘియాజ్ ఆసక్తిని ప్రదర్శించాడు. అమీర్ ఖుస్రూ, హసన్‌దెహ్లావీ వంటి కవులను అతడు ఆదరించాడు. ఢిల్లీసమీపమున తుఘ్లకాబాద్ దుర్గమును నిర్మించాడు.

ఘియాజ్ ఉద్దీన్ గొప్ప యోధుడు. స్వాతంత్ర్యం ప్రకటించిన సామంత రాజ్యాలైన, ఓరుగల్లు, జాజ్‌నగర్, గుజరాత్, బెంగాల్ తిర్‌గలత్‌లను పునరాక్రమించుటకు ప్రయత్నించాడు.

**మరణం (1325) :** విజయుడై తిరిగివచ్చు తండ్రిని అభినందించుటకు యువరాజు జునాఖాన్ ఢిల్లీ సమీపములోని అఫ్ఘన్‌పూర్ వద్ద ఏర్పాట్లుచేశాడు. బెంగాల్ నుండి తెచ్చిన ఏనుగుల ప్రదర్శన జరిగే సమయంలో సుల్తాన్ ఆసీనుడైయున్న దారుశిబిరం కూలగా ఆ శిధిలాలలో చిక్కుకొని అతడు తనచిన్న కుమారునితోసహా మరణించాడు.

## 24.4. మహమ్మద్ బిన్ తుఘ్లక్ (క్రీ.శ. 1290 - 1325 - 1351) :

"మధ్యయుగమున మహమ్మద్ బిన్ తుఘ్లక్ వలె ఆసక్తిని రేకెత్తించినవాడు అంతగా విమర్శింపబడిన సుల్తాన్ మరెవ్వరునులేరు. అతని ఇరువది ఆరు సంవత్సరాల పాలనా కాలమంతయు విఫలమైన ప్రయోగాత్మక సంస్కరణలతో విషాదాంతముగా గడచినది" అని కె.ఎ. నిజామి అను చరిత్రకారుడు పేర్కొన్నాడు. ఢిల్లీ సుల్తానులలోనేగాక మధ్యయుగ భారతదేశ చక్రవర్తులలో గూడా విశిష్టమైన వ్యక్తిత్వమున్నవాడు మహమ్మద్.

**24.4.1 తొలిజీవితం :** మహమ్మద్ బిన్ తుగ్లక్ అసలుపేరు ఫక్రుద్దీన్ మహమ్మద్ జునాఖాన్. అతడు ఘియాజ్‌ఉద్దీన్ తుగ్లక్ పెద్ద కుమారుడు. క్రీ.శ. 1290 ప్రాంతంలో జన్మించిన జునాఖాన్ అజూదుద్దీన్, ఖుత్‌లఘ్‌ఖాన్‌లను గురువుల వద్ద విద్యనభ్యసించి మంచి విద్యావంతుడయ్యెను. ముస్లిం ప్రభువులలో అంతటి విద్యావంతుడు లేడనే ఖ్యాతిని గడించాడు. మహమ్మద్ బహుభాషాకోవిదుడు. మాతృభాష అయిన తుర్కీలోనే గాక పారశీకంలో గూడా మంచి పండితుడు. పారశీకంలో చక్కనిపద్యాలు వ్రాయగల సమర్థుడు. అరబ్బి, సంస్కృత భాషలను అభ్యసించాడు. అలంకారిక శాస్త్రంలో అఖండుడు. గణిత, ఖగోళ, పదార్థవిజ్ఞాన, చరిత్ర, వైద్య, తర్క, తత్త్వ, మైవశాస్త్రాలను అధ్యయనం చేసినవాడు. అద్భుతమైన జ్ఞాపకశక్తిగలవాడు. పండిత చర్చలలో అతనికి ఆసక్తి ఎక్కువ. మంచివాదనా

పటిమగలవాడు. పెద్దపెద్ద విద్యాంసులు గూడా అతనితో వాదించడానికి తటపటాయించేవారు. అతడు లలిత కళల యందభిమానము గలవాడు. అతని దస్తూరి ముత్యాల వరుసవలె ఉండేది. ఇంతటి బహుముఖ పాండిత్యం సాధించినందువల్లనే బరనీవంటి సమకాలిక చరిత్రకారులు మహమ్మద్‌ను "సృష్టివైచిత్ర్యము" (Wonder of Creation) అని ప్రస్తుతించారు.

కుతుబుద్దీన్ ముబారక్‌షా ఖిల్జీ కాలంలో జునాఖాన్ అశ్వశాలాధిపతిగా నియమితుడవటంతో అతని రాజకీయ జీవితం ఆరంభమయింది. ఖుస్రూషా కాలంలో అదేపదవిలో కొనసాగుతూ అతనిని పదవీచ్యుతినిగా చేయుటలో తండ్రికి సహకరించాడు. ఘియాజ్‌ఉద్దీన్ తుగ్లక్ సుల్తానైనప్పుడు మహమ్మద్ యువరాజుగా ప్రకటింపబడుటయే గాక 'ఉలుఘ్‌ఖాన్' అను బిరుదుతో సత్కరింపబడ్డాడు. యువరాజుగా అతడు ఓరుగల్లు, రాజమహేంద్రవరం, జాజ్‌నగర్‌లను జయించాడు.

**24.4.2. సింహాసనము అధిష్టించుట :** క్రీ.శ. 1325లో ఘియాజ్ ఉద్దీన్ తుగ్లక్ ఢిల్లీ సమీపములోని అఫ్ఘన్‌పూర్ వద్ద మరణించుట వలన జునాఖాన్ మహమ్మద్ బిన్ తుగ్లక్ అనుపేరుతో ఢిల్లీ సుల్తాన్‌గా సింహాసనము నధిష్టించి విశాల సామ్రాజ్యమున కధిపతియైనాడు.

**24.4.3 అతని రాజకీయ మతధోరణులు :** మహమ్మద్ కాలమునాటి ప్రయోగాత్మక సంస్కరణలను విధానాలను అవగాహన చేసుకొనుటకు అతని రాజకీయ, మతధోరణులను గూర్చి తెలుసుకొనుట అవసరం. 1) మహమ్మద్ మేధావి. స్వతంత్రాలోచనలు కలవాడు. 2) రాజకీయంగా పరిపాలనా పరంగా భారతదేశమును ఏకముచేయుటయే అతని ప్రధానాశయము. 3) రాజకీయ అస్థిరత్వంతో కొట్టుమిట్టాడుచున్న మధ్య ఆసియాను జయింపవలెనని అతడు సంకల్పించాడు. 4) పొరుగుదేశములతో సన్నిహిత సంబంధము లేర్పరచుకొనవలెనని అతని కోరిక. 5) ఉదార మతభావాలు, పరమత సహనం కలవాడు. 6) ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రతిభే ప్రధానార్హతయని అతని విశ్వాసం. అంతేగాని పుట్టకకాదు. అర్హతను బట్టి హీనజన్ములకు గూడా బాధ్యతాయుత పదవులొసంగినాడు. హిందువులు గూడా ఉన్నత పదవులలో నియమింపబడ్డారు. మహమ్మద్‌లోని గుణదోషాలను విచారించునప్పుడు ఈ అంశాలను దృష్టిలో నుంచుకోనవలె.

**24.4.4 ప్రయోగాత్మక పరిపాలనా సంస్కరణలు :** పరిపాలనలో అతని సంస్కరణలు, విధానాలు ప్రయోగాత్మకంగా వున్నాయిగాని ఆనాటి పరిస్థితులలో ఆచరణయోగ్యములుగా లేవు. అట్టి ప్రయోగాత్మక చర్యలేవనగా:

**24.4.4.1 రాజధాని మార్పిడి :** మహమ్మద్ కాలమునాటి ప్రయోగాత్మక చర్యలలో అపార జననష్టమునకు తీవ్రవిమర్శకు గురియైనది రాజధానిని ఢిల్లీ నుండి దేవగిరికి మార్చుట. రాజధాని మార్పిడి అనాలోచితంగా జరిగింది కాదు. అందులకనేక కారణాలున్నాయి : (1) ఢిల్లీకంటె దేవగారి ఢిల్లీ సామ్రాజ్యంలోని అన్ని ప్రాంతాలకు అందుబాటులో ఉంటుంది. (2) దక్షిణ హిందూదేశంలో క్రొత్తగా జయింపబడిన ప్రాంతాలను దేవగిరి నుండి అదుపులో నుంచుట సులభం. (3) దోఇణాపథ సంపదను ఆదాయవనరులను పూర్తిగా అనుభవించటకు రాజధానిని దేవగిరికి మార్చుట అవసరం. 4) దేవగిరి ప్రాంతపు వ్యవసాయం, వర్తకం ప్రకృతి రమణీయకత సుల్తానును ఆకర్షించింది. 5) దక్కనులో ముస్లింల సంఖ్యను పెంచి తద్వారా దక్కను సమస్యకు శాశ్వత పరిష్కారమును సాధించుట. 6) తనను దుర్భాషలాడిన ఢిల్లీ పౌరులను శిక్షించపనెంచుట. ఇది సరియైన కారణంగా కన్పించదు. దీనిని కారణముగా కంటే ఫలితముగా భావించుట యుక్తము. 7) ఢిల్లీలో బలవంతులైన తురుష్క సర్దారుల ప్రభావం నుండి తన ప్రభుత్వానికి విముక్తి కలిగించవలెనని మహమ్మద్ ఆశించాడు. 8) తరచుగా భారతదేశ వాయవ్య ప్రాంతాలపై జరుగు మంగోలుల దండయాత్రల నుండి సురక్షిత ప్రాంతమునకు తరలిపోవుటకు దేవగిరి అనుకూలంగా ఉంటుంది.

దేవగిరి దుర్గాన్ని దుర్భేద్యంగా చేసి దానికి 'దౌలతాబాద్' అని పేరుపెట్టి ఢిల్లీ నుండి అచటకు రాజధాని మార్పిడికి ఆదేశించాడు (క్రీ.శ. 1328-29). రాజధాని మార్పిడి రెండు ఘట్టాలలో జరిగింది. మొదట రాజకుటుంబం, ప్రభుత్వకార్యాలయాలతోపాటు ఉద్యోగ సిబ్బంది, రాజాస్థానంతో సంబంధమున్న ప్రభువర్గము మార్చబడింది. పిమ్మట మతాధికారులు, కవిపండితులు, వ్యాపారులు, ప్రభువర్గ కుటుంబాలవారు తరలించబడ్డారు. అంతేగాని సమకాలిక చరిత్ర కారులైన బరనీ, ఇసామీ, ఇబిన్ బతూతాలు వ్రాసిన విధంగా ఢిల్లీ పౌరజనమంతా తరలించబడలేదు. కుక్కపిల్లను, పిల్లకూనలను కూడా సుల్తాన్ తరలించినాడని ముసలివాడైన అంధుని దౌలతాబాద్ వరకు ఈడ్పించినాడని వీరు చేసిన రచనలు విశ్వసనీయాలు కావు. ఎంతటి అవివేకి అయినా యిట్టివ్యర్థమైన చర్యలకు పూనుకొనడు. బ[illegible]నీ, ఇబిన్ [illegible] [illegible] నిశితంగా పరిశీలిస్తే హిందూ పౌరజనులు, సామాన్యవర్గానికి చెందిన ముస్లింలు ఢిల్లీలోనే ఉన్నట్లు

విదితమగుచున్నది. మార్పుకు గురియైన ప్రజల సౌకర్యార్థం సుల్తాన్ అనేక సహాయ చర్యలు తీసుకొన్నాడు. ఢిల్లీలోని వారి గృహాలకు మూల్యం చెల్లించాడు. ఢిల్లీ దేవగిరుల మధ్య దూరం 700 మైళ్లు. అల్లాఉద్దీన్ కాలం నుండి ఈ రెండు నగరాల మధ్యగల రహదారి బాగా మెరుగుపర్చబడింది. ఆ రహదారి వెంట సకల సదుపాయాలతో మజిలీలు ఏర్పాటు చేయించాడు. ఉచిత ఆహారపానీయాలు, సదుపాయాలు కల్పించాడు. ప్రయాణీకులకు రక్షణ కల్పింపబడింది. దౌలతాబాద్ ప్రాంతపు హైందవ వాతావరణం నచ్చలేదు. ఆ వాతావరణం సుల్తాన్‌కు గూడా సరిపడలేదు. అదియునుగాక సుల్తాన్ వాయవ్య సరిహద్దు ప్రాంతాలకు దూరంగా వుండుటవలన మంగోలుల దండయాత్రలు ఎక్కువైనవి. ధనాశ చూపి వారిని మరల్చడానికి సుల్తాన్ చేసిన ప్రయత్నాలు ఫలించకపోగా వారిని మరింతగా రెచ్చగొట్టినాయి. అందువలన సుల్తాన్ రాజధానిని మరల ఢిల్లీకి మార్చినాడు (క్రీ.శ. 1336-36) లేన్‌పూల్ అను ఆంగ్ల చరిత్రకారుడు అన్నట్లు మహమ్మద్ రాజధానిమార్పిడి "వృధా ప్రయాసకు చిహ్నంగా" నిలిచిపోయింది.

భారతదేశ చరిత్రలో రాజధాని మార్పిడి జరిగిన సందర్భాలు లేకపోలేదు. ప్రాచీనయుగమున గుప్తుల కాలంలోను, మధ్యయుగమున మొగలాయిల కాలంలోను, ఆధునిక యుగమున ఆంగ్లేయుల పాలనా కాలంలోను రాజధాని మార్పిడి జరిగింది. ఆయా సందర్భాలలో రాజు లేక రాజ్యాధినేతతోపాటు అధికార యంత్రాంగం మాత్రమే బదిలీ చేయబడింది. అంతేగాని పౌరజనం జోలికిపోలేదు. అందువలన రాజధాని మార్పిడి ప్రజాజీవనం మీద ఎలాంటి దుష్ఫలితం కలుగనీయలేదు. కానీ మహమ్మద్ బిన్ తుగ్లక్ కాలంలో పౌరజనంగూడా తరలింపబడుట వలన రాజధాని మార్పిడి అనేక దుష్ఫలితాలకు దారితీసింది. 1) అసౌకర్యంతోపాటు ప్రజానష్టం సంభవించింది. 2) ప్రభుత్వ ఖజానాకు అపారనష్టం వాట్లింది. 3) సుల్తాన్ పట్ల ప్రజలకు గౌరవం నశించింది. 4) ఉత్తర భారతంపై మంగోలుల దండయాత్రలు ఎక్కువైనాయి. 5) ఢిల్లీనగరం తన వైభవం కోల్పోయింది. 6) ఢిల్లీ పరిసరాలలో పరిశ్రమలు, వర్తకవ్యాపారాలు వెనుకంజవేశాయి. 7) ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్యనున్న సాంఘిక, సాంస్కృతిక అవరోధములు తొలగిపోయి రెండు ప్రాంతాల మధ్య సన్నిహిత సంబంధాలు నెలకొల్పబడ్డాయి. ముస్లిం వలసలు వెలిశాయి. ఇస్లాం మతం, ఇస్లాం సంస్కృతి దక్షిణాపథంలో వ్రేళ్లూనినాయి. 8) మారిన ఈ పరిస్థితులు బహమనీ రాజ్యస్థాపనకు తద్వారా మొఘలాయిల అధికార విస్తరణకు దారితీశాయి.

దౌలతాబాద్ రెండవ రాజధానియేగాని అది మహమ్మద్ సామ్రాజ్యానికి ఏకైక రాజధాని కాదని మహ్దీ హుస్సేన్, గార్డెనర్ బ్రౌన్ వంటి ఆధునిక చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. వారి అభిప్రాయాన్ని నాణేల ఆధారం ధ్రువీకరిస్తుంది. మహమ్మద్ తన రాజధానిని మార్చినది 'ఖుద్బాబాద్'కే గాని 'దేవగిరికి' కాదు. అల్లా ఉద్దీన్ ఖిల్జీ కుమారుడు కుతుబుద్దీన్ ముబారక్‌షా ఖిల్జీ దేవగిరి పేరును 'ఖుద్బాబాద్'గా మార్చినాడు.

**24.4.4.2. నాణెముల సంస్కరణలు** : (క్రీ.శ. 1329 - 30) : ఢిల్లీ సామ్రాజ్యానికి అపారధన నష్టం కలిగించిన మహమ్మద్ మరొక ప్రయోగాత్మక సంస్కరణ రాగి, కంచు నాణేల ముద్రణ. నాణేల సంస్కరణలయందు సుల్తాన్‌కు ఆసక్తిమెండు. తాను రాజ్యమునకు వచ్చినప్పటి నుండి దేశంలో చెలామణిలోవున్న నాణెముల స్వరూపాన్ని, నాణ్యాన్ని మెరుగుపర్చుటకు సుల్తాన్ అనేక మార్పులు చేశాడు. 'దీనార్' అనే బంగారు నాణేన్ని (201.6 గురిగింజల బరువు) 'అదలి' అనే వెండినాణెన్ని (144 గురిగింజల బరువు) ముద్రింపించి చలామణిలో ఉంచాడు. చిన్నచిన్న లావాదేవీలలో సౌకర్యంగా ఉండుటకు 'దోకాని' లేక 'సుల్తాని' అనే రాగినాణేన్ని చెలామణిలో ఉంచాడు. నాణెముల సంస్కరణలో అతడు తీసుకొన్న సాహసోపేతమైన చర్య, భారతదేశములో అపూర్వమైన చర్య బంగారు, వెండి నాణేలకు మారుగా కంచు, రాగినాణేలను వాడుకయందుంచుట. ఈ చర్యకు అనేక కారణాలు కలవు. 1) రాజధాని మార్పిడి వలన సుల్తాన్ నిర్వహించిన దండయాత్రల వలన, మంగోలుల దాడులవలన, గంగా-యమునా అంతర్వేదిలో ఏర్పడిన క్షామ పరిస్థితుల వలన, ప్రభుత్వ ఖజానాకు కలిగిన నష్టాన్ని భర్తీచేయవలసి వచ్చింది. 2) వెండి కొరతవలన ఏర్పడిన సమస్యను అధిగమించుటకు మహమ్మద్ లాంఛనప్రాయ ద్రవ్యాన్ని (Token Currency) ప్రవేశపెట్టినాడు. ఆనాడు ఇతర దేశాలలోవలె భారతదేశంలో గూడా వెండి కొరత ఏర్పడింది. 3) చలామణిలోవున్న ద్రవ్య పరిమాణము పెంచుటకు ఈ చర్య ఉపకరిస్తుంది. 4) క్రొత్త ప్రయోగాలు చేయుటలో సుల్తాన్‌కు ఆసక్తి మెండు. 5) విదేశీయుల ఉదాహరణల ప్రభావం గూడా సుల్తాన్ మీద కన్పిస్తుంది. చైనా చక్రవర్తి కుబ్లయ్‌ఖాన్ (క్రీ.శ. 1260 - 94) పర్షియా చక్రవర్తి కైఖాటూఖాన్ (క్రీ.శ. 1293)లు లాంఛనప్రాయ ద్రవ్యాన్ని చలామణి యందుంచారు. ఆ ప్రయోగం చైనాలో విజయవంతంకాగా పర్షియాలో విఫలమయింది. ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందులు అధిగమించలేక సుల్తాన్ ఈ చర్య తీసుకొన్నాడని కొందరు చరిత్రకారు

ఆరోపణ. కానీ ఇది వాస్తవము కాదు. ఎందువలననగా ఈ సంస్కరణ విఫలమైనదని సుల్తాన్ గ్రహించగానే క్రొత్తనాణేలను తీసుకొని వాటికి బదులుగా బంగారు, వెండి నాణేలు ఇచ్చినాడు.

పైన పేర్కొనబడిన కారణాల వలన సుల్తాన్ లాంఛనప్రాయ ద్రవ్యాన్ని చలామణి యందుంచాడు. బంగారు, వెండి నాణేలకు బదులుగా కంచు, రాగి నాణేలను వాడుక యుందుంచాడు. కానీ ఆ నాణేలను ప్రభుత్వం మినహా ఇతరులు ముద్రించరాదను నిషేధం విధించనందువలన, క్రొత్తనాణేల ముద్రణ కష్టసాధ్యమైనది కానందువలన ప్రతి ఇల్లు టంకసాలగా మారి వేలకొలది దొంగనాణేలు చలామణిలోనికి వచ్చెను. ఏవి ప్రభుత్వమువారు జారీ చేసిన నాణెములో ఏవి దొంగనాణెములో తెలియని ఆయోమయ పరిస్థితి ఏర్పడెను. డబ్బు విలువ పడిపోయి వస్తువుల ధరలు పెరిగినాయి. పూర్వపునాణేలు కనుమరుగై వాటివిలువ నాలుగైదురెట్లు పెరిగింది. ఈశ్వరీ ప్రసాద్ అను చరిత్రకారుడు అన్నట్లు గ్రషాం సిద్ధాంతం ఆచరణలోకి వచ్చింది. ఎక్కడ చూచినా కంచు, రాగి నాణేల ద్వారా పన్నులు చెల్లించారు. ప్రభుత్వము నుండి తమకు రావలసిన సొమ్మును వెండి, బంగారు నాణేలలో పుచ్చుకొనేవారు. ఇరాక్, ఇరాన్ వంటి దేశాల నుండి వచ్చిన విదేశీ వ్యాపారులు కంచు, రాగి నాణేలను బంగారు, వెండి నాణేలతో సమాన విలువ గలవిగా ఆమోదించ నిరాకరించుటచే విదేశ వాణిజ్యం స్తంభించి నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడి ప్రజలు ఇబ్బందులకు గురియైనారు. ఆచరణలో ఎదురైన ఈ ఇబ్బందులను తన పొరపాటును సుల్తాన్ గ్రహించి కంచు, రాగి నాణేలను ఉపసంహరించి వాటికి బదులుగా బంగారు, వెండి నాణేలను ప్రజలకిచ్చి ప్రభుత్వ గౌరవ ప్రతిష్టలు కాపాడాడు. దీనివలన ప్రభుత్వ ఖజానాకు తీరని నష్టం వాటిల్లింది. సుల్తాన్ ప్రతిష్ఠ దెబ్బతిన్నది. అతని ఆశయం వమ్మయ్యింది.

మంత్రులను, శ్రేయోభిలాషులను సంప్రదించక అధికార గర్వంతో సంస్కరణలు అమలు చేయాలనే తాపత్రయము, నాణేల ముద్రణను ప్రభుత్వ గుత్తాధిపత్యంగా అమలు చేయకపోవుట, ప్రజల స్వార్థపరత్వము మున్నగు కారణాలవలన సుల్తాన్ నాణేల సంస్కరణలు విఫలమైనాయి. ఈ సంస్కరణలు విఫలమైనను ఇవి సుల్తాన్‌కు "Prince of Moneyers" అనే బిరుదును ఆర్జించి పెట్టినాయి.

**24.4.4.3. గంగా - యమునా అంతర్వేదిలో శిస్తు హెచ్చించుట (1333 - 34) :** తన ప్రయోగాత్మక సంస్కరణలవలన, సైనిక వ్యయము పెరుగుటవలన ఖాళీ అయిన ఖజానాను నింపుటకు సుల్తాన్ సారవంతమైన గంగా - యమునా అంతర్వేదిలో భూమిశిస్తు పెంచుటకు యత్నించాడు. శిస్తు హెచ్చింపు ఎంత అనునది స్పష్టంగా తెలియుటలేదు. పెంపుదల రెట్టింపని కొందరు, ముప్పై నుండి నలభైశాతం వరకని కొందరు చరిత్రకారులు అభిప్రాయపడుచున్నారు. అల్లాఉద్దీన్ ఖిల్జీ భూమిశిస్తు 50% వరకు పెంచాడు. అంతర్వేది సారవంతమైన ప్రదేశం. కావున సుల్తాన్ చర్య అపూర్వమూకాదు, అన్యాయమూ కాదు. కానీ ఆ సమయంలో శిస్తుపెంచుటయే సుల్తాన్ చేసిన పొరపాటు. ఈ శిస్తు పెంచునాటికి గంగా - యమునా అంతర్వేదిలో క్షామము తాండవించుచుండెను. అయినను ప్రభుత్వోద్యోగులు నిర్దాక్షిణ్యముగా పన్నులు వసూలు చేయసాగిరి. ప్రజలు పన్నులు చెల్లింపలేక తమ గృహములను పంటపొలములను వీడి సమీపారణ్యములకు పారిపోయి జీవనోపాధిగానక దారిదోపిడీలకు పూన్డారు. సైన్యం రంగ ప్రవేశంచేసింది. అంతర్వేది ప్రాంతం తిరుగుబాటు చేస్తున్న ప్రజలకు, సుల్తాన్ సైన్యాలకు మధ్య రణరంగంగా మారింది. వేలకొలది ప్రజలను సైనికులు అడవి మృగాలను వేటాడినట్లు వేటాడి వధించారు.

శిస్తు హెచ్చించిన ప్రాంతంలో క్షామ పరిస్థితులు నెలకొన్నవని సుల్తాన్ ఆలస్యంగా తెలుసుకొని దానినివారణకు అనేకచర్యలు తీసుకొన్నాడు. శిస్తు వసూళ్లు నిలిపివేయబడ్డాయి. బావులు త్రవ్వించి, పశువులను, వ్యవసాయ పరికరములను, విత్తనాలను కొనుగోలు చేయుటకు రుణములిచ్చెను. కానీ ఈ సహాయక చర్యలు సకాలంలో జరుగకపోవుట వలన రైతులకు ఎట్టి మేలు చేకూరలేదు. 'ఆలస్యం అమృతం విషం' అన్నట్లు సుల్తాన్ సహాయక చర్యలు 'బూడిదలో పోసిన పన్నీరు చందమాయెను. ప్రజలలో సుల్తాన్‌పట్ల ద్వేషభావము ప్రబలెను. దురదృష్టవశాత్తు ఒక్క మహమ్మద్ విషయములో తప్ప ప్రజాహిత సంస్కరణలెప్పుడూ విఫలము కాలేదు.

**24.4.4.4. వ్యవసాయ శాఖ ఏర్పాటు :** మహమ్మద్ వ్యవసాయాభివృద్ధి గావించి తద్వారా ఆహారవసరములు తీర్చుటయేగాక దేశసంపదను ప్రభుత్వాదాయమును పెంపొందించుటకు "దివాన్ - ఇ - కోహి" అను వ్యవసాయ శాఖను ఏర్పాటు చేశాడు. 60 చదరపు మైళ్ల విస్తీర్ణంగల బంజరును భూమిలేని రైతులకు పంచిపెట్టి రెండు సంవత్సరాల కాలంలో డెబ్బైలక్షల రూపాయలు రుణాలుగా మంజూరుచేశాడు. ఈశాఖ కార్యకలాపాలు పర్యవేక్షించి తగునిర్ణయాలు తీసుకొనుటకు 'సధాఅమీర్' అను ప్రత్యేక ఉద్యోగి

నియమించాడు. కానీ సుల్తాన్ చేపట్టిన ఈ పథకం గూడా ఫలప్రదం కాలేదు. ఈ పథకము అమలుకు ఎన్నికచేయబడిన భూమి సారవంతమైనది కానందువలన, ప్రభుత్వోద్యోగులలో ప్రబలిన అవినీతి, లంచగొండితనం, కాలవ్యవధి మరీ తక్కువగా నుండుట, రైతుల ఉదాసీనత మున్నగు కారణములవలన ఈ చర్యగూడా విఫలమయింది. బరనీ అన్నట్లు సుల్తాన్ ఆశించిన దానిలో నూరోవంతు ఫలితం గూడా కలుగలేదు. ఈవిధంగా సదుద్దేశముతో తీసుకొన్న చర్య విఫలమయింది.

**24.4.4.5 న్యాయనిర్వహణ :** మహమ్మద్ న్యాయశీలి. న్యాయనిర్వహణలో స్వపరభేదములు పాటించక నిష్పక్షికంగా నేరవిచారణ చేసెడివాడు. దోషులైన మతాధికారులను సైతం శిక్షించుటకు వెనుకాడెడివాడు కాదు. న్యాయ నిర్వహణ యందు అత్యంతాసక్తిని ప్రదర్శించినాడని, న్యాయదక్షతలో అతనికి సాటియగువారెవ్వరూ లేరని పలుదేశములలో పర్యటించిన ఇబిన్ బతూతా పేర్కొన్నాడు.

**24.4.4.6. మతవిధానం :** మహమ్మద్ మత విషయాలలో ఉదారభావాలు కలవాడు. పరమతసహనముగల సుల్తాన్ హిందువులపట్ల, జైనులపట్ల సానుభూతిలో వ్యవహరించేవాడు. అల్లాఉద్దీన్ ఖిల్జీ కాలంలో వలెగాక సంపన్నులైన హిందువులు తధనుగుణంగా జీవించే అవకాశముంది. సాయిరాజ్, సమరసింహుడు మున్నగు హిందువులు వజీరు, రాష్ట్రగవర్నర్ వంటి ఉన్నత పదవులలో నియమింపబడ్డారు. రాజశేఖరుడు, భీముడు, జినప్రభసూరి వంటి పండితులకు సుల్తాన్‌పోషణ లభించింది. ముస్లిములతోపాటు ముస్లిమేతరులను గూడా మత, తాత్త్విక చర్చలకు ఆహ్వానించాడు. హోలీ ఉత్సవాలలో పాల్గొన్న మొట్టమొదటి ఢిల్లీ సుల్తాన్ అతడేనేమో! సుల్తాన్ శత్రుంజయ ఆలయమును దర్శించినట్లు, గోమఠ నిర్మాణమును అనుమతించినట్లు, జైనారామము నిర్మించినట్లు శాసనాధారాలున్నాయి.

అల్లాఉద్దీన్ ఖిల్జీవలె మహమ్మద్ గూడా రాజ్యవ్యవహారాలలో మతాధికారుల జోక్యాన్ని సహించేవాడు కాదు. రాజ్యంలో సుల్తాన్ అధికారాన్ని ఉలేమాలు శిరసావహించవలెనని శాసించాడు. దోషులైన ఖ్వాజాలను, షేక్‌లను, ముహ్తసిబ్‌లను శిక్షించాడు. బాల్బన్‌వలె మహమ్మద్ గూడా దైవాంశగలవానిగా, దేవుని ఛాయగా (Zilli Allah) భావించారు. సుల్తాన్‌కు విధేయులైన అల్లాకు విధేయులైనట్లేనని అతను ప్రకటించాడు. ఖలీఫాగా తనను ప్రకటించుకోలేదు గాని ఆయన (ఖలీఫా) ప్రస్తావన ఎక్కడా కన్పించదు. కానీ చివరిదశలో మారిన రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఖలీఫా విధేయుడుగా మారినాడు ఖలీఫా పేరుమీద రాజాజ్ఞలు జారీచేశాడు. అయినప్పటికిని రాజ్యపరిస్థితులు అతడాశించినవిధంగా అదుపులోకి రాలేదు.

## 24.5. విదేశాంగ విధానం

విదేశవ్యవహారాలలో గూడా మహమ్మద్‌కు పరాజయాలే ఎదురైనాయి. అల్లాఉద్దీన్ ఖిల్జీవలె తానుగూడా గొప్ప విజేత కావలెనని అతడు ఆశించాడు. భారతదేశాన్ని రాజకీయంగా సాంస్కృతికంగా సమైఖ్యపరచుట, పొరుగుదేశములతో సన్నిహిత సంబంధము లేర్పరచుకొనుట అతని ప్రధాన ఆశయాలుగా కన్పిస్తాయి.

**24.5.1 దక్షిణ భారతదేశ దండయాత్రలు :** మహమ్మద్ యువరాజుగానున్నప్పుడు క్రీ.శ. 1323లో ఓరుగల్లును జయించి ఢిల్లీ సల్తనత్‌లో చేర్చినాడు. తాను సుల్తానైన కొద్దికాలానికే తనమేనల్లుడు బహాఉద్దీన్ గురుషాస్ప్ క్రీ.శ. 1326లో సాగర్‌లో తిరుగుబాటు చేయగా సుల్తాన్ అతనిని వెన్నంటి తరిమి అతనికాశ్రయమిచ్చిన కంపిల దేవుని వధించి అనెగొందిని ఆక్రమించాడు. తదుపరి బహాఉద్దీన్ ద్వారా సముద్రంలో ఆశ్రయం కోరినప్పుడు మూడవ వీరబల్లాలుడు అతనిని సుల్తాన్‌కు అప్పగించాడు. సుల్తాన్ అతనిని చర్మం వలిపించి క్రూరంగా చంపినాడు. వీరబల్లాలుడు ఢిల్లీ సామంతుడైనాడు. మధుర సుల్తాన్ గూడా ఢిల్లీ సామంతుడే. ఈ విజయాలతో ఢిల్లీ సామ్రాజ్యం కావేరీనదీ పర్యంతం విస్తరించింది. ఇంతటి విశాల సామ్రాజ్యాన్ని మరే ఢిల్లీ సుల్తాను పరిపాలించలేదు. ఆ సామ్రాజ్యంలో 23 రాష్ట్రాలు కలవట! సామ్రాజ్య దక్షిణభాగాలను సమర్థవంతంగా అదుపులోనుంచుటకే మహమ్మద్ తన రాజధానిని ఢిల్లీనుండి దేవగిరికి మార్చినాడు. కానీ ఆచరణలో ఎదురైన ఇబ్బందులవలన ఆ ప్రయత్నం విఫలమయింది. అందువలన రాజనీతిజ్ఞులు, కార్యశూరులు ఆయన సముద్రగుప్తుడు, అల్లాఉద్దీన్ ఖిల్జీ వంటివారు దక్షిణరాజ్యములను జయించియు వాని నాక్రమించక సార్వభౌమాధికార స్థాపనతో సంతృప్తి చెందారు.

భారతదేశంలోని విశాల సామ్రాజ్యంతో తృప్తిచెందని మహమ్మద్ మధ్యఆసియా మున్నగు ప్రాంతములను జయించి తన ఆధిపత్యమును విదేశాలలో గూడా నెలకొలుప సంకల్పించాడు. అందుకు అచటనెలకొనియున్న పరిస్థితులు గూడా అతనిని ప్రోత్సహించాయి.

**24.5.2. ఖోరసాన్ దండయాత్ర :** నాడు మధ్య ఆసియాలో పటిష్ఠమైన రాజ్యము లేక రాజకీయ అస్థిరత నెలకొని యుండెను. ఖోరసాన్ ప్రభువు అబూసయ్యద్‌కు వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేయుచుండిరి. అదియునుగాక ఈజిప్టు సుల్తాన్, మంగోలుల నాయకుడగు తర్మాషిరీన్ ఖాన్‌లు అట్టి తిరుగుబాటులను ప్రోత్సహించుటయేగాక ఖోరసాన్ దండయాత్రలో మహమ్మద్‌కు సాయపడుటకు బృహత్ పథకమును రూపొందించి 3,70,000 సైనికులను సైన్యంలో చేర్చుకొని వారికి ఒక సంవత్సర వేతనం ముందగానే చెల్లించాడు. తదుపరి హిమాలయపర్వతములను దాటుటలోగల కష్టనష్టములను, సైనిక వ్యయభారమును గ్రహించిన సుల్తాన్ ఖోరసాన్ దండయాత్రా ప్రయత్నాలను విరమించి సైన్యాన్ని రద్దుచేశాడు. ఈ పథకమువలన సుల్తాన్ ఆశించిన రాజ్య ప్రాప్తికలుగకపోగా దేశ ఆర్థిక పరిస్థితి దిగజారింది. ఖజానా ఖాళీ అయింది. నిరుద్యోగులైన సైనికులు అసాంఘిక కార్యకలాపములకు పాల్పడినారు.

**24.5.3. కారజాల్ పై దాడి :** మహమ్మద్ చైనాపై దాడిచేయ ఉద్దేశించినట్లు చేసిన ఫెరిష్టా రచన విశ్వసనీయంగా తోచదు. బరనీ, ఇబిన్ బతూతాలు స్పష్టంగా తెల్పినట్లు సుల్తాన్ హిమాలయ పర్వతశ్రేణులలోనున్న కారజాల్‌పై (కుమాయూన్ - గర్వాల్) దండయాత్ర జరిపాడు. కారజాల్ కొండజాతిప్రజలు ఢిల్లీ పరిసరప్రాంతముల వరకు దాడులుసాగించి అచట శాంతి భద్రతలు లేకుండా చేశారు. కావున మహమ్మద్ వారిని శిక్షించుటకు నిశ్చయించాడు. మొదటి దండయాత్ర విజయవంతమయింది. అనేక కష్టనష్టములకోర్చి సుల్తాన్ సైన్యం కారజాల్‌ను జయించి ఆక్రమించింది. ఈ దండయాత్రలో హిమాలయములలోని మంచుకు, చలికి, అధిక వర్షపాతము వలన సైనిక సరఫరాలకు ఏర్పడిన అంతరాయము వలన ఎక్కువ భాగం సైన్యం నశించింది. తిరుగు ప్రయాణంలో శేషసైన్యం స్థానికుల దాడులకు గురియై సైనిక సామగ్రిని నష్టపోయింది. ఈ దండయాత్రవలన కారజాల్ ప్రాంతపు జాతుల దండయాత్రలు తొలగిపోయినవిగాని ఆర్థికంగా, సైనికంగా ఢిల్లీసల్తనత్‌కు నష్టం వాటిల్లింది.

**24.5.4. మంగోలు దాడులు :** సుల్తాన్ తన రాజధానిని ఢిల్లీ నుండి దేవగిరికి మార్చినప్పుడు మంగోలులు తర్మాషిరీన్ నాయకత్వాన ఢిల్లీ సామ్రాజ్యావాయవ్య ప్రాంతాలపైదాడులు జరిపారు. అంతట సుల్తాన్ అపార ధనమొసంగి వారిని తృప్తిపరచి రాజ్యమును రక్షించుకొన్నాడు. కానీ ఈ విధానం లోపభూయిష్టమైనది. సుల్తాన్ బలహీనతను గ్రహించిన మంగోలులు తరచుగా ధనమునకై వత్తిడి చేయసాగిరి.

**24.5.5. నగరకోట్ :** అల్లాఉద్దీన్ కాలంవరకు అజేయంగా వున్న నగరకోట్‌ను క్రీ.శ. 1337లో మహమ్మద్ జయించి ఆక్రమించినాడు.

**3.5.6. చైనాతో సంబంధాలు :** కారజాల్ దండయాత్ర సందర్భంగా ఢిల్లీ సైన్యం చైనాకు చెందిన కొన్ని బౌద్ధాలయాలను ధ్వంసం చేసింది. వాటిని పునర్నిర్మించుటకు అనుమతినీయవలసినదిగా కోరుతూ చైనా చక్రవర్తి (తోఘన్ తైమూర్) క్రీ.శ. 1341లో మహమ్మద్ ఆస్థానమునకు తన రాయబారిని పంపాడు. ఇస్లాం మత సూత్రాల ప్రకారం జిజియా పన్ను చెల్లింపనిదే అట్టి పునర్నిర్మాణ కార్యక్రమాలు చేపట్టుటకు వీలులేదని తెలియజేస్తూ క్రీ.శ. 1342లో కానుకలతో సహా ఇబిన్ బతూతాను తన రాయబారిగా చైనాకు పంపాడు. అనేక ఇబ్బందులకు లోనై బతూతా క్రీ.శ. 1347లో ఢిల్లీ చేరాడు.

## 24.6. తిరుగుబాట్లు

రాజధాని మార్పిడి, లాంచనప్రాయద్రవ్యచలామణి, గంగా-యమునా అంతర్వేదిలో శిస్తు హెచ్చింపు మున్నగు మహమ్మద్ ప్రయోగాత్మక సంస్కరణల వైఫల్యము వలన, విఫలమైన ఖోరసాన్, కారజాల్ దండయాత్రలవలన, అతని కూర విధానాల వలన ప్రజలలో ఉద్యోగులలో తీవ్ర అసంతృప్తి చెలరేగి సామ్రాజ్యంలోని వేర్వేరు ప్రాంతాలలో తిరుగుబాట్లు చెలరేగాయి. తిరుగుబాట్లు జరుగుటలో వింతలేదు. చండశాసనులుగా ప్రసిద్ధి చెందిన బాల్బన్, అల్లాఉద్దీన్ ఖిల్జీ కాలాలలోనే తిరుగుబాట్లు జరిగాయి. కానీ మహమ్మద్ కాలంలో జరిగినన్ని తిరుగుబాట్లు మరే ఢిల్లీ సుల్తాన్ కాలంలోను జరుగలేదు. అతని కాలంలో మొత్తం 22 తిరుగుబాట్లు జరిగాయి. ఈ తిరుగుబాటులకు ఆద్యుడు బహాఉద్దీన్. సుల్తాన్ మేనల్లుడు సాగర్ గవర్నర్ అగు బహాఉద్దీన్ గుర్షాస్ప్ క్రీ.శ. 1328లో మొట్టమొదట తిరుగుబాటు బావుటా ఎగురవేశాడు. ఆ తిరుగుబాటు సునాయాసంగానే అణచివేయబడ్డది. తదుపరి సింధు, ముల్తాన్ పాలకుడగు బహ్రాంఐబా (కిష్లుఖాన్) తిరుగుబాటు చేయగా (1328) సుల్తాన్ అతనిని వధించి శాంతి నెలకొల్పినాడు. క్రీ.శ. 1335లో మాబార్‌లో జలాలుద్దీన్ హసన్‌షా తిరుగుబాటు చేసి సుల్తాన్‌గా ప్రకటించుకున్నాడు. సుల్తాన్ ఆ తిరుగుబాటును అణచలేకపోవుటచే ఆ ప్రభావం

దక్షిణ దేశంలోని హిందూ స్వాతంత్ర్యోద్యమనాయకుల మీద ప్రసరించింది. క్రీ.శ. 1336లో ముసునూరి కాపయనాయకుడు ఓరుగల్లు నాక్రమించి స్వాతంత్ర్యం ప్రకటించి 'ఆంధ్రసురత్రాణ' యను బిరుదము ధరించాడు. అదే సంవత్సరంలో (1336) హరిహర, బుక్కరాయ సోదరులు ఆనెగొందిలో స్వతంత్ర హిందూ రాజ్యమునకు అంకురార్పణ చేసినారు. అదియే క్రమక్రముగా విజయనగర సామ్రాజ్యంగా అలరారింది. అటుపిమ్మట బెంగాల్‌లో ఫక్రుద్దీన్ ముబారక్‌షా (1338) అయోధ్యలో ఐన్‌ఉల్‌ముల్క్ (1340) స్వతంత్రులయ్యినారు. ఈ తిరుగుబాటుల నణచుటలో సుల్తాన్ విఫలుడగుట వలన ఉత్తేజితులైన ముస్లిం సర్దారులు హసన్ గంగూ బహ్మనీ నాయకత్వాన క్రీ.శ. 1347లో తిరుగుబాటుచేసి గుల్బర్గాలో స్వాతంత్ర బహ్మనీ రాజ్యస్థాపనచేశారు. అదేసమయంలో గుజరాత్‌నందు థాగి తిరుగుబాటుచేయగా సుల్తాన్ దౌలతాబాద్ నుండి అచటకువెళ్ళి ఆ తిరుగుబాటును అణచాడు. థాగి తప్పించుకొని సింధుకు పారిపోయి అచటకుట్రలు పన్నసాగాడు. అతనిని అణచుటకు సుల్తాన్ సింధు వెళ్తూ మార్గమధ్యమున థట్టా సమీపమున జ్వరపీడితుడై క్రీ.శ. 1351లో ఇహలోక బాధల నుండి విముక్తి చెందాడు. బదయూనీ అన్నట్లు సుల్తాన్ మరణంతో "అతని బాధ ప్రజలకూ, ప్రజల బాధ అతనికి తప్పింది."

## 24.7 మహమ్మద్ వైఫల్యానికి కారణాలు

మహమ్మద్‌కు నిర్మొహమాటంగా, ధైర్యంగా సలహాల్వగల సలహాదారులులేరు. ఈ విషయంలో అట్టి సలహాదారులుగల అల్లాఉద్దీన్ ఖిల్జీ అదృష్టవంతుడు. అందువలన అతని ప్రయోగాత్మక సంస్కరణలలోని గుణదోషములను చర్చించి తగునిర్ణయాలు తీసుకొనే అవకాశం లేకుండాపోయింది. అదియునుగాక ఇతరుల సలహాలను పాటించగల సహనం, విశాల హృదయం సుల్తాన్‌లోలేవు. పరిపాలనా వ్యవహారాలలో సుల్తాన్‌కు ఆచరణాత్మక దృష్టి, లౌక్యం లోపించాయి. అతని ఆలోచనలు కాలానుగుణ్యంగా లేవు. అవి భావితరాలకు చెందినవి. అందువలననే లేన్‌పూల్ అన్నట్లు "సదుద్దేశాలు, ఉదారభావాలు ఉండిగూడా ఓరిమి, తుల్యదృష్టి సాధ్యా సాధ్య విచక్షణ లేకపోవడంతో మహమ్మద్ బీన్ తుగ్లక్ ఘోరపరాజయం పొందాడు." విశ్వాసపాత్రులైన ఉద్యోగులు, సమర్థవంతమైన సైన్యం, శూరులైన సేనానులు లేకపోవుటవలన విదేశాంగ విధానంలో విజయాలు సాధించు అవకాశాలు క్షీణించాయి. తుదకు సులా&తన్‌గూడా బరనీ ముందు తన వైఫల్యాన్ని అంగీకరించి ఈవిధంగా అన్నాడు. "నా రాజ్యం రోగగ్రస్తమయింది. ఏ చికిత్సా దానిని బాగుచేయలేదు. వైద్యుడు తలనొప్పి కుదిరిస్తే జ్వరమొస్తుంది. జ్వరము తగ్గిస్తే మరొక ఇబ్బందేదో ఎదురవుతుంది. అదేవిధంగా నా రాజ్యంలో అనేక తిరుగుబాట్లు చెలరేగాయి. ఒక తిరుగుబాటును అణచివేస్తే వేరొకటి మరొకచోట ప్రత్యక్ష మవుతుంది." అతనిలో తొందరపాటు తనము, మొండితనము, ప్రతిఘటనను భరించలేని మనస్తత్వము మున్నగు అవలక్షణాలున్నాయి. అతని ఔదార్యాన్ని, న్యాయశీలతను అతనిలోని క్రౌర్యము మరుగుపరచినది. అందువలననే అతడు "పిశాచ హృదయముగల భూతమని" వర్ణింపబడ్డాడు. మానవ మనస్తత్వమును అవగాహన చేసుకొనలేకపోయిన సుల్తాన్ ప్రజామోదముపొందని సంస్కరణలెంత మంచివైనను ఆచరణ యోగ్యములు కావని గ్రహించలేక పోయినాడు.

## 24.8. ఘనత

ఢిల్లీ సుల్తానులలోనే గాక మధ్యయుగ భారతదేశ చక్రవర్తులలో గూడా విశిష్టమైన వ్యక్తిత్వమున్నవాడు మహమ్మద్‌బిన్ తుగ్లక్. ముస్లిం ప్రభువులలో అంతటి విద్యావంతుడు లేడనే ఖ్యాతిని గడించినవాడు. మహమ్మద్ వ్యక్తిగత జీవితం ఆదర్శప్రాయమైనది. ప్రభువర్గ లక్షణాలైన స్త్రీలోలత్వం, మద్యపానాసక్తత అతనిలోలేవు. మతపరంగా అతని అభిప్రాయాలు చాలా ఉదారమైనవి. మూఢాచారాలు అతనికి గిట్టవు. హిందూ సమాజములోనున్న సతీసహగమన దురాచారమును నిషేధించాడట! మత విషయకంగా హిందువులనాతడు హింసించలేదు. వారిని అతడు ఉన్నత పదవులతో నియమించాడు. అల్లాఉద్దీన్ ఖిల్జీ వలెనే రాజకీయాలలో మతాధికారుల జోక్యం అతడు సహించలేదు. రాజకీయ విధానాలు స్వతంత్రంగా రూపొందించాడు. అందువలన సనాతన ముస్లింలాతనిని మతద్రోహి (Heretic) గా వర్ణించారు. కానీ మహమ్మద్ దైవభక్తిపరుడు. ఖొరాన్ క్షుణ్ణంగా చదివినవాడు. దైవప్రార్థనలు క్రమబద్ధంగా చేసేవాడు. మహమ్మద్ సహజంగా దయాదాక్షిణ్యాలు ధర్మబుద్ధికలవాడు. దానధర్మాలు అపారంగా చేశాడు. [illegible]సుపత్రులు నిర్మించాడు. విద్యా సంస్థలకు విరాళములిచ్చాడు. పేదలనాదుకొన్నాడు. కర్మాగారములు నెలకొల్పి వేలకొలది కార్మికులకు పనికల్పించాడు. సార్వభౌమ ఆశయాలలోను, ప్రభుత్వ సంస్కరణల యందాసక్తిలోను అల్లాఉద్దీన్ ఖిల్జీకి తీసిపోవువాడు కాదు. పైగా అతనిలోలేని విద్యాసంస్కారాలు మహమ్మద్‌లో కన్పిస్తాయి.

ఈ సద్గుణాలతోపాటు మహమ్మద్‌లో కొన్ని దుర్గుణాలు గూడా ఉన్నాయి. అవి అతని మంచిగుణాలను మరుగుపరచాయి. అతడు తొందరపాటు మనిషి. అతని విధానాలు ఆదర్శప్రాయాలేగాని అవి ఎంతవరకు ఆచరణసాధ్యాలో అతడు గమనించేవాడు కాదు.

తానుపట్టినకుందేలుకు మూడేకాళ్లు అనే మొండిధోరణితో వ్యవహరించేవాడు. ఇతరుల సలహాలను మన్నించేవాడుకాదు. ప్రజాభిప్రాయం గూడా పరిగణనలోకి తీసుకొనక యథేచ్ఛగా తన సంస్కరణలను అమలు జరిపేవాడు. అతని దయాస్వభావం అస్థిరమైనది దయాశీలియైన మహమ్మద్ కోపం వచ్చినప్పుడు రాక్షసంగా వ్యవహరించేవాడు. ఇతరుల సలహాలను మన్నించేవాడు కాదు. ప్రజాభిప్రాయంగూడా పరిగణనలోకి తీసుకొనక యథేచ్ఛగా తన సంస్కరణలను అమలు పరిపేవాడు. స్వల్ప నేరాలకుసైతం మరణదండన విధించేవాడు. అతడిని దర్శించటానికి వెళ్ళినవారు బయటకు వచ్చి తమ తల ఉన్నదో లేదో అని 'తడిమి చూసుకొనేవారట." అందువలన బరనీ వంటి సమకాలీన చరిత్రకారులు మహమ్మద్‌ను "విరుద్ధ గుణనిలయునిగా" (Mixture of opposite qualities) వర్ణించారు. అంతటి మహాపండితుడు సైతం తల బిరుసుగా, మూర్ఖంగా వ్యవహరించాడు. ఈ విపరీత గుణాలను గమనించి ఎల్ఫిన్‌స్టోన్; హెవెల్, వి.ఎ. స్మిత్, యస్.ఆర్. శర్మ, సత్యనాథయ్యార్ వంటి విదేశీ, స్వదేశీ చరిత్రకారులు మహమ్మద్ ఉన్మాదియేమోనని అనుమానపడినారు. కానీ వాస్తవానికి అతడు ఉన్మాదికాడు. వాస్తవిక దృక్పథము లౌక్యములేని దురదృష్టవంతుడు. ఈశ్వరీప్రసాద్, గార్డెనర్ బ్రౌన్‌లు అభిప్రాయపడినట్లు మహమ్మద్ "దురదృష్టవంతుడైన ఆదర్శవాది." (Ill-starred idealist)

## తుగ్లక్ వంశ వృక్షము

తుగ్లక్

1. ఘియాజ్ ఉద్దీన్ తుగ్లక్ (1320 - 25)

2. మహమ్మద్ బిన్ తుగ్లక్ (1325-51)

ఫతేఖాన్

4) రెండవ ఘియాజ్ ఉద్దీన్ తుగ్లక్ (1388-89)

8) నస్రత్‌షా దురాక్రమణ దారుడు

7) హుమాయూన్ (అల్లా ఉద్దీన్ సికిందర్ షా) (1394)

6) మహమ్మద్‌షా (1390-94) (ఫిరోజ్‌షా కాలంలో కొద్దికాలం (1387) అబూబకర్ తరువాత కొంతకాలం పరిపాలించినాడు).

నసీరుద్దీన్ మహ్మద్ షా 1394 - 1413

రజబ్

3) ఫిరోజ్‌షా తుగ్లక్ (1351-88)

జాఫర్

5) అబూబకర్ (1389-90)

## 24.9. ఢిల్లీసల్తనత్ పతనమునకు కారణాలు

రెండవ తరయిన్ యుద్ధంతో (క్రీ.శ. 1192) భారతదేశంలో ముస్లింల అధికారస్థాపన జరిగింది. క్రీ.శ. 1206లో ఆరంభమయిన బానిస వంశ సుల్తానుల పాలనా కాలం నుండి వారి అధికారం విస్తరించి ఖిల్జీ, తుగ్లక్ వంశాల కాలాలలో దాదాపు భారతదేశమంతా వారి అధీనమైనది. తుగ్లక్ వంశ అవసానదశలో మొదలైన ఢిల్లీసుల్తాన్‌ల అధికారక్షీణత సయ్యద్, లోడీవంశీయుల కాలాలలో వేగమునందుకొన్నది. తుదకు క్రీ.శ. 1526లో జరిగిన మొదటి పానిపట్ యుద్ధంలో వారి అధికారము అంతర్హితమయింది. ఇందులకనేక కారణాలు కలవు.

**24.9.1 ఢిల్లీసుల్తాన్‌ల నియంతృత్వ అధికారాలు :** ఢిల్లీసుల్తాన్‌లు నిరంకుశాధికారాలు నిర్వహించారు. అధికారాలన్నీ - శాసననిర్మాణ, సైనిక, న్యాయ - సుల్తాన్‌నందే కేంద్రీకరింపబడ్డాయి. సుల్తాన్ సమర్థుడైనచో రాజ్యనిర్వహణ స్వయంగా జరిగేది. లేనిచో అలజడులు, అశాంతి నెలకొని ప్రజా జీవితం దుర్భరంగా తయారయ్యేది. స్వతంత్ర రాజ్యాల స్థాపనకు, విదేశీ దండయాత్రలకు అవకాశం లభించేది. బాల్బన్, అల్లాఉద్దీన్ ఖిల్జీ వంటి ప్రతిభావంతులైన సుల్తాన్‌ల కాలాలలో ఢిల్లీసల్తానత్ సురక్షితంగా ఉంది. కైకుబాద్, మహమ్మద్‌షా వంటి దుర్బలుల కాలాలలో ఢిల్లీసామ్రాజ్యం కుదించుకుపోయింది.

**24.9.2 సరియగు వారసత్వ విధానము లేకపోవుట :** క్రమబద్ధమగు వారసత్వ విధానము లోపించుటవలన తరచుగా వారసత్వ యుద్ధములు చెలరేగి ఆర్థిక, సైనిక నష్టములు జరుగుటయేగాక సుల్తాన్‌లు రాజనియంతల చేతులలో కీలుబొమ్మలయ్యారు. రాజ్యంలో ముఠాతత్వాలు పెరిగి శాంతి భద్రతలు కొరవడేవి. కుతుబుద్దీన్ తరువాత ఆరామ్‌షా - ఇల్ టుట్‌మిష్‌ల మధ్య, ఇల్ టుట్‌మిష్ మరణానంతరం అతని వారసులగు రుక్నుద్దీన్ ఫిరోజ్, రజియా, బహ్రాంల మధ్య, జరిగిన వారసత్వయుద్ధాలు, ఫిరోజ్‌షా తుగ్లక్ తరువాత అతని వారసుల మధ్య జరిగిన వారసత్వయుద్ధాలు ఢిల్లీసల్తనత్‌ను బలహీన పరచాయి. అవి ఆంతరంగిక తిరుగుబాటులను, విదేశీ దండయాత్రలను ప్రోత్సహించాయి.

**24.9.3 అసమర్థులైన ఢిల్లీ సుల్తాన్‌లు :** ఫిరోజ్‌షా తుగ్లక్ తరువాత సుల్తాన్‌లయిన తుగ్లక్ వంశంవారు ఆ తరువాత వచ్చిన సయ్యద్‌లు, లోడీలు, సమర్థులుకారు. వారిలో బాల్బన్‌కు, అల్లాఉద్దీన్ ఖిల్జీకి సాటియైన వారెవ్వరూలేదు. తైమూర్ దండయాత్రా కాలమునాటి ఢిల్లీ సుల్తాన్ నజీరుద్దీన్ మహమ్మద్ రాజధానిని శత్రువు పరముజేసి పారిపోయిన భీరువు. తదుపరి అధికారమునకు వచ్చిన సయ్యద్‌లు, లోడీలు తమ ఉనికికే పోరాడజొచ్చిన దుర్బలులు. వారికాలమంతా తిరుగుబాటుల నణచుటలోనే గడిచిపోయింది. స్వతంత్రించిన రాజ్యాలను వారు పునరాక్రమించలేకపోయారు. చివరి రెండు వంశాలవారు నామమాత్రపు సుల్తాన్‌లే. వారిలో కొందరు భోగలాలసులు; మరికొందరు రాజనియంతల చేతులలో కీలుబొమ్మలు. చివరి ఢిల్లీసుల్తాన్ ఇబ్రహీం లోడీ కేవలం కొన్నిగంటలపాటు జరిగిన మొదటి పానిపట్ యుద్ధంలో సర్వమూకోల్పోయాడు. కావున చివరిదశలోని సుల్తాన్‌ల దౌర్బల్యము ఢిల్లీసల్తనత్ పతనమునకు ప్రబల కారణమయ్యింది.

**24.9.4. ఢిల్లీ సర్దార్‌లలో ప్రభు భక్తి కొరవడుట :** ఢిల్లీ సర్దార్‌లలో తొలుతనున్న స్వామిభక్తిగాని, కార్యదక్షతగానిలేవు. వారు అధికార కాంక్షాపరులు, విషయలోలురు అయిరి. వారిలో ముఠాతత్వం ప్రబలినిది. అధికారదాహంతో వారిలో వారు పెనుగులాడుచూ సుల్తాన్ అధికారమును గూడా బలహీనపర్చారు. ముఠాతత్వాలవలన పరిపాలనా వ్యవస్థ కుంటుపడింది. సయ్యద్‌ల కాలంలో రాజనియంతలెక్కువైరి. తమను అదుపులో నుంచుటకు ప్రయత్నించిన ఇబ్రహీంలోడీని అణచుటకు అతని సర్దారులు కాబూలు ప్రభువగు బాబర్‌ను ఆహ్వానించాడు. ఇట్లు ఢిల్లీ సర్దార్‌ల స్వార్థచింతన, అధికార కాంక్ష ఢిల్లీసల్తనత్‌ను బలిగొన్నవి.

**24.9.5 సైనిక బలహీనత :** నిరంకుశ రాజరికాలెప్పుడూ పటిష్ఠమైన సైనిక శక్తిమీద ఆధారపడి వుంటాయి. సైన్యమునందు క్రమశిక్షణ, శక్తియుక్తులు, ధైర్యసాహసాలు ఉన్నంతకాలం అదిప్రభువును కాపాడుచు రాజ్యాన్ని వృద్ధిచేస్తుంది. శక్తివంతమైన సైనిక యంత్రాంగ సాయంతోనే అల్లాఉద్దీన్ ఖిల్జీ తన సామ్రాజ్యమును సువిశాల మొనర్చుటయేగాక క్రూరులైన మంగోలుల దాడుల నుండి ఢిల్లీ సామ్రాజ్యమును కాపాడాడు. కాని ఫిరోజ్‌షా తుగ్లక్ కాలంలో సైనిక వ్యవస్థలో అతడు అవివేకంగా ప్రవేశపెట్టిన మార్పులవలన క్రమశిక్షణ లోపించి సైన్యం నిర్వీర్యమయ్యింది. దుర్బలులైన సయ్యద్, లోడీవంశ సుల్తాన్‌ల కాలాలలో సైన్యపరిస్థితి మరీ దిగజారింది. లోడీల సైనిక బలహీనత, క్రమశిక్షణా రాహిత్యము మొదటి పానిపట్ యుద్ధంలో విదితమయ్యింది. తత్ఫలితంగా మొగలువంశ స్థాపన జరిగింది.

**9.6 సామ్రాజ్య విస్తీర్ణత :** ఢిల్లీ సామ్రాజ్యం క్రమక్రమంగా వృద్ధిచెంది ఖిల్జీల కాలంలో దక్షిణాపథమునకు గూడా విస్తరించింది. మహమ్మద్ బిన్ తుగ్లక్ కాలానికి అది అతివిశాల సామ్రాజ్యంగా రూపొందింది. అందులో 23 రాష్ట్రాలు ఉండేవి. వార్తాసౌకర్యాలు, రవాణా సౌకర్యాలు సరిగాలేని ఆరోజులలో దూరప్రదేశాలను అదుపులోనుంచుట అమిత కష్టంగా ఉండేది. ఛండశాసనుడైన బాల్బన్ కాలంలో గూడా బెంగాల్ గవర్నరైన తుఘ్రిల్ ఖాన్ తిరుగుబాటు చేయసాహసించాడు. క్రీ.శ. 1336లో ఓరుగల్లు, కాంపిల్యములలో, 1338లో బెంగాల్‌లో, 1347లో గుల్బర్గాలో స్వతంత్ర రాజ్యము లవతరించినప్పుడు వాటిని అణచుట అసాధ్యమయ్యింది. దుర్బలులు, అసమర్థులు సుల్తాన్‌లైనప్పుడు దూరప్రాంతాల పాలకులు స్వాతంత్ర్యం ప్రకటించారు.

**9.7 హిందువుల యెడల సుల్తాన్‌ల వైఖరి :** ఢిల్లీ సల్తనత్‌లో అధిక సంఖ్యాక ప్రజలు హిందువులు. ముస్లిం రాజ్యాస్థాపనా నంతరం హిందువులను తమ అధికారమునకు సుముఖులుగా చేసుకొనుటకు ప్రయత్నించకపోవుటయేగాక అల్లాఉద్దీన్ ఖిల్జీ, ఫిరోజ్‌షా తుగ్లక్, సికందర్ లోడీల వంటి సుల్తాన్‌లు వారిని సాంఘికంగా, ఆర్థికంగా, మతపరంగా హింసించారు. వారి దేవాలయాలను ధ్వంసం చేయించారు. ఇల్‌టుట్ మిష్ ఉజ్జయినీలోని మహంకాళి ఆలయాన్ని ధ్వంసం చేశాడు. ఫిరోజ్‌షా నగర్‌కోట్‌లోని జ్వాలాముఖి ఆలయాన్ని, పూరీలోని జగన్నాథ్ ఆలయాన్ని నాశనం చేశాడు. హిందువులు పవిత్ర నదీజలములలో స్నానమాడుటను సికందర్ లోడీ నిషేధించాడు.

సుల్తాన్‌లు కొందరు బలవంతంగా మత మార్పిడులు జరిపించారు. వారిపై అవమానకరమగు పన్నులు విధించారు. ఈవిధంగా బాధితులైన హిందువులు ప్రతీకారవాంఛతో ఢిల్లీ సల్తనత్ పతనమునకు యధోచితముగా దోహదం చేశారు.

**24.9.8. మహమ్మద్ బిన్ తుగ్లక్ ప్రయోగాత్మక చర్యలు :** మహమ్మద్ బిన్ తుగ్లక్ కాలమునాటి రాజధాని మార్పిడి రాగినాణేల చలామణి, గంగా-యమునా అంతర్వేదిలో శిస్తుహెచ్చింపు, ఖోరసాన్ దండయాత్ర వంటి ప్రయోగాత్మక చర్యలు ప్రజలలో ఉద్యోగులలో తీవ్ర అసంతృప్తిని, అసౌకర్యమును, భయాందోళనలను కలిగించాయి. ఆ అసంతృప్తి 22 తిరుగుబాటుల రూపములో బహిర్గతమై ఢిల్లీ సామ్రాజ్యమును తీవ్ర సంక్షోభంలో ముంచివేశాయి. తన సామ్రాజ్యంలో పలు ప్రాంతములలో బయలుదేరిన ఆ తిరుగుబాటుల నణచుటకు అతడు అనేక విఫల ప్రయత్నాలు చేశాడు. ఆ ప్రయత్నాలలోనే అతడు ప్రాణాలు కోల్పోయాడు. తత్ఫలితంగా దక్షిణాన మధుర, కాంపిల్యము, ఓరుగల్లు, గుల్బర్గాలలో ఉత్తరాన గుజరాత్, మాళ్వ, అయోధ్య, బీహార్, బెంగాల్‌లలో స్వతంత్ర రాజ్యాలు తలలెత్తాయి. ఇట్లు ప్రసిద్ధ సుల్తాన్ మహమ్మద్ బిన్ తుఘ్లక్ కాలముననే ఢిల్లీ సల్తనత్ పతనం ప్రారంభమయ్యింది.

**24.9.9. ఫిరోజ్ షా విధానాలలోని లోపాలు :** మహమ్మద్ బిన్ తుగ్లక్ విధానాల వలన ప్రారంభమైన ఢిల్లీ సల్తనత్ క్షీణతను అరికట్టుటకు గొప్ప యోధుడు. రాజనీతిజ్ఞుడు అగు వారసుడు అవసరం. కాని ఫిరోజ్‌లో ఈ లక్షణాలు మృగ్యం. పైగా అతడు తన విధానాలచే ఢిల్లీ సామ్రాజ్య పతనమును వేగిరపరచాడు. స్వాతంత్ర్యం ప్రకటించిన సామంత రాజ్యాలను పునరాక్రమించుట కతడెట్టి ప్రయత్నాలు చేయలేదు. సైనిక నిర్వహణలో అతడు ప్రవేశపెట్టిన వారసత్వ విధానము, జాగీర్దారీ విధానము, బానిసల యెడల మితిమీరిన కారుణ్యమును ప్రదర్శించి క్రొత్త సమస్యలను కొని తెచ్చుకొనుట, పరమత ద్వేషం మున్నగు లోపభూయిష్టమైన అతని విధానాలు ఢిల్లీ సల్తనత్ పతనమునకు దోహదము చేశాయి.

**9.10 స్వతంత్ర రాజ్యాల స్థాపన :** మహమ్మద్ బిన్ తుగ్లక్ పరిపాలించినంత విశాల సామ్రాజ్యాన్ని మరే ఢిల్లీ సుల్తాన్ పాలించలేదు. అతని కాలంలో ఢిల్లీ సామ్రాజ్యంలో 23 రాష్ట్రాలు ఉండేవి. కానీ దుర దృష్టవశాత్తు రాజ్యక్షీణత గూడ అతని కాలంలోనే ఆరంభమైయ్యింది. అతని విధానాల వలన అసంతృప్తులైన సామంతులనేకులు తిరుగుబాటుచేసి స్వాతంత్ర్యం ప్రకటించారు. క్రీ.శ. 1335లో మాబార్ నవాబైన జలాలుద్దీన్ హసన్ షా స్వాతంత్ర్యం ప్రకటించి సుల్తాన్ బిరుదం ధరించినాడు క్రీ.శ. 1336లో ముసునూరి కాపయనాయకుడు ఓరుగల్లు కేంద్రంగా స్వతంత్ర రాజ్యము నేర్పరచి "ఆంధ్ర సురత్రాణ"గా ప్రకటించుకొన్నాడు. అదే సంవత్సరంలో హరిహర బుక్కరాయ సోదరులు తుంగ భద్ర నదీతీరాన ఆనె గొందిలో విజయనగర సామ్రాజ్యానికి అంకురార్పణ చేశారు. క్రీ.శ. 1338 లో ఫక్రుద్దీన్ ముబారక్ షా బెంగాల్‌లో స్వతంత్ర రాజ్యం స్థాపించినాడు. క్రీ.శ. 1340 లో అయోధ్య యందు ఐనుల్ ముల్క్ స్వతంత్రుడైనాడు. దక్షిణాన క్రీ.శ. 1347లో అల్లాఉద్దీన్ హసన్ గంగూ నాయకత్వాన గుల్బర్గా కేంద్రంగా మరొక స్వతంత్ర్య రాజ్యం స్థాపితమైయ్యింది. ఫిరోజ్ షా వారసుల కాలంలో క్రీ.శ. 1398లో జాన్పూర్‌నందు మాలిక్ సర్వర్, క్రీ.శ. 1401లో గుజరాత్ నందు స్వాతంత్ర్యం ప్రకటించారు. అదేవిధంగా మేవార్‌లో రాణా కుంభా స్వతంత్రుడైనాడు. ఖాందేశ్, సింధు ప్రాంతాలు గూడా స్వతంత్రించాయి. ఈవిధంగా స్వతంత్రించిన ప్రాంతాలు పునరాక్రమింప బడక పోవుటచే ఢిల్లీ సామ్రాజ్యం క్షీణించి పోయింది.

**24.9.11. విదేశీ దండ యాత్రలు :** ఢిల్లీ సల్తనత్‌ను బాగా బలహీనపరచినవి పదేపదే పునరావృతమైన మంగోల్ దండయాత్రలు. ల్‌టూట్ మిష్ కాలంలో చంఘిజ్ ఖాన్ నాయత్వాన ప్రారంభమై మహమ్మద్ బిన్ తుగ్లక్ కాలం వరకు కొనసాగాయి. పరమ క్రూరులైన ంగోలుల దండయాత్రల వలన అపార జననష్టం, సైనిక నష్టం, ఆస్తినష్టం సంభవించింది. ఢిల్లీసుల్తాన్‌లు తమ కాలాన్ని, సాధన సంపత్తులను ంగోలుల నెదిరించుటలో వినియోగించుట వలన వారు తమ రాజ్య క్షీణతను అరికట్టలేక పోయ్యారు.

ఢిల్లీ సల్తానత్‌కు గొడ్డలి పెట్టు వంటిది క్రీ.శ. 1398లో జరిగిన తైమూర్ దండయాత్ర. భారత దేశం మీద జరిగిన ఏ ఒక్క ండయాత్రలోను ఈ దండయాత్ర వలన కలిగినంత నష్టం సంభవించలేధు. జననష్టంతో పాటు అపారమైన ఆస్తినష్టం జరిగింది. ాజధాని నగరమైన ఢిల్లీ సర్వనాశనమైయ్యింది. మూడు నెలలపాటు ఢిల్లీలో సుల్తానే లేడు. అట్టి పరిస్థితులలో సుల్తానంటే భయగౌరవాలు శించాయి. సామంతులు స్వాతంత్ర్యం ప్రకటించారు.

ఢిల్లీ సల్తనత్‌కు అశని పాతం వంటిది బాబర్ దండయాత్ర. తైమూర్ వారసులలో ఒకడైన బాబర్ భారతదేశంపై దండెత్తి వచ్చి క్రీ.శ. 526లో జరిగిన మొదటి పానిపట్ యుద్ధంలో చివరి ఢిల్లీ సుల్తాన్ ఇబ్రహీం లోడీని వధించుటతో లోడీ వంశంతో పాటు ఢిల్లీ సుల్తాన్‌ల ా అంతమయి మొగలు సామ్రాజ్య స్థాపన జరిగింది.

## 24.10 సారాంశము :

తుగ్లక్ వంశీయులు కరౌనా తెగకు చెందిన తురుష్కులు. తుగ్లక్ వంశస్థాపకుడు ఘియాజ్ ఉద్దీన్ తుగ్లక్. అల్లాఉద్దీన్ కాలంలో సామాన్య సైనికునిగా తన ఉద్యోగ జీవితం ప్రారంభించిన ఘియాజ్ మంగోలుల దండయాత్రల నెదుర్కొనుటలో తన శక్తి సామర్థ్యాలు ప్రదర్శించి దీపాల్ పూర్ గవర్నరైయ్యాడు. ముబారక్ షా ఖిల్జీని తుద ముట్టించిన నాసరుద్దీన్ ఖుస్రూషాను హతమార్చి ఢిల్లీ సింహాసనమును అధిష్టించాడు. ఢిల్లీసుల్తాన్‌గా అతడు తీసుకొన్న ఉదార చర్యలు చేపట్టి ప్రజాహిత కార్యక్రమాలు ఘియాజ్‌ను ఢిల్లీ సల్తనత్ యుగామునాటి షేర్షాగా చేశాయి. అతని రెవిన్యూ సంస్కరణలు సైన్యాన్ని పటిష్టపరచాయి. తన న్యాయ సంస్కరణల ద్వారా ఘియాజ్ శిక్షల కాఠిన్యాన్ని తగ్గించాడు. అమీర్ ఖుస్రూ వంటి సుప్రసిద్ధ కవులకాతని పోషణ లభించింది. విదేశాంగ విధానంలో గూడా ఘియాజ్ గణనీయమైన విజయాలు సాధించాడు. ఓరుగల్లు జాజ్‌నగర్‌లు ఢిల్లీ సామ్రాజ్యంలో చేర్చబడ్డాయి. బెంగాల్ ఢిల్లీ సామంత రాజ్యమయింది. మంగోలుల దండయాత్ర త్రిప్పి కొట్టబడింది.

ఘియాజ్ మరణానంతరం యువరాజు జునా ఖాన్ మహమ్మద్ బిన్ తుఘ్లక్ అను పేరుతో ఢిల్లీ సుల్తానైయ్యాడు. ఢిల్లీ సుల్తాన్‌లలోనే గాక మధ్యయుగ భారతదేశ చక్రవర్తులలో గూడా విశిష్టమైన వ్యక్తిత్వమున్నవాడు మహమ్మద్. ముస్లిం ప్రభువులలో అంతటి విద్యావంతుడు లేడనే ఖ్యాతిని గడించినవాడు. అతడు అద్భుతమైన జ్ఞాపక శక్తి కలవాడు, దానశీలి, న్యాయశీలి, ఉదారుడు. పరమత సహనముగల విశాల హృదయుడు. కానీ అతనికి లౌక్యం తెలియదు, ఓర్పు తక్కువ. కొన్ని సందర్భాలలో క్రూరంగా వ్యవహరించేవాడు. అతనిలోని మొండి తనము, క్రౌర్యము అతని ఉదార, దయాగుణాలను మరుగు పరచాయి. మహమ్మద్ పాలనా రంగంలో ప్రవేశపెట్టిన ప్రయోగాత్మక చర్యలు ప్రజలలో అసంతృప్తికి రేకెత్తించయి. అట్టి చర్యలలో అపార జన, ధన నష్టానికి తీవ్ర విమర్శకు గురియైనది. అతని రాజధాని మార్పిడి. అది వృధా ప్రయాసకు చిహ్నంగా మిగిలిపోయింది. అతని నాణేల సంస్కరణల వలన రాజ్యం తీవ్ర ఆర్థిక సంక్షోభమునకు గురి అయింది. విదేశ వర్తకం స్తంభించింది. ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లింది. గంగా - యమునా అంతర్వేదిలో శిస్తు హెచ్చించుటకు అతడు చేసిన ప్రయత్నాలు ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చకపోగా ప్రజలలో అసంతృప్తిని కలిగించి ప్రభుత్వాన్ని నష్టానికి గురి చేశాయి. అదే విధంగా అతని వ్యవసాయాభివృద్ధి ప్రణాళిక గూడా విఫలమైయ్యింది. అతని ఖోరసాన్ దండ యాత్ర ధననష్టానికి దారి తీస్తే కార జాల్ దండయాత్ర సైనిక నష్టాన్ని కలిగించింది. మంగోలుల దండయాత్రలను విజయవంతంగా ఎదుర్కొన లేక పోయాడు. తుదకు తన విధానాల వలన తీవ్ర అసంతృప్తికి గురియై తిరుగుబాటు చేసిన సామంతులను గూడా అణచలేకపోయాడు. సమయానుకూలంగా మెలగు స్వభావం కాకపోవుట వలన, పరిస్థితులు అనుకూలించక పోవుట వలన, లౌక్యం కొరవడుట వలన మహమ్మద్ పరాజయాల పాలైయ్యాడు.

మహమ్మద్ వారసుడుగా వచ్చిన ఫిరోజ్ లో ధైర్యసాహసాలు, రాజనీతి, దూరదృష్టి లోపించాయి. అందువలన ఢిల్లీ సామ్రాజ్య క్షీణత వేగమునందుకొన్నది. ఢిల్లీ సామ్రాజ్యంలో అనేక స్వతంత్ర రాజ్యాలు తలెత్తాయి. కానీ పాలనారంగంలో అతడు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు, కల్పించిన నీటి పారుదల సౌకర్యాలు, చేపట్టిన ప్రజాహితనిర్మాణాలు, కార్యక్రమాలు ఆర్థిక ప్రగతికి దోహదము చేయుటయే గాక ప్రజాసంక్షేమాన్ని పెంపొందించాయి. అయితే బానిసల యెడల అతని వైఖరి, అతని జాగీర్ దారీ విధానము, పరమత ద్వేషము వంశ విచ్ఛత్తికి దోహదం చేశాయి. ప్రజానురంజక పాలన నెలకొల్పినాడు.

ఫిరోజ్ వారసులైన తుఘ్లక్ షా, అబూబకర్, మహమ్మద్, అల్లా ఉద్దీన్ సికందర్ షా, నసీరుద్దీన్ మొహమ్మద్ మున్నగువారి కాలంలో ఢిల్లీ సామ్రాజ్యం కుంచించుకు పోయింది.

క్షీణోన్ముఖమైన ఢిల్లీ రాజ్యాన్ని మరింత బలహీన పరిచినవాడు తైమూర్. మత వ్యాప్తికి, ధన సంపాదనకు ఢిల్లీ పై దండయాత్ర జరిపి తైమూర్ ఢిల్లీ సామ్రాజ్యాన్ని ఆర్థికంగా సైనికంగా అపార నష్టానికి గురి చేశాడు. ఆ విపత్తునుండి ఢిల్లీ సల్తనత్ కోలుకోలేకపోయింది.

పతానావస్థలోనున్న తుఘ్లక్‌ల అధికారాన్ని కూలద్రోసి ఖిజర్ ఖాన్ సయ్యద్ వంశాన్ని స్థాపించాడు. అతని వారసులు ముబారక్ షా, మహమ్మద్ షా, అల్లాఉద్దీన్ ఆలం షా అనువారు ముగ్గురూ అసమర్థులే. వారు తమ ఉనికికే పోరాడజొచ్చిన దుర్బలులు. వీరిని తొలగించి లోడీలు అధికారాన్ని చేజిక్కించుకొన్నారు.

లోడీ వంశస్థాపకుడు బహలోల్. ఇతని వారసులు సికందర్ లోడి, ఇబ్రహీం లోడీ అనువారు. ఢిల్లీ సల్తనత్ ప్రాబల్యమును పునరుద్ధరించుటకు వారు చేసిన ప్రయత్నాలు పెద్దగా ఫలించ లేదు. రాజనీతిజ్ఞత దూరదృష్టి లేని ఇబ్రహీం లోడీ విధానాలు మొదటి పానిపట్ యుద్ధానికి దారి తీయగా, ఆ యుద్ధంలో అతడు ఓడిపోయి ప్రాణాలు కోల్పోయాడు. ఢిల్లీ సుల్తాన్‌ల పాలన అంతమై మొఘలాయీల పాలనా ఆరంభమైయింది.

ఢిల్లీ సల్తనత్‌లోని వ్యవస్థాపరమైన లోపాలు, సర్దారుల స్వార్థము, ద్రోహచింతన, సైనిక బలహీనత, మహమ్మద్ బిన్ తుఘ్లక్, ఫిరోజ్ షా తుఘ్లక్ విధానాలలోని లోపాలు, సామంత పాలకుల తిరుగుబాట్లు, విదేశీ దండయాత్రలు మున్నగు అంశాలు ఢిల్లీ సామ్రాజ్య పతనానికి దారి తీశాయి.

## సంప్రదించిన మరియు ఉపయుక్త గ్రంథాలు


1. Agha Mahdi Husain : Tughluq Dynasty
2. Jauhri R.C : Firgz Tughluq
3. Halim Abdul : History of the Lodi Sultans
4. Lal K.S. : The Twilight of the Delhi Sultanate
5. Aiyanagar K.S : South India and Her Mohammandan In vader
6. Venkata Ramanayya N. : Early Muslim expansion in South India
7. Iswari Prasad : A History of Medieval India from A.D. 647 to 1526
8. Srivastava A.L : The Delhi Sultanate
9. Paney A.B : Early Medieval India
10. Mehta J.L. : Advanced Study in the History of Medieval India Vol I
11. Meera Singh : Medieval History of India
12. majumdar R.C. (Ed) : The History and culture of Indian people, Vol V The Delhi Sultanat
13. Mohanmmad Habibe & Nizami K.A. : A. Comprehensive History of India Vol V The Delh Sultanate
14. Sharma S.R : The crescent in India
15. Hanumantha Ro, B.S.L& : Indian History and Culture vol-II
16. వారణాసి యశోదా దేవి, బి.యస్. యల్ హనుమంతావు : (ఇ) భారతదేశ చరిత్ర - సంస్కృతి, ప్రధాన భాగము తెలుగు అకాడమి ప్రచురణ


## ప్రశ్నలు

### I. వ్యాస ప్రశ్నలు (Essay Questions)

1. మహమ్మద్ బిన్ తుఘ్లక్ ప్రయోగాత్మక సంస్కరణలను విమర్శనాత్మకముగా పరిశీలించుము ?
2. ఫిరోజ్‌షా తుఘ్లక్ విధానాలను వివరిస్తూ వాటిలోని లోపాలను పేర్కొనండి ?
3. ఢిల్లీ సల్తనత్ పతనమునకు కారణములేవి ?

### II. లఘు వ్యాసప్రశ్నలు (Short Essay Questions)

1. ఘియాజ్ ఉద్దీన్ తుఘ్లక్ సాధించిన విజయాలను పేర్కొనుచు అతని పరిపాలనా సామర్థ్యమును వివరింపుము ?
2. ఫిరోజ్ షా తుఘ్లక్ వారసులను గురించి సంగ్రహంగా తెల్పండి ?
3. తైమూర్ దండయాత్రకు కారణములేవి . ఆ దండయాత్ర వలన కలిగిన ఫలితములేవి ?
4. ఢిల్లీ సుల్తాన్ ల చరిత్రలో సయ్యద్‌ల స్థానమెట్టిది ?
5. క్షీణిస్తున్న ఢిల్లీ సామ్రాజ్య వైభవము పునరుద్ధరించుటకు లోడీ సుల్తాన్‌లు ఎట్లు ప్రయత్నించారు.

III. లఘు ప్రశ్నలు (Short Notes)

1. రాజధాని మార్పిడి
2. లాంఛన ప్రాయనాణేలు (Token Currency)
3. ఖోరసాన్ దండయాత్ర
4. ఖిజర్ ఖాన్ సయ్యద్
5. బహలోల్ లోడీ
6. సికందర్ లోడీ
7. ఇబ్రహీం లోడీ
8. మొదటి పానిపట్ యుద్ధం

IV. కుశాగ్రబుద్ధి ప్రశ్నలు (Objective Questions)

1. క్రింది వానికి సరియైన సమాధానములను బ్రాకెట్లలో వ్రాయండి.

1. రాజదానిని ఢిల్లీనుండి దేవగిరికి మార్చిన సుల్తాన్ (

(ఎ) బాల్బన్ (బి) అల్లాఉద్దీన్ ఖిల్జీ (సి) మహమ్మద్ బిన్ తుగ్లక్
(డి) ఫిరోజ్ షా తుగ్లక్ (ఇ) సికందర్ షా

2. లాంఛన పూర్వ (Token Currency) ద్రవ్యమును చలామణి చేసినవాడు. ( )

(ఎ) ఇల్ టుట్ మిష్ (బి) బహ్రాం (సి) ముబారక్ షా
(డి) మహమ్మద్ బిన్ తుగ్లక్ (ఇ) ఆలంషా

3. బహమనీ సామ్రాజ్య స్థాపన ఎప్పుడు జరిగెననగా ( )

(ఎ) 1335 (బి) 1336 (సి) 1338
(డి) 1342 (ఇ) 1347

4. రైతుబాంధవునిగా కీర్తింపబడినవాడు ( )

(ఎ) అల్లాఉద్దీన్ ఖిల్జీ (బి) సికందర్ లోడి (సి) మహమ్మద్ బిన్ తుగ్లక్
(డి) ఫిరోజ్ షా తుగ్లక్ (ఇ) మహమ్మద్ షా

5. మధ్యయుగ ఔరంగజేబ్‌గా పేరుపొందిన సుల్తాన్ ( )

(ఎ) బాల్బన్ (బి) నస్రత్ షా (సి) ఫిరోజ్ షా తుగ్లక్
(డి) ఇబ్రహీం లోడి

6. తైమూర్ ఏ పట్టణమును స్వాధీనం చేసుకొనలేదు. ( )

(ఎ) మిరట్ (బి) కాంగ్రా (సి) జమ్మూ
(డి) ఢిల్లీ (ఇ) అలహాబాద్

7. తైమూర్ భారతదేశంపై దండెత్తిన సంవత్సరం ( )

(ఎ) 1380 (బి) 1390 (సి) 1398
(డి) 1401 (ఇ) 1529

8. ఆగ్రా దుర్గమును నిర్మించిన సుల్తాన్ ( )

(ఎ) బహలోల్ లోడీ (బి) సికందర్ లోడీ (సి) ఇబ్రహీం లోడీ
(డి) అల్లాఉద్దీన్ ఆలం షా (ఇ) తుఘ్లక్ షా

9. లోడీ వంశం పతనమైన సంవత్సరం ( )

(ఎ) 1520 (బి) 1525 (సి) 1526
(డి) 1527 (ఇ) 1529

10. లోడీ వంశపురాజులలో కడపటివాడు ( )

(ఎ) బహలాల్ లోడీ (బి) సికందర్ (సి) ఆలంఖాన్ లోడీ
(డి) ఇబ్రహీం లోడీ (ఇ) దౌలత్ ఖాన్ లోడీ

**3. దిగువ వానిని జతపర్చుము.**

| "ఎ" గ్రూపు | | | "బి" గ్రూపు |
|---|---|---|---|
| (1) జియా ఉద్దీన్ బరనీ | ( ) | (ఎ) | ఉద్యోగదాయక శాఖ |
| (2) ఇబిన్ బతూతా | ( ) | (బి) | సయ్యద్ వంశస్థాపకుడు |
| (3) ఫిరోజ్ షా తుగ్లక్ | ( ) | (సి) | ఆంధ్ర సురత్రాణ |
| (4) ఖిజర్ ఖాన్ | ( ) | (డి) | తారీఖ్ - ఇ - ఫిరోజ్ షాహి |
| (5) కాపయనాయకుడు | ( ) | (ఇ) | తుఘ్లక్ నామా |
| | | (యఫ్) | రీహ్లా |
| | | (జి) | దేవల్ రాణి |

**జవాబులు**

1. (1) సి (2) డి (3) ఇ (4) డి (5) సి (6) ఇ (7) సి (8) బి (9) సి (10) డి.
2. (1) ఘియాజ్ ఉద్దీన్ తుఘ్లక్ (2) తారీఖ్ - ఇ - ఫిరోజ్ షాహి (3) ఫిరోజ్ షా తుగ్లక్
(4) నసీరుదీద్దన్ మహ్మద్ షా (5) ఇబ్రహీంలోడీ
3. (1) డి (2) యఫ్ (3) ఎ (4) బి (5) సి.

## అభ్యాసాలు

1. "మహమ్మద్ బిన్ తుఘ్లక్ దురదృష్టంతుడైన ఆదర్శవాది" వివరింపుము
2. భారతదేశ రేఖా పటములో మహమ్మబిన్ తుఘ్లక్ సామ్రాజ్య విస్తీర్ణమును దిగువ స్థలములను గుర్తించుము

(1) మధుర (2) కాంపిల్యము (3) ఓరుగల్లు (4) గుల్బర్గా
(5) దేవగిరి (6) జాజ్ నగర్ (7) అయోధ్య (8) థట్ట

## పారిభాషిక పదకోశము

ఆబాద్ = నివాసము (తుగ్లకాబాద్, దౌలతా (ధనం) బాద్)
కోస్ (క్రోసు) = రెండు మైళ్ళదూరం
గ్రషాం సిద్ధాంతం = సర్ థామస్ గ్రషాం (క్రీ.శ.1519 - 1579);

ఇంగ్లాండ్ దేశపు వ్యాపారి, పెట్టుబడిదారుడు సుప్రసిద్ధ బ్రిటీష్ రాణి మొదటి ఎలిజిబెత్ (క్రీ.శ. 1558 - 1603) కాలమునాటి వాడ 'ఒకే విలువగల రెండు నాణెములు చలామణియందు ఉన్నచో తక్కువ లోహవిలువ గల నాణెములు ఎక్కువ లోహవిలువగల నాణెములను చలామణిలో లేకుండా చేయును" అనునదే ఆయన సిద్ధాంతం.

| | | |
|---|---|---|
| దష్టి (దమ్మిడీ) | = | రూపాయిలో 192 వ భాగం |
| దివాన్లు | = | మెత్తలు, దిండ్లు ఆనుకొనుటకు ఉపయోగింపబడు దిండ్లు |
| దోకాని | = | దుగ్గాని, రెండుకానులు; 'కాని' అనునది ఒక నాణెము, 'కాని' రూపాయిలో 64వ భాగము |
| బిన్ | = | కుమారుడు |
| మాబార్ | = | 'నడవ' దక్షిణ 'మలబార్' ప్రాంతమునుండి సింహళమునకు గాని, భారతదేవములోని ఉత్తర ప్రాంతములకు గాని వెళ్లుటకు 'నడవ' గా ఉపయోగపడునది. తమిళనాడు తీరప్రాంతము. |
| తాస్ ఘరియాల్ | = | కాలమును తెలియజేయు గంట, కాలమాపక గంట |
| తురుష్కులు | = | మధ్య ఆసియాకు చెందిన ఒక జాతి. అందులో ఇల్బారీ, సెల్జుక్, కారౌనా, చాగ్తాయ్ మున్నగు తెగలున్నాయి. |
| రిహ్లా | = | ప్రయాణము, యాత్ర |
| లంగ్ | = | కుంటివాడు, తైమూర్ - ఇ- లంగ్ అనగా కుంటివాడైన తైమూర్ అని అర్థం |
| సురత్రాణ | = | 'సులతాన్' అను అరబ్బీ పదమునకు సంస్కృతీకరణ 'సురత్రాణ' |

పాఠ్య రచయిత

**డా. ఒంగోలు సాంబయ్య**

పాఠం - 25

# భారతీయ సంస్కృతిపై ఇస్లాం ప్రభావం - భక్తి ఉద్యమం.

ముఖ్యాంశాలు :


25.1 భారతదేశ సంస్కృతిపై ఇస్లాం మత ప్రభావం

25.2 హిందూ సమాజము నందు ముస్లిం ప్రభావము

25.3 మహ్మదీయ సమాజముపై హిందువుల ప్రభావం

25.4 ఇస్లాం పై హిందూ మత ప్రభావం

25.5 హిందూ మతం పై ఇస్లాం మత ప్రభావం

25.6 సాంస్కృతిక రంగము

25.7 సారాంశము

25.8 ఉపోద్ఘాతం

25.9 మత ఉద్యమాలు

25.10 భక్తి ఉద్యమానికి దోహదం చేసిన అంశాలు

25.11 భక్తి ఉద్యమ సూత్రాలు

25.12 భక్తి ఉద్యమ ప్రవక్తలు

25.12.1 శంకారాచార్యులు, రామానుజాచార్యులు, రామానందుడు

25.12.2 మీరాబాయి

25.12.3 వల్లభాచార్యులు

25.12.4 చైతన్యుడు

25.12.5 నామదేవుడు

25.12.6 కబీరు

25.12.7 నానక్

25.13 భక్తి ఉద్యమ ఫలితాలు


## 25.1 భారతదేశ సంస్కృతి పై ఇస్లాం ప్రభావం :

**8.1 ఉపోద్ఘాతం :** మహమ్మదీయులు భారతదేశమునకు రాకముందు గ్రీకులు, కుషాణులు, శకులు, హుణులు మొదలగ అనేక విదేశ జాతుల వారు దేశంపై దండెత్తి రాజకీయంగా వారిని ఓడించి పాలించినప్పటికి సాంస్కృతికంగా వారు హిందూ సంస్కృతికి ఆకర్షింపబడి చివరకు హిందూ సమాజంలో కలసిపోయారు. కాని మహమ్మదీయులు మాత్రం అలా హిందూసమాజంలో కలిసిపోలేదు.

అందుకు కారణం వారికొక ప్రత్యేకమయిన కట్టుదిట్టమైన మత గురువుల వ్యవస్థ భిన్నమైన సాంఘిక, రాజకీయ ఆదర్శాలు, ఆచారాలు ఉండటం. మహమ్మదీయులు భారతదేశంలో 1206 లో ఇస్లాం రాజ్యాన్ని స్థాపించిన తర్వాత హిందూ స్థానం నుండి హిందూ మతాన్ని పెకలించివేయ ప్రయత్నించారు. వారి దేవాలయాలను ధ్వంసం చేశారు. స్త్రీలను అవమానించారు. ఎంతో మందిని చిత్ర వధ చేశారు. అనేకులను బానిసలుగా జేశారు. పవిత్ర దినాలలో హిందువులు గంగా యమునా నదులలో స్నానం చేయరాదని నిషేధించారు. హిందూ దేవాలయాలను ధ్వంసం చేసి ఆ వస్తువులతో మసీదులను నిర్మించారు. కాని ఫలితంలేకపోయెను. ముస్లింల దౌష్ట్యాలను హిందూ ప్రజలు తీవ్రంగా ఎదుర్కొని తమ విశిష్టతను నిలబెట్టుకున్నారు. కాని మహమ్మదీయులు హిందువులను గాని, హిందువులు మహమ్మదీయులను గాని సమూలంగా నాశనం చేయడం అసాధ్యమని తేలింది. అయితే కాలం గడిచిన కొలది ఆవేశాలు తగ్గిన తర్వాత ఒకరి నొకరు అర్థం చేసుకొనుటకు ప్రయత్నించారు. పాలకులు అయిన ముస్లిములు పాలితులైన హిందువులు గత్యంతరము లేక సయోధ్యత పెంపొందించుకున్నారు. 1206 లో ప్రారంభమయిన ఢిల్లీ సుల్తానుల పాలన 1526 వరకు కొనసగినందున హిందూ ముస్లింలు తమ భిన్న సంస్కృతులతో ప్రక్కప్రక్కల నివశించి నందున కాల క్రమేపి వారి మధ్య సహజీవనం ఏర్పడ్డది. దానికి ఈ క్రింది పరిస్థితులు తోడ్పడ్డాయి. ఎ. మహమ్మదీయులుగా మారిన హిందువులు ముస్లిం పాలకుల దృక్పధంలో మార్పు తెచ్చారు. బి. తమ అంతఃకలహాలలో ముస్లింలు హిందువుల సహాయం కోరేవారు. సి. ఢిల్లీ పాలకులు కూడా హిందువుల సహకారం లేనిదే హిందూ దేశాన్ని పాలించలేమని అర్థం చేసుకున్నారు. డి. ఢిల్లీ సుల్తానులు తమ ఆస్థానములో కొందరు హిందువులకు దర్బారులో ఉద్యోగాలు ఇచ్చారు. వారి సహచర్యం వలన గూడ విరోధ భావం తగ్గింది. అవగాహనను పెంచింది. ఇ. ఉద్యోగాల నిమిత్తం హిందువులు అరబ్బీ పారశీల భాషలను నేర్చు కొనుట మొదలయ్యింది.

ఒకరి సంస్కృతి మరి యొకరి సంస్కృతిని ప్రభావితం చేసినది. తత్ఫలితంగా ఈ యుగంలో సాంఘిక, సాంస్కృతిక, మత రంగాలలో అనేక మార్పులు ఏర్పడ్డాయి.

**25.2 హిందూ సమాజము నందు ముస్లిం ప్రభావం :** ముస్లింలు తమ సాంఘిక జీవితంలోనికి అడుగు పెట్టకుండా హిందువులు ఆత్మ రక్షణకు పూనుకొన్నారు. కులకట్టుబాట్లు కఠినం చేయబడ్డాయి. అతిక్రమణ శిక్షార్హం.

ముస్లింలు భోగలాలసులైనందున తమ ఆడ పిల్లలకు వారి వల్ల ప్రమాదం వచ్చునేమోయని హిందువులు వారికి బాల్యంలోనే వివాహాలు చేయమొదలిడినారు. అందువల్ల హిందూ సంఘంలో బాల్య వివాహాలు, సతీసహగమనం కఠినంగా అమలు జరుపబడ్డాయి.

ముస్లిం స్త్రీలు పరులకు కన్పించకుండా ఘోషాను ధరించెదరు. వారిని చూసి హిందువులు తమ స్త్రీలకు ఘోషా పద్దతిని ప్రవేశపెట్టిరి. ఇంకా వేష భాషలలోను, ఆహార నియమాలలోను హిందూ పద్ధతులు మారిపోయినవి.

**25.3 మహమ్మదీయ సమాజముపై హిందువుల ప్రభావం :** ఇస్లాం మతం పుచ్చుకున్న హిందువులు తమ కులాలను వదలలేదు. కనుక ముస్లింలోను ఒక నూతన వర్ణ వ్యవస్థ ఏర్పడినది. ఇంకా హిందువుల శుభకార్యాలు, మరణం తరువాత కర్మ చేయడం, జుట్టు తీయించుకోవడం మొదలగు కొన్ని ఆచారాలు ముస్లిం సంఘంలో ప్రవేశించినవి. హిందువులు మత గురువులను అవతార పురుషుల వలే పూజించు ఆచారం ముస్లింలో ప్రవేశించి వారు ఫకీరులను పూజించడం తీర్థ యాత్రలు చేయడం ప్రారంభించారు.

హిందువులతో పరిచయము వలన ముస్లింలకు లగ్నములలో, శకునములలో, జాతకములలో, మంత్రతంత్రములలో నమ్మకము కలిగింది. రస పుత్రులలో ఉన్న జోహర్ అనుకరించి యుద్ధ సమయములందు జనానా స్త్రీలను వధింపసాగారు.

ముస్లింలలో అనేక మంది విద్వాంసులు సంస్కృతాన్ని నేర్చుకొని వేదవేదాంగాలను పరిశీలించారు. రామాయణ, మహాభారత, భగవద్గీత గ్రంథాలను పర్షియన్ భాషలోకి అనువదించారు.

సుల్తానులు రాజపుత్ర రాజుల వేష భాషలను, రాజరిక మర్యాదలను సాంప్రదాయాలను అవలంబించారు.

**25.4 ఇస్లాం పై హిందూ మత ప్రభావం :** ముస్లింలు హిందువులను హింసించినా వారి గ్రంథాలలోను, వేదాంతంలోను ఉన్న గొప్ప తనాన్ని గ్రహించినారు. భగవంతుడు సర్వాంతర్యామి, కర్మ, పునర్ జన్మ మొదలగు నమ్మకాలు ముస్లింలను ఆకర్షించాయి. దాని

**25.5 హిందూ మతంపై ఇస్లామ్ ప్రభావము :** ఏకేశ్వరోపాసన, సర్వమానవ సౌభ్రాతృత్వము మొదలైనవి సూఫీ మత సిద్ధాంతము. ఇవి హైందవులకు క్రొత్తగాదు. ఉపనిషత్తులు, త్రియతాచార్యుని భోధనలలో ఇవి కలవు. భక్తి ఉద్యమ రూపమున హిందువులు తమ సమాజమును సంస్కరించిరి. రామానందుడు, చైతన్య, నానాక్, కబీర్ మొదలగు వారు భక్తి ఉద్యమ కర్తలు.

**25.6. సాంస్కృతిక రంగము :** వాస్తు శిల్ప కళలలోను హిందూ ముస్లిం రీతులు మిళితమై మిశ్రమ శైలి ఉద్భవించింది. ఈ శైలిని హిందూస్థానీ లేక ఇండో ఇస్లామిక్ శైలి అని పిలిచిరి. కట్టడాలకు ముస్లింలే రూప కల్పన చేసినప్పటికి వాటిని నిర్మించిన వారు హిందువులైనందున, హిందూ దేవాలయాలను పడ..గొట్టి ఆ వస్తువులనే వారు తమ కట్టడాలకు ఉపయోగించినందున ముస్లిం శిల్ప కళలో హిందూరీతులు ఏర్పడగా హిందువులు తమ కట్టడాలలో ముస్లిం కట్టడాలవలే గుమ్మటం, లతాలంకరణ, ఆర్చిలను ప్రవేశ పెట్టడంతో హిందూ శిల్ప శైలి మార్పు చెందింది. ఈవిధంగా మిశ్రమ వాస్తు రీతులలో అనేక కట్టడాలు వెలసినవి. వానిలో కుతుబ్ మీనారు, అలామ్ దర్వాజా, పద్మ మహల్, గజశాల మొదలగునవి నేటికిని ఉన్నవి.

ఢిల్లీ పరిసర ప్రాంతాలలో సాధారన ప్రజలు మాట్లాడే భాష హిందీ. ఢిల్లీ సుల్తానుల రాజభాష పారశీకము. కొంత కాలము గడచిన తర్వాత హిందీలో తుర్కీ, పర్షియన్, అరబ్బీ భాషల పదాలు కలిశాయి. రెండుమతాల వారు ఒకే లిపిలో రూపొందిన కొత్త భాషలో మాట్లాడారు. అదే ఉర్దూ భాష. హిందూ ముస్లిం సైనికులు కలిసి ఉన్నందున ఈ భాష ముఖ్యంగా సైనిక శిబిరాలలో రూపొందింది. ఈ భాషను మొదట జబూన్ - ఎ - హిందవి అని పిలిచారు. తరువాత ఉర్దూ అని పిలిచారు. ఈ భాషలో మొదటి కవి అమీర్ ఖుస్రూ.

ఇంకా ముస్లింల సంపర్కం వల్ల నృత్య, సంగీతాలలోను అనేక మార్పులు వచ్చాయి. ఈ విధంగా ఏర్పడిన సంస్కృతిని హిందూస్థానీ సంస్కృతి అని పిలిచిరి. బాబర్ భారత దేశాన్ని జయించినపుడు ఆయనకు హిందూ ముస్లింల మధ్య వేష భాషలలో, ఆటపాటలలో, ఆచారవ్యవహారాలలో, సంగీత సాహిత్య లలిత కళలలో ఎలాంటి వ్యత్యాసం కనిపించలేదని తన బాబర్ నామాలో వ్రాశాడు.

## 25.7 సారాంశము :

ఢిల్లీ సుల్తానులు మూడు శతాబ్దాలకు పైగా (1206 - 1526) భారత దేశమును పాలించారు. ఈ కాలములో ఐదు వంశాల వారు రాజ్యపాలన చేసిరి. వీరిలో కొందరు గొప్ప పాలనాదక్షులుగా ప్రసిద్ధి చెందిరి. వీరి పాలనా విధానమునందలి ఒకే రకమైన వ్యవస్థ ఒకే రీతిలో కొనసాగెను. ఈ కాలం భారత దేశ ప్రజలకు చాలా కష్టకాలం నగరాలను పట్టణాలను ధ్వంసం చేసి దోపిడీ చేయడం, బలవంతపు మతం మార్పిడీలు, దేవాలయ విధ్వంసం, పాలక వర్గం భోగభాగ్యాలతో మునిగి తేలడం, సామాన్య ప్రజలుదుర్భర అవమానకర జీవితం గడపటం ఈ యుగ ప్రధాన లక్షణాలు గా భావించవచ్చు. గ్రీకులు, కుషాణులు, శకులు మొదలగు జాతులు వలే గాక ముస్లింలు హిందూ సమాజంలో కలిసి పోక తమ ప్రత్యేకతను నిలుపుకొన్నారు. ఒకరి సంస్కృతి మరొకరి సంస్కృతిని ప్రభావితం చేసింది. తత్ఫలితంగా ఈ యుగంలో సాంఘిక సాంస్కృతిక, మత రంగాలలో అనేక నూతన మార్పులు ఏర్పడ్డాయి.

## 25. 8 ఉపోద్ఘాతం

మధ్యయుగంన హిందూ మతమందు వెలసిన మహోద్యమం భక్తి ఉద్యమం. చిరకాలంగా భారతీయ సంస్కృతి అనేక విదేశీ సంస్కృతుల ప్రభావాలకు లోనై సహనానికి, సహజీవనానికి ప్రసిద్ధి చెందింది. భారతదేశంలో మహమ్మదీయులు భారతీయ సమాజంలో విలీనంకాక తమ ప్రత్యేకతను నిలుపుకున్నారు. మహమ్మదీయులు అరబు, పారశీక, సాంస్కృతులను అలవరచుకొని, సారస్వతం, వాస్తుశిల్ప కళలోను, ఆచార వ్యవహారాల్లోను, ప్రత్యేకతలతో భారతదేశంలో భారత దేశంలో సంచలనం కల్గించిరి.

ముస్లింలతో పరిచయం ఏర్పడటంతో భారతీయ సాంఘిక వ్యవహారాలలో విప్లవాత్మక పరిణామాలు జరిగాయి. ఈ మతంలోని ఏకేశ్వరరోపాసన, నిరాడంబర పూజావిధానం, సాంఘిక సమానతాభావం, నిర్గుణోపాసన హిందువులను ప్రభావితం చేసాయి. దానితో హిందూ సమాజం కూడా ఎంతో మార్పుకు గురయ్యి, తమ ప్రాచీన భావాలను సంస్కరించుకోదలచారు. భక్తి ఉద్యమం మౌలికంగా హిందూ ఉద్యమైనను, క[illegible] కల్గించినది మాత్రం 'సూఫిమతం'. సూఫితత్వ ప్రచార ప్రభావం మన బహు[illegible]ఆరా[illegible], అర్థరహితమైన కర్మకాండ, కు[illegible]ధాలు, [illegible] పాల వల్లనే హిందూ మతం, నిర్జీవమై పోవుచున్నదని గ్రహించి [illegible]ందరు హిందూమత గురువులు హిందూమత

సమాజమును సంస్కరించుటకు దీక్ష వహించిరి. ఈ దీక్ష ఫలితమే నిరాడంబర పూజా విధానం, వర్ణ వ్యవస్థలని సాంఘిక సమతాభావం, భగవంతుడొక్కడే అనునవి ముఖ్య సూత్రములైనవి. ఈ సూత్రాలే ఇస్లాం మత ధర్మమగుటచే కొందరు భక్తి వుద్యమం ఇస్లాంనుండి ఆవిర్భవించిందని భావించిరి. కాని ఇది సత్యం కాదు. ఎందువల్ల అనగా 'భక్తి' మార్గం భారతీయ ఉపనిషత్తులలోను, త్రిమతాచార్యుల బోధనలలోను కలదు. అందువల్లనే 'భక్తి ఉద్యమం భారతదేశంనకు క్రొత్తకాదు. కొందరు ఆధునిక చరిత్రకారులు భావించినట్లు ఇది ఇస్లాంనుండి జన్మించినది కాదు. కాని హిందూమత సంస్కృతిని దుయ్యబట్టిన విగ్రహనాశకులైన ముస్లింల బోధననుండి ప్రేరణ ఒరవడిన గ్రహించినిదనుట వాస్తవము'. అని ఎ.ఎల్. శ్రీవాత్సవ పండితుని అభిప్రాయం. అందువల్లనే దీనిని "మధ్యయుగ హిందూమత పునరుజ్జీవమని" ఫణిక్కర్ వర్ణించెను.

## 25. 9 మత ఉద్యమాలు

ఇస్లాం మతం హిందూమతంలో ఎన్నో మార్పులకు కారణమైంది. ముస్లిం చక్రవర్తులు హిందూమత వ్యతిరేక విధానాలను అనుసరించారు. దేవాలయాలను పడగొట్టించి హిందువులకు అనేక ఆశలు చూపి ఇస్లాం మతంలోకి మార్చే ప్రయత్నాలు చేయసాగారు. ఫలితంగా భారతదేశంలో హిందూమతం పతనం చెందే పరిస్థితులు దారితీసెను. బ్రహ్మణుల ఆధిక్యత కూడా అంతరించింది. ఇస్లాం మతం ప్రభోదించే సర్వమానవ సమానత్వం, సౌభ్రాతృత్వం, సోదర భావం, హిందూ సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజలను విశేషంగా ఆకర్షించింది. హిందూమతంను పరిరక్షించుటకు రాజపుత్ర స్థానంలోని హిందూ రాజులు, విజయనగర ప్రభువులు బద్ద కంకణులైరి.

ఇస్లాం మతంలోని సుగుణాలను హిందువులు కూడా గ్రహించి, హిందూ మతాన్ని రూపుదిద్ది, హిందూ మతానికి పూర్వపు వైభవాన్ని తెచ్చుటకు, హిందూ సమాజమున గల సాంఘిక వ్యత్యాసాలు, మతాచారాలు, మూఢనమ్మకాలు తొలగించుటకు అనేక మంది పండితులు, వేదాంతులు, మత బోధకులు తీవ్ర ప్రయత్నాలు చేసారు. ఇదే భక్తి ఉద్యమం.

## 25.10 భక్తి ఉద్యమానికి దోహదం చేసిన అంశాలు

1. హిందూమతంలో అత్యంత ఆధ్యాత్మిక విలువలు కలిగి సామాన్య మానవునికి అవగతము కాలేదు. కనుక సులభంగా అర్ధమయ్యే నూతన మతబోధన పట్ల సామాన్య ప్రజానీకం దృష్టి సారించింది.
2. మధ్యయుగంలో గల వర్ణ వ్యత్యాసాలను తొలగించుట. అగ్ర కులాల వారి ఆధిక్యతను తగ్గించుట. ఈ భక్తి ఉద్యమం ద్వారా దిగువ కులంల వారిని కూడా భక్తి - మోక్ష మార్గాలవైపు మళ్లించుట.
3. హిందూ సమాజంలోని దిగువ కులాల ప్రజలు వర్ణ వ్యత్యాసాలకు విసుగుచెంది, ఇస్లామ్ మతాన్ని స్వీకరించారు. అట్టి సమయంలో ఈ భక్తి ఉద్యమంద్వారా హిందువులు ఇస్లాం మతంలోనికి వలసపోకుండా ఆపడం.
4. మహ్మదీయులు హిందువులపై జరుపు అత్యాచారాలను అరికట్టుట.
5. ముస్లింరాజులు భారతదేశంలో హిందూమత వ్యతిరేక విధానం అనుసరించి అనేక ప్రధాన పవిత్ర దేవాలయాలను నేలమట్టం చేసారు. అట్టి పరిస్థితులలో హిందువులు భక్తి మార్గాన్ని అనుసరించారు.
6. హిందువులలో మతోత్సాహం కలిగించి, మహమ్మదీయ దురాగతంనుండి హిందూమతంను, హిందూదేశంను రక్షించుట.
7. హిందువులకు, ముస్లింలకు మధ్య సామరస్య భావంను పెంచి ఇద్దరి మధ్య ఐక్యతను సాధించుట.
8. డా. తారచంద్, అహమ్మద్ జాని, డా. కురేష్ వంటి చరిత్రకారులు భక్తి ఉద్యమం ఆరంభానికి హిందూ సమాజంపై ఇస్లాంమత ప్రభావమే ప్రధానకారణంగా పేర్కొన్నారు. కాని ఈ అభిప్రాయం పూర్తిగా సత్యంకాదు. భక్తి ఉద్యమం ప్రచారంచేసిన సర్వమానవ సోదరభావం, సమానత్వం, విగ్రహారాధన పట్ల వ్యతిరేకత, వర్ణ వ్యవస్థకు వ్యతిరేకత, ఏకేశ్వరోపాసన వంటి అంశాలపై ఇస్లాం ప్రభావం ఉన్నదనటంలో అన[illegible]ం లేదు. ఈ విధంగా ఇస్లాం మతం భక్తి ఉద్యమం పై తన ప్రభావాన్ని కల్గి ఉంది.

## 25.11 భక్తి ఉద్యమ సూత్రాలు

1. ఈశ్వరుడొక్కడే
2. కులభేదాలు ఉండరాదు
3. విగ్రహారాధన ఉండకూడదు.
4. మానవులు అందరు సమానులే
5. యజ్ఞయాగాది క్రతువులు, వ్రతాలు, కర్మకాండలు మోక్షసాధన మార్గాలు కావు.
6. నిర్మలమైన మనస్సు, సద్గుణమైన శీలం, అచంచల భక్తి ఒక్కటియే మోక్షమునకు మార్గం
7. మోక్ష సాధనకు అందరూ అర్హులే మొదలగు అంశాలు భక్తి ఉద్యమ సూత్రాలుగా చెప్పవచ్చును.

## 25.12 భక్తి ఉద్యమ ప్రవక్తలు

భక్తి ఉద్యమ ప్రవక్తలు చాలామంది కలరు. వారిలో ముఖ్యులు

శంకరాచార్యులు, రామానుజాచార్యులు, నామదేవుడు, రామానందుడు, కబీరు, గురునానక్, వల్లభాచార్యులు, చైతన్యుడు, మొదలగు వారు తమ బోధనల ద్వారా భక్త ఉద్యమంను ప్రచారం చేసారు.

### 25.12.1. శంకరాచార్యులు, రామానుజాచార్యులు; రామానందుడు

భక్తి ఉద్యమ ఆదిపురుషుడు శంకరాచార్యులు బౌద్ధమతాన్ని హిందూమతంలో సమ్మేళనం చేసి నూతన ఆధ్యాత్మిక భావ ప్రచారానికి నాంది పలికారు.

క్రీ.శ. 12 వ శతాబ్దంలో భక్తి ఉద్యమాన్ని విశేషంగా ప్రచారంచేసిన వారిలో ముఖ్యుడు రామానుజాచార్యులు. ఇతడు విష్ణుభక్తుడు. ఒకే భగవంతుని పట్ల భక్తి ఆరాధనకు ఇతడు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి మోక్షసాధనకు చక్కని మార్గం సూచించాడు.

రామానుజాచార్యులు తరువాత రామానందుడు ప్రముఖుడు. ఇతడు అలహాబాదు వాస్తవ్యుడు. 14 వ శతాబ్దంనకు చెందినవాడు. రామభక్తుడు. భక్తిని అన్ని వర్ణాల ప్రజలకు, స్త్రీ పురుషులు అనుభేదం లేకుండా బోధించాడు. అన్ని వర్ణాలవారు ఇతని అనుచరులుగా ఉండిరి. అందులో ముఖ్యుడు మహమ్మదీయుడు కబీరు. రామానందుడు వైష్ణవ మతంను ప్రచారం చేసెను. ఇతడు ప్రయాగ, బెనారసులలో విద్యాభ్యాసం గావించి ఉత్తర భారతంలో అనేక ప్రాంతాలను పర్యటించాడు. రామానుజాచార్యుని 'విశిష్టాద్వైత' మతాన్ని విశ్వసించి, కులవ్యవస్థను, పూజా విధానంను, కర్మకాండను నిరసించెను. సంస్కృత భాషకు బదులు హిందీ భాషను ప్రోత్సహించి తన భావాలను సామాన్య మానవులకు అందుబాటులో ఉండునట్లు ప్రచారం చేశాడు. 'భక్తి' మార్గం జ్ఞానంనకు సాధనంగా బోధించాడు.

**25.12. 2. మీరాబాయి :** రామానందుని ప్రియశిష్యురాలు మీరాభాయ్. ఈమె 'రాఠోర్' వంశమునకు చెందిన రసపుత్ర వనిత. ఆమె శ్రీకృష్ణుని భక్తురాలు. 15వ శతాబ్దంలో కృష్ణభక్తిని బోధిస్తూ బ్రజిది భాష అనే హిందీ, గుజరాతీలలో అనేక కీర్తనలను రచించింది. వాని ప్రచారం చేస్తూ దైవసాన్నిధ్యం చేరెను. ఆమె రచించిన గీతాలు నేటికీ బహుజనాదరణను పొందుచునే ఉన్నవి.

**25.2.3 వల్లభాచార్యులు :** వల్లభాచార్యులు క్రీ.శ. 1479 సం. న వారణాసి సమీపంలో తెలుగు బ్రాహ్మణ వంశంలో జన్మించాడు. ఇతడు వైష్ణవ భక్తుడు. ఇతనిది 'శుద్ధద్వైతం', అంటే జీవాత్మ పరమాత్మలకు అభేదం, జీవాత్మ బంధువిముక్తి సాధించడానికి కృష్ణభక్తి ముఖ్యసాధనమన్నాడు. భగవంతుని శ్రీకృష్ణావతారం పట్ల అపార ప్రేమగలవాడు.

గొప్ప ప్రజ్ఞ, విశేష పాండిత్యంతో పాటు వేదాంత పరిజ్ఞానం గల ప్రతిభావంతుడు. ఇతడు రచించిన గ్రంథాలు, బ్రాహ్మసూత్రాలపై వ్యాఖ్య, జైమిని సూత్రాలపైన విమర్శ మరియు 'అనుభష్య', 'తత్వార్థ దీప' ప్రధానమైనవి. అట్లే రాధాకృష్ణ ప్రేమతత్వాన్ని ఆధ్యాత్మిక ప్రాధాన్యతతో

బోధించాడు. కుల, మత, స్త్రీ పురుష అనుభేదం లేకుండా తన బోధనలు ప్రచారం చేస్తూ 'భక్తి' మార్గంను బోధించాడు. కాశిలో విద్యాభ్యాసం చేసి, దక్షిణ భారతదేశంలో శ్రీకృష్ణ దేవరాయల ఆస్థానంలో తన ప్రతిభను ప్రదర్శించాడు.

**25.12. 4. చైతన్యుడు :** భక్తి మార్గ ప్రభోదకుల్లో చైతన్యుడు. ఇతడు క్రీ.శ. 1485లో బెంగాలులోని "నాడియా" నందు బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. తన యిరువది ఐదవయేట సన్యసించి భక్తి భావంతో రాధాకృష్ణుల ప్రేమతత్వాన్ని ప్రభోధించడానికి జీవితాన్ని అంకితం చేశాడు. చైతన్యుడు కూడా వర్ణవ్యత్యాసాలను ఖండించి మానవ సౌందర్యాన్ని గుర్తించవలెనని బోధించాడు. ఇంకనూ ఇతడు జంతుబలి, మాంసభక్షణ, సురాపానం, మొదలగునవి గర్హించెను. ఒకసారి ఒక చండాలుని కౌగిలించుకొని "మన ఇద్దరి దేహాలు ఒకటి యేనని", అంటరాని తనంపై చైతన్యుడు విజయ ధ్వజమెత్తెను.

అతని శిష్యకోటిలో ముస్లింలు కూడా కలరు. తన్మయత్వంలో చైతన్యుడు రాధాకృష్ణుల ప్రేమను కీర్తన చేస్తూ దేశాటనం చేశాడు. చైతన్యమార్గానికే 'మధురభక్తి' అని పేరు. "కృష్ణుని పూజించడం గురువుని సేవించడం ద్వారా వ్యక్తి మాయమోహాల నుండి విముక్తుడై కృష్ణ పద సాన్నిధ్యం చేరుకుంటాడు". అని భోదిస్తూ పూరీలో క్రీ.శ. 1533 వ సం.న పరమపదించాడు. నేటికీ బెంగాల్‌లు చైతన్యుని కీర్తించుచూ ఆయన శ్రీకృష్ణుని అవతారమని విశ్వసింతురు.

**25.12. 5. నామదేవుడు :** భక్తి ఉద్యమకారులలో నామదేవుడు కూడా ప్రముఖుడు. క్రీ.శ. 15 వ శతాబ్ది తొలి పాదమందు మహారాష్ట్ర దేశంలో జన్మించిన తత్త్వవేత్త నామదేవుడు. ఇతడు దర్జీ కులంలో జన్మించి, వర్ణవ్యవస్థను, విగ్రహారాధనను ఖండించి, వ్రతాలు, ఉపవాసాలు, నియమాలు, తీర్థయాత్రలు అనవసరమని, మీ హృదయ ద్వారాలు తెరచి హరినామస్మరణ చేయండి, ముక్తిలభిస్తుంది, అని మహారాష్ట్ర ప్రాంతంలో ప్రచారం చేశాడు. అతని బోధనలు మహారాష్ట్ర దేశంలో ఆధ్యాత్మిక సాంఘిక సమతాభావాలను సాధించాయి.

**25.12. 6. కబీరు :** భక్తి ఉద్యమకారులలో ప్రముఖ సాదువు కబీరు. అతడు బ్రాహ్మణ వితంతువునకు కల్గిన అక్రమ సంతానమని, పుట్టిన వెంటనే వారణాసి దగ్గర ఒక తటాకం దగ్గర వదలివేయబడగా, ఒక ముస్లిం అతనిని చేరదీసెనని ప్రతీతి. కబీరు జన్మతః హిందులైనా, మహమ్మదీయుల ఇంట పెరిగిగి రామానందుని శిష్యుడై జ్ఞానం పొందాడు. తాను "అల్లాకు, రామునికి కూడా బిడ్డను" అని కబీరు చెప్పుకున్నాడు. దేవుడొక్కడేనని ఆయన విశ్వాసం. హిందువు, తురుష్కుడు ఒకేమట్టితో చేసిన వేరు, వేరు పాత్రలు, రాముడు, రహీమ్ ఒక్కడే అనేది అతని భోధనల సారం. ఈ భావాలతో కబీరు హిందీలో అనేక కీర్తనలు వ్రాశాడు. హిందూ - మహమ్మదీయుల సమైక్యతకు పాటుపడిన వారధి కబీరు. కబీరు నైతిక జీవితంనకు కడు ప్రాధాన్యతమిచ్చెను. ఆయన మాటలలో చెప్పవలెనన్న "పవిత్ర హృదయంలేకుండా, పవిత్ర జలమందు మునిగినను, తీర్థయాత్రలు చేసినను, విగ్రహాలు పూజించినను నిష్ప్రయోజనమని బోధించాడు".

ఇట్లు కబీరు నైతిక జీవనంకు, భక్తి మార్గంనకు ప్రాధాన్యమిచ్చి ముక్తి మార్గంనకు చేరెను. కబీరు మరణించిన స్థానంన అతని శిష్యులు ఒక పూలరాశిని గాంచిరని, దానిని హిందువులు, మహమ్మదీయులు పంచుకొని, హిందువులు వారణాసిలో దహన సంస్కారాలు చేయగా, మహమ్మదీయులు గోరక్‌పూర్‌లో సమాధి చేశారని ప్రతీతి.

**25.12. 7. గురునానక్ :** నానక్ క్రీ.శ. 1469 లో పంజాబులోని తాల్వెండి గ్రామంలో క్షత్రియ వంశంలో జన్మించాడు. బాల్యంనుండీ మతగురువుల బోధల చేత ప్రభావితుడై మతసహనాన్ని అలవర్చుకున్నాడు. తన ముప్పదవ యేట సన్యసించి "దేవుడొక్కడే" అని నిష్కలంక పవిత్ర జీవితమే ముక్తికి మార్గమని బోధించాడు. అతడు నైతిక విలువకు ప్రాధాన్యమిచ్చి, విగ్రహారాధనను, వర్ణ వ్యత్యాసాలను ఖండించాడు. హిందువులు, మహమ్మదీయులు కూడా నానక్ శిష్యులైనారు. పంజాబీ భాషలో శిష్యుడు అనడానికి 'శిక్' అంటారు. క్రమంగా నానక్ భోధనలు శిక్కు మతంగా రూపొందాయి.

మానవులు అందరు సమానులు అని, సత్యం, సోదరభావం, సన్మార్గం, స్వయంకృషి, దాన ధర్మాలు ఉత్తమ ఆదర్శాలుగా అతడు భావించాడు. ఇస్లాం, హిందూ మతాలు, భగవంతుని చేరుటకు రెండు మార్గాలుగా భావించాడు. మానవుడు తన సత్కార్యాల ద్వారానే రక్షింపబడునని విశ్వసించాడు. భగవంతుని పట ఆరాదనను బోధించాడు.

నానక్ సామాన్య ప్రజలకు అర్థమయ్యే విధంగా బోధనలు గావించాడు. ఫలితంగా అతని బోధనలు విశేష ప్రజాదరణ పొందాయి నానక్ స్వభావంలోని మాధుర్యం, బోధనలోని నిరాడంబర అన్ని వర్ణాల జాతుల ప్రజల ప్రేమను పొందుటకు సహకరించాయి. నానక్ హిందువులకు గురువుగా, మహమ్మదీయులకు 'పీర్' గా శాశ్వతుడైన గురునానక్ 'షాఫకీరు' నామధేయుడయ్యాడు.

## 25. 13. భక్తిఉద్యమ ఫలితాలు

ఈ మతోద్యమాల ఫలితంగా హిందువులు, ముస్లిమ్‌లు ఒకరినొకరు అర్థంచేసుకొని సహజీవనం అలవాటు చేసుకోసాగారు. భక్తి మార్గమే మోక్షసాధనకు ఉత్తమం, పుట్టుక వల్లగాని, ఆర్థిక పరిస్థితుల వల్లగానీ, స్త్రీ పురుష అనుభేదం లేకుండా అందరు మోక్ష సాధనక అర్హులు అని ఈ భక్తి ప్రచారకర్తలు ప్రభోధించారు. తత్ఫలితంగా హిందూ, బౌద్ధ, ఇస్లాం, మతాల మధ్య సామరస్యం, పరమతసహః విధానం ఏర్పడి, మోక్షంనకు భక్తి, భావం పెరిగాయి. అట్లే నిర్జీవమైన హిందూమతం బలంను పుంజుకొని సామాన్య ప్రజలచే విశేషంగ ఆదరింపబడింది. ఇస్లాం మత విస్తరణ అరికట్టబడెను. రామానందుడు కబీరు హిందూ భాషలందు, మీరాబాయి వ్రజభాష యందు నానక్ పంజాబీ భాష యందు రచనలు గావించి భక్తి ఉద్యమంను ప్రచారం చేశారు. తత్ఫలితంగా ప్రాంతీయ భాషలు బాగుగా అభివృద్ధి చెందాయి.

## అభ్యాసాలు

ఈ క్రింది వ్యాసరూప ప్రశ్నలు వివరించండి.

1. భక్తి ఉద్యమనగానేమి ? భక్తి ఉద్యమ ప్రారంభానికి దారితీసిన పరిస్థితుల్ని వివరించండి ?
2. భక్తి ఉద్యమ ప్రధాన ప్రచారకులు - వారి బోధనలు వర్ణింపుము

### లఘు వ్యాస రూప ప్రశ్నలు

1. భక్త ఉద్యమ సూత్రాలు
2. మీరాబాయి
3. గురునానక్
4. చైతన్యుడు

ఈక్రింది వానిలో సరైన సమాధానంలను గుర్తించండి :

1. భక్తి ఉద్యమానికి మూల పురుషుడు ఎవరు ( )
   ఎ) శంకరాచార్యుడు బి) రామానుజాచార్యుడు సి) చైతన్యుడు డి) మీరాబాయి
2. చైతన్యుడు ఎప్పుడు జన్మించెను ( )
   ఎ) 1485 బి) 1469 సి) 1533 డి) 1469
3. భక్తి ఉద్యయకాలంలో విదేశాలు పర్యటించిన సాధువు ( )
   ఎ) గురునానక్ బి) కబీరు సి) చైతన్యుడ డి) నామదేవుడు

### Reference Books


1. Social, Cultural & Economic History of Indian Medieval Period - S.C. Ray Choudary
2. Muslim rule in India - V.D. Mahajen.
3. Indian History & Culture Vol II - B.S.L. Hanumantha Rao, K. Basavesara Rao
4. The Sultanate of Delhi - A.L. Srivastava
5. An Advanced History of India - Three Authors


రచయిత
సి. రవీంద్రరాజు

పాఠం - 26

# కాకతీయులు - సాంఘిక, ఆర్థిక పరిస్థితులు - సాంస్కృతిక సేవ

## 26. 1 లక్ష్యం :

చాళుక్య, చోళ సామ్రాజ్యాల పతనానంతరం దక్షిణ భారత దేశంలో కాకతీయ, హోయసాల, పాండ్య యాదవ రాజ్యాలు, ఆంధ్ర, కర్ణాటక, తమిళ, మహారాష్ట్ర ప్రాంతాలలో రాజ్యమేలాయి. ఈ కాకతీయుల రాజకీయ చరిత్ర, దక్షిణ భారత దేశ సంస్కృతికి వారు చేసిన సేవ ఈ పాఠంలో అధ్యయనం చేయబడుతుంది.

**ముఖ్యాంశాలు :**


26.2 ఉపోద్ఘాతం.

26.3 ఆధారాలు.

26.4 కాకతీయ వంశ పుట్టుక

26.5 తొలి చక్రవర్తులు

26.6 రెండవ ప్రోల రాజు

26.7 రుద్ర దేవుడు

26.8 మహాదేవుడు

26.9 గణపతి దేవుడు

26.10 రుద్రమ దేవి

26.11 రెండవ ప్రతాప రుద్రుడు

26.12 కాకతీయుల సాంస్కృతిక సేవ

26.13 సారాంశము


## 26. 2 ఉపోద్ఘాతం

చాళుక్య, చోళ సామ్రాజ్యాల పతనానంతరం దక్షిణ భారత దేశ చరిత్రలో ప్రముఖపాత్ర వహించిన వారిలో ముఖ్యులు కాకతీయుః వీరు తెలుగు మాట్లాడు ప్రాంతములన్నియు రాజకీయముగా ఏకముచేసి తెలుగు భాషా సంస్కృతికి, శిల్పకళకు ఎనలేని సేవచేసారు అంతేగాక దాదాపు మూడు శతాబ్దాల పాటు ఇస్లాం వ్యాప్తిని దక్షిణ భారత దేశములోనికి చొచ్చుకొని రాకుండా నిరోధించుటలో వీరు సఫలీకృతులై విజయనగర పాలకుల అభ్యున్నతికి మార్గదర్శకులైనారు.

## 26. 3 ఆధారాలు

కాకతీయ చరిత్రకు ఆధారాలు శాసనాలు, సాహిత్యం, వాస్తు శిల్పాలు

**1.1. శాసనాలు :** a. శిలాశాసనాలు - రుద్రదేవుని అనుమకొండ శాసనము, మైలమబయ్యారం శాసనము, గణపతి దేవుని మోటుపల్లి శాసనం, మల్కాపురం శాసనము, ప్రతాపరుద్రుని తేరాల శాసనం, జాయపసేనాని చేబ్రోలు శాసనం మొదలైనవి. b. తామ్ర శాసనాలు - దానార్ణవుని మంగల్లు శాసనము, గణపతి దేవుని మొగలుట్ల, కరీంనగర్, గురవపాడు శాసనాలు, రుద్రమదేవి ఆలపాడు శాసనం, ప్రతాప రుద్రుని ఉత్తరేశ్వర శాసనం మొదలైనవి.

**1.2 సాహిత్య ఆధారాలు :** విద్యానాధుని ప్రతాపరుద్ర యశోభూషణము, పాల్కురికి సోమనాధుని పండితారాధ్య చరిత్రము, వల్లభాచార్యుని క్రీడాభిరామము, కొలను గణపతి దేవుని శివయోగసారము, జాయపసేనాని నృత్తరత్నావళి, బద్దెన నీతిశాస్త్ర ముక్తావళి, వెలుగ. టి వారి వంశావళి, అమీర్ ఖుస్రూ, ఇసామీ, మార్కోపోలో మొదలగువారి రచనలు.

**1.3 వాస్తుశిల్పాలు :** అనుమ కొండ, పాలంపేట, పిల్లల మర్రి, నాగులపాడు, మోటుపల్లి చేబ్రోలు మొదలగు ప్రాంతాల్లో నిర్మితమైన దేవాలయాలు.

## 26. 4 కాకతీయ వంశ పుట్టుక :

కాకతీయ వంశ నామమును గూర్చి చరిత్ర కారులలో ఏకాభిప్రాయం లేదు.

1. చాళుక్య దానార్ణవుని ముంగల్లు శాసనంలో తొలి కాకతీయ రాజులకు 'రాష్ట్రకూట' బిరుదు కలదు. కనుక కాకతీయులురాష్ట్ర కూటవంశ శాఖ వారై ఉండవచ్చునని పరబ్రహ్మశాస్త్రి అభిప్రాయం.
2. 'కాకతి' అను జైన దేవతను కాకతీయులు పూజించుట వలన కాకతీయులైనారని మరికొందరి అభిప్రాయం
3. కాకతీయ చక్రవర్తులు 'కాకతీ పుర వల్లభ' అను బిరుదును ధరించుటవల్ల వీరి జన్మస్థలము కాకతీపురమై యుండవచ్చునని, అందువల్లనే కాకతీయులైనారని ఇంకా కొందరి అభిప్రాయం. కాకతి పురము ఏది అను విషయములో పండితుల మధ్య ఏకాభిప్రాయము లేదు. ఓరుగల్లు 'కాకతమ్మ'కు ఆలయమున్నందున ఆ నగరమే కాకతీపురమై యుండవచ్చునని కొందరి అభిప్రాయం.
4. వంశనామము, లేక పూజించిన దేవత నామము, లేక జన్మస్థలమును బట్టి కాకతీయ పేరువచ్చి యుండవచ్చును. సమకాలీన శాసనాల్లో కొన్నింటి యందు కాకతీయులు క్షత్రియులనియు, మరికొన్నింటియందు శూద్రులని పేర్కొనబడింది.

## 26.5 తొలి చక్రవర్తులు :

దానార్ణవుని ముంగల్లు, బయ్యారం చెరువు శాసనాల ప్రకారము కాకతీయులలో మొదటి పాలకుడు రాష్ట్రకూట గుండయ. ఇతని అధికారము ఓరుగల్లు సమీపమున గల 'కుర్రవాడి' ప్రాంతములో ప్రారంభమయ్యెను. గుండయ తరువాత ఎరియ, భౌతియ, కాకత్య గుండ్యన వరసగా రాజ్య మేలారు. కాకత్య గుండ్యన నతవాడి (వరంగల్, ఖమ్మం జిల్లాలోని ప్రాంతం) ప్రాంతమును పాలించెను. కాకత్య గుండ్యన తరువాత అతని కుమారుడు మొదటి బేత రాజు కుమారుడైన మొదటి బేతరాజు క్రీ.శ. 1052 వరకు రాజ్యపాలన చేసెను. బేతరాజు కుమారుడైన మొదటి ప్రోలరాజు (క్రీ.శ. 1052 - 1076) సోమేశ్వరుని (రాష్ట్ర కూటరాజు) నుండి అనుమకొండ ప్రాంతమును పొందెను. ఇతనికి 'అరికేసరి' అను బిరుదు కలదు. మొదటి ప్రోలుని తరువాత అతని కుమారుడు రెండవ బేతరాజు (1076 - 1108) అధికారమునకు వచ్చెను. ఇతని కాలములోనే అనుమకొండ కాకతీయుల రాజధాని అయ్యింది. రెండవ భేత రాజు అనంతరము అతని కుమారుడు దుగ్గరాజు (1108 - 1116) రాజ్యమేలెను.

## 26.6 రెండవ ప్రోలరాజు (1116 - 1157)

అన్న దుగ్గ రాజును తొలగించి కాకతీయ సింహాసన మధిష్టించి రెండవ ప్రోల రాజు కళ్యాణి చాళుక్య రాజైన మూడవ తైలపుని ఓడించి స్వతంత్రుడయ్యెను. చాళుక్యులకు వ్యతిరేకంగా ఇతడు కాలచూరి బిజ్జల దేవునకు సహాయం చేసి చాళుక్య సామ్రాజ్య పతనానికి కారకుడయ్యెను. కాని తూర్పు తీరమునకు తన సామ్రాజ్యంను విస్తరింప చేయవలెనను ప్రయత్నమున చందవోలు పాలుకులైన వెలనాటి చోళుల చేతిలో మరణించెను.

## 26.7 రుద్రదేవుడు లేక మొదటి ప్రతాపరుద్రుడు (1158 - 1195)

రెండవ ప్రోలరాజు మరణానంతరము అతని కుమారుడు రుద్రదేవుడు కాకతీయ సింహాసనమధిష్టించెను. ఇతడు గొప్ప పరాక్రమవంతుడు. అనేక దండయాత్రలు చేసి ఇతడు కాకతీయ రాజ్యంను విస్తరింపచేసెను. తన దండ యాత్రల్లో రుద్రదేవుడు చాళుక్య సామంతులైన దొమ్మరాజును, మైలగి దేవుని జయించెను. ఆ తదుపరి కందూరు చోడ రాజైన భీమునిపై దండయాత్ర చేసి అతనిని ఓడించి రాజధాని పానుగల్లును దహనం చేసెను. పరాజయం చెందిన చోడభీముడు తన కుమార్తె పద్మావతిని రుద్రదేవునికిచ్చి వివాహము చేసెను. ఆ తదుపరి రుద్రుడు తీరాంధ్రంపై దృష్టి సారించెను. ఈ దండ యాత్రలో త్రిపురాంతకం, ధాన్యకటక పాలకులను జయించి మదిగొండ, పిఠాపురం పాలకులను సామంతులుగా చేసుకొనెను. రుద్ర దేవుని కాలంలోనే కాకతీయులకు, దేవగిరి యాదవులకు పోరు ప్రారంభమయ్యెను. యాదవ రాజైన జైతుగి కాకతీయ రాజ్యంపై దండెత్తి రుద్రుని వధించి పశ్చిమోత్త తెలంగాణా ప్రాంతాన్ని ఆక్రమించెను.

## 26.8 మహాదేవుడు (1195 - 1199)

రుద్ర దేవుని తరువాత అతని సోదరుడు మహదేవుడు అధికారానికి వచ్చెను. తన అన్న మరణానికి కారకులైన యాదవ రాజు జైతుగి పై ప్రతీకారం తీర్చుకొనుటకు మహాదేవుడు యాదవులతో యుద్ధం చేసి వారిచేతిలో మరణించెను. మహాదేవుని కుమారుడైన గణపతిదేవుడు యాదవులకు బందీగా చిక్కెను.

## 26. 9 గణపతి దేవుడు (1199 - 1262)

1. కాకతీయ చక్రవర్తులలో అగ్రగణ్యుడు గణపతి దేవుడు. మహాదేవుడు యాదవులతో యుద్ధముచేస్తూ మరణించగా గణపతిదేవుడు యాదవులకు బందీగా దొరికెను. నాటి నుండి గణపతిదేవుడు సింహాసనం అధిష్టించు వరకు కాకతీయ సామ్రాజ్యాన్ని రేచర్ల రుద్రుడు సంరక్షించెను. గణపతి దేవుని కాలంలో కాకతీయ సామ్రాజ్యవైభవం అత్యున్నత దశకు చేరుకున్నది. తెలుగు భాషా ప్రాంతాలన్నిటిని తన ఏలుబడిలోనికి తెచ్చి 'సకల దేశ ప్రతిష్ఠాపనాచార్య' అను బిరుదు పొందెను.
2. సింహాసన మధిష్టించిన వెంటనే గణపతి దేవుడు కాకతీయ సామ్రాజ్యమునకు నలువైపులగల శత్రువులను అంత మొందించుటకు దండ యాత్రలు ప్రారంభించెను. మొదట గణపతిదేవుడు తన దృష్టిని తీరాంధ్ర పాలకులపై కేంద్రీకరించెను ఆ నాడు వెలనాటి పాలకులడైన పృథ్వీశ్వరుడు కృష్ణా ప్రాంతంను తన ఆధీనంలో వుంచు కొనుటకు తన రాజధానిని చందపోలు నుంచి పిఠాపురమునకు మార్చెను. వెలనాటి పృథ్వీశ్వరుని ఆధీనమునందు అయ్య వంశమునకు చెందిన పినచోడి దివి సీమను పాలించుచుండెను. గణపతి దేవుడు తన సేనాని ముత్యాల చౌండరాముని దివి సీమ పైకి పంపి పినచోడుని జయించి దివి సీమను ఆక్రమించెను. ఈ విజయముతో సంతసించిన గణపతి దేవుడు దివిసీమను పినచోడి పాలన క్రిందనే వుంచి అతని కుమార్తెలైన నారంబ, పేరాంబలను వివాహమాడి, కుమారుడైన జాయపను గజ సాహిణిగ నియమించి తన రాజకీయ విజ్ఞతను ప్రదర్శించెను.
3. దివిసీమలోని విజయమును చూసిన ధరణికోటలోని కోట పాలకులు గణపతిదేవుని ఆధిపత్యము అంగీకరించిరి.
4. ఆ తదుపరి గణపతిదేవుడు నెల్లూరులోని తెలుగు చోడరాజైన తిక్కభూపాలుడు, కమ్మనాటి మహామండలేశ్వరుడైన బల్లయ సహాయంతో వెలనాడు పై దండెత్తి పృథ్వీశ్వరుని వధించెను. సమర్థుడైన జాయపను వెలనాటి పాలకునిగ గణపతిదేవుడు నియమించెను. క్రీ.శ. 1206 నాటికి వెలనాటి విజయం పూర్తయ్యెను.
5. వెలనాటిని జయించిన పిదప గణపతి దేవుడు దక్షిణ దేశముపై తన దృష్టిని సారించెను. నెల్లూరు తెలుగు చోడరాజైన మనుమసిద్ధి దాయాదుల ఘర్షణల వల్ల సింహాసనం కోల్పోయి గణపతి దేవుని సహాయమర్థించగా గణపతి దేవుడు మనుమసిద్ధి శత్రువులను జయించి మనుమసిద్ధి అధికారంను నెల్లూరులో నిలబెట్టెను.
6. గాంగ రాజైన మూడవ అనంగ భీముని ఓడించి దక్షిణ కళింగను గణపతి దేవుడు స్వాధీనపరచుకొనెను.

7. యుద్ధముల ద్వారా కాకతీయ రాజ్యాన్ని విస్తరింప జేయుటయే గాక వైవాహిక సంబంధాల ద్వారా తన అధికారంను గణపతిదేవుడు సుస్థిర పరచుకొనెను. నిడదవోలు పాలకుడైన వీరభద్రునికి తన కుమార్తె రుద్రమదేవి నిచ్చి వివాహం జేసెను. కోట పాలకుడైన భేత రాజునకు తన రెండవ కుమార్తె గణపాంబను ఇచ్చి పెండ్లి చేసెను. గణపతి దేవుడు ఓరుగల్లు పట్టణమును వృద్ధిపరచి దానిని తన రాజధానిగా చేసెను. ఇతని కాలంలో, వ్యవసాయభివృద్ధికి అనేక చెరువులు త్రవ్వబడ్డాయి. వర్తక వ్యాపారాలు అభివృద్ధి చెందాయి. గణపతి దేవుడు గొప్ప శివ భక్తుడు. గోళకి మఠాధిపతియైన విశ్వేశ్వర శివుడు ఇతని మత గురువు. పాలంపేటలోని రాయప్పగుడి ఈతని కాలంలోనే నిర్మించబడింది.

## 6.10 రుద్రమదేవి (1262 - 1289)

1. గణపతి దేవునకు కుమారులు లేనందున అతని కుమార్తెయగు రుద్రమదేవి అతని తర్వాత కాకతీయ సింహాసనమధిష్టించెను. రుద్రమదేవిని చాళుక్య వీరభద్రుని కిచ్చి వివాహము చేసిరి. కాని రుద్రమదేవి అనతి కాలానికే భర్తను కోల్పోయెను. తన తదుపరి కాకతీయ రాజ్యభారమును వహింపవలసి వచ్చింది. రుద్రమదేవిని పుత్రునిగా భావించి గణపతి ఆమెకు సమస్త విద్యలలో శిక్షణయిచ్చి రుద్రదేవ మహారాజు అను పేర తన వారసురాలుగా నియమించెను. ఇది సహించలేని రుద్రాంబ దాయాదులు రుద్రాంబ అధికారమునకు వచ్చిన వెంటనే తిరుగు బాటు చేసిరి. మరొక వైపు యాదవులు, పాండ్యులు కాకతీయులతో యుద్ధాలకు దిగిరి. ముందుగా రుద్రమదేవి తనపై తిరుగుబాటు చేసిన మురారి, హరిహర దేవులను అణచి వేసింది. ఈ అణచివేతలో రుద్రమకు అండగా నిలిచిన వారిలో ప్రముఖులు వెలమకులస్థుడైన ప్రసాదిత్యుడు, కాయస్థ వంశానికి చెందిన జన్నిగదేవుడు. అంతరంగిక సంక్షోభంలో రుద్రమదేవి నిమగ్నురాలైయున్న కాలంలో కళింగ గాంగులు వేంగిని జయించిరి. కళింగ గాంగులను ప్రతిఘటించుటకు పోతినాయక, ప్రోలి నాయకుల ఆధ్వర్యమున రుద్రమదేవి సేనలను పంపెను. ఈ పోరులో కళింగ సైన్యం గోదావరి దాటి తరలిపోయెను. నాటి నుండి కాకతీయులకు కళింగులకు మధ్య గోదావరి సరిహద్దు అయ్యెను. ఇదేకాలంలో యాదవరాజు మహాదేవుడు కాకతీయ రాజ్యంపై దండయాత్ర జేసెను. రుద్రమదేవి మహాదేవుని జయించి అతని వద్దనుండి కప్పము తీసుకొని వదలి వేసెనని ప్రతాపరుద్ర యశోభూషణ ప్రకారం తెలియుచున్నది. కాకతీయ సామ్రాజ్యపు దక్షిణ భాగమున పాండ్యులు విజృంభించి తిరుపతి, నెల్లూరు ప్రాంతాలను ఆక్రమించిరి. పాండ్యుల పాలనలో గల తెలుగు ప్రాంతాలను కాయస్థ సేనాని జన్నిగ దేవుడు జయించెను. ఇతడు, ఇతని తర్వాత అధికారానికి వచ్చిన త్రిపురారి, రుద్రమదేవి సార్వభౌమత్వాన్ని అంగీకరించారు. అయితే త్రిపురారి తరువాత రుద్రమదేవికి ప్రక్కలో బల్లెమయ్యెను. ఇతనిచే యుద్ధములో రుద్రమదేవి వీర స్వర్గమలంకరించెనని పి.వి. పరబ్రహ్మ శాస్త్రి అభిప్రాయం.

2. రుద్రమదేవి గొప్ప యోధురాలేగాక పాలనాదక్షురాలు. ఈమె ఓరుగల్లు కోటను మరింత దుర్భేధ్యంగా తీర్చిదిద్దినది. వెనిస్ యాత్రికుడు మార్కోపోలో కాకతీయుల రేవు పట్టణమయిన మోటుపల్లిని సందర్శించి రుద్రమదేవి పరిపాలనాదక్షతను, కాకతీయ అభ్యుదయాన్ని కొనియాడెను.

## 26.11 రెండవ ప్రతాప రుద్రుడు (1289 - 1323)

రుద్రమదేవి తదుపరి ఆమె మనుమడైన ప్రతాపరుద్రుడు సింహాసన మధిష్టించెను. ఇతని పాలన ప్రథమ భాగములో కాకతీయ సామ్రాజ్యము ఉచ్ఛస్థితికి చేరుకొని ద్వితీయ భాగములో క్షీణించి పూర్తిగా పతనము చెందినది. మొదట తెలుగు చోడులు, గండికోట రెడ్ల తిరుగుబాటులను అణచెను. ఆ తదుపరి కంచిపై దాడిచేసి పాండ్యులను, కేరళ రాజగు రవివర్మను పారద్రోలెను. కళింగ గాంగుల దాడులనరికట్టెను. కలంపిలిని స్వాధీన పరచుకొనెను. ప్రతాపరుద్రుని కాలంలో కాకతీయ రాజ్యము ముస్లిం దాడులకు గురిఅయ్యెను. అల్లాఉద్దీన్ ఖిల్జీ సేనాని మాలిక్‌కపూర్ దండెత్తి రాగా ప్రతాపరుద్రుడు అతనితో యుద్ధముచేసి పరాజయము చెంది సంధి చేసుకొని సామంతుడుగా నుండుటకు అంగీకరించెను. ఖిల్జీల పతనావస్థ ఆసరాగా తీసుకొని ప్రతాపరుద్రుడు సుల్తానుకు కప్పము చెల్లించుట మానివేయగా ఘియాస్ ఉద్దీన్ తుగ్లక్ తన కుమారుడైన జునాఖాన్‌ను ఓరుగల్లుపై పంపెను. కాని ప్రతాపరుద్రుడు జునాఖాన్‌ను ఓడించెను. జునాఖాన్ మరల 1323 లో కాకతీయ రాజ్యంపై దాడిచేసి ప్రతాపరుద్రుని ఓడించి బందీగా పట్టుకొని ఢిల్లీకి పంపెను. కాని మార్గమధ్యంలోనే ప్రతాప రుద్రుడు నర్మదానదిలో దూకి ఆత్మహత్య చేసుకొనెను. ప్రతాపరుద్రుని మరణంతో కాకతీయ సామ్రాజ్యము అంతరించెను. అతని రాజ్యము ఢిల్లీ సల్తానత్‌లో విలీనమయ్యెను.

## 26.12 ఆంధ్ర సంస్కృతికి కాకతీయుల సేవ

దక్షిణ భారతదేశమున తెలుగు భాషా ప్రాంతాలను సమైక్య పరచి ఆంధ్ర సంస్కృతికి రూపు రేఖలు దిద్దిన వారు కాకతీయులు.

**26.12.1** పరిపాలనా విధానము : కాకతీయులు హిందూ ధర్మ శాస్త్రములకు అనుగుణంగా పరిపాలన చేసారు. వీరు సాంప్రదాయ సిద్ధమైన రాజరికమును కొనసాగించారు. పరిపాలనలో రాజుకు సహాయం చేయడానికి మహాప్రధాని, సంధి విగ్రహి, సకల సేనాధిపతి, తంత్ర పాలుడు మొదలగు ఉద్యోగులుండేవారు. కాకతీయ రాజ్యంలో జాగీర్దారీ పద్ధతి అమలులో ఉండెను. ఈ జాగీర్దారులను నాయంకరులు అనేవారు. వీరు తమతమ ప్రాంతాలలో ఇంచుమించు స్వతంత్ర పాలకులు వలె వ్యవహరించేవారు. పరిపాలనా సౌలభ్యము కొరకు కాకతీయులు తమ రాజ్యమును నాడులుగాను, నాడులను స్థలములుగాను, స్థలములను గ్రామములుగాను విభజించిరి. స్థలమునకు అధికారి నాయంకరుడు. ఆయగాండ్రు, కరణం, రెడ్డి మొదలగు వారు గ్రామ పరిపాలనను చూచెడివారు. న్యాయపాలనలో రాజుకు సలహాలను ఇచ్చుటకు 'ప్రాడ్వివాకులు' అనెడివారు ఉండెడివారు. కాకతీయుల కాలంలో శిక్షలు కఠినముగా ఉండెను. భూమి శిస్తు, వృత్తిపన్నులు, గానుగలపైన, పశువులపైన, సంతల పైన, మగ్గాలపైన పన్నులు ప్రభుత్వ ఆదాయ మార్గాలు. కాకతీయులు శక్తివంతమైన సైన్యాన్ని పోషించేవారు. వీరికాలంలో అనేక గిరిదుర్గములు నిర్మించబడ్డాయి. రాజు నియంత్రణలోగల సిద్ధసైన్యమేగాక కాకతీయుల కాలమునాటి అమర నాయంకరులు సైన్యాన్ని పోషించేవారు. వెలను దొరలు కాకతీయుల సైన్యంలో ప్రధాన పాత్ర వహించారు.

**26.12.2.** ఆర్థిక పరిస్థితులు : కాకతీయుల పాలనలో ఆంధ్ర దేశము ఐశ్వర్యములో తులతూగింది. మార్కోపోలో, అమీర్‌ఖుస్రూ వంటి వారి రచనలిందుకు చక్కని నిదర్శనములు. వ్యవసాయం ప్రజల ప్రధాన జీవనాధారం. కాకతీయ రాజులు వ్యవసాయాభివృద్ధికి అనేక చర్యలు తీసుకొన్నారు. ఈ కాలంలో లక్నవరము, రామప్ప, పాకాల, అనుమకొండ, భద్రకాళి చెరువులు నిర్మించబడ్డాయి. ఇవికాక కాట సముద్రము, చౌడ సముద్రము, గౌడ సముద్రము, చింతల సముద్రము, విశ్వనాధ సముద్రము అను జలాశయములు కూడ ఈ కాలం నాటివే. కాకతీయులు ప్రధానంగా వరి, కొర్రలు, పెసలు, జొన్నలు, చెరకు, నూనెగింజల్ని పండించారు. ఆంధ్రదేశం వీరి కాలంలో వస్త్ర పరిశ్రమకు ప్రసిద్ధి చెందింది. వస్త్ర పరిశ్రమతో పాటు లోహపరిశ్రమ, దంతపరిశ్రమ వజ్రపరిశ్రమ అభివృద్ధి చెందినది. మచిలీపట్నం వస్త్ర పరిశ్రమకు, నిర్మల్ యుద్ధపనిముట్ల తయారీకి, గోల్కొండ వజ్రాల వ్యాపారానికి ప్రసిద్ధి చెందింది. ఈ కాలమున తూర్పు తీరమందలి ప్రసిద్ధ రేవు పట్టణము మోటుపల్లి. ఇచటి నావికులకు ఎటువంటి ఆపద కలగ కుండా గణపతి దేవుడు కట్టు దిట్టము చేసెను. విదేశాల నుండి దిగుమతిఅయ్యే వస్తువుల్లో ముఖ్యమైనవి శ్రీగంధము, పచ్చ కర్పూరము, ముత్యాలు, పగడాలు, దంతాలు మున్నగునవి.

**26.12.3.** సాంఘిక పరిస్థితులు : కాకతీయుల కాలం నాటి సమాజంలో గోచరించు ముఖ్యలక్షణములు బాల్యవివాహములు, వర శుల్కం, కన్యాశుల్కం, సతీసహగమనం, రాజకీయంగా బ్రాహ్మణుల ప్రాబల్యం తగ్గింది. జూదం, మద్యపానం, కోడి పందెముల నాటి వినోదాలలో ముఖ్యమైనవి.

**26.12.4.** మత పరిస్థితులు : కాకతీయుల కాలంనాటి ఆంధ్ర దేశమున జైన, బౌద్ధ మతాలు క్షీణించి వాని స్థానంలో భక్తి ఉద్యమ ప్రేరితములైన వీర శైవము, వైష్ణవ మతము ఎక్కువ ప్రచారంలోకి వచ్చెను. కాని సమాజంలో వర్ణ వ్యత్యాసాలు నిర్మూలించబడలేదు. తరచు శైవ, వైష్ణవ ఘర్షణలు జరుగుచుండేవి. అందువల్లనే తిక్కన హరిహర భావనను ప్రచారం చేసెను. ఆనాడు దానధర్మాలు, తీర్థాటనలు చేయటలో ప్రజలకు ఆసక్తి పెరిగింది. తిరుపతి, త్రిపురాంతకం, శ్రీశైలం, సింహాచలం, పంచారామములు నాటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు. తొలి కాకతీయులు జైన మతమును ఆదరించినను క్రమముగా వీరశైవం వీరి ఆదరణ పొందింది. గణపతి దేవుని కాలంలో వీర శైవం ఎక్కు ప్రచారనకు వచ్చింది. కాకతీయులు అనేక శైవాలయములకు దాన ధర్మములుచేసిరి. వేములవాడ, జోగిపేట, కొలనుపాక మొదలగు చోట్ల గల జైనాలయములను శివాలయములుగా మార్చిరి. శైవ మతమును ఆదరించినను వైష్ణవ సాంప్రదాయములను కూడా కాకతీయులు కొనసాగించిరి.

**26.12.5.** సారస్వతాభివృద్ధి : కాకతీయ రాజులు అనేకమంది పండితులను, కవులను పోషించిరి. వీరి ఆదరణలో సంస్కృత భాష అభివృద్ధి చెందింది. వీర శైవమత ఉద్యమ ఫలితంగా తెలుగు భాషయందు గొప్ప అభివృద్ధి జరిగెను. కాకతిరుద్ర దేవుడు స్వయంగా 'నీతిసారము' అను గ్రంధమును సంస్కృతంలో రచించెను. ఇతని ఆస్థానంలో గల అగస్త్యుడు సంస్కృతంలో కావ్యములు రచించెను. రెండవ ప్రతాపరుద్రుని ఆస్థానంలో గల శాకల్య మల్లభట్టు సంస్కృతంలో ఉత్తర రాఘవ కావ్యము, నిరోష్ఠ్య రామాయణమును

రచించెను. నాటి సంస్కృత కవులలో అగ్రగణ్యుడైన విద్యానాథుడు ప్రతాపరుద్ర యశోభూషణము అను గ్రంథమును రచించెను. జైన కవులలో అగ్రగణ్యుడైన అధర్వణుడు, విరాట పర్వమును తెలుగులోకి అనువదించెను. వీరశైవ కవులలో ప్రథముడైన మల్లికార్జున పండితుడు శివ తత్వ సారమును రచించెను. వీర శైవులలో పాల్కురికి సోమనాథుడు అగ్రగణ్యుడు. రెండవ ప్రతాపరుద్రుని కాలానికి చెందిన ఇతడు బసవ పురాణము, పండితారాధ్య చరితమును రచించెను. తెలుగు కవిత్రయంలో రెండవ వాడైన తిక్కన ఈ కాలం నాటి వాడే. ఇతని శిష్యులైన మాధవ మార్కండేయ పురాణమును, కేతన దశకుమార చరితను రచించెను. నాటి మతేతర గ్రంథాల్లో ముఖ్యమైనవి నీతి శాస్త్రము, నీతి సారము, సుమతీ శతకం. నాటి శృంగార కావ్యాల్లో మదన విజయం, కాదంబరి ముఖ్యమైనవి. జాయప సేనాని రచించిన 'నృత్తరత్నావళి' నాట్య శాస్త్ర గ్రంథము.

**26.12.6 వాస్తు శిల్పాలు :** కాకతీయులు వాస్తు శిల్ప కళలో చాళుక్య శైలి ననుసరించి వాటికి మెరుగులు దిద్ది విజయనగర రాజుల కందించారు. కాకతీయులు వీరశైవ మతస్థులు అందువల్ల వీరి రాజ్యంలో ఎక్కువగా శైవాలయాలు నిర్మితమయ్యాయి. వీరు నిర్మించిన దేవాలయాలలో ముఖ్యమైనవి. క్రీ.శ. 1163 లో కాకతీరుద్రుడు అనుమకొండలో నిర్మించిన వేయిస్థంబాల గుడి, క్రీ.శ. 1234 లో గణపతి దేవుడు సామంతుడు రేచెర్లరుద్రుడు పాలంపేటలో నిర్మించిన రామప్పగుడి, ఓరుగల్లు కోటలోని స్వయంభూ దేవాలయాలు, విష్ణు ఆలయం, సూర్యాలయం, పానగల్లు, పిల్లలమర్రి, నాగులపాడు, మాచెర్ల, గురజాల, మోటుపల్లిలోని ఆలయాలు. కాకతీయుల శిల్పాలు సర్వాలంకర శోభితంగా వివిధ భంగిమల్లో ఉంటాయి. కాకతీయుల శిల్పకళా ఖండాలన్నింటిలో రామప్పగుడిలోని నాగినీ శిల్పం మహోన్నతమైంది. దేవాలయ నిర్మాణంతో బాటు కాకతీయులు అనేక ప్రాంతాల్లో కోటల్ని నిర్మించారు. ఈ కాలంలో నిర్మించబడిన కోట ఓరుగల్లు, రాయచూరు, గోల్కొండ, రాచకొండ, దేవరకొండ కోటలు ముఖ్యమైనవి.

## 26.13 ముగింపు

దక్షిణ భారతదేశమున తెలుగు భాషా ప్రాంతాలను సమైక్యపరచి ఆంధ్రసంస్కృతికి రూపు రేఖలు దిద్ది, దాదాపు మూడు శతాబ్దాల పాటు (క్రీ.శ. 1000 - 1323) మహమ్మదీయ దాడుల నుంచి హిందూమతాన్ని, సంస్కృతిని కాపాడి విజయనగర రాజులకు కాకతీయులు మార్గదర్శకులైనారు.

## ప్రశ్నలు

### వ్యాస ప్రశ్నలు.

1. రెడ్డిరాజుల రాజకీయ చరిత్రను వివరించి వారు ఆంధ్ర సంస్కృతికి చేసిన సేవ వివరింపుము.

### సమస్య పూరిత ప్రశ్నలు

1. ముసునూరి నాయకుల ఆధ్వర్యాన ఆంధ్ర దేశంలో కొనసాగిన స్వాతంత్ర ఉద్యమాన్ని వివరింపుము.

### లఘుటీక ప్రశ్నలు

1. ప్రోలయనాయకుడు  2. పద్మనాయకులు

### అభ్యాసాలు

1. ముసునూరి కాపయ నాకుడు కొనసాగించిన స్వాతంత్ర్య ఉద్యమాన్ని వివరింపుము.
2. రెడ్డిరాజులు ఆంధ్ర సంస్కృతికి చేసిన సేవ ఎట్టిదో వివరిపుము ?

### ఉపయుక్త గ్రంథాలు


1. బి. య[illegible] యల్. హనుమంతరావు, భారతదేశ చరిత్ర - సంస్కృతి, ద్వితీయ భాగం తెలుగు అకాడమీ
2. మల్లంపల్లి [illegible] శర్మ - ఆంధ్రదేశ చరిత్ర సంగ్రహము.
3. History of the Reddy Kingdoms - M. Somasekahra Sarma.


రచయిత

**వి.కె మోహన్.**

పాఠం - 27

# విజయనగర చరిత్ర

## 27. 1 లక్ష్యం :

ఓరుగల్లు కాకతీయుల పాలన అంతమయిన తరువాత కృష్ణానదికి దక్షిణ ప్రాంతంలో విజయనగరాన్ని రాజధానిగా సుమారు మూడున్నర శతాబ్దాల కాలం. క్రీ.శ. 1336 - 1678 సంగమ, సాళువ, తుళువ, ఆరవీడు అనే నాల్గు వంశాల పాలనలో జరిగిన రాజకీయ విషయాలు వివరించుట.

**ముఖ్యాంశాలు :**


| | |
|---|---|
| 27.2 | ఆధారాలు |
| 27.3 | విజయనగర సామ్రాజ్య స్థాపన |
| 27.4 | విద్యారణ్యుడు |
| 27.5 | సంగమ పాలకుడు |
| 27.6 | సాళువ పాలకుడు |
| 27.7 | తుళువ పాలకులు |
| 27.8 | ఆరవీటి పాలకులు |


## 27.2 ఆధారాలు :

విజయనగర సామ్రాజ్యంలో నాలుగు భాషలలో విరివిగా సాహిత్య పోషణ జరిగింది. అవి, సంస్కృతం, తెలుగు, తమిళం, కన్నడం, ఈ భాషల్లో వ్రాయబడ్డ పెక్కుగ్రంథాలు : శతదూషని, బ్రహ్మసూత్రవృత్తి, న్యాయామృత, యుక్తిమల్లికా, పంచదసి, జీవముక్తి వివేక, అనుభూతి ప్రకాశిక మధురావిజయం, రామాభ్యుదయం, జాంబవ కళ్యాణం, అచ్యుతరాయాభ్యుదయం అనే సంస్కృత గ్రంథాలు. ఉత్తరహరివంశము, హరవిలాసము, శివరాత్రి మహత్యము, జైమిని భారతము, ఆముక్తమాల్యద, మనుచరిత్రము, కాళహస్తి మహాత్యము, రాజశేఖర చరిత్రము, పాండురంగమహాత్యము, రాదువచకము కొన్ని తెలుగు గ్రంథాలు. గరులింగ విభుని భిక్షాటన చరిత్ర, బొమ్మరసుని సుందరపురాణ, భీమకవి బసవపురాణ, లక్కనదండేశుని బసవ పురాణ, చామరసుని ప్రభులింగలీల, వీరభద్ర రాజాచే వ్రాయబడిన వీరభద్ర విజయము అనే కొన్ని కన్నడ గ్రంథాలు, తిరువానూరు వ్రాసిన తత్వ ప్రకాసస్వామిగళ, వడమలై అణగలైయ్యన్ వ్రాసిన విరుసుమయ విళక్కమ్, జ్ఞానప్రకాస దేసికర్ రచించిన కాచికాళంబకమ్ కొన్ని తమిళ గ్రంథాలు.

**శాసనాలు** (INSCRIPTIONS) : ఈ కాలానికి చెందిన శాసనాలు రెండు రకాలు. మొదటివి రాతిపై చెక్కబడ్డవి. (Stone Inscriptions or Epigraphs) మరియు రాగిరేకులపై వ్రాయబడ్డవి (Copper plate grants) ఇవి తెలుగు, కన్నడ నాగరిలిపుల్లో వ్రాయబడ్డాయి. ఇవి అనేక వేలున్నాయి.

**విదేశీ ఆధారాలు** : (FOREIGN SOURCES) : విజయనగర సామ్రాజ్యాన్ని పలువురు విదేశీ యాత్రీకులు దర్శించారు. వారు తమ అనుభవాల్ని ప్రత్యక్ష కథనంగా రచన రూపంగా వెల్లడించారు.

నికొలోకాంటి (Nicolo Conti) వెనీస్ వాస్తవ్యుడు క్రీ.శ. 1420 రెండవ దేవరాయ కాలంలో విజయనగర సామ్రాజ్యంలో పర్యటించి, సంవత్సరాది, దీపావళి మహర్నవమి పండగల వృత్తాంతాన్ని వివరించాడు. అబ్దుల్ రజాక్ (Abdur Razzak); పర్షానుండి వచ్చి క్రీ.శ.

1442 విజయనగర సామ్రాజ్యాన్ని దర్శించి రాజధాని వైభవం ఇలా వర్ణించాడు. "The city of Bidjanagar is such that the pupil of the eyes has seen a place like it, and the ear of intelligence has never been informed that existed any thing equal it in the world".

డొమింగో పియాస్ (Domingo Paes) : పోర్చుగీసు యాత్రికుడు శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఇతడు విజయనగర సామ్రాజ్యాన్ని దర్శించి మహానవమి ఉత్సవాన్ని వర్ణించాడు. పెర్నావస్ నూనిజ్ (Ferna Nuniz) పోర్చుగీసు యాత్రికుడు. కృష్ణదేవరాయల కాలంలో తను చూసినవి చూసినట్టుగ వివరించాడు స్థానిక ఆచార వ్యవహారాల్ని ఇతడు చక్కగ వర్ణించాడు. దురాతి బారాసా (Durate Barbosa) ఇతడు కూడా పోర్చుగీసు యాత్రికుడే. ఇతని విజయనగర సామ్రాజ్య ప్రత్యక్ష వర్ణన చాల బలమైన చారిత్రకాధారము.

సాంప్రదాయ వృత్తాంతాలు (Traditional Accounts) : విజయనగర, రాజకీయ, సాంస్కృత జనజీవనాన్ని ప్రతిబింబించే, చాటుకృతులు, మెకంజీ వ్రాత ప్రతులు (Mackenzie Manuscripts) స్థానిక వ్రాత చిట్టాలు (Local Records) మొదలయిన వాటిలో విజయనగర సామ్రాజ్య చరిత్ర నిక్షిప్తమైవుంది.

నాణేలు (NUMISMATICS) : విజయనగర పాలకులు ఉద్యోగులు విడుదల చేసిన నాణేలు వారి చరిత్ర రచనలో ఆధారాలుగ ఉపయోగపడతాయి. బంగారం, వెండి, రాగి లోహాల్లో వివిధ బొమ్మలతో జారీచేయబడిన విజయనగర నాణేలు, ధార్మిక, ఆర్థిక, సాంస్కృతిక చరిత్రకు ముఖ్య ఆధారాలు. సంగమ, సాళువ, తుళువ, ఆరవీటి పాలకులు వివిధ రకాలైన నాణేలను విడుదల చేశారు. వీటి అధ్యయనం నాటి చరిత్రకు ఎంతో తోడ్పడుతుంది.

శిల్పాలు చిత్రలేఖనాలు (Sculptures and Paintings) : విజయనగర సామ్రాజ్యంలో నిర్మించబడిన కట్టడాల్లో లభ్యమైన పెక్కు దేవతామూర్తులు, వారి పరివార మూర్తులు అనేక విషయాలు తెలియజేస్తాయి. దేవాలయ వాస్తుశిల్పం, రాజప్రాసాదాల తీరు, ఆకాలపు వాస్తువును తెలియజేస్తాయి.

## 27. 3 విజయనగర సామ్రాజ్య స్థాపన

విజయనగర సామ్రాజ్యం ఎప్పుడుఎవరిచే స్థాపించబడింది అనే విషయం వివాదాస్పదంగా వుంది. విజయనగర స్థాపకులు ఆంధ్రులా లేక కన్నడిగులా ? అనే ప్రశ్న తలెత్తటంతో సమస్య మరో మలుపు తిరిగింది.

రాబర్ట్ సూయల్ వ్రాసిన (A Forgotten Empire) వలన విజయనగర స్థాపనకు సంబంధించిన పలువివరాలు తెలస్తున్నాయి. సూయల్ ప్రకారం విజయనగరము క్రీ.శ. 1336లో మొదటి హరిహరరాయలచే స్థాపించబడింది. క్రీ.శ. 1323 లో వరంగల్ మహమ్మదీయుల ఆధీనం కావటంతో కాకతీయ కొలువులో పనిచేస్తున్న బుక్క, హరిహర అనే సోదరులు కొంతమంది అశ్విక దళంతో పారిపోయి ఆనెగొంద చేరుకున్నారు. వారితో వచ్చిన మదవ అనే బ్రాహ్మణుని సలహా సహకారాలతో విజయనగరాన్ని నిర్మించినట్లు సీవెల్ ఇంకో ఉదంతంలో పేర్కొన్నాడు. ఇదే విషయాన్ని ఇంకో విధంగా కూడా చెప్పబడింది. దీన్ని ప్రకారం క్రీ.శ. 1309 లో వరంగల్‌ను పాలిస్తున్న రాజప్రతినిధి కొలువులో ఉండే బుక్క, హరిహరులనే వారు మాలిక్ కపూర్ ఆధ్వర్యంలో హోయసాలభల్లాలునిపై దండెత్తిగా ఓడిపోయి ఆనెగొంది ప్రాంతానికి పారిపోయి మాధవ అనే వ్యక్తిని కలుసుకొని అతని సహాయంతో విజయనగరాన్ని నిర్మించెనట. క్రీ.శ. 1220 లో మాధవాచార్యులు కొండల మధ్య నివసించేటప్పుడు బుక్క అనే పశువుల కాపరి ఆహారం పెట్టి సపర్యలు చేయగ సంతృప్తుడైన మాధవాచార్యులు బుక్కను భారతదేశానికి రాజుకాగలడని ఆశీర్వదించెనట. బుక్క కాలానుగతంగా రాజై విజయనగరాన్ని నిర్మించినట్లు కౌటో (Couto) పేర్కొన్నాడు.

రాబర్ట్ సూయల్ తన ప్రముఖ గ్రంథమైన "ఎ ఫర్‌గాటెన్ ఎంపైర్" లో కురుబతెగకు చెందిన హరిహర బుక్క అనే సోదరులు ఓరుగల్లు (వరంగల్)లో ప్రతాపరుద్రుని కోశాగారులుగా పనిచేశారు. క్రీ.శ. 1323 లో వరంగల్ ఢిల్లి సుల్తానుల వశమయ్యింది. అప్పుడు ఈ సోదరులు ఆనెగొంది రాజును ఆశ్రయించి ఉద్యోగాల్లో చేరెను. అయితే 1334 లో ఆనెగొంది సుల్తాను వశం కాగా, అతడు తన ప్రతినిధిగా మాలికిను నియమించెను. అందుకు ప్రజలు తిరుగుబాటు చేయగా సుల్తాను స్థానిక హిందువుల్నే రాజు మంత్రులుగా నియమించెను. అలా నియమించబడ్డ వారే హరిహర బుక్క సహోదరులు.

ఫాదర్ హీరాస్ 'బిగినింగ్స్ ఆఫ్ విజయనగర హిస్టరీ' అన్న గ్రంథంలో హోయసాల వంశానికి చెందిన మూడవ వీరభల్లాలుడు విజయనగరాన్ని నిర్మించినట్లు పేర్కొన్నాడు.

డా. ఎస్. కృష్ణస్వామి అయ్యంగార్ క్రీ.శ. 1328 - 29 లో మూడవ భల్లాలుడు హసపట్టణం లేక విరూపాక్ష పట్టణ నిర్మాణానికి పునాది వేయగా అదే విజయనగరమయ్యిందని అభిప్రాయపడ్డారు.

విజయనగరం సామ్రాజ్యపు రాజధాని కాబట్టి దాన్ని సామ్రాజ్యం పేరుగా పిలువరాదని, కర్ణాటక సామ్రాజ్యంగా పిలవటం సమంజసమని, ఎమ్. హెచ్. రామశర్మ ప్రతిపాదించాడు. విజయనగరాన్ని తెలుగుకవులు 'కన్నడ రాజ్యలక్ష్మి' అని, కృష్ణదేవరాయల్ని 'కర్ణాటక క్షితిపాల' అని సంబోధించటం చేతనూ, సంగమపాలకులు కన్నడబిరుదాల్ని ధరించి కన్నడభాషను పోషించడం చేత విజయనగర స్థాపకులైన సంగములు కన్నడ దేశస్థులని భావించవచ్చు.

**విజయనగర స్థాపకులు తెలుగువారు :** విజయనగర రాజ్యాన్ని తెలుగువారు స్థాపించారు అని వాదించే వారిలో డా. నేలటూరి వేంకట రమణయ్య, ఆచార్య. కె.ఎ. నీలకంఠ శాస్త్రీ ప్రముఖులు. డా. వేంకట రమణయ్య ప్రతిపాదించిన విషయాల్లో ఈ అంశాలున్నాయి. క్రీ.శ. 1336 ముందు హరిహర సోదరులకు హోసపట్టణం, విజయనగరంతో సంబంధంలేదు. విరూపాక్ష దేవాలయం ఉండట వల్ల, ఈ పట్టణాన్ని విరూపాక్ష పట్టణం అని కూడా పిలిచారు. ఇది కంపిలరాయలచే నిర్మించబడ్డట్టు శాసనాల వల్ల తెలుస్తుంది.

క్రీ.శ. 1328లో ద్వారసముద్రాన్ని ఢిల్లీ సుల్తాను ధ్వంసం చేసిన ఆధారాలు లేవు. క్రీ.శ. 1343 వరకూ ద్వార సముద్రము మూడవ భల్లాలుని రాజధానిగా వుంది. క్రీ.శ. 1327 - 28 లో కంపిలరాజ్యాన్ని ఢిల్లీ సుల్తాను తన సామ్రాజ్యంలో కలుపుకున్నాడు. భల్లాలుని శాసనాల్లో హోసపట్టణాన్ని నిర్మించిన ప్రస్తావనలేదు. హరిహర సోదరులైన మారప్ప ముద్దప్పలు మలెనాడు ప్రాంతాన్ని పాలించినట్లు క్రీ.శ. 1352 నాటి శాసనాల వల్ల తెలుస్తుంది. అయినా మలెనాడు మూడవ భల్లాలుని రాజ్యంలో భాగమని చెప్పే ఆధారం లేదు. మూడవ భల్లాలుని ఆస్థానంలో హరిహర సోదరులు ఉద్యోగం చేయలేదని, పైగావారు హోమసాలులతో యద్ధం చేసినట్లు శాసనాధారల వలన తెలుస్తోందని, అందుచేత విజయనగరస్థాపన చేసినవారు కన్నడిగులు, మూడవ భల్లాలుని సామంతులు కారని డా॥ నేలటూరి వేంకటరమణయ్య భావించారు.

'రాజుకాలనిర్ణయం' అనే 17 వ శతాబ్దపు సంస్కృత గ్రంథం, కలెడి బసవరాజు రచించిన 'శివ తత్వరత్నాకర' గ్రంథం వల్ల హరిహ బుక్కరాయలు కాకతీయ రాజైన రెండవ ప్రతాపరుద్రుని ఆస్థానంలో కోశాధికారి, దేవారికులుగా వుండేవారని తెలుస్తోంది. నంజుండ వ్రాసిన 'బల్లాల రాయన యుద్ధం' అనే గ్రంథంలో హరిహర బుక్కరాయలు కంపిల కొలువులో కోశాధికారులుగ ఉండేవారని చెప్పబడింది.

జియావుద్దీన్ బరానీ 'సుల్తాన్ కంపిలను పాలించటానికి పంపిన వ్యక్తి వరంగల్ పాలకుడైన కన్యానాయక బంధువులలో ఒకడు, అనివ్రాశాడు. ఆనాటి మహమ్మదీయ చరిత్రకారుల రచనలను బట్టి హరిహర బుక్కరాయలు తెలుగువారని, పైగా కాకతీయ పాలకుల బంధుకోటిలోని వారని తెలియుచున్నది. విజయనగర స్థాపకులు తెలుగువారని చెప్పేందుకు డా. వెంకటరమణయ్యగారు ఈ క్రింది ఆధారాలను చూపించారు. సర్వజ్ఞ తన 'కాలజ్ఞానం' అనే గ్రంధంలో బుక్కరాయలను 'ఓరుగల్లు బుక్క' అని సంబోధించాడు. బుక్క రాయలు నాచన సోముణ్ణి పోషించాడు. బుక్క రాయల కోడలైన గంగాదేవి తన 'మధురావిజయం' అనే గ్రంథంలో రెండో ప్రతాపరుద్రుని ఆస్థాన కవులైన, ఆగస్త్య, విశ్వనాధులను, తిక్కనను కూడా స్తుతించింది. అయితే విజయనగర స్థాపకులు తొలుత కర్ణాటక దేశానికి చెందిన వారని, తరువాత ఆంధ్రదేశానికి వచ్చి యుండవచ్చునని భావించవచ్చు.

## 27.4 విద్యారణ్యుడు

విజయనగర స్థాపనతో సంబంధమున్న వ్యక్తులలో ముఖ్యమైనవాడు విద్యారణ్యుడు. హరిహర బుక్కరాయలు విద్యారణ్యుని సహాయంవల్ల విజయనగరాన్ని నిర్మించారని ప్రతీతి. క్రీ.శ. 1336 - 37 నాటి కాపలూరి శాసనంలో విద్యారణ్యుని ఆజ్ఞప్రకారం హరిహరుడు విద్యానగరాన్ని నిర్మించాడని చెప్పబడింది. క్రీ.శ. 1368 నాటి శాసనంలో మొదటి బుక్కరాయలు ప్రపంచాన్ని జయించిన తరుహాత విజయనగరి అనే గొప్ప నగరాన్ని నిర్మించాడని చెప్పబడింది. అయితే విద్యారణ్యుని సలహా ప్రకారం విద్యానగరాన్ని నిర్మించబడిందనే వాదన ఆధార

రహితంగా వుంది. విద్యారణ్యుడు హరిహర బుక్కరాయలు హిందూమతంలోకి మారటానికి, అటుపిమ్మట వారిచే విజయ లేక విద్యానగరాన్ని నిర్మింపచేయటానికీ ఎలా తోడ్పడ్డాడో చెప్పడం సాధ్యంకాదు.

## 27.5 సంగమ పాలకులు

మొదటి హరిహర రాయలు క్రీ.శ. 1336 సం.లో ఏప్రియల్ 18న పట్టాభిషిక్తుడయ్యాడు. ఇతడు సంగముని కుమారుడు. అందుచే ఇతని వంశాన్ని సంగమ వంశమని చరిత్రకారులు పిలుస్తున్నారు. హరిహర రాయలు క్రీ.శ. 1336 నుండి ఇరవై సంవత్సరాలు పాలించాడు. అతనికి కుమారులు లేరు. అతని తదనంతరం తమ్ముడైన బుక్కరాయలు రాజ్యానికి వచ్చాడు. ఇతడు అనేక యుద్ధాలలో విజయాన్ని సంపాదించి సమస్త దక్షిణా పథానికీ చక్రవర్తి అయ్యాడు. బుక్కరాయల తరువాత రెండవ హరిహరరాయలు రాజ్యాన్ని పాలించాడు. హరిహరరాయల కుమారుడైన విరూపణ్ణఉడయలు ద్రావిడదేశంలో రాయల అధికారాన్ని నెలకొల్పి సింహళంలపై దండెత్తి దాని పాలకుణ్ణి ఓడించి కప్పాన్ని వసూలు చేసెను. హరిహరరాయలు 28 సంవత్సరాలు పాలించెను. ఈకాలంలో విజయనగర సామ్రాజ్యం నలుదిశలా విస్తరించటంతో పశ్చిమ సముద్రతీర రేవు పట్టణాల ద్వారా ద్వీపాంతర వ్యాపారం బాగా సాగింది. అందువల్ల విజయనగర సామ్రాజ్య సిరిసంపదలు బాగా పెరిగాయి. రెండవ హరిహరరాయలు 'రాజాధిరాజ' అనే బిరుదాన్ని ధరించాడు. ఇతడు క్రీ.శ. 1404 లో మరణించాడు. సింహాసనం కోసం అంతఃకలహాలు రెండేళ్ళపాటు సాగాయి. క్రీ.శ. 1406 లో మొదటి రాయలు అతికష్టంపై సింహాసనాన్ని అధిష్టించి 16 సంవత్సరాలు పరిపాలించాడు. ఇతడు నిరంతరం బహమని సుల్తానులతోను, కొండవీటి రెడ్లతోనూ పోరాడవలసి వచ్చింది. దేవరాయలు విజయనగర కోటగోడల్ని బలపరచి బురుజుల్ని నిర్మించాడు. అరబ్బీ, పారశీక దేశాలనుండి ఉత్తమజాతి అశ్వాలను తెప్పించి బలమైన అశ్వదళాన్ని రూపొందించాడు. ఇతడు జాతిమతాల్ని సైతం లెక్కచేయక, మహమ్మదీయ విలుకాండ్రను కూడా తన సైన్యంలో భర్తీ చేసుకున్నాడు.

మొదటి దేవరాయల తరువాత అతని కుమారులు రామచంద్రరాయలు 6 నెలలు, విజయరాయలు 8సం. పాలించినట్లు చరిత్రకారల అభిప్రాయం అయితే క్రీ.శ. 1426 నుండి 1446 వరకు రెండో దేవరాయలు పాలించినట్లు తెలుస్తుంది. ఇతడు ప్రతాప, ప్రౌఢ ప్రతాప, గజ భేటకార అనే బిరుదుల్ని కలిగి సమర్థవంతంగా పాలించాడు. ఇతని కాలంలో పర్షియా చక్రవర్తి రాయబారి అబ్దుల్ రజాక్, ఇటాలియన్ యాత్రికుడు నికోలో కొంటి, విజయనగరాన్ని దర్శించి, దాని వైభవాన్ని ఘనంగా పొగిడారు. కృష్ణానది మొదలు సింహళము వరకూ అరేబియా సముద్రం నుంచి బంగాళాఖతం వరకూ గల భూభాగమంతా ఇతని అధికారంలోకి వచ్చింది. కొల్లం, సింహళం, పెగు, దనాసరి, అయిన విదేశాల పాలకులు ఇతనికి కప్పం చెల్లించారు. దేవరాయలు గొప్ప సాహిత్యాభిమాని. ఇతని ఆస్థానంలో కవి సార్వభౌముడైన డిండిమవున్నాడు. రెండవ దేవరాయల మరణించిన తరువాత అతని కుమారుడు మల్లికార్జున రాయలు క్రీ.శ. 1446 నుండి క్రీ.శ. 1465 వరకూ పాలించాడు. రాయలకు గజపతులకు తీరాంధ్రాన్ని జయించాలన్న కోరిక ఫలితంగా యుద్ధాలు ఎక్కువయ్యాయి. బహమనీ సుల్తానులు కూడా ఈ యుద్ధాల్లో పాల్గొన్నారు.

మల్లికార్జున రాయల మరణానంతరం క్రీ.శ. 1465 లో అతని కుమారుడైన రాజశేఖర రాయలు సింహాసనమధిష్ఠించాడు. కాని ఎక్కువ కాలం పాలించలేదు. మల్లికార్జునరాయల పినతండ్రి కుమారుడైన రెండవ విరూపాక్షరాయలు మల్లికార్జునుని చంపి రాజ్యాన్ని తన అధీన పర్చుకున్నాడు. అయితే స్త్రీ వ్యసన పరుడు, త్రాగుబోతు అయిన విరూపాక్షరాయలు రాజ్యాన్ని రక్షించుకోలేక పోయాడు. గోవా బహమనీ సుల్తాను ఆక్రమణకు గురికాగా, సాళువ నరసింహరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని కాపాడేందుకు కంకణం కట్టుకున్నాడు.

కపిలేశ్వర గజపతి కుమారుడు సింహాసనం కోసం పోరాటం సాగించగా బహమనీలు హంవీరునికి హామీ ఇచ్చారు. సాళువ నరసింహుడు తన తెలివితేటలతో హంవీరపురుషోత్తముల మధ్య రాజీకుదిర్చాడు తద్వారా తన బలాన్ని పెంచుకొని బహమనీలను ఓడించాడు. క్రీ.శ. 1485 లో విరూపాక్షరాయలు తన పెద్దకుమారునిచే చంపబడ్డాడు. రాజవంశంలోనూ రాజధానిలోను అంతఃకలహాలు పెచ్చు పెరగగా, అదుపుచేసే వారసులు లేనందున సంగమవంశం పూర్తిగా పాలనాధికారాన్ని కోల్పోయింది. మిగిలిన రాజ వంశం వారెవరైన వుంటే ప్రాణభీతితో అడవులలోనికి అదృశ్యమయ్యారు.

## 27.6 సాళువ పాలకులు

సంగమ పాలకుల్లో చెలరేగిన రాజకీయ కల్లోలము సాళువ వంశానికి చెందిన నరసింహరాయలు విజయనగర సింహాసనాన్ని చేజిక్కించుకొనే అవకాశం కలిగించింది. సాళువ వంశస్థులు, యదుసంతతి వారమని, చంద్రవంశ క్షత్రియులమని చెప్పుకొన్నారు. సాళువ నరసింహరాయలు విజయనగర సింహాసనమదిష్టించిన వెంటనే తిరుగుబాటు చేసిన పెరనిపాడు (కడప), సంబెటవార్ని, ఉమ్మత్తూరు సంగీతపురం (తులునాడు) పాలెగార్లను, బొమ్మవరం పాలకుడైన సాళువ మల్లిదేవుణ్ణి అణచివేసెను. ఇతడు పాలించిన 6 సంవత్సరాల కాలంలో విజయనగర పాలనను పటిష్టపరచి, సైన్యాన్ని బలపరిచాడు. సాళువ నరసింహునికి ఇద్దరు కుమారులు. మొదటివాడు తిమ్మరాజు, రెండవ వాడు నరసింహుడు, మరణించేముందు తన కుమారులతో అర్హుడైనవానికి సింహాసనం ఇవ్వమని, తన సేనానాయకుడైన తుళువ నరసానాయకునికి అధికారమిచ్చెను. దానిప్రకారం తిమ్మరాజు సింహాసనమధిష్ఠించాడు. కాని కొద్దికాలానికే యుద్ధంలో క్షతగాత్రుడై మరణించగా అతని తమ్ముడైన ఇమ్మడి నరసింహరాయలు సింహాసనమెక్కాడు. తుళువ నరసానాయకుని ప్రాబల్యాన్ని సహించలేని ఇమ్మడి నరసింహుడు అతణ్ణి తొలగించి నాదెండ్ల తిమ్మరుసును ప్రధానిగా నియమించాడు. ఇది అవమానంగా భావించిన నరసానాయకుడు పెనుగొండకు పోయి అక్కడ సైన్యాన్ని సమకూర్చుకొని, యుద్ధం ప్రకటించాడు. ఆ యుద్ధంలో నాదెండ్ల తిమ్మరుసు మరణించగా, ఇమ్మడి నరసింహుడు బందీగా దొరికాడు. అధికారం చేజిక్కించుకొన్న సాళువ నరసింహుడు పాలించటం మొదలుపెట్టాడు. దీంతో సాళువ పాలనకు తెరపడింది. తుళువపాలకుల పాలన ప్రారంభమయ్యింది.

## 27.7 తుళువ పాలకులు

సాళువ వంశం అధికారం కోల్పోవటంతో తుళువ వంశానికి చెందిన నరసానాయకుడు క్రీ.శ. 1505 లో విజయనగర సింహాసనమధిష్ఠించాడు. ఇతడు పాలించిన నాలుగు సంవత్సరాల్లోను అనేక యుద్ధాలతో పాటు, దానధర్మాలుకూడా చేశాడు. నరసానాయకునికి అయిదుగురు కొడుకులున్నట్లు న్యూనిజ్ వ్రాశాడు. అయితే, కృష్ణ, అచ్యుత, రంగ వీరనరసింహ, అనే వారిపేర్లు మాత్రమే తెలుస్తున్నాయి. అదోనిదుర్గ పాలకుడైన కాచప్ప ఉడమడు, విజయనగర సామ్రాజ్యానికి బద్ధ విరోధి అయి యూసఫ్ ఆదిల్ ఖాన్ తోనూ, ఉమ్మత్తూరు పాలె గాండ్రతోనూ, చేతులుకలిపి వీరనరసింహరాయలపై దండెత్తెగా, వీరనరసింహుని నమ్మినబంటు అయిన ఆరవీటి రామరాజు, తిమ్మరాజులు యూసఫ్ ఆదిల్ ఖాన్‌ను ఓడించి, కాచప్ప, ఉమ్మడుని చంపి, తిరగి, అదోని దుర్గాన్ని వీరనరసింహునికి అప్పగించెను. అందుకు సంతసించిన వీరనరసింహుడు తిమ్మరాజుకు 'స్వామి ద్రోహరగం' అనే బిరుదాన్నిచ్చి అదొని, కందనవోలులకు పాలకుడిగ చేసెను.

తుళువ వంశస్థులు, మైసూరునందలి తుళు ప్రాంతానికి చెందినవారు. వీర నరసింహుని తరుాత, శ్రీకృష్ణదేవరాయలు విజయనగర సామ్రాజ్యానికి ప్రభువయ్యాడు. తుళువ వంశములోనే కాక యావత్ విజయనగర పాలకులలో ప్రముఖుడు శ్రీకృష్ణదేవరాయలు. ఇతని కాలంలో విజయనగరం అత్యంత ఉచ్ఛదశకు చేరుకుంది.

### కృష్ణ దేవరాయలు : (క్రీ.శ. 1509 - క్రీ.శ. 1529)

కృష్ణదేవరాయలు జననం గురించి ఎన్నో గాథలు పాచుర్యంలో వున్నాయి. ఒక గాథ ప్రకారం, కృష్ణదేవరాయలతల్లి అయిన నాగమదేవి, కులవధువు కాదని, బోగస్త్రీ అని, అందువల్ల కృష్ణదేవరాయలు క్షత్రియుడు కాదని, దాసీపుత్రుడని తెలుస్తుంది. కృష్ణదేవరాయలు ఆంధ్రుడా లేక కన్నడిగుడా అన్న ప్రశ్నకూడా వున్నది. ఈ విషయంలో చరిత్రకారులలో ఏకాభిప్రాయం లేదు. ఆంధ్ర చరిత్రకారులు కృష్ణదేవరాయలు ఆంధ్రుడని, కన్నడ చరిత్రకారులు కన్నడిగుడని వ్రాశారు.

కృష్ణదేవరాయలు సింహాసనం అధిష్ఠించేనాటికి, విజయనగర సామ్రాజ్య పరిస్థితులు విషమించాయి. వారసత్వం కోసం సవతి తల్లుల సంతతి ఒకవైపు, శతృవర్గం మరోవైపు వ్యతిరేకతనీ తిరుగుబాటునీ ప్రకటించారు. ఉమ్మత్తూరు, శ్రీరంగ పట్టణపాలకులు ఒకవైపు, బహమనీ సుల్తాన్ అహ్మద్‌షా, కళింగ ప్రతాపరుద్ర గణపతి విజయనగరానికి విరోధులయ్యారు.

ఇటువంటి పరిస్థితుల్లో పోర్చుగీసు గవర్నరయిన అఫాంసో అల్బ్‌కర్క్, గోవాను ఆక్రమించి ప్రధాన కేంద్రంగా చేసుకోవటానికీ, ఆదిల్‌ఖాన్, కళ్ళికోట జామొరిన్‌లను ఓడించటానికి కృష్ణదేవరాయల సహాయాన్ని మద్దతునూ అర్థించి లూయిస్ ఫ్రయర్‌ను రాయబారిగా పంపెను.

పోర్చుగీసుల సహకారం దొరికింది. బహమనీసుల్తాన్ మహమ్మద్ షా, బీజాపూర్ నుండ యూసఫ్ ఆదిల్ షాలు విజయనగర సరిహద్దు వరకు దండెత్తిరాగా, కృష్ణదేవరాయలు వారితో కోవెల కొండవద్ద ఎదిరించి పోరాడెను. ఆయుద్ధంలో యూసఫ్ ఆదిషా మరణించెను. 12 సంవత్సరాలు వయస్సు వాడైన యూసఫ్ ఆదిల్‌షా కుమారుడు ఇస్మాయిల్ బీజాపూరు సింహాసనమెక్కెను.

కోవెల కొండను ఆక్రమించిన కృష్ణదేవరాయలు విజయనగరం చేరెను. అయితే బీజాపూర్‌లో కామల్‌ఖాన్ అనే సర్దారు బాలుడైన ఇస్మాయిల్‌ను తొలగించి చేజిక్కించుకున్నాడు. దీన్ని వ్యతిరేకించిన గుల్బర్గా పాలకుడు మాలిక్ దస్తూర్, బీదర్‌ను పాలిస్తున్న బీదర్ - ఇ - మాల్లిక్ సహాయం కోరాడు. ఇది తెలిసిన, కమాల్‌ఖాన్ దస్తూర్‌ను, బరీద్‌నూ ఓడించి, బీదర్‌ను ఆక్రమించి సుల్తాన్ మహ్మాద్‌షాను తన బందీగా చేసుకొన్నాడు. బీజాపూర్‌పై బరీద్ దస్తూరులు దండెత్తారు. పరిస్థితులు విషమించగా బెల్గాం ప్రజలు కమాల్ పాలనను నిరసించి కృష్ణదేవరాయల సహాయాన్ని అర్థించారు.

కృష్ణదేవరాయలు బెల్గాం ప్రజల ఆహ్వానాన్ని తన రాజకీయ ప్రయోజనానికి బాగా ఉపయోగించుకొన్నాడు. వెంటనే దండెత్తి వచ్చి రాయచూర్ అంతర్వేదిని జయించి [illegible] ఒప్పందానికి కుదిర్చాడు.

కాని ఇంతలో కమాల్ బీజాపూర్‌లో హత్య చెయ్యబడటంతో రాజకీయాలు మరోవిధంగా మారాయి. బీజాపూర్‌లో చెలరేగిన అల్లకల్లోలం అరాచకానికి కృష్ణదేవరాయలు జోక్యం చేసుకొన్నాడు. బరీద్‌ను గుల్బర్గా వద్దఓడించి, బందీగా వున్న మహ్మాద్‌షాను బంధ విముక్తుణ్ణి చేసి సింహాసనం పై కూర్చుండబెట్టి 'యవన రాజ్యస్థాపనాచార్య' అనే బిరుదుని ధరించాడు. క్రీ.శ. 1510 నాటి హంపీ శాసనంలో కృష్ణదేవరాయల్ని 'పరిభూత సురతాణ' అని పేర్కొంది. ఇదేకాలానికి చెందిన హంపి శాసనం 'గజపతి గజకూట పాకాల' అని పేర్కొంది. అల్లసాని పెద్దన మనుచరిత్రలో రాయలను 'యవన క్షోణీధవ స్థాపన' అని, 'కలుబరిగీ కటకక్షితి రక్షక' అని వర్ణించాడు.

ఉమ్మత్తూరు పై దాడి : శివ సముద్రాన్ని రాజధానిగా పాలిస్తున్న ఉమ్మత్తూరు గంగారాజు కృష్ణదేవరాయల్ని ధిక్కరించాడు. గంగ రాజును అణచేందుకు కృష్ణదేవరాయలు సైన్యాన్ని ఆయత్తం చేసుకొని యుద్ధం ప్రకటించాడు. ఒక సంవత్సరం సాగిన యుద్ధంలో లొంగని గంగరాజు కావేరీనదిలో మునిగి మరణించాడు. రాయలు, ఉమ్మత్తూరు, శివసముద్ర దుర్గాలను నాశనంచేసి, దానికి శ్రీరంగపట్టణాన్ని రాజధానిగా చేశాడు. ఈక్రొత్త ప్రాంతపాలనకై సాళువ గోవిందరాజును తన ప్రతినిధిగా నియమించాడు.

కళింగ దండయాత్ర : క్రీ.శ. 1513 నుండి 1519 వరకూ రాయలు కళింగపై దండయాత్ర సాగించాడు. ఈ కాలంలో అప్పుడప్పుడూ రాజధానికి వెళుతూ మధ్య మధ్య పుణ్య క్షేత్రాల్ని దర్శించేవాడు. కొండవీడు ప్రాంతాన్ని ప్రతాపరుద్రగజపతి కొడుకు వీరరుద్ర గజపతి పాలించేవాడు. ఉదయగిరిని, రాయలు జయించి కోటలో వున్న బాలకృష్ణుని విగ్రహాన్ని తీసుకొనిపోయి రాయలు విజయనగరంలో ప్రతిష్ఠించాడు. క్రీ.శ. 1515 లో కొండవీడు ముట్టడించబడి ఈ ముట్టడిలో సాళువ తిమ్మరుసు తన శక్తియుక్తులు ఉపయోగించి రాయలకు విజయాన్ని చేకూర్చాడు. కొండపల్లి ముట్టడి తరువాత విజయనగర సేనలు చితాబ్‌ఖాన్ పాలనలో వున్న తెలంగాణాలో ప్రవేశించాయి. పొట్నూరు దగ్గర రాయలకు చితాబ్‌ఖాన్ మధ్య భీకరమైనయుద్ధం జరిగింది. విజయనగర సేనలు విజయమందాయి. ప్రతాపరుద్ర గజపతి తన కుమార్తె భద్రాదేవిని రాయలకిచ్చి పెండ్లి చేసి సంధి కుదుర్చుకున్నాడు.

బహమనీ రాజ్యాలతో జోక్యం : కళింగ విజయం తరువాత కృష్ణరాయలు బహమనీ రాజ్యవ్యవహారాల్లో జోక్యం చేసుకున్నాడు. బీజపూర్ రాజ్య వ్యవహారాల్లో రాయలు నిమగ్నమయ్యాడు. క్రీ.శ. 1518 లో మమూద్‌షా మరణించాడు. సుల్తాన్ నామమాత్ర పరిపాలన కావటంతో అలీబరీద్ అధికారం చలాయించసాగాడు. మమూద్ షా ముగ్గురు కొడుకుల్లో అహ్మాద్‌షా వాలియుల్లాలు అకాలంగా మరణించారు. మూడోవాడైన కాలియుల్లా సుల్తానై అలీబరీద్‌న్ తొలగించే ప్రయత్నంలో అధికారాన్ని కోల్పోయి బీదర్ విడిచి పారిపోయాడు. దీంతో బహమనీ వంశం అంతరించింది.

కృష్ణదేవరాయలు బీజపూర్ సుల్తాన్ ఇస్మాయిల్ ఆదిల్‌షాతో చాలాసార్లు యుద్ధాలు చేశాడు. ఈ యుద్ధాల కారణాలు ఫలితాలు నిర్దిష్టంగా తెలియవు. రాయచూర్‌లో రాయల వశమయ్యింది. సుల్తానుల్లో భయాందోళన పెరగగా, రాయచూర్‌ను ఆదిల్‌షాకు తిరిగి ఇవ్వమని రాయలను కోరారు. దీని నిమిత్తం అసద్‌ఖాన్ లారీని రాయల ఆస్థానానికి పంపెను. "ఆదిల్‌షా నా కాలికి మొక్కితే రాయచూర్‌ను తిరిగి ఇస్తాన అని రా[illegible] మాధానం ఇచ్చెను. దీనికొరకు ముద్గల్లులో ఏర్పాటుచేసిన సమావేశానికి ఆదిల్‌షా రానందున, కృష్ణదేవరాయలు అవమానంగా భావిం[illegible] బీజపూర్‌పై దండెత్తి ఫిరోజాబాద్, గుల్బర్గా, సాసన్‌బాద్ సాగర్ నగరాల్ని ముట్టడించి ధ్వంసంచేసెను. ఇది చూసిన

ఆదిల్‌షా తన మిత్రపక్షాల్ని అర్థించాడు. అహ్మద్‌నగర్ పాలకుడైన బుర్హాన్ నిజాం షా, బీరార్ అల్లావుద్దీన్ ఇమామ్‌లతో వియ్యమంది బలం పెంచుకున్నాడు. బీదర్ పాలకుడైన అమీర్ బరీద్ ఆదిల్‌షా స్నేహన్ని అర్థించాడు. క్రీ.శ. 1528 - 29 సంవత్సరం విజయనగరానికి వినాశకాలం. ఆదిల్‌షా మిత్రపక్షాల బలాల్ని సమీకరించి రాయచూర్, ముద్గల్లు కోటల్ని ఆక్రమించి తన ప్రతిష్టను నిల్పుకొన్నాడు. కృష్ణదేవరాయలు పోరాడి ఓడిపోయాడు.

కృష్ణదేవరాయల కుమార్తె తిరుమలాంబ వివాహం ఆరవీటి వంశస్థుడైన రామరాజుతో జరిగింది. అల్లుడు అయిన రామరాయల్ని అళియరామరాయలని పిలిచేవారు. పసివాడైన తిరుమలుడు రాయల ఏకైక పుత్రుడు. ఇతడు మరణించటంతో, అతణ్ణి హత్య చేశారని, అందులో తిమ్మరుసుకు భాగం వుందని రాయలు ఆగ్రహించి తిమ్మరుసు కనుగుడ్లు పీకించి, బందీచేశాడు. కొడుకు అకాల మరణంతో కుంగిపోయిన కృష్ణదేవరాయలు క్రీ.శ. 1529లో మరణించాడు. తన తదనంతరం తమ్ముడైన అచ్యుతరాయలు పాలకుడిగా ప్రకటిస్తూ, అతడు ఆదిల్‌షా పై యుద్ధం కొనసాగించాలని మరణ శాసనంలో పేర్కొన్నాడు. అప్పటికి పెనుగొండలో బందీగా వుంచబడిన అచ్యుతరాయలు కృష్ణదేవరాయల వారసునిగా ప్రకటించటం, అళియరామరాయులకు ఎంతమాత్రం ఇష్టంలేదు. ఎలాగైనా రాజ్యం చేజిక్కించుకోవాలని రామరాయలు ప్రయత్నం చేశాడు. అంతవరకు రాయలకు విధేయులుగా వున్న సాళువ నరసింగనాయకుడు అతని అనుచరులు అంతఃకలహాల్ని అరికట్టి రామరాయల్ని తరిమికొట్టి అచ్యుతరాయల్ని పట్టాభిషిక్తుణ్ణి చేశారు.

అచ్యుతరాయలు క్రీ.శ. 1535 ప్రాంతంలో దండెత్తి రాయ్‌చూర్ అంతర్వేదిని ఆక్రమించాడు. అచ్యుతరాయలు బయట శత్రువుల్ని అణచే ప్రయత్నంలో వుండగా, రామరాయలు తన పలుకుబడిని పెంచుకొన్నాడు. అతడు అదనుకై వేచివున్నాడు. క్రీ.శ. 1536 లో గుత్తిలో జరిగిన తిరుగుబాటునణచి తిరిగి వస్తున్న అచ్యుతరాయల్ని బందీచేసి, రామరాయలు సింహాసన మాక్రమించ ప్రయత్నించాడు. ఈ ద్రోహానికి, ప్రజలుగాని, సామంతుల గాని, ఒప్పుకోనందున, రామరాయలు వారిపై దండెత్తి బీభత్సం సృష్టించాడు. ఇంతలో రాజధాని ఉద్యోగులు సలకం పెద తిరుమలరాజు తో చేరి అచ్యుతరాయలకు పట్టాభిషేకం జరిపించారు.

క్రీ.శ. 1542లో ప్రజాభిమానాన్ని కోల్పోయిన అచ్చుతరాయలు మరణించాడు. అచ్యుతరాయలు కొడుకైన వెంకటపతిరాయల్ని సింహాసన మెక్కించి, పెత్తనం చేయాలని సలకం తిరుమలుడు ప్రయత్నించాడు అయితే రామరాయలు గుత్తిలో అచ్యుత రాయల అన్న రంగరాయల కుమారుడైన సదాశివరాయల్ని రాజుగా ప్రకటించాడు. ఇదే అదనుగా తలంచిన ఇబ్రహీం ఆదిల్‌షా విజయనగం పైరెండుసార్లు దండెత్తాడు. సదాశివరాయలు పేరుకు మాత్రమే రాజు పెత్తనమంతా అళియరామరాయలిదే. క్రీ.శ. 1543 నుండి, 1565 వరకూ విజయనగరానికి మకుటంలేని మహారాజుగా అళియ రామరాజు చెలామణి అయ్యాడు.

**రామరాయలు - బహమనీ రాజ్యాలు :** పొరుగు రాజ్యాలైన బహమనీల స్వంత వ్యవహారాల్లో రామరాయలు జోక్యం చేసుకున్నాడు. అంతేకాకుండా వారిని భయభ్రాంతుల్ని చేసి ఒక విధంగా ఐక్యమయ్యేలా చేశాడు - ఎల్లప్పుడూ పరస్పరయుద్ధాల్లో మునిగి తేలితే తమ రాజ్యాలకు ప్రాణాలకు విజయనగరం వల్ల ముప్పు తప్పదని వారు తెలుసుకొన్నారు. సుల్తానుల కూటమిలో, ప్రముఖులు మాలిక్ ఇబ్రహీం కుతుబ్‌షా, హుస్సేన్ నిజాంలు. వీరితో ఆలీబరీద్‌షా, బుర్హాన్ ఇమాద్ ఉల్‌ముల్క్, ఆలీ ఆదిల్ షాలు చేరినారు. వీరే పంచపాదుషాలు.

**రాకాసి - తంగడి గ్రామాల యుద్ధం :** పగబట్టిన 'పంచ పాదుషాలు' ఒక్కటై, రామరాయలను ఒంటరివాణ్ణి చేశారు. బలమైన సైన్యాలతో బయలుదేరి కృష్ణానదికి ఉత్తరానవున్న రాకాసి - తంగడి అనే గ్రామాలమధ్య విజయనగర సైన్యంతో తలపడ్డారు. ఘోరంగా సాగిన ఆరునెలల యుద్ధంలో రామరాయలు పట్టుబడి వధింపబడ్డాడు.

**తిరుమల రాయల పలాయనం :** విజయనగరాన్ని రక్షించలేని తిరుమల రాయల ధనాన్ని ఏనుగులపై ఎక్కించుకొని సదాశివరాయలతో పెనుగొండకు పారిపోయాడు. సుల్తానుల సైన్యాలు విజయనగరాన్ని ధ్వంసం చేశారు.

## 27.8 ఆరవీటి పాలకులు

క్రీ.శ. 1570 లో తిరుమల రాయలు పెనుగొండ లో పట్టాభిషేకం జరుపుకొన్నాడు. తన రాజ్యాన్ని తన ముగ్గురు కొడుకులకు విభజించి ఇచ్చాడు. తెలుగు ప్రాంతానికి పెనుగొండను కేంద్రంగా శ్రీరంగరాయలకు, కన్నడ ప్రాంతానికి శ్రీరంగ పట్టణం కేంద్రంగా [illegible]రాయలకు తమిళ ప్రాంతానికి చంద్రగిరి కేంద్రంగా వెంకట పతిరాయలకు ఇచ్చాడు.

శ్రీరంగరాయలు క్రీ.శ. 1572 నుండి 1585 వరకూ పాలించాడు. ఇతని సామంతులు స్వామి ద్రోహం చేసి మహమ్మదీయులతో చేయి కలిపారు. క్రీ.శ. 1580 నాటికి కొండవీడు రాజ్యాన్ని విజయనగరం పూర్తిగా కోల్పోయింది. శ్రీరంగరాయలకు సంతానం లేదు. అనంతరం చిన్న తమ్ముడైన రెండో వెంకటపతిరాయలు రాజ్యానికి వచ్చాడు.

రెండో వెంకటపతిరాయలు క్రీ.శ. 1586 నుండి 1614 వరకూ పాలించాడు. కొండవీడు తప్ప మిగిలిన తెలుగుప్రాంతాన్ని కుతుబ్‌షాహీల నుండి తన ఏలుబడికి తీసుకువచ్చాడు. పెనుగొండనుండి రాజధాన్ని నెల్లూరుకు మార్చాడు. వెంకటపతి రాయలకు సంతానం లేదు. అందువల్ల తన అన్న కుమారుడైన శ్రీరంగరాయల్ని మరణించేముందే వారసునిగా ప్రకటించాడు. ఇది తన బావమరిది అయిన గొబ్బూరు జగ్గరాజుకు యిష్టంలేదు. జగ్గరాజు అంతర్యుద్ధాన్ని ప్రారంభించాడు. శ్రీరంగరాయల కుటుంబాన్ని బంధించి హత్యచేశాడు. అయితే వెలుగోటి యాచమ నాయకుడు శ్రీరంగరాయల కుమారుడైన రామదేవరాయల్ని తప్పించగలిగాడు. రామదేవరాయలకు కుమారులు లేకపోవడంతో అళియరామ రాయలి కుమారుడైన పెదవెంకటపతిని వారసునిగ నియమించాడు.

మూడవ వెంకటపతిరాయలు క్రీ.శ. 1630 నుండి 1642 వరకూ పాలించాడు. ఇతని కాలంలో గోల్కొండ బీజపూర్ రాజ్యాలు ఆంధ్ర కర్ణాటక ప్రాంతాలలో ఎక్కువ భాగాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకున్నాయి.

శ్రీరంగరాయలు మూడవ వెంకటపతి రాయల తరువాత సింహాసనమధిష్ఠించాడు. ఇతడే చివరి విజయనగర రాజు. క్రీ.శ. 1645 లో తంజావూరు, జింజి, మధుర నాయకులు అందరూ ఏకమై శ్రీరంగరాయల్ని ఓడించారు. శ్రీరంగనాయకులు బేలూరుకు వెళ్ళి క్రీ.శ. 1678 వరకూ నామమాత్రంగా పాలించాడు. విజయనగర సామ్రాజ్యం సామంతుల కుట్రలు, ద్రోహబుద్ధిచేత, మహ్మదీయ పాలకుల ఐకమత్యముచేత నాశనమై కాలగర్భంలో కలిసిపోయింది.

## వ్యాస రూప ప్రశ్నలు.

1. విజయనగర సామ్రాజ్య స్థాపన ఎట్లు జరిగెను ?
2. విజయనగర పొరుగు రాజ్య సంబంధాలను గూర్చి వ్రాయుము.
3. శ్రీకృష్ణ దేవరాయల దండయాత్రలను గురించి వ్రాయుము
4. విజయనగర సామ్రాజ్య పతనమెట్లు జరిగెను. ?

## లఘు ప్రశ్నలు

1. విజయ నగర సామ్రాజ్యాన్ని సందర్శించిన విదేశీయాత్రికులు
2. అళియ రామరాజు
3. తిమ్మరుసు
4. రాక్షసి - తంగిడియుద్ధము
5. విద్యారుణ్యుడు.

రచయిత
ఎమ్. మోహన్ దాస్ కుమార్

పాఠం - 28

# విజయనగర సామ్రాజ్యంలో సాంస్కృతిక పరిస్థితులు

## 28. 1. లక్ష్యం

ఉత్తర భారతదేశమందు క్రీ.పూ. 6 వ శతాబ్దం నాటికి అనేక రాజ్యాలుండి రాజకీయ అనైక్యత ఉన్నప్పుడు, అట్టి రాజకీయ అనైక్యతను అంతమొందించి మగధ రాజ్యము ఏ విధంగా ఉన్నతస్థితికి చేరుకున్నదో తెలిసికొనుట.

ముఖ్యాంశ సంగ్రహం

28. 2. ఉపోద్ఘాతం

28. 3. సామాజిక పరిస్థితులు

28. 4. మత విధానం

28. 5. సాహిత్య పోషణ

28. 6. కళాపోషణ

## 28. 2. పరిపాలనా విధానం

రాచరికంలో రాజ్యాన్ని సంపాదించటం సులువైనప్పటికీ దాన్ని సక్రమంగా పాలించకపోతే ప్రయోజన ముండదు. అందువలన విజయనగర పాలకులు వారు సంపాదించిన సువిశాల సామ్రాజ్యానికి చక్కని పరిపాలనా యంత్రాంగాన్ని నిర్మించారు.

సువిశాల సామ్రాజ్యాన్ని పరిపాలనా సౌలభ్యం కొరకు, రాష్ట్రాలగాను కప్పం చెల్లించి సార్వభౌమాధికారాన్ని అంగీకరించిన సామంతరాజ్యాలుగాను, విభజించారు. రాష్ట్రాలనే రాజ్యాలు, మండలాలు, నాడులు అని కూడా పిలచేవారు. ప్రధానమైన దుర్గాలను కేంద్రంగా తీసుకొని రాష్ట్రాల విభజన చేశారు. కొండవీడు, గుత్తి, ఉదయగిరి, పెనుగొండ, చంద్రగిరి, రామదుర్గ, రాయచూర్, అనేవి రాష్ట్రాలపేరు.

రాజవంశానికి చెందిన రాజకుమారులను రాజ్యానికి ప్రతినిధులుగాను పాలకులుగాను నియమించేవారు. రాష్ట్రపాలకులుగ సైన్యాధికారులైన దుర్గాధిపతులే నియమించబడేవారు.

పరిపాలనా విభాగంలో అతిచిన్నది మొదటిదీ గ్రామమే. కొన్ని దగ్గర గ్రామాలను 'స్థల' మని పిలచేవారు. అరవీటి పాలకుల శాసనాల్లో 'స్థల' అనేది 'సమ్మత' అని పేర్కొనబడింది.

కన్నడ దేశంలో కొన్ని 'స్థలముల కూటమిని' 'సీమ' అనేవారు. 'సీమ' అనేది తెలుగులో 'నాడు' అయ్యింది. 'నాడు' 'సీమ' 'రాజ' అనే విభాగాలకు మధ్య వనిత లేక పలిత అనే భూభాగం కూడ వుంది. ఉదయగిరి, పెనుగొండ, హంపి రాష్ట్రాలు 'వనిత' లుగ విభజింపబడ్డాయి.

కన్నడ శాసనాల్లో 'వెందేయ' 'వెంతి' అనే భూభాగం చెప్పబడింది. ఇది 'స్థల' భూభాగం కంటే పెద్దది. పై ప్రాంతాలన్నీ కేంద్రప్రభుత్వ ప్రత్యక్ష పర్యవేక్షణలో వుండేవి. రాజ్యాధిపతులుగా మిక్కిలి నమ్మదగిన దుర్గదన్నాయకులు నియమింపబడేవారు. వీరు ఎక్కువగా బ్రాహ్మణులే. సరిహద్దు రాజ్యాల దన్నాయకులు తప్ప ఇతరులు రాజదానిలో ఉంటూతమ రాష్ట్ర పరిపాలనను 'కార్యకర్తల' ద్వారా నిర్వర్తించేవారు. ఇది విజయనగర పరిపాలనలోని ఒక ప్రత్యేకత. ప్రతి నాయకుడికీ, గవర్నర్‌కు మంత్రులకు వారి వారి కార్యకర్తలుండేవారు. వీరు పౌరసంబంధమైన పాలన జరిపించేవారు. దన్నాయకులకు నాణేలు ముద్రించటం పన్నులు మినహాయించటం, కొత్తపన్నులు విధించటం వంటి

ప్రత్యేకాధికారాలుండేవి. దన్నాయకుడు రాష్ట్రంలో ఉన్నత రెవిన్యూ అధికారి, న్యాయమూర్తి న్యాయపాలకుడు. ఇతడు తన రాబడిలో కొంత భాగాన్ని చక్రవర్తికి చెల్లిస్తూ మిగిలిన దానితో తనకు నిర్దేశించిన సైన్యాన్ని పోషించేవాడు. చావిడి దన్నాయకులు అతని క్రింది కరణాలు పనిచేసే వారు. రాజ్యంలోని ముఖ్యవిభాగం 'సీమ'. 'సీమ' యొక్కముఖ్యాధికారిని. 'పారుపత్య' గారు లేక 'మణయ' గారు అని పిలచేవారు. ఇతడు 'సీమ' రెవెన్యూ అధికారి. సీమలో పన్నులు విధించటం, వసూలు చెయ్యటం, సంతలు ఏర్పాటు చెయ్యటం, రైతులకు పట్టాలు ఇవ్వటం వంటి అనేక విధులు నిర్వర్తించేవాడు. ఇతనికి సహాయం చెయ్యటానికి 'చావడి' అనే కచేరి పని చేయటానికి కరణాలుండేవారు. రాయ సమువారు అవసరం వారు, రాచకరణాలు అనే ఉద్యోగులుండేవారు. అయితే వీరి విధులు ఏమిటో నిర్దిష్టంగా చెప్పవీలుకాదు. 'అవసరీకులు' ముఖ్యంగా అంతఃపురానికి సంబంధించిన వుద్యోగులై వుండవచ్చు.

'నాడు' అనబడే భూభాగానికి చెందిన పాలనా యంత్రాంగ వివరాలు స్పష్టంగా తెలియవు. 'స్థల' అనే పరిపాలనా విభాగంలో చావిడి వుండేది. అందులో స్థల కరణాలు, స్థలం యొక్క లెక్కలపట్టీని తయారుచేసే వారు.

గ్రామం అతిచిన్న పరిపాలనా భాగం. ప్రాచీనకాలం నుండీ గ్రామపాలనలో కీలకపాత్ర వహించిన ప్రజాసభలు వాటి ప్రాముఖ్యతను కోల్పోలేదు. అయితే ఆనాటి ప్రజాసభలను 'బక్కెలు' 'ప్రజె', 'హలరు' 'హెడినెంటు' జగత్తు అని పిలచేవారు. గ్రామసభలు పన్నులు వసూలుచేసి ప్రభుత్వానికి చెల్లించేవి. గ్రామసభలకు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు మధ్య సన్నిహిత సంబంధాలు ఉండేవి.

గ్రామసభలు న్యాయాధికారులు గాను, ధర్మకర్తలు గానూ వ్యవహరించేవారు. భాండర వాడలు, అమరగ్రామాలు, మాన్య గ్రామాలు అని మూడు రకాల గ్రామాలుండేవి, మాన్య గ్రామాల్లో దేవ, బ్రాహ్మణ, ఉచ్చిరి గ్రామాలనే మూడు రకాలుండేవి. బ్రహ్మ దేవగ్రామాల్లో ఏకబోగ, గణబోగ అనే గ్రామాలుండేవి. గణభోగ గ్రామాల్లో నివసించేవారిని మహాజనులని పిలచేవారు. వీరు గ్రామానికి ప్రభుత్వానికీ మధ్య సంధానుకర్తలుగ వ్యవహరించి, న్యాయ విధులను నిర్వహించేవారు.

ఆనాడు అనేక నగరాలున్నాయి. వీటితోపాటు అనేక పట్టణాలున్నాయి. సముద్రతీరంలో వ్యాపారం నిర్వర్తించేవి పట్టణాలు. ప్రతినగరంలోను వ్యాపార శ్రేణులుండేవి. ఇవి ఆర్థిక పరిపాలనలో ప్రభుత్వానికి తోడ్పడేవి. ప్రభుత్వానికి సంబంధించిన గ్రామాల్లో కనీసం 12 మంది గ్రామాధికారులుండేవారు. గ్రామంలోని అయ్యగార్లకు జీతం ధనం లేక ధాన్యరూపంలో గాని చెల్లించేవారు. కాదు. గ్రామంలోని భూమిని వారు సాగుచేసుకొని, అనుభవించేవారు. వారసత్వంగా అనుభవించే యీ భూముల్ని 'మిరాశీ' లనేవారు. ఈ భూములపై విధించే పన్నును, 'జోడి', అంటారు. రైతులు ఆయగార్లకు యిచ్చేభాగాన్ని 'మేర' అంటారు. ఈ విధంగా విజయనగర సామ్రాజ్యంలతో పరిపాలన సాగింది.

**ప్రభుత్వ ఆదాయం :** ప్రభుత్వాన్ని నడపటానికి పరిపాలన జరపటానికి సైన్యాన్ని పోషించటానికీ ఆదాయం అవసరం. ఆదాయం లేకుండా ఏ ప్రభుత్వం నిలబడదు. విజయనగర ప్రభుత్వం అనేక ఆధారలనుండి ఆదాయాన్ని సేకరించేది. అందులో ముఖ్యమైనది. ధాన్యాదాయము, రెండవది సువర్ణాదాయం.

వ్యవసాయ దారులనుండి పన్నులు వసూలుచేయటానికి, వీలుగా, భూమిని కొలిపించి పంటలు, భూముల స్వభావాన్ని నిర్ణయంచి పన్నులు విధించి, వసూలు చేసేవారు. పంటలో 1/2 లేక 1/3 వంతు పన్నుగా వసూలు చేశారు. పన్నులను ధాన్యరూపంలో వసూలు చేశారు.

సువర్ణరూపంలో వచ్చిన ఆదాయాన్ని 'సిద్దాయం' అనేవారు. విజయనగర పాలనలో బంగారం, వెండి, రాగి నాణేలు చెలామణిలో వుండేవి. 'గద్యాణం' అనే బంగారు నాణానికే 'వరాహ' అనేపేరు చెలామణిలో వుండేది. 'ఘట్టి' 'దొడ్డవరాహ' అనే ప్రత్యేక గద్యాణాలు కూడా వుండేవి. 'ప్రతాప' అనేది గాద్యాణంలో సగం విలువున్న నాణెం. 'పణం', 'చిన్నం' అనే చిన్న బంగారు నాణేలతో పాటు 'ఏణం' ఏణంలో ఆరవవంతు విలువగలిగిన 'తార్' అనే నాణేలతు ఎక్కువ వినిమయంలో వుండేవి. జిటలు, కాసులు అనే రాగినాణేలు సామాన్యుల అవసరాలకు సరిపోయేవి.

**న్యాయం :** విజయనగరపాలకులు క్రమబద్ధమైన న్యాయస్థానాల్ని నెలకొల్పలేదు. చక్రవర్తే ఉన్నత న్యాయాధికారి. స్వయంగా కేసులను విచారించి శిక్షలు విధించటం చక్రవర్తి తరచుగా చేసేపని. అయితే ఇతర వ్యవహారాలలో తలమునిగిన చక్రవర్తి న్యాయపాలనావ్యవస్థలో

ఆసక్తి చూపిన దాఖలాలు అంతగా కనిపించవు. రాష్ట్రాలలో రాష్ట్ర పాలకులు, అమరనాయకులు వివిధ ఉద్యోగులు న్యాయపాలకులుగ వ్యవహరించేవారు. న్యాయాధీశులుగ వుండేందుకు ఏ అర్హతలు పాటించేవారో తెలియదు. ధర్మాసనాలు, ఆస్తి తగాదాలను దేవాలయాల్లో పరిష్కరించేవారు. నేరాలను బట్టి గాక కులాలను బట్టి తీర్పు, శిక్ష విధించేవారు. బ్రాహ్మణ నేరస్తులకు శిక్షలు స్వల్పంగా వుండేవి. వీరికి కఠిన శిక్ష అనగా కారాగార శిక్ష మాత్రమే. అదే స్థాయి నేరానికి ఇతరకులాల వారయితే మరణదండన విధించేవారు.

విజయనగర పాలకులు ఆదాయంలో ఎక్కువ భాగం సైనిక అవసరాలకు, రాణివాస(పు) విలాసాలకు ఖర్చుపెట్టి మిగిలినది దానధర్మాల ద్వారా బ్రాహ్మణ ప్రజలకు ముట్టజెప్పే వారని తెలుస్తుంది.

**శాంతి భద్రతలు :** విజయనగర పాలకులు అంతర్గతంగా శాంతి భద్రతలు కాపాడటానికి, నేరనిరోధం చెయ్యటానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. గ్రామంలో 'తలారి' అనే ఉద్యోగి శాంతి రక్షణ బాధ్యతలు నిర్వహించేవాడు. 'స్థలకావలిగారు' 'దేశ కావలిగారు', 'నాడు కావలిగారు' అనే ఉద్యోగులుండేవారు. ఒక్క విజయనగరంలోనే 12000 మంది రక్షక భటులుండేవారు.

ప్రజలకు సరి అయిన రక్షణ కల్పించలేక పోయిన విజయనగర పాలకులు దారిదోపిడీలు, దొంగతనాన్ని అరికట్టలేకపోయారు. అందువల్ల వర్తకులు గుంపులు గుంపులుగా ఒక ప్రదేశం నుండి ఇంకో ప్రదేశానికి తరలిపోతూ వుండేవారు.

## 28. 3 సామాజిక పరిస్థితులు :

విజయనగర పాలనాకాలంలో సామాజిక పరిస్థితులను గురించి తెలుసుకోవటానికి ఆనాటి సాహిత్యం, విదేశీయాత్రికుల రచనలు బాగా ఉపకరిస్తాయి. గ్రామాలు ఎక్కువ జనసాంద్రత కలిగి ఉండేవి. రాజధాని అయిన విజయనగరం జన సాంద్రత సుమారు 5,00,000 వుంటుందని విదేశీయాత్రికుల అంచనా.

సమాజం వర్ణవ్యవస్థపై నిర్మించబడింది. సమాజంలో అధిక సంఖ్యాకులు హిందువులే అయితే నగరాల్లోను ముఖ్య వ్యాపార కేంద్రాలో, మహమ్మదీయులు, క్రైస్తవులు, యూదులు, యింకా ఇతర విదేశీయులుండేవారు. హిందువుల్లో నాలుగు వర్ణాలుగా విభజింపబడి సాంఘిక జీవనం చేయగా, పంచములు మాత్రం సమాజానికి దూరంగా జీవనం సాగించేవారు. ఇది ఆనాటి వర్ణాశ్రమ ధర్మం.

విదేశీ యాత్రికుల రచనలను బట్టి బ్రాహ్మణుల పురోహితవర్గం, అగ్రహారీకులు, మఠాధిపతులు, ప్రభుత్వోద్యోగులు, వర్తక భోక్తలు అనే ఆరు తరగతులుగా వుండేవారు.

క్షత్రియులు దక్షిణ భారత సమాజంలో లేరని సమాజ శాస్త్రవేత్తల భావన. క్షత్రియులంటే పాలకులనే అర్థంగా భావించవచ్చు. వైశ్యులు వ్యాపార వాణిజ్యాలు నిర్వహించేవారు. వీరితోబాటు బ్రాహ్మణులు, లింగాయతులు, బలిజలు వ్యాపారం చేసేవారు. శూద్రులు వ్యవసాయం దాని అనుబంధ వృత్తుల్ని అనుసరించేవారు. శూద్రుల్లో అనేక ఉపకులాలుండేవి. మొత్తం సమాజంలో వీరిశాతమే ఎక్కువ. అయితే విద్యకు దూరంగా వుంచబడిన వీరి పరిస్థితి బ్రాహ్మణులతో చూస్తే కడుదయనీయంగా వుండేది. అయితే వీరికి ఉన్న కాంతికిరణం ఒక్కటే. అది వారు పంచముల కంటే కొంచెం ఎక్కువ, బ్రాహ్మణులకంటే బాగా తక్కువ. అది వారిస్థితి.

పంచములు శూద్రులకన్నా సామాజిక స్థాయిలో తక్కువ. వీరిలో గుర్తింపదగిన వారు మాలమాదిగలు. మాలవారు నేతపని, వ్యవసాయ కూలిపని చేయగా, మాదిగవారు చర్మకారవృత్తితో పాటు, మోటగూనలు, తాళ్ళు, తయారుచేసేవారు. చిన్న చిన్న నేరాలకు వీరు పెద్ద శిక్షలు అనుభవించేవారు. నగర పారిశుధ్య కార్యక్రమాలు, వెట్టిచాకిరీలు వీరు చెయ్యవలసి వుండేది.

పంచాణం వారు గ్రామాల్లోను నగరాల్లోను ప్రజలకు అవసరమైన వస్తువుల్ని గాని, సేవల్ని గాని అందించేవారు. విజయనగర సమాజం వర్ణవ్యవస్థపై ఆధారపడి కుల తారతమ్యాలతో నిత్య ఘర్షణకు గురికాబడింది. విదేశీయుల సంపర్కం తప్ప, మిగిలిన దంతా ప్రాచీన భారతీయ సమాజంలో భాగంగానే గడిచింది.

## 28. 4. మత విధానం

విజయనగర సామ్రాజ్య స్థాపన ముఖ్య ఉద్దేశ్యము మహమ్మదీయ మతవ్యాప్తిని అరికట్టడం, హిందూ మతరక్షణ చెయ్యటం, అయితే ఈ ఉద్దేశ్యాన్ని వారు సక్రమంగా నిర్వర్తించినట్లు కనిపించవు. విజయనగర పొరుగురాజ్యాలు హిందూమత వ్యతిరేకులయిన మహమ్మదీయులు.

విజయనగర పాలకుల తమ మతాన్ని ఇష్టదైవాల్ని వారికొరకే వుంచుకొని, ఇస్లాం మత విధానాన్ని మాత్రం ఖండించలేదు. రాజకీయ అవసరాలు చాలా విచిత్రంగా వుంటాయి. మహ్మదీయ పాలకుల్ని పూర్తిగ అణచలేని పరిస్థితుల్లో విజయనగర పాలకులు వారికి సహాయసహకారాలు అందించేవారు.

హరిహరరాయలు బుక్కరాయలు పాశుపత సంప్రదాయానికి చెందినవారు. మళువ రాజులకాలంలో వైష్ణవ సాంప్రదాయం అభివృద్ధి చెందింది. దాని ఫలితమే కృష్ణస్వామి, విఠలస్వామి, చక్రతీర్థ కోదండరామ స్వామి మొదలైన హంపీలోని దేవాలయాలు, వంశ పారంపర్యంగా మార్పు చెందిన వైష్ణవ సాంప్రదాయ ప్రతీకలు. కళింగ దండయాత్రలో అచ్చటినుండి తెచ్చిన కృష్ణవిగ్రహాన్ని రాజధానిలో ప్రతిష్టించినవిధానం తిరుమల వేంకటేశ్వరునిపట్ల విజయనగర పాలకులు చూపిన శ్రద్ధాశక్తులు వైష్ణవ మతాభివృద్ధికి వారు చేసిన సేవ తెలియగలదు.

ప్రజలు అన్ని మతాలకు చెందిన పండగల్ని సమభావంతో జరుపుకొనేవారు. విజయనగర పాలకులు తొమ్మిదిరోజులు జరుపుకోనే మహర్నవమిని ఎంతో వేడుకతో జరుపుకొనేవారు. 'ఏరువా' పండగను విధిగా రైతులు జరుపుకొనేవారు విజయనగర ప్రజలు నయన పోలయ్య, గ్రామగంగ, పుట్టలమ్మ, నందివీరులు, ఎక్కలమ్మ, ధర్మరాజు, కంబమయ్య, కాటిరేడు అనే గ్రామదేవతల్ని పూజించేవారు.

శైవమతం, వైష్ణవ మతాలతో పాటు జైన బౌద్ధమతాల వారు కూడా వుండేవారు. బుక్కరాయల కాలంలో వైష్ణవుల మధ్య జైనులమధ్య వివాదాలు బాగా చెలరేగాయి. ఈ మధ్య కాలంలో హంపీలో జరిపిన పురావస్తు త్రవ్వకాలవలన అచ్చట బౌద్ధ అవశేషాలు కూడా వున్నట్లు తెలియుచున్నది.

క్రైస్తవమతం భారతదేశానికి అతిప్రాచీన కాలంలోనే వచ్చినప్పటికీ, పోర్చువారి రాకతోనే బాగా ప్రాచుర్యంలో వచ్చిందని చెప్పాలి. 'పరవలు' అనే పల్లెవారు మహమ్మదీయుల ఆగడాలు భరించ లేక క్రైస్తవమతంలోకి మారారు. వీరే తొలిసారిగ క్రైస్తవులైన భారతీయులు. రెండవ వెంకటపతి రాయలు జేస్యూట్ ఫాదర్లను ఆదరించి, చంద్రగిరి వెల్లూర్లలో చర్చిల నిర్మాణానికి అనుమతినిచ్చాడు అంతేకాకుండా ఇతడు క్రైస్తవులకు ప్రతిఏటా వెయ్యి పణాల్ని కానుకగా ఇచ్చినాడు.

విజయనగర సామ్రాజ్యంలో మఠాల అభివృద్ధి బాగాసాగింది. విద్యా బోధనా కేంద్రాలుగా వుండిన మఠాలు రానురాను మతానికి బాగా ప్రాధాన్యత నివ్వసాగాయి. శైవమఠాల్లో, బ్రాహ్మణ, బ్రాహ్మణేతరమైనవి, వైష్ణవ మఠాల్లో రామానుజ, మధ్వాచార్యుల పేరుగా పిలువబడేవి. రామానుజుని శ్రీవైష్ణవ మత ఉదార ధోరణి అవలంబించటం చేతే శూద్రులు దానిలో విరివిగా చేరారు. వైష్ణవ, శైవ మతాల్లో చేరిన ప్రజలు వారిపూర్వ వర్ణాల్ని వదులుకోలేదు. 'కుడిచేయి' 'ఎడమచేయి' అనే భాగాలుగా మసలేవారు.

మొత్తంమీద మతమౌఢ్యం మూఢాచారాలు ప్రబలంగా వున్న విజయనగర సామ్రాజ్యంలో మహమ్మదీయ మతాన్ని అవమానించకుండా, గోవధను నిషేదించకుండా, మహమ్మదీయుల పవిత్రగ్రంథమైన ఖురానును సయితం దర్బారులో వుంచి వారి సత్‌భావనను పొందటానికి పాలకులు ప్రయత్నించారు.

## 28. 5. సాహిత్య పోషణ

విజయనగర పాలకులు రాజ్యవిస్తరణతో పాటు విద్యా సాహిత్య పోషణలో కూడా తగు ప్రోత్సాహాన్నిచ్చిరి. వీరికాలంలో సంస్కృత, తెలుగు, కన్నడ, తమిళ భాషలలో పెక్కు గ్రంథాల రచన జరిగింది.

సంస్కృత రచనల్లో, వేదాంతదేశికుడు రచించిన యాదవాభ్యుదయం, రామాభ్యుదయం ముఖ్యమైన కావ్యాలు. అనేక వేదభాష్యాలు అలంకార శాస్త్రాలు కావ్య నాటకాలు సంస్కృతంలో వ్రాయబడ్డాయి. ఐతరేయ దీపిక, తైత్తరీయ దీపిక, పంచదశి, జీవన్ముక్తి వివేక మొదలైన గ్రంథాల్ని విద్యారణ్యుడు రచించాడు. పరాశరస్మృతి వ్యాఖ్య, జైమిని న్యాయమూల విస్తర, సర్వదర్శన సంగ్రహం అనే గ్రంథాలు మాధవాచార్యులు రచించెను. అతని సోదరుడైన శాయణాచార్యులు నాలుగువేదాలకు కూలంకషముగా భాష్యాన్ని 'వేదార్థ ప్రకాశిక' అనే గ్రంథంగా వ్రాశాడు. వేదాంత దేశికుడు 'తత్వటీక' 'తాత్పర్య చంద్రిక' అను రచించెను. వ్యాసతీర్థులు తాత్పర్య చంద్రిక, తర్కతాండవ. న్యాయామృత అనే రచనలు చేసెను. శ్రీకంఠం పండితులు బ్రహ్మసూత్ర భాష్యం వ్రాస్తే, అప్పయ్య దీక్షితులు దానిపై వ్యాఖ్యానాన్ని శైవార్క మణిదీపిక, అనేపేర వ్రాశాడు. ఇవికాక పెక్కు సంస్కృత గ్రంథాల మూలప్రతులు ఇంకా ప్రచురింపబడలేదు.

**తెలుగు భాష :** విజయనగర పాలనలో తెలుగుభాషకు, కవులకు కావలసినంత ఆదరణ, పోషణ లభించింది. అందువలన ఆనాట కవులు, పండితులు తెలుగులో ఎన్నో పేరెన్నికగన్న గ్రంథాలను వ్రాశారు. రెడ్డిరాజుల ఆస్థానకవి సార్వభౌముడు శ్రీనాధుడు స్వయంగా విజయనగర సామ్రాజ్యాన్ని రెండవ దేవరాయల కాలంలో దర్శించాడు. కన్నడ కవి అయిన డిండిమ భట్టును ఓడించాడు. 'దీనారటంకాలతో కనకాభిషేక' గౌరవాన్ని పొందాడు. తుళువ రాజుల కాలంలో తెలుగు ప్రబంధ సాహిత్యం అత్యంత ఉన్నత దశకు చేరుకుంది. అల్లసాని పెద్దన 'మనుచరిత్ర' నందితిమ్మన 'పారిజాతాపహరణము', భట్టుమూర్తి 'వసుచరిత్ర' పింగళిసూరన 'కథాపూర్ణోదయము', 'రాఘవ పాండవీయము', విరూరి వేదాద్రి మంత్రి ఆస్థానంలో తెనాలి రామకృష్ణుని, 'పాండురంగ మహాత్యము', 'ఉద్భటారాధ్య చరిత్రము', కృష్ణదేవరాయల 'ఆముక్తమాల్యద', 'మదాలస చరిత్ర' చాలముఖ్యమైన గ్రంథములు.

అష్టదిగ్గజములనబడే ఎనమండుగురు కవులు, శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో వున్నట్లు ప్రతీతి. అయితే ఇది చరిత్ర ద్వారా నిర్ధారణ కాలేదు. పైన చెప్పిన కవులే కాక, ఎందరో తెలుగు కవులు చరిత్రలో చోటు చేసుకొనలేకపోయిరి. తెలుగు భాషను గురించి కృష్ణదేవరాయలు పలికిన మాటలు 'దేశభాషలందు తెలుగు లెస్స' అన్నది ఆ కాలానికి నిజంగా వర్తిస్తుంది.

**కన్నడ భాష :** రెండవ దేవరాయల కాలంలో కన్నడ భాషకు కావలసినంత ఆదరణ లభించింది. గురులింగ విభుని 'భిక్షాటన చరిత్ర', బొమ్మరుసు, 'సుందరపురాణ,' భీమకవి, 'బసవపురాణ', అక్కనందేశుని, బసవపురాణ' చామరసుని, 'ప్రభులింగ లీల', వీరభద్రరాజు, 'వీరభద్ర విజయము' అనే గ్రంథాలు విజయనగరరాజుల కాలంలోనే వ్రాయబడ్డాయి. కన్నడభాషకు ఎంతో ఆదరణ లభించింది.

**తమిళ భాష :** విజయనగర రాజుల కాలంలో తమిళభాషకు అందులో వ్రాసిన గ్రంథాలకు ఎంతో పోషణ దొరికింది. తిరువానూర్, తత్వప్రకాస స్వామిగళ్, పడమలై అణ్ణాగలైయ్యన్, 'విరుసుమయ విళక్కమ్', జ్ఞానప్రకాస దేశికర రచించిన 'కాచికాళంబకమ్' వ్రాయబడ్డాయి. ఇవిగాక అనేక తమిళకృతులు ఇంకా వెలుగు చూడవలసి వుంది.

## 28. 6 కళాపోషణ

విజయనగర రాజుల సుదీర్ఘ పాలనలో దక్షిణ భారత దేశమున భాషలతోపాటు అనేక కళలు అభివృద్ధి చెందాయి. విజయనగర దేవాలయ వాస్తువుల్లోను, శిల్ప, మూర్తుల్లోను కనిపించే సంగీత, నాట్య భంగిమలవల్ల ఆకాలంలో సంగీతం, నాట్యం చిత్రలేఖనం ఎంతో పోషింపబడ్డాయని తెలుస్తుంది. సాహిత్యంలో సంగీతం, నాట్యం చిత్రలేఖనం, నేతపని, వస్త్రాల అలంకరణల వర్ణనలు, ఆకాలపు కళల, గొప్ప తనానికి ప్రఖ్యాతులకు వివరణ దొరుకుతుంది.

విద్యారణ్యుడు చాలారాగాలను రచించినట్లు 'సంగీతసారం'లో పేర్కొన్నాడు. కృష్ణదేవరాయలు వీణను 'కృష్ణ' అనే పండితుని దగ్గర నేర్చుకొనెను. అలియ రామరాయలు తన కుమార్తెలను రామయ మంత్రిచే సంగీతం నేర్పించాడు. రామయమంత్రి రచించిన గ్రంథం 'స్వరమేళ కళానిది' గొప్ప సంగీత వేదము. ఆనాటి సాహిత్యంలో అనేక వాయిద్యాల ప్రస్తావన వుంది.

**వాస్తువు :** విజయనగర వాస్తువు ద్రావిడ సంప్రదాయానికి చెందింది. విజయనగర కట్టడాల్ని దేవాలయం, దుర్గం, మహలు, మొదలైన రకాలుగా విభజించవచ్చును. దేవాలయాలు వాస్తువులో విఠలాలయం చాల ముఖ్యమైంది. దీని కళ్యాణ మంటపంలో సప్తవిభాగాలుగా మలచిన ఏక శిలా స్తంభాలు సప్తస్వరాల్ని పలుకుతాయి. ఆలయ మంటపానికి ఎదురుగావున్న ఏకశిల రథము, నరసింహ లక్ష్మి, వినాయక విగ్రహాలు అపూర్వమైనవి.

విజయనగర వాస్తువుతో మహమ్మదీయ వాస్తుప్రభావం పద్మమహలు, పట్టపుటేనుగులశాలలో కనిపిస్తుంది. పుష్పగిరి, లేపాక్షి, తాడిపత్రి చంద్రగిరి, పెనుగొండల్లో విజయనగర దేవాలయాలున్నాయి. తిరుపతి, కాళహస్తి, శ్రీశైలం దేవాలయాలకు గోపురాల్ని విజయనగరరాజులు నిర్మించారు.

తాడిపత్రి ఆలయాల్లో ఉబ్బెత్తు శిల్పాలున్నాయి. లేపాక్షిలోని వీరభద్రాలయంలో వర్ణచిత్రాలున్నాయి. విజయనగర రాజుల పాలనాకాలంలో, వాస్తుశిల్ప, వర్ణచిత్రాలతో పాటు అనేక కళలు పోషింపబడి అభివృద్ధి చెందాయి.

## వ్యాస రూప ప్రశ్నలు.

1. విజయనగర సామ్రాజ్య కాలం నాటి సామాజిక పరిస్థితులేవి ?
2. విజయనగర రాజుల సాహిత్య సేవను వివరించునది.
3. విజయనగర రాజుల కళా సేవను వర్ణించునది.

## లఘు ప్రశ్నలు

1. అష్టదిగ్గజములు
2. విజయనగర కాలంలో క్రైస్తవమతం
3. విజయనగర వాస్తు.

## ఉపయుక్త గ్రంథాలు


1. Atchuta Rao, T
   A History of Andhra Literature in Vijayanagaram Emprire (Telugu)
2. Arudra
   Smagra Andhra Sahityamu.
3. Mahalingam T.V
   Administration and social life under Vijayanagaram.
4. Venkataramanayya, N & Sastry, K.A.N
   Further Sources of Vijayanagar Histoy, 3 Vols



రచయిత

ఎమ్. మోహన్ దాస్ కుమార్

పాఠం - 29

# ఢిల్లీ సుల్తానత్ యుగ పరిస్థితులు

## లక్ష్యం

క్రీ.శ. 1206 మొదలు 1526 వరకు ఢిల్లీ సుల్తానులు భారతదేశమును పాలించారు. ఈ కాలంలో బానిస, ఖిల్జీ, తుఘ్లక్, సయ్యద్, లోడీ అను ఐదు రాజవంశాలు పాలించాయి. ఈ కాలపు పరిపాలనా విధానము, సాంఘిక, ఆర్థిక పరిస్థితులు, సాహిత్యం, కళలు, భారతదేశ సంస్కృతిపై ఇస్లాం చూపిన ప్రభావం గురించి ఈ పాఠంలో అధ్యయనం చేయబడుతుంది.

## ముఖ్యాంశ సంగ్రహము :

19.1. ఆధారాలు

19.2. ఉపోద్ఘాతం

19.3. ఢిల్లీసుల్తానుల పరిపాలనా విధానం

19.4. సాంఘిక పరిస్థితులు

19.5. ఆర్థిక పరిస్థితులు

19.6. సాహిత్యం

19.7. వాస్తుశిల్పాలు

19.8. భారతదేశ సంస్కృతిపై ఇస్లాం ప్రభావం

19.9. సమీక్ష

## 29. 1. ఆధారాలు

**19.1. 1. నాణేలు**

**19.1. 2. వాస్తు శిల్పాలు**

**1.3. రచనలు :** మీర్ మహమ్మద్ వ్రాసిన తారీఖ్ ఇ సింద్, హసన్ నిజామీ వ్రాసిన టాజ్ - ఉల్ - మాసిర్, మిన్‌హాజ్ -ఉస్ - సిరా. వ్రాసిన తబకత్ - ఇ - నాసిరి, అమీర్ ఖుస్రూ రచించిన ఖాజా - ఇన్ - ఉల్ - పుటు, జియా ఉద్దీన్ బరనీ వ్రాసిన తారీఖ్ - ఇ - ఫిరోజ్ షాహి, ఖాజా అబుమాలిక్ ఇసామీ వ్రాసిన పుటు - ఉస్ - సలాటిన్, అహమ్మద్ యాద్గర్, అబ్బాస్ శర్వానీ రచనలు, ఇబన్ బటూటా, మార్కోపోలో, అబ్దుల్ రజాక్, నికోలోకాంటి, డామింగోపేస్ మొదలగు విదేశీయుల రచనలు.

## 29. 2. ఉపోద్ఘాతం

కుతుబ్ ఉద్దీన్ ఐబక్ 1206లో ఢిల్లీలో స్వతంత్ర ముస్లిం రాజ్యాన్ని స్థాపించాడు. ఇది భారతదేశ చరిత్రలో ఒక ముఖ్య సంఘటన - నాడు మొదలు 1526 వరకుగల కాలాన్ని ఢిల్లీసుల్తానుల యుగమంటారు. ఈ యుగంలో ఐదు రాజవంశాలు పాలించాయి. ఈ రాజవంశాల వారిలో ఇల్‌టుట్‌మిష్, బాల్బన్, అల్లాఉద్దీన్ ఖిల్జీ, ఫిరోజ్‌షా తుగ్లక్ మొదలగువారు గొప్పపాలనా దక్షులుగా ప్రసిద్ది చెందారు. వీరిపాలనా విధానము నందలి మౌలికమైన వ్యవస్థ ఒకేరీతిలో కొనసాగింది. సాంఘికంగా, సాంస్కృతికంగా గొప్ప మార్పులు జరిగాయి. ఈ కాలంలో పెక్కు విదేశీ తెగలు (మహమ్మదీయులు) భారతదేశంలో ప్రవేశించాయి. వీరు హిందూ సమాజంలో విలీనం గాక తమ

ప్రత్యేకతను నిలుపుకున్నారు. తత్ఫలితంగా భారత సమాజంలో రెండు వర్గాలు శాశ్వతంగా ఏర్పడ్డాయి. వీరిమధ్య సంబంధాలలో ఘర్షణ ముఖ్యలక్షణమయ్యింది.

## 29. 3. ఢిల్లీసుల్తానుల పరిపాలనా విధానం

ఢిల్లీ సుల్తానుల రాజ్యం ఇస్లాం మత విశ్వాసాల ప్రకారం నడుపబడింది, ఒక అల్లాఉద్దీన్ తప్ప ఇతర సుల్తానులందరూ ఖలీఫా యొక్క సార్వభౌమాధికారిన్ని ఆమోదించారు.

**29.3. 1. కేంద్రప్రభుత్వము :** ఢిల్లీ సల్తనత్‌లో సుల్తాన్ అత్యున్నత శాసన, కార్యనిర్వహణ, న్యాయాధికారి. ఇతడు రాజ్యములోని ప్రజలందరికి అధికారి. ముస్లిములకు రాజ్యాధికారి మరియు మతాధికారి. సుల్తాన్ చనిపోయిన తర్వాత అతని వారసుడిని జాగీరుదారులు,న్యాయశాస్త్రవేత్తలు, ముల్లాలు నిర్ణయిస్తారు. ఢిల్లీసుల్తనత్ మౌలికంగా సైనిక స్వభావాన్ని కలిగి ఉంది. ఇది పూర్తిగా సైనిక సామర్థ్యముపై ఆధారపడి నడిచిన ప్రభుత్వములో రాజ్యపాలనలో సైతము సైనిక అధికారులు ప్రధాన పాత్రవహించారు. అంతేగాక ఢిల్లీసల్తనత్. మతము అత్యంత కీలక పాత్రవహించింది. ఉలేమాలు అనే ముస్లిం మతాధికారులు ప్రభుత్వ నిర్వహణలో ఎక్కువగా జోక్యము చేసుకొనేవారు. అల్లాఉద్దీన్ ఖిల్జీ ప్రభుత్వపాలన నుండి ఉలేమాల జోక్యాన్ని రద్దుచేశాడు. ఢిల్లీపాలకుల్లు అత్యంత భోగవిలాస జీవితమును గడిపేవారు. ప్రభుత్వ ధనములో ఎక్కువభాగము అంతఃపుర నిర్వహణకు సుల్తాన్ ఆడంబరములకు ఖర్చు అయ్యేది. పరిపాలన నిర్వహణలో సుల్తానుకు మంత్రులు, ఉద్యోగులు సహాయపడేవారు. కేంద్ర మంత్రిమమండలిలో ప్రధానమైనవారు : ఎ) వజీర్ - ప్రధానమంత్రి, బి) నాయబ్ వజీర్ - ఉపప్రధాని, సి) దివాని అర్జ్ - సైనికమంత్రి, డి) దివాని ఇన్ షా - ఉత్తర ప్రత్యుత్తరాలమంత్రి, ఇ) దివాని రసాలత్ - విదేశాంగ మంత్రి, ఎఫ్) దివాన్ - ఇ-ఖాజీ - న్యాయశాఖాధ్యక్షుడు, జి) సాదర్ - మతవిషయాలు పరిశీలించువాడు. వీరుగాక గూఢచారులకు, వ్యవసాయానికి, లెక్కలను తనిఖీ చేయడానికి, నౌకా నిర్మాణానికి ప్రత్యేక మంత్రులున్నారు. వీరికింద గుమాస్తాలు మొదలైన ఉద్యోగులుండేవారు.

**29.3. 2. ప్రాంతీయ పాలన :** ప్రారంభంలో ఢిల్లీసల్తనత్ 'ఇక్తా' లు అనబడు సైనిక కేంద్రాలుగా విభజింపబడింది. ఇక్తాకు అధిపతి ముక్తి. ఈ ముక్తీలకు సాధారణ పాలనతోపాటు, రెవిన్యూ, పోలీసు అధికారములు కూడ యుండును. ఈ ముక్తీలను అల్లాఉద్దీన్ ఖిల్జీ కాలములో ఒక ప్రాంతము నుండి మరి ఒక ప్రాంతమునకు బదిలీలు చేయుచుండిరి. ఇక్తాను షిక్కలుగను, షిక్కలును పరగణాలుగను విభజించారు. షిక్కమీద షిక్‌దారు, పరగణామీద చౌదరీ అను శిస్తువసూలుచేసే అధికారులుండేవారు. గ్రామాలలో ప్రాచీన పంచాయితీ వ్యవస్థను ముస్లింలు మార్చలేదు. పట్టణాలలో కొత్వాల్ అనే రక్షక భటాధికారి ఉండేవాడు.

**29.3. 3. రెవిన్యూ పాలన :** ఢిల్లీసుల్తాన్ యుగంలో పన్నుల భారం విపరీతంగా పెరిగింది. ఖురాన్ సమ్మతించిన ఎ) ఖరజ్ - ముస్లిమేతర రైతుల మీద పన్ను బి) ఉషర్ - ముస్లిం రైతుల మీద పన్ను, సి) జిజియా - ముస్లిమేతరుల మీద పన్ను, డి) ఖామ్స్ - యుద్ధదోపిడిలో ఐదోవంతు, ఇ) జకత్ - ముస్లింల నుండి ఇస్లాం మత సంస్థల నిర్వహణకు వసూలుచేయు పన్ను అనే పన్నులు సుల్తానులు వసూలుచేసేవారు. ఇవిగాక గనుల మీద, వారసులు లేని ఆస్తుల మీద, వ్యాపారం మీద, రహదారుల మీద పన్నులు విధించారు. ప్రభుత్వ ఆదాయములో ఎక్కువ భాగము సైన్యానికి ఖర్చుచేసే వారు. ఆ తదుపరి అంతఃపుర వ్యయము, ఉద్యోగుల జీత భత్యములు, దానధర్మములు,. భవననిర్మాణముల కొరకు ఎక్కువగా ధనమును ఖర్చుచేసే వారు. ఫిరోజ్ షా తుగ్లక్ వ్యవసాయానికి ఎక్కువ ధనమును ఖర్చుచేసెను.

**29.3. 4. న్యాయపరిపాలన :** ఢిల్లీ సల్తనత్ పాలకులందరూ ఖురాన్‌ను అనుసరించి న్యాయపాలన రూపొందించిరి. దేశములో సుల్తాన్ అత్యున్నత న్యాయాధికారి. ఆ తదుపరి ముఖ్యఖాజీ న్యాయాధిపతిగా నుండెడివాడు. ప్రతి ముఖ్య పట్టణములో కొత్వాల్ నేరములను విచారించెడివాడు. నాడు శిక్షలు కఠినముగా నుండెడివి. అంగ విచ్ఛేదము, మరణశిక్ష సాధారణముగా విధించేవారు. హిందువులలో బ్రాహ్మణులకు ఉరిశిక్ష లేదు.

**29.3. 5. సైన్యం :** ఢిల్లీ సల్తనత్ సైనిక బలంమీద, ఆధారపడినది. సైన్యంలో అశ్వదళానికి ప్రాధాన్యత ఇవ్వబడింది. పదాతిదళం, గజదళం కూడా తోడ్పాటుగా ఉండెను. సైన్యంలో ఎక్కువమంది తురుష్కజాతుల వారు, పారశీకులు, మంగోలులు, ఆఫ్ఘనులు, అరబ్బులు, అబిసీనియనులు, దేశీయ ముస్లిములు. సైనికులలో పెక్కు జాతులు వారుండట వలన వారిలో ఏక లక్ష్యం లోపించింది. సైనికులలో పెక్కు మంది యుద్ధాలలో దోపిడికోసం వచ్చి చేరినవారు.

29.3. 6. పెక్కు లోపభూయిష్టమైన విధానములున్నను ఢిల్లీ సల్తనత్ పాలకులు అనుసరించిన పరిపాలనా విధానములో కొన్ని విశిష్టమైన అంశములను మరింత మెరుగుపరచి ఆ తదుపరి కాలంలో షేర్‌షా, అక్బర్ వంటి గొప్ప చక్రవర్తులు అమలుచేసిరి.

## 29. 4. సాంఘిక పరిస్థితులు

భారతదేశంలో ప్రవేశించిన ముస్లింలు హిందూ ప్రజానీకంలో కలిసిపోక తమ ప్రత్యేకతను నిలుపుకోవడం చేత భారతీయ సమాజం రెండు ప్రత్యేక మతాలను అనుసరించే భిన్న వర్గాలు ఏర్పడ్డాయి. మహమ్మదీయులు తమ మత విస్తరణకు పూనుకొన్నారు. హిందువులు తమ మత రక్షణకు ప్రయత్నాలు చేయసాగారు. దీనివల్ల పై రెండు వర్గాలమధ్య ఘర్షణ ప్రారంభమై భిన్న వర్గాలుగా శాశ్వతంగా జీవించసాగారు. ముస్లింలు పాలక వర్గానికి చెందినందువల్ల సమాజంలో వారిది ఉన్నత స్థానము. పరిపాలనలో, ఆస్థానంలో, సైన్యంలో ఉన్నత ఉద్యోగాలన్నీ ముస్లింలవే. పాలిత వర్గమైన హిందువులు అనేక బాధలకు గురిఅయ్యారు. వీరిపై పన్నుల భారమధికము, విద్యా సౌకర్యాలు లేవు. దేశంలో పంటలు పండించడం, వస్తూత్పత్తి బాధ్యత హిందూవులది. కాని లాభాలు పొందటం ముస్లింల హక్కు. అందుచేత ఈ యుగంలో పాలకులకూ పాలితులకూ మధ్య ద్వేషము, విరోధము ప్రబలంగా వున్నాయని బటూటా వ్రాశాడు. ప్రజలలో అజ్ఞానము, సంప్రదాయ ప్రియత్వము, మూఢ ఆచారాలున్నాయి. స్త్రీలకు గౌరవప్రదమైన స్థానం లేదు. రసపుత్రులలో జోహార్‌ను అనుకరిస్తు ముస్లిం సర్దారులు యుద్ధ సమయాలలో జనానా స్త్రీలను వధించడం ప్రారంభించారు. హిందువులలో వర్ణ వ్యత్యాసాలు హెచ్చాయి. యోగులు మత గురువులు అంటే భక్తి శ్రద్ధలెక్కువ.

## 29. 5. ఆర్థిక పరిస్థితులు

ఈ యుగంలో భారత దేశం ఐశ్వర్య వంతంగా ఉందని చెప్పవచ్చు. దానికి తార్కాణం తైమూర్ ఢిల్లీలో అపారమయిన ధన రాశులను దోచుకొని వెళ్ళడమే. అయితే ఢిల్లీ పాలకులు గాని ఇతర ప్రభువుల కాని నిర్దిష్టమైన ఆర్థిక విధానాన్ని అనుసరించలేదు. వ్యవసాయము ప్రజల ముఖ్యవృత్తి. వరి, గోధుమ, జొన్న, చెరకు, పత్తి మొదలగు పంటలు పండించేవారు. ఈ యుగంలో పండ్లతోటలు ఎక్కువగా నాటారు. దేశంలో అనేక రకాల వస్త్రాలు, ఆయుధాలు, అత్తర్లు తయారు చేసేవారు. ప్రభు వర్గానికి అవసరమైన వస్తువులను ఉత్పత్తి చేయించడానికి ప్రభుత్వము పెక్కు కార్ఖానాలు నెలకొల్పినది. వ్యవసాయంలో, కార్ఖానాలలో పని చేసేవారిలో హిందువులు అధిక సంఖ్యాకులు. విదేశీ వాణిజ్యం తురుష్కుల, అరబ్బుల చేతులలో ఉండేది, ఎగుమతులలో ప్రధానమైనవి. వస్త్రాలు, నల్లమందు, నీలిమందు దిగుమతులలో యుద్ధ అశ్వాలు, విలాస వస్తువులు ప్రధానమైనవి. వర్తకులు శ్రేణులుగా ఏర్పడి వాణిజ్యం సాగించారు. వర్తకులు మోసాలు చేస్తుండే వారనని అల్లా ఉద్దీన్ ఖిల్జీ నిబంధనలను బట్టి గ్రహించవచ్చు.

## 29. 6. సాహిత్యం

ఢిల్లీ సుల్తానులు సారస్వతాన్ని ఆదరించి పోషించారు. వారి కొలువులోని చరిత్రకారులు, రచయితలు పారశీక భాషలో రచనలు చేశారు. ఇస్లాం మత విద్యకు ఢిల్లీ ప్రధాన కేంద్రంగా రూపొందింది. ఈ కాలంలో అమీర్ ఖుస్రూ సర్వోన్నత కవిగా గుర్తింప బడ్డాడు. బాల్బన్ ఆస్థానంలో కవిగా ప్రవేశించి గియాజ్ ఉద్దీన్ కాలం వరకూ జీవించి ఖుస్రూ అనేక గ్రంథాలు రచించాడు. అమీర్ హసన్ అను కవి మహమ్మద్ బీన్ తుగ్లక్ కాలంలో ఉన్నాడు. జియాఉద్దీన్ బరనీ వ్రాసిన తారీఖ్ - ఇ - ఫిరోజ్ షాహి బాల్బన్ కాలం నుంచి ఫిరోజ్ షా తుగ్లక్ వరకు చరిత్ర విస్తరిస్తుంది. షామ్స్ - ఇ - సిరాజ్ అఫీఫ్ అను చరిత్ర కారుడు ఫిరోజ్ తుగ్లక్ ఆస్థానంలో ఉన్నాడు. కొందరు రాష్ట్ర పాలకులు, హిందూరాజులు సంస్కృత పండితులకు, కవులకు ఆశ్రయమిచ్చారు. వారిలో ముఖ్యులు రఘునందన, పద్మనాభ దత్, విద్యావతి ఉపాధ్యాయ, వాచస్పతి, బ్రహ్మ సూత్రాల మీద వ్యాఖ్యవ్రాసిన శ్రీరామానుజులు, ప్రతాప రుద్ర మొదలగువారు. దేశీయ భాషలలో మీరాబాయి, కబీర్‌లు హిందీలోను, నామ్‌దేవ్, జ్ఞానేశ్వరుడు మరాఠీలోను, నానక్ పంజాబీలోను గ్రంథాలు రచించాడు. ఈ యుగం తెలుగు భాషకు స్వర్ణయుగం. ఉర్దూ భాష ఢిల్లీ పరిసర ప్రాంతాలలో జన్మించి వ్యాప్తిలోనికి వచ్చింది. అమీర్ ఖుస్రూ ఈ భాషలో మొదటి కవిగా రూపొందాడు.

## 29. 7. వాస్తు శిల్పాలు

ఢిల్లీ సల్తనత్ యుగంలో నిర్మాణాలలోల దేశీయ, విదేశీయ రీతులు సమ్మేళనమైనూతన శైలి ఉద్భవించింది. ఇందులో హిందూర ముస్లిం శిల్ప కళ లక్షణాలు మిళితమై వున్నవి. అందువల్ల దీనికి 'ఇండో - ఇస్లామిక్ లేక హిందుస్తానీ శైలి' అని పేరు వచ్చినది. ఈ శైలి ఉద్భవించుటకు గల కారణాలు. ఎ) ఢిల్లీ పాలకులు విదేశాల నుండి స్థపతులను రప్పించి కట్టడాల నిర్మాణానికి పూనుకున్నప్పటికి, ఆ

కట్టడాలలో నియమింపబడిన పని వారందరూ హిందువులే. బి) ముస్లింలు హిందూ దేవాలయాలను నాశనం చేసినపుడు అవే వస్తువులను మసీదుల నిర్మాణానికి ఉపయోగించారు. సి) కొన్ని సందర్భాలలో హిందూ, జైన ఆలయాలను నాశనం చేయక పై గోపురాలను, లోపలి విగ్రహాలను తీసివేసి మిగిలినవి యధాతథంగా వుంచి నాశనం చేయక పై గోపురాలను, లోపలి విగ్రహాలను తీసివేసి మిగిలినవి యధాతథంగా వుంచి మసీదులుగా మార్చారు. ముస్లిం భవనాలలో విశిష్ట లక్షణాలు మినారుల నిర్మాణం, గుమ్మటం, కమాను, ఖోడక శీర్షము ఆలంబిక వృత్త ఖండాలు, వృత్త ఖండాలంకృత ద్వారాలు. ఢిల్లీ సల్తనత్ యుగ కట్టడాలలో ముఖ్యమైనవి. ఎ) ఢిల్లీలోని కుతుబ్ మీనారు, బి) ఢిల్లీ దగ్గరలోని కువాట్ - ఉల్ - ఇస్లామ్, సి) అలాయ్ దర్వాజా, డి) ఘియాజ్ తుగ్లక్ సమాధి, ఇ) అజ్మీరులోని జుమ్మా మసీదు. కుతుబ్ మీనారుకు కుతుబుద్దీన్ ప్రారంభించగా అతని అల్లుడు ఇల్‌టిట్‌మిష్ పూర్తి చేశాడు. కుతుబ్‌ఉద్దీన్ నిర్మించిన కువాట్ - ఉల్ - ఇస్లామ్ మసీదు పై ఖురాన్ సూక్తులు లిఖించబడ్డది. అల్లాఉద్దీన్ ఖిల్జీ ఢిల్లీలో నిర్మించిన అలాయ్ దర్వాజా వర్ణ చిత్రాలతో అలంకరించబడ్డాది. ఘియాజ్ ఉద్దీన్ సమాధిలో హిందూరీతులైన అమలక కలశము నిర్మింపబడ్డాది. దక్షిణ భారతదేశంలో ఇండో - ఇస్లామిక్ రీతికి గుల్బర్గా, బీదరు కేంద్రాలు. బీజాపూర్‌లోని గోల్ గుంబజ్, హైదరాబాద్‌లోని చార్‌మినార్ ప్రసిద్ధ నిర్మాణాలు. ఇండో - ఇస్లామిక్ శైలి ప్రభావం విజయనగర కట్టడాలలో కన్పిస్తుంది. హంపిలోని పద్మమహల్, గజశాల, చంద్రగిరి భవనాలు దీనికి తార్కాణాలు.

## ప్రశ్నలు

I. **వ్యాస ప్రశ్నలు :**

1. భారతదేశ సంస్కృతిపై ఇస్లాం మత ప్రభావాన్ని వ్రాయుము ?
2. ఢిల్లీ సుల్తానుల పరిపాలనా విధానమును వివరింపుము ?

II. **సమస్యా పూరిత ప్రశ్నలు :**

1. ఢిల్లీ సల్తనత్ యుగంలో ఆర్థిక సాంఘిక పరిస్థితులను వివరింపుము.

III. **లఘుటిక ప్రశ్నలు :**

1. ఇండో - ఇస్లామిక్ లేక హిందూ స్థానీ శిల్పకళ.

**అభ్యాసాలు :**

1. ఢిల్లీ సల్తనత్ యుగ విశేషాలు వివరింపుము.
2. భారతదేశ సంస్కృతి పై ఇస్లాం ప్రభావమును వివరింపుము.

## ఉపయుక్త గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | బి.యన్.ఎల్. హనుమంతరావు | : | భారతదేశ చరిత్ర; సంస్కృతి, ద్వితీయ భాగం, తెలుగు అకాడమి ప్రచురణ. |
| 2. | A.L. Srinivastava | : | The Sultanate of Delhi. |
| 3. | Ishwariprasad | : | History of Medievamdia. |
| 4. | Lanepoole | : | Medieval India under Mohammadan Rule. |
| 5. | Percy Browun | : | Indian Architecture. |
| 6. | Tarachand | : | Influence of Islam on Indian Culture. |
| 7. | Habibullah | : | The Foundations of Muslim Rule in India. |
| 8. | R.C. Majumdar | : | The Delhi Sultanate. |
| 9. | Qureshi | : | Administration of the Sultnate of Delhi. |
| | Tripathi | : | Some aspects of Muslim Administration. |


రచయిత

వి.కె. మోహన్